శ్రీమతే రామానుజాయ నమః

శ్రీవరవరముని వరివస్య

ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఎ. శింగరాచార్యస్వామి

శ్రీరామానుజ సిద్ధాంతవ్యాప్తి రక్షణదీక్షితా ।
శ్రీరామానుజసిద్ధాంతసభా జేజీయతాం సదా ॥

ప్రకాశకులు

శ్రీరామానుజ సిద్ధాంతసభ

సికింద్రాబాద్

2020

శ్రీవరవరముని వరివస్య

ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

ప్రథమ ముద్రణ : 2020

ప్రతులు :

అన్నిహక్కులు : రచయితవే.

సందర్భము :

వెల : అమూల్యము

ముఖచిత్రం : శ్రీమణవాళమహాామునులు.

అక్షరయోజనము : 1. యస్. చంద్రశేఖర్, తిరుపతి.
2. శ్రీమతి ఏ.యస్. జయలక్ష్మి, తిరుపతి.

ముద్రణ :

అభినందనం

శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవరమ్ ।
యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్ ॥

చేతన రక్షణకోసం శ్రీమన్నారాయణుడు ఈ లోకంలో పలు అవతారాలను ఎత్తడమే కాక, నిత్యసూరులను కూడా అవతరింపజేసినాడు. ఆ విధంగా భగవదాజ్ఞతో కలియుగంలో ఆదిశేషాంశతో అవతరించినవారు ఆచార్య సార్వభౌము లైన భగవద్రామానుజులు. శ్రీరామానుజావతారానికి సుమారు మూడువందల సంవత్సరాల తరువాత మళ్ళీ ఆ ఆదిశేషుడే సర్వేశ్వరుని ఆజ్ఞతో శ్రీమణవాళ మహామునులుగా అవతరించారు. సంప్రదాయంలో వీరిని శ్రీరామానుజుల ఇంకొక అవతారంగా సంభావిస్తారు.

శ్రీమణవాళమహామునుల పాండిత్యం ఎంత గొప్పదో, వారికి కల శమదమాది ఆత్మగుణ సంపద అంత గొప్పది, వీరికి కల "విశదవాక్శిఖామణి, పొయ్యిలాద మణవాళ మహాముని" మొదలైన, సార్థవారైన బిరుదాలు వీరి వైభవాన్ని తెల్పుతున్నాయి. శ్రీమణవాళ మహామునులు అవతరించకపోయి ఉంటే ద్రావిడ వేదాంతం మరుగునపడి ఉండేది అనేది అత్యంత వాస్తవం.

"గురుం ప్రకాశయేద్ధీమాన్" అనే సూక్తి ఆచార్యవైభవాన్ని లోకంలో వ్యాపింప జేయడానికి ప్రయత్నించడం అనేది శిష్యకృత్యమని తెలుపుతున్నది. శ్రీమణవాళ మహామునులు అవతరించి 650 సంవత్సరాలు పూర్తి అయిన ప్రస్తుత సందర్భంలో ఆ ఆచార్యవర్యుల వైభవాన్ని తెలిపే కొన్ని గ్రంథాలను ఏకత్ర కూర్చి ప్రచురించి, ఆ మహనీయుల పట్ల యథాశక్తి కృతజ్ఞతను ప్రకటించుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రస్తుతగ్రంథం ముద్రింపబడుతున్నది. ఇది, భగవద్రామానుజ సిద్ధాంత ప్రచార, పరిరక్షణలే ప్రధానోద్దేశ్యాలుగా భావించి అందుకోసం కృషిచేస్తున్న శ్రీరామానుజ సిద్ధాంతసభ, సికింద్రాబాద్ ద్వారా ప్రకటింపబడుతున్నది. ఈ కైంకర్యానికి కావలసిన ద్రవ్యాన్ని భక్తిశ్రద్ధలతో

సమర్పించి, తద్వారా శ్రీమణవాళ మహామునుల విషయంలో స్వరూపాను రూపమైన సేవనుచేసికొనేవారు ఉ.వే. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రాజనరసింహాచార్య స్వామివారి శిష్యులు, పరమపదవాసులు అయిన శ్రీమాన్ కోశెట్టి వేంకటనారాయణ గారి **(18-2-1953** నుండి **1-10-2020)** పవిత్ర స్మృతిగా, వారి సోదరులు కోశెట్టి హరగోపాల్ ప్రభావతిగారు, కోశెట్టి అశోక్ కుమార్ సువర్ణ గారు, కోశెట్టి ఉపేందర్ మీనగారు, కోశెట్టి రమేష్ జ్యోతిరాజ్ గారు, వీరి కుమారులు మరియు కోడళ్ళు, శ్రీనివాస్, స్వప్నగారు, కోశెట్టి కృష్ణ హరితగారు వీరిని అందరిని హృదయపూర్వకంగా అభినందిస్తూ, వీరి సంప్రదాయసేవ మరింత అభివృద్ధిచెందాలని మంగళాశాసనం చేస్తున్నాను. ఈ ప్రయత్నంలో వీరిని ప్రోత్సహించిన పెద్దలు, శ్రీరామానుజసిద్ధాంత సభ అధ్యక్షులు ఉ.వే. శ్రీమాన్ కె.కె. పరకాలన్ గారిని, శ్రీమాన్ శశిధర్ గారిని అభినందిస్తున్నాను. ఈ గ్రంథం ప్రసన్న లోకానికి ఆనందం కలిగించగలదని నమ్ముతున్నాను. స్వస్తి.

భాగవత దాసుడు

ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీమతే రామానుజాయ నమః
శ్రీమద్వరవరమునయే నమః

శ్రీప్రతివాదిభయంకరం అణ్ణన్ ప్రణీతమైన

శ్రీవరవరమునిశతకము

ఆచార్యవరివస్యా వ్యాఖ్యానము

అవతారిక

శ్రీవరవరమునిశతకం ప్రతివాదిభయంకరార్య సంప్రోక్తమ్ ।
వ్యాఖ్యాతి శింగరార్యో వరముని పదయుగసిసేవిషుర్భక్త్యా ॥

మహాజ్ఞానులచేత **"ఇరుళ్ తరు మాఞాలమ్"** (అజ్ఞానాన్ని కల్గించే విశాలమైన భూమి) అని వ్యవహరింపబడే ఈ విభూతిలో వకుళభూషణభాస్కర– లోకదివాకరాదులైన ఆళ్వార్లు, శ్రీరామానుజ దివాకరాదులైన పూర్వాచార్యులు అవతరించి, కలివల్ల ఏర్పడిన అజ్ఞానాన్ని తమ సదుపదేశ– సద్గ్రంథ నిర్మాణాదులతో తొలగించినా, ఇక మఱి ఏ ఆచార్యులవల్ల నెరవేరని కార్యాన్ని శ్రీపిళ్ళైలోకా చార్యులవారి మూలంగా నిర్వహించాలని భావించిన భగవానుడు **"సంసారభోగిసందష్టజీవ జీవాతువు"** (సంసారమనే విషసర్పంచేత కఱువబడిన జీవులను బ్రతికించే జీవనౌషధం) అయిన ఆ మహాచార్యులను, వారి తమ్ములైన అళకియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్‌ను అవతరింపజేసి, వారిరువురి ద్వారా అరుదైన గొప్ప దివ్యసూక్తులను అవతరింపజేశాడు. వ్యాసమహర్షి బ్రహ్మసూత్రాలనే శారీరకమీమాంసను రచించినా, భాష్యం లేనిదే దాని అర్థం తెలియడం వీలుకాదని తలచిన సత్యసంకల్పుడైన భగవానుడు భగవద్భాష్యకారులైన శ్రీరామానుజులను అవతరింపజేసినట్లే, ఆ ఆచార్యసార్వభౌములనే మళ్ళీ మణవాళ మహామునులుగా అవతరింపజేసి పూర్వం ఎత్తిన అవతారాలలో చేయకుండా మిగిలిన కృత్యాలను వారి ద్వారా పూర్తిచేయించాడు.

మణవాళమహామునులవంటి ఆచార్యులు పూర్వం అవతరించలేదు, ఇక అవత రించబోయే అవకాశం లేదు. **"ఉపమానోపమేయత్వం యదేకస్యైవ వస్తునః"** అనే రీతిలో నిర్వచింపబడ్డ అనన్వయాలంకారానికి ఆచార్యపరంపరలో లక్ష్యాన్ని చెప్పవలసివస్తే శ్రీమణవాళమహామునులనే తప్ప వేఱెవ్వరినీ చూపడానికి వీలు లేదు – అనే విషయం నిర్మత్సరవివేకులకు సమ్మతం.

శ్రీమణవాళమహామునులు, శ్రీరంగంలో సాక్షాత్తు శ్రీరంగనాథుడే వారికి శిష్యుడై, ఈడు వ్యాఖ్యానాన్ని ఆలకించే రీతిలో విలక్షణమైన శిష్యసంపదతో వేంచేసి ఉన్న సమయంలో, శ్రీకాంచీపురంలోని **"తిరుత్తణ్కా"** అనే దివ్యదేశంలో అవతరించి, శ్రీమన్నయనవరదాచార్యస్వామివారి సన్నిధిలో అధ్యాత్మవిద్యాభ్యాసాన్ని చేసి, **"ప్రతివాది భయంకరు"**లనే బిరుదును పొందిన ప్రతివాది భయంకరం అణ్ణన్‌స్వామి తిరుమలలో కొంతకాలం ఉండి, శ్రీవేంకటేశ్వరునకు తిరుమంజనకైంకర్యాన్ని చేస్తూ ఉండగా, శ్రీరంగనాథుని సన్నిధిలోనుండి యాదృచ్ఛికంగా అక్కడకు వచ్చిన శ్రీవైష్ణవుల మూలంగా శ్రీరంగంలో వేంచేసి ఉన్న మణవాళమహామునుల అప్రతిమవైభవాలను విని, వారి శ్రీచరణాలను ఆశ్రయించి, సత్సంప్రదాయార్థవిశేషాలను విని ఉజ్జీవించాలని భావించారు. అపుడే శ్రీవేంకటేశ్వరుని అనుజ్ఞను పొంది శ్రీరంగాన్ని చేరి, శ్రీవరవరమునులను ఆశ్రయించి, వారివల్ల పంచసంస్కారాలను పొందారు. **"వరవరమునితాం యాతే యతిరాజే సకలలోకజీవాతౌ, శ్రీవాదిభీకరోఽ భూత్ శ్రీమాన్ శ్రీవత్సచిహ్నమిశ్రోఽ పి"** (శ్రీరామానుజులు శ్రీవరవరమునులుగా అవతరించగా, కూరేశులు ప్రతివాది భయంకరమ్ అణ్ణన్‌గా అవతరించారు) అనే రీతిలో భగవద్రామానుజులకు కూరేశులవలె, మాముని లకు శిష్యాగ్రేసరులై, వారికి అన్నిరీతులలో కుడిభుజంగా ఉన్నారు. ఆచార్యులైన శ్రీవరవర మునుల విషయంలో తమకు ఉన్న గొప్ప భక్తి ప్రపత్తుల ప్రేరణవల్ల సంస్కృత, ద్రావిడ భాషలలో శ్రీవరవరమునుల విషయంగా కొన్ని స్తుతి గ్రంథాలను విన్నపించారు. వాటిలో ముఖ్యమైన ఈ శ్రీవరవరమునిశతకం శబ్దార్థపుష్టి మొదలైనవాటిలో కవులకు, విద్వాంసు లకు, భక్తులకు కర్ణామృతమై ప్రకాశిస్తున్నది. దీనిలోని అలంకారపౌష్కల్యం అతిశయించి ఉంటుందనే విషయం సహృదయరసికహృదయానుభవసిద్ధం.

ఇంతవరకు ఈ శతకం తెలుగు లిపిలో రెండుమార్లు, దేవనాగరిలిపిలో రెండుమార్లు ముద్రింపబడింది. ఇది ప్రతివాదిభయంకరవంశీయులకు నిత్యానుసంధేయం. కంఠస్థం కూడా. పలుచోట్ల పాఠ భేదాలు కన్పిస్తున్నందువల్ల పాఠనిర్ణయంలో కొంత శ్రమ లేకపోలేదు. ఎఱుమ్బియప్పా అనుగ్రహించిన వరవరమునిశతకం ఇంచుమించుగా అంతా మందా క్రాంతావృత్తంలో నిబద్ధమైనది. కాని, ఈ శతకంలో పలు వృత్తాలు ఇందులో అద్భుతంగా, అనాయాసంగా ప్రయోగింపబడినందువల్ల ఇది ఉత్తమకావ్యకోటిలో పరిగణనీయం. స్తోత్రగ్రంథాలలో ఇటువంటి గ్రంథం దుర్లభమని చెప్పడం అతిశయోక్తి ఏమాత్రం కాదు.

శ్రీప్రతివాది భయంకరమ్ అణ్ణన్ అనుగ్రహించిన

శ్రీవరవరముని శతకము

ఆచార్యవరివస్యా వ్యాఖ్యానము

1. **మూలేఽవతీర్ణ మిహ మూలమనూదితార్థ-**
తత్త్వావబోధసుఖితాం వసుధాం విధాతుమ్ ।
రామానుజార్యచరణాంబుజచంచరీకం
రమ్యోపయంతృయమినం శరణం ప్రపద్యే ॥

వసుధాం = భూమిని, మూలమను + ఉదిత + అర్థతత్త్వ + అవబోధ సుఖితాం= అష్టాక్షరి మహామంత్రంలో చెప్పబడ్డ అర్థాలలోని తత్త్వాన్ని తెలిసి సంతోషించినదానినిగా, విధాతుం = చేయడానికి, ఇహ = ఈ లోకంలో, మూలే = మూల అనే నక్షత్రంలో, అవతీర్ణం = అవతరించినవారు, రామానుజార్యచరణ + అంబుజచంచరీకం = భగవద్రామానుజుల శ్రీచరణాలనే పద్మాలలో తుమ్మెదలవలె నిత్యం ఆశ్రయించి ఆనందించే వారైన, రమ్యోపయంతృయమినం = వరవరమునులను, శరణం ప్రపద్యే = శరణంగా ఆశ్రయిస్తున్నాను.

ఈ భూలోకములోనున్నవారిని మూలమంత్రమగు అష్టాక్షరియొక్క అర్థములను యథార్థముగా తెలిసికొనుటచే విలక్షణమైన సుఖమును కల్గినవారినిగా చేయుట కొఱకు (సాధారణసంవత్సరము అల్పిశి నెలలో) మూలానక్షత్రమున ఈ లోకములో అవతరించిన వారు, భగవద్రామానుజుల పద్మములవంటి శ్రీపాదములలో తుమ్మెదవలె అభినివేశమును పొందినవారును, శ్రీవరవరమునులు అను పేరుతో ప్రసిద్ధులగు పెరియ జీయర్‌ను ఆశ్రయింతును – అని భావము.

ఇచట భూవాచకమైన వసుధాశబ్దము భూమిలో నున్న జనులను లక్షించును. ఇందు గ్రంథారంభమున **"ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్"** అను రీతిలో కర్తవ్యమగు నమస్కారరూపమంగళమును ఆచరించినట్లయినది.

ఈ స్తుతిగ్రంథం నిర్విఘ్నంగా పరిసమాప్తి చెందడంకోసం మంగళాచరణంగా ఈ శ్లోకం రచింపబడింది, భగవానుని అవతారప్రయోజనం గీతలో **"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"** (సాధుపరిత్రాణంకోసం, దుష్టజననాశనంకోసం, ధర్మాన్ని సుస్థాపించడంకోసం ప్రతియుగంలో నేను అవతరిస్తాను.) అని అంటూ తెలుపబడింది. ఆచార్యుల అవతారానికి కూడా వాటినే ప్రయోజనాలుగా భావించవచ్చు. అయితే, సమీచీనాలైన అర్థవిశేషాలను

ఉపదేశించడంద్వారా, అనుష్ఠించడంద్వారా ఆచార్యులచే సాధుపరిత్రాణం చేయబడు తుంది. వేదబాహ్యమతస్థులు పలికే అపార్థాలను నిరసించడంద్వారా దుష్కృద్వినాశం చేయబడుతుంది. ఈ మూడిటిలో సాధుపరిత్రాణమే ప్రధాన ప్రయోజనం, మిగిలిన రెండు ఆనుషంగికాలని పూర్వాచార్యాభిప్రాయం. ప్రకృతంలో **"వసుధాం మూలమనూదితార్థ తత్త్వావబోధసుఖితాం విధాతుం మూలే అవతీర్ణమ్"** అని అంటూ తిరుమంత్రార్థతత్త్వాన్ని ఉపదేశించి లోకాన్ని ఉజ్జీవింపజేయడంకోసం శ్రీవరవరమునులు అవతరించారని చెప్పడం ద్వారా రహస్య త్రయం, తన్మూలకాలైన సకలశాస్త్రార్థాలు- అనే అన్నిటియొక్క యథార్థతత్త్వాన్ని వ్యక్తం చేయడంకోసమే శ్రీవరవరమునుల అవతారం జరిగిందని సూచింపబడింది. ఇది సాధుపరిత్రాణ రూపమైన ప్రధాన ప్రయోజనాన్ని తెల్పుతున్నది. **'మనుః'** అనే పదం మంత్రాన్ని తెలుపుతుంది. **'మూల మను'** అంటే మూలమంత్రం. ఇది అష్టాక్షరీ మంత్రమే. **"ఋచో యజూంషి సామాని తథైవాథర్వణాని చ, సర్వ మష్టాక్షరాంతస్థం యచ్చాన్యదపి వాఙ్మయమ్"** అనే రీతిలో సకల వేదాలు, శాస్త్రాలు అష్టాక్షరిమంత్రాంతర్గ తాలు. కనుక, దీనిని వివరించి ఉపదేశించడంద్వారా సకలార్థతత్త్వాలను బోధించి, లోకోజ్జీవనం కల్గించడంకోసమే శ్రీవరవరమునులు అవతరించారని చెప్పినట్లయింది. **"రామానుజార్యచరణాంబుజచంచరీకమ్"** అని అనడంద్వారా యతీంద్రప్రవణులనే శ్రీవరవరమునుల తిరునామం వివరింపబడింది. **"రమ్యోపయంతా, కాంతోపయంతా, రమ్యజామాతా"** అనే ఈ నామాలన్నీ పర్యాయాలు. **"రామానుజార్య చరణాంబుజ చంచరీకమ్"** అనే ప్రయోగం శ్రీ రామానుజుల విషయంలో వారికి గల సతతప్రావణ్యాన్ని సూచిస్తుంది కనుక. కైంకర్యాన్ని **"రమ్యోపయంతృయ మినం శరణం ప్రపద్యే"** అనే ప్రయోగం ప్రపత్తిని తెలుపుతున్నంది కనుక, చరమ పర్వగతమైన ద్వయమంత్రార్థం ఇందులో సూచింపబడింది. ఇదే కదా ఈ స్తుతిలోని ప్రధానప్రమేయం.

2 యదవతరణమూలం ముక్తిమూలం ప్రజానాం
శఠరిపుమునిదృష్టామ్నాయసామ్రాజ్యమూలమ్ ।
కలికలుషసమూలోన్మూలనే మూల మింధే
స భవతు వరయోగీ నః సమస్తార్థమూలమ్ ॥

యత్ అవతరణమూలమ్ = ఏ మణవాళమహామునుల అవతారదినం అయిన మూలానక్షత్రం, ప్రజానాం = సకలజనులయొక్క, ముక్తిమూలమ్ = ముక్తికి మూలంగా, శఠరిపుమునిదృష్ట = శఠకోపమునులనబడే నమ్మాళ్వార్లచేత దర్శింపబడ్డ, ఆమ్నాయ సామ్రాజ్యమూలమ్ = ద్రావిడబ్రహ్మసంహిత (తిరువాయ్‌మొழிఅనే ప్రబంధం) యొక్క సర్వతోముఖం అయిన విజయానికి మూలంగాను, కలికలుషసమూల +ఉన్మూలనే =

కలికల్మషాన్ని సమూలంగా పెక లించడంలో, మూలమ్ = మూలం గాను, ఇంధే = ప్రకాశిస్తున్నదో, సః వరయోగీ = ఆ (కారణం) మణవాళమహామునులు, నః = మన, సమస్త+ అర్థమూలం భవతు = సకలార్థసిద్ధికి మూలం కావాలి.

ఏ వరవరమునుల అవతారహేతువైన మూలానక్షత్రం లోకుల మోక్షమునకు మూలకారణమైయున్నదో, మఱియు, శ్రీశఠకోపులనబడు నమ్మాళ్వార్లచే సాక్షాత్కరింపబడిన ద్రావిడవేదమును ప్రమాణసామ్రాజ్యములో (పరమప్రమాణముగా) అభిషిక్తము చేయుటకు హేతువగుచున్నదో, కలిదోషమును సమూలముగా పెకలించుటలో కారణమై ప్రకాశించు చున్నదో, అట్టి శ్రీ మణవాళమహామునులు దాసభూతులమగు మనయొక్క సకలపురుషార్థ సిద్ధికొఱకు కారణభూతులు అగుగాక! (మనకు సకలార్థములను ప్రసాదింతురు గాక !)

శ్రీవరవరమునుల అవతారనక్షత్రముయొక్క గొప్పతనము **"శెన్దమిழ் వేదియర్ శిన్దై తెళిన్దు శిఱన్దు మకిழ்న్దిడునాళ్"** (అందమైన ద్రావిడవేదాన్ని తెలిసినవారి మనస్సు తేటపడి, ప్రకాశించి ఆనందించే దినం) అను వారి నాళ్ పాట్టులో తెలుపబడినది. అందు **"మన్దమది ప్పువి మానిదర్తజ్ఞళై వానిలుయర్త్తిడునాళ్"** (ఈ భువిలో మందమతులు అయినవారినికూడా పరమపదానికి ఉద్ధరించి కొనిపోయే దినం) అనుటను **"యదవతరణమూలం ముక్తిమూలం ప్రజానామ్"** అనెడి మొదటి విశేషణము వివరించు చున్నది. **"కన్దమలర్ పొழிల్ శూழ் కురుకాతిపతి కలైకళ్ విళజ్గిడునాళ్"** (సుగంధాన్ని కల్గిన పూలను కల తోటలతో పరివేష్టితమైన కురుకాపురికి అధిపతి అయిన నమ్మాళ్వార్ల ప్రబంధాలు ప్రకాశించే దినం) అనుటను **"శఠరిపుమునిదృష్టామ్నాయ సామ్రాజ్యమూలమ్"** అనెడి రెండవ విశేషణము వివరించుచున్నది. **"స భవతు వరయోగీ నః సమస్తార్థ మూలమ్"** అనుటకు – మనకు సకలవేదవేదాంతరహస్యార్థముల సిద్ధికిని మణవాళమహా మునులు మూలహేతువులు అగుదురు – అనియును అర్థమును చెప్పవచ్చును. మహా మునుల కటాక్షవిశేషముచే మనకు సకలశాస్త్రార్థములును స్పష్టముగా ప్రకాశించునని తాత్పర్యము.

ఈ శ్లోకంలో అణ్ణన్ **"అழகు తికழ்న్దిడుమ్ ఐప్పశియిల్ తిరుమూలనన్నాళ్"** (అందం ప్రకాశించే అల్పిశిమాసంలోని మూలానక్షత్రం) అని మంగళాశాసనం చేయబడే మణవాళమహామునుల అవతారనక్షత్రం అయిన మూలానక్షత్రంయొక్క వైభవాన్ని కీర్తిస్తున్నారు. **"యన్మూల మాశ్వయుజమాస్యవతారమూలమ్"** అనే ఎఱుమ్బియప్పా ప్రణీతమైనశ్లోకం కంటే విలక్షణమైన రీతిలో ఈ శ్లోకం అవతరించింది.

(యదవతరణమూలమ్) – "శెన్దమిழ் వేదియర్ శిన్దై తెళిన్దు శిఱన్దు మకిழ்న్దిడు నాళ్, శీరులకారియర్ శెయ్‌దరుళ్ నఱ్కలై తేశు పొలిన్దిడునాళ్, మన్దమతి ప్పువి మానిదర్

తజ్గళై వానిల్ ఉయర్త్తిడునాళ్, మాశఱు ఞానియర్ శేర్ ఎతిరాశర్తమ్ వాழ్వు ముళైత్తిడునాళ్, కన్దమలర్ పొழிల్ శూழ் కురుకాపతి నల్కలైకళ్ విళఙ్గిడునాళ్, కారమర్ మేని యరజ్గనకర్ క్కిఱై కణ్గళ్ కళిత్తిడునాళ్, ఇప్పుశియిల్ తిరుమూల నన్నాళ్" (అందమైన ద్రావిడవేదాన్ని అభ్యసించినవారి మనస్సు స్వచ్ఛమై, గొప్పగా ప్రకాశించి ఆనందించే దినం, కల్యాణగుణాలను కల శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించిన సద్గ్రంథాల ప్రకాశం వర్ధిల్లేదినం, ఈ లోకంలో మందమతులైనవారుకూడా పరమపదానికి ఉద్ధరింపబడే దినం, ఏదోషం లేని జ్ఞానులు ఆశ్రయించే యతిరాజుల ఉజ్జీవనం అంకురించే దినం, సుగంధాన్ని కల పూలు పూచే తోటలను కల్గిన కురుకాపురికి నాథులైన నమ్మాழ்వార్ల గ్రంథాలు ప్రకాశించే దినం, మేఘసదృశుడైన శ్రీరంగనాథుని నేత్రాలు ఆనందించే దినం, అంతులేని కల్యాణగుణాలను కల మహాత్ములైన మణవాళ మహాముని అవతరించిన దినం ఏది? అంటే– అందం ప్రకాశించే అల్పిశిమాసంలోని మూలానక్షత్రమే.) అని కీర్తింపబడే అల్పిశిమాసంలోని మూలానక్షత్రం.

(ప్రజానాం ముక్తిమూలమ్) – "మన్దమతి ప్పువి మానిదర్తజ్గళై వానిలుయర్ త్తిడునాళ్" (భూలోకంలోని మందమతులైన మానవులను పరమపదానికి ఉద్ధరించే దినం) అనే రీతిలో **"అలైనీర్ కడలుళ్ అழுన్దుమ్ నావాయ్‌పోల్ అన్తు నాన్ తుళఙ్గ"** (అలలు కల్గిన సముద్రంలో మునిగిపోయే నావవలె జన్మసముద్రంలో నేను అపుడు మునిగి బాధపడుతూ ఉండే) మానవులందరు సద్గతిని పొందడంలో మూలమై ఉంటుంది, భగవానుని **"అలమ్ పురిన్ద నెడుమ్ తడక్కై"** (చాలు అనిపించేటట్లు పుష్కలంగా ఇచ్చే దీర్ఘమైన, ఉదారమైన శ్రీహస్తాన్ని) చేరలేనివారై, **"నానే నానావిత నరకమ్ పుకుమ్ పావమ్ శెయ్‌తేన్"** (నేనే పలువిధాలైన నరకాలలో ప్రవేశించే పాపాలను చేశాను) అనే రీతిలో పలు పాపాలను చేసిన సంసారులుసైతం శ్రీమణవాళమహామునుల సంబంధంతో ఉజ్జీవించారుకదా !

(శఠరిపుమునిదృష్టామ్నాయ సామ్రాజ్యమూలమ్) – "శేఱ్ఱు క్కమలవయల్ శూழ் అరఙ్గర్తమ్ శీర్ తழைప్ప, పోఱ్ఱి త్తొழுవల్ల అన్దణర్ వాழ ఇప్పూతలత్తే, మాఱ్ఱఱ్ఱ శెమ్బొన్ మణవాళమాముని వన్దిలనేల్, ఆఱ్ఱిల్ కరైత్త పుళియల్లవో తమిழ்ఆరణమే" (పంకంలో ఉద్భవించిన తామరపూలను కల్గిన సస్యక్షేత్రాలచే నిండుగా ఉండే శ్రీరంగ నగరానికి అధిపతి అయిన శ్రీరంగనాథుని సంపద నిత్యాభివృద్ధిని పొందేటట్లుగా, మంగళాశాసనం చేసి నమస్కరించే సద్బ్రాహ్మణులు ఉజ్జీవించేటట్లుగా, సాటి లేని, ఎఱ్ఱని బంగారంవలె స్పృహణీయులైన మణవాళమహామునులు ఈ భూలోకంలో అవతరించి ఉండకపోతే, నదిలో కఱిగిన చింతపండువలె ద్రావిడవేదం నిష్ప్రయోజనమై ఉండేదికదా!) అని సమకాలంలోనే అనుసంధింపబడిందికదా. మణవాళమహామునుల రహస్యవ్యాఖ్యా

నాలు అవతరించి ఉండకపోతే, నమ్మిళ్వై శ్రీసూక్తులు అవతరించినదానికి పూర్ణప్రయోజనం సిద్ధించి ఉండేది కాదుకదా! **"శఠరిపుముని దృష్టామ్నాయ"** అనే పదంచేత కేవలం తిరువాయ్మొళ్ళి మాత్రమేకాదు. **"నాతనుక్కు నాలాయిర ముఱైత్తాన్ వాళ్ళియే"** (నాథమునులకు నాలాయిరాన్ని ఉపదేశించినవారు వర్ధిల్లాలి) అనే రీతిలో నాలాయిర దివ్యప్రబంధం పూర్తిగా నమ్మాళ్వార్ల శ్రీముఖంనుండి ఆవిర్భవించింది కనుక, సకలదివ్య ప్రబంధాలను ఈ పదం నిర్దేశిస్తుందని చెప్పవచ్చు. అది సంస్కృతవేదంకంటే అతిశయించి, గొప్పతనాన్ని పొంది ప్రకాశించడానికి మూలకారణం వరవరమునుల శ్రీసూక్తులే కనుక, ఈ విధంగా పల్కడంలో అడ్డు ఏమీ లేదు.

(కలికలుషసమూలోన్మూలనే మూలమ్ ఇంధే) –**'కలియుమ్ కెడుమ్ కణ్డుకొణ్మిన్"** (కలి నశిస్తుంది. చూడండి) అని పల్కిన నమ్మాళ్వార్ల శ్రీసూక్తిరీతిలో కలికన్ఱి అయిన తిరుమఙ్గైయాళ్వార్లు, **"రామానుజముని ర్జీయాత్ యో హరేః భక్తియంత్రితాత్, కలికోలాహలక్రీడాముధాగ్రహ మపాహరత్"** (హరిభక్తి అనే యంత్రంవల్ల కలియొక్క కోలాహలక్రీడ అనే వ్యర్థమైన ఆగ్రహాన్ని అపహరించిన శ్రీరామానుజముని జయించుగాక) అనే రీతిలో ఎమ్బెరుమానార్ అవతరించి, కలివల్ల కల్గిన అజ్ఞానాన్ని ఖండించినా, అందులో కలిశేషం కొంత మిగిలినందువల్ల, ఆ కలిదోషంయొక్క నిశ్శేషనిబర్హణం మణవాళ మహాములు అవతరించిన తరువాతనే జరిగింది.

(సః వరయోగీ నః సమస్తార్థమూలమ్ భవతు) – పూర్వం తెలిపిన గొప్పతనానికి అంతటికీ నిధి అయిన మణవాళమహామునుల అనుగ్రహంతో మనకు సకలార్థసిద్ధి కలగాలి – అని తాత్పర్యం. వేదవేదాంత వేదాంగాలలో ఉండే సకలార్థాలు మణవాళమహామునుల దివ్యసూక్తులలో పొదగబడి ఉండడంవల్ల ఆ అర్థవిశేషాలు అన్నీ మనకు చేతికి లభించేటట్లుగా కృపజేయాలని దీనిద్వారా వారిని ప్రార్థించినట్లయింది.

3. **జనివిపదపవాదౌ యస్య పాదౌ విదంతః**
సతత మపి మహాంతః స్వాంత ఏవోద్వహంతి ।
స జయతి భజదంతర్ధ్వాంతకల్పాంతభానుః
నిరవధిగుణకాంతో హంత! కాంతోపయంతా ॥

మహాంతః = మహనీయులు, యస్య పాదౌ = ఏ మణవాళమహామునుల శ్రీచర ణాలను, జనివిపత్ +అపవాదౌ = సంసారంవల్ల ఏర్పడే ఆపదలను అన్నిటినీ పోగొట్ట గల్గినవిగా, విదంతః = తెలిసికొన్నవారై, సతతమ్ = ఎల్లప్పుడు, స్వాంతే ఏవ = తమ హృదయంలోనే, ఉద్వహంతి = ధరిస్తున్నారో, భజత్ + అంతర్ధ్వాంత కల్పాంతభానుః= భక్తుల మనస్సులలో ఉండే అజ్ఞానమనే చీకటిని పోగొట్టే విలక్షణుడైన సూర్యుడై, గుణ

కాంతః=కల్యాణగుణాలతో అభిరాముడై ఉండే, సః = ఆ, కాంతోపయంతా= వరవర మునులు, జయతి = వర్ధిల్లుతున్నారు, హంత = ఆహా !

పెద్దలు ఏ శ్రీవరవరమునుల శ్రీపాదములను సంసారమునందు పుట్టుక మొదలగు ఆపదలకు అపవాదముగా భావించి, ఎల్లప్పుడు ఆ శ్రీపాదములనే ఆదరముతో ప్రేమించి, ధరింతురో (శ్రీవరవరమునుల శ్రీచరణములనే ధ్యానింతురో), ఏ వరవరమునులుతమను ఆశ్రయించినవారి ఆంతరమైన అజ్ఞానాంధకారమును నిరసించుటలో (మనస్సులో గల అజ్ఞానమనెడి చీకటిని పోగొట్టుటలో) ప్రళయకాలసూర్యుడై వెల్గుచున్నారో, అట్లున్నను అంతు లేని తమ శమదమాది కల్యాణగుణములతో ఆకర్షణీయులై, అతిమనోహరులై యున్నారో, అట్టి శ్రీవరవరమునులు సర్వోత్కృష్టులై వెలుగుచున్నారు.

ఇందు పూర్వార్ధములో శ్రీమణవాళ మహామునుల శ్రీపాదమహిమ తెలుపబడినది. ఉత్తరార్ధములో మణవాళమహామునుల అతిశయము చెప్పబడినది.

మణవాళమహామునుల **"శెయ్యతామరై త్తాళిణై"** (అందమైన, ఎఱ్ఱని తామరపూల వంటి పాదపద్మం) యొక్క గొప్పతనం ఈ శ్లోకం పూర్వార్ధంలో వర్ణింపబడుతున్నది. శాస్త్రాలు విధిశాస్త్రాలని, అపవాదశాస్త్రాలని, ప్రతిప్రసవశాస్త్రాలని మూడు విధాలు. ముందు చెప్పబడ్డ విధిని నిషేధించేది అపవాదశాస్త్రం అనబడుతుంది. దానిని అడ్డుకొని విధిశాస్త్రాన్నే స్థాపించగల్గినది ప్రతిప్రసవశాస్త్రం. **"అపవాదాపవాదః ప్రతిప్రసవః"** అని శాస్త్రజ్ఞుల నిర్వచనం. ఇక్కడ శ్రీవరవరమునుల శ్రీచరణాలను సంసారంవల్ల కలిగే ఆపదలకు అపవాదం –అని అనడం శాస్త్రసరణిలో పల్కిన సూక్తి. **"జనుర్జననజన్మాని జని రుత్పత్తి రుద్భవః"** అనే అమరకోశవచనానుసారం **"జని"** అంటే పుట్టుక. **"పున రపి జననం పున రపి మరణమ్, పునరపి జననీజఠరే శయనమ్"** (తిరిగి పుట్టుక, తిరిగి మరణం, మళ్ళీ తల్లి కడుపులో శయనం) అనే సంసారం దీనివల్ల చెప్పబడింది. ఇందువల్ల కలిగే ఆపదలు, దుఃఖాలు ఎన్నో ఉన్నాయి కదా! **"కొన్నుయిరుణ్ణుమ్ విశాతి పకై పశి తీయన వెల్లామ్"** (ప్రాణులను చంపి తినే రాక్షసజాతులు, పగ, ఆకలి, మొదలైన చెడ్డలు అన్నీ) అని, **"పోర్న్ద పిఱప్పొడు నోయొడు మూప్పొడు ఇఱప్పివై"** (బాధించే జన్మ, వ్యాధులు, వార్ధక్యం, మరణం– అనేవి) అని ఆళ్వార్లు పల్కిన వీటికి అన్నిటికీ –

(యస్య పాదౌ అపవాదౌ విదంతః) –మణవాళమహామునుల శ్రీచరణాలే నివర్తకాలు అని తెలిసినవారై– అని భావం. ఈ జ్ఞానం సామాన్యులకు కలుగదు కనుక ఈ జ్ఞానం కల్గినవారిని **"మహాంతః"** అని అంటున్నారు. వారు వాటిని ఏం చేస్తారు? అంటే,

(స్వాంత ఏవ ఉద్వహంతి) – "తౌ పాదౌ ఏవ స్వాంతే ఉద్వహంతి" అని అన్వయించాలి. సంసారబంధస్థితిమోక్షహేతువులైన శ్రీమన్నారాయణుని శ్రీచరణాలను వీడి, మామునుల శ్రీచరణాలనే అనవరతం చింతన చేస్తున్నారని భావం. ఇది ఏవకారార్థం.

ఇటువంటి వైలక్షణ్యాన్ని నిండుగా కల్గిన శ్రీచరణాలను కల్గినవారైన మాముునుల గొప్ప తనాన్ని ఉత్తరార్థం తెలుపుతున్నది. తమ శ్రీచరణాలను సేవించే భక్తుల మనస్సులలోని అజ్ఞానాన్ని పారదోలే విషయంలో **"కదిరాయిర మిరవి కలన్దెరిత్తాల్ ఒత్తిరుక్కుమ్"** (వేయిమంది సూర్యులు కలిసి ప్రకాశిస్తే, దానితో సాటి వస్తుంది.) అన్నట్లు సూర్యునితో పోలి ఉంటారు. ఆ కాలంలో ఉపదేశరూపాలైన శ్రీసూక్తులతోను, తరువాత కాలంలో శ్రీకోశాలతోను, కల్యాణగుణాలని పేరు కల్గినవి అన్నిటితోను స్పృహణీయులై– **"సమస్త కల్యాణగుణాభిరాములై"** ఉంటారు.

4. ఇంధే వాక్యవిభూషణస్య మహతో యద్భాషణం భూషణం
యత్పాదాంబురుహద్వయం సుమనసాం మూర్ధ్న స్సదా భూషణమ్ ।
యద్భక్తాంఘ్రిరజఃకణో వితనుతే దుఃఖోదధేః శోషణం
వందే కాంతవరం మునిం తమనఘం నిత్యం కలే ర్భీషణమ్॥

మహతః వాక్యవిభూషణస్య = గొప్పదైన శ్రీవచనభూషణానికి, యద్భాషణం = ఏ మణవాళ మహా మునుల వ్యాఖ్యానం, భూషణం = గొప్ప అలంకారమో, యత్పాదాంబురుహద్వయం = ఏ మణవాళమహామునుల శ్రీచరణ్వయం, సుమనసాం = విద్వాంసుల, మూర్ధ్నః = శిరస్సుకు, సదా భూషణమ్ = ఎల్లప్పుడు భూషణంగా, ఇంధే = ప్రకాశిస్తున్నదో, యద్భక్తాంఘ్రిరజః కణః = ఏమణవాళమహామునుల భక్తుల శ్రీచరణరజస్సుయొక్క లేశం, దుఃఖ+ఉదధేః = సాంసారిక దుఃఖాలనే సముద్రాన్ని, శోషణం వితనుతే = ఇంకింప జేస్తున్నదో, కలేః భీషణం = కలిపురుషునకు భయంకరులు, అనఘం = పాపరహితులు (హేయప్రతిభటులు) అయిన, తం కాంతవరం మునిం = ఆ వరవరమునులను, నిత్యం వందే = నిత్యం నమస్కరిస్తున్నాను.

శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించిన శ్రీవచనభూషణమను గొప్ప దివ్య శాస్త్రమునకు ఏ మణవాళమహామునులు అనుగ్రహించిన, భాష్యమై అమరియున్న వ్యాఖ్యానము భూషణముగా ప్రకాశించుచున్నదో (**"మహితమ్"** అను పాఠమున శ్లాఘ్యమగు భూషణమై అమరియున్నదో– అని అర్థము), ఏ మణవాళమహామునుల శ్రీపాదపద్మద్వయము ఎల్లప్పుడు విద్వజ్జనమస్తకభూషణమై వెలుగుచున్నదో, ఏ శ్రీ మణవాళ మహామునుల ఒకే ఒక పాదరజఃకణము భక్తుల దుఃఖసముద్రమును ఇంకింపజేయు చున్నదో, కలిపురుషునకు భయంకరులై, కల్యాణగుణయుక్తులై ప్రకాశించు ఆ మణవాళ మహామునులను నిత్యము నేను సేవింతును. శ్లోకంలో **"మహతః"** అనుచోట **"మహితమ్"** అను పాఠాంతరము కలదు.

శ్రీవచనభూషణముయొక్క గొప్పతనమును శ్రీమణవాళమహామునులు ఉపదేశరత్తిన మాలై ప్రబంధంలో **"అన్న పుకழ் ముడుమ్బై యణ్ణల్ ఉలకాశిరియన్ ఇన్నరుళాల్**

శెయ్‌ద కలై యావైయిలుమ్, ఉన్నిల్ తికழ் వశనభూషణత్తిన్ శీర్‌మై ఒన్ఱుక్కిల్లై పుకழ్ల్ల ఇవ్వార్తై మెయ్యిప్పోదు" (అనిర్వచనీయవైభవమును కల ముదుంబై నగరానికి నిర్వాహకులైన శ్రీపిళ్ళైలోకాచార్యులువారు అనుగ్రహించిన గ్రంథాలను అన్నిటిని పరిశీలిస్తే, వాటిలో ప్రకాశించే శ్రీవచనభూషణానికి గల గొప్పతనం దేనికీ లేదు. ఈ మాట పొగడ్త కాదు; వాస్తవం) అనుచు ప్రారంభించి, ఏడు పాశురములలో విస్తరముగా అనుగ్రహించిరి. శ్రీవచనభూషణముయొక్క అర్థములు తమకు మధురముగా స్ఫురించు రీతిని **"శీర్ వచనభూషణత్తిన్ శెమ్బొరుళై శిన్దైతన్నాల్ తేరిలుమామ్ వాయ్‌క్కొణ్డు శెప్పిలుమామ్, ఆరియర్‌కాళ్ ! ఎన్ఱనక్కు నాళు మినితాక నిన్ఱదైయో ! ఉన్దమక్కు ఎవ్విన్బముళదామ్"** (ఆచార్యులారా! గొప్ప వైభవాన్ని కల శ్రీవచనభూషణంలోని అందమైన అర్థాలను మనస్సుతో భావించినా, నోటితో పల్కినా నాకు నిత్యం మధురంగా ఉన్నది. ఆహా! మీకు ఏవిధమైన ఆనందం కల్గుతున్నది?) అను పాశురములో వ్యక్తీకరించిరి. శ్రీవచన భూషణము నకు సంప్రదాయసిద్ధమైన వ్యాఖ్యానము విశదవాక్ శిఖామణియైన మణవాళమహామునులు అనుగ్రహించిన భాష్యమే. అందుచే దీనిని **"మహితం భూషణమ్"** అని కీర్తించుట మిక్కిలి తగినది. మఱియు, **"ఆర్ వశనబూషణత్తిన్ ఆழ్‌పొరుళెల్లా మఱివార్ ? ఆరదు శొన్నేరిల్ అనుట్టిప్పార్ ? ఓరొరువర్ ఉణ్డాకిల్"** (శ్రీవచనభూషణగ్రంథంలోని గంభీరాలైన అర్థాలను అన్నిటిని తెలిసినవారెవరు? ఒకవేళ ఎవరైనా తెలిసి పల్కినా, వానిని అనుష్ఠించేవారెవరు? ఉంటే, ఒకరో ఇద్దరో ఉంటారు.) అనుచు పల్కుట శ్రీమణవాళమహామునులకే బాగుగా తగును. వీరే శ్రీవచనభూషణముయొక్క అర్థమును యథాతథముగా తెలిసి, దాని ప్రకారము నిష్ఠను కల్గినవారని గ్రహింపనగును.

మణవాళమహామునులు తాము అనుగ్రహించిన ఉపదేశరత్తినమాలైలో శ్రీవచన భూషణ వైభవాన్ని ఏడు పాశురాలలో అమోఘంగా అనుగ్రహించారు. **"సాంగాఖిలద్రవిడ సంస్కృతరూప వేదసారార్థ సంగ్రహ మహారసవాక్యజాతమ్, సర్వజ్ఞలోకగురునిర్మితమార్య భోగ్యం వందే సదా వచనభూషణదివ్యశాస్త్రమ్"** (అంగాలతో కూడిన సమస్తమైన సంస్కృత, ద్రావిడ వేదాల సారార్థసంగ్రహాన్ని తెలిపే గొప్ప వాక్యాల సమూహం, సర్వజ్ఞులైన పిళ్ళైలోకాచార్యులవారు నిర్మించినది, ఆర్యులకు భోగ్యమైనది అయిన శ్రీవచనభూషణ దివ్యశాస్త్రాన్ని నమస్కరిస్తున్నాను) అనే రీతిలో దివ్యశాస్త్రంగా ప్రసిద్ధమైన రహస్యగ్రంథం వ్యాఖ్యానం లేకుండా ఎవరికీ అందుబాటులో ఉండేది కాదు కనుక, **"శచ్చమ్బిరదాయమ్ తాముడైయోర్ కేట్టక్కాల్ మెచ్చు వియాక్కియైకళుణ్డాకిల్ – నచ్చి యదికరియుమ్ నీర్ వశనబూషణత్తు క్కுఱ్ఱ మఱియుడైయీర్ !"** (సత్సంప్రదాయాన్ని తెలిసి అనుష్ఠించేవారు వింటే, వారు అందఱు మెచ్చే వాఖ్యానాలు ఉంటే, శ్రీవచనభూషణం పట్ల ఆదరాన్ని కల మనస్సును కల్గిన ప్రపన్నులారా! మధ్యస్థులై ఏ పక్షపాతం లేకుండా వాటిని మీరు

అభ్యసించండి) అని అంటూ శ్రీవరవరమునులే స్వయంగా అనుగ్రహించినట్లు సత్సంప్రదాయ శుద్ధిని కల వ్యాఖ్యానం దుర్లభమై, మణవాళమహామునులు అనుగ్రహించిన వ్యాఖ్యానమే విశదవాక్ శిఖామణి అనే బిరుదును అన్వర్థం చేయగల్గినదై ప్రకాశిస్తున్నది. కనుక, అది శ్రీవచనభూషణానికి చాలా గొప్ప భూషణమై ప్రకాశిస్తున్న రీతిని మొదటి పాదంలో అణ్ణన్ అనుగ్రహించారు. వస్తుస్థితిలో, శ్రీవరవరమునుల వ్యాఖ్యానం అవతరించి ఉండకపోతే శ్రీవచనభూషణం అడవి కాచిన వెన్నెలే అయి ఉండేదికదా !

శ్రీసూక్తి వైభవాన్నిగూర్చి పల్కిన తరువాత శ్రీచరణాల రెండవ పాదంలో శ్రీచరణాల వైభవాన్ని గూర్చి పల్కుతున్నారు. **"కోలమా మెన్‌శెన్నిక్కు ఉన్ కమలమన్న కురైకళ్ఴలే"** (పద్మాలవంటివి, ధ్వనించేవి అయిన నీ శ్రీచరణాలు నా శిరస్సుకు ఆభరణాలు) అని, **"అడిచ్చియోమ్ తలైమిశై నీ అణియాయ్ ఆఴియమ్ కణ్ణా! ఉన్ కోలప్పాదమ్"** (అందమైన నేత్రాలను గల స్వామీ! దాసురాండ్రమైన మా తలపై నీ అందమైన శ్రీచరణాలను అలంకరించు) అని వాంఛించడం కాకుండా, శ్రీవరవరమునుల శ్రీచరణాలనే **"ఎన్ శెన్నిక్కు మలర్న్ద పూవే"** (నా శిరస్సుకు పూచిన పువ్వు) అనే రీతిలో తమ తమ శిరస్సులకు అలంకారమైన పూచిన పూవుగా అన్నట్లు కల్గి ఉంటారు– మనుషులలో గొప్పవారు.

ఇక, మూడవ పాదంలో శ్రీవరవరమునుల దాసుల శ్రీచరణరేణుప్రభావం చెప్పబడుతున్నది. "సముద్రం ఇంకి పోయింది" అనే మాటను ఏనాడూ మనం వినలేదు. అందులోను, రజఃకణాలతో సముద్రం ఇంకిపోవడం సర్వాత్మనా అసంభావితం. **"పఱవై యేఱు పరమ్ పురుడా ! నీ యెన్నైక్కైక్కొణ్డపిన్ పిఱవి యెన్నుమ్ కడలుమ్ వఱ్ఱి"** (గరుడుని అధిరోహించే పరమపురుషా! నీవు నన్ను పరిగ్రహించిన తరువాత జన్మ అనే సముద్రం ఇంకిపోయి) అని అంటూ పెరియాఴ్వార్ అనుగ్రహించిన రీతిలోనే అత్యుక్తి అనే రీతిలో శ్రీమద్వరవర ముని భక్తుల శ్రీపాదరేణువులోని ఏకదేశమే సంసారుల సకలదుఃఖసాగర శోషణనిపుణంగా ఉన్నదని అంటున్నారు. దాసుల శ్రీచరణ రజఃపరమాణుపరాక్రమే ఇంతటిది అయితే, ఇక శ్రీవరవరమునుల శ్రీచరణరేణుమహిమ ఎంతటిదో కదా ! అది వాచామగోచరమనే విషయం కింపునర్న్యాయసిద్ధం కదా!

"అనఘమ్" – సదాచారలక్షణసంపత్తిలో ఏ కొఱత లేనివారని ప్రకృతంలో తాత్పర్యం.

5. **యత్పాదాంబుజసంశ్రయేణ విమలాః యల్లబ్ధబోధోజ్జ్వలాః**
యత్సేవైకరసా స్వశిష్యనివహవ్యాప్తాఖిలాశాంతరాః ।
ప్రఖ్యాతా హి వరప్రదప్రభృతయ స్తే నిత్యసిద్ధోపమాః
తస్మాత్కాంతవరా న్మునే రనుపమాత్ దైవం పరం నాద్రియే ॥

నిత్యసిద్ధోపమాః = నిత్యులతో, ముక్తులతో సమానులైన, వరప్రదప్రభృతయః = కోయిలణ్ణన్ మొదలైన, తే = ఆ మహనీయులు, యత్పాదాంబుజ సంశ్రయేణ = ఏ మణవాళమహామునుల శ్రీచరణపద్మాలను ఆశ్రయించడంచేత, విమలాః = దోష రహితు లయ్యారో, యల్లబ్ధబోధ + ఉజ్జ్వలాః = ఏ మణవాళమహామునుల వద్ద పొందిన జ్ఞానంతో వెలుగుతున్నారో, యత్ సూక్తి +ఏకరసాః = ఏ మణవాళమహామునుల శ్రీసూక్తులలోనే రసికులై, స్వశిష్యనివహవ్యాప్త + అఖిల +ఆశాంతరాః = తమ శిష్యుల సమూహాలతో సకలదిఙ్మండలాలలో వ్యాపించి ఉన్నారో, తస్మాత్ అనుపమాత్ కాంతవరాత్ మునేః= అటువంటి సాటిలేని మణవాళమహామునులకంటే, పరం దైవం = గొప్ప దైవాన్ని దేనినీ, న+ ఆద్రియే = ఆదరించను.

ఏ మణవాళమహామునుల శ్రీపాదములను ఆశ్రయించిన కారణముచే నిర్మలురై, ఏ మణవాళమహామునుల కృపచే లభించిన రహస్యత్రయాదుల అర్థజ్ఞానముచే గొప్పగా వెల్గుచున్నవారై, ఏ మణవాళమహామునుల శ్రీపాదములందు కైంకర్యమును చేయుటయే ఆనందముగా కలవారై, పది దిక్కులలో వ్యాపించిన శిష్యులను కలవారైయున్న శ్రీవరద నారాయణగురువగు కోయిలణ్ణన్ మొదలగు మహాత్ములు నిత్యసూరులతో, శ్వేతద్వీప వాసులతో సమానులై వెల్గుచున్నారో, తమకు ఏసాటి లేని ఆ శ్రీమణవాళమహాముని లను తప్ప వేఱొక దైవమును నేను ఆదరింపను. చరమపర్వమగు శ్రీమణవాళమహామునులే పరదైవమని శ్లోకతాత్పర్యము.

కోయిలణ్ణన్ మొదలైన శిష్యవర్గాలు గొప్పతనాన్ని కల్గి ఉండడంకూడా శ్రీవరవర మునుల సంబంధంవల్లనే – అని ఈ శ్లోకంలోని తాత్పర్యం. కోయిలణ్ణన్‌కు వరదనారా యణులని తిరునామం. ఆ నామంలోని ఏకదేశాన్ని గ్రహించి **"నామ్ని నామైకదేశగ్రహణ"** (పేరులో కొంత భాగాన్ని మాత్రం గ్రహించి నిర్దేశించడం) మనే రీతిలో వరదశబ్దంచేత ఆ ఆచార్యులు ఇక్కడ నిర్దేశింపబడ్డారు. రాబోయే 8వ, 14వ శ్లోకాలలో ప్రసక్తం కాబోయే వరదగురునామంకూడా వీరి నామమే. వీరేకాక, వానమామలైజీయర్, పరవస్తు పట్టర్‌పిరాన్ జీయర్ మొదలైన ఉత్తమాశ్రమాన్ని ఆశ్రయించిన మహనీయులుసైతం శ్రీవరవరమునుల శ్రీచరణాలను సేవించి, వారిపట్ల ప్రావణ్యాన్ని కల్గి ఉన్నా, వారిని విడచిపెట్టి కోయిల్ అణ్ణన్‌ను మాత్రం ప్రస్తావించడం ఎందుకు? అని అంటే, వారి విషయంలో ఉండే అసాధారణం అయిన వైలక్షణ్యాన్నిబట్టి. అది ఏమి? అంటే, వీరు అభిజనవిద్యావృత్తాలతో పాటుగా, శిష్యసంపత్తునుకూడా సమృద్ధంగా కల్గినవారు అయినా, తమ ఆచార్య పురుషత్వాన్ని ఒక విషయంగా లెక్కించకుండా శ్రీవరవరమునుల శ్రీచరణాల లోని శిష్యవృత్తినే తమకు ఉజ్జీవనహేతువు– అని నిశ్చయించుకొని ఆశ్రయించడమే దీనికి కారణం. యతీంద్రప్రవణప్రభావమనే శ్రీవరవరమునుల చరిత్రగ్రంథంలో– నిత్యముక్తులను, శ్వేతదీపవాసులను పోలి ఉండేవారైన వీరు శ్రీవరవరముని శ్రీచరణాలలో

ఆశ్రయించి, నిర్మలజ్ఞాననిధులై వెలుగుతున్నారు. వీరికి సకలార్థవిజ్ఞానం శ్రీవరవరమునుల వల్లనే కల్గింది. మణవాళ మహామునులకు ఆజ్ఞారూపకైంకర్యాలను చేయడం తప్ప వేఱు దేనినీ తెలియనివారు వీరు. తాము కూడా శిష్యవర్గాలను దశదిశలలో కలవారు. ఇటువంటి సచ్ఛిష్యసమృద్ధిని కల శ్రీవరవరమునులకంటే ఇంకొ దైవం ఉన్నదని నేను భావించను- అని శ్లోకసారం.

6. యత్సూక్త్యైకరసా యదంఘ్రియుగళీసేవైకహేవాకినో
యద్వాత్సల్యదయాదిసద్గుణగణాకూపారమగ్నాశయాః ।
మన్యంతే న పరం విముక్తికరణం సంతో యదాలోకనాత్
తన్యాన్న స్స శుభాన్యవేలమహిమా కాంతోపయంతా మునిః ॥

యత్సూక్తి +ఏకరసాః = ఏ మణవాళమహామునుల సూక్తిలోనే ఆనందించేవారు, యత్ +అంఘ్రియుగళీసేవా + ఏకహేవాకినః = ఏ మణవాళమహామునుల శ్రీచరణాలలో సేవచేయడంలోనే మిక్కిలి కుతూహలాన్ని కలవారు, యత్ వాత్సల్యదయాదిసద్గుణగణ+ అకూపారమగ్నాశయాః = ఏ మణవాళమహామునులయొక్క వాత్సల్యం, దయ మొదలైన సద్గుణసమూహాల సాగరంలో మునిగిన మనస్సులను కలవారు అయిన, సంతః = సత్పురుషులు, యత్ ఆలోకనాత్ = ఏ మణవాళమహామునుల కటాక్షానికి మించిన, పరం విముక్తికరణం = ఇంకొక గొప్పదైన ముక్తి సాధనం ఉన్నదని, న మన్యతే = భావించడంలేదో, సః అవేలమహిమా = అటువంటి అంతులేని వైభవాన్ని కల్గిన, కాంతోప యంతా మునిః = మణవాళమహామునులు, నః = మనకు, శుభాని తన్యాత్ = మంగళాలను వృద్ధిచేయాలి.

సత్పురుషులుఏ శ్రీ మణవాళమహామునుల శ్రీసూక్తిని వినుటయు, అనుసంధించుట యును అతిమధురమైయుండుటచే ఎల్లప్పుడు ఆనందించుచున్నారో, ఏ శ్రీమణవాళమహా మునుల శ్రీపాదయుగమును సేవించుటలో (శ్రీపాదములందు కైంకర్యమును చేయుటలో) కుతూహలమును కలవారైయున్నారో, ఏ మణవాళ మహామునుల వాత్సల్యము, కృప మొదలగు సద్గుణముల సాగరములో మగ్నమైన మనస్సును కలవారైయున్నారో, ఏ మణవాళమహామునుల కృపాకటాక్షమును తప్ప వేఱొక దానిని మోక్షమునకు శ్రేష్ఠకారణముగా భావింపరో, అంతులేని మహిమను కల ఆ శ్రీ మణవాళ మహామునులు మనకు అన్ని శుభములను మిక్కిలిగా అనుగ్రహింతురుగాక !

గత శ్లోకంలో కోయిలణ్ణన్ మొదలైన సచ్ఛిష్యవర్గప్రస్తావం రాగానే, వారి వైభవాన్ని విస్తారంగా వర్ణించడంకూడా శ్రీవరవరమునుల వైభవకీర్తనంలోకే చేరుతుంది కనుక, ఆ తత్త్వాన్ని తెలుపుతూ ప్రతివాదిభయంకరం అణ్ణన్ ఈ శ్లోకాన్ని అనుగ్రహిస్తున్నారు. శ్రీవరవరమునుల శిష్యులు. **"స్థితో౾ రవిందే మకరందనిర్భరే మధువ్రతో నేక్షురకం హి**

వీక్షతే” (మకరందం నిండుగా ఉండే తామరపూవు ఉండగా తుమ్మెద దానిని విడచిపెట్టి అరసం అయిన కాకిచెఱకు పూవును చూడదుకదా) అనే రీతిలో శ్రీవరవరమునుల దివ్యసూక్తిరసానుభవం తప్ప వేఱు దేనినీ తెలియనివారు, భగవద్రామానుజశ్రీచరణ కైంకర్యాన్ని తప్ప ఇంకొక విషయాన్ని తెలియని వడుగనంబివలె, శ్రీవరవరమునుల శ్రీచరణకైంకర్యాన్ని తప్ప ఇంకొకటిని తెలియనివారు, వీరు. భగవద్గుణాలలో అత్యంతాభినివేశాన్ని పొందడం కాకుండా, శ్రీవరవరమునుల కల్యాణగుణవారిధిలో మగ్న మనస్కులవుతారు, వీరు. మామునుల కటాక్షప్రసరణం పడినంత మాత్రంలోనే ప్రాప్యసిద్ధి కల్గినట్లు విశ్వసించేవారు, వీరు. ఇటువంటి సచ్ఛిష్యసమృద్ధిని కల మణవాళ మహామునులే మనకు శరణం. వారే మన శుభాలను అభివృద్ధిచేస్తారని అంటున్నారు.

7. యద్వాణీ శఠవైరిసూక్తితరుణీమాంగల్యదీపావలిః
యద్వీక్షా స్వశరవ్యసర్వజనతాసర్వార్థచింతామణిః ।
యన్మూర్తి ర్భజదార్తిభంజనచణాం సూక్తిం వివక్త్యంజసా
భూయా న్న స్సతతం స మే హృది గురుః కాంతోపయంతా మునిః॥

యద్వాణీ = ఏ మణవాళ మహామునుల శ్రీసూక్తి, శఠరిపుసూక్తితరుణీ = శఠకోపుల శ్రీసూక్తి అనే తరుణియొక్క, మాంగల్యదీపావలిః = మాంగల్యాన్ని ప్రకాశింపజేసే దీపమాలిక, యద్వీక్షా = ఏమణవాళమహామునుల కటాక్షం, స్వశరవ్యసర్వజనతా = తనకు లక్ష్యభూతులైన జనులందరియొక్క, సర్వార్థ = సమస్తవిషయాలను ప్రదానం చేయడంలో, చింతామణిః = చింతామణివంటిదో, యన్మూర్తిః= ఏమణవాళమహామునుల తిరుమేని, భజదార్తిభంజనచణాం = భక్తుల ఆర్తిని పోగొట్టడంలో సమర్థం అయిన, సూక్తిం = సూక్తియొక్క ఆవిర్భావాన్ని, అంజసా = వేగంగా, వివక్తి = వ్యక్తం చేస్తున్నదో, మే గురుః = నాకు ఆచార్యులైన, సః కాంతోపయంతా మునిః =ఆ మణవాళమహామునులు, మే హృది = నా హృదయంలో, సతతం = ఎల్లప్పుడు, భూయాత్ = ఉండాలి (ప్రకాశించాలి)

ఏ మణవాళమహామునుల శ్రీసూక్తి, శ్రీశఠకోపుల శ్రీసూక్తి అను తరుణియొక్క సౌభాగ్యమునకు ప్రకాశకమై, మంగళావహమైన (మంగళకరమైన) దీపపంక్తిగా వెలుగుచున్నదో, ఏ శ్రీమణవాళ మహామునుల కటాక్షము తనకు లక్ష్యమైన సర్వజనుల సర్వమనోరథార్థసిద్ధికిని చింతామణిగా ప్రకాశించుచున్నదో, ఏ శ్రీమణవాళమహామునుల దివ్యమంగళవిగ్రహము తనను ఆశ్రయించిన సర్వజనుల సమస్తదుఃఖములను పోగొట్టుటకు సమర్థమైన శ్రీసూక్తిని యథార్థముగానే నోరు తెఱచి పల్కుచున్నదో, (మణవాళమహామునులు తమ మృదుమధురమైన శ్రీసూక్తులతో తనను ఆశ్రయించినవారి దుఃఖములను అప్పటికప్పుడు పోగొట్టుచున్నారో) అట్టి ప్రభావమును కల, మనకు ఆచార్యులగు మహామునులు ఎల్లప్పుడు దాసుని చిత్తములో కృపతో వేంచేసి యుండ వలెను.

మణవాళమహామునుల శ్రీసూక్తి వైభవం వారి కటాక్షవీక్షణ మహిమ, తిరుమేని ప్రకాశాతిశయం- అనే ఈ మూడింటిని విలక్షణమైన రీతిలో కీర్తిస్తున్నారు, అణ్ణన్ ఈ శ్లోకంలో. తిరువాయ్‌మొழிకి వ్యాఖ్యానాలు అనేకం అవతరించినా, మణవాళ మహామునుల రహస్యవ్యాఖ్యానదివ్యసూక్తులు అవతరించి ఉండకపోతే ఆ తిరువాయ్‌మొழி వ్యాఖ్యానాలన్నీ నిష్ఫలాలు అయి ఉండేవి - అనే విషయాన్ని మొదటి పాదం పునరుద్ఘాటిస్తున్నది. మణవాళమహామునుల కటాక్షానికి లక్ష్యం కాగానే వారు సర్వార్థతత్త్వవేత్తలు కాగలరు - అనే విషయం రెండవ పాదంలో ఉద్ఘోషింపబడింది. వారి దివ్యమంగళవిగ్రహాన్ని సేవించగానే **"రూపమేవాస్యైతన్మహిమానం వ్యాచష్టే"** (ఇతని రూపమే ఇతని ఈ మహిమను వ్యక్తం చేస్తున్నది) అని వేదం పల్కిన రీతిలో మనస్సులో అపరిమితాలైన అర్థవిశేషాలు స్ఫురిస్తాయి- అనే విషయం, అవి భక్తుల ఆర్తిని భంజిస్తాయనే విషయం మూడవ పాదంలో చాటింపబడింది. ఇటువంటి అనితరసాధ్యమైన మహిమను కల ఆచార్యసార్వభౌములు తమ మనస్సులో నిలిచి ప్రకాశించాలని అంటూ శ్లోకాన్ని అణ్ణన్ ముగించారు.

8. అవాగ్భూషాజుష్టై రభువనగురుప్రేమభరితైః
అమూలర్‌క్షోద్భూతై రవరదగురూపాసితపదైః ।
కృతం తై స్తై స్సర్వైః గురుభి రమహాయోగిభి రితి
వ్యవస్యంత స్సంతో హృది మమ లసంతు ప్రతికలమ్ ॥

అవాగ్భూషాజుష్టైః = శ్రీవచనభూషణగ్రంథంలో అన్వయం లేనివారు, అభువనగురు ప్రేమభరితైః = శ్రీపిళ్ళైలోకాచార్యులవారిపట్ల భక్తి లేనివారు, అమూలర్‌క్ష+ఉద్భూతైః = మూల అనే నక్షత్రంలో అవతరించనివారు, అవరదగురూపాసిత పదైః = కోయిలణ్ణన్‌చేత సేవ చేయబడనివారు, అమహాయోగిభిః = పెరియజీయర్ అనే తిరునామాన్ని పొందనివారు అయిన, తైః తైః సర్వైః గురుభిః = ఆయా ఆచార్యులందఱిచేత, కృతమ్ ఇతి వ్యవస్యంతః= ప్రయోజనం లేదని నిశ్చయించుకొన్న, సంతః = సత్పురుషులు, మమ హృది = నా హృదయంలో, ప్రతికలం లసంతు = ప్రతిక్షణం భాసించాలి.

పూర్వశ్లోకములో శ్రీమణవాళమహామునులు నా మనస్సులో ఎల్లప్పుడు ప్రకాశింప వలెనని ప్రార్థింపబడినది. ఇందు ఆ వరవరముని భృత్యులు నా మనస్సులో ప్రతిక్షణము ప్రకాశింపవలెనని వేడబడుచున్నది.

శ్రీవచనభూషణమును ప్రీతితో సేవింపనివారై, శ్రీపిళ్ళైలోకాచార్యులవారిపట్ల పూర్ణ భక్తిని లేనివారై, మూలానక్షత్రమున అవతరింపనివారై, వరదనారాయణగురువుచే ఉపాసింపబడని శ్రీపాదములను కల్గినవారై, అవరయోగులైయున్న ఇతర ఆచార్యులతో సంబంధమును కలవారము కాము. అట్టివారిని ఉండ నిందు. శ్రీ మణవాళమహామునులే

తమకు రక్షకులని నమ్మిన శ్రీ మణవాళమహామునుల శిష్యులగు సత్పురుషులు నా మనస్సులో ఎల్లప్పుడు వెలుగుదురుగాక ! – అనుచు శ్రీవరవరముని వారు కానివారు భృత్యులపట్ల తమకు గల ప్రావణ్యమును ఇందులో అణ్ణన్ తెలిపిరి.

మహాయోగి– పెరియజీయర్, వారు కానివారు ఆ మహాయోగులు. **మహాయోగీ**–గొప్పయోగి, **అమహాయోగీ**–గొప్ప యోగి కానివారు– అనెడి శ్లేష ఇచట గమనింపతగినది.

విలక్షణమైన భక్తివిశేషాన్ని ప్రకాశింపజేసే శ్లోకరత్నం ఇది. తిరుమజ్గైయాళ్వార్లు **"కడన్మల్లై త్తలైశయనత్తుఱైవారై ఎణ్ణాతే యిరుప్పారై ఇఱైప్పొళుతు మెణ్ణోమే"** (కడల్మల్లైత్తలైశయనమ్– అనే దివ్యక్షేత్రంలో వేంచేసి ఉండే స్వామిని స్మరించనివారిని క్షణకాలం కూడా మేము స్మరించము) అని, **"కణ్ణాళన్ కణ్ణమజ్గైనకరాళన్ కళల్ శూడి అవనై యుళ్ళత్తు ఎణ్ణాత మానిడత్తై యెణ్ణాత పోదెల్లామ్ ఇనియవాతే"** (తిరుకణ్ణమంగై అనే దివ్యక్షేత్రాన్ని పాలించే స్వామి శ్రీచరణాలను తలపై భూషణంగా అలంకరించుకొని, ఆ స్వామిని మనస్సులో భావించని మానవులను స్మరించనపుడంతా మధురంగా ఉంటుంది) అని, **"ఆన్ విడైయేళు అన్ఱదర్త్తుక్కు ఆళానారల్లాతార్ మానిడరవర్ అల్లరెన్ఱు ఎన్మనత్తే వైత్తేనే"** (సప్తవృషభాలను భంజించిన స్వామికి దాసులు కానివారు మానవులు కానేకారు– అని నా మనస్సులో నిశ్చయించుకొన్నాను.) అని అనుగ్రహించిన రీతిలో వ్యతిరేకోక్తిలో అనుగ్రహించిన ఈ శ్లోకం భక్తిఘనిష్ఠతను చూపుతుంది. శ్రీవచనభూషణ దివ్యశాస్త్రంలో ప్రతిపత్తి లేని ఆచార్యులను ఆశ్రయించి ఏమి ఫలం? శ్రీపిళ్ళైలోకాచార్యులవారిపట్ల భక్తిలేని గురువులను ఆశ్రయించి ఏమి ఫలం? **"ఆణ్మూలమ్ అరశాళుమ్"** అనే గొప్ప తనాన్ని కల్గిన తిరుమూలనక్షత్రంలో అవతరించనివారిని ఆశ్రయించి ఏం ప్రయోజనం? కోయిలణ్ణన్ అనే మహాచార్యులు అభిజన విద్యావృత్తావలేపదూరులై, నమస్కరించి సేవించని ఆచార్యులను ఆశ్రయించి ఏం ప్రయోజనం? (కోయిలణ్ణన్ చే సేవింపబడని ఆచార్యులను ఆశ్రయించి ఏమి ఫలం ?) అని ఈ రీతిలో నిశ్చయించుకొని, ఇతరాచార్యులపట్ల విరక్తిని పొంది, మణవాళ మహామునులే శరణంగా నిశ్చయించుకొన్న పరమభాగ్యవంతులు నా హృదయంలోపల నిత్యవాసం చేయాలి– అని శ్లోకతాత్పర్యం.

'కృతమ్' అనే పదం **'అలమ్"** అనే అర్థంలో ప్రయోగింపబడ్డ అవ్యయపదం.

9. **న ఖల్వవరయోగినాం భజనతః ఫలస్యోద్భవః**
తదన్యవిముఖా స్సదా వరమునిం భజధ్వం జనాః ! ।
తదంఘ్రిభజనం సకృత్కృత మశేషతో దుష్కృతం
నివారయతి భూయసీం శ్రియ మనుత్తమాం పుష్యతి ॥

అవరయోగినాం భజనతః = మణవాళమహామునులు కాని యోగులను భజించడం వల్ల, ఫలస్య ఉద్భవః = ప్రయోజనంయొక్క ఉత్పత్తి, న ఖలు = లేదు కదా (సంభవించదు కదా), జనాః= ఓజనులారా!, తదన్యవిముఖాః = వరవరమునులు కాకుండా ఇతరులను సేవించకుండా ఉండేవారై, వరమునిం సదా భజధ్వం = మణవాళ మహామునులను నిత్యం సేవించండి, తదంఘ్రిభజనం = ఆ మణవాళ మహామునుల శ్రీచరణసేవ, సకృత్ కృతం(యది) = ఒక పర్యాయం చేయబడినది. (అయితే), దుష్కృతమ్ అశేషతః నివారయతి= (ఆ సేవ) దుష్కర్మను పూర్తిగా నివారిస్తుంది, అనుత్తమాం భూయసీం శ్రియం పుష్యతి = చాలా గొప్పదైన, అంతులేని సంపదను వృద్ధిచేస్తుంది.

జనులారా ! అధములగు యోగులు సేవించుటవలన ఫలము కలుగదు. అందుచే వారిని విడచి, వరయోగియగు శ్రీ మణవాళమహామునులనే ఎల్లప్పుడు సేవింపుడు. అవరయోగులను మాటిమాటికి సేవించినను ఆశించిన ఫలము లభింపదు. వరయోగియగు పెరియజీయర్ శ్రీపాదములను ఒకసారి సేవించినను, అదియే సమస్తపాపములను పోగొట్టి, మిక్కిలి గొప్ప సంపదను నిరంతరము అభివృద్ధియగునట్లు చేయును – అని లోకులనుగూర్చి అణ్ణన్ ఇందు ఉపదేశించిరి.

"సా హి శ్రీ రమృతా సతామ్" (అదే కదా సత్పురుషులకు నశింపని సంపద) అనెడి సంపదయే ఉత్తమసంపద. సకృత్‌సేవనమే అనిష్టనివృత్తికి, ఇష్టప్రాప్తికిని చాలును. అయినను, స్వయంభోగ్యముగానే వరవరయోగిని ఎల్లప్పుదును సేవింపుడు – అని భావము.

"అవరయోగినామ్" అనే పదానికి రెండర్థాలు. **'వరయోగినో న భవంతీతి అవరయోగినః–** శ్రీమణవాళమహామునులు కానివారు– అని ఒక అర్థం. ఇంకొక అర్థం ఏమంటే – **'అవర'** శబ్దం నీచార్థకం. గీతలోని నాల్గవ అధ్యాయంలో **"అవరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః"** అనే ప్రయోగాన్ని ఉదాహరణగా గమనించవచ్చు. ఔన్నత్యం లేని– ఉన్నతులు కాని యోగులను భజిస్తే ఏ ప్రయోజనమూ లేదు– అనే అర్థం కూడా స్ఫురిస్తుంది. మణవాళమహామునులను సేవిస్తే పొందే ఫలాన్నిగూర్చి ఉత్తరార్ధం తెలుపుతున్నది. అనిష్టనివృత్తి పూర్వకమైన ఇష్టప్రాప్తి కల్గుతుందని చెప్పబడుతున్నది. **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"** (నేను అన్ని పాపాలనుండి నిన్ను విడిపిస్తాను, శోకించకు) అని పల్కిన గీతాచార్యుని సూక్తి ప్రతిజ్ఞామాత్రం. ఇక్కడ ఆవిధంగా కాకుండా, ఫలసిద్ధి ప్రత్యక్షసిద్ధం.

(అనుత్తమామ్) – "న విద్యతే ఉత్తమా యస్యాః సా, తామ్" అనే వ్యుత్పత్తిని ఇక్కడ చెప్పాలి. **(భూయసీమ్) అత్యంతం బహ్వీ –భూయసీ.** ప్రకృతంలో శ్రీశబ్దంచేత వివక్షితం. ఏమంటే, **"సా హి శ్రీ రమృతా సతామ్"** (అదే గదా సత్పురుషులకు శాశ్వతమైన సంపద) అని చెప్పబడే మోక్షలక్ష్మియే. ఐహికాముష్మికాలైన సకలైశ్వర్యాలు ఈ పదంచేత

చెప్పబడినా, **"జనే త్వాంస్తాన్ కామాన్ విదధపి సాయుజ్యహృదయమ్"** (వేదం జనులకు ఆయా కోరికలను ఇచ్చినా, ముక్తిని ప్రసాదించడంలోనే హృదయాన్ని కల్గినది) అని అన్నట్లుగా ఆముష్మికైశ్వర్యమే ఇక్కడ ముఖ్యంగా వివక్షితం.

10. సురాహారాసారీకరణచణయత్సూక్తిలహరీ-
గరీయస్త్వాం స్తోతుం ప్రభవతి న వాచస్పతి రపి ।
స న స్తన్యాదన్యాదృశమహిమశాలీ వరవరో
మునీంద్రో నిస్తంద్రః కుశల మనువేలం గురువరః ॥

సుర+అహార+అసారీకరణ చణ = దేవతల ఆహారం అయిన అమృతాన్ని అసారంగా- విలువ లేనిదిగా చేయగల్గిన, యత్సూక్తిలహరీగరీయస్త్వాం = ఏ మణవాళ మహామునుల శ్రీసూక్తి ప్రవాహంయొక్క గాంభీర్యాన్ని, స్తోతుం = స్తుతించడానికి, వాచస్పతిః అపి = బృహస్పతికూడా, న ప్రభవతి = సమర్థుడు కావడం లేదో, సః = అన్యాదృశ మహిమశాలీ గురువరః = అటువంటి సాటి లేని మహిమను కల గొప్ప ఆచార్యులైన, వరవరః మునీంద్రః = మణవాళమహామునులు, నిస్తంద్రః = ఆలస్యమును చేయనివారై, అనువేలమ్= ప్రతిక్షణం, నః = మనకు, కుశలం తన్యాత్ = మంచిని అనుగ్రహించాలి.

మాధుర్యాది గుణయోగముచే దేవతల ఆహారమగు అమృతమును అసారముగా చేయగల ఏమణవాళ మహామునుల శ్రీసూక్తిప్రవాహముయొక్క గొప్ప మహిమను దేవగురువగు బృహస్పతికూడ స్తుతింప సమర్థుడు కాడో, లోకవిలక్షణమైన మహిమతో కూడిన, ఆచార్యశ్రేష్ఠులగు ఆ శ్రీమణవాళమహామునులు ఆలస్యమును చేయనివారై మనకు ప్రతిక్షణము అధికాధికముగా క్షేమమును కల్గింతురుగాక !

("నిస్తంద్రః") - 'తంద్రా" - అనగా - ఆలస్యము. సోమరితనము అని అర్థము. ఆలసింపక కర్తవ్యమగు ధర్మమును చేయువారు - అని ప్రకృత భావము. జ్ఞానమున్నను, అనుష్ఠానము లేకున్నచో ప్రయోజనము లేదు కదా! **"ఞాన మనుట్టాన మివై నన్గాకవే యుడైయనాన కురువై యడైన్దక్కాల్, మానిలత్తీర్ ! తేనార్ కమల త్తిరుమామగళ్ కొழునన్ తానే వైకున్దమ్ తరుమ్"** (జ్ఞానం, అనుష్ఠానం- అనే ఈ రెండిటిని చక్కగా కల గురువును పొందితే, లోకులారా! తేనె నిండుగా ఉండే కమలంలో నివసించే లక్ష్మీదేవికి నాథుడైన స్వామి తానే స్వయంగా వైకుంఠాన్ని అనుగ్రహిస్తాడు.) అనుచు శ్రీవరవరమునులు ఉపదేశరత్తినమాలైలో నుడివిరికదా! అట్టి జ్ఞానానుష్ఠానసంపన్నులగు ఆచార్యులు శ్రీమణవాళ మహామునులే. వారి శ్రీచరణ సంబంధము లభించినచో మనకు పరమ పదము లభించుట తథ్యము - అను అర్థ మిచట ఏర్పడుచున్నది. ఈ సందర్భమున - **"మన్నుయిర్కాళ్! ఇజ్గే మణవాళమామునివన్ పొన్నడియామ్ శెజ్గమలప్పోదుకళై ఉన్ని చ్చిరత్తాలే తీణ్డిల్ అమానవనుమ్ నమ్మై కరత్తాలే తీణ్డల్ కడన్"** (ఓ చేతనులారా! ఈ

లోకంలో శ్రీవరవరమునుల అందమైన ఎఱ్ఱని శ్రీచరణ పద్మాలను ధ్యానించి, మన శిరస్సులపై ధరిస్తే, అమానవపురుషుడు మనలను తన కరంతో స్పృశించడం అతని బాధ్యత కాగలదు. మనలను పరమపదాన్ని చేర్చడం అతని బాధ్యత.) అను పాశురము అనుసంధేయము.

ఈ శ్లోకం పూర్వార్ధంలో అనుగ్రహించిన అర్థంలో అతిశయోక్తి లేశంకూడా లేదనే విషయాన్ని అనుభవరసికులు మాత్రమే తెలియగలరు. ఆచార్యులు తాము అనుభవించిన రీతిని అన్యూనానతిరిక్తంగా పల్కిన తీరు ఇది. సురాహారశబ్దం దేవభోగ్యం అయిన అమృతాన్ని తెల్పుతున్నది. ఆ అమృతాన్ని సైతం అసారమని, త్రోసిరాజు అనేటట్లు చేస్తుంది- మణవాళమహామునుల శ్రీసూక్తిగంగాప్రవాహం. దాని గొప్పతనాన్నిగూర్చి చెప్పవలసివస్తే - వాచస్పతి అనే పేరును కల్గిన బృహస్పతికూడా అందుకు సమర్థుడు కాడు. ఇక ఈ లోకంలోనివారినిగూర్చి ఏం చెప్పాలి? ఒక వేళ చెప్పినట్లయితే, **"మహాగజాః పలాయంతే మశకానాం తు కా గతిః ?"** (గొప్ప ఏనుగులే పరుగు తీస్తే ఇక దోమల గతి ఏమి ?) అని చెప్పవచ్చు. అంతే.

(గరీయస్తామ్) - "అత్యంతం గుర్వీ గరీయసీ, తస్యాః భావః గరీయస్తా, తామ్" - అని ఈ పదవిగ్రహవాక్యం. అన్వయాలంకారానికే లక్ష్యం అని పల్కి ఊరుకోవాలి- అనిభావం.

(అన్యాదృశమహిమశాలీ) - అన్యాదృశమ్ అత్యద్భుతమ్, అతివిలక్షణమ్- అనే ఇవి అన్నీ వాచామగోచరం అనే అర్థాన్ని ఇచ్చే పర్యాయపదాలు.

(నిస్తంద్రః) - శ్రీసుదర్శనశతకంలో ఫలశ్రుతి లేని శ్లోకమే లేదు. ప్రతిశ్లోకం లోను ఒక్కొక్క విధంగా ఫలం తెలుపబడింది. అందులోని 95వ శ్లోకం చివర **"స దనువిజయీ హంతు తంద్రాలుతాం నః"** అని ఉన్నది. మీ నిద్రపోతుతనాన్ని పోగొట్టాలి- అని ఆశాసించడం దీని భావం. వస్తుస్థితిలో నిద్రపోతుతనాన్ని జయించడం అనేది ఒక దేవతానుగ్రహంవల్లనే సిద్ధిస్తుందనే విషయం దీనివల్ల తెలుపబడింది. ఎవరైనా ఉపదేశంలో సమర్థులుగా ఉండవచ్చు. తాము అనుష్ఠించేటపుడు సోమరిపోతుతనమే అడ్డం వస్తుంది. శ్రీవరవరమునుల విషయంలో, ఉపదేశంవంటిదే అనుష్ఠానం, అనుష్ఠానంవంటిదే ఉపదేశం- అని స్పష్టంగా ప్రకాశిస్తాయని భావం. **అనువేలమ్-** అనుక్షణం -అని అర్థం.

11. **కలానిధిశిరోమణి ర్జితమనోభవో యద్వచ**
స్సుధాశనతరంగిణీ దధదనారతం మూర్ధని ।
శివో౽పి యదుపాశ్రితో విషమదృష్టితాదూరగః
స మే దిశతు మంగళం వరవరో మునీనాం వరః ॥

యత్ ఉపాశ్రితః = ఏ మణవాళమహామునులను ఆశ్రయించిన శిష్యవర్గం, కలానిధిశిరోమణిః = విద్వాంసులలో శిరోమణి (చంద్రుని శిరోభూషణంగా కల్గినది), జితమనోభవః = కామవేదనకు వశం కానిది (మన్మథుని జయించినది), వచస్సుధాశన తరంగిణీ = శ్రీసూక్తులు అనే దేవగంగను, అనారతం మూర్ధని దధత్ = సదా శిరస్సుపై ధరించేది, శివః+అపి = శివుడైనా, మంగళకరుడైనా, విషమదృష్టితాదూరగః = విషమదృష్టికి వైదేశికమై ఉన్నదో, సః = ఆ, మునీనాం వరః వరవరః = శ్రీవరవరమునులు, మే = నాకు, మంగళం దిశతు = మంగళమును ప్రసాదించాలి.

ఈ శ్లోకమునుండి అణ్ణన్ బహుముఖముగా శ్రీమణవాళ మహామునుల వైభవమును వర్ణించుచున్నారు.

ఇందు ఏ మణవాళమహామునులను ఆశ్రయించినవాడు శివుడైనను, విషమదృష్టి లేకుండుటచే శివునికంటెను గొప్పవాడై యున్నాడో, మునులలో శ్రేష్ఠులగు ఆ మణవాళ మహామునులు దాసుడనగు నాకు మంగళములను అనుగ్రహించునుగాక ! అనుచున్నారు.

మణవాళమహామునులను ఆశ్రయించినవాడు శివుడు ఎట్లగుచున్నాడు ? అనినచో శివుడు కలానిధియగు చంద్రుని శిరోభూషణముగా కల్గియున్నాడు. మామునులను ఆశ్రయించిన వాడును కళలకు నిధియైయున్న విద్వాంసులకు శిరోమణిగా – అనగా– విద్వచ్ఛిరోమణిగా వెలుగుచున్నాడు. శివుడు జితమనోభవుడు. అనగా – మన్మథుని జయించినవాడు. వరవరమునులను ఆశ్రయించినవాడు కూడ కామమును జయించినవాడే. శివుడు ఆకాశగంగను శిరస్సుపై దాల్చును. **"సుధాశనతరంగిణీ"**– అనగా – ఆకాశగంగ. **"సుధాశను"**లనగా– అమృతమును భుజించు దేవతలు. తరంగిణీ అనగా– నది. శ్రీవరవరమునులను ఆశ్రయించినవాడుకూడ వారి శ్రీసూక్తి అనెడి అమృతప్రవాహమును తన శిరస్సున దాల్చును. శ్రీవరవరమునుల అమృతమయమైన శ్రీసూక్తులను శిరసా వహించి, స్వీకరించునని భావము.

ఈ రీతిలో మణవాళమహామునులను ఆశ్రయించినవాడు శివునితో సామ్యమును కల్గియుండుటచే శివుడయినను, అతడు విషమదృష్టిని లేనివాడని తెలుపబడుచున్నది. కావున ఇచట అర్థమున విరోధము భాసించుచున్నది. శివుడు ముక్కంటి అగుటచే విషమ దృష్టిని కలవాడు. శ్రీవరవరమునులను ఆశ్రయించినవాడును శివుడే. అనగా – మంగళ స్వరూపుడే. పరిశుద్ధుడే. అయినను అతడు విషమదృష్టిని– అనగా, పక్షపాతదృష్టిని లేనివాడు. అందఱిని సమానముగా చూచువాడు. సమదృష్టి – అని ఈ విధముగా ఇచటి అర్థవిరోధమునకు పరిహారము చెప్పనగును.

శ్లేషాలంకారము, విరోధాభాసాలంకారమును ఈ శ్లోకమున కలవు. ఈ రీతిలోనే ముందు శ్లోకములందును గమనింపనగును. శ్రీవరవరమునులను ఆశ్రయించినవారు

గొప్ప విద్వాంసులై, కామక్రోధాదులను జయించినవారై, పరిశుద్ధులై, సద్గుణశీలురై, పక్షపాతదృష్టిని లేనివారై, వెలుగుదురు. ఇట్టి సచ్ఛిష్యవర్గముచే సేవింపబడువారై ప్రకాశించుచున్న శ్రీవరవరమునులు నాకు శుభమును కలుగజేయుగాక! అని శ్లోకతాత్పర్యము.

ఇందులో మణవాళమహామునుల శిష్యవర్గానికి కొన్ని రీతులలో శివసాధర్మ్యాన్ని, మఱికొన్ని రీతులలో శివవైధర్మ్యాన్ని ఆలంకారికసహృదయహారిగా అణ్ణన్ అనుగ్రహిస్తున్నారు.

(కలానిధిశిరోమణిః) – "కలానిధిః శిరోమణిః యస్య సః" అనే బహువ్రీహి సమాసంవల్ల ఈ పదం చంద్రశేఖరుడైన శివుని నిర్దేశిస్తుంది. వరవరమునుల శిష్యవర్గం, కలానిధి శిరోమణి. **"కలానిధీనాం (విద్యానిధీనాం) శిరోమణిః"** అనే షష్ఠీతత్పురుష సమాసంవల్ల విద్వాంసులలో గొప్పది– అని అర్థం. ఈ విధంగా కలానిధిశిరోమణిత్వంవల్ల వరవరమునుల శిష్యవర్గానికి శివసాధర్మ్యం ఇక్కడ సిద్ధించింది.

(జితమనోభవః) –శివుడు మన్మథుని జయించాడు– అనే విషయం పురాణ ప్రసిద్ధం. శ్రీవరవరమునుల శిష్యవర్గం **'నిర్జితక్రోధలోభైః"** అన్నట్లుగానే క్రోధానికి, లోభానికి మూలమైన కామాన్ని జయించినవారు. **"కామాదిదోషహర మాత్మపదాశ్రితానామ్",** (తన పాదాలను ఆశ్రయించినవారి కామాదిదోషాలను పోగొట్టేవారు) **"మదనకదనైః న క్లిశ్యంతే యతీశ్వరసంశ్రయాః"** (యతీశ్వరులను ఆశ్రయించినవారు మదనునిచే బాధింపబడరు.) ఇత్యాది పూర్వాచార్యసూక్తుల అర్థాలు ఇక్కడ భావ్యాలు.

(వచస్సుధాశనతరంగిణీ మనారతం మూర్ధని దధత్) – "సుధాశనానాం దేవానాం, తరంగిణీ నదీ" – అంటే –దేవగంగ. దానిని తన జటాజూటంలో శివుడు ధరిస్తాడు. ఇక, శ్రీవరవరమునుల శిష్యవర్గం ఆ వరవరమునులు అనుగ్రహించే శ్రీసూక్తి ప్రవాహం అనే గంగను **"అతివై యెన్నుమ్ ముదలాఉు తలైప్పర్రీ వాయ్క్కొణ్డతే"** అనే రీతిలో గ్రహించగల్గినది. ఇంతవరకు శ్రీవరవరమునుల శిష్యవర్గానికి శివసాధర్మ్యం తెలుపబడింది. ఇక వైధర్మ్యం తెలుపబడుతున్నది.

(శివోఽపి విషమదృష్టితాదూరగః) – శివుడు ముక్కంటి కనుక విషమదృష్టిని కల వాడు. సమం కానిది విషమం. ఎగుడు దిగుడు కన్నులను కలవాడని తాత్పర్యం. శ్రీవరవర మునుల శిష్యవర్గం విషమదృష్టిని లేనిది. వ్యధికరణజ్ఞానం లేనిదై, సమానాధికరణ జ్ఞానాన్ని కల్గినది. **"దృష్టి"** అనే పదం శివుని పక్షంలో నేత్రాన్ని, శ్రీవరవరముని శిష్యుల పక్షంలో జ్ఞానాన్ని తెల్పుతుంది. **"శివ"** అనే పదం శివుని పక్షంలో నామవాచకం. ప్రకృతంలో మంగళాలకు ఆకరుడని భావం. ఇటువంటి శిష్యసమృద్ధిని కల శ్రీవరవరమునులు నాకు మంచిని అనుగ్రహించాలని శ్లోకతాత్పర్యం.

12. **కల్యాణాచలధర్మభాగసమగు ర్యత్సంశ్రితో భూతిమాన్**
బిభ్రచ్ఛుభ్రకలానిధేః కిల కలాం మూర్ధ్నా భృశం నిర్మలామ్ ।
క్లుప్తాహీనవిభూషణః స్మరజిత స్సాయుజ్య మాటీకతే
సోఽవ్యా న్న స్సతతం ముని ర్వరవరోఽనన్యార్హతేజోనిధిః ॥

యత్ సంశ్రితః = ఏ వరవరమునులను ఆశ్రయించిన శిష్యుడు, కల్యాణాచల ధర్మభాక్ = సత్యాదులలో ఏమాత్రం చలించని నిష్ఠను కల్గినవాడై (మేరుపర్వతంతో సాటి వచ్చే కాంతిని కల్గినవాడై), అసమగుః = సాటి లేని నందిని వాహనంగా కల్గినవాడై, (సాటి లేని సూక్తులను కల్గినవాడై), భూతిమాన్ = సంపదను కల్గినవాడై (భస్మాన్ని కల్గినవాడై), క్లుప్త + అహీనవిభూషణః = గొప్పవైన శమదమాది ఆత్మా లంకారాలను కల్గినవాడై (నాగభూషణభూషితుడై), శుభ్రకలానిధేః అవికలాం కలాం మూర్ధ్నా బిభ్రత్ = నిర్దుష్టమైన కళలకు నిధిగా ఉండే వరవరమునుల సూక్తిని శిరసావహించేవాడై (కలానిధి అయిన చంద్రుని యొక్క విమలమైన కళను తలతో ధరించేవాడై), గిరీశః = (వాక్కులలో సామర్థ్యాన్ని కల్గినవాడై) (కైలాసపతియై), స్మరజితః సాయుజ్యం = శివునితో సామ్యాన్ని, ఆటీకతే = కల్గి ఉన్నాడో, అనన్యార్హతేజోనిధిః = తమకే స్వంతం అయిన తేజస్సుకు నిధి అయిన, సః = ఆ, వరవర మునిః= వరవరమునులు, నః = మనలను, సతతం అవ్యాత్= ఎల్లప్పుడు రక్షించుగాక !

ఏ మణవాళమహామునులను ఆశ్రయించినవాడు శివసాయుజ్యమును కలవాడై యున్నాడో, ఇతరదుర్లభమగు విలక్షణతేజోనిధియైన మణవాళమహామునులు మనలను ఎల్లప్పుడు రక్షించునుగాక ! అనుచున్నారు.

శివుడు **"భూతిమాన్"** – అనగా –విభూతిని (భస్మమును) ఒంటికి పూసికొంటాడు. వరవరమునులను ఆశ్రయించిన భక్తుడును. **"భూతిమాన్"** అనగా – ఐశ్వర్యమును కలవాడు. అనగా– శ్రీవైష్ణవ కైంకర్యసంపదను కలవాడు. శివుడు, కలానిధియగు చంద్రుని కళలలో నిర్మలమగు ఒక కళను శిరస్సుపై ధరించును. ఇతడును సకలకళలకును నిధియగు మామునుల నిర్మలమైన, విశదజ్ఞానరూపమైన కళను తలపై ధరించును. తలను వంచి, నిర్మలజ్ఞాన ప్రకాశమును పొందునని భావము. శివుడు క్లుప్తాహీనవిభూషణుడు. **"అహిః"** అనగా సర్పము. **ఇనః** – శ్రేష్ఠుడు. గొప్ప నాగమును భూషణముగా కల్గియున్నాడు. వరవరమునుల దాసుడును **'అహీనః'–** అనగా కొఱత లేని భూషణములను దాల్చి యుండును. శమదమాదులగు ఆత్మగుణములను కొఱత లేని భూషణములుగా కల్గియుండును. ఇట్లు ఈ విశేషణశబ్దములను శ్లేషాలంకారప్రక్రియలో శివునకు, మామునుల భక్తునకును సమన్వయింపనగును. **"స్మరజిత్"** – మన్మథుని జయించినవాడు. అగు శివుడు. అతనియొక్క సాయుజ్యమును, అనగా – గొప్పతనమును కల్గినవాడగు చున్నాడు.

"కల్యాణాచలధర్మభాక్ అసమగుః" – ఈ విశేషణములను శ్లేషరీతిలో ఇరువురకును సమన్వయింపనగును. అది ఎట్లనగా – మామునుల భక్తుడు మంచిని కల్గించు, స్థిరమైన శ్రీవైష్ణవధర్మమును ఆశ్రయించియున్నాడు. మఱియు, **"అసమగుః"** – గోశబ్దము వాక్కుకు కూడ వాచకము. కనుక నిస్సమాభ్యధికమైన శ్రీసూక్తిమహిమను కలవాడు –అని భావము. ఈ విశేషణమునకు వేఱు రీతిలోకూడ అర్థమును చెప్పవచ్చును. **"కళ్యాణాచలధర్మభాక్"**– వివేక, విమోక, అభ్యాస, క్రియా, కల్యాణ, అనవసాద, అనుద్ధర్షములనెడి ఉపాసనోపయోగు లగు ధర్మములలో కల్యాణశబ్దవాచ్యమగు సత్యము, ఆర్జవము, దయ, దానము, అహింస, అనభిధ్యా (నిష్ఫలమగు ఆలోచన లేకుండుట) అనెడి ధర్మగుణములలో స్థిరమైన నిష్ఠను కలవాడు – మణవాళమహామునుల దాసుడు. **"అసమగుః"** –నిస్సమాభ్యధికమైన వాక్కును కలవాడు. శివుని పక్షమున– **"కల్యాణాచలధర్మభాక్"** –కల్యాణశబ్దము స్వర్ణమునకును వాచకము. బంగారుమయమైన మేరుపర్వతముయొక్క ధర్మమగు ఎఱ్ఱని వర్ణమును శివుడు కల్గి యుండును. **"పొన్ తికழు మేని పురిశడైయమ్ పుణ్ణియన్"** (బంగారంవలె మెఱిసే మేనిని, పేనిన జటలను కలవాడు, పవిత్రుడు) అని చెప్పబడుచున్నదికదా! **"అసమగుః"** – బలములో సాటిలేని నందిని వాహనముగా, కలవాడు శివుడు. గోశబ్దమును నేత్రేంద్రియ వాచకముగా గ్రహించినచో, **"అసమగుః"** –అగ్నిరూపమైన నేత్రమును కలవాడు– అని కూడ అర్థము. శివుడు ముక్కంటికదా! కావున బేసిసంఖ్యలో కన్నులను కలవాడు. ఇట్లు శివసామ్యమును శ్రీవరవరముని భృత్యవిషయమున చెప్పనగును.

"బిభ్రద్యస్య కలానిధే రవికలాం మూర్ధ్నా గిరీశః కలామ్" అను రెండవ పాదము కొన్ని కోశములలో కలదు. అపుడు **"గిరీశః"**– కైలాసపతియగు శివుడు అని అర్థము. ఇచట షష్ఠీతత్పురుషసమాసము. మామునుల విషయమున **"గిరి – ఈశః"** –వాక్కులో ప్రభువు సమర్థుడు. చక్కగా మాట్లాడగల్గినవాడని భావము. (**"గిర్"** శబ్దం సప్తమీ ఏక వచనంలో **'గిరి'** అని మాఱుతుంది)

ఈ శ్లోకంలో శ్రీమణవాళమహామునుల శిష్యవర్గానికి శివునితో సామ్యం శ్లేషాలంకార ప్రక్రియతో తెలుపబడుతున్నది. ఆఱు శ్లిష్టవిశేషణాలను ప్రయోగించడం ద్వారా ఈ సామ్యం నిర్వహించబడుతున్నది.

(కల్యాణాచలధర్మభాక్) – ఇక్కడ కల్యాణమనే శబ్దం బంగారుకు పర్యాయవాచకం. అందువల్ల కల్యాణాచలమంటే మేరుపర్వతమని భావం. దాని ధర్మం అంటే సాధర్మ్యం. ఆ సాధర్మ్యాన్ని కలవాడు శివుడు. **"పొన్ తికழుమేని పురిశడైయమ్ పుణ్ణియన్"** (బంగారంవలే మెరిసే శరీరాన్ని కలవాడు, పేనిన జటలను కలవాడు) అని పేయాழ్వార్ల సూక్తి, **"నిన్ కూఱు కొణ్డ తழల్ నిఱవణ్ణన్"** (నీలో భాగాన్ని పొందిన అగ్నివర్ణుడైన శివుడు) అని తిరుమజ్ఞై ఆழ్వార్ల సూక్తి. మేరుపర్వతంవర్ణంవంటి వర్ణాన్ని కలవాడు.

కనుక శివుడు **"కల్యాణాచల ధర్మభాక్"** అని అనబడ్డాడు. ఇక, ఈ విశేషణం శ్రీవరవరమునుల పక్షంలో ఏవిధంగా శ్లేషించింది? అంటే, భక్తిసాధనాలుగా చెప్పబడ్డ వివేక- విమోక -అభ్యాస-క్రియా-కల్యాణావసాదానుద్ధర్షాలనే ఏడింటిలో **"సత్యార్జవ-దయా-దాన- అహింసా అనభిద్యాః షట్ కల్యాణాని"** అనే రీతిలో **సత్యం, ఋజుత్వం, దయ, దానం, అహింసా, అనభిద్య-** అనే ఆఱు గుణాలు కల్యాణశబ్దవాచ్యాలు; కనుక, ఆ కల్యాణాన్ని, చలించని ధర్మనిష్ఠను కలవారని తాత్పర్యం. లేక, మంచిని కల్గించే స్థిరమైన శ్రీవైష్ణవ ధర్మాన్ని ఆశ్రయించినవాడని కూడా అర్థాన్ని చెప్పవచ్చు.

(అసమగుః) – శివుడు సాటి లేని వాహనం అయిన వృషభాన్ని కలవాడు. నానార్థకం అయిన గోశబ్దానికి కన్ను అని కూడా అర్థం ఉన్నది. కనుక విషమలోచనుడు- ఎగుడు దిగుడుగా ఉండే, లేక బేసిసంఖ్యలోని కన్నులను కలవాడనికూడా చెప్పవచ్చు. శ్రీవరవరమునుల శిష్యబృందపక్షంలో గోశబ్దానికి వాక్కు అని అర్థం కనుక **"అసమగుః"** అనే పదానికి శ్రీవరవరముని శిష్యబృందం సాటి లేని వాగ్వైభవాన్ని కల్గినదని భావం.

(భూతిమాన్) – భూతి అనే శబ్దానికి భస్మమని, సంపద అని అర్థాలున్నాయి. కనుక శివుని పక్షంలో భస్మధారి అని, మణవాళమహామునుల శిష్యవర్గం పక్షంలో ఐశ్వర్యశాలి అని, – శ్రీవైష్ణవ సంపదను కలవాడని తాత్పర్యం.

(శుభ్రకలానిధేః అవికలాం కలాం మూర్ధ్నా బిభ్రత్) – శివుడు చంద్రశేఖరుడు; కనుక కలానిధి అయిన చంద్రుని కళను తలతో ధరించేవాడని భావం. వరవరముని శిష్యవర్గం పక్షంలో- విశుద్ధకలావల్లభులైన వరవరమునుల నిరవద్యమైన శ్రీసూక్తిని శిరసా ధరించేవారని భావం. **"బిభ్రద్యస్య కలానిధే కిలకలాం మూర్ధ్నా భృశం నిర్మలామ్"** అనే పాఠాంతరం ఉన్నది.

(గిరీశః) – "గిరీశో గిరిశో మృడః" అనే అమరకోశవచనానుసారం కైలాసపతి కనుక శివుడు గిరీశుడని భావం. వరవరమునిశిష్యవర్గపక్షంలో **(గిరి+ఈశః)** అని విభజించాలి. సంస్కృతంలో రేఫాంతమైన గిర్‌శబ్దానికి వాక్కు- అని అర్థం. ఈ శబ్దం సప్తమీవిభక్తి ఏకవచనంలో **'గిరి'** అని మాఱుతుంది. అపుడు **"గిరి,ఈశః"** అనే పదాలకు వాక్కులలో సమర్థులని భావం.

(క్లుప్తాహీనవిభూషణః) – శివుడు నాగభూషణుడు కనుక క్లుప్తమైన, అహీన విభూషణాలను కలవాడు, **అహి** = సర్పం, **ఇన** = శ్రేష్ఠుడు- అని శివుని పక్షంలో అర్థం. వరవరమునిశిష్యుల పక్షంలో – **అహీన-** హీనం కాని- తక్కువ కాని, గొప్పవైన, **భూషణం** = శదమాది ఆత్మగుణాలను భూషణాలుగా కల్గినవారు – అని భావం. ఈ రీతులలో వరవరముని శిష్యబృందం –

(స్మరజితః సాయుజ్య మాటీకతే) – కాముని జయించిన శివునితో సామ్యాన్ని కల్గి ఉన్నది. ఇటువంటి శిష్యవర్గంతో కూడి ఉన్నవారు, తమకే చెందిన గొప్ప తేజస్సును కలవారు అయిన శ్రీమణవాళమహామునులు మనలను నిత్యం కాపాడాలి –అని శ్లోకతాత్పర్యం.

13. యద్భక్తో నాభిభూతః మదనమథనకృద్వాగ్విలాసైకభూమిః
నాళీకస్థోఽ కృతోక్తి వ్యవహృతిచతురాస్యత్వసంప్రాప్తభూమా ।
సంప్రాప్యానన్యలభ్యాం కమలభవతులా మేధతే సత్యధామా
సోఽ వ్యా న్నః క్షాంతిసింధు ర్నిరవధిమహిమా సౌమ్యజామాతృయోగీ॥

యద్భక్తః = ఏ వరవరమునుల శిష్యవర్గం, నాభిభూతః = న + అభిభూతః – ఎక్కడా అవమానాన్ని పొందనిది (నాభినుండి పుట్టినవాడు), మదనమథనకృత్ = కామాది దోషహారి (మన్మథుని సంహరించిన శివుని జన్మింపజేసినవాడు), వాగ్విలాస+ఏకభూమిః = వాక్కుల విలాసానికి సాటిలేని చోటు (సరస్వతీ విలాసానికి ముఖ్యమైన ఆస్పదం) నాళీకస్థః = అసత్యమైన వచనం లేనిది (తామరపూవులో ఉన్నవాడు), అకృత+ఉక్తి వ్యవహృతి చతురాస్యత్వసంప్రాప్తభూమా= వేదవ్యవహారచతురం అయిన నాల్గు ముఖాలను కల్గినది (అపౌరుషేయాలైన నాల్గు వేదాలను ఉచ్చరించడంకోసం నాల్గు ముఖాలను కల్గినవాడు), సత్యధామా (సన్) = సత్యమైన గొప్పతనాన్ని, తేజస్సును– కల్గినది, సత్యానికి నివాసభూమి (సత్య లోకాన్ని వాసస్థానంగా కల్గినవాడు), కనుక, అనన్యలభ్యాం = (ఈరీతులలో) ఇతరులకు లభ్యం కానిది అయిన, కమలభవతులాం=బ్రహ్మదేవునితో సామ్యాన్ని, సంప్రాప్య = పొంది, ఏధతే= ప్రకాశిస్తున్నదో, సః=ఆ, క్షాంతిసింధుః = సహనమనే గుణానికి సముద్రం వంటివారై, నిరవధిమహిమా= గొప్ప మహిమను కలవారైన, సౌమ్యజామాతృయోగీ=శ్రీవరవరమునులు, నః=మనలను, అవ్యాత్ = రక్షించుగాక!

"ముదలావార్ మూవరే" అని లోకంలో మొట్టమొదటివారుగా ప్రకాశించు ముగ్గురు దేవతలు. వారిలో ఒకరగు శివుని గొప్పతనమును కలవారై, అతనికంటెను విలక్షణులై వరవరమునుల భక్తులు వెల్గుచున్నారని గత రెండు శ్లోకములలో తెలిపిరి. ఇందు, శివుని సృజించిన చతుర్ముఖునితో సమానమైన మహిమను కలవారు వీరు– అనుచున్నారు. **"క్షాంతి"** ––క్షమ – అనగా సహనము. క్షమాసముద్రులై, అవధి లేని మహిమను కలవారగు శ్రీమణవాళమహామునులు మనలను రక్షించుగాక !– అని భావం. ఈ మణవాళమహాగీమునుల భక్తుదు, **"న అభిభూతః"** – బాహ్యాంతరశత్రువులచే పరిభవింపబడనివాడుగను, మాయికవిషయకామమును నిరసించువాడుగను, శ్రీసూక్తి విలాసమునకు అద్వితీయమైన ఆశ్రయముగను, అనగా – రస్యముగా పల్కు వాగ్విలాసమును కలవాడుగను ఉండును– అని భావము. **"నాళీకస్థః"** – న+ఆళీకస్థః – అళీకమనగా అసత్యవాక్కు, అప్రియవచనము.

ఇవి లేనివాడు నాళీకస్థుడు. ఏనాడును అబద్ధమును పలుకనివాడు –అని భావము. అపౌరుషేయమగు, నిత్యమైన వాక్కును – అనగా – నాల్గు వేదములను అధ్యయనము చేయుటలో చతురాస్యత్వమును – అనగా – సమర్థమగు వాగ్వైభావముతో మహిమను పొందినవాడును, సత్యమునందే స్థిరముగా నుండువాడును బ్రహ్మ. అతడు శ్రీమన్నారాయణుని నాభిభూతుడు. అనగా నాభీకమలమునుండి ఉద్భవించినవాడు. **"ఉన్దిమేల్ నాన్ముకనై ప్పడైత్తవన్"** (నాభిలో చతుర్ముఖుని సృష్టించినవాడు) అనిరికదా బ్రహ్మను దివ్యసూరులు. **"మదనమథనకృత్"** – కాముని దహించినవాడగు శివుని సృష్టించినవాడు. మఱియు, బ్రహ్మ తన పత్ని అగు (వాక్ – వాగ్దేవియగు సరస్వతి) వాణీదేవియొక్క విలాసములను అనుభవించువాడు.

బ్రహ్మ – నాళీకస్థః, నాళీకమనగా కమలము. అందున్నవాడు. నాల్గు వేదములను అధ్యయనము చేయుటకు చతురాస్యత్వమును – అనగా – నాల్గు ముఖములను కల్గినవాడైయుండుటచే, గొప్పతనమును కలవాడు. **"సత్యధామా"–** సత్యలోకములో నివసించువాడు. ఇట్లు శ్లేషాలంకారరీతిలో శ్లోకములోని విశేషణములన్నియు చతుర్ముఖునకును, శ్రీవరవరమునుల భక్తునకును ఒప్పును. కావున ఇతడు – అనగా శ్రీవరవరమునుల భక్తుడు బ్రహ్మయొక్క సామ్యమును పొంది వెలుగుచున్నాడు – అని భావము. మామునుల భక్తుల విషయములో **"సత్యధామా"** అనుటకు శ్రీవైష్ణవశ్రీవలన కల్గిన కాంతిని, ప్రభావమును నిజముగానే కలవాడను అర్థమును గ్రహింపవలెను. **"ధామ"** శబ్దము **"గృహదేహత్విట్ ప్రభావాః ధామాని"** అనెడి అమరకోశవచనానుసారము ఇచట కాంతికి, ప్రభావమునకును వాచకము. **"సత్యం ధామ యస్య సః సత్యధామా"** అని ఇచటి విగ్రహము. **"అపగతమదమానై రంతిమోపాయనిష్ఠై రధిగతపరమార్థై రర్థకామానపేక్షైః , నిఖిలజనసుహృద్భిః నిర్జితక్రోధలోభైః వరవరమునిభృత్యై రస్తు మే నిత్యయోగః"** (మద, మానాలు తొలగినవారు, అంతిమోపాయంలో నిష్ఠను కలవారు, పరమార్థాన్ని పొందినవారు, అర్థాన్ని, కామాన్ని కోరనివారు, జనులందఱి మంచిని ఆశించేవారు, క్రోధలోభాలను నిర్జించినవారైన వరవరముని భృత్యులతో నిత్యం నాకు కలయిక కలగాలి) అనెడి శ్లోకములో చెప్పబడిన ప్రభావములన్నియు సత్యమైనవే; కేవలము పొగడ్తలు కావు– అని భావము. పరమసాత్త్వికులగు శ్రీవరవరమునుల భృత్యులకు రాజస– తామసులగు బ్రహ్మరుద్రులతో సామ్యమును పల్కుట తగదుకదా ! అని భావింపనవసరము లేదు. వారికిని ఒక్కొక్క రీతిలో అతిశయము కలదు. ఆ అతిశయము శ్రీవరవరముని భృత్యులకును కలదు – అని పల్కుటలోనే కవిహృదయము. **"శివనయనేపోల్వార్ మన్ను తిరుక్కోవలూరదనుళ్ కణ్డేన్ నానే"** (శివునితో, బ్రహ్మతో సాటివచ్చేవారు స్థిరంగా నిలచి ఉండే తిరుక్కోవలూర్‌లో దర్శించాను), **"అన్దయను మరన్ శేయు మనైయవర్కళ్ నాఙ్గార్ అరిమేయ విణ్ణకర మమర్న్ద శెమ్బొఱ్సెయ్కోయిలినుళ్ళే"** (అపుడు బ్రహ్మరుద్రులతో సాటి వచ్చేవారు

నివసించే తిరునాంగూర్ లోని అరిమేయవిణ్ణగరమ్ క్షేత్రంలో నిత్యనివాసంచేసి గొప్ప పర్వతంవంటివాడు) అని దివ్యదేశవాసులగు శ్రీవైష్ణవబ్రాహ్మణులకు ఉపమానముగా బ్రహ్మ మొదలగువారిని ఆళ్వార్లు పల్కిరి కదా !

ఈ శ్లోకములో బ్రహ్మ నాల్గు ముఖములతో నాల్గు వేదములను అధ్యయనము చేయుచున్నాడు; శ్రీవరవరమునుల భక్తుడు ఒక ముఖముతోనే నాల్గు వేదములను అధ్యయనము చేయు సామర్థ్యమును కల్గియున్నాడు; కావున బ్రహ్మకంటె అతడు ఉత్కృష్టుడని స్ఫురించుచున్నది.

శ్రీవరవరమునుల శిష్యవర్గం చతుర్ముఖునితో పోలి ఉన్నదని అంటూ అత్యంత మనోహరమైన శ్లేషభంగిమలో అణ్ణన్ వర్ణిస్తున్నారు. ఈ చతుర్ముఖసామ్యాన్ని ఆఱు విశేషణాలతో నిర్వహించిన అందం విద్వజ్జనైకవేద్యం.

(నాభిభూతః) – చతుర్ముఖుడు నాభీకమలంనుండి ఉద్భవించిన విషయం ప్రసిద్ధం. వరవరమునుల భక్తవర్గం **'న అభిభూతః' –'లాభ స్తేషాం జయ స్తేషాం కుత స్తేషాం పరాభవః"** (వారికి లాభం, జయం కల్గుతాయి. వారికి పరాభవం ఎందువల్ల కల్గుతుంది?) అనే రీతిలో ఎక్కడా తిరస్కారమనేది వారికి కలుగదు. నశబ్దంతో అభిభూత శబ్దానికి సమాసం చేస్తే **"నాభిభూతః"** అనే రూపం సిద్ధిస్తుంది.

(మదనమథనకృత్) – "మదనం మథ్నాతీతి మదనమథనః" –కాముని శరీరాన్ని దహించినవాడు శివుడు; ఆ శివుని సృష్టించినవాడు బ్రహ్మ. **"నాన్ముకనుమ్ తాన్ముకమాయ్ శఙ్కరనై త్తాన్ పడైత్తాన్"** (చతుర్ముఖుడు తన ద్వారా శంకరుని సృష్టించాడు) అనే రీతిలో శివుని సృష్టించినవాడు చతుర్ముఖుడు కదా! వరవరమునుల శిష్యుల పక్షంలో అర్థం ఏమంటే – **మదనస్య మథనకృత్** – కామాదిదోషాలను మథించగల్గినవారని భావం. **"నిర్జితక్రోధలోభైః, అపగతమదమానైః"** ఇత్యాదిగా వరవరమునుల భృత్యులు స్తుతింప బడుతున్నారు కదా!

(వాగ్విలాసైకభూమిః) – బ్రహ్మ సరస్వతీవల్లభుడు కనుక, తన భార్య అయిన ఆమె విభ్రమాలకు ఆస్పదంగా ఉంటాడు. శ్రీవరవరమునుల భక్తవర్గం వాక్పటిమను కల్గి ఉండడాన్ని ఈ విశేషణం తెలుపుతుంది.

(నాళీకస్థః) – నాళీకమని తామరపూవుకు పేరు. అందులో ఉండేవాడు బ్రహ్మ. శ్రీవరవరముని భక్తవర్గం **"న అలీకః"**. అలీకమంటే –**"అలీకం త్వప్రియేఽనృతమ్"** అనే అమరకోశవచనానుసారం అసత్యం, అప్రియం– అని అర్థం. వరవరమునులభక్తబృందం అసత్యోక్తిని, అప్రియోక్తిని తెలియనిది; **"సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్య మప్రియమ్"** (సత్యాన్ని పలకాలి, ప్రియాన్ని పలకాలి. సత్యమైనా అప్రియమైన మాటను పలుకరాదు.) అనే నిష్ఠను కలవారని తాత్పర్యం.

(అకృతోక్తివ్యవహృతి చతురాస్యత్వ సంప్రాప్తభూమా) – బ్రహ్మ చతుర్ముఖుడనే పేరును కలవాడు కనుక చతురాస్యుడు, చతురాననుడు. నాల్గు ముఖాలు కలవాడని భావం. ఎందుకోసం ఇతడు నాల్గు ముఖాలను కల్గి ఉన్నాడు ? అని అంటే, **"అకృతోక్తి వ్యవహృతయే"– "అకృతోక్తి"** అనే పదం నిత్యాపౌరుషేయం అయిన వేదాన్ని తెల్పుతుంది. నాల్గు వేదాలను స్వరవిపర్యయం లేకుండా ఉచ్చరించడంకోసం తగిన రీతిలో నాల్గు ముఖాలను కల్గి, తద్వారా అతిశయాన్ని పొందినవాడు– చతుర్ముఖబ్రహ్మ. శ్రీవరవరముని భక్తుల విషయంలో అయితే – **"చతురాస్య"** శబ్దాన్ని **"చతుర + ఆస్య"** అనే పదవిభాగాన్ని చేసి, వేదవ్యవహారంలో చాతుర్యాన్ని కల నోటిని (జిహ్వను) కల్గి ఉన్నందువల్ల అతిశయాన్ని పొందినవారని భావం.

(సత్యధామా) – బ్రహ్మపక్షంలో– సత్యశబ్దంచేత సత్యలోకం వివక్షితం. ఆ లోకాన్ని నివాసస్థానంగా కలవాడు బ్రహ్మ. వరవరమునుల భక్తవర్గపక్షంలో – **"గృహదేహత్విట్ ప్రభావా ధామాని"** అనే అమరకోశవచనానుసారం ధామశబ్దం ప్రభావపరం. పొగడుతూ పల్కిన ప్రభావాన్ని అంతటినీ నిజంగా కల్గినది– అని భావం. **"అపగతమదమానై రంతిమోపాయనిష్ఠైః"** (మదాన్ని, దురభిమానాన్ని లేనివారు, అంతిమోపాయంలో నిష్ఠను కలవారు) ఇత్యాది శ్లోకరత్నప్రసిద్ధం అయిన కీర్తి ఏ అతిశయోక్తి లేకుండా యథాభూతార్థ కథనంగా ఉంటుంది. లేక, ధామశబ్దానికి గృహమనే అర్థాన్ని గ్రహించి, సత్యానికి గొప్ప నివాసం–అంటే–సత్యాన్ని ఎల్లప్పుడు పలికేవారని చెప్పవచ్చు. **"పొయ్యిలాద మణవాళ మాముని"** (అసత్యం ఏమీ లేని వరవరమునుల) శిష్యులు కూడా సత్యవచస్కులు కావడంలో ఏమి ఆశ్చర్యం? ఇటువంటి గొప్పతనాన్ని కల్గిన శిష్యులచేత సేవింపబడే శ్రీమద్వరవరమునులు మనలను రక్షించాలని – శ్లోకభావం.

14. శిరసి వహతాం యత్పాదాంభః కలానిధిమౌళితా
జయతి వరదాచార్యాదీనా మనన్యసమాశ్రయా ।
స హి వరముని స్సాక్షా న్నారాయణ స్తత ఏవ తత్
చరణవరణా స్సర్వేఽప్యుర్వ్యాం తరంతి భవార్ణవమ్ ॥

యత్పాద+అంభః = ఏ మణవాళమహామునుల శ్రీపాదతీర్థాన్ని, శిరసి వహతాం= శిరసా వహించే (మిక్కిలి గౌరవించే), వరదాచార్యాదీనాం = కోయిలణ్ణన్ మొదలైనవారికి, అనన్యసమాశ్రయా = ఇతరులను ఎవ్వరినీ ఆశ్రయంగా లేని, కలానిధిమౌళితా = కలానిధిమౌళి– అనే గొప్పతనం, (చంద్రశేఖరుడై ఉండే గొప్పతనం, సమస్త కళలకు నిధులుగా ఉండే వారిలో గొప్పవారుగా ఉండే స్థితి) జయతి = సర్వోత్కర్షతో వెల్గుతున్నదో, స హి వరవరమునిః = ఆ వరవరమునులు, సాక్షాత్ నారాయణః = సాక్షాత్తు నారాయణుడే, తతః ఏవ = అందువల్లనే, ఉర్వ్యాం = ఈ లోకంలో, తత్ చరణవరణాః సర్వే అపి = ఆ

వరవరమునుల శ్రీచరణాలను ఉపాయంగా ఆశ్రయించినవారందరు కూడా, భవ+అర్ణవం తరంతి = సంసారసముద్రాన్ని దాటుతున్నారు.

ఇందు అణ్ణన్ **"అమ్మావరుళ్ళుమ్ ముదలావాన్ మూరినీర్ వణ్ణన్"** (ఆముగ్గురిలోను జలంవలె నీలవర్ణాన్ని కలవాడు మూలకారణభూతుడు) అనునట్లు త్రిమూర్తులలో ముఖ్యుడగు శ్రీమన్నారాయణుడే సాక్షాత్తు శ్రీమణవాళ మహామునులు అనుచున్నారు. అది ఎట్లనగా – శ్రీమన్నారాయణుని తిరువడితీర్థమగు గంగాజలమును శిరస్సులో ధరించు శివుడుకళానిధిమౌళియై, చంద్రశేఖరుడైయున్నాడు. మామునుల తీర్థమును తలపై దాల్చు వరదనారాయణులు (కోయిలణ్ణన్) మొదలగువారు పలువురు కళానిధిమౌళులై వెల్గుచున్నారు. అనగా– సకలకళలను ఎట్టి దోషము లేకుండ అభ్యసించిన విద్వచ్ఛిరోమణులై వెల్గుచున్నారు – అని భావము. వీరివలె సర్వకళానిధిమౌళియగు స్వభావము శివునకు అరుదు కదా! మఱియు, ఈ భూమిలో మణవాళమహామునుల శ్రీపాదములను శరణముగా గ్రహించిన అందఱును సంసారమనెడి సముద్రమును దాటి ఆవలి గట్టుకు చేరుదురు. శ్రీమన్నారాయణుని శ్రీచరణములను ముముక్షువులై ఆశ్రయించిన చేతనుడును సంసారసముద్రమును దాటుచున్నాడు. అందుచే మామునులు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే –అని స్థిరీకరించి నట్లయినది. **"పీతకవాడై పిరానార్ పిరమకురువాకి వన్దు"** (పీతాంబరధారి అయిన స్వామి పరమాచార్యుడై వచ్చి) అనియు, **"సాక్షా న్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనూమ్, మగ్నా నుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** (సాక్షాత్తు దేవుడైన శ్రీమన్నారాయణుడే మానవరూపాన్ని ధరించి, శాస్త్రపాణియై ఆచార్యుని రూపంలో సంసారంలో మునిగినవారిని ఉద్ధరిస్తున్నాడు.) అనియును పల్కు రీతిలో శ్రీమన్నారాయణుడే ఆచార్యుడుగా వచ్చి చేతనులను ఉజ్జీవింపచేయుచున్నాడని చెప్పబడుచున్నదికదా!

శ్రీమణవాళమహామునుల శిష్యులకు గడచిన శ్లోకాలలో శివసామ్యం, చతుర్ముఖ సామ్యాన్ని నిర్వహించిన అణ్ణన్ ఇందులో శ్రీమణవాళమహామునులకు శ్రీమన్నారాయణు నితో తాదాత్మ్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. పరమసాత్త్వికులైన శ్రీవరవరమునుల శిష్యులకు పరమసత్త్వ సమాశ్రయుడైన శ్రీమన్నారాయణునితో సామ్యం చెప్పవలసి ఉండగా, రాజసతామసులైన బ్రహ్మరుద్రులతో సామ్యం ఎందుకు చెప్పడం? అని కొందఱు ప్రశ్నించ వచ్చు. దివ్యదేశాలను వర్ణించే తిరుమఙ్గైయాళ్వార్లు అక్కడ నివసించే శ్రీవైష్ణవులను బ్రహ్మరుద్రులతో సమానులుగా వర్ణించడాన్ని గమనిస్తున్నాము కదా! **"శివనయనేపోల్‌వార్ మన్ను తిరుక్కోవలూరదనుళ్ కణ్డేన్ నానే"** (2-10-9) (శివుడు, బ్రహ్మవంటివారు నివసించే తిరుక్కోవలూర్ అనే క్షేత్రంలో నేను స్వామిని దర్శించాను) అనే పెరియతిరుమొழி సూక్తిని దీనికి ఉదాహరణంగా గ్రహించవచ్చు. ఈ శ్లోకంలో వరవరమునులకు సాక్షాత్ నారాయణత్వం ఏవిధంగా చెప్పబడింది? అని అంటే, శ్రీమన్నారాయణుడు తన శ్రీపాదతీర్థాన్ని (గంగా జలాన్ని) శిరసా వహించినవానికి కలానిధిమౌళిత్వాన్ని–

చంద్రశేఖరత్వాన్ని ఇచ్చాడు. **"కలానిధిః మౌలౌ యస్య సః, తస్య భావః - కలానిధిమౌళితా"** అని ప్రకృతంలో విగ్రహవాక్యాన్ని చెప్పాలి. శ్రీవరవర ముని దినచర్యాస్తుతిలో - **"తత స్స్వచరణాంభోజస్పర్శసంపన్నసౌరభైః, పావనై రర్థిన స్తీర్థై ర్భావయంతం భజామి తమ్"** (తరువాత, తమ శ్రీపాదపద్మాల స్పర్శచేత పరిమళాన్ని కల్గినవి, పావనములైనవి అయిన శ్రీపాదతీర్థాలతో నన్ను సంభావించేవారిని భజిస్తున్నాను.) అని పల్కిన రీతిలో శ్రీవరవరమునులు ఆ యా విశేషసందర్భాలలో శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించగా, దానిని సేవించినవారు సకలకళానిధిమౌళులుగా ప్రకాశిస్తున్నారు. **"కలానిధి"** శబ్దం సకలకళావల్లభులను తెలుపుతుంది. వారిలో ముఖ్యులైనవారి **"కళానిధిమౌళి"** శబ్దం తెలుపుతుంది. అటువంటివారుగా శ్రీవరవరమునుల శ్రీపాదతీర్థాన్ని సేవించిన కోయిలణ్ణన్ మొదలైనవారు ప్రకాశిస్తున్నారని ఇచటి తాత్పర్యం. ఇంతేకాదు, శ్రీమన్నారాయణుడు శ్రీరామావతారం ఎత్తినపుడు, ఆయన శ్రీచరణాలను ఆశ్రయించి ఉజ్జీవించి, **"తిరువడి"** అనే పేరును నిరూపకంగా కల్గిన మారుతి - **"ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలమ్"** (అవలీలగా సముద్రజలాలను దాటి) అని, **"గోష్పదీకృతవారాశిమ్"** (గోవుపాదం అంత చిన్నదిగా సముద్రాన్ని చేసినవాడు) అని చెప్పే రీతిలో సముద్రాన్ని లంఘించాడని ప్రసిద్ధంకదా! ప్రకృతంలో - **"మణవాళమామునికళ్ పొన్నడియామ్ శెజ్గమలప్పోదుకళై ఉన్ని చ్చిరత్తాలే తీణ్డిల్ అమానవనుమ్ నమ్మై క్కరత్తాలే తీణ్డల్ కడన్"** (వరవరమునుల అందమైన, ఎఱ్ఱని శ్రీపాదపద్మాలను భావించి, వానిని శిరస్సుపై ధరిస్తే, అమానవపురుషుడు మనలను తన కరాలతో స్పృశించడం అతని కర్తవ్యం) అనే రీతిలో శ్రీవరవరమునుల శ్రీచరణాలను శరణంగా కలవాడు ఆ మారుతివల్లకూడా చేయడానికి అరుదైన సంసారసముద్రతరణాన్ని చేయగలడు. ఈ విధంగా శ్రీవరవరమునులు సాక్షాన్నారాయణుడే- అని తెలుపబడింది.

15. **జలజనిలయాకాంతోఽనంతద్విజోత్తమసేవితో**
జలజవిలసత్పాణిః నిత్యం కరస్థసుదర్శనః ।
సకలసుమనోవైరివ్రాతావలేపవిలోపకృత్
మధురిపుతులాకాంతః కాంతోపయంతృమునీశ్వరః ॥

జలజనిలయా+కాంతః = తామరపూవులో నివసించే లక్ష్మీదేవికి అసాధారణుడై (భర్తయై), (జడ-జని-లయా+ఏకాంతః = మూఢజన్మను పోగొట్టడంలో చాలా సమర్థుడై) అనంతద్విజోత్తమసేవితః = అనంతునిచేత, పక్షిరాజు అయిన గరుడునిచేత సేవింపబడేవాడై (అసంఖ్యాకులైన బ్రాహ్మణోత్తములచే సేవింపబడేవాడై), జలజల విలసత్పాణిః = (పాంచజన్యమనే) శంఖంచేత ప్రకాశించే శ్రీహస్తాన్ని కలవాడై (తామరలవలె విలసిల్లే శ్రీహస్తాన్ని కలవాడై), నిత్యం కరస్థ సుదర్శనః=ఎల్లప్పుడు చేతిలో వర్తించే సుదర్శనాన్ని

కలవాడై, (భగవద్రామానుజుల దర్శనార్థాలను కైవశం చేసికొన్నవాడై), సకలసుమనో వైరివ్రాతావలేపవిలోపకృత్ = సకలరాక్షసుల సమూహంయొక్క గర్వాన్ని లేకుండా చేసిన వాడైన, (అసురప్రకృతిని కల వేదవిరుద్ధంగా వాదించే అందఱియొక్క గర్వాన్ని హరించిన వాడైన), కాంతోపయంతృ మునీశ్వరః = శ్రీవరవరమునులు, మధురిపు తులాకాంతః = మధుసూధనుడనబడే భగవానునితో గల సామ్యంవల్ల ఆకర్షణీయులు.

ఇందు ప్రకారాంతరమున శ్రీమణవాళమహామునులు మధుసూదనుడగు శ్రీమన్నారాయణునితో సామ్యమును పొందినవారై, దానిచే అందముగా వెలుగుచున్నారు– అని నిరూపింపబడుచున్నది. ఈ శ్లోకములోని విశేషణములు భగవానునకు, శ్రీవరవర మునులకును ఒప్పు రీతిలో ప్రయోగింపబడుట అత్యంతము సహృదయ హృదయానంద జనకము.

భగవానుడు పద్మనివాసినియగు లక్ష్మికి వల్లభుడు. అనంతుడు, పక్షిరాజగు గరుత్మంతుడు మొదలగువారిచే సేవింపబడుచున్నాడు. (**"ఉత్తమ"** శబ్దాన్ని అనంత, ద్విజశబ్దాలకు విశేషణంగా కూడా చేయవచ్చు.) జలజమని పద్మమునకు పేరు. శంఖమునకును జలజమను పేరు కలదు. అపుడు భగవానుడు ఎడమ చేతిలో వెల్గు శంఖమును కల్గినవాడని భావము.

(నిత్యం కరస్థసుదర్శనః) – **"ఎప్పోదుమ్ కైకళ్ళలా నేమియాన్"** (ఎల్లప్పుడు చేతిలో పరిభ్రమించే సుదర్శనాన్ని కలవాడు), **"కైయిలఙ్గాళ్ళి శఙ్గన్, శుడరాళ్ళి శఙ్గిరుపాల్ పొలిన్దు తోన్ఱ"** (శ్రీహస్తాలలో రెండు వైపులా శంఖం, చక్రం ప్రకాశించగా), **"వలక్కైయాళ్ళి యిడక్కై చ్చఙ్గ మివై యుడై మాల్వణ్ణనై"** (కుడివైపు చక్రం, ఎడమవైపు శంఖం– అనే వీటిని కల నీలవర్ణుని) ఇత్యాదిగా స్వామి స్తుతింపబడుచున్నాడుకదా ! దేవవిరోధులగు సకలాసురుల సంఘముయొక్క గర్వమును నశింపచేయువాడు, భగవానుడు.

ఇక, మణవాళమహామునుల విషయమున విశేషణములు ఎట్లు యోజింపవలెనో గమనించెదము.

(జలజనిలయాకాంతః) లక్ష్మీదేవియొక్క మనస్సు ఆనందించుటకు తగిన రీతిలో కైంకర్యశ్రీని కల్గినవారైయుండుటచే లక్ష్మీదేవికి ఇష్టులై, మనోజ్ఞులై శ్రీవరవరమునులు ఉందురు.

(అనంత ద్విజోత్తమసేవితః) అనంతులగు అనగా – అసంఖ్యాకులగు శ్రీవైష్ణవ బ్రాహ్మణోత్తములచే సేవింపబడువారు, శ్రీవరవరమునులు.

(జలజవిలసత్పాణిః) శ్రీవరవరమునులు తమను ఆశ్రయించుటకై వేచియుండు ముముక్షుజనుల ఉజ్జీవనమునకు తగినట్లు వారికి తప్తచక్రాంకనములను అనుగ్రహించుట కొఱకు శ్రీసుదర్శన పాంచజన్యములను తమ హస్తములలో ధరింతురు. లేక, **"జలజవిల సత్పాణిః"**– తామరవలె వెల్గుచున్న శ్రీహస్తమును కలవారనియు అర్థము.

(నిత్యం కరస్థసుదర్శనః) – నిత్యము హస్తగతమైన సద్దర్శనములను కలవారు. సుదర్శనశబ్దము సద్దర్శనమును తెల్పును. ఎమ్బెరుమానార్ దర్శనమే సద్దర్శనము. దానిని కరస్థముగా కలవారు. భగవద్రామానుజుల దర్శనసిద్ధాంతములను అన్నిటిని తమకు విధేయములుగా చేసికొనినవారని తాత్పర్యము. లేక, ఈ రెండు విశేషణములకు శంఖ చక్రరేఖలను శ్రీహస్తములయందు కలవారని అర్థమును కూడా చెప్పవచ్చును. శంఖ చక్రరేఖలు సాముద్రికశాస్త్రములో మహాపురుష లక్షణములుగా చెప్పబడుచున్నవికదా!

(జలజనిలయైకాంతః) – అను వేఱొక పాఠము కన్పించుచున్నది. అపుడు, భగవానుని పక్షమున పద్మాసనియగు లక్ష్మీదేవికి అసాధారణమైన పతి– అని అర్థము. శ్రీమణవాళమహామునుల పక్షమున **"జడజనిలయ + ఏకాంతః"** అని అన్వయము. ఇచట **"లడయో రభేదన్యాయ"**మును అన్వయింపనగును. జడమైన పుట్టుక మొదలగు వానిని లయమును అనగా – నాశమును చేయుటయే అసాధారణగుణముగా కలవారు. యథాజాతులను సైతము, తీర్చిదిద్ది, వారివలనకూడ కైంకర్యమును గ్రహింపగలవారని భావము. **"తీర్న్ద అడియవర్తమ్మై తిరుత్తి పుణికొళ్ళ వల్ల ఆర్న్దపుకழ் అచ్చుతన్"** అనే నమ్మాழ்వార్ల శ్రీసూక్తి భావం శ్రీవరవరమునుల విషయంగా అనుసంధేయం.

(సకలసుమనోవైరివ్రాతావలేపవిలోపకృత్) – దేవతలకు విరోధియైన సకల అసురుల, రాక్షసుల సమూహమునకు గల గర్వమునకు విలోపమును – అనగా – నాశమును చేయువాడు, భగవానుడు. మణవాళమహామునులు, త్రైవిద్యవృద్ధులైన పెద్దలకు విరోధులగు ఆసురరాక్షసప్రకృతుల గర్వమును నిరసించువారు. ఈ రీతులలో భగవానునితో సామ్యమును శ్రీమణవాళమహామునులు కల్గియుండుట ఇందు నిరూపితము.

ఈ శ్లోకంలో శ్రీమణవాళమహామునులకు శ్రీమన్నారాయణునితో సామ్యం నిర్వహింపబడుతున్నది.,

(జలజనిలయైకాంతః) – భగవానుడు లక్ష్మికి భర్త. ఆ లక్ష్మి పద్మనివాసిని. మణవాళమహామునుల పక్షంలో జలశబ్దాన్ని జడశబ్దంగా **'లడయోరభేదః'** (లకార, డకారాలకు తేడా లేదు) అనే న్యాయాన్నిబట్టి గ్రహించాలి. **"జని"** అంటే పుట్టుక– జన్మ అని అర్థం. జడమైన జన్మకు లయం కల్గించేవారు– అంటే – దానిని లేకుండా చేయడంలో సమర్థులు– అద్వితీయులని భావం. యథాజాతులుగా చెప్పబడే మూఢులు, అజ్ఞానులను సైతం సంస్కరించి **"తిరుత్తి పుణికొళ్ళవల్ల"** (సంస్కరించి సేవను పరిగ్రహించగల్గిన) అన్నట్లు ఉజ్జీవింప చేయగల్గినవారని శ్రీవరవరమునుల పక్షంలో భావం.

(అనంతద్విజోత్తమసేవితః) – ఆదిశేషునిచే, గరుడునిచే సేవింపబడేవాడు– అని శ్రీమన్నారాయణుని పక్షంలో అర్థనిర్వాహాన్ని చేయాలి. శ్రీవరవరమునుల పక్షంలో అనంతులైన –అపరిమిత సంఖ్యలోని ద్విజోత్తములచే– శ్రీవైష్ణవులచే సేవింపబడేవారు.

(జలజవిలసత్ పాణిః) – జలజమంటే ప్రకృతంలో శంఖరాజమైన పాంచజన్యం. ఇది సముద్రంనుండి పుట్టింది. కనుక జలజం చేత– పాంచజన్యశంఖంచేత అలంకరింప బడ్డ శ్రీహస్తాన్ని కలవాడు భగవానుడు. ఇక, శ్రీవరవరమునుల పక్షంలో– తామరపూవువలె ప్రకాశించే శ్రీహస్తాన్ని కలవారని భావం. **"కైయు మేన్దియ ముక్కోలుమ్ వాழ்ియే"** అని నిత్యం వారి శ్రీహస్తానికి మంగళాశాసనం చేయబడుతున్నది కదా! **"జలజవత్ విలసత్ పాణిః"** అని వివరణం.

(నిత్యం కరస్థసుదర్శనః) – భగవానుడు, **"ఎప్పోతుమ్ కైకழ்లా నేమియాన్"** (ఎల్లప్పుడు చేతిలో భ్రమించే చక్రాన్ని కలవాడు) అన్నట్లు సదా శ్రీహస్తంలో శ్రీసుదర్శనాన్ని ధరించేవాడు. శ్రీవరవరమునుల పక్షంలో – సుదర్శనం అంటే –సద్దర్శనమని అర్థం. అది భగవద్రామానుజ సిద్ధాంతమే. ఆ దర్శనంలోని విశేషార్థాలను అన్నిటినీ కైవసం చేసికొన్నవారని భావం. లేక **"జలజ–విలసత్ పాణిః", "నిత్యం కరస్థసుదర్శనః"** అనే రెండు విశేషణాలకు ఉత్తమపురుషలక్షణం అయిన చక్ర, శంఖలాంఛనాలతో వెలిగే శ్రీహస్తం కలవాడనే భావాన్ని చెప్పవచ్చు.

(సకలసుమనోవైరివ్రాతావలేపవిలోపకృత్) – ఆసురస్వభావాన్ని కలవారి గర్వాన్ని అణచగల సామర్థ్యాన్ని కల్గి ఉండడం శ్రీమన్నారాయణ– శ్రీవరవరమునులకు ఇద్దఱికీ పొసగుతుంది. **"అశురర్ ఇరాక్కదరై యిణైక్కులత్తై యెదుత్తు కళైన్ద ఇరుడీకేశన్"** (అసురుల, రాక్షసుల నీచకులాన్ని సమూలంగా నశింపజేసిన హృషీకేశుడు) కదా భగవానుడు. ఇక వరవరమునుల పక్షంలో, తిరువాయ్మొழ்ిలోని **"పొలిక పొలిక"** అనే దశకంలో **"ఐయ మొన్ఱిల్లై అరక్కర్ అశురర్ పిఱన్దీరుళ్ళీరేల్ ఉయ్యుమ్ వకై యిల్లై తొణ్డీర్ !"** (దాసులారా ! సందేహం లేదు. రాక్షసులు, అసురులు జన్మించినవారుంటే వారికి బతికే దారి ఇక లేదు) అని అనుగ్రహించిన విషయం శ్రీవరవరమునులవల్ల సఫలమైనదని భావం.

పైరీతులలో వరవరమునులు **'మధురిపుతులాకాంతః"** –మధుకైటభులను సంహరించిన భగవానునితో సామ్యం పొందారు– అనే అర్థం సభంగ– అభంగశ్లేషలద్వారా అందంగా నిర్వహింపబడింది.

16. యద్వాగ్జాలం మధుజిదతనుచ్ఛేదినాళీకవాసో–
త్కృత్తోద్వృత్తాసురసురవరైః సాదరం సేవ్యమానమ్ ।
పద్మావాసాక్షితిధరసుతావాక్ఛచీకాంతభూతైః
కాంత్యా కాంతం స జయతు మహాయోగికాంతోపయంతా ॥

కాంత్యా = కాంతి అనుగుణముచే, కాంతం = ఆకర్షణీయమైనది (మనోహరమైనది) అయిన, యద్వాగ్జాలం = ఏ మణవాళమహామునుల శ్రీసూక్తి సమూహం, మధుజిత్ =

మధువు అను రాక్షసుని సంహరించినవాడు (విష్ణువు), అతనుచ్ఛేది = శరీరరహితుడైన మన్మథుని దహించినవాడు (రుద్రుడు), నాళీకవాస = నాభీ పద్మాన్ని నివాసంగా కల్గినవాడు (బ్రహ్మ), ఉత్కృత్త+ఉద్వృత్త+అసుర = గర్వించిన వృత్రాసురుని సంహరించినవాడు (ఇంద్రుడు) అనే, సురవరైః = దేవతా శ్రేష్ఠులైన, పద్మావాస (కాంత) = లక్ష్మీదేవి భర్త అయిన విష్ణువు, క్షితిధరాసుతా (కాంత)= పార్వతికి భర్త అయిన రుద్రుడు, వాక్ (కాంత)= సరస్వతికి పతి అయిన బ్రహ్మ, శచీకాంత భూతైః = శచీదేవికి పతి అయిన ఇంద్రుడు అనువారిచే

(మణవాళ మహామునుల శ్రీసూక్తిపక్షంలో) – మధుజిత్ = తేనెను జయించినది, అతనుచ్ఛేది = కామక్రోధాదులను లేనిది, నాళీకవాస = అసత్యాలకు నిలయం కానిది, ఉత్కృత్త+ఉద్వృత్త+అసురసముదయః = ఆసుర స్వభావాన్ని కల్గి వాదించే వారి సమూహాన్ని కల్గినది, కాంత్యా కాంతం = కాంతి అను గుణముచే మనోహరమైనది, యద్వాగ్జాలం = ఏ మణవాళమహామునుల శ్రీసూక్తిబృందం, సాదరం= ఆదరపూర్వకంగా, ఆసేవ్యమానం = సేవింపబడుతున్నదో, సః కాంతః మహాయోగి కాంతోపయంతా = ఆ అందమైన పెరియజీయర్ అనబడే మణవాళమహామునులు, జయతు = సర్వోత్కర్షతో ప్రకాశించాలి.

ఈ శ్లోకమునుండి శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తివైభవము బహుముఖముగా వర్ణింపబడుచున్నది. కాంతి, ఓజోగుణము – ఈ రెండును ప్రసాదగుణమునకు ఉపలక్షణ ములు. ప్రసాదగుణముచేతను, కాంతిగుణముచేతను మనోహరమైనది మణవాళ మహామునుల వాగ్జాలము – అనగా – శ్రీసూక్తిసమూహము, **"మధుజిత్"** – మధుసూదను డగు నారాయణుడు, **"అతనుచ్ఛేది"** – అనంగుడగు మన్మథుని ఛేదించిన రుద్రుడు, **"నాళీకవాసః"** – కమలములో నివసించు బ్రహ్మ, **"ఉత్కృత్తోద్వృత్తాసురసురవర"** – ఉద్వృత్తుడగు అసురుడు – వృత్రుడు. అతనిని వజ్రాయుధముతో దండించిన సురవరుడు, ఇంద్రుడు– అని అర్థము. పద్మావాస అగు లక్ష్మికి కాంతుడు నారాయణుడు; క్షితిధరసుత పార్వతి – ఆమె కాంతుడు రుద్రుడు; వాక్ సరస్వతి, ఆమె కాంతుడు బ్రహ్మ; శచీదేవి కాంతుడు ఇంద్రుడు – అను ఈ దేవతాశ్రేష్ఠులచే ఎవరివాక్కు మాధుర్యమువలన ఆదరముతో అనుసంధింపబడుచున్నదో, అట్టి మహాయోగియగు మణవాళమహామునులు సర్వోత్కృష్టులై వెలుగుదురుగాక !

ఈ శ్లోకములో పాఠభేదములు కనుపించుచున్నది. రెండవ పాదములో – **"ఉత్కృత్తోద్వృత్తాసురసముదయైః సామ్య మాసేవమానమ్"** అని, మూడవ పాదములో – **"వాక్శశీకాంతరూపైః కాంత్యా కాంత స్స జయతు"** అని అనునవి ఆ పాఠభేదములు. అపుడు, ఏ మణవాళమహామునుల శ్రీసూక్తి బృందము లక్ష్మీదేవి, పార్వతి, సరస్వతి,

ఇంద్రాణి- అనెడి వీరికి పతులగు నారాయణుడు, శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు - అను వీరితో సామ్యమును పొందినదో, విలక్షణమైన తేజస్సుతో వెల్గుచున్న ఆ మణవాళ మహామునులు సర్వోత్కృష్టశాలురై వెలుగుదురుగాక ! - అని శ్లోకభావము.

ఇక, సామ్యము నిరూపింపబడుచున్నది. శ్రీమన్నారాయణుడు **మధుజిత్-** అనగా మధువను అసురుని జయించినవాడు, శ్రీవరవరమునుల శ్రీసూక్తులు మాధుర్యమను గుణమున మధువును - అనగా - తేనెను మించినవి. శివుడు **'అతనుచ్ఛేది'-** అనగా - అనంగుడగు కాముని జయించినవాడు. శ్రీవరవరమునుల శ్రీసూక్తియు కామక్రోధాదులను నిరసింపగల్గినది. బ్రహ్మ **"నాళీకవాసుడు"** - అనగా పద్మవాసుడు. అట్లే, శ్రీవరవరమునుల శ్రీసూక్తియు **"పొయ్యిలాద మణవాళమాముని పున్ది"** - (అసత్యము లేని మణవాళ మహామునుల బుద్ధి) అని పొగడబడు బుద్ధినుండి ఉత్పన్నమైనదగుటచే **"న + అళీకవాసము"** - అనగా అసత్యము ఏ మాత్రము లేని సత్యవాక్కుగా నుండును. **ఉత్కృత్త** = నిరసింపబడిన, **ఉద్వృత్త** = దుర్మార్గులగు, **అసురసముదయైః** = అసురసమూహమును కలవాడైయున్నవాడు, ఇంద్రుడు. శ్రీవరవరమునుల శ్రీసూక్తియును బాహ్యకుదృష్టులనెడి ఆసురప్రకృతులను నిరసించును. **"నణ్ణా వశురర్ నలివెయ్‌ద నల్ల వమరర్ పొలివెయ్‌ద"** (ఆశ్రయింపని అసురులు క్లేశమును పొందునట్లు, ఆశ్రయించు అమరులు వృద్ధి పొందునట్లు) అనునట్లుండును. ఈ రీతిలో లక్ష్మీ, పార్వతి, సరస్వతి, శచీదేవి - అను వీరి పతులగు శ్రీమహావిష్ణువు, శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు- అను దేవతలతో సామ్యమును కల్గినదై మణవాళమహామునుల సూక్తిజాలము వెల్గుచున్నదని తెలుపబడినది.

ఈ శ్లోకంలో మణవాళమహామునుల దివ్యసూక్తులు శ్రీమన్నారాయణునితో, శివునితో, చతుర్ముఖునితో, ఇంద్రునితో సామ్యాన్ని పొంది వెలిగే రీతిని అతివిలక్షణమైన శ్లేషభంగిలో అణ్ణన్ నిర్వహిస్తున్నారు. ఉత్తరార్ధంలో ముందు గమనిద్దాం.

(పద్మవాసా .... కాంతరూపైః) - పద్మావాసాకాంతః, క్షితిధరసుతాకాంతః, వాక్కాంతః, శచీకాంతః - అని యోజన చేయాలి. ఇవి క్రమంగా త్రిమూర్తులను, ఇంద్రుని తెలుపుతున్నాయి. ఇక పూర్వార్ధంలో -

(మధుజిత్ .... సముదయైః) - ఈ ప్రయోగంలో శ్లేష నిర్వహింపబడింది. ఈ శబ్దాలు శ్రీవరవరమునుల శ్రీసూక్తిస్వభావాన్ని తెలుపుతున్నాయి. అట్లే, శ్రీమన్నారాయణుని స్వభావాన్ని కూడా తెలుపుతున్నాయి. ఏవిధంగా? అంటే -

(మధుజిత్) - పద్మావాసాకాంతుడైన శ్రీమన్నారాయణుడు కైటభుడనే అసురునితో చరించే మధువు అనబడే అసురుని సంహరించాడు - అని శ్రీమన్నారాయణుని పక్షంలో అర్థం. శ్రీవరవరమునుల పక్షంలో- వారి వాగ్జాలం మధువును జయించింది- తేనెకంటే పరమభోగ్యంగా ఉన్నది- అని భావం.

(అతనుచ్ఛేది) – క్షితిధరసుతాకాంతుడైన రుద్రుడు అతనువు అనబడే మన్మథుని ఛేదించాడు– సంహరించాడు అని భావం. శ్రీవరవరమునుల పక్షంలో– వారి వాగ్జాలం కామక్రోధాదులను జయించిందని భావం.

(నాళీకవాస) – వాక్ కాంతుడైన బ్రహ్మ, నాళీకాన్ని –అంటే– పద్మాన్ని వాసంగా కలవాడు. శ్రీవరవరముని శ్రీసూక్తి పక్షంలో, న+అళీకవాసః – అసత్యం ఏమాత్రం లేని యథార్థాలను పలికేవారు కనుక, వారి వాక్కు అళీకసంబంధాన్ని కల్గినది కాదు అని భావం. పూర్వం 13 వశ్లోకంలో **"నాళీకస్థః'** అనే ప్రయోగం స్మరణార్థం.

(ఉత్కృత్త–ఉద్వృత్త– అసురసముదయః) – శచీకాంతుడైన ఇంద్రుడు దుర్మార్గంలో వర్తించే అసురుల సమూహాలను సంహరించినవాడు. మామునుల సూక్తి జాలపక్షంలో– **"నణ్ణా వశురర్ నలి వెయ్‌త నల్లవమరర్ పొలి వెయ్‌ద"** (ఆశ్రయించని అసురులు క్లేశాన్ని పొందేటట్లు, మంచివారైన సురులు వృద్ధి పొందేటట్లు) అనే రీతిలో ఆసురప్రకృతుల అవలేపాలను సమూలంగా ఛేదించింది. ఈవిధంగా త్రిమూర్తులతో, ఇంద్రునితో సామ్యాన్ని పొందిన శ్రీసూక్తులను అనుగ్రహించే శ్రీవరవరమునులు నిత్యశ్రీః నిత్యమంగళంగా వెలగాలి– అని శ్లోక భావం.

17. హృద్యా యస్య సరస్వతీ సువిమలా తాపా నశేషానపి
ద్రాగున్మూలయతి శ్రుతాఽపి భవినాం శుద్ధిం విధత్తే పరామ్ ।
భంగం నైతి కదాపి కుత్రచిదపి ప్రాప్తాఽపి గంభీరతాం
సోఽవ్యాన్మామతివేలవైభవనిధిః కాంతోపయంతా మునిః ॥

యస్య = ఏ మణవాళమహామునుల, హృద్యా = హృదయంగమమైన, సువిమలా = మిక్కిలి నిర్మలమైన, సరస్వతీ = సూక్తి, (సరస్వతి) శ్రుతా అపి = వినబడిన మాత్రంలోనే, భవినాం = సంసారుల, తాపాన్ అశేషాన్ అపి = సమస్తతాపాలను, ద్రాక్ ఉన్మూలయతి = వేగంగా పోగొడుతున్నదో, పరాం శుద్ధిం = గొప్ప శుద్ధిని, విధత్తే = కల్గిస్తున్నదో, గంభీరతాం ప్రాప్తా అపి = అర్థంలో గాంభీర్యాన్ని కల్గినది అయినా, (చాలా లోతైనది అయినా) కుత్రచిత్ అపి = ఎక్కడ కూడా, కదా అపి = ఎప్పుడు కూడా, భంగం న ఏతి = అన్యవాదులవల్ల పరాజయాన్ని పొందదో (కెఱటాలను కల్గినది కాదో), సః = ఆ, అతివేల వైభవనిధిః= (అపరిమితమైన వైభవాలకు నిధి అయిన), (తీరాన్ని ముంచెత్తే నీటిని కల్గిఉండే వైభవానికి నిధి అయిన) – కాంతోపయంతా మునిః = శ్రీవరవర మునులు, మామ్ అవ్యాత్ = నన్ను రక్షించాలి.

ఇక, శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తులకు పుణ్యనదులకంటే గల అతిశయము వర్ణింపబడుచున్నది. ఇందు సరస్వతీనదికంటే వైలక్షణ్యము భాసించునట్లు పలుకబడినది.

సరస్వతీశబ్దము సరస్వతీనదికి, వాక్కుకును వాచకము. మిక్కిలి నిర్మలమైన ఏ శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తి, **"హృద్యా"** - మనోహరమైనది - హృదయముచే ధరించుటకు - అనగా - అనుసంధించుటకు తగినదియై యున్నది. సమస్తసాంసారిక తాపములను శీఘ్రముగా పూర్తిగా పోగొట్టుచున్నది. చెవులతో వినినంతమాత్రముననే సంసారులకు గొప్ప పరిశుద్ధిని కల్గించుచున్నది. మిక్కిలి గంభీరమైయున్నను అది ఏ చోట అయినను ఏ సమయమునందు అయినను భంగమును పొందలేదు. ఇట్టి శ్రీసూక్తి వైభవమును కల శ్రీవరవరమునులు దాసుని రక్షింతురు గాక ! గంభీరమైన సరస్వతీనది కొన్నిచోట్ల భంగమును (కెఱటములు లేచుటను) పొందినది. కాని, వీరి సరస్వతి - అనగా శ్రీసూక్తి భంగమును - అనగా - పరాభవమును ఎపుడును ఎచటను పొందలేదు. కావున సరస్వతీనదికంటే గొప్పది - అని తాత్పర్యము.

శ్రీమద్వరవరమునుల సరస్వతి (సూక్తి) సరస్వతీనదిగా స్తుతింపబడుతూ, దానితో వైధర్మ్యసాధర్మ్యాలను రెండిటిని కల్గినదిగా అత్యద్భుతమైన రీతిలో వర్ణింపబడుతున్నది. సరస్వతీనది కొన్ని సమయవిశేషాలలో నిర్మలంగా ఉన్నదని అనుకొన్నా, సదా నిర్మలంగా ఉండదు. శరీరతాపాలను తొలగించేదై ఉన్నా, సంసారుల మానసిక తాపాలను తీర్చలేదు. తాపహరణం తనలో అవగాహించినవారికి తప్ప, శ్రవణమాత్రంతో కల్గించదు. ఈ విధంగా సరస్వతీనది కంటే వరవరమునుల సూక్తికి గల వైలక్షణ్యం సూచింపబడింది.

(గంభీరతాం ప్రాప్తా అపి భంగం నైతి) సరస్వతీనది లోతును కల్గినదై, కెఱటాలను కల్గి ఉంటుంది. **"భంగస్తరంగ ఊర్మి ర్వా"** అనే అమరకోశవచనానుసారం భంగమంటే కెఱటం. ఇక, శ్రీవరవరమునుల శ్రీసూక్తిపక్షంలో- విమలత్వం, తాపహరత్వం, శుద్ధిసంపాదకత్వం, గంభీరత్వం - అనే ఈ గుణాలతో సరస్వతీనదితో సామ్యం. సదా నిర్మలత్వం, అభంగురత్వం, శ్రవణమాత్రంతోకూడా తాపహరత్వం, పరిశుద్ధమైన మనస్సును కల్గించడం- అనే వీటితో సరస్వతీనదికంటే ఔన్నత్యం తెలుపబడింది.

(భంగం నైతి కదాపి కుత్రచిదపి) - శ్రీవరవరమునుల శ్రీసూక్తులకు భంగాన్ని కల్గించాలని ఎంతమంది ఎన్నిమార్లు ఎక్కడ ప్రయత్నించినా కొంచెం కూడా సాధ్యం కాదు - అన్నది ఈ సూక్తిహృదయం. ఈ విధంగా ఈ అర్థంలో **"అపి"** శబ్దం సముచ్చయార్థకంగా గ్రాహ్యం.

18. సమింధే యత్సూక్తి స్సకలసుమనోమౌళివిధృతా
శివత్వం సర్వేషా మపి విదధతీ స్వాన్వయవతామ్ ।
విధో రత్యాసన్నా నిరవధికపూర్త్యా విలసత
స్సదా గంగోత్తుంగా జయతి స ముని స్సుందరవరః ॥

సకలసుమనోమౌళి విధృతా = అందఱు పండితులచేత శిరోభూషణంగా ధరింప బడినదై, స్వాన్వయవతాం సర్వేషామ్ అపి = తనతో సంబంధాన్ని కలవారికి అందఱికి, శివత్వం విదధతీ = (పరమపావనత్వాన్ని), శివుని స్వభావాన్ని కల్గించేదై, సదా నిరవధిక పూర్త్యా = ఎల్లప్పుడు అంతులేని పరిపూర్తితో, విలసతః = ప్రకాశించే, విధోః అత్యాసన్నా= చంద్రునివలె చల్లనిదైన (చంద్రునకు చాలా సన్నిహితంగా ఉన్నదైన), యత్ సూక్తిః = ఏ మణవాళమహామునుల శ్రీసూక్తి అనే, ఉత్తుంగా గంగా = గొప్ప గంగ, (గంగకంటే – గొప్పదిగా), సమింధే = వెలుగుతున్నదో, సః సుందరవరః మునిః జయతి = ఆ వరవర మునులు సర్వోత్కర్షతో ప్రకాశిస్తున్నారు.

ఇందు శ్రీవరవరమునుల శ్రీసూక్తి గంగానదికంటెను ఉత్తుంగ –అని నిరూపింప బడుచున్నది. గంగానది, ఒక దేవునిచే (శివునిచే) శిరస్సుపై ధరింపబడి, ఆ ఒక్కనికి మాత్రమే శివత్వమును కల్గించినది. గంగ కళామాత్రుడగు చంద్రునకు మాత్రమే సమీపమున నున్నది. శ్రీవరవరమునుల శ్రీసూక్తి అనెడి గంగ పూర్ణచంద్రునకు అతిసమీపములో నున్నది. అనగా – పూర్ణకళలతో కూడిన చంద్రునివలె మిక్కిలి చల్లనిదియై, చల్లని ప్రకాశమును కల్గించునదియై, మిక్కిలి ఆహ్లాదకరమైయున్నది – అని భావము.

సుమనశ్శబ్దము దేవతలను, విద్వాంసులను తెల్పును. శ్రీవరవరమునుల శ్రీసూక్తి సకల విద్వాంసులచే శిరసా ధరింపబడుచున్నది. శైత్య, మార్దవ, ప్రకాశగుణయోగముచే అందరిచే శిరసా శ్లాఘింపబడుచున్నది. మఱియు, తనతో సంబంధమును కల అందరికిని శివత్వమును – అనగా – మంగళత్వమును ఆపాదించునదియైయున్నది. పరమపవిత్రతను కల్గించుచున్నది. అందుచే శ్రీవరవరమునుల శ్రీసూక్తి గంగోత్తుంగ –గంగకంటె ఉన్నతమైనది. ఇట్టి శ్రీసూక్తి వైభవమును కల శ్రీవరవరమునులు సర్వోత్కృష్టులై వెలుగుదురుగాక !

ఈ శ్లోకంలో మణవాళమహామునుల శ్రీసూక్తి గంగానదికంటే మిక్కిలి గొప్పది– అని వర్ణింపబడుతున్నది.

(గంగోత్తుంగా) "గంగాయాః ఉత్తుంగా"– గంగకంటె (అన్ని నదులకంటే) గొప్పది– అని పంచమీ తత్పురుష సమాసంగా, **"గంగా చ సా ఉత్తుంగా చ"** అని విశేషణోత్తరపద సమాసంగా గ్రహించి రెండర్థాలు చెప్పబడుతున్నవి. **"గంగా+ ఉత్తుంగా"** అని రెండుగా విడదీసి అన్ని నదులకంటే గొప్పదైన గంగ– అనే అర్థాన్ని చెప్పినపుడు శ్రీవరవరమునుల సూక్తికి గంగాసామ్యం స్ఫురిస్తుంది. **"గంగాయాః ఉత్తుంగా"** అనే అర్థాన్ని చెప్పినపుడు గంగకంటే ఆధిక్యం స్ఫురిస్తుంది. శ్లోకం అంతా ఆ ఆధిక్యమే స్ఫురిస్తున్నది. ఇటువంటి వివరణమే శ్రీరామాయణంలోని **"చంద్రకాంతాననమ్"** అనే పదానికి చెప్పబడడం గమనార్హం. అక్కడ **"చంద్రకాంత"** శబ్దాన్ని, **"చంద్ర ఇవ కాంతమ్"** అని, **"చంద్రాత్ కాంతమ్"** అని రెండు విధాలుగా వివరింపబడింది.

(సుమనోమౌళివిధృతా) – దేవతలలో ఒకడైన శివుడు తన శిరస్సుతో గంగను ధరించాడు. శ్రీవరవరమునుల శ్రీసూక్తి అనే గంగ అయితే, **"సకలసుమనోమౌళివిధృతా"** – సకలవిద్వాంసులచేత శిరసా వహింపబడుతుంది. వారిచే మిక్కిలిగా ఆదరింపబడుతుందని తాత్పర్యం. **"సుపర్వాణ స్సుమనసః"** అనే అమరకోశవచనానుసారం సుమనశ్శబ్దం దేవతావాచకం. **"పండిత స్సుమనా స్సుధీః"** అనే కోశవచనాన్నిబట్టి పండితవాచకంకూడా. అందువల్ల ఏకసుమనోమౌళి విధృత అయిన దేవగంగకంటె సకలసుమనోమౌళి విధృత అయిన శ్రీవరవరమునుల సూక్తి గొప్పది అనే విషయం కింపునర్న్యాయసిద్ధంకదా !

(శివత్వం విదధతీ) – "కస్య పాదోదకేన స శివః స్వశిరోధృతేన" (ఎవని శ్రీపాదతీర్థాన్ని తలపై దాల్చినవాడు శివుడయ్యాడో) అనే ఆళవన్దార్ శ్రీసూక్తిరీతిలో దేవగంగ రుద్రుని ఒక్కని మాత్రమే శివునిగా చేయగల్గింది. శ్రీవరవరమునుల శ్రీసూక్తి అయితే

(స్వాన్వయవతాం సర్వేషా మపి శివత్వం విదధతీ) – తనతో అన్వయాన్ని కలవారిని అందఱినీ శివులుగా చేస్తున్నది– అంటే –పరమపరిశుద్ధులుగా చేస్తున్నది. శ్రవణ– మనన– పఠన– లేఖనాదులలో ఏదైనా ఒక రీతిలో స్వామిదివ్యసూక్తితో అన్వయాన్ని కల్గినవారు అందఱు మనస్సులో, వాక్కులో, హృదయంలో పరమపవిత్రతను పొందుతారు.

(విధోః అత్యాసన్నా) – దేవగంగ చంద్రశేఖరుని జటాజూటంలో ఉంటుంది. కనుక చంద్రుని సమీపంలో ఉంటుంది. శ్రీవరవరమునుల శ్రీసూక్తి అనే గంగ– దేవగంగ వలె కళామాత్రావశిష్టుడైన చంద్రునకు సమీపంలో ఉండడం కాకుండా,

(సదా నిరవధిక పూర్త్యా విలసతః విధోః అత్యాసన్నా) – ఎల్లప్పుడు సకలకళా పరిపూర్ణుడైన చంద్రునితో సన్నికృష్టంగా ఉంటుంది. అంటే– సంపూర్ణచంద్రునివలె సర్వాహ్లాదకరంగా ఉంటుందని భావం. సామ్యార్థంలో కూడా ఆసన్నమనే పదప్రయోగం ఉన్నది. అందువల్ల ఈ రీతులలో గంగకంటె చాలా గొప్పదైన శ్రీసూక్తిని అనుగ్రహించే శ్రీవరవరమునులు సర్వోత్కర్షతో వెలుగొందుతున్నారని శ్లోకభావం.

19. సూర్యానందవిధాయినీతి యమునా కాంతోపయంతుః మునేః
వాణీవ వ్యవహారభాక్ భవతు సా కిం తావతా స్యాత్ సమా ।
శుద్ధేయం న హి సా స్వకం శ్రితవతాం తాపా నశేషా నియం
సర్వేషాం వినివార్య కర్తు మమితం శ్రేయః క్షమా నైవ సా ॥

యమునా = యమునానది, సూర్యానందవిధాయినీ ఇతి =సూర్యునకు ఆనందాన్ని కల్గిస్తున్నదనే కారణంచేత (సూరులకు– అంటే –పండితులకు– ఆనందాన్ని కల్గిస్తున్నదనే కారణంచేత), కాంతోపయంతుః మునేః = శ్రీవరవరమునుల, వాణీ ఇవ = శ్రీసూక్తితో సాటి వచ్చేటట్లుగా, వ్యవహారభాక్ భవతు = వ్యవహరింపబడేదిగా కావచ్చు, తావతా కిం సా సమా స్యాత్ = అంతమాత్రంతో సమం అవుతుందా ఏమి?, ఇయం = ఈ

(శ్రీవరవరమునుల) సూక్తి, శుద్ధా = పరిశుద్ధమైనది (స్వచ్ఛమైనది), సా న హి = ఆ యమున = శుద్ధమైనది కాదుకదా (నల్లని వర్ణాన్ని కల్గినదికదా), ఇయం స్వకం శ్రితవతాం= ఈ సూక్తి తన సంబంధాన్ని పొందిన, సర్వేషాం = అందఱికి, తాపాన్ అశేషాన్ = అన్ని తాపాలను, వినివార్య = పూర్తిగా పోగొట్టి, అమితం శ్రేయః = అంతు లేని శ్రేయస్సును, కర్తుం = చేయడానికి (కల్గించడానికి) క్షమా = సమర్థురాలు, సా తు న ఏవ = ఆ యమున అయితే అటువంటిది కానే కాదు.

ఇందు శ్రీవరవరమునుల శ్రీసూక్తి యమునానదికంటె ఉన్నతమైనదని ప్రతిపాదింప బడుచున్నది.

"సూర్యానందవిధాయినీ" అనునది శ్లిష్టప్రయోగము. యమునానది **"సూర్య+ ఆనంద విధాయినీ"** – సూర్యుని పుత్రిక అగుటచే అతనికి ఆనందమును కల్గించును. శ్రీవరవరమునుల శ్రీసూక్తి, **"సూరి + ఆనంద విధాయినీ = సూరీణా మానందవిధాయినీ"** – సూరులకు ఆనందమును కల్గించునది. సూరులనగా నిత్యులు, ముక్తులు, విలక్షణ జ్ఞానమును కల విద్వాంసులును. కావున శ్రీవరవరమునుల శ్రీసూక్తివలె యమునానదియు **"సూర్యానందవిధాయినీ"** అని వ్యవహరింపబడుచున్నది. అయినను, అది శ్రీవరవర మునుల శ్రీసూక్తితో ఏ మాత్రము తులతూగలేదు. అది దీనివలె మిక్కిలి విశుద్ధము కాదు. నీచ సంపర్కము దానికి కలదు. కాని, వరవరమునుల శ్రీసూక్తి విశుద్ధమనస్కులగు శిష్టులచే సేవింపబడుచున్నది. మఱియు, ఇది తనను సేవించిన వారిఅందఱి తాపములను పోగొట్టి, అంతు లేని శ్రేయస్సును మోక్షపర్యంతముగా కల్గింప సమర్థమైనది. యమున అట్టిది కాదు. అందుచే దానికంటే శ్రీవరవరమునుల శ్రీసూక్తి గొప్పది అనుటలో విప్రతిపత్తి ఏమియు లేదుకదా !

ఈ శ్లోకంతో శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తికి యమునానదితో ఏకదేశసామ్యం, ఎక్కువగా ఉత్కర్షం తెలుపబడుతున్నవి.

(సూర్యానందవిధాయినీ) – ఈ విశేషణంద్వారా యమునానదికి శ్రీవరవరమునుల వాక్కుతో సామ్యం ప్రతిపాదింపబడింది. ఏవిధంగా అంటే– యమునానది పురాణకథ నానుసారం సూర్యుని పుత్రికగా ప్రసిద్ధం. **"రవిసుతా, తరణితనయా"** ఇత్యాది ప్రయోగాలను గమనించవచ్చు. అందువల్ల ఆ నది సూర్యానందవిధాయిని. ఇక, వరవరమునుల శ్రీసూక్తి– **"సూరి. ఆనందవిధాయిని"** – పండితులకు ఆనందసందోహ సంధాయక– అని భావం. ఈవిధంగా యమునానదితో ఒక విధంగా సామ్యాన్ని ప్రతిపాదింపబడినా, ఆ యమునా నదికి శుద్ధియోగం లేనందువల్ల, తనతో సంబంధాన్ని కలవారి విషయంలో సకలతాప హరత్వం లేనందువల్ల, సర్వవిధశ్రేయస్కరత్వం లేనందువల్ల, వీటిని అన్నిటినీ పూర్ణంగా కల శ్రీవరవరమునుల దివ్యసూక్తితో యమునానదికి సామ్యం కల్గడం అసంభవం కనుక, దానికంటే ఇది (వరవరమునులసూక్తి) చాలా గొప్పది – అని తెలుపబడింది.

**20. విహరతి యమునాయాః స్రోతసీవాతిహృద్యే
వచసి మనసి చ శ్రీమాధవో యస్య నిత్యమ్ ।
నిరుపమమహిమానం యోగినం తం మహాంతం
నిరుపధిగుణకాంతం చింతయ స్వాంత ! నిత్యమ్ ॥**

స్వాంత = ఓ మనసా !, శ్రీమాధవః = శ్రీమాధవుడు, యమునాయాః = యమున యొక్క స్రోతసి ఇవ = ప్రవాహంలోవలె, యస్య =ఏ మణవాళమహామునుల యొక్క, అతిహృద్యే = అత్యంతభోగ్యమైన, వచసి = సూక్తిలో, మనసి చ = మనస్సులోను, నిత్యం = సదా, విహరతి = విహరిస్తూ ఉన్నాడో, తం = ఆ, నిరుపమ = సాటిలేని, మహిమానం = మహిమను కలవారు, నిరుపధిగుణకాంతం = సహజమైన కల్యాణగుణాలతో ఆకర్షణీయులు అయిన, మహాంతం యోగినం = పెరియజీయర్‌ను (వరవరమునులను), నిత్యం చింతయ = ఎల్లప్పుడు చింతించు.

మాధవుడైన శ్రీకృష్ణుడు అతిమనోహరమగు యమునానదీ ప్రవాహములోవలె మణవాళమహామునుల వాక్కులో, మనస్సులో నిత్యము క్రీడించుచున్నాడు. (శ్రీవరవర మునుల శ్రీసూక్తియు, మనస్సును యమునవలె శ్రియఃపతికి విహారస్థలములు), గొప్ప మహిమను కలవారు, స్వాభావికములగు గుణములచే అతిమనోహరులై యున్నవారు, మహాత్ములగు ఆ మణవాళ మహామునులను, ఓ మనసా! నీవు నిత్యము అనుసంధింపుము.

గడిచిన శ్లోకంలో శ్రీవరవరమునుల దివ్యసూక్తికంటే యమున గొప్పది కాదని అన్నారు. **“తూయ పెరునీర్”** (పవిత్రమైన గొప్పజలాన్ని కల్గిన) అని గోదాదేవి కీర్తించిన యమునకు కొఱతను పల్కితే, యమునానదీవిహారి, **“యమునైత్తుఱైవన్”** అని కీర్తింపబడే కాళిందీరసికుడు అయిన శ్రీకృష్ణునకు కోపం వస్తుందో? ఏమో! అని భావించి, శ్రీకృష్ణుని మనస్సు ఉల్లాసపడేటట్లుగా అణ్ణన్ ఈ శ్లోకాన్ని రచిస్తున్నారు.

శ్రీకృష్ణుడు ఆనందంగా క్రీడించినది – యమునానదిలోను, యమునానదీ ప్రవాహంలోవలెనే శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తిలోను, హృదయంలోను కనుక, శ్రీమామునులు యమునతో సాటివచ్చేవారని భావం. **‘శ్రీమాధవ’** అనే పదం శ్రీకృష్ణుని మాత్రమే కాక, సామాన్యంగా భగవానుని నిర్దేశిస్తుంది. కనుక, శ్రీకృష్ణుని విహారానికి మాత్రం లక్ష్యమైనది యమున, పర–వ్యూహ–విభవ –అంతర్యామి – అర్చావతార మూర్తులు అన్నిటియొక్క విహారం ఇక్కడే అనే వైలక్షణ్యం అర్థతః సూచితమవుతున్నది. ఇరామానుశ నూఱ్ఱన్దాదిప్రబంధంలోని **“ఇరుప్పిడమ్ వైకున్దమ్ వేఙ్గడమ్”** (భగవానుడు ఉండే చోటు వైకుంఠం, తిరుమల) అనే పాశురంయొక్క ఛాయలో **“శఠకోప వాగ్వపుషి... శయితమ్”** అనే భట్టర్ శ్రీసూక్తి క్రమంలో ఈ శ్లోకం రచింపబడడం గమనార్హం. **“విగాహే యామునం తీర్థం సాధుబృందావనే స్థితమ్, నిరస్తజిహ్మగస్పర్శే యత్ర కృష్ణః కృతాదరః”** అనే దేశికసూక్తి స్మరణీయం.

21. కృతావగాహా జనతా యదీయసారస్వతస్రోతసి తుంగభద్రా।
సంసేవ్యమానా కవిభి స్సమింధే పాయా త్స నః కాంతవరో మునీంద్రః ॥

యదీయ సారస్వతస్రోతసి = ఏ మణవాళమహామునుల శ్రీసూక్తి ప్రవాహంలో, కృతావగాహా = అవగాహనాన్ని చేసిన (స్నాన మాడిన), జనతా = శిష్యజనసమూహం, తుంగభద్రా (సతీ) = మంచిని – మంగళాన్ని కల్గినదై (గొప్ప తుంగభద్రయై), కవిభిః = విద్వాంసులచే (సారసపక్షులచే), సంసేవ్యమానా సమింధే = సేవింపబడేదై ప్రకాశిస్తున్నదో, సః కాంతవరః మునీంద్రః = ఆ రమ్యజామాతృమునీంద్రులు, నః పాయాత్ = మనలను రక్షించాలి.

ఏ మణవాళమహామునుల ఉపన్యాసశ్రీసూక్తిని అవగాహించిన– అనగా– సంపూర్ణంగా అర్థం చేసికొనిన శిష్టజనసముదాయము తుంగభద్రయై – అనగా – ఉన్నతమైన శుభమును కల్గినదియై, విద్వజ్జనులచే సేవింపబడునదియై వెలుగుచున్నదో, ఆ మణవాళ మహామునులు మనలను రక్షింతురుగాక! అని శ్లోకభావము. శ్రీవరవర మునుల శ్రీసూక్తులను విని అనుభవించు సజ్జనము తుంగభద్రనదికి సమమై ప్రకాశించు చున్నది – అనియు అర్థము.

నదీపక్షమున **"కవిభిః"** – కవులు అనగా నీటికాకులు, వాటిచే, జలచరపక్షులచే సేవింపబడుచున్నదని చెప్పనగును.

లోకంలో సరస్వతీప్రవాహంలో మునిగిన జనం తుంగభద్రగా మాఱడం అనేది అసంభావితం. అదికూడా ఇక్కడ సంభవిస్తున్నదనే అర్థాన్ని కవి ఆశ్చర్యావహంగా నిర్వహిస్తున్నారు. వాక్కుకు సరస్వతి అనే పర్యాయపదం ఉన్నందువల్ల, మణవాళ మహామునుల శ్రీసూక్తి ప్రవాహం సరస్వతీస్రోతస్సుగా చెప్పబడింది. ఇందులో అవగాహించినవారు– అంటే– శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తిని చక్కగా అనుభవించ గల్గినవారు – తుంగభద్రగా కాగలరు. **"తుంగాని భద్రాణి యస్యా స్సా"**– చాలా గొప్ప శుభాలను కలవారని దీని భావం. తుంగభద్ర ఏ విధంగా ప్రకాశిస్తున్నదో, వీరుకూడా అదే రీతిలో ప్రకాశిస్తారని ఇకపై చెప్పబడుతున్నది.

(కవిభిః సంసేవ్యమానా సమింధే) – కవిశబ్దం విద్వత్‌పరంగా ప్రసిద్ధం. శ్రీవరవరమునిశిష్యజనతా పక్షంలో **"కవిభిః సంసేవ్యమానత్వమ్"** –పండితులచే మిక్కిలిగా గౌరవింపబడే స్థితి– సుస్పష్టం. కవనచాతురిని కలవారు స్వామిని స్తుతించకుండా ఉండలేరు. తుంగభద్రానదీపక్షంలో – **"కం – జలం, వి–పక్షి, నీటి పక్షులు"**– అని కవిశబ్దానికి అర్థంచెప్పాలి. సారసపక్షులచే సేవింపబడడం జలప్రవాహానికి సహజంగా ఉండే స్థితి కదా ! దేశికుల గోదాస్తుతిలోని **"శోణాధరేఽపి కుచయోరపి తుంగభద్రా"** ఇత్యాది శ్లోకరీతిలో ప్రకృత శ్లోకం రచింపబడడం గమనించదగినది. ఇదే వైఖరిలో తరువాతి శ్లోకం కూడా అనుగ్రహింపబడింది.

22. యద్వాణీం మధురా మవాప్య సుధియః సాకేతధామత్యజో
మాయాసంగవిదూరగాశ్చ సుతరాం సంత్యక్తకాశ్యాశ్రయాః ।
కాంచ్యాదిష్వపి నిస్పృహాశ్చ సతతం రామానుజైకాంతినో
రాజంతే స తనోతు సుందరవరో యోగీశ్వరో న శ్శుభమ్ ॥

సుధియః = విద్వాంసులు, మధురాం యద్వాణీమ్ అవాప్య = ఏ మణవాళమహాములు మధురమైన శ్రీసూక్తిని పొంది (ఏ మణవాళ మహామునులయొక్క శ్రీసూక్తి అనే మధురను పొంది), సాకేతధామత్యజః = శ్రీరాముని ఉపేక్షించినవారై (అయోధ్యను విడచినవారై), మాయా సంగవిదూరగాః చ = ప్రాకృతిక సంగంలో అభినివేశాన్ని లేనివారై (మాయాఅనే హరిద్వారలో అభినివేశాన్ని లేనివారై), సుతరాం సంత్యక్తకాశీ+ఆశ్రయాః = కాశిని ఆశ్రయంగా కలవాడైన శివుని విడచినవారై (కాశీనగరంలో ఆశ్రయాన్ని పూర్తిగా విడచిపెట్టినవారై), కాంచ్యాదిషు అపి నిస్పృహాః చ = స్త్రీ భూషణాలలో వ్యామోహాన్ని లేనివారై (కాంచీ మొదలైన నగరాలలో ఆసక్తిని లేనివారై), సతతం రామానుజ+ ఏకాంతినః= ఎల్లప్పుడు భగవద్రామానుజుల విషయంలో ప్రావణ్యాన్ని కలవారై (ఎల్లప్పుడు శ్రీకృష్ణుని పట్ల అనన్యభక్తిని కలవారై) రాజంతే = ప్రకాశిస్తున్నారో, సః సుందరవరః యోగీశ్వరః= ఆ రమ్యజామాతృయోగీశ్వరులు, నః శుభం = మనకు శుభాన్ని, తనోతు = విస్తరింప జేయాలి.

గంగ, యమున, సరస్వతి – అనెడి పుణ్యనదులతో సమానముగను, వానికంటె మించియున్నదిగను ఉన్నదనుచు శ్రీవరవరమునుల శ్రీసూక్తిని పూర్వము వర్ణించిన అణ్ణన్, ఇందు ఉత్తరమధురా అనెడి పుణ్యనగరితో దానికి సామ్యమును ప్రతిపాదించుచున్నారు. **"అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ హ్యవంతికా, పురీ ద్వారవతీ చేతి సప్తైతే మోక్షదాయికాః"** (అయోధ్య, మధుర, మాయ, కాశి, కాంచి, అవంతి, ద్వార – అనే ఈ ఏడు ముక్తిని కల్గించే నగరాలు) అనుచు అయోధ్య మొదలగు ఏడు నగరములను పుణ్యనగరులుగ మహర్షులు కీర్తించిరి. వీనిలో మధురకు ఒక వైలక్షణ్యము కలదు. అది శ్రీకృష్ణుడు అవతరించి బాల్యలీలలను ప్రదర్శించినచోటు కదా ! ఇచట మధుర అనునది గోకులము, గోవర్ధనము, బృందావనములకును ఉపలక్షణము. **"మధురా నామ నగరీ పుణ్యా పాపహరీ శుభా, యస్యాం జాతో జగన్నాథః సాక్షాద్విష్ణు స్సనాతనః"** (మధుర అనే ప్రసిద్ధమైన నగరి పవిత్రమైనవి, పాపాన్ని హరించేది, మంగళకరమైనది. ఆ నగరంలోనే సనాతనుడైన, జగన్నాథుడైన హరి అవతరించాడు) అని కీర్తింపబడుచున్నది కదా ! నమ్మాళ్వార్లు కూడా **"కణ్ణనల్లాల్ ఇల్లై కణ్డీర్ శరణదు నిఱ్కు వన్దు, మణ్ణిన్ పారమ్ నీక్కుదఱ్కే వడమదురై ప్పిఱన్దాన్, తిణ్ణమానుమ్ ముడైమై యుణ్డేల్ అవనడి శేర్న్దుయ్మినో ఎణ్ణవేణ్డా నుమ్మదాదు మవనన్ఱి మఱ్ఱిల్లైయే"** (శ్రీకృష్ణునికంటే అన్యదైవం లేదనే విషయాన్ని స్థాపించడంకోసం, భూభారాన్ని తీర్చడం కోసమే ఉత్తరమధురలో స్వామి అవతరించాడు.

మీవి అనేవి ఉంటే వానిని అతని శ్రీచరణాలలో సమర్పించి తరించండి. మీది అనేది ఒకటి ఉన్నదని భావించవద్దు. అతనిది తప్ప ఇంకొకటి ఏదీ లేదు.) అని పల్కిరి.

ఈ శ్లోకములో శ్రీవరవరమునుల శ్రీసూక్తిని మధురకు సమముగా నిరూపించు చున్నారు. ఉత్తరమధురయు మధురమైనది. శ్రీవరవరమునుల శ్రీసూక్తియు మధురమైనది. మధురను చేరిన, చక్కని వివేకమును కల బుద్ధిని కల్గిన రసికశిరోమణులు అయోధ్య, మాయ (హరిద్వారము), కాశి, కాంచి మొదలగు మిగిలిన నగరములందు ఆశ లేనివారై, రామానుజైకాంతులై- అనగా- బలరామునకు తమ్ముడగు శ్రీకృష్ణునియందే ఏకాంతభక్తిని కలవారై, ఆ స్వామినే అవధిగా తలచియుందురు. అనగా - శ్రీకృష్ణభక్తిలో నిష్ఠను కలవారైయుందురు. అతిమానుషములైన మణవాళమహామునుల శ్రీసూక్తులలో అభినివేశమును పొందిన మహాబుద్ధిశాలురగు సత్పురుషులు జ్ఞానవైరాగ్యభక్తులను కలవారై, హర్మ్యప్రాసాదములను సైతము విడచినవారై - అనగా -వానియందు ఆశ లేనివారై, మాయను- అనగా -మోహమును కల్గించు విషయముల సంగములకు దూరముగా నుండువారై, కాశీవాసియగు దేవతాంతరమును విడచినవారై, కాంచీ- అనగా- మొలనూలు మొదలగు భూషణములయందు కోరికను లేనివారై, లేక, సుందరీమణులు ధరించిన మొలనూలువంటి ఆభరణములలో కోరికను లేనివారై, ప్రాప్యప్రాపకా భాసము లను విడచినవారై- అనగా- పురుషార్థాంతరములలో, సాధనాంతరములలో అన్వయింపని వారై యుందురు.

"రామానుజైకాంతినః" - భగవద్రామానుజులనే ప్రాప్యముగను, ప్రాపకముగను అధ్యవసించి, పరమైకాంతులై, వారి శ్రీచరణములే శరణము అనుచు యతీంద్రప్రవణులై వెల్గుదురు. మణవాళమహామునులు తమను ఆశ్రయించినవారికి తమవలెనే యతీంద్ర ప్రావణ్యమును కల్గినవారినిగా చేయుదురని తాత్పర్యము. యోగిశ్రేష్ఠులగు ఆ శ్రీమణవాళమహామునులు మనకు కల్యాణమును (శుభమును మంగళమును) అధికాధికముగా కల్గింతురుగాక!

"అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ హ్యవంతికా, పురీ ద్వారవతీ చైవ సప్తైతా మోక్షదాయికాః" అనే ఏడు పుణ్యనగరులు పురాణప్రసిద్ధాలు. వాటిలో ముముక్షువులు అభినివేశం కల్గి ఉండాలన్నది తగిన విషయమైనా, శ్రీమణవాళ మహామునుల శ్రీసూక్తి రసికులకు వాటిలో రుచి లేకపోవడాన్నిగూర్చి శ్లేషభంగిమలో అణ్ణన్ ఇందులో రస్యంగా అనుగ్రహిస్తున్నారు.

(యద్వాణీం మధురా మవాప్య) - ఈ ప్రయోగాన్ని రెండు విధాలుగా అన్వయించాలి. యథామూలంగా ఒక యోజన; **"మధురాం యద్వాణీ మవాప్య"** అని ఇంకొక యోజన. మధురమైన శ్రీవరవరమునుల సూక్తిలో అవగాహించి అని,

శ్రీవరవరమునుల శ్రీసూక్తులనే మధురాపురిని పొంది– అని ఈ రెండు యోజనలలోని భావం. శ్రీవరవరమునుల శ్రీసూక్తి ఏవిధంగా మధురాపురి అవుతుంది ? అనే ప్రశ్నకు తావు లేదు. శ్రీసూక్తి మధురంగా ఉండడంలో అడ్డు ఏమున్నది ? **"మధురా నామ నగరీ పుణ్యా పాపహరీ శుభా"** అని పొగడబడ్డ మధురను చేరినవారికి మిగిలిన స్థలాలు ఏవీ రుచించవుకదా. **"మధురాం ప్రాప్య గోవిందః కథం గోకుల మేష్యతి"–** (మధురను చేరిన తరువాత గోవిందుడు రేపల్లెకు ఏవిధంగా రాగలడు?) అనికదా రేపల్లెలోని గోపికలుకూడా పలికారు. మధుర చాలా దగ్గరలో ఉన్నా అప్రాప్యమైనపుడు, దానికంటే చాలా దూరంలో ఉండే అయోధ్య, కాశి, కాంచి, మొదలైన స్థలాలు ప్రాప్యాలు కాకపోవడంలో ఏమి ఆశ్చర్యం ! శ్లోకంలో ఆ విషయం ఇక తెలుపబడుతున్నది.

(సాకేతధామత్యజః) – సాకేతమని అయోధ్యకు పేరు. **"సాకేత ఇతి ధామ, సాకేతధామ. తత్ త్యజంతీతి సాకేతధామత్యజః".** మధురను పొందినవారు అయోధ్యాస్థానాన్ని విడచిపెట్టినవారవుతున్నారు– అని ఒక అర్థం. మధురమైన శ్రీసూక్తి ద్వారా శ్రీమణవాళమహామునులపట్ల అభినివేశాన్ని పొందినవారుకూడా **"సాకేతధామత్యజః"** –సాకేతధాముని విడచినవారే. **"సాకేతః ధామ యస్య సః – సాకేతధామా"** అనే బహువ్రీహిసమాసంవల్ల అయోధ్యను నివాసంగా కల్గిన శ్రీరాముడు సాకేతధాముడు– అని ప్రకృతంలో అర్థాన్ని వివక్షితంగా చేసికొని, భగవద్విషయాన్ని కూడా ఉపేక్షించారని ఇంకొక అర్థం చెప్పవచ్చు.

(మాయాసంగవిదూరగాః) – హరిద్వారక్షేత్రానికి మాయాపురి అని పేరు. దానిలో సంగాన్ని లేనివారు– అనేది మొదటి అర్థం. **"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యజా"** (ఈ త్రిగుణాత్మకమైన, దివ్యమైన నా మాయ దాటలేనిది) అని గీతాచార్యుడు పల్కిన మాయాశబ్దవాచ్య అయిన ప్రకృతియొక్క బంధానికి లోనుకానివారు –అనేది ముఖ్యమైన అర్థం.

(సంత్యక్తకాశ్యాశ్రయాః) – కాశీపట్టణం అనే ఆశ్రయాన్ని విడచిపెట్టినవారని ఒక అర్థం. **"కాశీ ఆశ్రయః యస్య సః కాశ్యాశ్రయః (శివః), సంత్యక్తః కాశ్యాశ్రయః యై స్తే"** అనే వివరణాన్నిబట్టి కాశీనగరాన్ని ఆశ్రయంగా కల్గిన శివుని ఉపేక్షించినవారనేది ముఖ్యమైన అర్థం.

(కాంచ్యాదిష్వపి నిస్పృహాః) – ఆదిశబ్దంచేత అయోధ్యా, మధురాదులతో సహపఠితాలైన అవంతికను, ద్వారకనుకూడా గ్రహించవచ్చు. కాంచీ మొదలైనవానిని సైతం గర్హించారు – అని ఒక అర్థం. **'కాంచీ'** అనే పదం స్త్రీభూషణవిశేషవాచకం (మొలనూలును నిర్దేశిస్తుంది) దానిచే ఉపలక్షితాలైన సౌందర్యలావణ్యాదులను వివక్షించి, వాటిలోకూడా మనస్సు ఆసక్తం కాదు– అనేది ఇక్కడి ముఖ్యమైన అర్థం. ఈ విధంగా

మణవాళ మహామునుల శ్రీసూక్తులలో రాసిక్యాన్ని కలవారి రీతిని తెలిపినట్లయింది. ఇటువంటివారిచే సేవింపబడే శ్రీవరవరమునులు మనకు మంచిని కలిగించాలి– అని శ్లోకభావం.

23. యద్వాణీ మపరాజితాం మధుజిదుల్లాసాస్పదం సంతతం
శేషాహీనబలద్విజేంద్రమహితాం ముక్తావలీబంధురామ్ ।
శుద్ధ స్సంప్రతిపద్య హృష్యతి జనో నోపైతి పాపోత్తరః
తస్మాత్కాంతవరా న్మునే రనుపమా ద్దైవం పరం నాద్రియే ॥

జనః = శిష్యజనం, మధుజిత్+ఉల్లాస+ఆస్పదం = మధువు కంటే తీయని గొప్పతనానికి ఆస్పదము (మధుజిత్ అనబడే భగవానుని ఆనందానికి ఆస్పదము), సతతం= ఎల్లప్పుడు, శేష+అహీనబలిద్విజేంద్రమహితాం = శేషభూతులై, ఏకొఱత లేని సత్కారాన్ని కలవారైన శ్రీవైష్ణవులచే సేవింపబడినది (ఆదిశేషుడనే సర్పరాజు, గొప్ప బలాన్ని కల విష్వక్సేనుడు, గరుడుడు – అనే వీరిచే సేవింపబడినది), ముక్తావలీబంధురామ్ = ముత్యాల మాలవలె అందమైనది (ముక్తుల సమూహంతో నిండినది) అయిన, యద్వాణీం = ఏమణ వాళమహామునుల శ్రీసూక్తి అనే, అపరాజితాం = పరమపదాన్ని, సంప్రతిపద్య = పొంది, శుద్ధః = పవిత్రమైనదై, నిర్ధూతపాప+ఉత్కరః = పాపసమూహాలను విదలించు కొన్నదై, హృష్యతి = సంతోషిస్తున్నదో, తస్మాత్ = ఆ, కాంతవరాత్ మునేః = రమ్యజా మాతృమునులకంటే, పరం దైవం = వేఱొక దైవాన్ని, న+ఆద్రియే = ఆదరించను.

ఈ శ్లోకంలో మణవాళమహామునుల శ్రీసూక్తిని అపరాజితగా నిరూపించుచున్నారు. అపరాజిత అనునది శ్రీవైకుంఠదివ్యనగరముయొక్క తిరునామము. **"అపరాజితా పూర్బ్రహ్మణః"** అని కౌషీతక్యుపనిషత్తు అన్నది. **"యోఽ యోధ్యేత్యపరాజితేతి విదితా నాకం పరేణ స్థితా"** (అయోధ్య అని, అపరాజిత అని ప్రసిద్ధి పొందినది, స్వర్గానికి ఆవలి వైపున ఉన్నది) అని భట్టర్ శ్రీసూక్తి. ఇందలి విశేషణములు శ్రీవైకుంఠనగరమునకును, మణవాళ మహామునుల శ్రీసూక్తులకును ఒప్పును. **"అపరాజిత"** అను శ్రీవైకుంఠ దివ్యనగరము మధుసూదనుడగు భగవానునకు ఉల్లాసభూమి– అనగా భోగభూమి. మఱియు– శేషుడు అనగా ఆదిశేషుడు; అహీనబలుడు. అనగా– అసంఖ్యాతబలమును కల విష్వక్సేనుడు; ద్విజేంద్రుడు అనగా – పక్షిరాజగు గరుత్మంతుడు వీరిచే సేవింపబడునదియైయున్నది. ముక్తపురుషుల పంక్తులచే పరివేష్టితమై, అందముగా వెలుగుచున్నది. అట్టి దివ్యనగరిని ప్రకృతిబంధవినిర్ముక్తుడై, శుద్ధుడైనవాడే పొంది, పరబ్రహ్మానుభవముతో ఆనందమును పొందును.

"పాపోత్తరః న ఉపైతి" – పాపిష్ఠుడు దానిని పొందలేడు. **"నిర్ధూతపాపోత్కరః"** అను పాఠమున పాపరాశిని ఎగురగొట్టుకొనినవాడని అర్థము. అట్టి శుద్ధుడే

పరమపదమును పొంది, బ్రహ్మానందమును పొందునని తాత్పర్యము. ఆ రీతిలోనే, శ్రీవరవరమునుల శ్రీసూక్తియు అపరాజిత. ఎవరిచేతను జయింపబడనిది. ఇతర మతములవారి దుర్వాదములచే భంగమును పొందనిది. భగవానుని ముఖోల్లాసమునకు స్థానమైనది. ఆదిశేషునితో (సమానమైన) కొఱతలేని బుద్ధిని, బలమును కల శ్రీవైష్ణవులగు బ్రాహ్మణశ్రేష్ఠులచే పూజింపబడునది. ముక్తామాలవలె- ముత్యమువంటి సదుక్తులచే కూర్పబడి, మనోహరముగా వెలుగునది. పాపియైనవాడు శ్రీవరవరమునుల శ్రీసూక్తిని వినెడి భాగ్యము లేనివాడు. పుణ్యశాలియై, శుద్ధుడైయున్నవాడే మణవాళమహామునుల శ్రీసూక్తిని విని, ఆనందమును పొందును. ఇట్టి శ్రీసూక్తివైభవమును కలవారై, సాటి లేని వారగు శ్రీవరవరమునులను తప్ప వేఱొక దైవమును నేను ఆదరింపను-అని శ్లోకభావము.

ఈ శ్లోకంలో మణవాళమహామునుల శ్రీసూక్తిని పరమపదంగాను, ఆ శ్రీసూక్తిని సేవించడంలో తాత్పర్యాన్ని కల శిష్యులను ముక్తులుగాను నిరూపించే అందం అత్యద్భుతం.

(యద్వాణీమ్ అపరాజితామ్) - "వివేశాపరాజితా" అనే తైత్తిరీయారణ్యక వాక్యానుసారం పరమపదానికి **"అపరాజితా"** అనే ఇంకొక పేరున్నది. శ్రీపరాశరభట్టర్ శ్రీగుణరత్నకోశంలో **-"యాఽయోధ్యేత్యపరాజితేతి విదితా నాకం పరేణ స్థితా"** (అపరాజిత అని, అయోధ్య అని ప్రసిద్ధమైన నగరం ఏది ఉన్నదో, అది స్వర్గానికి ఆవలి వైపున ఉన్నది) **"యో బ్రహ్మకోశోఽ స్త్యపరాజితాఖ్యః"** అని శ్రీరంగరాజస్తవంలో అని పల్కడం గమనించవచ్చు. శ్రీమణవాళమహామునుల శ్రీసూక్తి అపరాజితవలె- పరమపదం వలె- ఉన్నది. **"పరాజితా న భవతీతి అపరాజితా"** -ఎక్కడ ఏనాడూ పరాజయాన్ని పొందదు - అని భావం.

(మధుజిదుల్లాసాస్పదమ్) - "మధుజిత్" అనే పదం మధుకైటభసంహర్త అయిన భగవానుని నిర్దేశిస్తుంది. అతని ఉల్లాసానికి ఆస్పదం పరమపదం. శ్రీవరవరమునుల శ్రీసూక్తి పక్షంలో- తేనెను జయించగల గొప్పతనాన్ని కల్గినదని భావం. ఆస్పదశబ్దం నిత్యపుంలింగం కనుక, ఇక్కడ బహువ్రీహిసమాసం కానందువల్ల, **"ఆస్పదమ్"** అనే ఉండాలి.

(శేషాహీనబలిద్విజేంద్రమహితామ్) - అని పాఠాంతరం. పరమపదం, శేష = ఆదిశేషుడనే, అహి+ఇన-సర్పరాజు, బలిద్విజ+ఇంద్రమహితామ్ = మిక్కిలి బలాన్ని కల పక్షిరాజు అయిన గరుడుడు - అనే వీరిచే సేవింపబడేదిగా ఉంటుంది. ఇక, శ్రీవరవరమునుల శ్రీసూక్తి, శేష = సర్వాత్మనా తనకు శేషభూతులు, అహీన= చాలా గొప్పవారు, బలి = **"కులన్దరుమ్"** (కులాన్ని ఇస్తుంది) ఇత్యాది పాశురంలో చెప్పబడ్డ, **"వలన్తరుమ్"** (బలాన్ని ఇస్తుంది) అనే రీతిలో భగవదనుభవానికి తగిన బలాన్ని పొందినవారు అయిన, ద్విజేంద్ర= శ్రీవైష్ణవులచే (బ్రాహ్మణోత్తములచే), మహితాం -

కీర్తింపబడేదై ఉంటుంది. లేక, **"అహీన"** అనే శబ్దాన్ని **"ద్విజేంద్ర"** శబ్దానికి విశేషణం చేయకుండా, **'బలి'** అనే పదానికి విశేషణంగా చేసి, **"అహీనః బలిః యేషాం తే అహీనబలయః, తథావిధైః ద్విజేంద్రైః మహితామ్"** అనే వ్యుత్పత్తిని గ్రహించవచ్చు. **'బలి'** అని పూజకు పేరు. అంటే -సత్కారం. అహీనమైన సత్కారాన్ని కలవారు అంటే- అంతటా సత్కరింపబడదగినవారని భావం. ఏ దివ్యదేశంలో అయినా శ్రీవరవరమునుల సంబంధాన్ని కలవారికి సత్కారవిశేషాలు చేయబడతాయికదా! అందువల్ల ఈ అర్థాన్ని గ్రహించడంలో అడ్డు లేదు.

(ముక్తావలీబంధురామ్) - పరమపదం **"ముక్తానామ్ ఆవలీభిః"** - ముక్తాత్మల సమూహాలతో అందాన్ని పొంది ఉంటుంది. శ్రీవరవరమునుల దివ్యసూక్తి పంక్తి పక్షంలో- ముత్యాల వరుసవలె శుద్ధమై, స్పృహణీయమై ఉంటుంది. ఈవిధంగా శ్రీవరవరమునుల శ్రీసూక్తి పరమపదంతో పోలి ఉంటుంది అని అర్థం. ఇక, మూడవ పాదంతో పరమపదాన్ని చేరిన ముక్తాత్మలకు, శ్రీవరవరమునుల శ్రీసూక్తులను సేవించే శిష్యజనాలకు సామ్యం చెప్పబడింది. పరమపదాన్ని పొందిన జనం-

(నిర్ధూతపాపోత్కరః శుద్ధః హృష్యతి) - "తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్య ముపైతి" (అపుడు బ్రహ్మజ్ఞానాన్ని పొందినవాడు పుణ్యపాపాలను విదల్చుకొని ప్రకృతి సంబంధం లేనివాడై, పరమాత్మతో పరమసామ్యాపత్తిని పొందుతున్నాడు.) అనే రీతిలో పాపాలను విదలించుకొని, శుద్ధిని పొందినవారై, **"రసో వై సః, రసం హ్యేవాయం లబ్ధ్వా౽నందీ భవతి"** (ఆ పరమాత్మ రసస్వరూపి కదా ! ఈ ముక్తపురుషుడు రస స్వరూపి పరమాత్మను పొంది ఆనందాన్ని కలవాడవుతున్నాడు) అనే రీతిలో ఆనందాన్ని పొందుతున్నారు. ఇక, శ్రీవరవరమునుల శిష్యసమూహం. **"పాపానాం పాపిష్ఠానాం కుమతీనా ముత్కరో నిర్ధూతో యేన"** అనే వ్యుత్పత్తినిబట్టి పాపిష్ఠివారిని విదల్చికొట్టి, త్రికరణశుద్ధియుక్తమై, నిత్యనందశాలియై వెలుగుతున్నది. ఇటువంటి శ్రీసూక్తులను అనుగ్రహించే శ్రీవరవర మునులకు మించిన దైవాన్ని దేనినీ నేను తెలియను- అని శ్లోకభావం. **"ఆచార్యాదిహ దేవతాం సమధికా మన్యాం న మన్యామహే"** (ఆచార్యుని కంటే ఇంకొక గొప్ప దేవతను నేను భావించను.) అని కదా అభిజ్ఞసూక్తి.

24. యద్వాణీవిరజావగాహనకలాధౌతాత్మనా మాత్మనాం
ప్రజ్ఞాతర్జితనిర్జరేశ్వరగురుప్రౌఢిం సమాఢౌకతే ।
భక్తిః శ్రీశతదీయదేశికపదాధారా జరీజృంభతే
ముక్తి ర్యాతి కరాపచేయఫలతాం సో౽వ్యాద్వరో౽స్మాన్మునిః ॥

యద్వాణీ = ఏమణవాళమహామునుల శ్రీసూక్తి అనే, విరజా + అవగాహన కలాధౌతాత్మనాం = విరజానదిలో స్వల్పంగా అవగాహించడంచేత పవిత్రమైన స్వరూపాన్ని కలవారి, ఆత్మనాం = ఆత్మలయొక్క (మహాత్ములయొక్క), ప్రజ్ఞా = బుద్ధి, తర్జితనిర్జరేశ్వర

గురుప్రౌఢిం = బృహస్పతియొక్క గొప్పతనాన్ని సైతం జయించిన గొప్పతనాన్ని, సమాటీకతే = పొందుతున్నదో, భక్తిః = భక్తి, శ్రీశతదీయదేశికపద+ఆధారా= శ్రియఃపతియొక్క, ఆ స్వామి భక్తులయొక్క, ఆచార్యులయొక్క, శ్రీచరణాలను ఆధారంగా కల్గినదై, జరీజృంభతే = వృద్ధి అవుతున్నదో, ముక్తిః = ముక్తి, కరాపచేయఫలతాం = చేతితో కోసుకోదగిన ఫలం యొక్క స్థితిని, యాతి = పొందుతున్నదో, సః వరమునిః అస్మాన్ అవ్యాత్ = ఆ సుందర జామాతృముని మలను రక్షించాలి.

ఏ శ్రీమణవాళమహామునుల నిర్మలమైన శ్రీసూక్తి అనెడి విరజానదిలో స్నానమును చేయునట్టి నైపుణ్యముచే పరిశుద్ధమనస్కులగు చేతనుల జ్ఞానము, బుద్ధి, బృహస్పతియొక్క బుద్ధిని సైతము భయపెట్టునదియై, విలసిల్లుచున్నదో, ఆ చేతనులకు శ్రియఃపతియగు భగవానునిపట్ల గల భక్తిప్రావణ్యము మఱింతగా వృద్ధియగుచున్నదో, వారికి మోక్షఫలమును కైవసము అగుచున్నదో, ఆ శ్రీవరవరమునులు మనలను రక్షింతురుగాక!

ఈ శ్లోకంలో మణవాళమహామునుల దివ్యసూక్తిలో అవగాహించిన పరమభాగ్య శాలుర జ్ఞానభక్తి ప్రభావం విలక్షణమని కీర్తింపబడుతున్నది. శ్రీవరవరమునులు ధీభక్త్యాది గుణార్ణవులుకనుక, **"తమ్మైయే నాళుమ్ వణఙ్గి త్తొழுవార్క్కు తమ్మైయేయొక్క అరుళ్ శెయ్‌వర్"** (తమనే ప్రతిదినం నమస్కరించి సేవించేవారికి తమతో సమానంగా ఉండేటట్లు అనుగ్రహిస్తాడు) అనే రీతిలో తమ శ్రీచరణాలను ఆశ్రయించినవారినికూడ అనుగ్రహించి జ్ఞానభక్త్యాది గుణార్ణవులుగా చేసే రీతిని ఈ శ్లోకం తెలుపుతున్నది. శ్రీవరవరమునుల శ్రీసూక్తి పరమపదంతో సమానంగా ఇంతకుముందు శ్లోకాలలో వర్ణింప బడింది. ఇందులో విరజానదిగా వర్ణింపబడుతున్నది. విరజానదిలో స్నానం చేయగల్గినవారికి జ్ఞానవికాసం, భక్తిసమృద్ధి, ముక్తిసన్నికర్షం కలిగేటట్లే, శ్రీవరవరమునుల శ్రీసూక్తి ప్రవాహంలో అవగాహించినవారికి కూడా అవి కల్గడంలో ఆశ్చర్యం లేదుకదా !

(యద్వాణీ విరజావగాహనకలాధౌతాత్మనా మాత్మనామ్) – 'కలా' అనే పదానికి ఏకదేశమనే అర్థం ఉన్నది. ముక్తుడు కావాలంటే సీమాంతసింధువైన విరజలో పరిపూర్ణావగాహం చేయాలి. ఇక్కడ ఆ నిర్బంధం లేదు. శ్రీవరవరమునుల దివ్యసూక్తి ప్రవాహం కళలో– అంటే– ఏకదేశంలో అవగాహించినా, అది జ్ఞానభక్తుల సమృద్ధికి చాలు. **"నిర్జరేశ్వరగురు"** అనే పదం దేవగురువైన బృహస్పతిని తెల్పుతుంది. **"బృహస్పతి ర్దేవానాం పురోహిత ఆసీత్"** అని వేదంకూడా పలుకుతున్నది. శ్రీవరవరమునుల శ్రీసూక్తులను ఆస్వాదించే విద్వాంసుల ప్రజ్ఞ. ఆ బృహస్పతియొక్క ప్రజ్ఞను సైతం జయించిన గొప్పతనాన్ని కల్గినది. **"స్మృతి ర్వ్యతీతవిషయా మతి రాగామిగోచరా, బుద్ధి స్తాత్కాలికీ ప్రోక్తా ప్రజ్ఞా త్రైకాలికీ మతా"** (స్మృతి అనేది గడచిన విషయానికి సంబంధించినది, మతి అంటే భవిష్యత్తుకు సంబంధించినది, బుద్ధి అనేది తాత్కాలికమైనది, ప్రజ్ఞ– మూడు కాలాలకు చెందినది) అనే రీతిలో త్రికాలావగాహి అయిన బుద్ధివిశేషానికి ప్రజ్ఞ అని పేరు.

(భక్తిః శ్రీశతదీయదేశికపదాధారా జరీజృంభతే) - "శ్రీశశ్చ తదీయాశ్చ దేశికాశ్చ" - శ్రీశతదీయదేశికాః, తేషాం పదాని ఆధారో యస్యా స్సా" - విరజానదీప్రవాహంలో అవగాహనం చేసినవారు, శ్రీమన్నారాయణునియొక్క, ఆ స్వామి భక్తులయొక్క, ఆచార్యులయొక్క శ్రీచరణాలలో స్థిరంగా ఉండే భక్తిని పొందగలరు. అక్కడికి చేరినవారు భగవానుని శ్రీచరణపద్మయుగ్మమాత్రంతో నిలువడం లేదు. **"మద్దేవతైః పరిజనైః తవ సంగసీయ"** (నాకు దైవాలైన నీ పరిజనాలతో నన్ను కలుపు) అని, **"అడియార్కళ్ కుళ్ఙ్గళుడన్ కూడువతు ఎన్నుకొలో !"** (భగవద్భక్తుల సమూహంతో కలిసేది ఎపుడో కదా !) అని ఆశపడిన రీతిలో **"అన్దమిల్ పేరిన్బత్తు అడియరోడిరున్దు"** (అంతం లేని గొప్ప ఆనందాన్ని కల్గిన దాసులతో కలసి ఉండి) అనే రీతిలో తదీయశేషత్వాన్నికూడా పొందుతారు. అంతేకాదు, **"అత్ర పరత్ర చాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్"** (ఈలోకంలో, పరమపదంలోను ఏ ఆచార్యుల శ్రీచరణాలు రెండు నాకు నిత్యం శరణమో) అనే భగవద్యాముసుల సూక్తి రీతిలో ఆచార్యపాదారవింద ప్రావణ్యాన్నికూడా పొందుతారు. వీటిని అన్నిటినీ విరజావగాహనాన్ని చేసి, పరమపదాన్ని చేరి పొందడంలో ఆశ్చర్యం లేదు. **"ఇజ్గే కాణ ఇప్పిఱప్పే మకిழ్వర్ ఎల్లియుమ్ కాలైయే"** (ఇక్కడే ఈ జన్మలోనే అందఱు చూస్తూ ఉండగానే రాత్రింబగళ్ళు ఆనందిస్తారు) అనే రీతిలో వరవరమునుల శ్రీసూక్తులనే విరజానదిలో ఏకదేశంలో అవగాహనం చేసినవారు ఈలోకంలోనే నిత్యం పొందడం విశేషం. **"విణ్ణులారిలుమ్ శీరియరే"** (నిత్యసూరుల కంటే గొప్పవారు) అనే రీతిలో నిత్యసూరుల కంటే గొప్పవారై ఉండే అతిశయం వీరికేకదా ఉన్నది. కావున ఇటువంటి గొప్పతనాన్ని కల్గిన శ్రీసూక్తులను అనుగ్రహించిన శ్రీవరవరమునులు మనలను రక్షించాలి- అని శ్లోక భావం. **"జరీజృంభతే"** - అంటే ఎక్కువ అభివృద్ధి చెందుతున్నదని భావం. ఇది యజంతప్రయోగం.

25. యచ్ఛిష్యా స్తిష్యడింభప్రతిమకుమతిదుస్తర్కసంపర్కజాత-
త్రయ్యంతస్వాపరూపాప్రతిమనిరవధిధ్వాంతకల్పాంతసూర్యాః।
శ్రీమద్రామానుజార్యోదితమతమమతామూర్తయః కీర్తిమంతో
జాగ్రత్యస్మై నమస్తాత్ వరవరమునయేఽనంతనిస్తుల్యభూమ్నే ॥

యచ్ఛిష్యాః = ఏ మణవాళమహామునుల శిష్యులు, తిష్యడింభప్రతిమకుమతి = కలిపురుషుని కుమారులతో సమానులైన దృష్టుల, దుస్తర్కసంపర్కజాత = దుస్తర్కాల సంబంధంవల్ల కల్గిన, త్రయ్యంతస్వాపరూప = వేదాంతాల నిద్రరూపంలోని, అప్రతిమ = సాటిలేని, నిరవధి = అంతు లేని, ధ్వాంత = చీకటిని పోగొట్టే, సూర్యాః= సూర్యుని వంటివారు, శ్రీమద్రామానుజార్య +ఉదితమత = భగవద్రామానుజాచార్యుల వారివల్ల ఉదయించిన దర్శనసంపట్ల, మమతా = భక్తియే, మూర్తయః = మూర్తయః = మూర్తీభ

వించినవారుగా, కీర్తిమంతః = యశస్సును కలవారుగా, జాగ్రతి = వెలుగుతున్నారో, అనంతనిస్తుల్యభూమ్నే = అంతు లేని, సాటి లేని గొప్పతనాన్ని కల్గిన, అస్మై వరవరమునయే = ఈ శ్రీవరవరమునులకు, నమః స్యాత్ = నమస్కారం అగుగాక !

ఏ మణవాళమహామునుల శిష్యులు, కలిపురుషుని పుత్రులతో సమానులగు కుదృష్టివాదులు చేయు శ్రుతివిరుద్ధములగు దుస్తర్కముల (వితండవాదముల) యొక్క సంబంధమువలన ఏర్పడిన వేదాంతమూర్ఛ అనెడి సాటిలేని అంధకారమును (దట్టమైన చీకటిని) పోగొట్టుటలో ప్రళయకాలసూర్యులవలె వెలుగుచున్నారో, (**"తిష్యః"** – కలిపురుషుడు, **"డింభః"**– శిశువు) మఱియు, శ్రీరామానుజులు ప్రకాశింపజేసిన **"ఎమ్బెరుమానార్ దరిశనమ్"** అను పేరుతో ప్రసిద్ధమైన విశిష్టాద్వైతమతములో మమతను, అనగా– అభిమానమును స్వరూపసిద్ధముగనే కల్గినవారై, ఎనిమిది దిక్కులలో వ్యాపించిన కీర్తిని కలవారై, విశిష్టాద్వైతసిద్ధాంతమును స్థిరీకరించుటలో సదా జాగరూకులై, ఎల్లప్పుడు శ్రద్ధగా నుందురో, అంతు లేని, నిస్సమాభ్యధికమైన వైభవమును కల ఆ శ్రీమణవాళ మహామునుల పాదద్వంద్వమునకు నా ప్రణామము అగుగాక!– అని శ్లోక భావము.

మణవాళ మహామునుల తిరువడి సంబంధమును కల్గిన శ్రీవైష్ణవోత్తములు ఉభయవేదాంత ప్రవర్తకాచార్యులై, భగవద్రామానుజదర్శనమును ప్రవర్తింపజేయుచు, కుదృష్టుల వాదములను నిరసించుచు, శిష్యప్రశిష్యపరంపరగా ఈ భూలోకములో ప్రకాశించుచున్నారు. కుదృష్టుల దుస్తర్కములచే వేదాంతశాస్త్రము బాధింపబడి మూర్ఛను పొందినది. అందుచే లోకములో నిజమైన జ్ఞానము నశించి, అజ్ఞాన–అన్యథాజ్ఞాన–విపరీత జ్ఞానములను అంధకారము వ్యాపించినది. ఈ చీకటిని భగవద్రామానుజదర్శనమును వృద్ధి పొందించు శ్రీవరవరమునుల శిష్యులు పారద్రోలి, యథార్థజ్ఞానమును లోకులకు ఉపదేశించి, లోకమున శ్రీవైష్ణవసమృద్ధిని మిక్కిలిగా వృద్ధి పొందించుచున్నారు. ఇట్టి శిష్యసమృద్ధిని కల శ్రీమణవాళమహామునుల పాదద్వయమందు దాసుడనగు నేను ఎల్లప్పుడు నమస్కరింతునని శ్లోకసారము. **"తిష్యడింభప్రతిమ"** అనుటకు బదులుగా **"తిష్యడింభప్రథిత"** అను పాఠభేదము కలదు. అపుడు, కలికోలాహలమే మూర్తీభవించిన వారని ప్రసిద్ధిజెందిన కుమతులు – అని అర్థము.

ఈశ్లోకంలో మణవాళమహామునుల శిష్యుల దర్శననిర్వాహధురంధరత్వం వర్ణింప బడుతున్నది. మూడు అద్భుతవిశేషణాలను ప్రయోగింపబడడంద్వారా ఈ విషయం నిర్వహింప బడుతున్నది. శ్లోకంలోని మొదటి రెండు పాదాలలో **"తిష్యడింభ"** అనే పదం నుండి ఒకే సమాసం.

(తిష్యడంభ...... సూర్యాః) – తిష్యశబ్దం కలిపురుషుని నిర్దేశిస్తుంది. డింభశబ్దం కోలాహలవాచకం. కలిపురుషుని కోలాహలమే రూపుదిద్దుకొన్నట్లుగా ప్రసిద్ధిని పొందినవారు

కుదృష్టులు. వారు చేసేవి అన్నీ కుతర్కాలు. **"ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రావిరోధినా, యస్తర్కేణానుసంధత్తే స ధర్మో వేద నేతరః"** (మహర్షి ప్రోక్తాలైన పురాణాలను, ధర్మశాస్త్రాలను వేదాలనే శాస్త్రాలకు విరోధం లేకుండా అనుకూల తర్కాలతో ఎవడు అనుసంధిస్తాడో, అతడే ధర్మాన్ని తెలియగలడు, ఇంకొకడు తెలియలేడు) అనే రీతికి వ్యతిరేకంగా చేసే తర్కాలు అన్నీ దుస్తర్కాలేకదా! అటువంటి దుస్తర్కసంపర్కంచేత వేదాంతాలు నిద్రపోయాయి. అందువల్ల అజ్ఞానమనే చీకటి కమ్ముకొన్నది. ఆ చీకటిని పారదోలడానికి **"కతిరాయిర మిరవి కలన్దెరిత్తాల్"** (కిరణాలు కల వేయి సూర్యులవలె ప్రకాశించే) అనే రీతిలో వెలిగేవారు, శ్రీవరవరమునుల శిష్యులు. వారు ఇంకా ఎటువంటివారు? అంటే,

(శ్రీమద్రామానుజార్యోదిత....మూర్తయః) – "అఖిలతమః కర్శనం దర్శనం నః" (అజ్ఞానమనే చీకటిని అంతటిని పోగొట్టే మన దర్శనం) అని కీర్తింపబడే భగవద్రామానుజ దర్శనంలోని అభిమానమే మూర్తీభవించిందా? అని భావించే రీతిలో ఉన్నవారు. **"మమతా"** అనే పదం ప్రేమవాచకం. **"మమతామూర్తయః"** – ప్రేమ మూర్తీభవించినవారు –అని అర్థం.

(కీర్తిమంతః) – శ్రీమద్వరవరమునులశిష్యులనే, తద్దివ్యసూక్తిరసికులనే, భగవద్రామానుజసిద్ధాంతనిర్ధారణ సార్వభౌములనే కీర్తిని పొందినవారు. ఇటువంటి శిష్యుల సమృద్ధిని కల్గిన శ్రీవరవరమునులనే నమస్కరించి, ఉజ్జీవిద్దాం– అని భావం.

26. అనిమిషతను బ్రహ్మ నిర్వేదభావనిబంధనం
భజతి కిల య శ్శ్రీమన్మత్స్యావతారతులాం హరేః ।
స జయతి సతాం సంఘ స్సౌమ్యోపయంతృసమాశ్రయః
తమిహ సతతం చేత! స్సేవస్వ సద్గుణశేవధిమ్ ॥

సౌమ్యోపయంతృసమాశ్రయః = శ్రీవరవరమునులను ఆశ్రయంగా కల, యః సతాం సంఘః = ఏ సత్పురుషుల సమూహం, బ్రహ్మ నిర్వేద భావ నిబంధనం = వేదములకు, బాహ్య–కుదృష్టి వాదులు పల్కు అపార్థములవలన కల్గిన నిర్వేదమును కారణముగా పరిగ్రహించినది (బ్రహ్మకు కల్గిన నిర్వేదమును కారణముగా కల్గినది), అనిమిషతనుః = సదాజాగరూకమై యుండునది (రెప్పపాటు లేని తనువును కల్గినది) అయిన, హరేః శ్రీమత్ మత్స్యావతారతులాం = భగవానుని మత్స్యావతారముతో సామ్యమును, భజతి కిల = పొందుచున్నది కదా, సః = ఆ సత్పు రుషుల సంఘం, జయతి=వర్ధిల్లుతున్నది, చేతః=ఓ మనసా!, సద్గుణ శేవధిమ్= సద్గుణనిలయులైన, తం = ఆ వరవరమునులను, ఇహ సేవస్వ = ఈ లోకంలో ఆరాధింపుమా!

ఈ శ్లోకము మొదలు పది శ్లోకములలో అణ్ణన్ శ్రీవరవరమునుల భక్తవర్గము ఒక్కొక్క రీతిలో భగవానుని దశావతారసమానమైయున్నదని శ్లేషాలంకారప్రక్రియలో

నిరూపించు చున్నారు. ఇట్లు నిరూపించుట కవిసమయము. ఏ మణవాళమామునులను ఆశ్రయించిన భక్తవర్గము భగవానుని మత్స్యావతారసామ్యమును పొంది వెలుగుచున్నారో, సద్గుణములకు నిధియైన ఆ శ్రీవరవరమునులను, ఓ మనసా! నీవు ఎల్లప్పుడు కొలిచి, ఉజ్జీవింపుము–అని శ్లోకభావం.

బ్రహ్మ అవాంతరప్రళయములో నిద్రించుచుండగా, అతని ముఖములనుండి నాల్గు వేదములును నాల్గు శిశువులుగా ఆవిర్భవించి, ఆడుకొనుచుండెను. అపుడు హయగ్రీవుడను అసురుడు ఆ వేదములను అపహరించి, ప్రళయజలములో వాటిని దాచగా, బ్రహ్మ నిద్రనుండి లేచి, తనకు ధనముగను, నేత్రములుగనునుండు వేదములు లేకపోవుటచే మోహమును పొంది, నిర్వేదమును (మనోవేదనను) చెంది, శ్రీహరిని ధ్యానించెను. భగవానుడు మత్స్యావతారమును ఎత్తి ప్రళయజలములో మునిగియున్న ఆ అసురుని వధించి, నాల్గు వేదములను తెచ్చి బ్రహ్మకు తిరిగి ఇచ్చి, అతని దుఃఖమును తీర్చెను. ఇట్లు బ్రహ్మకు కల్గిన నిర్వేదమును, అనగా – మనోవేదనను పోగొట్టుటకై మత్స్యావ తారమును భగవానుడు ఎత్తెను.

మత్స్యమూర్తి అనిమిషతనువు. మత్స్యము రెప్పపాటు లేని కన్నులను కల్గియుండునుకదా! మత్స్యములకు జలధిలో ఉన్నప్పుడు కన్నులు ఎల్లప్పుడు తెఱచుకొనియే ఉండును. అట్లే, శ్రీవరవరమునుల దాసుల సమూహముకూడా ఉండును. బ్రహ్మ శబ్దవాచ్యమగు వేదమునకు బాహ్యకుదృష్టులై, అపార్థమును చెప్పు అసుర స్వభావమును కలవారివలన భయమేర్పడి, నిర్వేదము కలుగగా, ఆ నిర్వేదమును పోగొట్టుటకు అనిమిషతనువై– రెప్పపాటు లేని కన్నులను కల్గినదియై, దైవప్రకృతియై, సదా జాగరూకమై (ఎల్లప్పుడు మేల్కొనియున్నదై), బాహ్యకుదృష్టులను నిరసించి, వేదముయొక్క దుఃఖమును (శ్రీవరవరమునుల శిష్యసమూహము) తీర్చును. కావున, అది మత్స్యావతారమునకు సమానమైయుండును – అని భావము. బ్రహ్మ శబ్దమునకు వేదము, బ్రహ్మ–అని అర్థములు కలవు. **"బ్రహ్మ నిర్వేదభావనిబంధనమ్– అనిమిషతనుః"** అను విశేషణము దివ్యమత్స్యమూర్తికిని, శ్రీవరవరమునుల శిష్యసమూహ మునకును శ్లేషద్వారా అన్వయింప నగును.

ఇచట ఈ క్రింది పాఠభేదము కానవచ్చుచున్నది.

వేదరాశి మనఘం సరోజజం ప్రాపయన్నితి విషణ్ణమాశ్రితమ్ ।
మత్స్యదేవసదృశో విభాతి యః తం భజేయ వరయోగిశేఖరమ్॥

యః = ఏ మణవాళమహామునులు, అతివిషణ్ణం = చాలా దుఃఖితుడై (సంసార క్లేశముల వలన మిక్కిలి విషణ్ణులైన), ఆశ్రితం = తనను ఆశ్రయించినవాడైన, సరోజజమ్ = నాభీపద్మం నుండి పుట్టిన బ్రహ్మకు (సరస్సు నుండి అవతరించిన పొయ్కై ఆళ్వార్లనుండి

ఉద్భవించిన), అనఘం వేదరాశిం = అనవద్యమైన వేదరాశిని, ప్రాపయన్ = పొందిస్తూ (ఉపదేశిస్తూ), (ఆర్తితో కూడిన ఆశ్రితజనానికి పొయ్‌కై ఆళ్వార్లనుండి ఉద్భవించిన **"ముదల్ తిరువన్దాది"** అనే దివ్యప్రబంధాన్ని కాలక్షేపంగా ఉపదేశిస్తూ), మత్స్యదేవసదృశః = మత్స్యావతార సదృశులై, విభాతి = వెలుగుతున్నారో, తం = ఆ, వరయోగిశేఖరం భజేయ = రమ్యజామాతృమునిని భజించగలను.

ఇందు శ్రీవరవరమునులకే మత్స్యావతారసామ్యము ప్రతిపాదింపబడుచున్నది. వేదములను కోల్పోయి, మిక్కిలి దుఃఖితుడై, తనను ఆశ్రయించిన, నాభీకమలోద్భూతుడగు బ్రహ్మకు నిర్దోషమైన వేదరాశిని అనుగ్రహించినవాడు. మత్స్యావతారస్వామి. శ్రీమణవాళ మహా మునులును సంసారదుఃఖదుఃఖితులై, తనను ఆశ్రయించిన చేతనులకు ఆ దుఃఖము పోగొట్టుటకు, **"సరోజజమ్"** – సరస్సులో అవతరించిన పొయ్‌కై ఆళ్వార్ల మూలముగా ఉద్భవించిన నిర్దోషమైన ద్రావిడవేదమును ఉపదేశించిరి. ఇందులో శ్లేషభంగిమలో శ్రీవరవరమునులకు మత్స్యావతారసామ్యము నిరూపింపబడినది. యతిశేఖరు లగు ఆ శ్రీవరవరమునులను సేవింతుమని భావము.

ఈ శ్లోకంనుండి వరుసగా పది శ్లోకాలలో భగవానుని దశావతారాలతో శ్రీవరవర మునులకు సామ్యం ప్రతిపాదింపబడుతున్నది. ఈ శ్లోకంలో మత్స్యసామ్యం, మణవాళ మహామునులకే వర్ణింపబడింది. ఆ తరువాత గల శ్లోకాలలో సామ్యం శ్రీవరవరముని భక్తులకు చెప్పబడుతుంది. ఈ సామ్యోక్తులు అన్నీ శ్లేషాలంకారంద్వారా నిర్వహింప బడుతున్నాయి. మొదట మత్స్యావతారపక్షంలో అర్థం.

(అనఘం వేదరాశిమ్ అతివిషణ్ణ మాశ్రితాం సరోజజమ్ ప్రాపయన్) – అని పదాలను అన్వయించి అర్థాన్ని చెప్పాలి. మత్స్యావతారచరిత్రసంగ్రహంగా ఏమంటే– పరమకారుణికుడైన భగవానుడు బ్రహ్మకు వేదరాశిని ఉపదేశించాడు. ఆ వేదాలు భగవానుని ముఖంనుండి వ్యక్తమై పురుషరూపంతో సంచరిస్తూ ఉండగా, ఒక అసురుడు వాటిని అపహరించుకొని పోయాడు. బ్రహ్మ అపుడు **"వేదా మే పరమం చక్షుః వేదా మే పరమం ధనమ్"** –కన్నులను పోగొట్టుకొన్నాను; ధనాన్ని పోగొట్టుకొన్నాను– అని ఆక్రందించగా, ఆ అసురుడు సముద్రంలో దాగుకొని ఉన్నాడని గ్రహించిన భగవానుడు మత్స్యరూపిగా సముద్రంలో ప్రవేశించి, ఆ అసురుని అన్వేషించి పట్టుకొని వధించి వేదాలను సంపాదించి, యథాపూర్వంగా బ్రహ్మకు ఇచ్చాడు.

(సరోజజమ్) – "సరోజాత్ జాయతే ఇతి సరోజజః" అనే వ్యుత్పత్తినిబట్టి ఈ పదం నాభీకమలంనుండి పుట్టిన బ్రహ్మను తెలుపుతుంది.

(ప్రాపయన్) – అనే పదం ద్వికర్మకప్రయోగం. **"వేదరాశిం సరోజజం ప్రాపయన్"** అని అన్వయించుకోవాలి. **"అతివిషణ్ణమ్", "ఆశ్రితమ్"** అనే పదాలు బ్రహ్మకు విశేషణాలు.

సరస్సులో అవతరించిన పొయ్‌కై ఆళ్వార్లు సరోజశబ్దవాచ్యులు. వారినుండి ఉద్భవించిన వేదరాశి **"ముదల్‌తిరువన్దాది"** అనే దివ్యప్రబంధం. దీనిని – **"అతివిషణ్ణమ్ ఆశ్రితం ప్రాపయన్"** –ఆర్తితో కూడిన ఆశ్రితజనానికి పొందించేవారు– ఉపదేశించేవారు శ్రీవరవరమునులు. ఇపుడు కూడా **"ప్రాపయన్"** అనే పదం ద్వికర్మకమే. మత్స్యావతార పక్షంలో **"సరోజజమ్", "వేదరాశిమ్"** అనే పదాలు కర్మపదాలు. శ్రీవరవరమునుల పక్షంలో **"ఆశ్రితమ్, వేదరాశిమ్"** అనేవి కర్మపదాలు. **"ఆశ్రితమ్"** అంటే ఆశ్రితజనులకు– శిష్యులకు– అని అర్థం. ఈ రీతులలో మత్స్యభగవానునితో సామ్యాన్ని కల్గి వెల్గుతున్న శ్రీవరవరమునులను భజిస్తున్నాను– అని శ్లోకతాత్పర్యం.

27. ప్రాపయన్నమృతకాంక్షిణోఽమృతం మందరాగభరణేఽపి సాదరః ।
దివ్యకూర్మసదృశో యదాశ్రితః సద్గుణోఽవతు మాం సరోమునిః ॥

యదాశ్రితః=ఏ మణవాళమహామునులను ఆశ్రయించిన శిష్యులు, అమృతకాంక్షిణః = మోక్షాన్ని పొందగోరేవారికి (అమృతాన్ని పొందగోరే వారికి), అమృతం ప్రాపయన్ = మోక్షాన్ని పొందించేవారై (అమృతాన్ని పొందించేవారై), మందరాగభరణే అపి సాదరః = మంద–రాగ–భరణే అపి = స్వల్పభక్తిని కలవారిని సైతం పోషించడంలో అభినివేశాన్ని కలవారై (మందరపర్వతాన్ని ధరించడంలో శ్రద్ధను కలవారై), దివ్యకూర్మసదృశః = దివ్యకూర్మరూపునితో పోలినవారై, విరాజతే = విశేషంగా ప్రకాశిస్తున్నారో, సః = ఆ, సుందరః మునిః = రమ్యజామాతృముని, మామ్ అవతు = నన్ను రక్షించుగాక !

ఇందు శ్రీమణవాళమహామునులను ఆశ్రయించిన సద్వర్గము (సత్పురుషుల సమూహము) కూర్మావతారసమానమనుచున్నారు. కూర్మరూపియగు భగవానుడు మందరమనెడి అగమును – పర్వతమును– ధరించుటలో ఆదరమును కలవాడై, అమృతమను అపేక్షించిన దేవతలకొఱకు సముద్రమును చిలికి, అమృతమును వారికి అనుగ్రహించెను. శ్లోకమున అమృతమను పదమునకు దేవతల ఆహారమగు సుధ అని, మోక్షమనియును అర్థము. ఇక, శ్రీవరవరముని శిష్యపక్షమున అర్థమేమనగా–

శ్రీవరవరమునులను ఆశ్రయించిన సత్పురుషులును మోక్షమును కోఱి, తమను ఆశ్రయించినవారికి మోక్షప్రాప్తిని కల్గించి, అనుగ్రహింతురు. మఱియు, వీరు **"మందరాగ భరణే సాదరః"** – మందరాగులనగా – తగ్గిన కోరికను కలవారు. అనగా – అల్పాను రాగమును కలవారిపట్లకూడ ఆదరమును కలవారు. **"మందర+అగ"** మందర పర్వతమని కూర్మపక్షమున, **"మంద+రాగ"** అని శ్రీవరవరమునుల భక్తుల పక్షమున అన్వయము. ఈ రీతులలో దివ్యకూర్మరూపికి సమానమైనవారు శ్రీవరవరమునులను ఆశ్రయించినవారు; అట్టి శ్రీవరవరమునులు నన్ను రక్షింతురుగాక – అని భావము. ఈ శ్లోకములో ద్వితీయార్థమున **"దివ్యకూర్మసదృశో విరాజతే య స్స మా మవతు సుందరో మునిః"**

అను పాఠభేదము కలదు– దీనినిబట్టి శ్రీవరవరమునులే దివ్యకూర్మరూపిగా నిరూపింప బడినట్లు తెలియుచున్నది. శ్రీవరవరమునుల దాసుల పక్షమున పూర్వార్ధమునకు చెప్పబడిన అర్థమే శ్రీవరవరమునులకును చెప్పనగును. ఈ పక్షములో రెండు శ్లోకములు శ్రీవరవర మునుల విషయకములు. పైశ్లోకములన్నియు శ్రీవరవరమునుల దాసుల విషయకములు.

ఈ శ్లోకంద్వారా శ్రీవరవరమునులకు కూర్మమూర్తిసామ్యం తెలుపబడుతున్నది. **"మన్దరమ్ నాట్టి అన్రు మతురక్కొழுమ్ శాఱు కొణ్ద శున్దరత్తోళుదైయాన్"** (మందర పర్వతాన్ని కవ్వంగా నాటి, అపుడు మధురమైన అమృతాన్ని గ్రహించిన సుందరబాహువు) అనే రీతిలో దివ్యకూర్మరూపియై మందరపర్వతాన్ని ధరించి, సముద్రాన్ని చిలికి అమృతప్రదానం చేసిన వృత్తాంతం పురాణప్రసిద్ధంకదా ! ఆ దివ్యకూర్మంతో సామ్యం శ్రీవరవరమునులకు ఏవిధంగా చెప్పబడింది? అంటే,

(అమృతకాంక్షిణః అమృతం ప్రాపయన్) – "తమేవం విద్వా నమృత ఇహ భవతి" (ఈవిధంగా పరమాత్మను తెలిసినవాడు మరణరహితుడు –ముక్తుడు అవుతున్నాడు) అనే రీతిలో ముముక్షువులకు మోక్షాన్ని ప్రసాదిస్తారు– అని భావం. అమృతశబ్దం మోక్షవాచకం కూడా.

(మందరాగభరణేఽ పి సాదరః) – దివ్యకూర్మపక్షంలో –**"మందర–అభరణే"** అని పదచ్ఛేదం. మందరపర్వతాన్ని ధరించడంలో– అని అర్థం. **'అగ'** శబ్దం **'న గచ్ఛతీతి అగః'** అనే వ్యుత్పత్తినిబట్టి ఎక్కడికీ కదలకుండా ఉన్నచోటనే స్థిరంగా ఉండే పర్వతాన్ని తెలుపుతుంది. మందరపర్వతాన్ని ధరించడంలో అభినివేశాన్ని కలవాడని భావం. శ్రీమణవాళమహామునుల పక్షంలో **"మంద–రాగ– భరణే"** అని పదవిభజనను చేయాలి. పరిపూర్ణమైన భక్తిని కలవారు కాక పోయినా, అల్పభక్తిని కలవారినికూడా పోషించడంలో ఆదరాన్ని కలవారని భావం. అద్వేషమాత్రం ఉన్నా, దానినే ఆధారంగా చేసికొని ఆదరిస్తారని హృదయం.

28. సౌకర్యవాన్ యత్పదభక్తిశాలీ భవాబ్ధిమగ్నోద్ధరణప్రవీణః ।
ఆటీకతే హ్యాద్యకిటే రభిఖ్యాంముని స్స నః పాతు వరోపయంతా ॥

యత్పదభక్తిశాలీ = ఏ శ్రీమణవాళమహామునుల శ్రీచరణాలలో భక్తితో వెలిగే శిష్యుడు, సౌకర్యవాన్ = సౌకర్యాన్ని కల్గినవాడై, (సూకరత్వాన్ని కల్గినదై), భవ+అబ్ధిమగ్న + ఉద్ధరణ ప్రవీణః సన్ = సంసారసముద్రంలో మునిగినవారికి ఉద్ధరించడంలో సమర్థుడై, ఆద్యకిటేః = ఆదివరాహంయొక్క, అభిఖ్యాం = సామ్యాన్ని (పేరును), ఆటీకతే = పొందుతున్నాడో, సః వరోపయంతా మునిః నః పాతు = ఆ శ్రీవరవరమునులు మనలను రక్షించాలి.

శ్రీమణవాళమహామునుల శ్రీచరణములందు భక్తిని కల్గిన దాసుడు, **"సౌకర్యవాన్"** – (సౌకర్యాన్ని కలవాడు) ముముక్షువగు ఏ చేతనుడు ఆశ్రయింపబోయినను కష్టము లేకుండగనే, తనను అతడు ఆశ్రయించునట్లు వరవరమునులు సులభులై యుందురు అని భావము. ఆచార్యాభిమానముచే అన్నియు అతనికి సుకరములు. సంసారసముద్రములో మునిగిన చేతనులను బయటకు తీయుటలో అతడు సమర్థుడైయుండును. అందుచే అతడు ఆదివరాహముయొక్క అభిఖ్యను– ఖ్యాతిని, సామ్యశ్రీని పొంది వెల్గును. ఇట్టి దివ్యసమృద్ధిని కల మణవాళమహామునులు మనలను రక్షింతురు గాక! అని భావము.

భగవానుని విషయమున **"సౌకర్యవాన్"** అనుటకు సూకరము– అనగా– వరాహము యొక్క స్వభావమును కలవాడు– అని అర్థము. **"సూకరస్య భావః సౌకర్యమ్, తద్వాన్"** అని అచటి వ్యుత్పత్తి. **"పాశి తూత్తు క్కిడన్ద పార్మకట్కు ప్పణ్డొరునాళ్ మాశుడమ్బిల్ నీర్ వారా మానమిలా ప్పన్టియామ్"** (పాచిపట్టిన నీటిలో మునిగి ఉండే భూమికోసం పూర్వం ఒకానొకనాడు మురికిపట్టిన శరీరంలో నీరు కారగా, ఇంత అని పరిమితి లేని ఆకారాన్ని కల్గిన వరాహమై) అనుచు గోదాదేవి పల్కిన రీతిలో, ప్రళయసముద్రములో మునిగియున్న భూమిని ఉద్ధరించినవాడు, వరాహస్వామి ఈ రీతిలో ఆదివరాహసామ్యమును శ్రీవరవరమునుల భక్తుడు పొందుచున్నాడు – అని శ్లేషభంగిమలో నిరూపింపబడినది. **"కిటిః"** – వరాహము. **"ఆద్యకిటిః"** – ఆదివరాహము.

ఈ శ్లోకంలో శ్రీమణవాళమహామునుల శిష్యవర్గానికి ఆదివరాహమూర్తితో సామ్యం రెండు శ్లిష్టవిశేషణాలద్వారా ప్రతిపాదింపబడుతున్నది. **"యత్పదభక్తిశాలీ"** అనేది విశేషణం కాదు. విశేష్యమే. కర్తృపదం. శ్రీమద్వరవరముని శిష్యవర్గం– అని భావం.

(ఆద్య కిటే రభిఖ్యామ్ ఆటీకతే) –**"కిటిః'** అని వరాహానికి పేరు. శ్రీవరవరముని శిష్యవర్గం ఆదివరాహమూర్తితో పోలి ఉన్నారని భావం. ఆ సామ్యనిర్వాహం ఏవిధంగా? అంటే–

(సౌకర్యవాన్) – "సూకరస్య భావః –సౌకర్యమ్, తద్వాన్ సౌకర్యవాన్" అనే వివరణాన్ని ఆదివరాహమూర్తి పక్షంలో చెప్పాలి. సూకరశబ్దం వరాహవాచకం కనుక, సూకరత్వాన్ని కల్గినవాడు వరాహమూర్తి– అని అర్థం. ఇక వరవరముని శిష్యవర్గపక్షంలో– **'సుకరస్వభావః సౌకర్యం, తద్వాన్"** అనే వివరణం వివక్షితం. ఆచార్యకృపాబలంవల్ల దుష్కరమనేది ఏమీ లేకుండా ఏదైనా వారికి సుకరమే– అని భావం. తరువాతి విశేషణంలో చెప్పబడే విషయంలో సుకరత్వాన్ని కల్గినది అని కూడా చెప్పవచ్చు.

(భవాబ్ధిమగ్నోద్ధరణప్రవీణమ్) – వరాహమూర్తి పక్షంలో– **"భవాబ్ధిమగ్నాయాః (భూమ్యాః) ఉద్ధరణే ప్రవీణమ్"** అనే వివరణను చెప్పాలి. హిరణ్యాక్షుడనే అసురునిచేత అపహరింపబడి సముద్రంలో ముంచబడ్డ భూదేవిని పైకి ఉద్ధరించడంలో సమర్థుడని

భావం. **"ఏనత్తురువాయిదన్దు"** (వరాహమూర్తియై భూమిని ఉద్ధరించి) **"ఇమ్మణ్ణిలై త్తానత్తే వైత్తవన్"** (ఈ భూమిని దాని స్థానంలో స్థాపించినవారు) కదా. శ్రీవరవరముని శిష్యుల పక్షంలో అర్థం ఏమంటే– **"భవాబ్ధిమగ్నానామ్ ఉద్ధరణే ప్రవీణః"** – **"పిఱవి క్కడలుళ్ అన్దు నాన్ తుళజ్గ"** (జన్మసముద్రంలో అప్పుడు నేను బాధపడుతుండగా) అనే రీతిలో సంసారార్ణవంలో అట్ట అడుగుకు మునిగిపోయినవారిని తీరాన్ని చేర్చడంలో శ్రీవరవరముని శిష్యవర్గం సౌకర్యాన్ని కల్గినది. సామర్థ్యాన్ని కల్గినది – అని భావం. ఈ విధంగా వరాహమూర్తితో సామ్యాన్ని పొందిన శిష్యవర్గాన్ని కల శ్రీవరవరమునులు మనలను రక్షించాలి– అని తాత్పర్యం.

29. హిరణ్యజిద్యత్పదభక్తిశాలీ నృసింహభావం ప్రకటీకరోతి ।
స మే విధత్తా మతులానుభావో వరోపయంతా కుశలాన్యజస్రమ్ ॥

యత్పదభక్తిశాలీ = ఏ మణవాళమహామునుల శ్రీచరణాలను భక్తితో ప్రకాశించే శిష్యసమూహం, హిరణ్యజిత్ = హిరణ్యాసురుని జయించినదై, (బంగారంలోని వ్యామోహాన్ని జయించినదై), నృసింహభావం = నృసింహమూర్తితో సాటివచ్చే భావాన్ని (గొప్ప మానవుని యొక్క స్వభావాన్ని), ప్రకటీకరోతి = వ్యక్తం చేస్తున్నదో, సః అతులానుభావః = ఆ అంతులేని మహిమను కల, సః వరోపయంతా = ఆ మణవాళమహామునులు, మే = నాకు, అజస్రం = సంతతం, కుశలాని =శుభాలను, విధత్తామ్ = కలుగజేయాలి.

మణవాళమహామునుల శ్రీచరణములందు భక్తిని కల శ్రీవైష్ణవుడు, **"హిరణ్యజిత్"**– అనగా – బంగారమును జయించినవాడు, అనగా – బంగారము మొదలగు ఐహిక సంపదలందు ఆశ లేనివాడు అగును. నృసింహస్వామికూడా హిరణ్యకశిపుని జయించిన వాడు. భగవానుడు నృసింహమూర్తియై ఆవిర్భవించి, నృసింహభావమును, అనగా నృసింహత్వమును ప్రకటీకరించెను. శ్రీవరవరమునుల భక్తుడును పురుషశ్రేష్ఠుడను స్వభావమును వ్యక్తీకరించును. అనగా – అతడు పురుషసింహమని తాత్పర్యము. నిస్సమాభ్యధికమైన ప్రభావమును కల అటువంటి శ్రీవరవరమునుల భక్తుడు ఎల్లప్పుడు మనకు కుశలములను కల్గించు గాక! అని భావము.

శ్లోకమున పూర్వార్ధము **"హిరణ్యజిద్యత్పదభక్తబృందం నృసింహతుల్యం నరసింహ భావాత్"** అనియు కొన్ని చోట్ల కలదు.

ఈ శ్లోకంలో శ్రీవరవరమునుల శిష్యులకు నరసింహమూర్తి సామ్యం నిరూపింప బడుతున్నది.

(హిరణ్యజిత్) – నృసింహమూర్తి **"ఇరణియన్ అకల్మార్వమ్ కీణ్డ పిరాన్"** (హిరణ్యకశిపుని విశాలవక్షస్సును చీల్చిన స్వామి) హిరణ్యాసురుని వధించిన గాథ సుప్రసిద్ధం. శ్రీవరవరముని శిష్యవర్గపక్షంలో– **"హిరణ్యజిత్"** –బంగారంలోని ఆశను

జయించినవారని అర్థం. **'వేధా ద్వేధా భ్రమం చక్రే కాంతాసు కనకేషు చ"** (బ్రహ్మ, స్త్రీల విషయంలో, బంగారం విషయంలో -రెండు విధాలుగా భ్రమను కల్గించాడు) అనే రీతిలో సామాన్యంగా లోకంలో ఉండే సువర్ణవ్యామోహాన్ని జయించినవారని భావం.

(నృసింహభావాత్) - "నరమ్ కలన్ద శిఙ్గమాయ్" (నరరూపం కలిసిన సింహమై) అన్నట్లు భగవానుడు నృసింహమూర్తిగా ఆవిర్భవించాడుకదా ! వరవరముని శిష్యవర్గపక్షంలో - మానవులలో సింహంవలె గొప్పగా ప్రకాశించేది- అని అర్థం. ఈ అర్థంలో సింహశబ్దం శ్రేష్ఠవాచకం. ఇటువంటి శిష్యసమృద్ధిని కల శ్రీవరవరమునులు మనకు శుభాలను సదా కల్గించాలని సారం.

30. భజతే కిల వామనోపమాం సుమనోవైరిబలిస్మయం హరన్ ।
శుభవిక్రమభృద్యదాశ్రితః త ముపాసే వరయోగిశేఖరమ్ ॥

యత్ ఆశ్రితః = ఏ మణవాళమహామునులను ఆశ్రయించిన శిష్యవర్గం, సుమనోవైరి బలిస్మయం = పండితులకు విరోధులై, బలిష్ఠులైన కుదృష్టుల గర్వాన్ని (దేవతలకు విరోధి అయిన మహాబలియొక్క గర్వాన్ని), హరన్ = హరిస్తున్నదై, శుభవిక్రమభృత్ = పుణ్యతీర్థసంచారాన్ని చేసేదై (మంగళకరమైన త్రివిక్రమక్రమణాన్ని కల్గినదై), వామన+ ఉపమాం భజతే = వామనమూర్తితో సామ్యాన్ని, భజతే = పొందుతున్నదో, తం వరయోగిశేఖరం = ఆ సౌమ్యజామాతృమునిని, ఉపాసే = ఉపాసిస్తున్నారు.

శ్రీవామనమూర్తి-దేవవైరియగు మహాబలియొక్క స్మయమును, అనగా - గర్వమును- అపహరించినవాడు. **"శుభవిక్రమభృత్" - "త్రీణి పదా విచక్రమే"** అనునట్లు శుభములగు మూడడుగులను పెట్టి, లోకములను కొలిచినవాడు. శ్రీవరవరమునులను ఆశ్రయించిన భాగవతోత్తముడును భూదేవులగు సాత్త్విక శ్రీవైష్ణవజనుల విరోధులైన బలిష్ఠుల గర్వమును అణచినవాడు. **"తీర్థీకుర్వంతి తీర్థాని స్వాంతస్థేన గదాభృతా"** (తమ మనస్సులో ఉండే భగవానుని ద్వారా తీర్థాలను పవిత్రం చేస్తారు) అనియు, **"తీర్త్తకరరామిన్ తిరిన్దు"** (వేగంగా పరిభ్రమిస్తూ తీర్థంకరులు కావాలి) అనియును, **"ఓడి త్తిరియుమ్ యోగికళ్"** (వేగంగా అంతటా సంచరించే యోగులు) అనియును పల్కునట్లే, శుభములైన భూసంచారములను కలవాడు. అందుచే లోకములను కొలిచిన, ఉత్తముడగు శ్రీవామనునితో సాటి యగుచున్నాడు. అట్టి శ్రీమణవాళ మహామునులను ఉపాసింతును; భక్తితో సేవింతునని తాత్పర్యము.

ఈ శ్లోకంలో శ్రీమణవాళమహామునుల శిష్యవర్గానికి శ్రీవామనమూర్తితో సామ్యం ప్రతిపాదింపబడుతున్నది. అందుకోసం రెండు శ్లిష్టపదాల ప్రయోగం చేయబడింది.

(సుమనోవైరిబలిస్మయం హరన్) - "సుపర్వాణ స్సుమనసః" అనే అమరకోశ వచనానుసారం సుమనస్సులు అంటే దేవతలు. దేవతలకు శత్రువైన మహాబలి యొక్క

గర్వాన్ని అణచినవాడు వామనమూర్తి. స్వామిశిష్యుల పక్షంలో– సుమనస్సులు అంటే పండితులు అని కూడా అర్థం. పండితులకు ప్రతిపక్షులైన, వాదంలో మహాబలిష్ఠులైన అద్వైతుల గర్వాన్ని అణచగల్గినది. అంతేకాదు;

(శుభవిక్రమభృత్) – "త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపా అదాభ్యః" అనే శ్రుత్యుక్తిరీతిలో మంగళకరమైన త్రివిక్రమణాన్ని చేసినవాడు వామనమూర్తి. శ్రీవరవరముని శిష్యవర్గ పక్షంలో–విక్రమమంటే సంచారం. పుణ్యక్షేత్రతీర్థయాత్రను **"ఓడి త్తిరియుమ్ యోకికళ్"** (పరుగెత్తి తిరిగే యోగులు) అన్నట్లు చేసేవారని అర్థం. లేక, పాండిత్యవిక్రమాన్ని కూడా అర్థంగా గ్రహించవచ్చు. ఇటువంటి శిష్యసమృద్ధిని కల్గిన శ్రీవరవరమునులను ఉపాసిస్తున్నాను– అని శ్లోకభావం.

31. మహీభరకుదృగ్బలక్షపణదక్షిణౌజోభృతో
యదంఘ్రిసముపాశ్రయా పరశురామసాధర్మ్యగాః ।
జయంత్యఖిలపాపభీమహితవిష్ణుధర్మాన్వితాః
స నో వరవరో ముని ర్వితరతు శ్రియం సంతతమ్ ॥

యత్+అంఘ్రిసముపాశ్రయాః = ఏ మణవాళమహామునుల శ్రీచరణాలను ఆశ్రయించినవారు, మహీభరకుదృక్ బలక్షపణదక్షిణ+ఓజోభృతః = భూమికి భారమైన కుదృష్టిసిద్ధాంతాన్ని చేసేవారి బలాన్ని పోగొట్టడంలో సమర్థమైన మహిమను కలవారై (భూమికి భారం అయిన కుదృష్టిబలాలను– క్షత్రియాధమబలాలను నశింపజేయడంలో సామర్థ్యాన్ని కల తేజస్సును కలవారై), అఖిల = అన్నివిధాలైన, పాప= పాపాలపట్ల, భీ= పాపులందఱికి భీతిని కల్గించే గొప్పవిష్ణు స్వరూపంతో కూడినవారై (భీతిని కలవారై వైష్ణవ ధర్మాన్ని అవలంబించేవారై, లేక, విష్ణుధర్మంలో చెప్పబడిన ధర్మాలను అనుష్ఠించే వారై), అందువల్లనే, పరశురామ సాధర్మ్యగాః = పరశురామునితో సామ్యాన్ని పొందినవారై, జయంతి = సర్వోత్కర్షతో వెల్గుతున్నారో, సః వరవరమునిః = ఆ రమ్యజామాతృముని, నః సంతతం శ్రియం వితరతు = మనకు ఎల్లప్పుడు సంపదను విశేషంగా ఇవ్వాలి.

ఏ మణవాళమహామునుల శ్రీపాదములందు ఆశ్రయించినవారు భూమికి భారభూతులగు కుదృష్టివాదుల తర్కబలమును నశింపజేయుటలో దక్షిణమైన – అనగా సమర్థమైన – ఓజస్సును – అనగా – బలమును –కలవారై, అందుచే భూమికి భారభూతులై, దుష్టబుద్ధులైన దుష్టక్షత్రియులను నిర్మూలించుటలో సమర్థమైన భుజబలమును కల పరశురామునితో పోలినవారుగా, పాపములను చేయుటలో భయమును కల్గినవారుగా, సమస్తశ్రీవైష్ణవధర్మమును అవలంబించినవారై వెల్గుచున్నారో, ఆ వరవరమునులు మనకు ఎల్లప్పుడు శ్రీవైష్ణవసిరిని అనుగ్రహింతురుగాక !

ఈ శ్లోకములో మూడవ పాదము వేఱు రీతిలోకూడ కన్పించుచున్నది. **"జయంతి భగవద్గుణార్ణవనివాసనైయత్యగాః"** అనునది ఆ పాఠభేదము. ప్రాయశః ఈ పాఠమే సరి

అయినదని తోచును. దీనిచే పరశురామునితో వేఱొక సామ్యముకూడ శ్రీవరవరముని భృత్యులకు తెలుపబడినది. పరశురాముడు పరశువును చేతదాల్చి ఇరువది ఒక్కమార్లు భూమండలములోని క్షత్రియులను సంహరించిన దేవుడు. అతడు పిమ్మట ఒక యాగ విశేషము చేసి, అందు దక్షిణగా తాను జయించి సంపాదించిన భూమిని అంతటిని దానమిచ్చి, పిమ్మట తన నివాసస్థానముగా పశ్చిమసముద్రమును చోటు కొఱకు అడిగి, అందు నివసించెనని పురాణకథనము. కావున అర్ణవనివాసమును నియతముగా కలవాడు పరశురాముడు. శ్రీవరవరమునుల శిష్యులును భగవానుని గుణాబ్ధిలో నియతవాసమును కలవారు. నియమముగా భగవద్గుణానుభవమును పొందువారని తాత్పర్యము.

ఈశ్లోకంలో మణవాళమహామునుల శ్రీచరణాలను సేవించేవారికి పరశురామునితో సామ్యం ప్రతిపాదింపబడుతున్నది. పరశురాముడు– **"వెన్ఱి మామ్మళు వేన్ది మున్ మణ్మిశై మన్నరై మూవెళ్ళుకాల్ కొన్ఱ తేవా !"** (జయాన్ని కల్గించే గొప్ప పరశువును దాల్చి పూర్వం భూలోకంలోని రాజులను ఇరవైఒక్క మార్లు వధించిన దేవా!) అని, **"కోక్కుల మన్నరై మూవెళ్ళుకాల్ ఒరుకూర్ మళ్ళువాల్ పోక్కియ తేవన్"** (భూలోకంలోని క్షత్రియులను ఇరవై ఒక్కమార్లు అద్వితీయమైన పదునును కల పరశువుతో వధించిన దేవుడు) అని కీర్తించే రీతిలో భూమికి భారమైన అధమక్షత్రియవర్గాన్ని సంహరించగల్గిన పరాక్రమాన్ని కల్గి ఉండడం ప్రసిద్ధం. శ్రీవరవరమునుల శిష్యులుకూడా– భూమికి భారమైన కుదృష్టిసమూహాల బలాన్ని నిరసించడంలో సామర్థ్యాన్ని కలవారు.

(భగవద్గుణార్ణవనివాసనైయత్యగాః) – పరశురాముడు నిత్యం సముద్రనివాసాన్ని చేసేవాడు. **"దత్వా కర్మణి దక్షిణాం క్వచన తా మాస్కంద్య సింధుం వసన్"** (యుగకర్మలో భూమిని దక్షిణగా ఇచ్చి, సముద్రంలో ఒక చోట నివసిస్తూ) అనే శ్రీదేశికుల దశావతార శ్లోకసూక్తి భావ్యం. ఒక యజ్ఞవిశేషంలో భూమిని అంతటిని దక్షిణగా దానం చేసి, సముద్రంలో ఎక్కడో ఒకచోట నివసించిన గాథ పురాణప్రసిద్ధం. శ్రీవరవరమునుల శిష్యుల పక్షంలో భగవద్గుణసముద్రంలో నిత్యనివాసం చేసేవారు– అని భావం. ఇటువంటి శిష్యసమూహాన్ని కల్గిన వరవరమునులు మనకు సదా శ్రేయస్సును కల్గించాలి – అని శ్లోకభావం.

32. సహజానఘలక్ష్మణాన్వితా వసుమత్యుద్భవయా శ్రియోజ్జ్వలా ।
రఘువర్యసమా యదాశ్రితాః వరయోగీ స శుభం తనోతు నః ॥

యత్ ఆశ్రితాః = ఏ శ్రీవరవరమునుల శిష్యులు, సహజ + అనఘలక్ష్మణ + అన్వితాః = భరతునితో, శత్రుఘ్నునితో, లక్ష్మణునితో కూడినవారై (సహజంగానే ఏ దోషం లేని లక్షణాలతో కూడినవారై, వసుమత్యుద్భవయా శ్రియా = భూమినుండి ఆవిర్భ వించిన లక్ష్మీస్వరూపిణి అయిన సీతాదేవితో, (ధనంతో, బుద్ధితో కల్గిన కీర్తితో), ఉజ్జ్వలాః

= గొప్పగా ప్రకాశించేవారై (అందువల్లనే), రఘువీరసమాః =శ్రీరామచంద్రునితో సమానులై ఉన్నారో, సః వరయోగీ నః శుభం తనోతు = ఆ శ్రీవరవరముని మనకు మంచిని విస్తరింపచేయాలి.

ఇందు శ్రీవరవరమునులను ఆశ్రయించినవారు రాఘవుడను దశరథపుత్రునకు సమానమైన వారు అనుచు రెండు శ్లిష్టవిశేషణములద్వారా నిరూపింపబడుచున్నది.

(వసుమత్యుద్భవయా శ్రియోజ్జ్వలా) "వసుమతి+ఉద్భవయా", వసు, మతి +ఉద్భవయా"- క్రమంగా అని రెండు పక్షములలో పదవిభజనను చేయాలి. శ్రీరాఘవుడు తనతో పుట్టిన తమ్ముడు, పాపరహితుడగు లక్ష్మణునితో కూడియుండువాడు. **"న నిద్రాం లభతే రామో వినాతం పురుషోత్తమమ్"** అనే వాల్మీకి సూక్తి స్మరణీయం. యాగభూమిలోనుండి ప్రాదుర్భవించిన సీతాదేవితోగల సంబంధముచే **"అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా"** అనునట్లు అంతులేని, లెక్కకట్ట వీలులేని తేజస్సుతో అతడు వెల్గును. మణవాళమహామునుల భక్తులును శ్రీవైష్ణవసంతానములో ప్రసూతులగుటచే స్వాభావికనిర్దోష శ్రీవైష్ణవలక్షణముతో కూడినవారై, భూమిలోనున్న ధనధాన్యసమృద్ధితో కూడినవారై, భగవద్భాగవతాచార్య కైంకర్యసిరితో వెలుగుదురు. **"లక్ష్మణ+అన్విత"** అని శ్రీరాముని పక్షమున ఒకే సమస్తపదముగా గ్రహింపనగును. **"లక్ష్మణా + అన్వితా"** అని రెండు పదములుగా శ్రీవరవరమునుల భక్తుల పక్షమున అన్వయింపనగును. **"లక్ష్మ"** అను పదముయొక్క తృతీయా ఏకవచనరూపము **"లక్ష్మణా"** అని అగును. కావున **"లక్ష్మణా+అన్వితాః"** అనుటకు లక్షణముతో కూడినవారని అర్థము. శ్రీరామునివలె దయాసాగరులుగను, శరణాగతవత్సలులుగను, సదాచారపరాయణులుగను, పెద్దలకు విధేయులుగను వీరు వెల్గుదురని భావము. ఇట్టి శిష్యసమృద్ధిని కల వరవరమునులు మనకెల్లప్పుడును శుభములను అనుగ్రహింతురు గాక!- అని శ్లోకతాత్పర్యము.

ఈశ్లోకంలో శ్రీవరవరమునుల శిష్యులకు శ్రీరామచంద్రునితో సామ్యం నిరూపింపబడుతున్నది. రెండు శ్లిష్టవిశేషణాలను ప్రయోగించడంద్వారా ఆ సామ్యం నిర్వహింపబడుతున్నది.

(సహజానఘలక్ష్మణాన్వితాః) -ప్రకృతంలో శ్రీరామచంద్రుని పక్షంలో సహజశబ్దం భరతుని తెలుపుతుంది. అట్లే, అనఘశబ్దం శత్రుఘ్నుని, లక్ష్మణశబ్దం లక్ష్మణుని నిర్దేశిస్తుంది. విభీషణుని పరిగ్రహించే సందర్భంలో- **"న సర్వే భ్రాతర స్తాత ! భవంతి భరతోపమాః"** (నాయనా! లోకంలో సోదరులందఱు భరతునివంటివారు కారు) అని శ్రీరామచంద్రుడు పల్కడంవల్ల సహజశబ్దం భరతుని నిర్దేశిస్తుందని అనడం సరసం. **"గచ్ఛతా మాతులకులం భరతేన తదాఽనఘః, శత్రుఘ్నః"** (మేనమామ ఇంటికి పోయే

భరతునిచే అనఘుడైన శత్రుఘ్నుడు వెంట తీసికొని పోబడ్డాడు.) అనే వాల్మీకి శ్లోకంలో శత్రుఘ్నుడు అనఘ శబ్దంతో విశేషింపబడ్డాడు. కనుక, ఇక్కడ అనఘశబ్దం శత్రుఘ్నుని నిర్దేశిస్తుంది – అని అనడం యుక్తం. ఇక, లక్ష్మణపదం సుప్రసిద్ధం. ఈ రీతిలో భరత– శత్రుఘ్న– లక్ష్మణులతో కూడుకొని ఉండేవారు. శ్రీరామచంద్రుడని భావం. శ్రీవరవరముని భక్తుల విషయంలో– **"సహజానఘ లక్ష్మణా. అన్వితాః"** అని పదవిభాగం చేయాలి. **"కలంకాంకౌ లాంఛనం చిహ్నం లక్ష్మ చ లక్షణమ్"** అనే అమరకోశ వచనానుసారం లక్ష్మశబ్దం లక్షణవాచకం. సహజ, అనఘ పదాలు దానికి విశేషణాలు. ఔపాధికం కాకుండా సహజమైన, నిరవద్యమైన శేషత్వరూపలక్షణంతో కూడుకొన్నవారని తాత్పర్యం.

(వసుమత్యుద్భవయా శ్రియా ఉజ్జ్వలాః) – వసుమతీశబ్దం భూమివాచకం. భూమినుండి ఉద్భవించిన శ్రీ–సీతాదేవి. ఆమెతోకూడి వెలిగేవాడు శ్రీరాముడు. శ్రీవరవర మునుల శిష్యులపక్షంలో– **వసు**– సంపదవల్ల, **మతి**– బుద్ధివల్ల, **ఉద్భవయా** – పుట్టిన, **శ్రియా**– కీర్తించే వెలిగేవారని భావం. **"వసు"** –ధనం. **'కొళ్ళెన్ఱు కిళర్న్దెళున్ద పెరుమ్ శెల్వమ్ నెరుప్పాక"** (నన్ను గ్రహించు– అని అంటూ ఆకర్షించే గొప్ప సంపదను నిప్పుగా తలచి) అనే రీతిలో లౌకికమైన ధనం హేయం అయినా, **"ఉలకిల్ ఏయ్న్ద పెరుమ్ శెల్వత్తరాయ్ త్తిరుమాలడియార్కళై ప్పూశిక్క నోఱ్ఱార్కళే"** (లోకంలో గొప్ప సంపదను కలవారై, శ్రియఃపతి దాసులను ఆరాధించే నోమును నోచగలరు) అనే ఫలశ్రుతి పాశురం రీతిలో అతిథి సత్కారయోగ్యమైన సంపద ఉపాదేయమేకదా! అటువంటి ధనంతో, బుద్ధితో (జ్ఞానంతో) కల్గిన కీర్తితో ప్రకాశిస్తారు– శ్రీవరవరముని శిష్యులు. ఈ విధంగా శ్రీరామునితో సామ్యం శ్రీవరవరముని శిష్యులకు నిరూపింపబడింది. అటువంటి శిష్యులను కల శ్రీమణవాళమహాములు మనకు మంచిని వర్ధిల్లజేయాలి. అని శ్లోక తాత్పర్యం.

33. అధిగతబలభద్రాభిఖ్యయా యత్పదాబ్జ–
ప్రవణజనసమష్ట్యా వాసుదేవాగ్రజస్య ।
అనితరజనలభ్యా లభ్యతే సామ్యలక్ష్మీః
స జయతు వరయోగీ నిస్తులావేలభూమా ॥

యత్పదాబ్జ ప్రవణజనసమష్ట్యా = ఏమణవాళ మహామునుల తామరలవంటి పాదాలలో ప్రావణ్యాన్ని కల్గిన శిష్యవర్గంచేత, అధిగతబలభద్రాభిఖ్యయా = బలభద్ర నామాన్ని పొందినదై, (బలం, మంగళం, కీర్తి – అనే వీటిని పొందినదై), అనితరజనలభ్యా = వేఱు ఎవరివల్ల పొందడానికి వీలులేనిదై, వాసుదేవాగ్రజస్య = బలభద్రునియొక్క, సామ్యలక్ష్మీః = సామ్యశ్రీ, లభ్యతే = పొందబడుతున్నదో, నిస్తుల+అవేలభూమా = సాటి లేని, అంతు లేని అతిశయాన్ని కల్గిన, సః వరయోగీ జయతు = ఆ వరవరముని సర్వోత్కర్షతో వెలగాలి.

బలరామునకు బలభద్రుడని తిరునామము. వసుదేవుని పుత్రుడగు శ్రీకృష్ణునకు అన్నయై, **"శెమ్బొఱ్కழలడి చ్చెల్వా!"** అనునట్లు వీరకడియమును దాల్చినవాడగు బలరాముని తోటి సామ్యలక్ష్మి ఏ శ్రీవరవరమునుల శ్రీపాద పద్మములలో ప్రవణులగు శ్రీవైష్ణవుల సముదాయముచే పొందబడుచున్నదో, నిస్సమాభ్యధికమగు, లెక్కకట్టుటకు వీలుకాని గొప్పతనమును కల ఆ శ్రీమణవాళమహామునులు సర్వశ్రేష్ఠులుగా వెల్గుచున్నారు- అని భావం.

"అధిగతబలభద్ర+అభిఖ్యయా" అని, **"అధిగతబల+భద్ర+అభిఖ్యయా"** రెండు పక్షములలో అనియును రెండు విధములుగా విడదీసి అన్వయింపనగును. **"అధిగతబలభద్రాభిఖ్యయా"** అనుటకు- పొందబడిన బలభద్రుడను పేరుతో - అని బలరాముని పక్షమున అర్థము. పొందబడిన బలము, మంగళము, కీర్తి- అను వీనిని కలవారు- అని శ్రీవరవరమునుల భక్తుల పక్షమున అర్థము. సర్వత్ర బహువ్రీహిసమాసము.

ఈ శ్లోకంలో శ్రీమణవాళమహామునుల శిష్యవర్గానికి బలరామునితో సామ్యం ఒక శ్లిష్టవిశేషణ ప్రయోగంద్వారా అణ్ణన్ నిర్వహిస్తున్నారు. బలరాముని పక్షంలో-

(అధిగత బలభద్రాభిఖ్యయా)- "బలభద్రేత్యభిఖ్యా అధిగతా యయా" అనే బహువ్రీహి సమాసానుగుణ విగ్రహవాక్యాన్ని గ్రహించాలి. బలరామునకు బలభద్రుడనే పేరు ఉన్నది కనుక ఈ ప్రయోగం సార్థకం. ఇక, శ్రీవరవరముని శిష్యుల పక్షంలో- **"బలం చ భద్రం చ అభిఖ్యాం చ"** అని ద్వంద్వసమాసం చేసి, **"అధిగతాః బలభద్రాభిఖ్యాః యయా తయా"** అని తరువాత బహువ్రీహిసమాసాన్ని గ్రహించాలి. ఉపనిషత్తులో **"ఆశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠః"** అనేచోట వివక్షితమైన ఫలం, శుభాలు, (**అభిఖ్యా** - అంటే కీర్తి), కీర్తిని పొందినవారు వరవరమునుల శిష్యులు అని చెప్పబడినట్లయింది. ఈ విధంగా ఈ రీతులలో బలరామునితో సాటివచ్చే శిష్యులను కల్గిన మణవాళమహామునులు పల్లాణ్డు పల్లాణ్డుగా వర్ధిల్లాలి- అని శ్లోకభావం.

34. సధర్మజాతార్జునచిత్తహర్షప్రధ్వంసిపక్షక్షపణప్రవీణః ।
యదాశ్రయాః కృష్ణతులాం భజంతే పాయాత్స నః కాంతవరో మునీంద్రః ॥

యత్ ఆశ్రయాః = ఏ మణవాళమహామునుల శిష్యులు, సధర్మజాత+ అర్జున చిత్తహర్షప్రధ్వంసి పక్ష క్షపణ ప్రవీణాః సంతః = ధర్మసమూహాలతో, శుభ్రమైన స్వచ్ఛమైన హృదయంతోకూడిన పరమసాత్త్వికులైన వారి హర్షాన్ని ధ్వంసం చేసే అసురప్రకృతుల మతాన్ని నిరసించడంలో సమర్థులై (ధర్మపుత్రునితోకూడిన అర్జునుని యొక్క ఆనందాన్ని పోగొట్టిన కౌరవపక్షాన్ని నశింపజేయడంలో సమర్థులై), కృష్ణతులాం = శ్రీకృష్ణునితో సామ్యాన్ని, భజంతే = పొందుతున్నారో, సః కాంతవరః మునీంద్రః = ఆ శ్రీమణవాళ మహామునులు, నః పాయాత్ = మనలను రక్షించాలి.

ఏ మణవాళమహాములను ఆశ్రయముగా కల దాసులు శ్రీకృష్ణునితో సామ్యమును పొందుచున్నారో, ఆ మణవాళమహామునులు మనలను రక్షింతురు గాక !

శ్రీకృష్ణుని పక్షమున– **"ధర్మజాత"**–అనగా ధర్మజుడు. ధర్మపుత్రునితో కూడిన అర్జునుని మనస్సంతోషమునకు నాశమును కల్గించుచున్న దుర్యోధనుడు మొదలగు దుష్టపక్షమును నశింపజేయుటలో సమర్థుడు శ్రీకృష్ణుడని పూర్వార్ధములోని భావము. వరవరమునుల దాసుల పక్షమున– **"ధర్మాణాం జాతమ్ – ధర్మజాతమ్"**–అనగా ధర్మసమూహము. **"అర్జునం చ తత్ చిత్తం చ"** –నిష్కల్మషమైన తెల్లని మనస్సు. **"ధర్మజాతార్జున చిత్తాభ్యాం సహ వర్తంత ఇతి – సధర్మజాతార్జునచిత్తాః"** – సద్ధర్మములను, నిర్మలమైన మనస్సును కలవారు సాత్త్వికులు. వారి హర్షమును నశింపజేయు పక్షములు– అసురప్రకృతులగు బాహ్య కుదృష్టుల మతములు. వానిని నశింపజేయగలవారు మణవాళమహామునుల శిష్యులు. ఇట్టి శిష్యసమృద్ధిని కల శ్రీవరవరమునులు మనలను రక్షింతురుగాక ! అని శ్లోకతాత్పర్యము.

ఈ శ్లోకంలో మణవాళమహామునుల శిష్యులకు శ్రీకృష్ణునితో సామ్యం ప్రతిపాదింపబడుతున్నది. శ్లోకంలోని పూర్వార్ధం అంతా ఒకే సమస్తపదం. శ్లిష్టవిశేషణం. శ్రీకృష్ణుడు మహాభారత సంగ్రామంలో కౌరవపక్షాన్ని రూపుమాపాడు. ఆ పక్షం ఎటువంటిది? అని అంటే, ధర్మపుత్రులు, అర్జునుడు మొదలైనవారి మనస్సులోని ఆనందాన్ని తుడిచివేసి, తానే ఆనందించాలని భావించేది. **"ధర్మజాత"** అనే పదాన్ని **"ధర్మాత్ యమాత్ జాతః"** అనే అర్థాన్ని చెప్పాలి. అంటే– యమధర్మరాజు కుమారుడైన యుధిష్ఠిరుడని అర్థం. **"ధర్మజాతేన సహ వర్తత ఇతి సధర్మజాతః"** ఇది **'అర్జున'** శబ్దానికి విశేషణం. ఇక్కడ ఈ ఇద్దఱిని నిర్దేశించడం మిగిలిన ముగ్గురికి ఉపలక్షణం. ఇక, శ్రీవరవరముని శిష్యుల విషయంలో –**"ధర్మాణాం జాతమ్, ధర్మజాతమ్, అర్జునం చ తత్ చిత్తం చ అర్జునచిత్తమ్. ధర్మజామ్ చ అర్జునచిత్తం చ– ధర్మజాతార్జునచిత్తే. ధర్మజాతార్జునచిత్తాభ్యాం సహితాః –సధర్మజాతార్జునచిత్తాః"** అనే విగ్రహాన్ని ప్రకృతంలో చెప్పాలి. ధర్మజాతమంటే ధర్మాల సమూహం. అర్జున చిత్తమంటే స్వచ్ఛమైన హృదయం. ఇక్కడ ఈ సమాసానికి పరమసాత్త్వికులని తాత్పర్యం. అటువంటి సత్పురుషుల హృదయాలలోని హర్షాన్ని నాశనం చేసే పక్షం–కుదృష్టిసిద్ధాంతుల మతం. దానిని నిరసించగలవారు శ్రీవరవరమునుల శిష్యులు. ఇటువంటి శిష్యసమృద్ధిని కలవారు శ్రీవరవరమునులు. వారు మనలను రక్షించాలి– అని శ్లోకతాత్పర్యం.

35. కలిదోష మశేషతః క్షితౌ క్షపయన్ కల్కితులా ముపేయివాన్।
యదుపాశ్రితసజ్జనః స నః సతతం సౌమ్యవరోఽభిరక్షతు ॥

యత్ ఉపాశ్రితసజ్జనః = ఏ శ్రీమణవాళమహామునులను ఆశ్రయించిన సజ్జనుడు, క్షితౌ = భూమిలో, కలిదోషం = కలిదోషాన్ని, అశేషతః= పూర్తిగా, క్షపయన్ = పోగొట్టే

వాడై (అందువల్ల), కల్కితులాం = కల్కిభగవానునితో సామ్యాన్ని, ఉపేయివాన్ = పొందిన వాడయ్యాడో, సః = ఆ, సౌమ్యవరః = మణవాళమహాముని, నః = మనలను, సతతం = సదా, అభిరక్షతు = రక్షించుగాక !

ఏ మణవాళమహామునులను ఆశ్రయించిన సత్పురుషుడు భూమిలో కలిదోషమును నిశ్శేషముగా పోగొట్టి, కృతయుగధర్మమును ప్రవర్తింపజేయువాడై, దానిచే కల్కిభగవానుని సామ్యమునకు విహారభూమి-విహరించు చోటై వెలుగుచున్నాడో, ఆ శ్రీవరవరమునులు మనలను రక్షింతురుగాక- అని అనుచున్నారు.

"కలియుమ్ కెడుమ్ కణ్డుకొళ్మిన్ కడల్ వణ్ణన్ పూదఙ్గళ్ మణ్మేల్ మలియ ప్పుకున్దిశై పాడి యాడి యుழిதరక్ కణ్డోమ్" (కలికూడా నశిస్తుంది. గమనించండి. సముద్రంవలె గంభీరస్వభావుడైన ఆ భగవానుని దాసులు ఈ భూమిలో అంతటా వ్యాపించి, ఆ స్వామి గుణాలను పాడి, ఆడి, నిర్భయంగా సంచరించడం చూచాము) అనియు, **"తిరియుమ్ కలియుకమ్ నీఙ్గి దేవర్కళ్ తాముమ్ పుకున్దు పెరియ కితయుకమ్ పఱ్ఱి ప్పేరిన్ప వెళ్ళమ్ పెరుక"** (సమస్త వస్తుస్వభావాలను మార్పు చేసే కలియుగం పోయి, నిత్యసూరులు కూడా తామే కోరి వచ్చి ఈ లోకంలో ప్రవేశించే గొప్ప కృతయుగమై, మహానందం ప్రవహించగా) అనియు, **"కొన్లుయిరుణ్ణుమ్ విశాది పకై పశి తీయన ఎల్లామ్ నిన్లివ్వులకమ్ కడివాన్ నేమిప్పిరాన్ తమర్ పోన్దార్"** (ప్రాణులను చంపి తినే రాక్షసులు, వ్యాధులు. పగలు, ఆకలివంటి దోషాలు – వీటిని అన్నిటినీ నివారించడం కోసం సుదర్శన చక్రధారి దాసులు అంతటా వ్యాపించి ఉన్నారు.) అనియును నమ్మాళ్వార్లు అనుగ్రహించిన రీతిలోనే శ్రీవరవరమునుల దాసులగు శ్రీవైష్ణవులు కలిదోషమును నిశ్శేషముగా భూమిలో నశింపజేయుదురు – అని పల్కినట్లయినది. ఇది భగవద్రామానుజుల అపరావతారమగు మణవాళమహామునులయొక్క దాసుల పక్షమున మిక్కిలి తగియున్నది. కల్కిభగవానుడు కలిదోషమును భూమిలో నిశ్శేషముగా పోగొట్టి, కృతయుగధర్మమును ప్రవర్తింపజేయుటకే అవతరింపగలడు- అను పురాణప్రసిద్ధి కలదు. ఇట్లు పది శ్లోకములతో శ్రీవరవరమునుల భక్తులకు దశావతారసామ్యము నిరూపింపబడినది. ఇట్టి శిష్య సమృద్ధిని కల మణవాళమహామునులు మనలను ఎల్లప్పుడు రక్షింతురుగాక! అని అణ్ణన్ ఇందు తెలిపిరి.

ఇందులో శ్రీవరవరమునుల శ్రీచరణాలను ఆశ్రయించిన సజ్జనులకు కల్కిభగ వానునితో సామ్యం సులభంగా ప్రతిపాదింపబడుతున్నది. కల్కిభగవానుడు ఇక ఎపుడో అవతరించి, కలికల్మషాలను తొలగించగలడని పురాణాలలో చెప్పబడింది. ఆ విధంగా ఎప్పుడో కాకుండా, శ్రీమణవాళమహామునుల పాదాలను ఆశ్రయించిన అష్టదిగ్గజాలనే ఆచార్యులు మొదలైనవారు, వారి పరంపరకు చెందినవారు ఈనాటికీ కలికల్మషాన్ని పోగొట్టి ప్రకాశించడం విశేషం.

36. అహీనభోగప్రవణ స్సమింధే శ్రీరంగధామా కిల రంగభర్తుః।
సాధర్మ్య మాస్థాయ యదంఘ్రిభక్తః పాయాత్స నః సౌమ్యవరో మునీంద్రః॥

యత్ అంఘ్రిభక్తః = ఏ మణవాళమహామునుల శ్రీచరణాలలో భక్తిని కలవాడు. అహీనభోగప్రవణః = శేషభోగంలో - ఆదిశేషుని శరీరంలో ప్రావణ్యాన్ని కల్గినవాడై, (చాలా గొప్ప ముక్తభోగాలలో ఆసక్తిని కల్గినవాడై), శ్రీరంగధామా సన్ = శ్రీరంగనివాస రసికుడై (శ్రీరంగాన్ని నివాసంగా కలవాడై), రంగభర్తుః సాధర్మ్యం = శ్రీరంగనాథునితో సామ్యాన్ని, ఆస్థాయ = పొంది, సమింధే = ప్రకాశిస్తున్నదో, సః సౌమ్యవరః మునీంద్రః = ఆ వరవరమునులు, నః పాయాత్ = మనలను రక్షించాలి.

ఈ శ్లోకమునుండి మూడు శ్లోకములలో శ్రీరంగము, తిరుమల, పెరుమాళ్ కోయిల్ (కంచి) లలోని అర్చామూర్తులతో మామునుల భక్తులకు సామ్యము తెలుపబడుచున్నది. **"అహీనభోగప్రవణః"** అను ఈ శ్లోకములో శ్రీరంగనాథునితో సామ్యము నిరూపింప బడుచున్నది. **"సాధర్మ్యమాసాద్య"** అనే పాఠాంతరం ఉన్నది.

కొఱత లేని భగవద్గుణానుభవములో అభినివేశమును కలవారై, శ్రీరంగమునందు నిత్యవాసమును చేయువారైన, శ్రీవరవరమునుల శ్రీచరణములందు భక్తిని కలవారైన శ్రీవైష్ణవులు తిరువనన్దాழ్వాన్‌యొక్క ఒడలు అనెడి పడుకపై ప్రీతితో నిద్రించువాడు, శ్రీరంగవిమానములో నివసించువాడగు శ్రీరంగనాథునితో సామ్యమును కల్గి వెల్గుచున్నారు. ఆ మణవాళమహామునులు మనలను రక్షింతురు గాక ! అని శ్లోక భావము.

"అహీనభోగ" అనునపుడు శ్లేష కలదు. **"అహి+ఇన+భోగ"** అని విడదీసి సర్పరాజగు ఆదిశేషుని శరీరమును- అని శ్రీరంగనాథుని పక్షమున, **"అహీన+ భోగమ్"** అని విడదీసి, కొఱత లేని భోగము - అని శ్రీవరవరమునుల భక్తుల పక్షమునను అర్థము చెప్పనగును.

ఇంతవరకు భగవానుని దశావతారమూర్తులతో శ్రీవరవరముని భక్తులకు సామ్యాన్ని రమ్యంగా ప్రతిపాదించిన అణ్ణన్, ఇకపై వరుసగా మూడు శ్లోకాలలో **కోయిల్ (శ్రీరంగం), తిరుమల (వేంకటాద్రి), పెరుమాళ్ కోయిల్ (హస్తిగిరి),** క్షేత్రాలలో వేంచేసి ఉండే అర్చామూర్తులతో సామ్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. ప్రకృతశ్లోకంలో శ్రీరంగంలో వేంచేసి ఉండే శ్రీరంగనాథుని అర్చామూర్తితో సామ్యాన్ని తెలుపుతున్నారు- రెండు శ్లిష్టవిశేషణాలను ప్రయోగిస్తూ.

(యదంఘ్రిభక్తః) - శ్రీమణవాళ మహామునుల శ్రీచరణాలలో భక్తిని కలవాడు.

(రంగభర్తుః సాధర్మ్యమ్ ఆస్థాయ సమింధే) - శ్రీరంగనాథునితో సామ్యాన్ని పొంది ప్రకాశిస్తున్నాడు. ఏవిధంగా అంటే -

(అహీనభోగప్రవణః) - శ్రీరంగనాథుని పక్షంలో -**"అహి"**శబ్దం సర్పవాచకం. **"ఇన"**శబ్దం శ్రేష్ఠవాచకం.**"భోగ"**శబ్దం సర్పశరీరవాచకం. **"భోగిభోగశయనీయశాయినే"**

(సర్పమైన ఆదిశేషుని శరీరాన్ని పడుకగా చేసికొని శయనించినవానికి) అనే ముకుంద మాలాస్తోత్రంలోని ప్రయోగం ఉదాహార్యం. ఇక, శ్రీవరవరముని శిష్యవర్గం– హీనభోగా లలో– లౌకికభోగాలలో ప్రావణ్యాన్ని కల్గి ఉండకుండా, అహీనమైన– గొప్పదైన మోక్షపురు షార్థంలో ప్రావణ్యాన్ని కల్గి ఉంటుంది. అక్షయ్యమైన ముక్తభోగంలో ప్రావణ్యాన్ని కల్గి ఉంటుంది. అంతేకాదు,

(శ్రీరంగధామా) – శ్రీరంగనాథుడు శ్రీరంగవిమానాన్ని నివాసంగా కల్గి ఉంటాడు. శ్రీవరవరముని శిష్యులు శ్రీరంగక్షేత్ర నివాసరసికులు. ఈ విధంగా వరవరముని శిష్యులకు శ్రీరంగనాథసామ్యం నిరూపించబడింది. ఇటువంటి శ్రీవరవరముని మనలను రక్షించాలి– అని శ్లోకభావం.

37. వృషాచలస్థితిం భజన్ వహన్ననారతం శ్రియం
సుదుర్లభాగమాఖిలార్థదానకేళికీర్తిమాన్ ।
విభాతి వేంకటేశవద్యదంఘ్రిసేవినాం గణః
స న స్తనోతు మంగళం వరోపయంతృదేశికః ॥

యత్ అంఘ్రిసేవినాం గణః = ఏ శ్రీమణవాళమహామునుల శ్రీచరణాలను సేవించే శిష్య సమూహం, వృషాచలస్థితిం భజన్ = సిద్ధ ధర్మంలో స్థిరమైన నిష్ఠను కల్గినదై (వృషాచలంలో నివాసాన్ని పొందుతూ), అనారతం = ఎల్లప్పుడు, శ్రియం వహన్ = కైంకర్యసిద్ధిని కలవారై (లక్ష్మిని వక్షస్సులో వహించేవాడై), సుదుర్లభ+ఆగమ+అఖిల+ అర్థదాన కేళికీర్తిమాన్ = మనకు పొందడానికి వీలుకాని పురుషార్థాలను అనుగ్రహించడమనే లీలతో కీర్తిని పొందినవాడై (దుర్లభాలైన, ఆగమాలలో ఉండే అన్ని అర్థాలను సులభంగా ఉపదేశించడం అనే లీలతో కీర్తిని కల్గినదై) వేంకటేశవత్ = శ్రీవేంకటేశ్వరునివలె, విభాతి= ప్రకాశిస్తున్నదో, సః వరోపయం తృయోగిరాట్ = ఆ శ్రీమణవాళమహామునులు, నః మంగళం తనోతు = మనకు మంగళాన్ని విస్తరింపజేయాలి.

ఏ శ్రీమణవాళమహామునుల శ్రీచరణములను సేవించువారి సంఘము వేంకటేశ్వరునివలె వెల్గుచున్నదో, ఆ ఆచార్యశ్రేష్ఠులగు ఆమణవాళమహామునులు మనకు మంగళములను కల్గించుగాక– అని అణ్ణన్ ఇందు అనుచున్నారు.

పూర్వార్ధములోనున్న మూడు విశేషణములను శ్రీవేంకటేశ్వరునకు, శ్రీవరవర మునుల భక్తులకును శ్లేషాలంకారరీతిలో అన్వయింపనగును. వృషాచలమని తిరుమలకు పేరు. వృషమనగా వృషభము – ఎద్దు. అచలము – కొండ. స్థితి–నివాసము. వేంకటాద్రిలోనున్నవాడని భావము. శ్రీవేంకటేశ్వరుడు ఎల్లప్పుడు పద్మావతీదేవిని వక్షః స్థలములో కల్గియుండువాడై, భక్తులకు దుర్లభములగు సకలపురుషార్థములను వారు

వారు కోరిన రీతిలో అనుగ్రహించుట అను లీలను కలవాడు. సాటిలేని కీర్తిని కలవాడు. ఇక, శ్రీవరవరమునుల భక్తుల పక్షమున **వృష**-ధర్మమునకు, **అచల**-కదలని, **స్థితిం**-స్థితిని-అని అర్థము. వరవరమునుల భక్తుల సంఘము ఎల్లప్పుడు ధర్మమునందు నిష్ఠను కల్గియుండును. వృషమనగా ధర్మమునకును పేరు. వారు ఎల్లప్పుడు శ్రీవైష్ణవసిరితో (కైంకర్యలక్ష్మితో) వెలుగుచుందురు. అవలీలగా తెలియుటకు సాధ్యము గాని శాస్త్ర దివ్యప్రబంధ రహస్యార్థములను ఉపదేశించుటచే కల్గిన కీర్తిని కల్గియుందురు.

ఈ శ్లోకంలో స్వామిశిష్యవర్గానికి తిరుమలలోని శ్రీవేంకటేశ్వరునితో సామ్యాన్ని అందంగా నిర్వహిస్తున్నారు అణ్ణన్- మూడు శ్లిష్టవిశేషణాలద్వారా. ఏవిధంగా అంటే-

(వృషాచలస్థితిం భజన్) - శ్రీవేంకటేశ్వరుడు వృషాచలంలో వేంచేసి ఉండేవాడు; కనుక అతనిపట్ల ఈ విశేషణం సార్థకం. శ్రీవరవరమునుల శిష్యవర్గపక్షంలో - **"వృషాచలస్థితిం భజన్"** వృషశబ్దం వృషభాన్ని చెప్పినట్లే, ధర్మాన్నికూడా తెలుపుతుంది. ఇక్కడ- సాధ్యధర్మాలలో ఆసక్తిని విడచి సిద్ధధర్మంలో స్థిరమైన నిష్ఠను కలవారై ఉండడాన్ని ఈ ప్రయోగం తెలుపుతున్నది.

ఇక్కడ **"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి"** (ధర్మసంస్థాపన కోసం అవతరిస్తాను) అని పల్కిన భగవానుడే "అన్ని ధర్మాలను విడచి నన్ను ఆశ్రయించు" అని అన్నందువల్ల సాక్షాద్ధర్మం తానే అని తెలుస్తున్నది" అనే ముముక్షుప్పడి చూర్ణిక, **"శాస్త్రికళ్ యరైప్పోలే ఇరణ్డైయుమ్ ఇడుక్కి ప్పిఱవి క్కడలై నీన్ద సారజ్ఞర్ విట్ట త్తిరుప్పారైప్పోలే ఇరుకైయుమ్ విట్టు క్కరై కుఱుకుజ్ఞాల మెణ్ణువర్‌కళ్"** అనే ఆచార్యహృదయచూర్ణిక, దాని వ్యాఖ్యానసూక్తి అనుసంధేయాలు.

(అనారతమ్ శ్రియం భజన్) - "అకలకిల్లేన్ ఇఱైయు మెన్రు అలర్‌మేల్ మజ్గై యుఱై మార్బా !" (క్షణం కూడా విశ్లేషించలేనని అంటూ నిత్యవాసం చేసే పద్మనివాసిని వక్షఃస్థలంలో కలవాడా !) అనే రీతిలో నిత్యం శ్రీసంబంధాన్ని కలవాడు శ్రీవేంకటేశ్వరుడు. శిష్యుల పక్షంలో- **"సా హి శ్రీ రమృతా సతామ్"** (అదేకదా సత్పురుషుల నశించని సంపద) అనే శ్రీవైశిష్ట్యం వివక్షితం. **"స తు నాగవరః శ్రీమాన్"** (కైంకర్యలక్ష్మిని కల ఆ గజేంద్రుడు) **"అంతరిక్షగతః శ్రీమాన్"** (అంతరిక్షంలో ఉండేవాడు, భగవద్భక్తి అనే సంపదను కల విభీషణుడు), **"లక్ష్మణో లక్ష్మిసంపన్నః"** (కైంకర్యలక్ష్మిని కల ఆ లక్ష్మణుడు) అనే ప్రమాణాలనుకూడా స్మరించాలి.

(సుదుర్లభాగమాఖిలార్థదానకేళికీర్తిమాన్) - "యేషా మర్థానా మాగమః (సమాగమః) సుదుర్లభః, తథావిధానా మఖిలానా మర్థానాం దానకేళిః, తేన కీర్తిమాన్ వేంకటేశః" అని వేంకటేశ్వరుని పక్షంలో వివరణం. వేంకటేశ్వరుడు మనకు పొందదానికి సాధ్యం కాని అరుదైన సకలార్థాలను సులభంగా అనుగ్రహించి కీర్తిని పొందినవాడని భావం. శ్రీవరవర ముని శిష్యవర్గపక్షంలో - ఆగమశబ్దానికి సమాగమమని అర్థంకాదు. వేదాలు, శాస్త్రాలు -

అని అర్థం. చాలా దుర్లభాలైన సకలశాస్త్రార్థాలను అవలీలగా ఉపదేశించి, దానివల్ల కీర్తిని పొందినవారని భావం. ఈ విధంగా పై రీతులలో శ్రీవేంకటేశ్వరునితో పోలిన శిష్యవర్గాన్ని కల శ్రీమణవాళమహామునులు మనకు మంగళాలను ప్రసాదించాలి- అనిభావం.

38. భక్తాఖిలార్థాధిగమైకహేతుం శ్రీపుణ్యకోట్యాయతనం యదీయమ్ ।
విదంతి సంతో వరదేన తుల్యం వరోముని ర్న స్స తనోతు భద్రమ్ ॥

యదీయం = ఏ శ్రీమణవాళమహామునులకు చెందినవానిని, (శిష్యవర్గాన్ని), సంతః = సత్పురుషులు, భక్తాఖిలార్థ+ అధిగమ+ ఏకహేతుం = భక్తులకు సకల విషయాలను గ్రహించడంలో కారణమై ఉన్నారో, భక్తుల సకలార్థాల ప్రాప్తికి ముఖ్య హేతువుగా, శ్రీపుణ్యకోట్యాయతనం = శ్రీపుణ్యకోటి అనే విమానాన్ని నివాసస్థానంగా కలవానినిగా, (కోట్ల లెక్కలోని పుణ్యాలకు ఆస్పదంగా ఉండేవానినిగా) అందువల్లనే, వరదేన తుల్యం = వరదరాజస్వామితో సమానంగా, విదంతి = తెలిసికొంటున్నారో, సః = ఆ, వరః మునిః = మణవాళమహామునులు, నః భద్రం తనోతు = మనకు మంగ ళాలను అనుగ్రహించాలి.

ఇందు సత్పురుషులు ఏ వరవరమునుల దాసులను వరదరాజస్వామితో పోల్చెదరో, ఆ మణవాళ మహామునులు మనకెల్లప్పుడు కల్యాణపరంపరను కల్గించుగాక!- అని పల్కుచున్నారు.

"వేగవత్యుత్తరే తీరే పుణ్యకోట్యాం హరి స్స్వయమ్, వరద స్సర్వభూతానా మద్యాపి పరిదృశ్యతే" (పుణ్యకోటి విమానంలో అయిన వరదరాజ స్వామి స్వయంగా ఈనాటికీ అందఱికి దర్శనం ఇస్తున్నాడు) అను రీతిలో కంచిలోని హస్తిగిరిలో పుణ్యకోటివిమానములో వేంచేసియుండు దేవాధిరాజు అందఱికిని వరమును ఇచ్చు స్వామిగా ఈ నాటికిని దర్శనమును అనుగ్రహించుచున్నాడుకదా ! శ్రీవరవరమునుల దాసులును తమను ఆశ్రయించిన భక్తులకు అపేక్షితమైన అర్థపంచకము, తత్త్వత్రయము, రహస్యార్థ ములు-మొదలగు ఉజ్జీవనహేతువులగు అన్ని అర్థములను ప్రసాదింతురు. **"శ్రీపుణ్య కోట్యాయతనమ్"** అనునపుడు పుణ్యకోటివిమానమును నివాసస్థానముగా కలవాడు- అని వరదరాజస్వామి పక్షమున, కైంకర్యప్రీతికి కోటిసంఖ్యలోనున్న పుణ్యములకును నివాసస్థానమైనవారు, శ్రీవరవరమునుల దాసులు, అందుచే వారు వరదరాజస్వామితో సమానులు - అని మణవాళమామునుల శిష్యుల పక్షమున శ్లేషద్వారా సాధింపబడినది.

ఈ శ్లోకంలో శ్రీవరవరమునుల శిష్యులకు శ్రీవరదరాజస్వామితో సామ్యం ప్రతిపా దింపబడుతున్నది. కంచిలో హస్తిగిరిలో వేంచేసి ఉండే వరదరాజస్వామి **"భక్తాఖి లార్థాధిగమైకహేతు"**వై ఉన్నాడు. **"అర్థితార్థపరిదానదీక్షితమ్"** (అడిగిన వారి అన్ని కోరికలను ఇవ్వడమనే దీక్షను కలవానిని) అనే రీతిలో భక్తులకు సకలార్థాలను అనుగ్రహించేవాడై

ఉన్నాడు. శ్రీవరవరమునుల శిష్యవర్గం పక్షంలో- భక్తులకు సకలశాస్త్రార్థాలను అనుగ్రహించగల్గినదై ఉంటుంది - అని అర్థం.

(శ్రీపుణ్యకోట్యాయతనమ్) - "పుణ్యకోట్యాం హరిః స్వయమ్,వరదః సర్వభూతానా మద్యాపి పరిదృశ్యతే" అనే రీతిలో పుణ్యకోటివిమానాన్ని నివాసంగా కల్గినవాడు వరద రాజస్వామి. **"పురుషాయ పురాణాయ పుణ్యకోటినివాసినే"** అని మహర్షివచనం. ఇక, శ్రీవరవరముని శిష్యవర్గపక్షంలో- శ్రీని, పుణ్యకోటిని ఆయతనంగా- నివాసంగా కల్గి ఉండేవారని భావం. శ్రీఅంటే- శ్రీవైష్ణవశ్రీ. పుణ్యకోటి అంటే- కోట్లసంఖ్యలోని సుకృతవిశేషాలు. వీటికి ఆశ్రయంగా ఉంటారని భావం. ఇటువంటి శిష్యసంపదతో వెలిగే శ్రీమణవాళమహామునులు మనకు శ్రేయస్సులను కల్గించాలి- అని శ్లోకతాత్పర్యం.

39. కాంతం వరం ప్రాప్య సతీ మదీయా మతిః పరస్మిన్ పురుషే విరక్తా ।
తత్సద్గుణాస్వాదరసైకలోలా పతివ్రతోదాహరణత్వ మేతు ॥

మదీయా = నాయొక్క, మతిః = బుద్ధిః, కాంతం వరం ప్రాప్య = అందమైన వరుని పొంది (శ్రీమణవాళమహామునులనే వరుని పొంది), పరస్మిన్ పురుషే విరక్తా = ఇతరపురుషుల పట్ల విరక్తిని పొందినదై (భగవానుని విషయంలోకూడా విరక్తిని పొందినదై), తద్గుణ+ఆస్వాదరసైకలోలా సతీ = ఆ వరుని గుణాల అనుభవరసంలో మాత్రమే ఆసక్తిని కల్గినదై, పతివ్రతయై (ఆ మణవాళమహామునుల కల్యాణగుణాల అనుభవంలో మాత్రమే ఆసక్తిని కల్గినదై), పతివ్రతా +ఉదాహరణత్వం = పతివ్రతకు ఉదాహరణంగా ఉండే స్థితిని, ఏతు = పొందాలి.

ఈ శ్లోకములో నా మంచి బుద్ధి శ్రీమణవాళమహామునులనే ఆశ్రయించి, వారి గుణానుభవరసమునందు అభినిష్టయై, మిగిలిన విషయములలో సంగము లేనిదియై, పతివ్రతలకు ఉదాహరణమై యుండుగాక ! అనుచు తనయొక్క స్వభావమును అణ్ణన్ ప్రకటించుచున్నారు.

లోకములో పతివ్రతయైన స్త్రీ అందమైన భర్తను పొంది, అతని సద్గుణములనే అనుభవించుటలోనే ఆదరమును కల్గి, పరపురుషులపట్ల విరక్తిని కల్గినదియై, **'సతీ'** అని పేరుతో ఆదరింపబడుచున్నది కదా! **"పరస్మిన్"** - పరపురుషుని యందు అని పతివ్రతాపక్షమున, పరమపురుషుడగు భగవానునియందు అని అణ్ణన్ బుద్ధిపక్షమున అర్థము. శ్రీవేంకటేశుని సుప్రభాతాది స్తుతులను ఆచార్యాజ్ఞను అనుసరించి అనుగ్రహిస్తూ **"సౌమ్యోపయంతృయమినా మమ దర్శితౌ"** అని అంటూ భగవత్పాదాశ్రయణం కూడా ఆచార్యముఖోల్లాసార్థమేనని పల్కిన అణ్ణన్ కవితకు ఆచార్యవిషయం కల పాతివ్రత్యం సుప్రసిద్ధం.

“తన్వీ మయాద్య లబ్ధా తపసా విపులేన భక్తికన్యేయమ్, భజతా మద్యభిచారం భావం ఘటికాద్రి భర్తరి ప్రౌఢా” అని అంటూ దేవరాజగురువులు అమృతఫలావలి అనే ఘటికాద్రినాథుని స్తుతిలో పల్కిన శ్లోకం ఇక్కడ సంవాదంగా స్మరణీయం. దేవరాజ గురువులు (ఎఱుమ్బియప్పా) అణ్ణన్ వలె వరవరమునికి గల ఎనిమిది మంది ముఖ్య శిష్యులలో ఒకరు.

40. సరసి కృతవిహారం ధ్యానమాత్రేణ పుంసాం
శమితసకలతాపే హంససంసేవ్యమానే ।
భజతి ముద మవేలాం సంతతం యస్య చేతః
స భవతు వరయోగీ మానసే మామకీనే ॥

యస్య చేతః = ఏ వరవరమునుల చిత్తం, ధ్యానమాత్రేణ = ధ్యానించుట మాత్రముతోనే, పుంసాం = మానవులయొక్క, శమితసకలతాపే = సకలతాపాలను ఉపశమింపచేసే, హంససంసేవ్యమానే = హంసలచేత సేవింపబడే (పరమహంసలుగా చెప్పబడే నాథయామునయతివరాదులచే సేవింపబడే), సరసి = సరస్సులో (సరోయోగివిషయంలో), కృతవిహారం = చేయబడిన విహారాన్ని కల్గినదై (విహరించినదై), సంతతం =ఎల్లప్పుడు, అవేలాం ముదం భజతి = అంతు లేని ఆనందాన్ని పొందుతున్నదో, సః వరయోగీ = ఆ శ్రీమణవాళమహాామునులు, మామకీనే మానసే భవతు = నా మనస్సులో నిలచి ఉండాలి.

ఈ శ్లోకమునుండి కొన్ని శ్లోకములలో వరవరమునులకు ఆళ్వార్లపట్ల, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధములపట్ల గల ఆదరాతిశయమును అణ్ణన్ తెలుపుచున్నారు. ఈ క్రమం ఇంచుమించు **“భూతం సరశ్చ”** ఇత్యాది తనియన్ శ్లోకంలోని క్రమాన్ని పోలి ఉండడం గమనార్హం.

ధ్యానమాత్రముచే ఆ ధ్యానమును చేయు అధికారుల సకలసాంసారిక తాపములను పోగొట్టువారు, పరమహంసలగు యోగులచే సేవింపబడువారగు పొయ్‌కైయాళ్వార్ అనెడి సరస్సులో విహరించు ఏ శ్రీవరవరమునుల చిత్తము అనునది ఎల్లప్పుడు అధికమైన సంతోషమును కల్గినదగుచున్నదో, ఆ మణవాళ మహామునులు దాసుడనగు నా మనస్సులో విహరింతురుగాక ! నా మనస్సు అనెడి మానససరోవరములో శ్రీవరవరమునులనెడి పరమహంస విహరించుగాక ! అని శ్లోక భావము.

మిగిలిన సరస్సులు స్నానము చేయువారి కొన్ని తాపములను మాత్రమే పోగొట్టును. మనస్సులో స్నేహముతో చింతించు మాత్రముననే సకలతాపములను పోగొట్టు అలౌకికమైన సరస్సు పొయ్‌కైయాళ్వార్లు – అని శ్లోక తాత్పర్యము. ఈ భావం **“ధ్యానమాత్రేణ”** అనే పదప్రయోగం ద్వారా వ్యక్తం. సరోయోగి **“ఏష బ్రహ్మ ప్రవిష్టోస్మి గ్రీష్మే శీతమివ**

ప్రాదమ్" అని, **"తామరైనీళ్వాశత్తదమ్"** అని కీర్తింపబడి భగవానుడనే దివ్యసరస్సులో మగ్నులై, ఆళ్వార్ పదవాచ్యులు కాగా, శ్రీవరవరమునులు ఆ సరోయోగి అనే సరస్సులో మునిగిన వేఱొక విలక్షణమైన ఆళ్వార్లు అయ్యారు. సరోయోగి ప్రథమపర్వంలో ఆళ్వార్లు కాగా, శ్రీవరవరమునులు చరమపర్వంలో ఆళ్వార్లు కావడం విశేషం. **"ఆళ్వార్"** అనే ద్రావిడ నామానికి "లోతుగా మునుగుతున్నవారు- అవగాహిస్తున్నవారు" అని కదా అర్థం.

41. సారాసారవివేచనైకరసికం సారస్వతం సారసం
సారాహారఝరీసహోదరపరీపాకేన లోకోత్తరమ్ ।
భక్త్యా శీలయత స్సుశీలజనతోత్తంసం పదాబ్జద్వయం
నిత్యం చింతయ చిత్త ! సాదరభరం సౌమ్యోపయంతు ర్మునేః ॥

సారసారవివేచన+ఏకరసికం = ఇది మంచి, ఇది చెడు –అనే వివేచనలో అద్వితీయ మైన ఆసక్తిని కల్గినది, సౌరాహారఝరీసహోదర పరీపాకేన = దేవతల ఆహారం అయిన అమృతంయొక్క ప్రవాహానికి సహోదరం అయిన- సాటి వచ్చే ఆస్వాదంతో, లోకోత్తరం = అలౌకికమైనదైన, సారసం సారస్వతం = పొయ్కై ఆళ్వార్ల దివ్యప్రబంధాన్ని, భక్త్యా = భక్తితో, శీలయతః = అనుశీలనం చేసే, సౌమ్యోపయంతుః మునేః = శ్రీమణవాళ మహా మునులయొక్క, సుశీలజనతా +ఉత్తంసం = మంచి శీలాన్ని కల సత్పురుషుల సమూహానికి శిరోభూషణమైన, పదాబ్జద్వయం = తామరలవంటి పాదాల జంటను, చిత్త = ఓ మనసా !, సాదరభరం = పూర్ణమైన ఆదరంతో, నిత్యం చింతయ = నిత్యం చింతించు.

ఈ శ్లోకములో, "పొయ్కైఆళ్వార్లు అనుగ్రహించిన **"ముదల్ తిరువన్దాది"** అనెడి ప్రబంధమును భక్తితో నిత్యముగా అనుసంధించు శ్రీవరవరమునుల సచ్ఛీలమును గల పరమసాత్త్వికజనశిరోభూషణమగు శ్రీపాదములనే ఓ మనస్సా ! ఆదరముతో నిత్యము చింతింపుము" అని అణ్ణన్ అనుచున్నారు. పొయ్కై ఆళ్వార్ల శ్రీసూక్తి ఎట్టిది, అనగా- మంచి, చెడులను చక్కగా వివేకింపగల్గినది. మఱియు, దేవతల ఆహారమైన అమృతప్రవాహమునకు సహోదరియై, అమృతముకంటె తీయనిదియై యున్నది; దివ్యమైనది. **"వరుత్తుమ్ పుఱవిరుళ్మాఱ్ఱ ఎన్పొయ్కైప్పిరాన్ మఱైయిన్ కురుత్తిన్ పొరుళైయుమ్ శెన్దమిళ్ తన్నైయుమ్ కూట్టి ఒన్ఱత్తిరుత్తు అన్ఱెరిత్త తిరువిళక్కై"** – (బాధించే బాహ్యాంధకారం తీరేటట్లుగా మా సరోయోగి వేదాలలోని అర్థాలను అందమైన ద్రావిడ భాషతో కలిపి ఒకటిగా వత్తిగా చేసి ఆనాడు వెల్గించిన జ్ఞానదీపం) అని అంటూ అముదనార్ పల్కిన రీతిలో సరోయోగి అనుగ్రహించిన ముదల్ తిరువన్దాది మంచిచెడ్డలను వివేకించి తెలియదానికి తగిన సాధనం కనుక **"సారాసారవివేచనైకరసికమ్"** అని ప్రయోగింపబడింది.

42. భూతార్థస్వోక్తిసందర్శితనిగమశిఖాగూఢతత్త్వార్థజాతే
భూతాఖ్యే యోగివర్యే భగవతి సతతం భక్తితో లగ్నచిత్తమ్ ।
సేవస్వ స్వాంత ! కాంతం నిరవధికగుణైః క్షాంతికారుణ్యముఖ్యైః
కాంతం జామాతరం తం నిరవధికగుణాస్వాదముక్తాన్యసంగమ్॥

భూతార్థస్వోక్తిసందర్శిత = యథార్థములైన తమ సూక్తులచే దర్శింపజేయబడ్డ, నిగమశిఖాగూఢతత్త్వార్థజాతే= వేదాంతాలలో గూఢంగా ఉండే తత్త్వార్థాల సమూహాన్ని కల్గినవారు, భగవతి =జ్ఞానాదిషాడ్గుణ్యపూర్తిని కలవారు అయిన, భూతాఖ్యే యోగివర్యే = పూదత్తాḻ్వార్లపట్ల, సతతం = ఎల్లప్పుడు, భక్తితః = భక్తివల్ల, లగ్నచిత్తం = ఆసక్తమైన మనస్సును కలవారు, క్షాంతికారుణ్యముఖ్యైః = క్షమ, దయమొదలైన, నిరవధికగుణైః = అంతు లేని గుణాలతో, కాంతం = మనోహరులు, నిరవధికగుణ+ ఆస్వాదముక్త+ అన్యసంగం = (ఆ) పూదత్తాḻ్వార్లయొక్క అంతులేని గుణాలను ఆస్వాదించడంచేత మిగిలిన విషయాలపట్ల ఆసక్తిని విడచినవారు అయిన, తం = ఆ, కాంతం జామాతరం = రమ్యజామాతృమునిని, స్వాంత= ఓ మనసా !, (సతతం) సేవస్వ = సదా సేవించు.

"ఓడి త్తిరియుమ్ యోగికళ్" (సంచరిస్తూ ఉండే యోగులు) అని, **"ఇన్కవి పాడుమ్ పరమకవికళ్"** (తీయని పాశురాలను పాడే గొప్ప కవులు) అనియు కీర్తింపబడు ముదలాḻ్వార్లు ముగ్గురిలో మధ్యలోనున్నవారు పరమపూజ్యులగు పూదత్తాḻ్వార్లు. వీరి విషయమున ఎల్లప్పుడు భక్తితో కూడిన చింతను కలవారై, నిస్సమాభ్యధికమగు క్షమ, కరుణ మొదలగు గుణములతో వెల్గుచున్నవారైయున్న శ్రీమణవాళమహామునులను ఎల్లప్పుడు నా మనసా! నీవు చింతింపుమా! మామునుల గుణానుభవరసముచే విషయాంతరములందు సంగమును విడుపుము- అని తాత్పర్యము. పూదత్తాḻ్వార్ల శ్రీసూక్తి యొక్క గుణములలో అభినివేశమును పొంది, అన్యసంగమును విడచి, దానినే నిరంతరము అనుసంధించు శ్రీవరవరమునులు - అను అర్థమును **"నిరవధిక గుణాస్వాద ముక్తాన్యసంగమ్"** అనే ప్రయోగమునకు ప్రకృతమున గ్రహింపనగును.

"ఇతైవనైక్కాణుమ్ ఇదయత్తిరుళ్ కెడ ఞానమెన్నుమ్ నితైవిళక్కేఱ్ఱియ పూదత్తిరువడి"(భగవానుని దర్శించే హృదయంలోని తమస్సు పోయేటట్లుగా జ్ఞానమనే పూర్ణమైన దీపాన్ని వెల్గించిన పూదత్తాḻ్వార్లు) అనే అముదనార్ సూక్తిని అనుసరించి **"భూతార్థస్వోక్తి సందర్శితనిగమశిఖాగూఢతత్త్వార్థజాతే భూతాఖ్యే యోగివర్యే"** అని ప్రయోగింపబడింది.

43. మహదాహ్వయపాదపద్మయోః మహదుత్తంసితయో ర్మధువ్రతమ్।
వరయోగిన మేవ సాదరం మతి రాసీదతు మామికాఽనృహమ్॥

మహత్ +ఉత్తంసితయోః = మహాత్ములచే (తిరుమళ్ళిశై ఆళ్ళ్వార్లచే) శిరోభూషణంగా చేసికొనబడినవి అయిన, మహదాహ్వాయపాదపద్మయోః = మహాయోగి (పూదత్తాళ్ళ్వార్ల) యొక్క పాదపద్మాలలో, మధువ్రతమ్ = తుమ్మెదలవలె నిలకడగా ఆదరంతో వర్తించేవారైన, వరయోగినమ్ ఏవ = శ్రీవరవరమునుల విషయంలోనే, మామికా మతిః = నా బుద్ధి, సాదరం = ప్రీతితో, అన్వహం = ప్రతిదినం, ఆసీదతు = పొందుగాక !

తిరుమళ్ళిశైప్పిరాన్ వంటి పెద్దలచే తమ శిరస్సుకు భూషణముగా అలంకరింపబడిన పేయాళ్ళ్వార్లయొక్క శ్రీచరణపద్మములలో తుమ్మెద అయిన శ్రీవరవరమునులయందే నా మనస్సు ఆదరముతో ఎల్లప్పుడు ప్రవర్తింపవలెను- అని భావము.

“మహదుత్తంసితయోః” -అనునపుడు గొప్పవారైన తిరుమళ్ళిశై ప్పిరాన్చే శిరోభూషణముగా అలంకరింపబడినదనియును అర్థమును గ్రహింపవచ్చును. తిరుమళ్ళిశై ప్పిరాన్ను సంస్కరించినవారు పేయాళ్ళ్వార్లు. (ఈ వృత్తాంతాన్ని గురుపరంపరా ప్రభావాదులలో కాననగును.) లేక, మహచ్ఛబ్దానికి శ్రీరామానుజులనే అర్థాన్ని గ్రహించి, **“మన్నియపేరిరుళ్ మాణ్డపిన్ కోవలుళ్ మామలరాళ్ తన్నొడుమాయనై క్కణ్డమైకాట్టుమ్ తమిళ్ళ్తలైవన్ పొన్నడిపోత్తు మిరామానుశన్”** అనే అముదనార్ సూక్తిని దానికి ఉదాహరణంగా చెప్పవచ్చు. మహనీయులైన శ్రీరామానుజులచే శిరస్సుపై ధరించబడిన చరణపద్మాలను కలవారిని తాత్పర్యం. శ్రీవరవరమునుల మనస్సు పేయాళ్ళ్వార్ల శ్రీచరణపద్మముల భోగ్యతలో అభినివిష్టమైనది. అణ్ణన్యొక్క మనస్సు శ్రీవరవరమునుల శ్రీచరణపద్మములలో అభినివిష్టమైనదని ఇచటి హృద్యభావము.

44. శ్రీవిష్ణుచిత్తపదపద్మరజోఽనుషంగాత్
చిత్తం యదీయ మరజస్కతయా సమింధే ।
అవ్యాజవత్సలతయా ప్రథిత స్సదాఽస్మాన్
అవ్యా త్స సుందరవరో మునిసార్వభౌమః ॥

యదీయం చిత్తం = ఏ మణవాళమహామునుల చిత్తం, శ్రీవిష్ణుచిత్తపద పద్మరజః+ అనుషంగాత్ = శ్రీవిష్ణుచిత్తుల (పెరియాళ్ళ్వార్ల) పాదాలనే పద్మాలయొక్క రజస్సు (పుప్పొడి) యొక్క సంబంధంవల్ల, అరజస్కతయా = రజోగుణం (తమోగుణం) లేనిదానిదై, అందు చేత, సమింధే = ప్రకాశిస్తున్నదో, అవ్యాజవత్సలతయా = సహజమైన వాత్సల్యగుణంచేత, ప్రథితః = ప్రసిద్ధులైన, సః సుందరవరః మునిసార్వభౌమః = ఆ రమ్యజామాతృముని సార్వభౌములు, సదా = ఎల్లప్పుడు, అస్మాన్ = మనలను, అవ్యాత్ = రక్షించుగాక !

ఏ మణవాళమహామునుల మనస్సు శ్రీవిష్ణుచిత్తులగు పెరియాళ్ళ్వార్ల శ్రీపాద పద్మముల రజస్సుయొక్క (పుప్పొడి) సంబంధమును కల్గి, అందువలననే రజోగుణరహితమై

వెల్గుచున్నదో, నిర్హేతుకముగానే వత్సలురని ప్రసిద్ధిని పొందినవారగు ఆ శ్రీమణవాళ మహాములు ఎల్లప్పుడు దాసులను రక్షింతురుగాక !- అని భావము.

పూర్వార్ధములో రజస్సంబంధముచే రజస్సంబంధము లేకుండుట అనెడి విరోధము అర్థమున స్ఫురించును. పెరియాళ్వార్ల శ్రీచరణరేణువుచే రజోగుణరహితమై, శుద్ధసత్త్వ గుణమును కల్గినదియై వెలుగుచున్నదను అర్థవిరోధపరిహారమును గ్రహింపనగును. అందుచే ఇచట విరోధాభాసాలంకారము కలదు.

ఆళ్వార్ల క్రమమునుబట్టి, పేయాళ్వార్లను గూర్చి గడచిన (43వ) శ్లోకములో పల్కుటచే, తరువాత ఈ శ్లోకము తిరుమழிశైప్పిరాన్‌ను గూర్చినదై కావలసి ఉండగా, అట్లుకాక, పెరియాళ్వార్లనుగూర్చి ఇందులో పల్కడం, అముదనార్‌ను ఒకవిధంగా అనుసరించడమే. అముదనార్‌కూడా ముదలాళ్వార్లనుగూర్చి పల్కిన తరువాత, తిరుప్పాణ్‌నుగూర్చి పల్కి ఆ తరువాత తిరుమழிశైప్పిరాన్‌ను కీర్తించారు.

45. క్షీరం శర్కరయేవ యద్విహితయా స్వాభిఖ్యయా వ్యాఖ్యయా
శ్రీగోదాగురుభారతీ సుమహితా పుష్ణాతి సా మాధురీమ్ ।
తస్య శ్రీపదపద్మయుగ్మ మనిశం కాంతోపయంతు ర్మునేః
స్మారం స్మార మహం విధూతదురితో యాయా మనాయాసతః ॥

యద్విహితయా = ఏ శ్రీమణవాళమహామునులచే చేయబడ్డ (రచింపబడ్డ), స్వ+అభిఖ్యయా వ్యాఖ్యయా = తన పేరును కల్గిన వ్యాఖ్యానముతో, శ్రీగోదాగురుభారతీ= గోదాదేవికి తండ్రి, ఆచార్యులు అయిన పెరియాళ్వార్లయొక్క ఆ శ్రీసూక్తి, సుమహితా = మిక్కిలి గొప్పదై, క్షీరం శర్కరయా ఇవ = చక్కెరతో కూడిన పాలవలె, మాధురీం పుష్ణాతి= మాధుర్యాన్ని నిండుగా కల్గి ఉన్నదో, తస్య కాంతోపయంతుః మునేః = ఆ శ్రీమణవాళ మహామునులయొక్క, శ్రీపదపద్మయుగ్మమ్ = శ్రీచరణాలనే పద్మాల జంటను, అనిశం= నిత్యం, స్మారంస్మారం = మాటిమాటికి స్మరించి, అహం = నేను, విధూతదురితః = పాపాలను విదల్చుకొన్నవాడనై, అనాయాసతః = సులభంగా, యాయామ్ = కాగలను.

చక్కెరతో కూడిన పాలు ఏ రీతిలో మిక్కిలి మధురముగా నుండునో, అట్లే, ఏ మణవాళమహామునులు అనుగ్రహించిన ప్రసిద్ధమైన వ్యాఖ్యానముతో కూడిన, గోదాదేవికి పితృపాదులగు పెరియాళ్వార్ అనుగ్రహించిన పెరియాళ్వార్‌తిరుమొழி అను దివ్య ప్రబంధము మిక్కిలి మాధుర్యముతో కూడినదిగా ప్రశంసింపబడుచున్నదో, విశదవాక్ శిఖామణియైన ఆ మణవాళమహామునుల శ్రీపాదపద్మములను ఎల్లప్పుడు ప్రేమతో అనుసంధించి, దానిచే అనాయాసముగా పాపములను పోగొట్టుకొందును- అని ఇందు అనుచున్నారు.

పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన పెరియాళ్వార్ తిరుమొళి వ్యాఖ్యానములో నాల్గు పదుల (శతకముల) వ్యాఖ్యానము లుప్తమగుటచే, భక్తుల ప్రార్థనకు అంగీకరించి, శ్రీవరవరమునులు ఆ భాగమునకు వ్యాఖ్యానమును అనుగ్రహించిరి. ఈ వ్యాఖ్యానముయొక్క మాధుర్యమును ఆస్వాదించిన భక్తులు మిగిలిన భాగముకూడ అగ్నిదగ్ధము అయిఉండినచో బాగుండెడిదికదా! దానికికూడా అమృతముకంటె తీయని వ్యాఖ్యానమును శ్రీమణవాళ వరవరమునులు అనుగ్రహించి యుందురు కదా! అని అనిరట.

వాధూలవీరరాఘవాచార్యస్వామివారు రచించిన శ్రీవరవరముని సుచరితచషకమనే లఘుగ్రంథంలో **"ఆఖ్యాతాం కృష్ణపాదైః కలికలుషబలాత్ కర్శితాం పూర్వటీకాం దృష్ట్వా భట్టేశసూక్తేః లలితరసమయీం వ్యాక్రియాం సాధు చక్రే"** అని ఈ అంశం ప్రస్తుతింప బడింది. ఆ వ్యాఖ్యమాధుర్యాన్ని చూచి కన్దాడై నాయన్ అనే ఆచార్యులు ఆశ్చర్యపడి **"ఇన్నాళ్ళుతు పాట్టుక్కుమ్ శేషియాతే మాట్టప్పోకాతొళివతే"** (ఈ నలభై పాశురాలు కూడా లుప్తం కాకుండా, మిగిలి ఉన్నాయే!) అని అంటూ "మిగిలిన నలభైపాశురాల వ్యాఖ్యానంకూడా లోపించి ఉంటే బాగుండేది కదా!" అని అన్నట్లు యతీంద్రప్రవణ ప్రభావమనే గ్రంథంలో తెలుపబడిన వృత్తాంతాన్ని **"క్షీరం శర్కరయేవ"** ఇత్యాది సూక్తికి ఉదాహరణా గ్రహించవచ్చు.

46. యత్కృతా న్మంగళాశాసనా దన్వహం మంగళాని శ్రియో వల్లభో విందతి ।
తస్య గోదాగురో ర్మంగళాశాసనం కుర్వతే స్యాన్మహాయోగినే మంగళమ్ ॥

యత్కృతాత్ = ఏ పెరియాళ్వార్లు అనుగ్రహించిన, మంగళాశాసనాత్ = మంగళాశాసనంవల్ల, అన్వహం = ప్రతిదినం, శ్రియః వల్లభః = శ్రియఃపతి, మంగళాని = మంగళాలను, విందతి = పొందుతున్నాడో, తస్య =ఆ, గోదాగురోః = గోదాదేవికి తండ్రి అయిన పెరియాళ్వార్లకు, మంగళాశాసనం = మంగళాశాసనాన్ని, కుర్వతే = చేసే, మహాయోగినే = పెరియజీయర్‌కు, మంగళం = మంగళం.

మంగళకరమగు లక్ష్మీదేవికి వల్లభుడు, పరమమంగళ స్వరూపుడగు శ్రియఃపతియు ఏ పెరియాళ్వార్ల నిత్యమంగళాశాసన బలముచే మిక్కిలి శుభమును పొందుచున్నాడో, ఆ పెరియాళ్వార్లను నిత్యము మంగళాశాసనమును చేయు మణవాళమహామునులకు **"నిత్యశ్రీః నిత్యమంగళమ్"** కలుగుగాక !

"తస్య గోదాగురో ర్మంగళం కుర్వతే స్యాన్మహాయోగినే మంగళమ్" అని అనడంవల్ల చరమపర్వనిష్ఠ సూచింపబడినది. **"మహాయోగి"** అనే పదం ద్రావిడ భాషలోని **"పెరియజీయర్"** అనే నామానికి సంస్కృతీకృతరూపం.

47. క్షోణీసారపురీకృతావతరణే స్వీయోక్తిసందర్శితా-
శేషామ్నాయశిరోరహస్యనికరే శ్రీభక్తిసారే మునౌ ।
భక్త్యా భూషితమానసే వరమునౌ భక్తిం పరాం బిభ్రతో
భక్త్యా నిత్య ముపాసిషీయ విలసత్తద్భక్తిధన్యానహమ్ ॥

క్షోణీసారపురీకృతావతరణే = మహీసారక్షేత్రంలో అవతరించినవారు, స్వీయోక్తి సందర్శిత+అశేష+ఆమ్నాయ శిరోరహస్యనికరే = తమ సూక్తులతో సమస్త వేదాంత రహస్యార్థాలను దర్శింపజేసినవారు అయిన, శ్రీభక్తిసారే మునౌ = శ్రీభక్తిసారమునుల (తిరుమழிశై ఆழ்వార్ల) విషయంలో, భక్త్యా భూషితమానసే = భక్తిచే అలంకరింపబడ్డ మనస్సును కల, వరమునేః = మణవాళ మహామునులయందు, పరాం భక్తిం బిభ్రతః = గొప్ప భక్తిని కల్గి ఉండేవారు, విలసత్ తత్ భక్తిధన్యాన్ = ఆ మణవాళమహామునుల విషయంలో ఉండే భక్తిచేత ధన్యులు అయినవారిని, అహం = నేను, భక్త్యా= భక్తితో, నిత్యం = నిత్యం, ఉపాసిషీయ = సేవించగలను.

మహీసారక్షేత్రమగు తిరుమழிశైలో అవతరించినవారును, తమయొక్క రెండు ప్రబంధములలో సకలవేదాంతరహస్యార్థముల సారమును వ్యక్తీకరించినవారును, భక్తిసారులను తిరునామమును కల్గినవారును అగు తిరుమழிశైప్పిరాన్ విషయమున భక్తిని కలవారైన శ్రీమణవాళమహామునులపట్ల పరమభక్తిని కలవారై, వారి విషయమున అధికమైన ప్రావణ్యముచే భాగ్యశాలురైనవారికి దాసుడనగు నేను భక్తితో నిత్యము సేవింతును- అని అణ్ణన్ అనుచున్నారు.

"యాన్ ముకమాయ్ అన్దాది మేలిట్టు అఱివిత్తేన్ ఆழ்పొరుళై చ్చిన్దామల్ కొణ్మినీర్ తేర్న్దు" (నా సూక్తి మూలంగా గంభీరమైన అర్థాలను అన్దాది ప్రక్రియలో ఉపదేశించాను. మీరు గమనించి వీనిని చెదరకుండా మనస్సులో నిలుపుకొనండి.) అనుచు తిరుమழிశైప్పిరాన్ అనుగ్రహించిరి. దానిని అనుసరించుచు **"స్వీయోక్తి సందర్శితా శేషామ్నాయశిరోరహస్యనికరే"** అని అణ్ణన్ పల్కిరి. నాన్ముకన్ తిరువన్దాది, తిరుచ్చన్ద విరుత్తము అను రెండు ప్రబంధములను తిరుమழிశైప్పిరాన్ అనుగ్రహించిరి.

"స్వీయోక్తిసందర్శితాశేషామ్నాయ శిరోరహస్యనికరా" అనే ప్రయోగానికి అనుగుణంగా **"ఆలోడ్యసర్వశాస్త్రాణి విచార్యచపునః పునః, ఇదమికం సు నిష్పన్నం ధ్యేయో నారాయణః సదా"** అని అంటూ సమస్తశాస్త్రార్థ తత్త్వంగా ఆవిష్కరింపబడ్డ శ్రీమన్నారాయణ పరత్వాన్ని ధ్యేయత్వాన్ని భక్తిసారమునీంద్రులు **"నాన్ముకనై నారాయణన్ పడైత్తాన్"** అని అంటూ నారాయణుడే సమస్తజగత్తుకు మూలమని, **"తిరువిల్లాత్తేవరై తేఱేల్ మిన్ తేవు"** అని అంటూ లక్ష్మివిశిష్టుడైన శ్రీమన్నారాయణుడొక్కడే ఉపాస్యుడని పల్కి, దానినే చివరలో కూడా **"ఇని యఱిన్దేన్...నల్గిరిశై నారణన్ నీ నన్గఱిన్దేన్ నాన్"** అని అంటూ ఈ సత్యాన్ని తిరిగి పలికారు కదా!

48. యచ్చిత్తం రఘుశేఖరాంఘ్రికమలద్వంద్వైకవందీకృతం
తస్య శ్రీకులశేఖరస్య పదయోః సూక్తౌ చ సక్తాశయమ్ ।
తద్వద్రంగభుజంగపుంగవగిరిప్రేమానువిద్ధాశయం
చేతః ! కాంతవరం విభావయ సదా యోగీశ్వరం సాదరమ్ ॥

యత్ చిత్తం = ఏ కులశేఖరాళ్వార్ల చిత్తము, రఘుశేఖర+ అంఘ్రికమలద్వంద్వైక వందీకృతం = శ్రీరాముని చరణకమలాల జంటలో బందీగా చేయబడిందో, తస్య= ఆ, శ్రీకులశేఖరస్య = కులశేఖరాళ్వార్ల యొక్క, పదయోః = పాదాలలో, సూక్తౌ చ = సూక్తిలోను, సక్త+ ఆశయం = మిక్కిలిగా ప్రావణ్యాన్ని కల్గిన హృదయాన్ని కలవారు, తద్వత్ = అదే రీతిలో, రంగ = శ్రీరంగనాథునిలో, భుజంగపుంగవగిరి = వేంకటేశ్వరునిలో గల, ప్రేమ = భక్తిచేత, విద్ధ+ఆశయం= ఆర్తితో కూడిన హృదయాన్ని కలవారైన, కాంతవరం యోగీశ్వరం = శ్రీమణవాళ మహామునులను, చేతః = ఓ మనసా !, సదా = ఎల్లప్పుడు, సాదరం = భక్తితో, విభావయ = భావించుము.

ఏ కులశేఖరాళ్వార్ల ఉల్లము శ్రీరాఘవుని పాదకమలములో అభినివిష్టమై, అతని కీర్తిని పాడుటలోనే ఆసక్తమైయున్నదో, ఆ కులశేఖరాళ్వార్ల శ్రీచరణములందు, వారు శ్రీసూక్తి అగు పెరుమాళ్ తిరుమొళి ప్రబంధమునందు ఆదరమును కల్గిన మనస్సు కల వారును, ఆ ఆళ్వార్లవలెనే శ్రీరంగమునందును, శేషాచలమగు తిరుమలలోను ప్రేమతో కూడిన మనస్సును కలవారును, యోగులలో శ్రేష్ఠులైన శ్రీవరవరమునులను ఓ మనసా! నీవు ఆదరముతో నిత్యము భావింపుము.

భుజంగపుంగవుడు- సర్పశ్రేష్ఠుడు- ఆదిశేషుడు, గిరి=కొండ, శేషాచలమని అర్థము.

ఈ శ్లోకములో రెండవ పాదము మూడవ పాదముగా, మూడవ పాదము రెండవ పాదముగా మార్చి అనుసంధించుటలో ఎక్కువ అర్థస్వారస్యమున్నది". కులశేఖరాళ్వార్లు తమ ప్రబంధములో విశేషముగా శ్రీరంగనాథుని గూర్చి ఒక దశకము, వేంకటేశ్వరుని గూర్చి ఒక దశకము పాడిరి కదా !

"తెన్నరఙ్గమ్ పాడవల్ల శీర్ పెరుమాళ్" (శ్రీరంగాన్ని కీర్తించగల్గిన కల్యాణగుణాలను కల కులశేఖరులు) అనే పెరుమాళ్ తిరుమొళి తనియన్ పాశురం స్మరణీయం. శ్రీరామచంద్రుని పట్ల కులశేఖరులకు గల భక్తి వారిచరిత్రలో కానవచ్చును. వారి ప్రబంధములో చివర దశం శ్రీరామాయణ గాథను సమగ్రంగా అనుసంధించడం కూడా దీనికి ఒక నిదర్శనం.

49. శ్రీరంగాధిపదివ్యమంగళవపుస్సౌందర్యసారామృత-
స్రోతోమగ్నమునీంద్రవాహనగుణోదన్వన్నిమగ్నాశయమ్ ।

చేతః ! కాంతవరం విచింతయ మునిం యచ్చింతనం సంతతమ్
కుర్వంతో హి విదంతి దైవ మపరం సంతో న యస్మాత్పరమ్ ॥

శ్రీరంగ+అధిప = శ్రీరంగనాథునియొక్క, దివ్యమంగళ =దివ్యమైన, మంగళకరమైన, వపుః = విగ్రహంయొక్క, సౌందర్యసార = సౌందర్యసారమనే, అమృత =అమృతంయొక్క స్రోతః= ప్రవాహంలో, మగ్న = మునిగిన (అవగాహించిన) వారైన, మునీంద్రవాహన = మునివాహనులనే పేరు కల తిరుప్పాణ్ ఆళ్వార్లయొక్క, గుణ+ఉదన్వత్ = గుణ సముద్రంలో, నిమగ్న = పూర్తిగా మునిగిన, ఆశయం = మనస్సును కలవారు, యత్ చింతనం = ఏ మణవాళమహామునులయొక్క, చింతనం = ధ్యానమును, సతతం = సదా, కుర్వంతః = చేసేవారై, యస్మాత్ = ఏ శ్రీవరవరమునులకంటే, పరం = ఉత్కృష్ట మైన, అపరం = ఇంకొక, దైవం = దైవమును, సంతః = సత్పురుషులు, న హి విదంతి = తెలియరో, అటువంటి, కాంతవరం మునిం = రమ్యజామాతృమునిని, చేతః= ఓ మనసా , విచింతయ= చింతించుము.

శ్రీరంగమున ఆదిశేషునిపై పరుండియున్న శ్రీరంగనాథుని దివ్యమంగళ-విగ్రహమును పాదములనుండి కిరీటమువరకు దర్శించి, అనుభవించి, ఆ స్వామి తిరుమేనిసౌందర్యసారమైన అమృతప్రవాహములో నిమగ్నులై, లోకసారంగముని భుజస్కంధముల పైకి ఎక్కి పోవుటచే మునివాహనులను పేరుతో కీర్తింపబడునట్టి తిరుప్పాణాళ్వార్లయొక్క గుణములందు మునిగిన మనస్సును కలవారగు శ్రీమణవాళ మహామునులనే, ఓ మూఢమనసా ! నీవు ఎల్లప్పుడు చింతింపుము. ఆ వరవరమునులను చింతించువారగు భక్తులు వారిని తప్ప వేఱొక దైవమును స్మరింపరు- అని తాత్పర్యము.

తిరుప్పాణాళ్వార్లు **"ఎన్నముదినై క్కణ్డ కణ్‌గళ్ మఱ్ఱొన్ఱినై క్కాణావే"** (నా అమృతస్వరూపుని దర్శించిన కన్నులు వేఱొక దానిని చూడవు కదా) అనిరి. ఇది ప్రథమ పర్వనిష్ఠ. మామునుల దాసులును శ్రీవరవరమునులను తప్ప వేఱొకరిని దర్శింపరు. ఇది చరమపర్వనిష్ఠ. శ్రీవరవరమునుల దివ్యమంగళవిగ్రహమును వర్ణించుచు అణ్ణన్ అమలనాదిపిరాన్ (**"పాదాది కేశమాలై"**) అను ప్రబంధమును రచించుట ఇచట స్మరణీయము.

తిరుప్పాణ్ పెరుమాళ్ శ్రీరంగనాథుని సౌందర్యసముద్రంలో మునిగి ఆళ్వార్లు కాగా, వారి గుణాబ్ధిలో మునిగి వేఱొక ఆళ్వార్లు అయ్యారనే అర్థస్వారస్యం మొదటి రెండు పాదాలలో గమనించదగినది.

50. యత్పాదరేణువహనేన సుగంధిమౌళి
స్తం బ్రహ్మబం(గ్రం)ధ మధిగచ్ఛతి ముక్తి(క్త)బంధః ।

తద్విష్ణుభక్తపదరేణుమునీంద్రభక్తం
కాంతోపయంతృముని మన్వహ మాశ్రయేయమ్ ॥

యత్ పాదరేణువహనేన = ఏ తొండరడిప్పొడి ఆళ్వార్ల పాదరజస్సును దాల్చడం చేత, సుగంధిమౌళిః = సుగంధాన్ని కల్గిన శిరస్సును కలవాడు, ముక్తబంధః= సంసార బంధంనుండి విడివడినవాడై, తం = ఆ, బ్రహ్మబంధం = పరమాత్మతో సంబంధాన్ని, అధిగచ్ఛతి = పొందుతున్నాడో, తత్ విష్ణుపదరేణుమునీంద్రభక్తం = ఆ తొణ్డరడిప్పొడి ఆళ్వార్ల భక్తులు అయిన, కాంతోపయంతృమునిం = శ్రీమణవాళ మహామునులను, అన్వహం = ప్రతిదినం ఆశ్రయేయం = ఆశ్రయిస్తాను.

ఏ తొండరడిప్పొడి ఆళ్వార్ల శ్రీపాదరేణువును తల దాల్చుటచే మంచి సుగంధమును కల శిరస్సును కలవాడు, సంసారబంధమునుండి విడివడి, బ్రహ్మసంబంధమును పొందుచున్నాడై, ఆ ఆళ్వార్లపట్ల భక్తిని కలవారగు మణవాళమహామునులను దాసుడనగు నేను ఆశ్రయింతును- అని అనుచున్నారు.

"ముక్తబంధః" -అను సరి అయిన పాఠమొకటి ఉండి యుండవచ్చునా ! అని ఊహ. **"తం బ్రహ్మగంధ మధిగచ్ఛతి"** అను పాఠము ఉండి యుండవచ్చునా ! అనియును భావన. ముక్తుడు శ్రీవైకుంఠమును చేరునపుడు దారిలో బ్రహ్మగంధము మొదలగునవి ముక్తునిలో ప్రవేశించునని ఉపనిషత్తులలో చెప్పబడినది. అందుచే ఉపనిషత్ప్రసిద్ధమైన బ్రహ్మగంధమును పొందెదను -అను అర్థము దీనివలన స్ఫురించును.

51. యత్పాదుకాత్వ మధిగచ్ఛతి సంయమీంద్రః
తస్మిన్ మునౌ వకుళమాలిని బద్ధభావమ్ ।
తత్సూక్తిసాగరచతుష్టయపూర్ణచంద్రం
సౌమ్యోపయంతృయమినం శరణం వృణేఽహమ్ ॥

సంయమీంద్రః = భగవద్రామానుజులు, యత్ పాదుకాత్వం = ఏ నమ్మాళ్వార్లకు పాదుకలై ఉండే స్థితిని, అధిగచ్ఛతి = పొందుతున్నాడో, తస్మిన్ వకుళమాలిని మునౌ = ఆ నమ్మాళ్వార్ల విషయంలో, బద్ధభావమ్ = భావబంధాన్ని కలవారు, తత్ సూక్తిసాగర చతుష్టయ = ఆ నమ్మాళ్వార్ల శ్రీసూక్తులనే నాల్గు సముద్రాలకు, పూర్ణచంద్రం = ఆనందాన్ని కల్గించే పూర్ణచంద్రులు అయిన, సౌమ్యోపయంతృయమినం = శ్రీమణవాళమహా మునులను, శరణం = ఉపాయంగా, అహం = నేను, వృణే = వరిస్తున్నాను.

యతిరాజులగు భగవద్రామానుజులు ఏ నమ్మాళ్వార్ల పాదుకయై వెలుగు చున్నారో, వకుళమాలను దాల్చినవారగు ఆ నమ్మాళ్వార్లపట్ల భావబంధమును కలవారును, ఆ ఆళ్వార్లు అనుగ్రహించిన నాల్గు ప్రబంధములనెడి నాల్గు సముద్రములకును పూర్ణచంద్రుని వంటివారగు శ్రీమణవాళమహామునులను దాసుడనగు నేను శరణముగా ఆశ్రయింతును.

చంద్రోదయసమయములో చంద్రుని చూచి సాగరము ఉప్పొంగును. అట్లే, శ్రీవరవరమునుల అవతారమువలన నమ్మాళ్వార్లు అనుగ్రహించిన సముద్రములవలె గభీరము లైన నాల్గు ప్రబంధములును సమృద్ధిని పొందినవి. 53వ శ్లోకంలో కూడా **"తస్య వచసాం చతుర్ణాం సింధూనా మమృతకిరణః"** అని స్తుతింపబడింది. **"కన్దమలర్పొழిల్ శూழ் కురుకాదిపన్ నన్నులైకళ్ విళఙ్గిడు నాళ్"** (సుగంధాన్ని కల పూలను కల్గిన తోటలచే పరివేష్ఠితమైన కురుకాపురికి అధిపతి అయిన నమ్మాళ్వార్ల ప్రబంధాలు వెలిగే దినం) కదా శ్రీవరవరమునుల అవతారదినమగు తిరుమూల త్తిరునాళ్ కీర్తింపబడుచున్నది.

52 మూర్తో యో భక్తిభూమ్నా మురహరిపదయోః యన్మహిమ్నః కలాఽపి
వ్యాసాదీనా మలభ్యా భుజగవిహగరాట్సైన్యభృద్విస్మయాయ ।
యత్సూక్తీనాం గరిమ్ణే స్పృహయతి సకలోఽప్యాగమోఽపౌరుషేయః
తస్మిన్ న్యస్తాత్మభారః శఠజితి వరయోగ్యస్తు మే స్వస్తి భూమ్నే ॥

మురహరి పదయోః = మురారి అయిన భగవానుని పదాలలో గల, భక్తిభూమ్నా= భక్తియొక్క అతిశయముతో, యః = ఏ నమ్మాళ్వార్లు, మూర్తః = మూర్తీభవించిన వారో (మురారి పదభక్తి మూర్తీభవించినట్లున్నవారో), యత్ మహిమ్నః = ఎవరి మహిమయొక్క కలా అపి = ఏకదేశము అయినా, వ్యాసాదీనామ్ అపి అలభ్యా = వ్యాసాది మహర్షులకు సైతము దొరుకదో, భుజగవిహగరాట్ విస్మయాయ = ఆదిశేషునకు, గరుడునకు ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నదో, యత్ సూక్తీనాం = ఏ నమ్మాళ్వార్ల సూక్తుల యొక్క, గరిమ్ణే = గొప్పతనం కోసం, అపౌరుషేయః సకలః ఆగమః అపి = అపౌరుషేయమైన సమస్తవేదము, స్పృహయతి = ఆశపడుతున్నదో, తస్మిన్ శఠజితి = ఆ శఠకోపులలో, న్యస్త+ఆత్మభారః = తన రక్షణ భారాన్ని నిలిపిన, వరయోగీ = మణవాళమహామునులు, మే స్వస్తి భూమ్నే = గొప్ప మంచికోసం, అస్తు =అగుగాక !

ఏ నమ్మాళ్వార్లు, మురరిపు అగు శ్రీకృష్ణుని శ్రీచరణద్వంద్వమునందలి పరమభక్తి మూర్తీభవించినట్లున్నవారో, భగవానుని నిర్హేతుకకటాక్షమువలన **"మయర్వఱ మదినలమ్"** అనునట్లు భ్రమవిప్రలంభాదిదోషరహితమైన జ్ఞానమును పొందిన ఏ నమ్మాళ్వార్ల ప్రభావముయొక్క ఏకదేశముకూడ తమయొక్క యత్నముచే జ్ఞానభక్త్యాదులను పొందిన వ్యాసాదిమునులచే సైతము పొందబడలేదో, ఏ ఆళ్వార్ల గొప్పతనము అనంతగరుడ విష్వక్సేనులను సైతము విస్మయపడునట్లు చేసినదో, అపౌరుషేయమై, నిత్యమైన నాల్గు వేదములును ఏ ఆళ్వార్ల శ్రీసూక్తుల గొప్పతనమును పొందగోరుచున్నదో, ఆ నమ్మాళ్వార్ల సన్నిధిలో సమర్పింపబడిన సమస్తభారమును కలవారగు శ్రీవరవరమునులు నా సమస్త మంగళములకును కారణభూతులు కావలయును.

"ఋషిం జుషామహే కృష్ణతృష్ణాతత్త్వ మివోదితమ్" అనుచు కృష్ణభక్తియొక్క మూర్తరూపమే శఠకోపులని భట్టర్ పల్కిరి కదా ! నమ్బిళ్ళై తిరువాయ్‌మొ*ழ*ి ప్రబంధం ఈడు వ్యాఖ్యకు ప్రవేశం (ముదల్‌శ్రియఃపతి)లో నమ్మాழ్వార్లకు లక్ష్మణుడు, సీతాదేవి, వాల్మీకి మొదలైన వారితో గల సామ్యాన్ని ప్రతిపాదించారు. అటువంటి భావాన్ని అణ్ణన్ రెండుమూడు పాదాలలో వ్యక్తీకరించడం గమనించదగినది.

తిరువీథులలో స్వామి వేంచేయునపుడు స్వామికి ముందు ద్రావిడవేద పారాయణము వెనుక సంస్కృతవేద పారాయణము చేయబడుట గమనింపదగినది. కంబ మహాకవి శఠకోపర్ అన్దాది ప్రబంధంలో **"వేదత్తిన్ మున్ శెల్‌క మెయ్యుణర్న్దోర్ విరిఞ్జన్ ముదలోర్ కోదఱ్ఱ ఞాన కొழுన్దిన్ మున్ శెల్‌క, కుణఙ్కడన్ద పోదక్కడల్ ఎఙ్గళ్ తెన్‌కురుకూళ్ పునిదన్ కవియోర్ పాదత్తిన్ మున్‌శెల్లుమే తొల్లైమూల పరమ్‌శుదరే"** (జగన్మూలంగా చెప్పబడే పరంజ్యోతిస్స్వరూపుడైన పరమాత్మ ఉత్సవసమయంలో సంస్కృతవేదం కంటే ముందుగా వేంచేస్తే వేంచేయవచ్చు. తత్త్వజ్ఞానపూర్ణులైన మహామునులయొక్క బ్రహ్మాది దేవతలయొక్క నిర్దుష్టమైన జ్ఞానాంకురాన్నికూడా దాటిపోవచ్చు. కాని, అంతు లేని జ్ఞాన సముద్రులైన నమ్మాழ్వార్లు పాడిన తిరువాయ్‌మొழி మొదలైన దివ్యప్రబంధాలలోని ఒక్క పాశురాన్ని అయినా దాటిపోగలడా? పోలేదు?) అనే పాశుర భావం స్మరణీయం.

53. శఠారాతిశ్రీమద్వదనసరసీజాతమిహిరః
తదీయశ్రీపాదాంబుజమధుకర స్తస్య వచసామ్ ।
చతుర్ణాం సింధూనా మమృతకిరణో భక్తజనతా-
సురద్రుః పాయా న్మాం వరమునివరోఽవేలమహిమా ॥

శఠారాతి = నమ్మాழ్వార్లయొక్క శ్రీమద్వదన = అందమైన వదనమనెడి, సరసీజాత = పద్మానికి, మిహిరః = సూర్యునివంటివారు, తదీయ శ్రీపాదాంబుజ = ఆ నమ్మాழ్వార్ల శ్రీచరణపద్మాలలో, మధుకరః= తుమ్మెదవంటివారు, తస్య = ఆ నమ్మాழ్వార్లయొక్క వచసాం చతుర్ణాం సింధూనాం = శ్రీసూక్తులనే నాల్గు సముద్రాలను ఉప్పొంగించే, అమృత కిరణః = చంద్రునివంటివారు, భక్తజనతాసురద్రుః = భక్తుల పాలిటి కల్పవృక్షము, అవేలమహిమా = అంతు లేని మహిమను కలవారు అయిన, వరమునివరః = శ్రీమణవాళమహామునులు, మాం = నన్ను, పాయాత్ = రక్షించాలి.

నమ్మాழ్వార్ల తిరుముఖమండలమను కమలమును వికసింపజేయగల సూర్యుడై, వారి శ్రీపాదపద్మములందు చేరిన తుమ్మెదయై, వారి శ్రీసూక్తులగు నాల్గు ప్రబంధములనెడి నాల్గు సముద్రములను ఉప్పొంగునట్లు చేయు చంద్రుడై, తనను ఆశ్రయించిన భక్తులకు కల్పవృక్షమై, అనగా- కల్పకమువలె సకలాపేక్షితప్రదానసమర్థుడై, నిరవధికమహిమతో కూడిన మునిశ్రేష్ఠులగు శ్రీవరవరమునులు నన్ను రక్షింతురుగాక !

ఈ శ్లోకంలో శ్రీవరవరమునులు సూర్యచంద్రులుగా, తుమ్మెదగా, కల్పవృక్షంగా అభివర్ణింపబడ్డారు.

54. శఠరిపుమునిదృష్టామ్నాయగూఢార్థతత్త్వ-
ప్రకటనపటులోకాచార్యసూక్త్యర్థజాతమ్ ।
వ్యవృణుత భవభాజాం గుప్తయే యః కృపావాన్
భవతు స వరయోగీ శ్రేయసే భూయసే నః ॥

శఠరిపుముని = నమ్మాళ్వార్లచేత, దృష్ట = దర్శింపబడ్డ, ఆమ్నాయ = ద్రవిడవేదం యొక్క, గూఢార్థతత్త్వ = గూఢాలైన అర్థతత్త్వాలను, ప్రకటన = వ్యక్తం చేయడంలో, పటు = సమర్థాలైన, లోకాచార్య = నమ్బిళ్ళైయొక్క, సూక్తి+అర్థజాతం = శ్రీసూక్తులలోని అర్థాల సమూహాన్ని, భవభాజాం గుప్తయే = సంసారుల రక్షణకోసం, యః కృపావాన్ = కరుణాశాలి అయిన ఏ శ్రీమణవాళమహామునులు, వ్యవృణుత = వివరించారో, సః వరయోగీ = ఆ శ్రీమణవాళమహామునులు, నః శ్రేయసే భూయసే భవతు = మనకు గొప్ప శ్రేయస్సును కల్గించాలి.

నమ్మాళ్వార్లచే దర్శింపబడి, వ్యక్తీకరింపబడిన ద్రావిడవేదమగు తిరువాయ్మొళ్ళి యొక్క రస్యరహస్యార్థములను చక్కగా అనుగ్రహించినవారు, లోకాచార్యులను పేరు గలవారైన నంబిళ్ళై అనుగ్రహించిన ఈడువ్యాఖ్యలోని అర్థములను కరుణను కల ఏమణవాళమహామునులు సంసారులగు మనవంటివారి రక్షణకొఱకు విశదముగా ఉపన్యసించిరో, ఆ మణవాళమహామునులు మనకు మిక్కిలిగా శ్రేయస్సును కల్గింతురుగాక!

నమ్బిళ్ళై అనుగ్రహించిన తిరువాయ్మొళ్ళి వ్యాఖ్యకు **"ఈడు"** అని పేరు. అనగా తిరువాయ్మొళ్ళి ప్రబంధవైభవానికి సాటి వచ్చే వ్యాఖ్య అని భావం. ఈ భావాన్ని అణ్ణన్ శ్లోకం పూర్వార్థంలో వ్యక్తం చేశారు. అయితే, అది అడవి కాచిన వెన్నెల కాకుండా అందఱికి అందేటట్లు చేసిన మహనీయులు వరవరమునులని శ్లోకం ఉత్తరార్ధంలో తెలిపారు. **"ఈడుముప్పత్తాఱాయిరప్పెరుక్కర్"** అని వరవరమునులు కీర్తింపబడుచున్నారు కదా! ఆ బిరుదును దృష్టిలోనుంచుకొని ఈ శ్లోకము రచింపబడినది. ఒక సంవత్సరకాలము పాటు ఈడు ముప్పత్తాఱాయిరప్పడి వ్యాఖ్యను శ్రీవరవరమునులు ఉపన్యసించగా శ్రీరంగనాథుడు ఆలకించిన వృత్తాంతం ప్రకృతంలో స్మరణీయం.

55. తాదృక్కేసరభూషదృష్టచతురామ్నాయాంగషట్కాత్మక-
స్వోక్త్యా నందితకేశవః కిల కలిప్రధ్వంసియోగీశ్వరః ।
నిత్యోద్బుద్ధయదీయహృత్సరసిజే పుష్ణాతి హంసశ్రియం
స శ్రేయాంసి తనోతు నః ప్రతికలం కాంతోపయంతా మునిః ॥

తాదృక్ = అటువంటి, (అనిర్వచనీయ వైభవాన్ని కల), కేసరభూషదృష్ట = వకుళ భూషణులైన నమ్మాళ్వార్లచే దర్శింపబడ్డ, చతుః ఆమ్నాయ+అంగషట్క+ఆత్మక = నాల్గు

వేదాలకు అంగభూతాలైన, ఆఱు ప్రబంధాలుగా ఉండే, స్వోక్త్యా=తన శ్రీసూక్తులతో, నందితకేశవః = కేశవుని ఆనందింపజేసినవారు, కలిప్రధ్వంసి యోగీశ్వరః కిల = కలివైరి సూరి అనబడే తిరుమంగైయాళ్వార్లు కదా! (ఆ ఆళ్వార్లు), నిత్య+ఉద్బుద్ధ = సదా ఉదయించిన – వికసించిన, యదీయ హృత్సరసిజే = ఏ శ్రీమణవాళమహామునుల హృదయమనే పద్మంలో, నిత్యనివాసం చేసే, హంసశ్రియం = హంసయొక్క శోభను, పుష్ణాతి=వర్ధిల్లజేస్తున్నారో, సః కాంతోపయంతా మునిః = ఆ శ్రీమణవాళమహామునులు, ప్రతికలం=ప్రతిక్షణం, నః=మనకు, శ్రేయాంసి = శుభాలను, తనోతు = విస్తరింప జేయాలి.

వకుళభూషణులగు నమ్మాళ్వార్లచే సాక్షాత్కృతమైన, నాల్గు ద్రావిడవేదములనబడు నాల్గు దివ్యప్రబంధములకును వివరణరూపములైన ఆఱు అంగములుగా ఆఱు ప్రబంధములను అనుగ్రహించినవారై, తమ దివ్యప్రబంధములచే భగవానుని మనస్సును ఆనందింపజేసినవారు, కలిధ్వంసియైన తిరుమజ్గైమన్నన్. ఎల్లప్పుడు ఆ ఆఱు ప్రబంధములను అనుసంధించుటచే ప్రబుద్ధమైన (తెలివిపొందిన, వికసించిన) వరవరమునుల మానసములో ఆ ఆళ్వార్లు తిరుమజ్గైయాళ్వార్లు రాజహంసగా విహరించి, వారిని ఆనందమును పొందునట్లు చేయుచున్నారో, అట్టి వరవరమునులు మనకు ప్రతిక్షణము మంగళములను కల్గింతురుగాక (కేసరమనగా వకుళపుష్పము).

"మాఱన్ పణిత్త తమిళ్ మఱైక్కు మజ్గైయర్కోన్ ఆఱజ్గమ్ కూఱవతరిత్త" అనే ఉపదేశరత్తినమాలై సూక్తి స్మరణీయం. **"స్వోక్త్యా నందితకేశవః"** అనే ప్రయోగానికి అనుగుణంగా ఈక్రింది ఐతిహ్యాన్ని స్మరించాలి.

పెరియతిరుమొళిలో తిరుమజ్గైయాళ్వార్లు **"మెయ్మ్మై శొల్లిల్ వెణ్శజ్గమొన్రేన్దియ కణ్ణ! నిన్తనక్కుమ్ కుఱిప్పాకిల్ కఱ్కలామ్ కవియిన్ పొరుళ్తానే"** అని అంటూ తిరుకణ్ణపురు దివ్యదేశంలోని శ్రీకృష్ణుని సంబోధించి, తమ సూక్తులలోని అర్థాలను గ్రహించాలనే ఆశ స్వామికి ఉన్నదని ఆ స్వామి ముఖంలోని భావాలనుబట్టి గ్రహించి, "శ్రీకృష్ణా! నీవు నావద్ద నా ప్రబంధాలలోని అర్థాలను గ్రహించాలనే ఉద్దేశ్యం ఉంటే వినవచ్చు" అని అన్నారట. ఆ మాటను విన్న పరమరసికుడు, భక్తవరతంత్రుడైన భగవానుడు "ఆళ్వార్లా! నేను తప్పకుండా మీవద్ద మీ ప్రబంధంలోని అర్థాలను ఆలకిస్తాను. అయితే నేనిపుడు అర్చారూపంగా ఉన్నందున ఆ పని వీలు కాదు. తరువాత ఇంకొక సమయంలో మీరు, మీ అవతార నక్షత్రం అయిన కార్తికమాసం కృత్తికలో మీపేరుతోనే, అంటే– **"కలికన్ఱిదాసర్"** అనే పేరుతోనే అవతరిస్తారు. అపుడు నేను నా నక్షత్రమైన రోహిణిలో అవతరించి, మీ ప్రబంధాల అర్థాన్నే కాక, ఆళ్వార్ల అందఱి ప్రబంధాల అర్థాలను మీవద్ద ఆలకిస్తాను" అని అన్నాడట. ఆవిధంగానే తిరుమంగైమన్నన్ నమ్పిళ్ళైగా, శ్రీకృష్ణుడు పెరియవాచ్చాన్ పిళ్ళైగా అవతరించారని, భగవానుని మాటను అనుసరించి శ్రీకృష్ణుని అవతారవిశేషమైన

పెరియవాచ్చాన్‌పిళ్ళై తిరుమంగైమన్నన్ అవతారవిశేషమైన నమ్బిళ్ళై సన్నిధిలో నాలాయిరదివ్యప్రబంధాలలోని అర్థాలను ఆలకించారని పెద్దలంటారు.

56. స్వకరలసచ్ఛితాగ్రకరవాలజితాబ్ధిసుతా-
దయితహృతానపాయనిగమాంతనిగూఢధనమ్ ।
కలిరిపుయోగివర్య మనిశం హృదయే నిదధత్
మనసి విహార మేతు సతతం మమ కాంతవరః ॥

స్వకర = తనచేతిలో, లసత్ = ప్రకాశించే, శిత+అగ్ర = పదునైన అంచును కల, కరవాలజిత = ఖడ్గంచే జయింపబడ్డ, అబ్ధిసుతాదయిత = శ్రియఃపతినుండి, హృత = హరించిన, అనపాయ = ఏనాడూ నశించని, నిగమాంత = వేదాంతాలోని, నిగూఢధనమ్ = గుప్తధనాన్ని కలవారు అయిన, కలిరిపుయోగివర్యం = కలివైరిసూరి అనబడే తిరుమంగై మన్నన్‌ను, హృదయే = హృదయంలో, అనిశం = సదా, నిదధత్ = భావిస్తున్న, కాంతవరః = శ్రీమణవాళమహామునులు, మమ మనసి = నా మనస్సులో, సతతం = ఎల్లప్పుడు, విహారమ్ ఏతు = విహరించాలి.

తమయొక్క శ్రీహస్తములో వెలుగు పదునైన ఖడ్గముయొక్క బలిమిచే శ్రియఃపతిని జయించి, అతనివద్దనుండి అపహరించిన వేదాంతశాస్త్రార్థమగు అష్టాక్షరీ మహామంత్ర మనెడి నశింపని ధనమును కలవారై, కలిని నిర్జించి, తఱిమినవారైన తిరుమంగై మన్నన్‌ను ఎల్లప్పుడు మనస్సులో నిలుపుకొనియున్న మణవాళమహామునులు నా మనస్సులో ఎల్లప్పుడు విహరింతురుగాక !

"మాయోనై వాళ్‌వలియాల్ మన్దిరఙ్గళ్ మఙ్గైయర్‌కోన్" అని కీర్తింపబడు కలియన్‌ను ఎల్లప్పుడు అనుసంధించు శ్రీవరవరమునులను దాసుడనగు నేను నిత్యము అనుసంధింతునని శ్లోకతాత్పర్యము. ఇందు ప్రస్తావింపబడిన ఐతిహ్యమును గురుపరంపరాప్రభావాదులలోని తిరుమఙ్గైయాழ்వార్ల చరిత్రలో చూడనగును.

ఈ సందర్భంలో యతీంద్రప్రవణప్రభావంలో ఉదాహరింపబడిన **"వేలణైత్త మార్వుమ్ విళఙ్గు తిరువెట్టెழுత్తై మాలురైక్క తాழ்త్త వలచ్చెవియుమ్, కాలణైత్త తణ్డైయుమ్ వీరక్కழలుమ్ తార్‌క్కలియన్ వాణ్ ముకముమ్ కణ్డుకళిక్కు మెన్‌కణ్"** (పూమాలికచేత అలంకరింపబడ్డ తిరుమఙ్గైయాழ்వార్లయొక్క అందమైన ముఖాన్ని, వేలాయుధంచేత అలంకరింపబడ్డ వక్షఃస్థలాన్ని, ప్రకాశించే అష్టాక్షరిని శ్రియఃపతి ఉపదేశించగా ఒగ్గిన కుడిచెవిని, కాలిలో అలంకరించుకొన్న దండకడియాలను, వీరకడియాలు దర్శించి నా కన్నులు ఆనందిస్తున్నాయి) అని మణవాళ మహామునులచేత అనుగ్రహింపబడిన పాశురాన్ని, **"ఇతువో తిరువరశు, ఇతువో మణఙ్గొల్లై, ఇతువో ఎழிలాలి ఎన్నుమూర్, ఇతువో తాన్ వెట్టుమ్ కలియన్ వేల్ నీట్టి నెడుమాలై ఎట్టెழுత్తు పతిత్త విడమ్"** – (ఇదే

కదా తిరుమఙ్గైయాళ్వార్ల బృందావనం! ఇదే కదా మణఙ్గొల్లై అనే ప్రదేశం ! ఇదే కదా ప్రకాశించే **"ఆలి"** అనే ఊరు, ఇదే కదా నఱికివేసే (హింసాప్రవృత్తిని కల) తిరుమఙ్గై యాళ్వార్ల వేలాయుధాన్ని చూచి (శ్రియఃపతి నుండి అష్టాక్షరిని కొల్లగొట్టిన చోటు) అనే శ్రీవరవరముని ప్రోక్తమైన పాశురం అనుసంధేయాలు. **"నిగమాంతనిగూఢధనమ్"** అంటే అష్టాక్షరి. **"ఋచోయజూంషి సామాని తథైవాథర్వణాని చ, సర్వమష్టాక్షరాంతస్థమ్"** అని కదా సూక్తి.

57. యద్ధస్తన్యస్తశస్త్రం శకలయతి కలిం యస్య సారస్వతం తు
స్రోతః శ్రోతౄ నశేషానపి సపది హృతాశేషతాపాన్ విధత్తే ।
తస్మిన్ నిర్ధూతతిష్యే జగదధిపధనస్తేయనిస్తుల్యభూమ్ని
న్యస్తాత్మా స్వస్తి విస్తారయతు మమ సదా సౌమ్యజామాతృయోగీ ॥

యత్ హస్తన్యస్తశస్త్రం = ఏ తిరుమంగైమన్నన్ చేతిలో ధరించిన ఆయుధం, కలిం = కలిపురుషుని, శకలయతి = ఖండఖండాలుగా చేస్తున్నదో, యస్య = ఏ తిరుమంగైమన్నన్ యొక్క, సారస్వతం స్రోతః తు = ప్రబంధాలనే ప్రవాహం, అశేషాన్ = అందఱిని, హృత+ అశేషపాపాన్ = హరింపబడ్డ సకలపాపాలను కలవారినిగా, సపది = వెంటనే, విధత్తే = చేస్తున్నదో, జగదధిప = లోకేశుడైన భగవానునియొక్క, ధన= ధనాన్ని, (ఆభరణాన్ని), స్తేయ = అపహరించడంలో, నిస్తుల్యభూమ్ని = సాటి లేని వైభవాన్ని కల్గిన, తస్మిన్ నిర్ధూతతిష్యే = కలిని పూర్తిగా నశింపజేసిన ఆ తిరుమంగై మన్నన్‌యొక్క విషయంలో, న్యస్తాత్మా = నిలిపిన, సమర్పించిన, ఆత్మను కలవారైన, సౌమ్యజామాతృయోగీ = శ్రీవరవరమునులు, మమ స్వస్తి = నాకు మంచిని, సదా విస్తారయతు = ఎల్లప్పుడు వర్ధిల్లజేయాలి.

ఏ ఆళ్వార్ల శ్రీహస్తములోనున్న వేలాయుధము కలిని ఖండఖండములు కావించు చున్నదో, ఏ ఆళ్వార్ల శ్రీసూక్తి అనెడి గొప్ప ప్రవాహము శ్రోతలందఱియొక్క సకలతాపము లను అప్పటికప్పుడే పోగొట్టుచున్నదో, భగవానుని ధనమును అపహరించుటచే కల్గిన అసాధారణ మహిమకు కల్గిన, కలిధ్వంసియగు ఆ తిరుమఙ్గైమన్నన్ యొక్క శ్రీపాదము లందు తమ సమస్తభారమును సమర్పించి, ఉజ్జీవించు శ్రీమణవాళమహామునులు ఎల్లప్పుడు నాకు కల్యాణములను కల్గింతురుగాక- అని భావం. **"ఇదం బ్రాహ్మమిదం క్షాత్రమ్"** అనే రీతిలో అటు అప్రతిభటవీరత్వాన్ని, ఇటు అనన్యాదృశకవితాశక్తిని కలవారుకదా తిరుమంగైమన్నన్.

"నిర్ధూతతిష్యః - నిర్ధూతః నిరస్తః తిష్యః కలిః యేన సః" అను బహువ్రీహిసమాసము ద్వారా కలిని నిర్జించినవారను అర్థము ఇచట స్ఫురించును. **"కలయామి కలిధ్వంసం కవిమ్"** అనే సూక్తిని మొదటి రెండుపాదాలు వివరిస్తున్నవి.

యతీంద్రప్రవణ ప్రభావంలో వరవరముని ప్రోక్తంగా తెలుపబడ్డ తిరుమజైమన్నన్ మంగళాశాసనపరమైన ఈ క్రింది పాశురం అనుసంధేయం. **“ఐయనరుళ్ మారి శెయ్య వడియిణైకళ్ వాళ్షియే, అమ్ తుకిలుమ్ శీరావుమ్ అణైయు వరై వాళ్షియే, మైయిలకు వేలణైత్త వన్మై మిక వాళ్షియే, మాఱామల్ అఞ్జలి శెయ్ మలర్ కరఙ్గళ్ వాళ్షియే, శెయ్య కలనుడన్ అలఙ్గల్ శేర్ మార్బుమ్ వాళ్షియే, మైయల్ శెయ్యు ముకముఱువల్ మలర్ కణ్గళ్ వాళ్షియే, మన్ను ముడి తొప్పారమ్ వలయముడన్ వాళ్షియే”** – (ఆచార్యులైన, **‘అరుళ్ మారి’** అని కీర్తింపబడే అందమైన తిరుమజైమన్నన్ పాదద్వంద్వానికి మంగళం. అందమైన వస్త్రాన్ని, ఉత్తరీయాన్ని అలంకరించుకొన్న వారి నడుముకు మంగళం. అంజనంవలె నల్లగా ప్రకాశించే వేలాయుధాన్ని ధరించిన వారి బలిమికి మిక్కిలి మంగళం. నిత్యం అంజలిని చేసే వారి కరపద్మాలకు మంగళం. అందమైన ఆభరణాలతో పాటు పూమాలికలు చేరి ఉండే వక్షఃస్థలానికి మంగళం. వ్యామోహాన్ని కల్గించే ముఖంలోని చిఱునవ్వు, నేత్రపద్మాలకు మంగళం. మన్నికగా ఉండే, వలయంతో అలంకరింపబడ్డ కిరీటానికి మంగళం).

58. యద్వాణీ రసభూమదారితసుధావేణీ ముదా సంయమి-
క్షోణీపాలముఖై స్తదన్యవిముఖై రాస్వాద్యతే సాదరమ్ ।
వేదాంతస్పృహణీయవైభవవతీ ఖేదాంతకృద్దేహినాం
గోదాం తాం శరణం వ్రజన్ వరవరో మోదాయ నః కల్పతామ్ ॥

యద్వాణీ = ఏ గోదాదేవియొక్క సూక్తి, రసభూమదారిత = మాధుర్యంచేత చీల్చబడ్డ, సుధావేణీ = అమృతప్రవాహాన్ని కల్గినదై, ముదా = సంతోషంతో, తదన్యవిముఖైః = ఆ గోదాదేవి సూక్తులనుతప్ప మిగిలినవాటిని విడచిపెట్టిన, సంయమిక్షోణీపాలముఖైః = భగవద్రామానుజులు మొదలైన ఆచార్యులచే, సాదరం = ఆదరంతో, ఆస్వాద్యతే = ఆస్వాదింపబడుతున్నదో, వేదాంతస్పృహణీయవైభవవతీ = వేదాంతాలచేతకూడా ఆశ పడతగిన వైభవాన్ని కల్గినది, దేహినాం వేదాంతకృత్ = సంసారుల దుఃఖాలను తీర్చేది అయిన, తాం గోదాం = ఆ గోదాదేవిని, శరణం = శరణంగా, వ్రజన్ = పొందే, వరవరః= శ్రీవరవరమునులు, నః మోదాయ కల్పతామ్ = మనకు ఆనందాన్ని కల్గించాలి.

వేదాంతములచేతకూడా ఆశపడతగిన వైభవమును కల్గినదియై, మనుష్యుల దుఃఖములను సమూలముగా పోగొట్టు స్వభావమును కల్గినదియై, మాధుర్యాధిక్యముచే అమృతప్రవాహమునుకూడ అధఃకరింపగల్గినదియైన ఏ గోదాదేవి శ్రీసూక్తి (తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళ్షి మిగిలినవారిపట్ల విముఖులైన, యతిరాజులగు శ్రీరామానుజులు మొదలగు పూర్వాచార్యులచే సాదరముగా నిత్యము అనుసంధింపబడి, అనుభవింప బడుచున్నదో, ఆ గోదాదేవి శ్రీపాదద్వయిని శరణముగా ఆశ్రయించిన శ్రీమణవాళ మహామునులు మనకు ఎల్లప్పుడును ఆనందమును కల్గింతురుగాక !

"యద్వాణీ రసభూమదారితసుధావేణీ" అనే ప్రయోగానికి అనుగుణంగా, తిరుప్పావై ప్రబంధంలోని 29వ పాశురంలోని **"ఉన్ పొఱ్ఱామరైయే పోఱ్ఱుమ్ పొరుళ్ కేళాయ్ !"** అనే గోదాసూక్తిని వ్యాఖ్యానిస్తూ అழகియ మణవాళప్పెరుమాళ్ అనే ఆచార్యులు ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో– **"ఇవర్కళ్... పేచ్చిల్ ఇనిమైయిలుమ్... అన్యపరనాయిరున్దాన్"** (వీరి సూక్తి మాధుర్యంలో అన్యపరుడై– ఆకర్షితుడై ఉన్నాడు) అని అనడం స్మరణీయం. భగవానుని సైతం ఆకర్షించగల్గిన గోదాదేవి సూక్తి మాధుర్యం దీనివల్ల సూచితమైనది. **"మధురా మధురాలాపా"** అని, **"కిళిమొళియాళ్"** అని కీర్తింపబడే సూక్తి వైలక్షణ్యం దివ్యదేవేరులందఱికి సమానంకదా! ఇంతేకాక, **"రసభూమి"** ఇత్యాది విశేషణానికి అనుగుణంగా గోదాదేవి ప్రబంధాలు రెండు చరమపర్వనిష్ఠాప్రతిపాదకాలు కనుక, చెఱకు గడలోని కణువులలో ఉత్తమమైన కణువులోని రసం ఎక్కువ మధురంగా ఉండేటట్లు, ప్రథమపర్వంలోని రసంకంటే చరమపర్వంలోని రసం అధికం కనుక, ఆ ఉత్తమరసాన్ని అందించే చరమపర్వాన్ని వివరిస్తున్న సూక్తి వైభవం దీనిద్వారా సూచితమైనదని చెప్పవచ్చు. లేక, దేవతల అమృతం కేవలదేహాన్ని మాత్రమే రక్షించగా, గోదాదేవిసూక్తి దేహాద్విలక్షణ మైన ఆత్మను రక్షిస్తుంది కనుక, ఆవిధంగా కూడా దేవతల అమృతప్రవాహం కంటే గోదాసూక్తి సుధాప్రవాహం అతిశయించి ఉన్నదని చెప్పవచ్చు. అణ్ణన్ సూక్తులలోని అత్యంతగభీరాలైన భావాలను పూర్తిగా వ్యక్తం చేయడం అసాధ్యం. ప్రాయికంగానే కొన్ని అర్థాలు నివేదింపబడుతున్నాయి. అంతే. పైవిధంగా అర్థాన్ని గ్రహించినపుడు **"వేదాంత స్పృహణీయ వైభవవతీ", "దేహినాం ఖేదాంతకృత్"** ఇత్యాది విశేషణ ప్రయోగాలు సరసంగా అన్వయిస్తాయి.

గోదాదేవి శ్రీసూక్తి **"వేద మనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదైతమిழ்"** (వేదానికి అంతటికి బీజంవంటిది, గోదాదేవి ప్రబంధం) అనునట్లు వేదమున కంతటికిని బీజభూతమై, **"పావజ్గళ్ తీర్క్కుమ్ పరమనడి కాట్టుమ్"** (పాపాలను తీరుస్తాయి. పరమాత్మ శ్రీచరణాలను చూపిస్తాయి.) అనునట్లు పాపములను పోగొట్టి, భగవానుని పదములను దర్శింప జేయగల్గినది. తిరుప్పావైను నిత్యము అనుసంధించునట్టి శ్రీరామానుజులు **"తిరుప్పావై జీయర్"** అనికదా కీర్తింపబడుచున్నారు. దీనిని మనస్సులో నుంచుకొని ఇట్లు పలుకబడినది. తిరుప్పావైప్రబంధములోని **"ఉన్దు మదకళిఱ్ఱన్"** అనే 8వ పాశురవ్యాఖ్య, అందులో ప్రస్తావింపబడిన ఐతిహ్యము ఇచట స్మరణీయములు. శ్లోకంలోని అనుప్రాసాత్మకమైన శబ్దాలంకార సౌందర్యం సమృదయమనోరంజకం.

59. **యత్సూక్తి ర్ముక్తిహేతుం ప్రకటయతి తరా మాగమాంతాధిరూఢం**
లక్ష్మీకాంతానువాదం స్ఫురదమితగుణాచార్యవర్యాభిధానమ్ ।
గోదాం తా మాదరేణ ప్రణిదధతి వరే యోగిని న్యస్తచిత్తాః
సంత స్సంతోషవంతో విదధతి భజతాం స్వాంతసంతాపశాంతిమ్ ॥

యత్ సూక్తిః = ఏ గోదాదేవిసూక్తి, ఆగమాంత+అధిరూఢం = వేదాంతాలలో మిక్కిలి సుప్రసిద్ధమైనది, లక్ష్మీకాంత+అనువాదం = శ్రియఃపతిచేత అనువదింపబడినది– అంగీకరింపబడినది, స్ఫురత్ + అమితగుణ =ప్రకాశించే అంతు లేని కల్యాణగుణాలను కల, ఆచార్యవర్య+ అభిధానం = సదాచార్యులనే పేరును కల్గినది (సదాచార్యుల రూప మైనది) అయిన, ముక్తిహేతుం = చరమపర్వరూపమోక్షసాధనాన్ని, ప్రకటయతి = వ్యక్తం చేస్తున్నదో, తాం గోదాం = ఆ గోదాదేవిని, ఆదరేణ = భక్తితో, ప్రణిదధతి = ధ్యానించే,వరే యోగిని= మణవాళమహామునులలో, సంతోషవంతః= ఆనందాన్ని కలవారై, భజతాం= తమను ఆశ్రయించేవారికి, స్వాంతసంతాపశాంతిం = వారి మనస్సులలోని సంతాపా లకు ఉపశమనాన్ని, విదధతి = కలుగజేస్తున్నారు.

ఏ గోదాదేవియొక్క శ్రీసూక్తి, శ్రియఃపతిని ప్రథమపర్వముగను, మిక్కిలి ప్రకాశించునట్టి క్షమాదిగుణములను కల ఆచార్యుని చరమపర్వముగను గ్రహించి, శ్రియః పతియొక్క అభిమానమును మోక్షమునకు అప్రధానకారణముగను, ఆచార్యాభిమానమునే ముఖ్యకారణముగను ఆశ్రయించు వేదాంతరహస్యార్థసారమగు చరమపర్వనిష్ఠను మిక్కిలి స్పష్టముగా వివరించుచున్నదో, ఆ గోదాదేవిని భక్తితో ధ్యానించు వరవరమునుల విషయమున స్థిరమైన ధ్యానమును కలవారై, దానిచేతనే సంతుష్టులైయున్నట్టి, చరమపర్వమున ఊనికను కల మహాత్ములు తమ అభిమానాంతర్భూతులైన భక్తులకు మనస్సంతాపశాంతిని కల్గింతురు.

గోదాదేవి ప్రణీతమైన తిరుప్పావై ప్రబంధము సమగ్రముగా చరమపర్వనిష్ఠా ప్రతి పాదక మనుట పూర్వాచార్యసమ్మతము చరమపర్వనిష్ఠ. **"మార్గశీర్ష"** శబ్దార్థము చరమపర్వనిష్ఠయేనని కదా అభిజ్ఞుల వివరణము. మార్గశీర్షవ్రత ప్రబంధమే కదా తిరుప్పావై. నాచ్చియార్ తిరువాయ్మొழ்రిలోని **"నల్ల వెన్ తోழ்రి"** అనెడి పాశురములో కూడ శూడిక్కొడుత్తనాచ్చియార్ అగు గోదాదేవి తమ ఆచార్యులగు విష్ణుచిత్తుల విషయమున చరమపర్వనిష్ఠను వ్యక్తీకరించినదికదా! కనుక, గోదాదేవి ప్రబంధములలోని తాత్పర్యము చరమపర్వనిష్ఠయే. కావుననే శ్రీవరవరమునులు ఉపదేశరత్తినమాలైలో గోదాదేవి మధురకవులు, శ్రీరామానుజులు ముగ్గురును చరమపర్వనిష్ఠను ప్రతిపాదించిరను భావనతో వారిని ముగ్గురి నామములను కలిపి పఠించిరి. ఈ క్రమాన్ని అనుసరిస్తూ అణ్ణన్ ఈ శ్లోకంలో గోదాదేవిని రామానుజులను, తరువాత మధురకవులను గూర్చి ప్రస్తావించారు.

60. యన్మౌలిస్పర్శదీవ్యత్పరిమళభరితాం మాలికాం మూర్ధ్ని బిభ్రత్
ధన్యం స్వం మన్యతే శ్రీనిధి రపి పురుష స్తా మమేయానుభావామ్ ।
గోదాం భక్త్యా యతిక్ష్మాపతి మివ సతతం లాలయంతం మహాంతం
సేవంతే యోగినం యే హృదయ! కలయ తానన్వహం దేశికేంద్రాన్ ॥

యత్ మౌలిస్పర్శ = ఏ గోదాదేవి శిరస్సుయొక్క కేశాల (కిరీట) స్పర్శచేత, దీవ్యత్= ప్రకాశించే, పరిమళభరితాం = సువాసనతో నిండిన, మాలికాం =పూమాలికను, మూర్ధ్ని=

శిరస్సున, బిభ్రత్ = ధరిస్తూ, శ్రీనిధిః పురుషః అపి = శ్రియఃపతి అయిన పరమపురుషుడు కూడా, స్వం ధన్యం మన్యతే = తనను ధన్యునిగా తలుస్తున్నాడో, అమేయ+ అనుభావామ్ = అంతు లేని మహిమను కల, తాం గోదాం = ఆ గోదాదేవిని, యతిపతిమ్ ఇవ = భగవ ద్రామానుజులనువలె, భక్త్యా = భక్తితో, సంతతం లాలయంతం = ఎల్లప్పుడు సంతోష పెట్టేవారైన, మహాంతం యోగినం = పెరియ జీయర్‌ను, యే = ఎవరు, సేవంతే = సేవిస్తున్నారో, తాన్ దేశికేంద్రాన్ = ఆ ఆచార్యవర్యులను, హృదయ = ఓ హృదయమా! అన్వహం = ప్రతిదినం, కలయ = భావించు.

శ్రియఃపతియగు పురుషోత్తముదు కూడ, **"శురుమ్బార్ కుళల్ కోదై"** (తుమ్మెదలు నిండుగా కల్గిన కేశపాశాన్ని కల గోద) అని ప్రశంసింపబడు గోదాదేవియొక్క **"కన్దమ్ కమళుమ్ కుళల్"** (సుగంధం వీచే కేశాలు) అను రీతిలోనున్న, సుగంధమును వీచు కురుల సంబంధముచే మిక్కిలి పరిమళముతో కూడిన, ఆమె అలంకరించుకొని విడచిన మాలికను తన శిరస్సులో అలంకరించుకొనుటచే తనను ధన్యునిగా భావించెనో, అపరిమితమగు ప్రభావమును కల ఆ గోదాదేవిని భగవద్రామానుజులవలె ఎల్లప్పుడు భక్తితో శ్లాఘించునట్టి శ్రీవరవరమునులను ఏ ఆచార్యశ్రేష్ఠులు సేవింతురో, వారిని ఓ మనసా! నీవు సతతము అనుసంధింపుము.

"అరఙ్గర్ మౌరి శూట్టికిన్టమాలైయై చ్చూడిక్కొడుత్తవళ్ తొల్లరుళాల్ వాళ్గిన్ట వళ్ళల్" అనే తిరువరంగత్తముదనార్ సూక్తి భావ్యం.

61. శఠారివైరిమునేః పరం న దైవం విదితం యేన తదేకదైవతేన ।
మధురం కవి మాశ్రిత స్తమీడ్యం వరయోగీ విదధాతు భావుకం నః ॥

తదేకదైవతేన = నమ్మాళ్వార్లనుమాత్రమే పరదైవంగా కల్గిన, యేన = ఏమధురకవి ఆళ్వార్లచే, శఠారివైరిమునేః= నమ్మాళ్వార్లకంటే, పరం =ఇంకొక గొప్ప, దైవం = దైవం, న విదితం = తెలియబడలేదో, ఈద్యం = స్తుతింపదగినవారైన, తం మధురం కవిం = ఆ మధురకవి ఆళ్వార్లను, ఆశ్రితః = ఆశ్రయించిన, వరయోగీ = శ్రీమణవాళ మహామునులు, నః= మనకు, భావుకం = మంగళాలను, విదధాతు = కలుగజేస్తారుగాక!

కురుకాపురీశులగు శఠకోపమునిని తప్ప వేఱొక దైవమును, నమ్మాళ్వార్లనే పరదైవముగా ఆశ్రయించిన ఏ మధురకవిచే తెలియబడలేదో, స్తుతింపతగినవారగు ఆ మధురకవి యాళ్వార్లను ఆశ్రయించినవారగు శ్రీవరవరమునులు మనకు మంగళములను కల్గింతురుగాక !- అనిభావము.

మధురకవులు **"తేవు మఱ్ఱఱియేన్ కురుకూర్‌నమ్బి పావిన్ ఇన్నిశై పాడి త్తిరివనే"** అనుచు తమ ఆచార్యులైన నమ్మాళ్వార్ల కంటే వేఱొక దైవాన్ని తెలియనని అన్నారు కదా! అందువల్లనే వారు ఈద్యులు -స్తుతింపదగినవారు.

62 **యత్పాదాబ్జానుబంధ స్సకలతనుభృతాం కల్పతే ముక్తిసిద్ధ్యై**
యత్సంబంధా త్కరస్థా మమనుత స యతిక్ష్మాపతిః స్వస్య ముక్తిమ్ ।
తస్మిన్ కూరాధినాథే నిరవధికగుణే భక్తి మామ్రేడయంతం
ముక్త్యై భక్త్యా భజంతో వరముని మనఘాః దేశికా మే దయంతామ్ ॥

యత్ పాద+అబ్జ+ అనుబంధః= ఏ రామానుజులయొక్క పాదపద్మాల పరంపరా సంబంధం, సకలతనుభృతాం = సమస్త శరీరులకు, ముక్తిసిద్ధ్యై = ముక్తిసిద్ధికోసం, కల్పతే = సమర్థమై ఉన్నదో, సః యతిక్ష్మాపతిః = ఆ భగవద్రామానుజులు, యత్ సంబంధాత్ = ఏ కూరేశుల సంబంధంవల్ల, స్వస్య ముక్తిం = తన ముక్తిని, కరస్థాం = చేతిలో ఉన్నదిగా, అమనుత = తలచారో, నిరవధికగుణే = అంతులేని కల్యాణగుణాలను కల, తస్మిన్ కూరాధినాథే = ఆ కూరత్తాழ்వానుల విషయంలో, భక్తిమ్ ఆమ్రేడయంతం = భక్తిని ద్విగుణీకృతం చేసికొంటున్న, వరవరమునిం = శ్రీవరవరమునిని, ముక్త్యై = ముక్తికొఱకు, భక్త్యా = భక్తితో, భజంతః = ఆశ్రయించే, అనఘాః = దోషవిదూరులైన, దేశికాః = ఆచార్యులు, మే = నాకు, దయంతామ్ = అనుగ్రహిస్తారు గాక !

ఏ భగవద్రామానుజుల సంబంధమే చేతనులందఱి మోక్షసిద్ధికి కారణముగా నున్నదో, ఆ శ్రీరామానుజులుకూడ ఏ కూరేశుల సంబంధమువలన తమకు మోక్షము కైవసమైనదని తలచిరో, లెక్కలేని సద్గుణములను కల ఆ కూరేశుల విషయమున నిత్యము నిరంతరమైన, నిరవధికమైన భక్తిని కల్గియున్న శ్రీవరవరమునులను మోక్షముకొఱకు ఆశ్రయించువారై, పాపరహితులైన దేశికులు (ఆచార్యులు) నా విషయములో నిత్యము కృపను చూపుదురుగాక !

ఈ సందర్భమున – **“అర్వాంచో యత్పదసరసిజద్వంద్వ మాశ్రిత్య పూర్వే మూర్ధ్నా యస్యాన్వయ ముపగతా దేశికా ముక్తి మాపుః, సోఽయం రామానుజముని రపి స్వీయముక్తిం కరస్థాం యత్సంబంధా దమనుత కథం వర్ణ్యతే కూరనాథః”** (శ్రీరామానుజులకు ముందు జన్మించిన ఆచార్యులు వారి తిరుముడి సబంధంతోను, తరువాత జన్మించిన ఆచార్యులు వారి శ్రీచరణ సంబంధంతోను ముక్తిని పొందారు. అటువంటి రామానుజులు కూడా తమకు ముక్తి కూరేశుల సంబంధం వల్ల కల్గిందని తలిచారంటే ఇక ఆ కూరేశులను స్తుతించడం ఏ విధంగా సాధ్యం?) అను శ్లోకము అను సంధేయము. **“మొழிయై క్కడక్కుమ్ పెరుమ్ పుకழాన్”** (వాక్కుకు మించిన గొప్ప కీర్తిని కలవారు) అనుచు ఆழ்వాన్ విషయమున అముదనార్ అనుగ్రహించిన శ్రీసూక్తిని, **“వాచామగోచరమహాగుణదేశికాగ్ర్య కూరాధినాథ”** (వాక్కుకు అందని గొప్ప గుణాలను కల గొప్ప ఆచార్యులైన కూరేశులు) అనుచు యతిరాజవింశతిలో వరవరమునులు పల్కిన సూక్తిని దృష్టిలో నుంచుకొని **“నిరవధికగుణే”** అను విశేషణము శ్లోకమున ప్రయోగింప బడినది.

63. యతిపతిపదయుగ్మం దైవతం యస్య నాన్యత్
త మిహ వటుకపూర్ణం సాదరం భావయంతమ్ ।
సతత మభిలషంతం తస్య నిష్ఠాం గరిష్ఠాం
వరవరమునివర్యం సంతతం చింతయేయమ్ ॥

యస్య = ఏ వడుగనంబికి, యతిపతిపదయుగ్మం = భగవద్రామానుజుల శ్రీచరణ యుగం, దైవతం = దైవమో, న+అన్యత్ = ఇంకొకటి కాదో, తం వటుకపూర్ణం = ఆ వడుగనంబిని, ఇహ = ఈ లోకంలో, సాదరం భావయంతం = ఆదరంతో అనుసంధించే వారు, తస్య = ఆ వడుగనంబియొక్క గరిష్ఠాం నిష్ఠాం = గొప్పదైన, ఆచార్యులే పరదైవమనే నిష్ఠను, సతతమ్ అభిలషంతం = సదా కోరేవారైన, వరవరమునివర్యం = వరవరముని వర్యులను, సంతతం చింతయేయమ్ = సదా భావిస్తున్నాను.

ఏ వడుగనంబికి భగవద్రామానుజుల శ్రీపాదయుగ్మము తప్ప వేఱొక దైవము లేదో, ఆ వడుగనంబిని ఆదరముతో మనస్సున అనుసంధించి, వారి అంతిమోపాయ నిష్ఠను ఎల్లప్పుడు తమకు కలుగవలెనని కోఱు శ్రీవరవరమునులను ఎల్లప్పుడు ఉజ్జీవన హేతువుగా అనుసంధింతును.

వడుగనంబియొక్క ఆచార్యనిష్ఠనుగూర్చిన పలు ఐతిహ్యములు గురుపరంపరా ప్రభావ, ప్రపన్నామృతాది చరిత్రగ్రంథాలలో, దివ్యప్రబంధ వ్యాఖ్యలలో గమనింపవచ్చును. **"పూర్ణ"** శబ్దానికి ఆచార్యకైంకర్యలక్ష్మీ పూర్ణులనే అర్థాన్ని గ్రహించాలి.

64. శఠరిపుమునిదృష్టసామవేదం
వ్యవృణుత యో యతిరాజశాసనేన ।
త మిహ శఠజిదాహ్వయం శ్రయంతం
వరవరమునివర్య ముపాసిషీయ నిత్యమ్ ॥

యః=ఏ తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ అను ఆచార్యవర్యులు, యతిరాజశాసనేన = భగవద్రామానుజుల ఆజ్ఞతో, శఠరిపుమునిదృష్టసామవేదం = నమ్మాళ్వార్లచేత దర్శింపబడ్డ సామవేదాన్ని, వ్యవృణుత = వివరించారో, తం శఠజిత్+ఆహ్వయం=శఠకోపులనే పేరును కల ఆ పిళ్ళాన్‌ను, ఇహ = ఈ లోకంలో, శ్రయంతం = ఆశ్రయించే, వరవర మునివర్యం = శ్రీమణవాళమహామునులను, నిత్యం = ప్రతిదినం, ఉపాసిషీయ = ఉపాసిస్తున్నాను.

ఏ తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ భగవద్రామానుజుల నియమనముతో నమ్మాళ్వార్లచే సాక్షాత్కరింపబడిన ద్రావిడసామవేదమగు తిరువాయ్‌మొళ్ళి ప్రబంధమునకు **"ఆఱా యిరప్పడి"** అనెడి వ్యాఖ్యను అనుగ్రహించిరో, ఆ తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్‌ను ఆశ్రయించు మణవాళ మహామునులను నిత్యము ఉపాసింతును.

ఈ శ్లోకం నుండి వరుసగా తిరువాయ్‌మొழ్గి ప్రబంధానికి వ్యాఖ్యానాలను అనుగ్రహించిన అయిదు గురువాఖ్యాతలను గూర్చి అణ్ణన్ ప్రస్తావిస్తున్నారు. తిరువాయ్ మొழ్గికి ఆఱాయిరప్పడి వ్యాఖ్యను పిళ్ళాన్ శ్రీరామానుజుల ఆదేశాను సారముగా రచించిరి అను వృత్తాంతమును శ్రీవరవరమునులు ఉపదేశరత్తినమాలై ప్రబంధ ములో– **"తెళ్ళారుమ్ ఞానత్తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ ఎతిరాశర్ పేరరుళాల్, ఉళ్ళారుమ్ అన్బుడనే మాఱన్ మఱైప్పొరుళై అన్ఱురైత్తదు, ఇన్బమికుమాఱాయిరమ్"** (మిక్కిలి స్పష్టమైన జ్ఞానాన్ని కల తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ అనువారు శ్రీరామానుజుల గొప్ప అనుగ్రహంతో, తమ హృదయంలో నిండి ఉండే ప్రేమతో ఆనాడు నమ్మాழ్వార్ల ద్రావిడ వేదంయొక్క అర్థాన్ని ఆనందాన్ని నిండుగా కలిగించే ఆఱాయిరప్పడి వ్యాఖ్యను అనుగ్రహించారు) అనే పాశురంలో ప్రస్తావించారు.

వడుగనంబి ఈ విషయాన్ని యతిరాజవైభవమనే గ్రంథంలో **"రామానుజార్యస్య యతీశ్వరస్య జ్ఞానాత్మజస్తస్యచ పాదుకేతి, ఖ్యాతశ్శఠారేశ్చరమ ప్రబంధం వ్యాఖ్యాతవాన్ తం కురుకేశవర్యః"** అనే శ్లోకంలో (83) తెలిపారు.

65. శఠారిదృష్టవేదమౌళిభావసంప్రకాశకృత్
కృతేతరోక్తిమౌళివేద్యయోగిశేఖరే సదా ।
శమాదిసద్గుణోదధౌ నిమజ్జతీవ యస్య ధీః
వరోపయంతృయోగినం నిరంతరం తమాశ్రయే ॥

శమాదిసద్గుణ+ఉదధౌ=శమం మొదలైన కల్యాణగుణాలకు సముద్రం వంటివారైన, శఠారిదృష్ట = నమ్మాழ్వార్లచే దర్శింపబడ్డ, వేదమౌళి = ద్రావిడవేదాంతంయొక్క, భావసంప్రకాశకృత్ = భావాన్ని వ్యక్తం చేసే, కృతేతరోక్తివేద్యయోగిశేఖరే = యతిశేఖరులైన (వేదాంతి అనబడే) నంజీయర్ విషయంలో, యస్య ధీః = ఏ మణవాళ మహామునుల బుద్ధి, నిమజ్జతీ ఇవ = మునుగుతున్నదివలె ఉన్నదో (అవగాహిస్తున్నదో), తం వరోపయంతృ యోగినం = ఆ శ్రీమణవాళమహామునులను, నిరంతరం సమాశ్రయే = నిత్యం ఆశ్రయిస్తాను.

వేదాంతి అను పేరును కల నఞ్జీయర్ నమ్మాழ్వార్లచే దర్శింపబడిన ద్రావిడ వేదాంతమగు తిరువాయ్‌మొழ్గియొక్క అర్థమును చక్కగా ఒన్బదినాయిరప్పడి అను వ్యాఖ్యలో విశదీకరించిరి. ఈ ఐతిహ్యము ఉపదేశరత్తినమాలైలోని **"తఞ్జీరై ఞానియర్‌కళ్ తామ్ పుకழ్గుమ్ వేదాన్తి నఞ్జీయర్ తామ్ పట్టర్ నల్లరుళాల్, ఎఞ్జాద ఆర్వముడన్ మాఱన్ మఱైప్పొరుళై ఆయ్‌న్దురైత్తదు ఏరొన్బదినాయిరమ్"** (జ్ఞానాధికులందఱు కొనియాడు కల్యాణగుణాలను కల, వేదాంతి అనే ప్రసిద్ధనామాన్ని కల నంజీయర్ శ్రీపరాశర భట్టర్‌వారి కృపతో, ఏ సంకోచం లేని అభినివేశంతో నమ్మాழ్వార్ల ద్రావిడ వేదమైన తిరువాయ్‌మొழ్గి అర్థాన్ని శబ్దాల పొందికతో, అర్థగౌరవంతో గొప్పదైన మనోజ్ఞమైన ఒన్బదినాయిరప్పడి వ్యాఖ్యను ప్రసాదించారు) అనే పాశురంలో ప్రస్తుతం.

"కృతేతరోక్తిమౌళివేద్యయోగిశేఖరః" – అను ప్రయోగము వేదాంతి అను పేరుగల నంజీయర్‌ను నిర్దేశించును. ద్రావిడవేదముకూడ అపౌరుషేయమే. నమ్మాழ్వార్లచే ప్రకాశింపజేయబడినది మాత్రమే). శమదమాదిసద్గుణసముద్రులగు ఆ నంజీయర్‌పట్ల ఏ మణవాళమహామునుల బుద్ధి అభినివిష్టమైనదో, ఆ వరవరమునులను నిరంతరము నేను ఆశ్రయింతును – అని శ్లోక భావము.

యోగశాస్త్ర ప్రవర్తకులైన నమ్మాழ్వార్లను **"శమాదిసద్గుణోదధి"** అని నిర్దేశించడం సముచితం. శ్రీవరవరమునులుకూడా ఒక ఆழ్వార్లు – అను చమత్కారమైన అర్థము మూడవ పాదములో గల **"శమాదిసద్గుణోదధౌ నిమజ్జతీవ"** అను ప్రయోగము ద్వారా స్ఫురించును. ఆழ్వార్లు అనగా భగవద్గుణాబ్ధిలో గాఢముగా మునుగుచున్నవారని కదా అర్థము. నమ్మాழ్వార్లు భగవద్గుణాబ్ధిని అవగాహించగా, వరవరమునులు ఆழ్వార్ల గుణాబ్ధిలో అవగాహించడం విశేషం.

66. తతమధురగభీరద్రావిడామ్నాయభాష్యం
యదుదిత మిహ సంతః సంతతం శీలయంతి ।
స హి విహరతి కృష్ణో దేశికో యస్య చిత్తే
స దిశతు వరయోగీ భద్ర మవ్యాహతం నః ॥

యత్ ఉదితం = ఏ పెరియవాచ్చాన్‌పిళ్ళైవల్ల ఉద్భవించినది, తత మధుర గభీర= విస్తృతమైనది, మధురమైనది, గంభీరమైనది అయిన, ద్రావిడ+ఆమ్నాయ భాష్యం = ద్రావిడవేదవ్యాఖ్యానాన్ని, ఇహ = ఈలోకంలో, సంతతం = నిత్యం, సంతః =సత్పురుషులు, శీలయంతి = అనుసంధిస్తున్నారో, సః కృష్ణః దేశికః = ఆపెరియవాచ్చాన్ పిళ్ళై అనే ఆచార్యులు, యస్య చిత్తే = ఏ మణవాళమహామునుల చిత్తంలో, విహరతి హి = విహరిస్తున్నారో, సః వరయోగీ = ఆ వరవరమునులు, నః = మనకు, అవ్యాహతం భద్రం = అడ్డులేని శుభాన్ని, దిశతు = అనుగ్రహించాలి.

ఏ శ్రీకృష్ణులను తిరునామమును కల పెరియవాచ్చాన్‌పిళ్ళైచే అనుగ్రహింప బడినదియై, విశదమై, మధురమై, గంభీరమైయున్న ద్రావిడవేదమగు తిరువాయ్‌మొழி యొక్క భాష్యమైన ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యానమును పెద్దలు ఎల్లప్పుడు ఆవృత్తిని చేసి, అర్థచింతనను చేయుదురో, ఆ శ్రీకృష్ణసూరి అనెడి ఆచార్యులు ఏ వరవరమునుల చిత్తమున ఎల్లప్పుడు విహరింతురో, ఆ వరవరమునులు మనకు అవ్యాహతమైన భద్రమును కల్గింతురుగాక !

తమ శిష్యులైన పెరియవాచ్చాన్ పిళ్ళై ఆచార్యులైన నమ్పిళ్ళై ఆజ్ఞానుసారంగా తిరువాయ్‌మొழி ప్రబంధానికి ఇరుపత్తునాలాయిరప్పడి అనే విశదమైన వ్యాఖ్యను అనుగ్రహించిన వృత్తాంతం ఉపదేశరత్తినమాలైలో **"నమ్పిళ్ళై తమ్ముడైయ నల్లరుళాల్**

ఏవియిడ, పిన్ పెరియవాచ్చాన్‌పిళ్ళై యదనాల్, ఇన్నావరుపత్తి మాఱన్ మత్తైప్పొరుళై చ్చొన్నదు ఇరుపత్తు నాలాయిరమ్” (నంబిళ్ళై, తమ పరమకృపతో ఆజ్ఞాపించగా, తరువాత పెరియవాచ్చాన్‌పిళ్ళై ఆ ఆజ్ఞను అనుసరించి, భక్తి బలాత్కారవశముచే నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళ్రికి ఇరుపత్తునాలాయిరప్పడి అనే వ్యాఖ్యను కృపజేశారు) అనే పాశురంలో తెలుపబడింది. **“తతమధురగభీర”** అనే విశేషణాన్ని ద్రావిడామ్నాయానికి కూడా అన్వయించవచ్చు. సందర్భానుసారంగా భాష్యానికి అన్వయించడం సరసతరం.

67. సుధాసింధో రిందో స్సుహృదతిగభీరం సుమధురం
యదుక్తం భాష్యం తచ్ఛఠజిదుదితామ్నాయశిరసః ।
స కృష్ణార్యః పుష్ణన్ హృది విహరణం యస్య జగతి
శ్రియం సంతన్యాన్మే వరమునివరః స ప్రతిదినమ్ ॥

శఠజిత్+ఉదిత+ఆమ్నాయశిరసః = నమ్మాళ్వార్లవలన ఆవిర్భవించిన ద్రావిడ వేదాంతం అయిన తిరువాయ్‌మొళ్రి ప్రబంధానికి, యదుక్తం భాష్యం = ఏపెరియ వాచ్చాన్‌పిళ్ళైచేత చెప్పబడ్డ వ్యాఖ్యానం (ఇరుపత్తునాలాయిరప్పడి) ఉన్నదో, తత్ = అది, సుధాసింధోః = అమృతసముద్రానికి, ఇందోః = చంద్రునకు, సుహృత్ = మిత్రమో, (వాటివలె ఆహ్లాదాన్ని కల్గించేదో), అతిగభీరం = చాలా గంభీరమైనదో, సుమధురం = చాలా భోగ్యమైనదో, సః కృష్ణార్యః = ఆ పెరియవాచ్చాన్‌పిళ్ళై, యస్య హృది = ఏ శ్రీమణవాళమహామునులయొక్క హృదయంలో, విహరణం పుష్ణన్ = విహారాన్ని చేస్తున్న వారై, జయతి = సర్వోత్కర్షతో వెలుగుతున్నారో, సః వరవరమునివరః = ఆ మణవాళ మహామునులు, ప్రతిదినం =ప్రతిదినం, మే = నాకు, శ్రియం = సంపదను, సంతన్యాత్= విస్తరింపజేయాలి.

ఏ శ్రీకృష్ణులను పెరియవాచ్చాన్‌పిళ్ళై తిరువాయ్‌మొళ్రి అని నమ్మాళ్వార్లు ప్రసాదించిన ద్రావిడవేదాంతముయొక్క భాష్యము (ఇరుపత్తునాలాయిరప్పడి వ్యాఖ్యను) అనుగ్రహించారో, అది అమృతసాగరమునకు, చంద్రునకును మిత్రమై, మిక్కిలి గంభీరమైన అర్థవిశేషములను కల్గినదియై, మిక్కిలి మధురమై యున్నది, ఆ శ్రీకృష్ణసూరి ఏ మణవాళమహామునుల హృదయము ఆనందమును జనింపజేయుచు క్రీడించుచున్నారో, ఆ వరవరమునులు నాకు ఎల్లప్పుడు శ్రీవైష్ణవసిరిని వృద్ధిజేయుదురు గాక !

“సుధాసింధో రిందోః సుహృత్” - “సమానం ఖ్యాయతే ఇతి సఖా” అనే సఖాశబ్దవ్యుత్పత్తివలన సఖుడంటే సమానంగా చెప్పబడేవాడని అర్థం.కనుక అమృత సింధువు, చంద్రునకు సుహృత్ అంటే భోగ్యతలో వాటితో సమానం- అని తాత్పర్యం. పెరియవాచ్చాన్‌పిళ్ళై వరవరమునుల హృదయంలో విహరిస్తూ ప్రకాశించడమంటే, తాము రచించిన వ్యాఖ్యలోని తాత్పర్యాన్ని యథాతథంగా వరవరమునులు గ్రహించి వివరించినందువల్ల పెరియవాచ్చాన్‌పిళ్ళై ఆనందించారని తాత్పర్యం.

ముందుశ్లోకంలో నాలాయిర వ్యాఖ్యానరచనను గూర్చి ప్రస్తావింపబడగా, ఇందులో **"శఠజిదుదితామ్నాయశిరసః"** అనే ప్రయోగాన్నిబట్టి ఇరుపత్తునాలాయిర వ్యాఖ్యాన రచనను గూర్చి ప్రస్తావింపబడినదని చెప్పవచ్చు. కనుక పునరుక్తి లేదు.

68. నిఖిలనిగమమౌళిసారసారం ప్రథయతి యద్ద్రావిడాగమాంతభాష్యమ్ ।
తదిహ జయతి యత్ప్రసాదశీతం హృదయ ! సదా వరయోగినం భజస్వ ॥

యత్ ద్రావిడ+ఆగమాంతభాష్యం = ఏపెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన ద్రావిడ వేదాంతభాష్యం (తిరువాయ్‌మొౙి వ్యాఖ్యానం), నిఖిలనిగమమౌళిసారసారం = సమస్త వేదాంతాల సారంలోని సారాన్ని, ప్రథయతి = ప్రకాశింపజేస్తున్నదో, తత్ = ఆ వ్యాఖ్యానం, యత్ ప్రసాదశీతం = ఏ మణవాళమహామునుల అనుగ్రహంవల్ల చల్లనిదై, జయతి = సర్వోత్కృష్టంగా ఉన్నదో, వరయోగినం = ఆ మణవాళమహానులను, హృదయ = ఓ హృదయమా, సదా భజస్వ = సదా భజించు.

ఏ తిరువాయ్‌మొౙి అనెడి ద్రావిడవేదాంతముయొక్క భాష్యము వేదాంతములన్నిటి యందలి మిక్కిలి సారమైన అర్థమును ప్రకాశింపజేయుచున్నదో, ఆ భాష్యము సైతము ఎవరి అనుగ్రహముచే చల్లనిదియై, సర్వోత్కృష్టమై ప్రకాశించుచున్నదో, ఆ వరవరమునులను ఓ మనసా! నీవు నిత్యము భక్తితో సేవించి, ఉజ్జీవింపుము.

వరవరమునులు కరుణతో అనుగ్రహించిన ప్రసన్నగంభీరమైన వివరణముచే ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యానము వినువారి మనస్సుకు చల్లనిదియై, సుఖమును కల్గించుచున్నదని భావము.

ఈ శ్లోకమును ఈడు వ్యాఖ్యానానికి అనుగుణంగా కూడా వివరించవచ్చు. **"ఈడు ముప్పత్తాఱాయిరప్పెరుక్కర్"** అనే బిరుదును కలవారు వరవరమునులు కనుక, **"తత్ యత్ప్రసాదశీతమ్"** అనే విశేషణాన్ని ఈడువ్యాఖ్యకు అనుగుణంగా అన్వయించడంలో స్వారస్యం ఉన్నది.

69. సుధాసారాకారం సకలనిగమాంతార్థముకురం
యదుక్తం తత్ పారాంకుశనిగమభాష్యం శరణయన్ ।
సమింధే యత్సంఘః స విహరతి కృష్ణో గురువరః
సదా యచ్చిత్తే తం వరవర ముపాసే మునివరమ్ ॥

యత్ ఉక్తం = ఏ వడక్కుత్తిరువీథిపిళ్ళై అనుగ్రహించిన, సుధాసార+ ఆకారం = అమృతప్రవాహరూపమై, సకలనిగమాంతార్థముకురం = సమస్తవేదాంతార్థాలను ప్రతిఫలించే అద్దమై ఉండే, పారాంకుశనిగమభాష్యం = నమ్మాౙ్వార్ల వేదం అయిన తిరువాయ్‌మొౙియొక్క వ్యాఖ్యానం ఉన్నదో, తత్ = ఆ భాష్యాన్ని, శరణయన్ = శరణంగా చేసికొంటూ, యత్ సంఘః = ఏ వడక్కుత్తిరువీథి ప్పిళ్ళై శిష్యసంఘం, సమింధే =

ప్రకాశిస్తున్నదో, సః కృష్ణః గురువరః = ఆ వడక్కుత్తిరువీధిప్పిళ్ళై, యచ్చిత్తే = ఏ మణవాళ మహామునుల చిత్తంలో, సదా విహరతి = ఎల్లప్పుడు విహరిస్తున్నారో, తం వరవరం మునివరం = ఆ మణవాళమహామునులను, ఉపాసే = ఉపాసిస్తున్నాను.

ఇందు **"కృష్ణో గురువరః"** అను ప్రయోగము శ్రీకృష్ణపాదులని కీర్తింపబడు వడక్కుత్తిరువీది పిళ్ళైను నిర్దేశించును. నమ్బిళ్ళై నమ్మాళ్వార్ల తిరువాయ్మొழி ప్రబంధానికి అనుగ్రహించిన ఈడు వ్యాఖ్యానం అమృతప్రవాహంవంటిది. సమస్తవేదాంతార్థాలు ప్రతిఫలించే అద్దంవంటిది. దీనిని వడక్కుత్తిరువీథిప్పిళ్ళై అను ఆచార్యులు గ్రంథస్థం చేశారు. ఈ ఆచార్యుల శిష్యసంఘం ఈడువ్యాఖ్యానాన్ని శరణంగా చేసికొని ప్రకాశిస్తున్నది. అట్టి ఆచార్యులగు వడక్కుత్తిరువీథిపిళ్ళై ఎవరియొక్క హృదయకమలములో ఎల్లప్పుడు ఉల్లాసముగా వెల్గుచున్నారో, ఆ వరవరమునులను నేను ఉపాసింతును– అని శ్లోకభావం.

శ్లోకంలో ప్రస్తావించిన ఐతిహ్యము ఉపదేశరత్తినమాలై ప్రబంధంలోని– **"తెళ్ళియదా నమ్బిళ్ళై శెప్పునెఱితన్నై వళ్ళల్ వడక్కుత్తిరువీదిప్పిళ్ళై, ఇన్ద నాడఱియ మాఱన్ మఱైప్పొరుళై నన్గురైత్తదు ఈడుముప్పత్తాఱాయిరమ్"** (సారసారవివేక చతురులైన నమ్బిళ్ళై పలికే దివ్యసూక్తి క్రమాన్ని మహోదారులైన వడక్కుత్తిరువీదిప్పిళ్ళై ఈ లోకంలోని అందఱు గ్రహించేటట్లు నమ్మాళ్వార్ల ద్రావిడ వేదానికి అర్థాన్ని ఈడు ముప్పత్తాఱాయిరప్పడి అనే వ్యాఖ్యద్వారా ప్రసాదించారు) అనే పాశురంలో ప్రస్తావింపబడింది.

70. సర్వజ్ఞేన ధృతా హి యేన శిరసా సా కృష్ణపాదోద్భవా
శ్రీపారాంకుశవేదమౌళివివృతిః స్వర్వాహినీసోదరీ ।
తాపం సర్వ మపాకరోతి భవినాం ధత్తే పరాం నిర్వృతిం
సేవే తస్య పదాబ్జయుగ్మ మనిశం సౌమ్యోపయంతు ర్మునేః ॥

సర్వజ్ఞేన యేన = సర్వజ్ఞులైన శ్రీమణవాళమహామునులచే, కృష్ణపాదోద్భవా = వడక్కుత్తిరువీథిప్పిళ్ళైవల్ల ఉద్భవించిన (కృష్ణశబ్దవాచ్యుడైన భగవానుని పాదాలనుండి పుట్టిన), సా= అనిర్వాచ్యమైన ఆ, స్వర్వాహినీసోదరీ = గంగానదికి సహోదరి అయిన, (గంగానదితో సమానమైన), శ్రీపారాంకుశవేదమౌళివివృతిః = నమ్మాళ్వార్ల వేదం అయిన తిరువాయ్మొழிయొక్క వ్యాఖ్య, శిరసా ధృతా = శిరసా వహింపబడినదో, సా = ఆ వ్యాఖ్య, భవినాం = సంసారుల, తాపం సర్వం = తాపాన్ని అంతటినీ, అపాకరోతి = తొలగిస్తున్నదో, పరాం నిర్వృతిం ధత్తే = బ్రహ్మానందాన్ని కల్గిస్తున్నదో, తస్య సౌమ్యోపయంతుః మునేః = ఆ మణవాళమహామునులయొక్క, పదాబ్జయుగ్మం = పదపద్మాల జంటను, అనిశం సేవే = నిత్యం సేవిస్తున్నాను.

శ్రీకృష్ణపాదసూరి అను తిరునామమును కల వడక్కుత్తిరువీథిపిళ్ళై నమ్బిళ్ళై ఉపన్యాసమును ముప్పత్తాఱాయిరప్పడిగా తాళపత్రములందు లిఖించిరి. ఆ ముప్పత్తాఱాయిరప్పడి

వ్యాఖ్యానమే **"ఈడు"** అనబడుచున్నది. ఇది తిరువాయ్మొழி ప్రబంధమునకు మిక్కిలి గొప్ప వ్యాఖ్యానమై, రసవత్తరమై అమరినది. ఈ ఈడు వ్యాఖ్యను ఆకాశగంగానదితో సమానముగా చెప్పవచ్చును. గంగ సంసారుల తాపమును పోగొట్టి, సౌఖ్యమును ఇచ్చుచున్నది. అది శ్రీకృష్ణుని పాదములనుండి ఉద్భవించినది. సర్వజ్ఞుడనిపేరు పొందిన శివునిచే శిరసా వహింపబడినది. దానివలెనే తిరువాయ్మొழி వ్యాఖ్యానమగు ఈడు ముప్పత్తాఱాయిరప్పడికూడ సంసారుల సకలతాపములను పోగొట్టి, వారికి భగవద్గుణాను భవ మనెడి గొప్ప ఆనందమును కల్గించుచున్నది. కృష్ణపాదశబ్దము ఇచట శ్లిష్టము. గంగపక్షమున కృష్ణుని పాదమని అర్థము. ఈడువ్యాఖ్యానము పక్షమున శ్రీకృష్ణపాదులనబడు వడక్కుత్తిరు వీథిప్పిళ్ళై- అని అర్థము. ఈ అర్థమున పాదశబ్దము పూజ్యవాచకము. ఈడు సర్వజ్ఞులగు మణవాళమహామునులచే శిరసా వహింపబడినది. దీనిని విస్తృతముగా ఉపన్యసించుటచే **"ఈడు ముప్పత్తాఱాయిర ప్పెరుక్కర్"** అని మణవాళమహామునులకు ప్రసిద్ధి కల్గినది. అట్టి వరవరమునుల శ్రీపాదకమలయుగమును నేను సదా సేవింతును- అని భావము.

శ్లోకములో వరవరమునులకు శివసామ్యము స్ఫురించుచున్నది. సర్వజ్ఞుడంటే శివుడు. త్రివిక్రమావతార సందర్భంలో బ్రహ్మతన మండలులోని తీర్థంతో పైలోకాలలోకి చాచిన త్రివిక్రముని శ్రీచరణాన్ని అభిషేకించగా, ఆ తీర్థాన్ని శివుడు తన శిరస్సుపై ధరించాడు. **"పాదోదకేన స శివః శివోభూత్"** అని యామునులీ వృత్తాంతాన్ని స్తోత్రరత్నంలో ప్రస్తావించారు. తిరుమழிశైప్పిరాన్ కూడా నాన్ముకన్ తిరువన్దాదిలో -**"కుఱైకొణ్డు నాన్ముకన్ కుణ్డికైనీర్పెయ్దు మఱైకొణ్డ మన్దిరత్తాల్ వాழ்త్తి, కఱైకొణ్డ కణ్డత్తాన్ శెన్నిమేలేఱ క్కழுవినాన్"** (బ్రహ్మ, ఆకించన్యాన్ని అనుసంధిస్తూ తన కమండలులోని తీర్థంతో పురుషసూక్తాదులను అనుసంధిస్తూ త్రివిక్రముని శ్రీచరణాలను కడిగి, ఆ జలాన్ని గరళకంఠుడైన శివుని తలపై ప్రోక్షించాడు) అని ఈ వృత్తాంతాన్ని అనుసంధించాడు. భగీరథుడు ఆకాశగంగను భూమిపైకి తీసికొని వచ్చిన సందర్భంలో కూడా శివుడు గంగను తన జటాజూటంలో ధరించాడు ఆ గంగ భూమిపై ప్రవహిస్తూ సంసారుల పాపాలను నశింపజేస్తున్నది. కనుక **"భవినాం తాపం సర్వమపాకరోతి ధత్తే పరాం నిర్వృతిమ్"** అనే ప్రయోగం ఈ రీతిలో కూడా అర్థవంతం. ఇక్కడ విశేషమేమంటే- గంగానది దేవతాంతర స్పర్శను పొందగా, ఈడు అనే స్వర్వాహినీసోదరి పరమపవిత్రులైన శ్రీవరవరమునుల స్పర్శను పొంది పరమోపాదేయమైనది - అనే గంగానది కంటే గల వైలక్షణ్యం స్ఫురిస్తున్నది.

12వ శ్లోకములో కూడా వరవరముని భక్తులకు శివసామ్యము వర్ణింపబడుట గమనార్హము. **"ప్రకృష్టవిజ్ఞానబలైకధాము"**డైన ఆదిశేషుని అవతారరూపులైన వరవరమునులను సర్వజ్ఞులని అనడం అర్థవంతం.

**71. శఠరిపునిగమార్థతత్త్వబోధం జనయతి యః కిల వాదిసింహఘోషః ।
వరవరమునివర్య మాశ్రయే తత్ ప్రవణధియం ప్రశమాదిసద్గుణాఢ్యమ్ ॥**

యః వాదిసింహఘోషః = ఏ అళ్గకియమణవాళ చ్ఛీయర్ అనే ఆచార్యులయొక్క నాదం (వ్యాఖ్య), శఠరిపునిగమార్థ తత్త్వబోధం = నమ్మాళ్వార్ల తిరువాయ్మొళ్ళి ప్రబంధంలోని తత్త్వం యొక్క జ్ఞానాన్ని, జనయతి కిల = కల్గిస్తున్నదో, తత్ ప్రవణధియం = ఆ జీయర్ విషయంలో ప్రావణ్యాన్ని కల్గిన బుద్ధిని కలవారు, ప్రశమ+ఆది సద్గుణ + ఆఢ్యం = శమాది సద్గుణాలతో గొప్పవారు అయిన, వరవరమునివర్యం = వరవర మునులను, ఆశ్రయే =ఆశ్రయిస్తున్నాను.

వాదికేసరి అళ్గకియమణవాళ జీయర్‌యొక్క సింహనాదరూపమైన పన్నీరాయిరప్పడి అను ఏ తిరువాయ్మొళ్ళివ్యాఖ్య తిరువాయ్మొళ్ళియొక్క తత్త్వార్థజ్ఞానము కల్గించునో, (వీరి తిరువాయ్మొళ్ళి వ్యాఖ్య పన్నీరాయిరప్పడికి **"ఉరై"** అని పేరు) ఆ వాదికేసరి అళ్గకియమణవాళ జీయర్‌పట్ల ప్రావణ్యమును కల-అనగా -అభినివేశమును కల-మనస్సును కలవారై, శమదమాదిసమస్తాత్మగుణసంపన్నులై వేంచేసియుండు మామునులను నేను ఆశ్రయింతును- అని భావము.

అళ్గకియమణవాళచ్ఛీయర్ పెరియవాచ్చాన్‌పిళ్ళై శిష్యులు. వీరు తిరువాయ్మొళ్ళికి ప్రతిపదార్థ రూపమైన వ్యాఖ్యను పన్నీరాయిరప్పడి అనే పేరుతో రచించారు. ఈ సంగతిని ఉపదేశరత్తినమాలై- **"అన్బోడు అళ్గకియమణవాళచ్ఛీయర్ పిన్బోరుమ్ కఱ్ఱుతిన్దు పేశుకైక్కాయ్, తమ్ పెరియపోదముడన్ మాఱన్ మఱైప్పొరుళ్ ఉరైత్తదు ఏదమిల్ పన్నీరాయిరమ్"** (అళ్గకియమణవాళచ్ఛీయర్ అనే ఆచార్యులు ప్రేమతో తరువాతి కాలంలోని వారు అభ్యసించి, తాత్పర్యాన్ని తెలిసికొని, వివరించే రీతిలో తమ గొప్ప బుద్ధితో నమ్మాళ్వార్ల ద్రావిడవేదానికి ప్రతిపదార్థ రూపమైన వ్యాఖ్య పన్నీరాయిరప్పడిని ప్రసాదించిరి) అనే పాశురం తెల్పుతున్నది. **"ప్రశమాది సద్గుణాఢ్యమ్"** అనే విశేషణం సన్న్యాసాశ్రమాను గుణమైన ఆత్మగుణాలను అన్నిటిని పూర్ణంగా కలవారనే అర్థాన్ని వ్యక్తం చేస్తుంది.

ఇక్కడ ఒక విశేషం. సంస్కృత భాషలో సింహశబ్దం శ్రేష్ఠవాచకం. **"సింహశార్దూల నాగాద్యాః వాచకా !"** అని అమరసింహుడన్నాడు. ఈ సింహశబ్దం ద్రావిడంలో **"శీయమ్"** అనే వికృతిని పొందుతుంది. ఉత్తమాశ్రమమైన సన్న్యాసాన్ని స్వీకరించిన వ్యక్తికి ద్రావిడంలో **"జీ(శీ)యర్"** అని వ్యవహారం. ఉత్తమాశ్రమం స్వీకరించిన సన్న్యాసి శ్రేష్ఠవాచకమైన **"శీయర్"** అనే పదంతో వ్యవహరింపబడుతున్నారని చెప్పవచ్చు. ఈ విధంగా **"జీయర్"** అనే పదం **"సింహ"** శబ్దపర్యాయంగా భావించినపుడు **"అళ్గకియ మణవాళచ్ఛీయర్"** ప్రకృతంలో **"వాదిసింహ"** శబ్దంతో నిర్దేశింపబడ్డారని చెప్పవచ్చు.

**72. సరఃప్రభృతిదివ్యసూర్యుదితదివ్యసూక్త్యాశయ-
ప్రకాశనసముద్భవానితరాలభ్యకీర్త్యుజ్జ్వలమ్ ।**

గురుం హృది విభావయన్ వరముని ర్ధి కృష్ణాహ్వాయం
మదీయహృదయే సదా సకరుణం విధత్తాం స్థితిమ్ ॥

సరఃప్రభృతి = సరోయోగి మొదలుగా గల, దివ్యసూరి = ఆళ్వార్ల వలన, ఉదిత = ఉదయించిన, దివ్యసూక్తి = దివ్యప్రబంధాల, ఆశయ = తాత్పర్యాన్ని, ప్రకాశన = వ్యక్తం చేయడం వల్ల, సముద్భవ = పుట్టిన, అనితరకీర్తి+ఉజ్జ్వలమ్ = అసాధారణమైన కీర్తితో ప్రకాశించేవారు అయిన, కృష్ణాహ్వాయం గురుం = పెరియవాచ్చాన్‌పిళ్ళై అనే ఆచార్యులను, హృది విభావయన్ = హృదయంలో మిక్కిలిగా భావిస్తూ ఉండేవారైన, వరమునిః = శ్రీవరవరమునులు, సకరుణం = దయతో, మదీయ హృదయే = నా హృదయంలో, స్థితిం విధత్తామ్ = స్థితిని చేయుదురు గాక! (నిత్యనివాసం కల్గి ఉందురు గాక !)

పొయ్‌కై ఆళ్వార్ మొదలగు సకలదివ్యసూరుల దివ్యసూక్తులగు అన్ని దివ్యప్రబంధములకును వ్యాఖ్యానములను అనుగ్రహించి, దివ్యప్రబంధార్థములను వివరించుటవలన ఏర్పడి విలక్షణమైన కీర్తిచే **"వ్యాఖ్యాతృచక్రవర్తి"** అనుచు పొగడబడుచు వెలుగు శ్రీకృష్ణనామధేయులగు పెరియవాచ్చాన్‌పిళ్ళైను మనస్సులో ఎల్లప్పుడును చింతించు శ్రీమణవాళమహామునులు నా హృదయకమలములో సదా వేంచేసియుండుగాక! అని భావము.

"పెరియవాచ్చాన్‌పిళ్ళై పిన్బుళ్ళవైక్కుమ్ తెఱియ వియాక్కియకళ్ శెయ్‌వాల్ అరియ అరుళిచ్చెయల్ పొరుళై ఆరియర్ కట్కు ఇప్పోదు అరుళిచ్చెయల్ ఆయ్‌త్తఱిన్దు" (పెరియవాచ్చాన్‌పిళ్ళై మిగిలిన దివ్యప్రబంధాలకు అన్నిటికి వ్యాఖ్యానాలను చేసినందువల్లనే ఈనాడు ఆ దుర్లభాలైన దివ్యప్రబంధార్థాలను ఆచార్యులు తెలిసికొని, ఇతరులకు తెలుపగల్గినట్లున్నవి.) అను ఉపదేశరత్నమాలా సూక్తి ఇచట అనుసంధేయము.

73. రహస్యత్రయాఖ్యం జగద్దేశికోక్తం రహస్యత్రయాంతర్గతార్థప్రదీపమ్ ।
వివవ్రే జగద్గుప్తయే యః కృపాబ్ధిః స నః పాతు రమ్యోపయంతా మునీంద్రః ॥

జగద్దేశిక+ఉక్తం = శ్రీపిళ్ళైలోకాచార్యులవారిచేత చెప్పబడినది, రహస్యత్రయ+అంతర్గత + అర్థప్రదీపం = మూడు రహస్యాలు అయిన అష్టాక్షరి, ద్వయ, చరమ శ్లోకాలలోని అర్థాలను విశేషంగా ప్రకాశింపజేసేది అయిన, రహస్యత్రయ +అఖ్యం = రహస్యత్రయమనే పేరును కల ముముక్షుప్పడిని, జగద్గుప్తయే = లోకరక్షణార్థం, యః కృపాబ్ధిః = కరుణాసముద్రులైన ఏమణవాళమహామునులు, వివవ్రే = వివరించారో, సః రమ్యోపయంతా మునిః = ఆ మణవాళమహామునులు, నః పాతు = మనలను రక్షించాలి.

రహస్యత్రయార్థములను సారముగా, స్పష్టముగా వివరించుచు శ్రీపిళ్ళైలోకా చార్యుల వారు అనుగ్రహించిన ముముక్షుప్పడిని కరుణాసముద్రులగు ఏ మణవాళ మహామునులు

సంసారిజీవులు ఉజ్జీవించుటకొఱకై వివరించిరో, ఆ వరవరమునులు మనలను రక్షింతురుగాక! – అని భావము.

తిరుమంత్రము, ద్వయము, చరమశ్లోకము అనబడు రహస్యములు మూడింటిని వివరించుచు, యాదృచ్ఛికపడి, శ్రియఃపతిపడి, పరన్దపడి ఇత్యాదిగా అనేక గ్రంథములను శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అతిసంక్షేపముగను, అతివిస్తృతముగను అనుగ్రహించుటచే అవి స్త్రీబాలాదులకు తెలిసికొనుటకు వీలుకాకుండనుండెను. కావున నాతివిస్తృతము, నాతిసంగ్రహమునగు **"ముముక్షుప్పడి"** అను ప్రబంధమును చివరగా అనుగ్రహించిరి. దీనికే వరవరమునులు వ్యాఖ్యానమును సాయించిరి. శ్రీవరవరమునులు ముముక్షుప్పడి వ్యాఖ్యానావతారికలో – **"మున్నే రహస్యత్రయ విషయమాక మూన్డు ప్రబంధమిట్టరుళి యిరుక్కచ్చెయ్‌దేయుమ్, అతిల్, యాదృచ్ఛికప్పడి అతి సంగ్రహమాకైయాలుమ్, పరన్దపడి అతివిస్తృతమాకైయాలుమ్, శ్రియఃపతిపడి ఉభయదోషమిన్ఱియిలే యిరున్దదే యాకిలుమ్, సంస్కృతవాక్యబహుళమాకైయాలే పెణ్ణుక్కుమ్ పేదైక్కుమ్ అధికరిక్కప్పోకామై యాలుమ్, త్రివిధ దోషమిన్ఱిక్కే ఇన్నముమ్ ఒరు ప్రబంధమిడవేణ్డుమెన్ఱు తిరువుళ్ళమ్ ఒరు ప్రబందమిడవేణ్డుమెన్ఱు తిరువుళ్ళమ్ పఱ్ఱి, ఎల్లావఱ్ఱుక్కు ప్పిన్బితే ముముక్షుప్పడి యకిఱ ఇప్ప్రబంధమిట్టరుళిఱ్ఱు"** (పూర్వమే రహస్యత్రయాన్నిగూర్చి మూడు ప్రబంధాలు రచించినా, వాటిలో యాదృచ్ఛికప్పడి చాలా సంగ్రహమైనందున, పరన్దపడి చాలా విస్తృతమైనందున, శ్రియఃపతిపడి ఈ రెండు దోషాలు లేనిది అయినా, సంస్కృత వాక్యాలు అందులో ఎక్కువగా ఉన్నందున స్త్రీ బాలురు దానిని అధికరించడానికి సాధ్యం కానందువల్ల, ఈ మూడు దోషాలు లేకుండా ఉండే ఇంకొక ప్రబంధాన్ని రచించాలని భావించి, అన్నిటికి పిమ్మట కదా ముముక్షుప్పడి అనే ఈ ప్రబంధాన్ని రచించారు) అని పల్కిన సూక్తి స్మరణీయం. తిరుమంత్రార్థమను ఈ గ్రంథమే కాలక్షేపగ్రంథముగా పెద్దలు పరిగ్రహించిరి. ప్రపన్నుడు ప్రతిఒక్కడు తప్పక తిరుమంత్రార్థమును ఆచార్యసన్నిధిలో కాలక్షేపము చేయవలెను. శ్లోకములోని **"రహస్యత్రయాఖ్యమ్"** అను ప్రయోగము ఈ ముముక్షుప్పడినే నిర్దేశించును. దానికే కదా వరవరమునులు వ్యాఖ్యానించారు.

74. శ్రీమల్లోకగురూదితా శ్రుతిశిరస్సిద్ధాంతసంజీవినీ
సా తత్త్వత్రితయాహ్వయా కిల కృతిః యద్వ్యాఖ్యయాఽలంకృతా ।
శ్లాఘాలోలఫణీంద్రమౌళివిలసద్రత్నాంశునీరాజితా
పాయా న్న స్సతతం స సుందరవరో యోగీ గుణై స్సుందరః ॥

యద్వ్యాఖ్యయా = ఏ మణవాళమహామునుల వ్యాఖ్యారూపమైన శ్రీసూక్తిచే, అలంకృతా = అలంకరింపబడినది, శ్రీమల్లోకగురు+ ఉదితా = శ్రీపిళ్ళైలోకాచార్యుల వారిచేత ఉదయించినది, శ్రుతి శిరఃసిద్ధాంతసంజీవనీ = వేదాంతసిద్ధాంతానికి సంజీవిని అయిన, తత్త్వత్రితయి+ఆహ్వయా = తత్త్వత్రయమనే పేరును కల్గినది అయిన, సా

కృతిః = ఆ గొప్ప కృతి, శ్లాఘాలోల = మాధుర్యంచేత, ప్రశంసించడంలో ఆసక్తుడైన, ఫణీంద్ర = ఆదిశేషునియొక్క, మౌళి = శిరస్సులలో (పడగలతో), విలసత్ = విశేషంగా ప్రకాశించే, రత్న+అంశు = రత్నాల కిరణాలచేత, నీరాజితా = హారతి ఇవ్వబడినది, గుణైః సుందరః = కల్యాణగుణాలతో ఆకర్షణీయులైన, సః సుందరవరః యోగీ = ఆ మణవాళ మహామునులు, నః సతతం పాయాత్ = మనలను సదా రక్షించాలి.

వేదాంతసిద్ధాంతతత్త్వార్థములను వివరించునది, శ్రీపిళ్ళైలోకాచార్యులవారిచే రచింపబడినది అయిన తత్త్వత్రయమను రహస్యగ్రంథము మణవాళమహామునుల వ్యాఖ్యానముచే అలంకరింపబడి, మాధుర్యాతిశయముచే ఆదిశేషునిచే సైతము శిరసా వహింపబడి, అతని పడగలలోని మణుల కాంతిచే నీరాజనము చేయబడి వెలుగుచున్నది. (ఆదిశేషులును వరవరమునులు తత్త్వత్రయవ్యాఖ్యానమును విని, ఆనందముగా తల ఊపి శ్లాఘించుచున్నాడని భావము), సద్గుణములచే అందముగా వెల్గునట్టి ఆ శ్రీమణవాళ మహామునులు మనలను ఎల్లప్పుడు కాపాడుదురుగాక ! – అని భావము.

సంప్రదాయములో తత్త్వత్రయ వ్యాఖ్యానమునకు– **"కుట్టిభాష్య"** మని పేరు. ఇంచుమించు శ్రీభాష్యములో తులతూగుపై అర్థవైభవమును కల తత్త్వత్రయ వ్యాఖ్యను (శ్రీభాష్యగ్రంథమును అనుగ్రహించిన) సహస్రఫణులైన శ్రీరామానుజులు శ్లాఘించుట యుక్తముకదా ! **"శ్లాఘాలోల ఫణీంద్ర"** అనే ప్రయోగస్వారస్యాన్ని బట్టి తత్త్వత్రయవ్యాఖ్యను శ్రీరామానుజులు ఆనందముతో సహస్రవదనులై శ్లాఘించుచున్నారను అర్థమును కూడా చెప్పవచ్చును. **"అహిరేవ జానాతి అహేః పాదాన్"** అని కదా సూక్తి.

75. శ్రుతిస్మృతిసరోమునిప్రభృతిసూరిసూక్తిస్ఫురత్–
ప్రసూనరచితాతులానఘవరార్యసూక్తిస్రజః ।
బిభర్తి శుభసౌరభశ్రియ ముదార యద్భారతీ
స మే దిశతు సుందరో వరముని శ్శుభం శాశ్వతమ్ ॥

శ్రుతి = శ్రుతులలో, స్మృతి = స్మృతులలో, సరోముని ప్రభృతి సూరి సూక్తి = పొయ్కై ఆళ్వార్లు మొదలైన దివ్యసూరుల సూక్తులలో, స్ఫురత్ = ప్రకాశించే, ప్రసూన= పూలచేత (పూలవంటి వాక్యాలచేత), రచిత = రచింపబడ్డ, అతుల = సాటి లేని, అనఘ= పాపరహితులైన, వరార్య = శ్రీ పిళ్ళైలోకాచార్యులవారియొక్క, సూక్తి =సూక్తులనే, స్రజః = పూమాలికకు, శుభసౌరభశ్రియం = మంగళకరమైన పరిమళ సంపదను, ఉదార = ఉదారులైన, యద్భారతీ = ఏమణవాళమహామునుల, బిభర్తి =భరిస్తున్నదో, సః సుందరమునిః = ఆ రమ్యజామాతృముని, శాశ్వతం శుభం = శాశ్వతమైన మంగళాన్ని, మే = నాకు, దిశతు = కల్గించాలి.

శ్రుతులు, స్మృతులు, ఆళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధములు అను సూక్తి పుష్పములచే గుదిగుచ్చబడినదియై, నిస్సమాభ్యధికమై, నిర్దోషమై, శ్రీపిళ్ళైలోకాచార్యుల

వారిచే కృపజేయబడిన శ్రీవచనభూషణమనెడి సూక్తిమాలకు మహోదారులగు ఏ మణవాళమహాముసుల వ్యాఖ్యానము మంగళకరమై, అతిశయించిన సువాసనను వెదజల్లుచున్నదో, ఆ మణవాళమహాముసులు శాశ్వతమైన మంగళమును అనుగుణంగా అనుగ్రహింతురుగాక !

మణవాళమహాముసుల వ్యాఖ్యానముచే శ్రీవచనభూషణము దివ్యసుగంధముతో కూడి, దానిని అభ్యసించినవారికి అలంకారమై, అనుభావ్యమై వెలుగుచున్నదని రస్యభావము. శ్రీపిళ్ళైలోచార్యులవారు అనుగ్రహించిన రహస్యగ్రంథాలకు అన్నిటికి శ్రీవర వరమునులు వ్యాఖ్యానమును అనుగ్రహించిన సందర్భాన్ని, ఆ వ్యాఖ్యానవైభవాన్ని యతీంద్రప్రవణప్రభావం ఈ క్రింది విధంగా తెలియజేసింది–

"భూత్వా భూయో వరవరమునిః భోగినాం సార్వభౌమః, శ్రీమద్రంగే వసతి విజయీ విశ్వసంరక్షణార్థమ్"స(సర్పప్రభువు అయిన ఆదిశేషుడు తిరిగి వరవరమునిగా అవతరించి, లోకరక్షణం కోసం శ్రీరంగంలో నివసిస్తున్నారు) అనే రీతిలో ఈవిధంగా సకలలోకోజ్జీవనం కోసం అవతరించిన శ్రీవరవరమునులు, అఖిలజనులకు జీవనౌషధం అయిన శ్రీపిళ్ళైలోచార్యులు వారి దివ్యసూక్తులైన రహస్యగ్రంథాలకు అన్నిటికి వ్యాఖ్యానం చేయాలని తలచి, **"రహస్యగ్రంథతత్త్వేషు రమయామాస తత్ప్రియాన్, వాక్యసంగతివాక్యార్థ తాత్పర్యాణి యథాశ్రుతమ్, వ్యాకుర్వన్నేవ పూర్వేషాం వర్తమానః పదే పదే, స్వమనీషాకథాం నైవ కల్పయన్ కించిదప్యయమ్, గుప్తాన్ సర్వైః గురుత్వేన గూఢా నర్థానదీదిశత్"** (ఈ వరవరమునులు పూర్వాచార్యుల దారిలో వ్యాఖ్యానిస్తూ ప్రతిపదానికి తమబుద్ధి తోచినట్లుగా ఉపయోగం లేని విషయాలను వేటినీ చెప్పకుండా, ఆచార్యముఖంగా తాము ఆలకించిన రీతిలో అర్థానుగుణంగా వాక్యాలను, వాటి పరస్పరసంబంధాన్ని, వాక్యార్థాలను, తాత్పర్యాలను విశేషంగా వివరిస్తూ, సకలపూర్వాచార్యులచేత రహస్యంగా అంతవరకు దాచి ఉంచిన అర్థాలను కృపతో ఉపదేశించారు. ఆ రహస్యగ్రంథాలలో ప్రవేశించిన వారికి ఆ రహస్యగ్రంథతత్త్వాలను ఉపదేశించి సంతోషింపజేశారు) అని, **"శ్రుతిస్మృతీతిహాసైశ్చ శ్రుత్యంతైః పాంచరాత్రతః, దేశికానాం నిబంధౄణాం దర్శయన్నేక కంఠతామ్, వాక్యాలంకారవాక్యాని వ్యాచక్షాణో విశేషతః, సుధియః స్వాదయామాస స్వస్వరూపం సుదుర్గ్రహమ్"** (వేదవాక్యాలతో, మన్వాదిస్మృతులతో, ఇతిహాసాలతో, వేదాంతాలతో, పాంచరాత్రంతో, గ్రంథకర్తలైన పూర్వాచార్యులయొక్క ఏకగ్రీవత్వాన్ని దర్శింపచేస్తూ, సమర్థులై, వాక్యాలను, స్తుతివాక్యాలను వివరిస్తూ, గొప్పజ్ఞానులకు సైతం అందని ఆత్మస్వరూపంయొక్క యాథాత్మ్యాన్ని శ్రీవరవరమునులు తెలిపారు) అనే క్రమంలో ఒక్కటి కూడా తప్పని రీతిలో మొట్టమొదట తత్త్వత్రయానికి వ్యాఖ్యానాన్ని అనుగ్రహించి, అనంతరం అశేషార్థాలను తెలిపే, గంభీరమైన అర్థాలను కల శ్రీవచనభూషణానికి **"మెచ్చుమ్ వియాక్కియై"** (పెద్దలు మెచ్చే వ్యాఖ్యానాన్ని శిష్టపరిగ్రాహ్యమైన రీతిలో

అనుగ్రహించి, **"శీర్ వశనబూడణమామ్ దెయ్వకుళిక్కై ప్పెఱ్ఱోమ్, పారులకై ప్పొన్నులకా ప్పార్క్క ప్పెఱ్ఱోమ్, తేరి నమక్కొప్పారిని యార్ ఉలకాశిరియ నరుళ్ తప్పామల్ ఓడియపిన్ తాన్"** (గొప్పదైన శ్రీవచనభూషణమే దివ్యమైన గుళికను పొందాము, భూలోకాన్ని పరమపదంగా చూడగలిగాము, మనస్సులో తేరి, లోకాచార్యులవారి అనుగ్రహాన్ని పొంది తప్పకుండా అభ్యసించిన మనకిక సాటి ఎవరు ?) అని అంటూ శ్రీవచనభూషణంయొక్క అర్థాన్ని తాముకూడా అనుసంధించి, మిక్కిలి ఆనందించారుకదా. శిష్యులుకూడా. ఆ రీతిలోనే **"వాగ్భూషణంవకుళభూషణ శాస్త్రసారం యో మాదృశాం చ సుగమం వ్యవృణోద్దయాళుః, రమ్యోపయంతృమునయే యమినాం వరాయ తస్మై నమః శమదమాదిగుణార్ణవాయ"** (శ్రీమణవాళమహామునులు కృపాళువులై నమ్మాళ్వార్ల తిరువాయ్మొళి ప్రబంధానికి సారం అయిన శ్రీవచనభూషణాన్ని మావంటివారికికూడా సులభంగా తెలిసేటట్లు వివరించారు. శమదమాదికల్యాణ గుణాలకు సముద్రంవంటివారు, యతిపతి అయిన ఆ మణవాళ మహామునులకు నమస్కరిస్తున్నాను) అని కీర్తించారు.

76. **జగద్గురువరానుజగ్రథితచిత్రగుర్వాశయా-**
భిధానకృతిసంప్రకాశనపటీయసే యత్కృతిః ।
అనన్యసులభాం వ్యనక్త్యనఘశేముషీనైపుణీం
స మే వరవరో ముని ర్వితరతు శ్రియం భూయసీమ్ ॥

యత్ కృతిః = ఏ మణవాళమహామునుల వ్యాఖ్య, జగద్గురువర+అనుజ = శ్రీపిళ్ళై లోకాచార్యులవారి అనుజులైన అళగియ మణవాళప్పెరుమాళ్ నాయనార్‌చే, గ్రథిత = కూర్పబడ్డ, చిత్ర = ఆశ్చర్యకరమైన, గురు+ఆశయ + అభిధానకృతి = ఆచార్య హృదయమనే గ్రంథాన్ని, సంప్రకాశనపటీయసీ = ప్రకాశింపజేయడంలో సమర్థమైనదో, అనన్యసులభాం = ఇతరులకు సులభం కాని, అనఘశేముషీనైపుణీం = ఏ దోషం లేని, బుద్ధినైపుణ్యాన్ని, వ్యనక్తి = వ్యక్తం చేస్తున్నదో, సః వరవరమునిః = ఆ వరవరముని, మే = నాకు, భూయసీం శ్రియః = అధికమైన జ్ఞానసంపదను, వితరతు = అనుగ్రహించాలి.

శ్రీపిళ్ళైలోకాచార్యులవారి అనుజులగు అళగియ మణవాళప్పెరుమాళ్ నాయనార్ అనుగ్రహించిన, శబ్దార్థగాంభీర్యముతో కూడినదియైయున్న ఆచార్యహృదయమను అత్యద్భుతమైన ప్రబంధముయొక్క అర్థములను చక్కగా వివరింపగల్గినది అగు ఏ మణవాళమహామునుల వ్యాఖ్యానము అన్యులకు లభించుటకు దుర్లభమై, దోషగంధ రహితమైన, వరవరమునుల బుద్ధిసామర్థ్యమును నిరూపించుచున్నదో, ఆ వరవరమునులు నాకు అధికమైన జ్ఞానసంపదను అనుగ్రహింతురుగాక !

శ్లోకములో **"గుర్వాశయ"** శబ్దము ఆచారహృదయగ్రంథమును నిర్దేశించుచున్నది. దీనికి శ్రీమణవాళమహామునులు అనుగ్రహించిన వ్యాఖ్య వారి బుద్ధివైభవమును వ్యక్తీకరించుచున్నది. ఈ వ్యాఖ్యయే వరవరమునులు సర్వజ్ఞత్వమునకు సాక్షి.

**77. కృత్వానేకాన్యహాన్యప్రతిమనయమహాశాస్త్రసంపాతఘోరం
తత్తాదృగ్వాదయుద్ధం యతిపతి రనయద్యం విజిత్య స్వపక్షమ్ ।
తత్ప్రోక్తం మానసారం వ్యవృణుత కిల యో మేయసారం చ గమ్యమ్
తస్మై నిత్యం నమస్తాత్ వరవరమునయే నిస్తులోదారభూమ్నే ॥**

అనేకాని అహాని = పలు దినాలు, అప్రతిమ = సాటి లేని, నయ = న్యాయాలతో కూడిన, మహాశాస్త్ర = గొప్ప శాస్త్రాలయొక్క, సంపాత = ప్రయోగంచేత, ఘోరం = భయంకరమైనది అయిన, తత్తాదృక్ = అనిర్వచనీయం అయిన, వాదయుద్ధ = వాదమనే యుద్ధాన్ని, విజిత్య = జయించి, యం = ఏ అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనే ఆచార్యులను, యతిపతిః = భగవద్రామానుజులు, స్వపక్షం = తన పక్షంలోకి, అనయత్ = తీసికొనివచ్చారో, తత్ ప్రోక్తం = ఆ అరుళాళ ప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్లచే రచింపబడ్డ, గమ్యం మానసారం = తెలియదగిన జ్ఞానసారం అనే గ్రంథాన్ని, మేయసారం చ = ప్రమేయసారమనే గ్రంథాన్ని, యః = ఏ మణవాళ మహామునులు, వ్యవృణుత = వ్యాఖ్యానించారో, నిస్తుల+ఉదారభూమ్నే = సాటి లేని గొప్ప వైభవాన్ని కల్గిన, తస్మై వరవరమునయే = ఆ మణవాళమహామునులకొఱకు, నిత్యం నమః స్తాత్ = నిత్యం నమస్కారం ఉండాలి.

యతిరాజు అగు భగవద్రామానుజులు పదునెనిమిది దినములపాటు మహా విద్వాంసుడగు యజ్ఞమూర్తి అను అద్వైతిని అమోఘమైన నీతితోకూడిన మహాశాస్త్రమను శస్త్రప్రయోగముచే ఘోరమైన వాదయుద్ధమును చేసి, చివరకు జయించి, వారిని తన పక్షములో చేర్చుకొనిరి. శ్రీవరదరాజస్వామి కృపవలన జయించి, ఆ యజ్ఞమూర్తిని తనకు శిష్యులుగా చేసికొనిన ఎమ్బెరుమానార్ వారికి అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనెడి పేరును పెట్టిరి.

ఈ వృత్తాంతాన్ని వదుగనంబి యతిరాజవైభవంలో **"యతీశ్వరస్యాప్యథ యజ్ఞమూర్తేః జితో భవేద్యో జయతోమతస్థః, ఇతి ప్రతిజ్ఞాయ చ రంగపుర్యాం ప్రవర్తతాష్టాదశ రాత్రవాదః, స్వప్నే యతీశో వరదేక్షితస్సన్ మాయామతస్థాపక యజ్ఞమూర్తిమ్, వాదేఽజయత్ తం వరదాఖ్య యాస్వం నామాప్యదాత్ సోఽపి తుతోష శిష్యః"** అనే శ్లోకాలలో (85,86) ప్రస్తావించారు.

వరవరమునిసుచరితచషకంలోకూడా – **"లోకాచార్యోక్త తత్త్వత్రితయ మనుయుగశ్లోక వాగ్భూషటీకామాలా సంక్షేప గీతాహృదయ వివరణే జ్ఞానసారాదిటీకే, అంతాదిం రత్నమాలాం శఠరిపుఘనితివ్యాక్రియామానజాలం చక్రే"** అని అంటూ జ్ఞానసార ప్రమేయసార రచనను గూర్చి ప్రస్తావింపబడింది.

దయాపాలమునిగా ప్రసిద్ధిని పొందిన ఆ అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ జ్ఞానసారము, ప్రమేయసారము అను రెండు ప్రబంధములను అనుగ్రహించిరి. ఈ

ప్రబంధములకు ప్రమాణత్తిరట్టుతో వ్యాఖ్యానమును అనుగ్రహించిన, నిస్సమాభ్యధికమైన ప్రభావమును కల వరవరమునుల శ్రీపాదములలో నిత్యము నేను నమస్కరింతును - అని భావము. **"అప్రతిమనయమహాశస్త్ర"** -అను పాఠమున అమోఘమైన నీతి అను మహాశస్త్రము - అని అర్థము. వాదయుద్ధంలో పలు విధాలైన న్యాయాలే కదా జయించే గొప్ప ఆయుధాలు.

78. **ప్రపన్నానాం గాయత్ర్యమృతకవిదృష్టా యతిపతిం**
స్తుతి ర్యద్వ్యాఖ్యాతా ప్రజనయతి సత్త్వోత్తరముదమ్ ।
అజస్రం నః పాయా ద్వరమునివరః శీలకరుణా-
క్షమావాత్సల్యాద్యై రనవధికగుణౌఘై స్స మధురః ॥

అమృతకవిదృష్టా = శ్రీరంగామృతకవి అనబడే తిరువరఙ్గత్తముదనార్‌చేత దర్శింప బడినది, యతిపతిస్తుతిః = భగవద్రామానుజుల స్తుతిరూపమైనది అయిన, ప్రపన్నానాం గాయత్రీ = ప్రపన్నగాయత్రి అనబడే ఇరామానుశనూ*ఱ్ఱ*న్దాది ప్రబంధం, యద్వ్యాఖ్యాతా = ఏ మణవాళమహామునులచేత వ్యాఖ్యానింపబడినదై, సత్త్వోత్తర ముదమ్ ప్రజనయతి = పరమసాత్త్వికులైన శ్రీవైష్ణవులకు ఆనందాన్ని కల్గిస్తున్నదో, శీలకరుణాక్షమావాత్సల్యాద్యైః = సౌశీల్యం దయ, క్షమ, వాత్సల్యం మొదలైన, అనవధికగుణ+ ఓఘైః = అంతు లేని గుణాల సమూహంతో, మధురః = భోగ్యులైన, సః వరమునివరః = ఆ శ్రీమణవాళ మహామునులు, నః పాయాత్ = మనలను రక్షించుగాక!

తిరువరంగత్తముదనార్ కృపజేసిన, ప్రపన్నగాయత్రీప్రబంధమనబడు, భగవద్రామానుజుల స్తుతిరూపమగు ఇరామానుశనూ*ఱ్ఱ*న్దాది మణవాళమహామునులు అనుగ్రహించిన వ్యాఖ్యానముతో కూడినదియై, పరమసాత్త్వికులగు శ్రీవైష్ణవులకు నిత్యము అనుసంధేయమై, సాత్త్వికమైన పరమానందమును అనుగ్రహించుచున్నదో, శీలము, కరుణ, క్షేమ, వాత్సల్యము మొదలగు గుణములచే వెలుగుచున్నవారై, దాసులకు మధురస్వరూపులగు ఆ శ్రీమణవాళ మహామునులు ఎల్లప్పుడు మనలను కాచెదరుగాక !

యతీంద్రప్రవణ ప్రభావంలో కూడా ఈ విషయం- **"అనంతరమ్, శ్రీవచన భూషణత్తుక్కుమ్ అడియాయ్, చరమపర్వనిష్ఠాక్రమప్రతిపాదకమాన నూ*ఱ్ఱ*న్దాదిక్కుమ్, జ్ఞానసారప్రమేయసారఙ్గళుక్కుమ్ వ్యాఖ్యానమ్ శెయ్‌దరుళి"** అని తెలుపబడింది. ఈ సూక్తిలో జ్ఞానసార, ప్రమేయసార వ్యాఖ్యలనుగూర్చి, ఇరామానుశ నూ*ఱ్ఱ*న్దాది వ్యాఖ్యను గూర్చి ప్రస్తావింపబడింది. **"అనవధిక"** అనే విశేషణం సంఖ్యలోను, వైభవంలోను అన్వయించడం సరసం. వాధూలవీరరాఘవాచార్యస్వామివారు వరవరముని సుచరిత చషకమనే గ్రంథంలో- **"శ్రీమద్రామానుజాంఘ్ర్యో రమృతగురువరైః అర్పితాం సూక్తిమాలాం వ్యాచక్షాణ"** అని ఇరామానుశనూ*ఱ్ఱ*న్దాది వ్యాఖ్యను గూర్చి ప్రస్తావించారు.

79. విష్ణో ర్యద్దర్శనార్చాసరణి మనుసరన్ అర్చనం సత్త్వభాజాం
సంఘః సర్వోఽపి కుర్వన్ జయతి గుణనిధిః తత్కటాక్షైకపాత్రమ్ ।
తస్మాత్కాంతోపయంతుః ప్రణతజననిధేః శ్రీమతో దేశికేంద్రాత్
నాహం నాహం న జానే పర మిహ శరణం దైవతం నైవ జానే ॥

యత్ దర్శన + అర్చాసరణిం = ఏమణవాళమహామునులచేత రచింపబడినది, మన దర్శనానికి అనుగుణమైనది అయిన, **"జీయర్ పడి"** అనే తిరువారాధనక్రమాన్ని, అనుసరన్ = అనుసరిస్తూ, విష్ణోః అర్చనం = విష్ణువుయొక్క ఆరాధనను, కుర్వన్ = చేస్తూ, గుణనిధిః = సద్గుణాలకు నిధి అయిన, సత్త్వభాజాం సంఘః= సాత్త్వికులైన శ్రీవైష్ణవసమూహం, తత్కటాక్ష+ఏకపాత్రం = ఆ మణవాళమహామునుల కటాక్షానికి అద్వితీయ లక్ష్యభూతమై, జయతి = సర్వోత్కర్షతో వెలుగుతున్నదో, ప్రణతజననిధేః = భక్తజనానికి నిధివంటివారు, దేశికేంద్రాత్ = గొప్ప ఆచార్యులు, శ్రీమతః = భగవత్కైంకర్యనిష్ఠులు అయిన, తస్మాత్ కాంతోపయంతుః = ఆ శ్రీమణవాళమహామునుల కంటే, పరం దైవతం = ఇంకొక దైవాన్ని, శరణం = శరణంగా, ఇహ = ఈ లోకంలో, న అహం జానే = నేను తెలియను, న అహం జానే = ఏను తెలియను, నైవ అహం జానే= నేను తెలియనే తెలియను.

ఏ మణవాళమహామునుల దాసులగు, సాత్త్వికులైన శ్రీవైష్ణవులు అందఱును ఆ వరవరమునులు ప్రసాదించిన, మన దర్శనమునకు అనుగుణమైన తిరువారాధనక్రమమును ప్రతిపాదించు **జీయర్ పడి**లో తెలిపిన రీతిలో భగవానునకు తిరువారాధనమును చేయుచు, ఆ మణవాళమహామునుల కటాక్షమునకు పాత్రభూతులై, శమదమాదిగుణనిధులై వెలుగుచున్నారో, తనను ఆశ్రయించినవారికి గుప్తనిధియైయుండు ఆచార్యశ్రేష్ఠులైన ఆ మణవాళమహామునులను తప్ప వేఱొక దైవమును నేను తెలియను. ఉజ్జీవనమునకు వేఱొక ఉపాయమును నేను తెలియను. ఎల్లప్పుడు పెరియజీయర్ తిరువడిగళ్ళనే శరణముగా కల్గియుందును.

ప్రమాణమును ముమ్మారు చేయుట సహజము. అదే రీతిలో అణ్ణన్ **"న జానే న జానే నైవ జానే"** అని అంటూ ముమ్మారు ప్రమాణం చేసిరి. నిత్యగ్రంథరచనను గూర్చి వడుగనంబి యతిరాజ వైభవంలో **"శ్రీశం ప్రపన్నస్య తదేకవృత్తేః కైంకర్యమాప్రాపణ కార్యమాహ నిత్యాభిధగ్రంథముఖాద్యతీశః"** (74) అని తెలిపారు.

80. శ్రీమత్కాంతవరస్య దేశికవరస్యాంఘ్రీ సరోజోపమౌ
సంసారార్ణవమగ్నసర్వజనతాసంతారణైకవ్రతౌ ।
యే ధ్యాయంతి సదా తదన్యవిముఖా స్తద్దర్శితే సత్పథే
నిష్ఠాం బిభ్రతి సద్గుణై స్సురభితా స్తేభ్యో మహద్భ్యో నమః ॥

సంసార+అర్ణవమగ్న = సంసారమనే సముద్రంలో మునిగిన, సర్వజనతా = సమస్త జనసమూహాన్ని, సంతారణ = దాటించి తీరాన్ని చేర్చడమనే, ఏకవ్రతౌ = అద్వితీయ వ్రతాన్ని కల్గినవి, సరోజ+ ఉపమౌ = పద్మాలకు సాటి వచ్చేవి అయిన, కాంతవరస్య దేశికవరస్య = శ్రీమణవాళమహాములనే ఆచార్యవర్యులయొక్క, అంఘ్రీ = శ్రీచరణాలను, యే = ఎవరు, సదా = ఎల్లప్పుడు, ధ్యాయంతి = ధ్యానిస్తున్నారో, తదన్యవిముఖాః = ఆ మణవాళమహామునుల కంటే అన్యుల విషయంలో వైముఖ్యాన్ని కలవారో, తత్ దర్శితే = ఆ మణవాళమహామునులచేత దర్శింపజేయబడ్డ (ఉపదేశింపబడ్డ), సత్పథే = మంచి దారిలో, నిష్ఠాం = నిష్ఠను, బిభ్రతి = కల్గి ఉన్నారో, సద్గుణైః సురభితాః = సద్గుణాలచేత పరిమళించేవారై ఉండే, తేభ్యః మహద్భ్యః = ఆ మహనీయులకు (పూజనీయులకు), నమః = నమస్కారం.

సద్గుణములచే సుగంధమును కల్గి వెలుగువారైన ఏ మహాపురుషులు, సంసార సాగరములో మునిగియుండు జనములను, ఆ సముద్రమునుండి దాటి ఆవలి గట్టును చూడగల్గునట్లు చేయుటయే వ్రతముగా కల్గియున్న, కమలసమానములగు వరవరమునుల శ్రీచరణములనే తప్ప వేఱొక దానియందు మనస్సును ప్రవేశింపనీయనివారై ధ్యానింతురో, మఱియు వారిచే చూపింపబడిన సత్సంప్రదాయములో నిష్ఠను కలవారైయుందురో, అట్టి, మణవాళమహామునుల **"పొన్నడియామ్ శజ్గమలప్పోదుకళ్"** అని కీర్తింపబడు శ్రీచరణములను శిరస్సుతో ధరించు ఆ మహాత్ముల శ్రీపాదములకే దాసుడనగు నా ప్రణామములు అగుగాక ! **"త్వద్భృత్య భృత్య... భృత్యస్య భృత్యః"** అనే కులశేఖరసూక్తి భావం, **"అడియారడియార్.. అడియోజ్గళే", "తొణ్డన్.. తొణ్డన్ శఠకోపన్"** అనే నమ్మాళ్వార్ల సూక్తి భావం వరవరమునిపట్ల అనుసంధింపబడింది.

81. యదుదితా యతిభూపతివింశతి స్సమవధీరితశీధుసుధారసా ।
విశదయత్యఖిలం భవినాం హితం వరముని స్స తనోతు శుభాని నః ॥

యదుదితా = ఏ మణవాళమహామునులవల్ల అవతరించిన, యతిభూపతి వింశతిః = యతిరాజవింశతి అనే స్తోత్రం, సమవధీరిత శీధుసుధారసా = మాధుర్యంలో తేనెను, అమృతరసాన్ని తక్కువజేసేదై ఉన్నదో, భవినాం = సంసారులకు, అఖిలం హితం = మంచిని అంతటిని, విశదయతి = విశదీకరిస్తున్నారో, సః వరమునిః = ఆ మణవాళ మహామునులు, నః = మనలకు, శుభాని =మంగళాలను, తనోతు = విస్తరింపజేయాలి.

ఏ వరవరమునులు ప్రసాదించిన యతిరాజవింశతిస్తోత్రము మాధుర్యాతిశయముచే తేనెను, అమృతరసమునుకూడ తిరస్కరించు సమస్తసంసారి చేతనులకు అన్ని హితములను సుస్పష్టముగా తెలుపుచున్నదో, ఆ వరవరమునులు మనకు మంగళములను అనుగ్రహింతురు గాక !

యతిరాజవింశతిలో తెలుపబడిన చరమపర్వనిష్ఠ దేవతల అమృతరసాన్ని మించిన భోగ్యతను కల్గినది. ఈవిషయాన్ని గోదాదేవి సూక్తి వైభవాన్ని స్తుతిస్తూ **"యద్వాణీ రసభూమదారిత సుధావేణీ"** అని అంటూ ఇతఃపూర్వమే పలికారు. **"సిద్ధిర్భవతి వా నేతి సంశయోచ్యుతసేవినామ్, న సంశయోస్తి తద్భక్తపరిచర్యారతాత్మనామ్"** (తన భక్తులను ఏనాటికీ విడువని వాడు కనుక అచ్యుతుడనే పేరును పొందిన భగవానుని సేవించేవారికి ఫలసిద్ధి కల్గుతుందా? లేదా? అనే సందేహం కలుగవచ్చు. కాని, ఆ అచ్యుతుని భక్తులను సేవించేవారికి ఫలసిద్ధికల్గడంలో సందేహం లేనే లేదు) అని కదా సూక్తి. కనుక చరపర్వనిష్ఠాబోధకమైన యతిరాజవింశతి సంసారులకు సమస్తమంగళాలను కల్గిస్తుంది- అని అనడం సమంజసం.

82 మహాయోగీ వక్తాஉనితరగుణసామాన్యమహిమా
స తు స్తుత్యః శ్రీమా నమితగుణభూమా యతిపతిః ।
అతో నిస్తుల్యా సా యతినరపతే ర్వింశతి రితి
వ్యవస్యంత స్సంతః కలి మిహ జయంత్యుజ్జ్వలధియః ॥

అనితరగుణసామాన్యమహిమా = ఇతరులలో లేని, అసాధారణాలైన సద్గుణాలను కల్గి ఉండడమనే అతిశయాన్ని కలవారైన, మహాయోగీ = పెరియజీయర్, వక్తా = వక్త (స్తుతించేవారు), శ్రీమాన్ = భగవద్భక్తి, కైంకర్యాలనే సంపదను కలవారు, అమితగుణ భూమా = అంతు లేని కల్యాణగుణాలను కల్గిన గొప్పతనాన్ని కలవారైన, సః యతిపతిః తు = ఆ భగవద్రామానుజులు, స్తుత్యః= స్తుతింపబడేవారు, అతః= అందువల్ల, (వక్త గొప్పవారు, స్తుతింపబడేవారు గొప్పవారు కావడంవల్ల), సా యతినరపతేః వింశతిః = ఆ యతిరాజవింశతి, నిస్తుల్యా ఇతి = సాటి లేనిది అని, వ్యవస్యంతః = నిశ్చయాన్ని చేసికొనే, సంతః = సత్పురుషులు, ఇహ = ఈ లోకంలో, ఉజ్జ్వలధియః = గొప్పగా ప్రకాశించే బుద్ధిని కలవారై, కలిం జయంతి = కలిని జయిస్తున్నారు.

యతిరాజవింశతిని అనుగ్రహించినవారు ఇతరులకు లభించుటకు సాధ్యము కాని మహిమను కల, యోగిశ్రేష్ఠులగు మణవాళమహామునులు. వారు యతీంద్రప్రవణులను ప్రసిద్ధిని పొందినవారు. స్తుతికి విషయమైన (స్తుత్యులైన) భగవద్రామానుజులు అపరిమితములగు గుణములను కలవారు. వీరే ఉత్తారకాచార్యులు -అను ప్రసిద్ధిని కలవారు. ఇట్టి స్తోతృ-స్తుత్యవైలక్షణ్యముచే ఏర్పడిన ఈ ఇద్దరియొక్క వైభవముచే యతిరాజవింశతి మిక్కిలి గొప్పది. దీనికి సమమైన స్తోత్రము వేఱొకటి లేదు - అని నమ్మి, ప్రకాశించు బుద్ధిని కల విలక్షణాధికారులు కలినికూడ జయింపగలవారు.

తిరువాయ్‌మొ*ழ*ి ప్రబంధంయొక్క వక్తృ, ప్రతిపాద్య, గ్రంథవైలక్షణ్యాలు తిరువాయ్‌మొ*ழ*ిలోని **"ఏఱ్ఱుమ్ పెరుమ్ పుక*ழ*్"** అనే పాశురంలో తెలుపబడినట్లే

ఇక్కడకూడా యతిరాజవింశతియొక్క వక్తృ- ప్రతిపాద్య- గ్రంథవైలక్షణ్యాలు ఈ శ్లోకంలో తెలుపబడ్డాయి. **"అనితరజనసామాన్యమహిమా"** అను పాఠము ఉండి యుండవచ్చునని తోచుచున్నది.

83. ద్రాక్షా మధిక్షిపతి నిందతిమాకరంద-
ధారాం సుధారసఝరీ మధరీకరోతి ।
యత్సంప్రణీత మతులం యతిసార్వభౌమ-
స్తోత్రం స మే వరముని ర్వితనోతు భద్రమ్ ॥

యత్ సంప్రణీతం = ఏ మణవాళమహామునులచేత చక్కగా రచింపబడినది, అతులం = సాటి లేనిది అయిన, యతిసార్వభౌమస్తోత్రం = యతిరాజవింశతి, (మాధుర్యంలో) ద్రాక్షాం = ద్రాక్షను, అధిక్షిపతి = నిందిస్తున్నదో, మాకరంద ధారాం = తేనెల సోనను, నిందతి = నిందిస్తున్నదో, సుధారసఝరీం = అమృతరసప్రవాహాన్ని, అధరీకరోతి = తక్కువ చేస్తున్నదో, సః వరమునిః = ఆ మణవాళమహామునులు, మే = నాకు, భద్రం వితనోతు = మంగళాలను ఇవ్వాలి.

ఏ మణవాళమహామునులు అనుగ్రహించిన యతిరాజస్తోత్రమగు యతిరాజవింశతి అను స్తుతి శ్రోతలకు మిక్కిలి మధురమైయుండుటచే, ద్రాక్షారసమును, తేనెల సోనను, అమృతరసప్రవాహమునుకూడ నిందించుచున్నదో, (తక్కువగా చేయుచున్నదో), యతీంద్రప్రవణులగు ఆ వరవరమునులు నాకు మంగళములను ప్రసాదించునుగాక ! (తేనెకంటె, ద్రాక్షకంటె, అమృతరసముకంటె మించియున్న మాధుర్యమును కల్గినది యతిరాజవింశతి – అని తాత్పర్యము.)

శ్రీవరవరమునులు భగవద్రామానుజులను స్తుతిస్తూ యతిరాజవింశతిని పల్కిన వృత్తాంతము యతీంద్రప్రవణ ప్రభావము అను సంప్రదాయచరిత్ర గ్రంథములో – **"అ*ఴ*కియమణవాళప్పెరుమాళ్ నాయనార్ తమక్కు ప్పిళ్ళై ప్రాప్యముమ్, ప్రాపకముమాక క్కాట్టి త్తన్ద ఉడైయవర్తిరువడికళిలే "యతీంద్రప్రవణర్" ఎన్నుమ్బడి అత్యంతప్రేమ యుక్తరాయ్, తత్ప్రేమాభివృద్ధియాలే యతిరాజవింశతియుమ్ అన్ద ఎమ్బెరుమానార్ విషయమాక అరుళిచ్చెయ్దరుళినార్. అవ్వుపకారత్తుక్కు "వల్లార్కళ్ వా*ఴ్*త్తుమ్ కురుకేశర్తమ్మై మనత్తు వైత్తు చ్చొల్లార వా*ఴ్*త్తుమ్ మణవాళమాముని త్తొణ్డర్ కు*ఴా*మ్ ఎల్లామ్ త*ఴై*క్క ఎతిరాశవింశతి యీన్దళిత్తోన్ పుల్లారవిన్ద త్తిరుత్తాళ్ ఇరణ్డైయుమ్ పో*ఱ్ఱు* నెఞ్జే !" ఎన్ఱు పిన్బుళ్ళారుమ్ అనుసంధిత్తు ఈడుపడుమ్బడి యాయి*ఱ్ఱు*. ఇవరుడైయ విజ్ఞాపనమాన ఇప్రబన్దత్తై ప్పిళ్ళైయుమ్ కేట్టరుళి, మికవుమ్ ఉకప్పుడనే తిరుప్పుళియా*ఴ్వా*ర్ అడియిలే తామ్ కణ్డ తమ్ముడైయ ఉడైయవరైయుమ్ ఇవర్క్కు త్తిరువారాధనమాక ఇరఙ్గి యరుళ"** ఇత్యాదిగా తెలుపబడింది.

**84. శ్రీమద్రంగసుధాభిధానకవిసూక్త్యర్థానుసంధానోజ్జ్వలా
గోదోదారవచఃప్రదర్శితగురూపాయత్వనిష్ఠాశ్రయా ।
యత్సూక్తి ర్యతిరాజవింశతినుతి ర్వేదాంతసింధో స్సుధా
శ్రీమద్రమ్యవరాయ సంయమవతాం నాథాయ తస్మై నమః ॥**

శ్రీమద్రంగసుధాభిధానకవిసూక్తి = తిరువరంగత్తముదనార్ అనే కవులయొక్క సూక్తి అయిన ఇరామానుశ నూఱ్ఱన్దాదియొక్క అర్థ+అనుసంధాన = అర్థాన్ని అనుసంధానం చేయడంవల్ల, ఉజ్జ్వలా = గొప్పగా ప్రకాశించేది, గోదా+ఉదారవచః ప్రదర్శిత = గోదాదేవి యొక్క గొప్ప సూక్తులచేత, ప్రదర్శిత = వ్యక్తం చేయబడిన, గురు+ఉపాయత్వ = ఆచార్యులే ఉపాయమనే, నిష్ఠా+ఆశ్రయా = నిష్ఠను ఆశ్రయంగా కల్గినది, వేదాంతసింధోః = వేదాంతాలనే సముద్రంలో పుట్టినది, సుధా = అమృతంవంటిది అయిన, యతిరాజ వింశతినుతిః = యతిరాజవింశతి అనే స్తుతి, యత్ సూక్తిః = మణవాళమహామునుల యొక్క సూక్తియో, తస్మై సంయమవతాం నాథాయ శ్రీమద్రమ్యవరాయ = యతులలో శ్రేష్ఠులైన శ్రీమణవాళమునులకు, నమః = నమస్కారం.

వేదాంతమనెడి క్షీరాబ్ధిలోని అమృతమైన యతిరాజవింశతి అను శ్రీమణవాళమహా మునులు అనుగ్రహించిన ఏ స్తుతి తిరువరఙ్గత్తముదనార్ సాయించిన ఇరామాను శనూఱ్ఱన్దాదియొక్క అర్థానుసంధానము మూలమున అవతరించినదియై, గోదాదేవి తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొழி ప్రబంధముల స్వాపదేశార్థమగు, ఆచార్యుడే ఉపాయ మను ఆచార్యనిష్ఠను నిరూపించుచున్నదో, ఇంద్రియములను నియమించు యోగులలో శ్రేష్ఠులగు ఆ మణవాళమహామునులు మనకు స్వామి. వారి శ్రీపాదములలో దాసుడనగు నా ప్రణామములను సమర్పింతును.

యతిరాజవింశతిని వ్యాఖ్యానిస్తూ శుద్ధసత్త్వం దొడ్డయాచార్యస్వామి వ్యాఖ్యానావ తారిక చివరలో- **"తిరువాయ్మొழி నూఱ్ఱన్దాది తిరువాయ్మొழிక్కు సంగ్రహమానాప్పోలవుమ్, ఉపదేశరత్తినమాలై గురుపరంపరా సంగ్రహమానాప్పోలవుమ్, ఇప్ప్రబంధమ్ ప్రపన్నగాయత్రీ సంగ్రహమాయిరుక్కుమ్"** (తిరువాయ్మొழி నూఱ్ఱన్దాది తిరువాయ్మొழிకి సంగ్రహమైనట్లే, ఉపదేశరత్నమాలై గురుపరంపరాప్రభావానికి సంగ్రహమైనట్లే, ఈ ప్రబంధం కూడా ప్రపన్నగాయత్రి అనబడే ఇరామానుశనూఱ్ఱన్దాదికి సంగ్రహమై ఉన్నది) అని అనడం, వాధూలవీర రాఘవాచార్యస్వామివారు మొదటి శ్లోకవ్యాఖ్యానం చివరలో **"అత్ర చ శ్రీమాధవాంఘ్రీత్యా"దికం శ్రీమదమృతార్య ప్రణీతప్రపన్నసావిత్రీశైలీం ప్రత్యభిజ్ఞాపయతి"** అని అనడం స్మరించాలి. అచార్యుడే ఉపాయం, ఉపేయమనే చరమపర్వనిష్ఠ గోదాదేవీ ప్రబంధాలలో ప్రతిపాదింపబడినదనే విషయం ఇతఃపూర్వమే తెలుపబడింది. వేదాంతాలలో జగత్కారణభూతుడైన శ్రీమన్నారాయణుడే ఉపాయం, ఉపేయమని తెలుపబడింది. ఇది పైపైన గమనించినపుడు

తెలిపే అర్థం. క్షీరాబ్ధిని చిలుకగా అందులోనుండి తత్సారమైన అమృతం వెలువడినట్లుగా వేదాంత క్షీరాబ్ధిని మథించగా వెలువడిన అమృతం చరమపర్వనిష్ఠ. ఉపాయోపేయాలు రెండూ ఆచార్యుడే అనే విశ్వాసం. ఇదే యతిరాజవింశతిలోని ప్రమేయం.

85. యతివరభక్తిపూర్తికలితార్తిసమాహ్వయవత్
కృతిరసవేదినః కిల తరంతి భవార్త్యుదధిమ్ ।
త మనుదినం యతీంద్రపదపంకజభృంగవరం
వరముని మాశ్రయాశయ ! విహాయ తదన్యరుచిమ్ ॥

(ఏ మణవాళమహామునులచే రచింపబడ్డ) యతివరభక్తిపూర్తికలిత = శ్రీరామానుజుల విషయంలోని పరిపూర్ణభక్తితో కూడినది, ఆర్తిసమాహ్వాయత్ = ఆర్తి ప్రబంధమనే పేరును కల్గినది అయిన, కృతి = స్తుతియొక్క, రసవేదినః= రసాన్ని తెలిసినవారు, భవ+ఆర్తి+ ఉదధిమ్ = సంసారదుఃఖమనే సముద్రాన్ని, తరంతి కిల = దాటుతున్నారో కదా, యతీంద్ర పదపంకజభృంగవరం = భగవద్రామానుజుల శ్రీచరణపద్మాలలో గొప్ప తుమ్మెదవంటి వారు అయిన, వరమునిం = శ్రీమణవాళమహామునులను, అనుదినం = ప్రతిదినం, ఆశయ = ఓ హృదయమా!, తదన్యరుచిం విహాయ = ఆ మణవాళమహామునులకంటే ఇంకొక విషయంలో రుచిని కల్గి ఉండడాన్ని విడచి, ఆశ్రయ = ఆశ్రయించు.

భగవద్రామానుజులపట్ల పరమభక్తి తల ఎత్తి, సంసారతాపమును సహింపలేక, తమ ఆర్తిని ఆర్తిప్రబంధములో మణవాళమహామునులు వ్యక్తీకరించిరి. ఆ ఆర్తిప్రబంధము యొక్క స్వారస్యమును అనుభవించిన పెద్దలు సంసారదుఃఖసాగరమును దాటి, పరమ పదమును పొందుచున్నారు. భగవద్రామానుజుల శ్రీచరణపద్మములందు తుమ్మెదవలె అభినివిష్టులగు ఆ మణవాళమహామునులను ఓ మనసా! నీవు ఇతరవిషయములందు రుచిని సవాసనగా వీడి, ప్రతిదినము ఆశ్రయించి ఉజ్జీవింపుమా ! - అని భావము.

ఒక ఆర్తిని తెలిపే ప్రబంధాన్ని అనుభవించినవారు ఇంకొక ఆర్తిసాగరాన్ని దాటతారు- అని అనడం ఒక చమత్కారోక్తి. ఆర్తి ప్రబంధంలోని వరవరమునుల ఆర్తి ఉపాదేయం. సంసారంలోని ఆర్తి త్యాజ్యం - అనేదే భేదం. వరవరమునుల ఆర్తి ప్రబంధం శ్రీరామానుజులను సంతోషపెట్టగా, భగార్తిసాగరం దుఃఖజనకం.

86. శఠారిదృష్టసామవేదభాష్యదర్శితాఖిల -
ప్రమాణసంగ్రహో మహోపకారకో మనీషిణామ్ ।
ముదం కరోతి యత్కృతి స్సమాశ్రయస్వ సాదరం
మనోహరోపయంతృయోగినం త మన్వహం మనః ॥

యత్ కృతిః = ఏ మణవాళమహామునులయొక్క ప్రమాణత్తిరట్టు అనే కృతి, శఠారిదృష్ట = నమ్మాழ్వార్లచే దర్శింపబడ్డ, సామవేద = సామవేదరూపమైన తిరువాయ్

మొ్ర్రియొక్క, భాష్య = వ్యాఖ్య అయిన ఈడు ముప్పత్తాఱాయిరప్పడిలో, దర్శిత = చూపింపబడ్డ, అఖిలప్రమాణసంగ్రహః= సకల ప్రమాణాల సంగ్రహరూపమైనది, మహోప కారకః = గొప్ప ఉపకారకమై, మనీషిణామ్ ముదం కరోతి = బుద్ధిమంతులకు ఆనందాన్ని కల్గిస్తున్నదో, తం మనోహర+ ఉపయంతృయోగినం = ఆ మణవాళ మహామునులను, మనః = ఓ మనసా!, సాదరం = భక్తితో, అన్వహం = ప్రతిదినం సమాశ్రయస్వ = ఆశ్రయించు.

నమ్మాళ్వార్లు దర్శించిన ద్రావిడసామవేదమగు తిరువాయ్‌మొ్ర్రియొక్క భాష్యము ముప్పత్తాఱాయిరప్పడి. ఆ ఈడులో ఉట్టంకింపబడిన ప్రమాణములు సమీకరింపబడి, ఆకరములతోపాటు ఏ మణవాళమహామునులుచే కూర్పబడి, ప్రబుద్ధులగు భగవద్విషయాధి కారులకు మహోపకారకమై, ఆనందావహమై వెలుగుచున్నవో, ఆ మణవాళమహామునులనే ఆదరముతో అనుదినము, ఓ మనసా! అనుసంధింపుము.

వాధూలవీరరాఘవాచార్యస్వామివారు శ్రీవరవరముని సుచరిత చషకమనే గ్రంథంలో **"శఠరిపుఘణితివ్యాక్రియామానజాలం చక్రే"** అని అంటూ ఈ ప్రమాణత్తిరట్టు సంకలనాన్ని గూర్చి ప్రస్తావించారు.

87. స్వకృతజగద్గురుతత్త్వత్రితయవ్యాఖ్యానమానసంగ్రహతః ।
భవినాం కృతోపకారః వరయోగీ పాతు నః సతతమ్ ॥

స్వకృత = తనచే (మణవాళమహామునులచే) రచింపబడ్డ, జగద్గురుతత్త్వత్రితయ = శ్రీపిళ్ళైలోకాచార్యులవారి తత్త్వత్రయమనే రహస్యగ్రంథంయొక్క, వ్యాఖ్యాన = వ్యాఖ్యానం లోని, మాన = ప్రమాణాల, సంగ్రహతః = సంగ్రహంద్వారా (ప్రమాణాలకు ఆకరాలను తెలిపే ప్రమాణత్తిరట్టును కూర్చడంద్వారా), భవినాం = సంసారులకు, కృత+ఉపకారః = ఉపకారాన్ని చేసినవారైన, వరయోగీ = శ్రీమణవాళమహామునులు, నః సతతం పాతు = మనలను సదా రక్షించుగాక !

శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించిన తత్త్వత్రయమునకు వరవరమునులు భాష్యరూపమైన వ్యాఖ్యానము అనుగ్రహించిరి. తత్త్వత్రయవ్యాఖ్యానముయొక్క ప్రమాణత్తి రట్టుకూడ వరవరమునులచేతనే కూర్పబడినది. దీనిని కూర్చడంద్వారా సంసారులకు ఉపకారకులైన ఆ శ్రీమణవాళమహామునులు మనలను ఎల్లప్పుడు కాపాడుదురుగాక!

88. యదీయోపదేశరత్నమాలయా పరిష్కృతాః
యదంఘ్రిపద్మశేఖరా జయంతి దేశికోత్తమాః ।
త మాశ్రితస్య సుందరోపయంతృయోగిశేఖరం
భవార్ణవోఽపి గోష్పదత్వ మేతి తత్ప్రభావతః ॥

యదీయ = ఏ మణవాళమహాామునులకు చెందిన (మణవాళమహాామునులచే రచింపబడిన), ఉపదేశరత్నమాలయా = ఉపదేశరత్తినమాలై అనే ప్రబంధంచేత, పరిష్కృతాః = అలంకరింపబడినవారు (సంస్కరింపబడినవారు), యత్ + అంఘ్రిపద్మ శేఖరాః = ఏ మణవాళమహామునుల శ్రీచరణాలను శిరోభూషణంగా కలవారైన, దేశిక+ ఉత్తమాః = సదాచార్యులు, జయంతి = సర్వోత్కర్షతో వెల్గుతున్నారో, తం సుందరోప యంతృ-యోగిశేఖరం = ఆ శ్రీమణవాళమహామునులను, ఆశ్రితస్య = ఆశ్రయించిన వానికి, భవ+అర్ణవః అపి = సంసారసముద్రం కూడా, తత్ ప్రభావతః = ఆ మణవాళ మహామునుల ప్రభావంవల్ల, గోష్పదత్వమ్ ఏతి = గోష్పాదంవలె చాలా చిన్నది అవుతున్నది.

ఏ మణవాళ మహామునులు అనుగ్రహించిన ఉపదేశరత్తినమాలైను నిత్యము అనుసంధించి, దానిచే వెల్గుచున్నవారై, ఆ వరవరమునుల శ్రీపాదములనే శిరోభూషణ ముగా ధరించు ఆచార్యులు సంసారమునే జయించుచున్నారో, యోగిశేఖరులగు ఆ మామునులను ఆశ్రయించినవారికి ఆ వరవరమునుల ప్రభావముచే సంసారసాగరముకూడ గోష్పాద సమమగును. వారికి మోక్షము నిశ్చితము.

"ఇన్ద ఉపదేశరత్తినమాలై తన్నై శిన్దైతన్నిల్ నాళుమ్ శిన్దిప్పార్ ఎన్దై ఎతిరాశర్ ఇన్నరుళుక్కు ఇన్నుమ్ ఇలక్కాకి శదిరాక వాళ్న్దిడువర్", "మన్నుయిర్కాళ్ ! ఇఙ్గే మణవాళమామునివన్ పొన్నడియామ్ శఙ్గమలప్పోదుకళై, ఉన్ని చ్చిరత్తాలే తీణ్డిల్ అమాన వనుమ్ నమ్మై కరత్తాలే తీణ్డల్ కడన్" (ఓ జనులారా ! ఈలోకంలో మీరు వరవరమునుల బంగారంవలె ఆశపడదగిన అందమైన శ్రీచరణపద్మాలను శిరస్సుపై ధరిస్తే, అమానవ పురుషుడు మనలను తన చేతితో స్పృశించడం అతని కర్తవ్యం కాగలదు) అనే ఉపదేశరత్తినమాలై పాశురభావ మిచట అనుసంధేయము.

89. శఠారిదృష్టసామవేదమౌళిసంగ్రహాత్మికాం
యదుక్తి మన్వహం గృణన్ విముక్తిసంపదాస్పదామ్ ।
సమేధతే సతాం గణః స న శ్శుభాని సాదరం
వరోపయంతృయోగిరాట్ తరంగయత్వనారతమ్ ॥

శఠారిదృష్ట = నమ్మాళ్వార్లచే దర్శింపబడ్డ, సామవేదమౌళి =సామవేదశిరస్సు అయిన తిరువాయ్మొళ్ళియొక్క, సంగ్రహాత్మికాం = సంగ్రహరూపమై, విముక్తిసంపత్+ ఆస్పదామ్ = మోక్షమనే సంపదకు నిలయమైన, యత్ ఉక్తిం = ఏ శ్రీమణవాళ మహామునుల ఉక్తి అయిన తిరువాయ్మొళ్ళి నూఱ్ఱన్దాదిని, అన్వహం గృణన్ = ప్రతిదినం అనుసంధించు, సతాం గణః = సత్పురుషుల సమూహం, సమేధతే = మిక్కిలి వర్ధిల్లుతున్నదో, సః వరోపయంతృయోగిరాట్ = ఆ మణవాళమహామునులు, నః శుభాని= మనకు శుభాలను, సాదరం = ఆదరంతో, అనాతరతం = నిత్యం, తరంగయతు = విస్తరింపజేయాలి.

నమ్మాళ్వార్లు అనుగ్రహించిన ముక్తిసంపదకు నిలయమై సామవేదముయొక్క మౌళిభూతమగు తిరువాయ్మొళ్ళికి సంగ్రహరూపమై, ఒక దశకమునకు ఒక పాశురము చొప్పున అమరియున్న, ఏ వరవరమునులు అనుగ్రహించిన తిరువాయ్మొళ్ళి నూఱ్ఱన్దాదిని నిత్యము అనుసంధించు సత్సంప్రదాయనిష్ఠులగు మహానుభావుల సంఘము వృద్ధిని పొందుచున్నదో, యోగులలో శ్రేష్ఠులై వెల్గు ఆ వరవరమునులు మనకు మరింతగా శుభములను విస్తరింపజేయుదురుగాక !

"అల్లుమ్ పకలుమ్ అనుబవిప్పార్ తజ్గళుక్కు చ్చొల్లుమ్ పొరుళుమ్ తొకుత్తురైత్తాన్ నల్లమణవాళమామునివన్ మాఱన్మఱైక్కు త్తణవాద నూఱ్ఱన్దాది తాన్" (రాత్రి పగలు భగవదనుభవాన్ని పొందేవారికోసం ఉదారులైన వరవరమునులు నమ్మాళ్వార్ల తిరువాయ్మొళ్ళి ప్రబంధంలోని శబ్దాలను, వాటి అర్థాలను గూర్చి ఎంతఅనుభవించినా తనివితీరని తిరువాయ్మొళ్ళి నూఱ్ఱన్దాది ప్రబంధాన్ని అనుగ్రహించారు) అనే తిరువాయ్ మొళ్ళి నూఱ్ఱన్దాది తనియన్ ఆ ప్రబంధభోగ్యతను తెల్పుతున్నది. **"మయర్వేదుమ్ వారామల్ మానిడరై వాళ్విక్కుమ్ మాఱన్ శొల్ వేరాకవే విళైయుమ్ వీడు"** (ఏ విధమైన అజ్ఞానం కలుగకుండా మానవులను ఉజ్జీవింపచేసే నమ్మాళ్వార్ల శ్రీసూక్తి మూలంగా పరమపదం లభిస్తుంది) అనే ఈ ప్రబంధం మొదటి పాశురంలోని సూక్తి నమ్మాళ్వార్ల ప్రబంధం పరమపదప్రాప్తిని కల్గిస్తుందని తెల్పుతున్నది. తిరువాయ్మొళ్ళి నూఱ్ఱన్దాది ప్రబంధం ఆ తిరువాయ్మొళ్ళిలోని శబ్దాలతో, అర్థాలతో కూర్చి రచింపబడినందువల్ల, వక్త **"పొయ్యిలాద మణవాళమాముని"** (అసత్యం లేని వరవరమునులు) కనుక ఆ ప్రబంధం పరమపదప్రాప్తిని కల్గిస్తుందని అనడంలో సందేహంలేదు కదా ! ఈ ప్రబంధంలో పలుచోట్ల **"కురుకూర్మన్నరరుళాల్ మాఱుమ్ శన్మమ్"** అని, **"తమిళ్మాఱన్ శొల్వల్లార్ వానవర్క్కు వాయ్న్ద కురవర్"** అని పల్కడం కూడా గమనించదగినది.

90. **దుగ్ధోదన్వద్ధవళమధురం శుద్ధసత్త్వైకరూపం**
రూపం యస్య స్ఫుటయతితరాం యం ఫణీంద్రావతారమ్ ।
ధ్యాయంత స్తం వరవరమునిం కేఽపి ధన్యా మహాంతః
కాలం సర్వం కలుషరహితా హృష్టచిత్తా హరంతి ॥

యస్య = ఏ మణవాళమహామునులయొక్క, రూపం = రూపం, దుగ్ధ+ఉదన్వత్ ధవళమధురం = పాలసముద్రంవలె తెల్లనిది, మధురమైనదై, శుద్ధసత్త్వ+ఏకరూపం = శుద్ధసత్త్వాన్ని మాత్రమే రూపముగా కల్గినదై, యం = ఏ శ్రీమణవాళమహామునులను, ఫణీంద్ర+అవతారం =ఆదిశేషుల అవతారమని, స్ఫుటయతి తరాం = మిక్కిలిగా స్పష్టం చేస్తున్నదో, తం వరవరమునిం = ఆ శ్రీమణవాళమహామునులను, కే అపి ధన్యాః మహాంతః = ఎవరో కొందఱు ధన్యులైన మహాత్ములు, ధ్యాయంతః = ధ్యానిస్తున్నవారై,

కలుషరహితాః = దోషం లేనివారై, హృష్టచిత్తాః = ఆనందించిన మనస్సును కలవారై, సర్వం కాలం హరంతి = కాలాన్ని అంతటిని గడుపుతున్నారు.

పాలసముద్రమువలె తెల్లదనమును, మాధుర్యమును కల్గినదై, రజస్సు, తమస్సును కలువని శుద్ధసత్త్వమునే రూపముగా కల్గిన ఏ మణవాళమహామునుల తిరుమేని వారిని ఆదిశేషుల అవతారవిశేషముగా ప్రస్ఫుటీకరించుచున్నదో, (ఉత్తమనంబి మొదలగువారికి వరవరమునులు తమ నిజరూపమగు ఆదిశేషరూపముతో సేవను అనుగ్రహించిరనుట ప్రసిద్ధము) ఆ మణవాళమహామునులను నిత్యము ధ్యానము చేయు కొందఱు భాగ్యశాలురైన మహాత్ములు మనస్సులో కలత లేనివారై, సంతుష్టిని కలవారై, సుఖముగా కాలక్షేపమును చేయుదురు.

శ్రీమణవాళ మహామునుల స్వచ్ఛమైన ధవళరూపం ఆదిశేషావతారాన్ని నిరూపిస్తున్నదనే అంశాన్ని తెలిపే ఒకానొక వృత్తాంతం యతీంద్రప్రవణ ప్రభావంలో ఈ క్రింది విధంగా తెలుపబడింది.

"ఒకనాడు మణవాళమహాముని శ్రీరంగనాథునకు మంగళాశాసనం చేయడంకోసం వేంచేశారు. అపుడు ఏకాంతసేవ జరిగే సమయం. తెరవేయబడి లోపల తిరువారాధన జరుగుతున్నది. మణవాళమహామునులు ఆలయం లోపలకు వెళ్ళి, శ్రీరంగనాథుని శ్రీపాదాలకు నమస్కరించి నిలువగా, అపుడు ఉత్తమ నమ్బి ఆలవట్టం వీచే కైంకర్యాన్ని చేస్తూ, మణవాళమహామునుల **"క్షీరసంఘాతగౌరమ్"** (పాలసమూహంవలె తెల్లని రంగును కల్గిన) అనే రీతిలో వెండికొండవలె ఉండే క్షీరవర్ణంలోని విగ్రహవైలక్షణ్యాన్ని చూచి, ఆ వర్ణంలో అతిశంకను పొంది, మణవాళమహామునులను "ఎక్కువ సేపు మీరు ఇక్కడ ఉండవద్దు" అని అన్నారు. వరవరమునులు ఉత్తమనంబి అభిప్రాయాన్ని గ్రహించి **"మహాప్రసాదమ్"** అని బయలుదేరి తమ మఠాన్ని చేరారు. తరువాత ఉత్తమనంబికి స్వప్నంలో శ్రీరంగనాథుడు సాక్షాత్కరించి మందహాసవదనంతో – "నమ్బీ! ఈ **"అనన్ద నెన్నుమ్ అణివిళఙ్గు ముయర్వెళ్ళై అణై"** (అనంతుడనే ఉన్నతమైన పర్యంకం) అయిన ఆదిశేషులే సుమా మణవాళమహామునులుగా వచ్చి అవతరించారు సుమా!" అని అంటూ చాచి ఉంచిన హస్తాన్ని ఎత్తి తాము పరుండి ఉండే ఆదిశేషులను తట్టి చూపుతూ, "వీరి తెల్లని శరీరవర్ణాన్ని ఈ విధంగా విశ్వసించండి" అని అనగా, ఉత్తమనంబి స్వప్నం నుండి మేల్కొని గడగడ వణకి భీతిల్లి, అప్పటికి అపుడే మణవాళ మహామునుల మఠానికి వెళ్ళి వారిని సేవించి, కలలో జరిగిన వృత్తాంతాన్నిగూర్చి విన్నపించి, అపరాధ క్షమాపణను వేడారు. అప్పటినుండి మణవాళమహామునులపట్ల మిక్కిలి విశ్వాసంతో ప్రవర్తించారు. దీనినిబట్టి **"అనన్తావతారర్ వరయోగి ఎన్బతు తెన్నరఙ్గర్ మననా్దా నతియుమ్ మఱ్ఱారఱివార్ ?"** (అనంతుని అవతారమే శ్రీవరవరమునులు అనే విషయం

శ్రీరంగనాథుని మనస్సుకే తెలుసు, మఱి ఎవరికి తెలుసు?) అని దీనిని తెలిసిన పూర్వాచార్యులు ఆదరించి పలికారు.

91. రాజచ్ఛీతమయూఖమండలశరజ్జ్యోత్స్నాసమానద్యుతిః
కాషాయాంబరధారిణీ కరలసద్దండత్రయీమండితా ।
ఫాలాద్యంగసముల్లసత్సువిమలస్నిగ్ధోర్ధ్వపుండ్రోజ్జ్వలా
దీవ్యంత్యాత్మగుణై స్సదా వరవరాకారాఽస్తు మే భావనా ॥

రాజత్ = ప్రకాశిస్తున్న, శీతమయూఖమండల = చంద్రమండలంనుండి పుట్టిన, శరత్‌జ్యోత్స్నా = శరత్కాల వెన్నెలతో, సమానద్యుతిః =సమానమైన కాంతిని కల్గినది, కాషాయాంబరధారిణీ = కాషాయవస్త్రాన్ని ధరించినది, కర = శ్రీహస్తంలో గల, లసత్ = ప్రకాశిస్తున్న, దండత్రయీమండితా = త్రిదండంచేత అలంకరింపబడినది, ఫాల+ఆది+అంగ = ఫాలం మొదలైన అంగాలలో, సముల్లసత్ = స్పష్టంగా వెలిగే, సువిమల = స్వచ్ఛమైన, స్నిగ్ధ = మనోహరమైన, పుండ్ర = ద్వాదశోర్ధ్వపుండ్రాలతో, ఉజ్జ్వలాం = మిక్కిలిగా ప్రకాశించేది, ఆత్మగుణైః దీవ్యంతీ = దయావాత్సల్యాది ఆత్మగుణాలతో ప్రకాశించేది, వరవర+ఆకారా = శ్రీమణవాళ మహామునుల రూపంలో ఉండేది అయిన, భావనా = భావన, మే = నాకు, సదా అస్తు = సదా ఉండాలి.

ఈ శ్లోకములో నా మనోవృత్తియగు భావన ఎల్లప్పుడు మణవాళమహామునుల తిరుమేని విషయముగానే కావలయును. అనుచు అణ్ణన్ ప్రార్థించుచున్నారు. మణవాళ మహామునుల శుభాశ్రయమైన తిరుమేని విషయముగా భక్తితో కూడిన అవిచ్ఛిన్నచింతనము అనుభవరూపముగా నాకు సిద్ధింపవలెను – అని భావము.

ఏ మణవాళమహామునుల తిరుమేని ప్రకాశించు శరత్కాలచంద్రుని వెన్నెలవలె కాంతిని కల్గినదో, కాషాయవస్త్రమును దాల్చునో, శ్రీహస్తమున వెలుగు త్రిదండముచే అందముగా ప్రకాశించుచున్నదో, ఫాలము మొదలగు పండ్రెండు స్థలములలో వెలుగు ద్వాదశోర్ధ్వపుండ్రములతో ప్రకాశించుచున్నదో, ఆత్మగుణములను ప్రకాశింపచేయుచున్నదో, ఆ వరవరమునియొక్క ఆకారమును విషయముగా కల ధ్యానము నాకు సిద్ధించుగాక ! అని తాత్పర్యము.

ఆచార్యుల తిరుమేనిని ధ్యానించుట ప్రపన్నాధికారులకు ఉజ్జీవనార్థము అవశ్యము కర్తవ్యముకదా! **"తేశారుమ్ శిచ్చన్ అవన్ శేర్ వడివై"** అని కదా శ్రీవరవరమునుల వాక్కు. ప్రత్యక్ష సమానాకార రూపమైన పరజ్ఞానదశ ఇందులో ప్రార్థింపబడింది.

ఎఱుమ్బియప్పా అనుగ్రహించిన వరవరముని దినచర్యాస్తోత్రంలోని **"అమ్లాన కోమలాకారమాతామ్రవిమలాంబరమ్,... ఊర్ధ్వపుండ్రై రుపశ్లిష్ట ముచిత స్థానలక్షణైః,**

కాశ్మీరకేసరస్తోమ కడారస్నిగ్ధరోచిషా కౌశేయేన సమింధానం స్కంధమూలావలంబినా"
ఇత్యాది సూక్తుల భావాలు ఇక్కడ స్మరణీయాలు.

92 చింతా మే యతిసార్వభౌమచరణప్రేమాత్మికా ప్రోల్లసత్-
శాంతిక్షాంతిదయాదిసద్గుణమయీ రాకేందుభాసాం నిధిః ।
శ్రీమత్స్వాంఘ్రిసరోజభక్తజనతామోక్షప్రదానోద్యతా
భూయాత్ సర్వజగద్ధితావతరణా సౌమ్యోపయంత్రాత్మికా ॥

యతిసార్వభౌమచరణప్రేమాత్మికా = భగవద్రామానుజుల శ్రీచరణాలలోని ప్రేమే మూర్తీభవించినట్లున్నది, ప్రోల్లసత్ = మిక్కిలిగా వ్యక్తం అవుతున్న, శాంతిక్షాంతిదయా+ ఆదిసద్గుణమయీ = శాంతి, క్షమ, దయ మొదలైన కల్యాణగుణాలతో నిండినది, రాకా+ఇందుభాసాం నిధిః = పున్నమి చంద్రుని వెన్నెలకు నిధివంటిది, శ్రీమత్ = శోభను కల్గిన, స్వ = తనయొక్క, అంఘ్రిసరోజ = పాదపద్మాలలో, భక్తజనతా = తన విషయంలో భక్తిని కలవారి సమూహానికి, మోక్షప్రదాన = మోక్షాన్ని అనుగ్రహించడంలో, ఉద్యతా = ఉద్యమించినది, సర్వజగత్ హిత + అవతరణా = సమస్తలోకంయొక్క హితంకోసం అవతరించినది, సౌమ్యోపయంతృ + ఆత్మికా = శ్రీమణవాళమహామునుల రూపంలో ఉన్నది అయిన, చింతా = భావన, మే = నాకు, భూయాత్ = కలగాలి.

నా భావన ఎల్లప్పుడు వరవరమునులనే విషయముగా కల్గినదియై, తదాకారమై తన్మయముగనే అగునుగాక ! అని ఇందు అనుచున్నారు. పూర్వశ్లోకంలో వరవరమునుల దివ్యమంగళవిగ్రహం భావింపబడగా, ఇందులో వారి దివ్యాత్మగుణ వర్ణన చేయబడు తున్నది.

వరవరమునులు యతీంద్రప్రవణులు. యతిసార్వభౌములగు భగవద్రామానుజుల విషయమున ప్రేమయే రూపముగా కలవారు. మిక్కిలి ప్రకాశించు శమ, దమ, క్షాంతి, దయాది సద్గుణములచే పరిపూర్ణులైయున్నవారు. పౌర్ణమీ చంద్రునియొక్క వెన్నెలకు నిధియై, దివ్యధావళ్యమును కల తిరుమేనిని కలవారై యున్నవారు. తమయొక్క శ్రీపాదములతో భక్తులగు చేతనులకు వారి సంబంధిసంబంధి పర్యంతముగా మోక్షమును అనుగ్రహించుటలో ఆసక్తిని కలవారు. లోకమునకంతటికిని హితమును చేయుటకొఱకే అవతరించినవారు. ఈ రీతిలో వెల్గు వరవరమునులనే ఎల్లప్పుడు చింతించు నా మనోవృత్తియు తదాకారమై అగుగాక – అని తాత్పర్యము.

"అర్థేనైవ విశేషో హి నిరాకారతయా ధియామ్" (జ్ఞానాలకు నిర్దిష్టమైన ఆకారం ఏదీ లేనందున, ఆయా విషయాలనుబట్టి జ్ఞానరూపం భాసిస్తుంది) అను రీతిలో జ్ఞానమునకు ప్రత్యేకముగా ఏ రూపమును లేదు. ఏ విషయమును అది గ్రహించునో ఆ

విషయముయొక్క ఆకారమును గొనియే ఆ జ్ఞానమును వ్యవహరింపవలెను. కావున నా భావపూర్ణమైన, వరవరమునుల విషయమైన, అనవరతచింతనారూపమైన ధ్యానము ప్రత్యక్ష సమానాకారముగా తదాకారముగా – తదేకవిషయముగా సిద్ధింపవలెను – అని తాత్పర్యము.

93. అంఘ్రీ శృంఖలితాబ్జకీర్తివిభవౌ తన్నాలదంభచ్ఛిదౌ
జంఘే హస్తికరప్రశస్తిహరణోన్నిద్రం తదూరుద్వయమ్ ।
మధ్యం తానవహృద్య మాయతభుజామధ్యం కవాటోపమం
బాహుద్వంద్వ మమర్త్యభూజవిటపాహంకారపాటచ్చరమ్ ॥

94. కంఠం కుంఠితకంబుడంబరభరం వక్త్రం శరచ్చంద్రమ
స్సౌందర్యోదితగర్వచర్వణకలాపాండిత్యనిత్యోజ్జ్వలమ్ ।
మౌళిం నిస్తుల మప్యపాస్తభజదాతంకం వపు స్సాదరం
తత్క్షీరోదసహోదరం వరమునే శ్చేత ! స్సదా భావయ ॥

చేతః = ఓ మనసా! వరమునేః = శ్రీమణవాళమహామునులయొక్క, శృంఖలిత+ అబ్జకీర్తివిభవే = పద్మాల కీర్తికి సంకెళ్ళు వేసి బంధించిన కీర్తివైభవాన్ని కల్గిన, అంఘ్రీ = శ్రీచరణాలను, తత్ నాలదంభచ్ఛిదౌ = ఆ పద్మాల తూడుల గర్వాన్ని ఛేదించిన, జంఘే = వరవరమునుల పిక్కలను రెండిటిని, హస్తికర = ఏనుగుతొండంయొక్క, ప్రశస్తి = కీర్తిని, హరణ = హరించడంలో, ఉన్నిద్రం = జాగరూకంగా ఉండే, తత్+ఊరుద్వయం = ఆ మణవాళమహామునుల రెండు ఊరువులను, తానవహృద్యం = సన్నగా ఉండడం వల్ల అందమైన, మధ్యం = నడుమును, కవాట+ఉపమం = కవాటాలవలె ఉండే, ఆయతభుజా మధ్యం = విశాలమైన వక్షఃస్థలాన్ని, అమర్త్యభూజ = దేవతావృక్షమైన కల్పవృక్షంయొక్క, విటప+అహంకార = శాఖల గర్వాన్ని, పాటచ్చరం = అపహరించే, బాహుద్వంద్వం = రెండు బాహువులను, కుంఠిత కంబుడంబరభరం = శంఖంయొక్క గర్వాన్ని అడ్డుకొన్న కంఠాన్ని, శరచ్చంద్రమస్ = శరత్కాలచంద్రునకు, సౌందర్య = అందంచేత కల్గిన, గర్వ = గర్వాన్ని, చర్వణకళా = ఆస్వాదించే (గ్రసించే) కళలోని, పాండిత్య = వైదుష్యంచేత, నిత్య+ఉజ్జ్వలమ్ = ఎల్లప్పుడు ఉజ్జ్వలమైన, వక్త్రం = వదనాన్ని, నిస్తులం = సాటి లేని, మౌళిమ్ అపి = శిరస్సును, అపాస్తభజత్+ ఆతంకం = భక్తుల భయాన్ని తీర్చేది, క్షీరోదసహోదరం = పాలసముద్రంతో సమానం అయిన, తత్ వపుః = ఆ దివ్యమంగళ విగ్రహాన్ని, సదా భావయ = ఎల్లప్పుడు భావించు.

ఈ శ్లోకములు రెండును చేరి యుగ్మక మనబడును. రెండవ శ్లోకములోనున్న **“భావయ”** అనెడి క్రియాపదముతో అన్నిటికిని అన్వయము. వరవరమునుల అవయవశోభ,

తిరుమేని శోభయు అమలనాదిపిరాన్ ప్రబంధములోని రీతిలో ఇందు అనుభవింప బడుచున్నది.

తామరపూవుయొక్క కీర్తివైభవమును దండింపగల్గిన శ్రీవరవరమునుల శ్రీచరణము లును, తామరతూడుల దంభమును ఛేదించు వారి మోకాళ్ళను, ఏనుగు తొండము కీర్తిని అపహరించుటలో జాగరూకమైన ఊరువులను, సన్నగా ఉండుటచే మనోహరమైన నడుమును, కవాటముతో సమానమైన విశాలవక్షఃస్థలమును, దేవలోకములోనున్న కల్పకవృక్షముయొక్క "నేనే కోరికలనన్నిటిని ఇవ్వగలదానను" అనెడి అహంకారమును కొల్లగొట్టు రెండు దీర్ఘహస్తములును, శంఖముయొక్క ఆడంబరమును వంచునట్టి కంఠమును, శరత్కాలచంద్రునకు సౌందర్యముచే కల్గిన గర్వమును కబళీకరించు కళలో పాండిత్యమును పొంది, నిత్యము వెలుగునట్టి తిరుముఖ మండలమును, నిస్సమాభ్యధిక మైనదై, తనను ఆశ్రయించువారి మనఃక్లేశమును పోగొట్టునట్టి కిరీటమును, పాలకడలికి సమానమైన తెల్లగానున్న తిరుమేనిని, ఓ మనసా ! నీవు ఎల్లప్పుడు ప్రేమతో భావింపుము.

"మానవామౌళితోవర్ణ్యాః దేవా శ్చరణతః పునః" అనే న్యాయాన్నిబట్టి వరవరమునుల దివ్యరూపం ఇందు పాదాదికేశంగా వర్ణింపబడినది. ఇందులోని వర్ణన అంతా ఆలంకారిక సమయానుగుణం. ముందు శ్లోకంలో భావించిన వరవరమునుల దివ్యరూపం తమ మనస్సులో ప్రత్యక్షం కాగా, ఆ రూపాన్ని అణ్ణన్ ఇక్కడ వర్ణిస్తున్నారు.

95. పుండ్రైః ద్వాదశభిః యథావిధి ధృతైః శుభ్రై రదభ్రచ్ఛవిః
తత్తాదృక్ శరదంబువాహపటలీసౌందర్యసంపన్నిధిః ।
ధీభక్త్యాదిగుణౌఘసంభృతయశస్సందోహసందేహదా
మూర్తి స్సా వరయోగినః ప్రతికలం జాగర్తు చిత్తే మమ ॥

యథావిధిధృతైః= విధిప్రకారం ధరించబడ్డ, శుభ్రైః = స్వచ్ఛమైన (తెల్లని), ద్వాదశభిః పుండ్రైః = ద్వాదశోర్ధ్వపుండ్రాలలో, అదభ్రచ్ఛవిః= స్వచ్ఛమైన మనోహరమైన కాంతిని కల్గినది, తత్ తాదృక్ = అనిర్వచనీయమైన, శరత్+అంబువాహపటలీ = శరత్కాలంలోని మేఘసమూహాల, సౌందర్యసంపత్ = సౌందర్యమనే సంపదకు, నిధిః = నిధి, ధీభక్త్యాది గుణౌఘసంభృత = జ్ఞానం, భక్తి మొదలైన గుణాల సమూహాలవల్ల ఏర్పడిన, యశః సందోహసందేహదా = కీర్తియొక్క సందోహమే మూర్తీభవించిందా! అనే సందేహాన్ని కల్గించే, వరయోగినః = వరవరమునుల, సా మూర్తిః = ఆ అద్వితీయ రూపం, ప్రతికలం = ప్రతిక్షణం, మమ చిత్తే = నా మనస్సులో, జాగర్తు = ప్రకాశించాలి.

పూర్వశ్లోకమున వరవరమునుల, సౌందర్యము అతిశయించిన తిరుమేనిని పూర్తిగా ఎల్లప్పుడు చింతింపుమనుచు మనస్సునుగూర్చి అణ్ణన్ ఉపదేశించిరి. ఇందు వరవర మునులు తమయొక్క కృపాతిశయముతో నా మనస్సులో ఎల్లప్పుడు ప్రతిక్షణము తమ

తిరుమేనిని తామే సాక్షాత్కరింపజేయుగాక ! అని ప్రార్థించుచున్నారు. **"అదువుమ్ అవనదు ఇన్నరుళే"** అనే ఆళ్వార్ల శ్రీసూక్తి భావం వరవరమునుల విషయంగా అనుసంధింపబడింది.

యథాప్రమాణము ధరింపబడిన, పవిత్రములగు, తెల్లని ద్వాదశోర్ధ్వ పుంద్రములతో అధికకాంతిని కల్గినది. అట్టి పవిత్రమైన, ధావళ్యము మించిన, శరత్కాలమేఘ సమూహముయొక్క సౌందర్యసంపదకు నిధియై, జ్ఞానము, భక్తి – మొదలగు గుణముల యొక్క శోభచే ఏర్పడిన, కీర్తియే ఒక రూపమును పొంది వెలుగుచున్నదా! ఏమి! అను సందేహమును కల్గించునట్లున్న మణవాళమహామునుల తెల్లని తిరుమేని నా హృదయములో ప్రతిక్షణమును ప్రకాశించుగాక ! అని భావము. (యశస్సును తెల్లగానున్నట్లు వర్ణించుట కవిసమయము.)

96. యన్మూర్తేః ధ్యానమూర్తిం శమయతి భవినాం జ్ఞప్తిపూర్వం విధత్తే
భక్తిం పుష్ణాతి విష్ణౌ విషయవిషయిణీ మాశు ముష్ణాతి తృష్ణామ్ ।
సోఽయం కాంతోపయంతా నిరవధికగుణస్తోమవిస్తారకీర్తిం
సర్వాంగోత్తుంగవీచిప్రశమితజగతీవిశ్వతాపోఽవతాన్నః ॥

యత్ మూర్తేః ధ్యానం = ఏ మణవాళమహామునులయొక్క ధ్యానం = ధ్యానం, భవినాం = సంసారుల, ఆర్తిం = దుఃఖాన్ని, శమయతి = ఉపశమింపజేస్తున్నదో, జ్ఞప్తి పూర్వం = జ్ఞానంమొదలైనవానిని, విధత్తే = కల్గిస్తున్నదో, విష్ణౌ = విష్ణువుయందు, భక్తిం = భక్తిని, పుష్ణాతి = వృద్ధిచేస్తున్నదో, విషయవిషయిణీమ్ = లౌకికసుఖాలను విషయాలుగా కల్గిన, తృష్ణాం = కోరికను, ఆశు ముష్ణాతి = వెంటనే హరిస్తున్నదో, నిరవధిక గుణస్తోమ = అంతు లేని కల్యాణగుణాల సమూహంచేత, విస్తార = విస్తృతమైన, అంతటా వ్యాపించిన, కీర్తిః = కీర్తిని కలవారు, సర్వాంగ = సమస్తదివ్యాంగాలనుండి వీచే, ఉత్తుంగ = ఉన్నతాలైన, వీచి = సౌందర్యకెరటాలచేత, ప్రశమిత = ఉపశమింప జేయబడిన, జగతీ = లోకంయొక్క, విశ్వతాపః = సమస్తమైన తాపాన్ని కలవారు అయిన, సః అయం కాంతోపయంతా = ఆ ఈ మణవాళమహామునులు, నః అవతాత్ = మనలను రక్షించాలి.

ఏ వరవరమునుల తిరుమేని ధ్యానము సంసారుల ఆర్తిని శమింపజేయుచున్నదో, జ్ఞానము మొదలగువానిని కల్గించుచున్నదో, శ్రీమన్నారాయణుని విషయమున భక్తిని వర్ధిల్లజేయుచున్నదో, **"మాళ్పాల్ మనమ్ శుழிప్ప మజ్గైయర్తోళ్ కైవిట్టు"** (భగవానునిపట్ల మనస్సు ఆకర్షితం కాగా, స్త్రీల బాహువుల సంబంధాన్ని విడచి) అనియు, **"పరమాత్మని యో రక్తః విరక్తోఽ పరమాత్మని"** (ఎవడు పరమాత్మలో అనురాగాన్ని కల్గినవాడై, ఆత్మవిషయలో మిక్కిలి విరక్తుడో) అనియును పలుకు రీతిలో మోహమును కల్గించు

విషయములలో పై పైకి పెఱుగు భోగేచ్ఛను అతిశీఘ్రముగా అపహరించుచున్నదో, అంతు లేని, లెక్క లేని కల్యాణగుణముల సమూహముచే వ్యాపించిన కీర్తిని కలవారై, ఆ కీర్తి అనెడి ఆకాశగంగలోని మిక్కిలి ఉన్నతమైన అలలచే అన్ని లోకములలోనివారి సకలతాపములను తీర్చు మహిమను కలవారైన ఆ మణవాళమహాముునులు మనలను కాపాడుగాక !

శ్రీవరవరమునుల ధ్యానమువలన విహితజ్ఞానభక్తి వైరాగ్యములు కల్గునని, ఇష్టప్రాప్తి, అనిష్టనివృత్తులను రెండిటిని కల్గించునని హృదయము.

97. మాత ర్వాణి ! నిరంతరం కలయ తాన్ కాంతోపయంతు ర్గుణాన్
అంతర్వాణివరై ర్వరప్రదరమావాసార్యముఖ్యై ర్నుతాన్ ।
పాదౌ తస్య కరద్వయార్చయ భవాతంకాపవాదౌ సదా
తద్భక్తా ననుచింతయాశయ ! తమోవైదేశికాన్ దేశికాన్ ॥

మాతః వాణి = తల్లీ ! సరస్వతీ !, అంతర్వాణివరైః = గొప్ప శాస్త్రజ్ఞులైన, వరప్రద రమావాసార్యముఖ్యైః = వరదనారాయణగురువు, శ్రీనివాసగురువు మొదలైనవారిచే, నుతాన్ =కీర్తింపబడ్డ, కాంతోపయంతుః తాన్ గుణాన్ = వరవరమునుల ఆ సద్గుణాలను, కలయ = భావించు, కరద్వయ = ఓ కరద్వయమా !, భవ+అతంక+ అపవాదౌ = సంసారభీతిని తీర్చే, తస్య పాదౌ = ఆ వరవరమునుల పాదాలను రెండిటిని, సదా = ఎల్లప్పుడు, అర్చయ = అర్చించు, ఆశయ = ఓ హృదయమా !, తమోవైదేశికాన్ = అజ్ఞానానికి దూరంగా ఉండేవారు, దేశికాన్ = సదాచార్యులు అయిన, తద్భక్తాన్ = ఆ మణవాళమహాముునుల భక్తులను, అనుచింతయ = సదా భావించు.

తల్లీ ! సరస్వతీ ! విద్వాంసులలో మిక్కిలి గొప్పవారగు శ్రీవరదనారాయణ గురువు, శ్రీనివాసగురువు మొదలగు దేశికశ్రేష్ఠులచే ఎల్లప్పుడు స్తుతింపబడు ఆ శ్రీమణవాళ మహాముునుల ధీ, భక్తి, శమ, దమ, దయాదిగుణములను నీవు ఎల్లప్పుడు అవిచ్ఛిన్నముగా భక్తితో కీర్తింపుము. సంసారభీతికి అపవాదు అయిన – అనగా – దానిని నశింపజేయగల ఆ వరవరమునుల శ్రీపాదములను ఓ నా కరద్వయమా! నీవు పూజింపుము. ఓ మనసా! నీవు తమోగుణమునకు వైదేశికులై (తమోగుణరహితులై) శుద్ధ సత్త్వగుణమును కల ఆ వరవరమునుల శ్రీచరణములలో భక్తిని కలవారగు ఆచార్యులను సతతము అనుసంధింపుమా!

"జిహ్వే ! కీర్తయ" అనే ముకుందమాలా శ్లోకార్థం, **"విచిత్రా దేహసంపత్తి రీశ్వరాయ నివేదితుమ్"** (విచిత్రమైన దేహమనే సంపద ఈశ్వరునకు నివేదించడం కోసం ఉన్నది) అనే సూక్త్యర్థం వరవరమునుల విషయంలో అందంగా అన్వయింపబడింది. **"వాయ్ అవనైయల్లదు వాళ్త్తాదు కై ఉలకమ్ తాయవనైయల్లదు తామ్ తొழా, పేయ్ములై**

నఙ్ఙు ఊణాక ఉణ్డాన్ ఉరువొడుపేరల్లాల్ కాణా కణ్ కేళా శెవి" (నా నాలుక భగవానుని తప్ప ఇంకొకరిని స్తుతించదు. లోకాలను ప్రేమతో తన శ్రీచరణంలో నిమిరిన స్వామిని తప్ప ఇంకొకరిని నా చేతులు నమస్కరించవు. పిశాచి అయిన పూతన స్తన్యంలోని విషాన్ని ఆహారంగా భుజించినవాని రూపాన్ని, నామాన్ని తప్ప ఇక ఎవరి రూపాన్ని, నామాన్ని నా కళ్ళుగాని, చెవులుగాని చూడవు, వినవు) అని పొయ్‌కై ఆళ్వార్లు ప్రథమపర్వంలో అనుసంధించిన భావాన్ని అణ్ణన్ చరమపర్వంగా అనుసంధించారు.

98. అజ్ఞానా మహ మగ్రణీ రథ చ మాం మన్యే భృశం పండితం
పాపీయానపి పాపలేశరహితం హా ! నిశ్చినోమి స్వయమ్ ।
భాస్వత్కర్మవిదేశగోఽపి కలయే సత్కర్మనిష్ఠం హృదా
ధిఙ్మాం నాథ ! మహామునే ! తదధునా త్రాతుం త్వమేవ క్షమః ॥

అహం = నేను, అజ్ఞానామ్ అగ్రణీః = అజ్ఞులలో మొదటివాడను, అథ చ = మఱి అయితే,మాం =నన్ను, పండితం = పండితునిగా, భృశం మన్యే = ఎక్కువగా భావిస్తున్నాను, పాపీయాన్ అపి = పాపిష్ఠివాడను అయినా, పాపలేశరహితం = పాపాన్ని కొంచమయినా లేనివాడనని, స్వయం = స్వయంగానే, నిశ్చినోమి హా! = నిశ్చయించుకుంటున్నానే అయ్యో !, భాస్వత్ = వెలిగే, సత్కర్మవిదేశగః +అపి = సత్కర్మకు దూరంలో ఉండేవాడను అయినా, హృదా = మనస్సుతో, సత్కర్మనిష్ఠం = సత్కర్మలలో స్థిరంగా ఉండేవాడనుగా, కలయే = భావిస్తున్నాను, ధిక్ = ఛీ !, నాథ = స్వామీ !, మహామునే = ఓ పెరియజీయర్‌స్వామీ !, తత్ = అందువల్ల, అధునా = ఇపుడు, మాం = నన్ను, త్రాతుం = రక్షించడానికి, త్వమ్ ఏవ క్షమః = నీవే సమర్థుడవు.

ఈ శ్లోకంలో అణ్ణన్ నైచ్యానుసంధానాన్ని చేస్తున్నారు. ఈవిధంగా పల్కడం **"ఆత్మనిక్షేప కార్పణ్యే"** అన్నట్లు శరణాగతిలో ఒక అంగం.

అజ్ఞానుల సమూహములో నేను అగ్రేసరుడను. అట్లున్నను నేను మిక్కిలి గొప్ప విద్వాంసునిగా నన్ను తలచుదును. అట్లే, **"పావమే శెయ్‌దు పావియానేన్"** (కేవలం పాపాలనే చేసి పాపిని అయ్యాను) అనునట్లు మిగుల పాపమునే చేసి, పాపిని అయినను నన్ను నేను కొంచెముకూడ పాపము లేనివానినిగా తలతును. పొగడతగిన, సత్కర్మకు మిగుల దూరములోనున్నవాడను అయినను నన్ను నేను సత్కార్యములందు నిష్ఠను కలవానినిగా మనస్సున ఎంచెదను. ఈ రీతులలో నుండు నన్ను నేనే ఏవగించుకొనవలసిన వాడను. అందుచే నాకు స్వామియైన ఓ మణవాళమహామునీ! మీరే నన్ను రక్షింప సమర్థులైయున్నారు.

తమ కర్మయోగ, జ్ఞానయోగ రాహిత్యాన్ని అణ్ణన్ ఇందులో ప్రస్తావించారు.

**99. నాహం సత్కర్మ కర్తుం పటు రపటుతర స్సాంఖ్యయోగం విధాతుం
నైవ ధ్యాతుం పరస్మాత్పర మనుపమం ధామ భూమానిధానమ్ ।
నైవ న్యస్యామి తస్మిన్ భర మనధిగమాత్ తత్ర విశ్వాసభూమ్నో
ముక్తే స్తస్మాదుపాయో వరమునివర ! మే త్వత్కృపైవానపాయా ॥**

అహం = నేను, సత్కర్మ = మంచి కర్మలను, కర్తుం = చేయడానికి, న పటుః = సమర్థుడను కాను, సాంఖ్యయోగం విధాతుం = సాంఖ్యయోగమనేబడే జ్ఞానయోగాన్ని అనుష్ఠించడానికి, అపటుతరః = అంతకంటేకూడా అసమర్థుడను, పరస్మాత్ పరం = అన్యులందరికంటే గొప్పవాడు, అనుపమం = సాటి లేనివాడు, భూమానిధానమ్ = లక్ష్మీదేవికి, భూదేవికి నాయకుడు, ధామ = తేజోరూపుడైన భగవానుని, ధ్యాతుం = ధ్యానం చేయడానికి, న ఏవ = సమర్థుడను కానేకాను, (భక్తియోగ రహితుడను) తత్ర = ఆ భగవానునియందు, విశ్వాసభూమ్నః అనధిగమాత్ = మహావిశ్వాసాన్ని పొందలేనందు వల్ల, తస్మిన్ =ఆ పరమపురుషునిలో, భరం న ఏవ న్యస్యామి = నా రక్షణభారాన్ని సమర్పించడమనే శరణాగతిని చేయలేను, తస్మాత్ = అందువల్ల, వరమునివర = ఓ మణవాళ మహామునీ!, మే = నాయొక్క, ముక్తేః = ముక్తికి, త్వత్కృపా ఏవ = నీ దయయే, అనపాయా = నిరుపద్రవం అయిన, ఉపాయః =శరణం.

ఇందులో అణ్ణన్ తమ ఆకించన్యాన్ని, అనన్యగతిత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరిస్తున్నారు.

నేను విహితములగు సత్కర్మలను చేయుటకు సమర్థుడను కానే కాను. సాంఖ్య యోగమగు జ్ఞానయోగమును అనుష్ఠింప మిక్కిలి అసమర్థుడను. అందుచే పరాత్పరుడై, తనకు సమానులు, మించినవారెవ్వరును లేనివాడై, **"ఒత్తార్ మిక్కారై యిలయాయ మామాయా"** (సాటి వచ్చేవారు, మించినవారు ఎవ్వరూ లేని ఓ గొప్ప ఆశ్చర్య చేష్టితుడా!) అనునట్లు మాయావియై, శ్రీభూమీనాయకుడై, పరమతేజస్వియైన పరమపురుషుని ధ్యానము చేయుటకుకూడ మిక్కిలి అశక్తుడనై యున్నాను. దుష్కరములగు ఉపాయాంతరములను వీడి, భగవానుని శ్రీచరణములతో శరణాగతిని చేయవచ్చునుకదా! అనినచో, అందులకు కూడ నేను అధికారిని కాను. భరసమర్పణమునకు ఆవశ్యకము అయిన మహావిశ్వాసము నాకు లేదే ! అందుచే అకించనుడనై, అనన్యగతినైయున్న నాకు నా మోక్షపురుషార్థసిద్ధికై అపాయము కొంచెము కూడలేని నీయొక్క స్వాభావికమైన కృపయే ఉపాయము – అని పల్కుచున్నారు.

"మీరే పరమకృపతో దాసుని ఉజ్జీవింపజేయవలెను" – అనుచు వరవరమునుల సన్నిధిలో ఇచట అణ్ణన్ ప్రార్థించిరి. **"భక్తే స్తస్మా దుపాయః"** అను పాఠాంతరములో **"అదువుమ్ అవనదు ఇన్నరుళే"** అనే రీతిలో ప్రాప్యత్వర అగు పరభక్తికిని నీ కృపయే కారణమని భావము.

ఆకించన్య, అనన్యగతిత్వాలు శరణాగతికి అంగాలు **"ఆత్మనిక్షేప కార్పణ్యే"** అని అంటూ ఇవి విధింపబడ్డాయి. గోదాదువి కూడా తిరుప్పావై ప్రబంధంలోని **"కఱవై కళ్‌పిన్ శెన్రు"** అనే ఇరవై ఏడవ పాశురంలో కర్మజ్ఞాన భక్తియోగానుష్ఠాన రాహిత్యాన్ని శరణాగతికి అంగంగా అనుసంధించారు. నమ్మాళ్వార్లు **"నోఱ్ఱ నోన్బిలేన్ నుణ్ణఱివిలేన్"** అని తమ ఆకించన్యాన్ని, అనన్యగతిత్వాన్ని నివేదించగా, ఈ క్రమాన్ని అనుసరిస్తూ భగవద్యామునులు **"న ధర్మనిష్ఠోస్మి న చాత్మవేదీ న భక్తిమాన్ త్వచ్చరణారవిందే, అకించనోనన్యగతిః"** అని పలికారు. పూర్వాచార్యులందఱు శరణాగతి చేసే సందర్భంలో ఈ రీతిని అనుసరించారు. ప్రకృతంలో అణ్ణన్ ఈ క్రమాన్ని చరమపర్వాత్మకంగా వరవర మునులపట్ల అనుసంధిస్తున్నారు.

100. త్వత్సూక్త్యైకరసాన్ త్వదంఘ్రియుగళన్యస్తాత్మరక్షాభరాన్
త్వత్సేవైకవరాన్ త్వదీయకరుణాస్రోతస్వినీసాగరాన్ ।
ఆచార్యాన్ మమ వీక్ష్య మయ్యపి భృశం నిస్సీమదోషాస్పదే
శ్రీమన్! రమ్యవర ! ప్రసీద యమినాం రాజన్! నమస్తే నమః ॥

త్వత్ సూక్తి+ఏకరసాన్ = తమ శ్రీసూక్తులను మాత్రమే ఆస్వాదించేవారు, త్వత్ + అంఘ్రియుగళ = కేవలం తమ పాదాల జంటలో, న్యస్త+ ఆత్మరక్షాభరాన్ = సమర్పించిన తమ రక్షణభారాన్ని కలవారు, త్వత్ + సేవా+ ఏకవరాన్ = మీ సేవను ఒక్కటినే వరంగా కలవారు, త్వదీయ = నీయొక్క, కరుణాస్రోతస్వినీ = కరుణ అనే నది చేరే, సాగరాన్ = సముద్రంవంటివారు అయిన, మమ ఆచార్యాన్ = నా ఆచార్యులను, వీక్ష్య = చూచి, నిస్సీమదోష+ ఆస్పదే = అవధి లేని దోషాలకు స్థానం అయిన, మయి అపి = నా విషయంలో కూడా, శ్రీమన్ రమ్యవర = ఓ మణవాళమహామునీ!, భృశం ప్రసీద = మిక్కిలిగా అనుగ్రహించండి, యమినాం రాజన్ = యతులకు ప్రభువైన మణవాళమహామునీ !, తే = మీకు, నమః నమః = మాటిమాటికి నమస్కారం.

"అకృత్రిమ.... పితామహం నాథమునిం విలోక్య ప్రసీద మద్వృత్త మచింతయిత్వా" (పితామహులైన నాథమునులను చూచి, నా వృత్తాన్ని లెక్కించకుండా నన్ను అనుగ్రహించు) అనే ఆళవన్దార్ పల్కిన రీతిలో వేడుతూ అణ్ణన్ స్తోత్రపరిసమాప్తిని చేస్తున్నారు.

ఓ శ్రీమణవాళమహామునీ ! మీ శ్రీసూక్తి మాధుర్యముచే దానిని సేవించుటలోనే ఆనందమును కలవారై, మీ శ్రీపాదపద్మములలో తమ సర్వభరమును సమర్పించి, మీ శ్రీచరణములనే శరణముగా ఆశ్రయించినవారై, **"నిర్భరో నిర్భయోஉస్మి"** అను రీతిలో భయము భారము తీరినవారై, మీ పాదపద్మములందు కైంకర్యమును చేయుటలోనే ఎల్లప్పుడు తత్పరులై, మీ కరుణ అను నదికి సముద్రమై (చేరు చోటై), యున్నవారై, మీ చరణములలో దాసుడు ఆశ్రయించుటకు పురుషకారభూతులైయున్న ఆచార్యులనే కటాక్షించి,

అంతు లేని దోషము కల నా విషయమునందుకూడ మీరే కృప జేయవలెను. యతిరాజు లగు మీ శ్రీచరణములలో ఈ దాసుడు నమస్కరించుచున్నాడు - అని విజ్ఞాపించి, అణ్ణన్ స్తోత్రపరిసమాప్తిని చేసిరి. ఇచట **"నమో నమః"** అనెడి వీప్సచే ఆదరాతిశయము ద్యోతితము.

పూర్వశ్లోకంలో అణ్ణన్ తమ ఆకించన్యాన్ని, అనన్యగతిత్వాన్ని తెలుపగా, దానిని విని వరవరమునులు, "అయితే మిమ్ములను ఏవిధంగా దేనిని చూచి అనుగ్రహించాలి" అని మనస్సులో తలచినట్లు భావించిన అణ్ణన్ దానికి సమాధానాన్ని గోదాసూక్తి ప్రక్రియలో అనుగ్రహిస్తున్నారు.

స్వామీ! నేను చేసిన సాధనానుష్ఠానం లేదని అన్నాను కాని, నీవు కాదనలేని మహనీయులైన ఆచార్యులతో సంబంధాన్ని కల్గి ఉన్నాను కదా ! ఆ సంబంధాన్ని చూచి నన్ను కరుణించు- అని ఇందులో అణ్ణన్ పల్కిన సమాధానం గోదాదేవి **"ఉన్దన్నైప్పిఱవి పిఱన్దన పుణ్ణియమ్ యాముడైయోమ్, కుఱై ఒన్ఱు మిల్లాద గోవిన్దా ! ఉన్ఱన్నోడురవేల్ నమక్కు ఇఙ్గొళిక్కవొళియాదు"** అనే సూక్తి వైఖరిని తలపిస్తున్నది. ఈ క్రమాన్నే కూరేశులు కూడా **"రామానుజాంఘ్రిశరణోఽస్మి... దాసస్తవేతి వరదాస్మి కటాక్షణీయః"** అని అంటూ పలికారు. ఈ విధమైన, కాదనడానికి వీలులేని, తమకు గల సదాచార్య సంబంధాన్ని పురస్కరించుకొని, తమను తప్పక కటాక్షించవలసినదని అణ్ణన్ పల్కిన సూక్తి **"పాపిష్ఠః క్షత్రబంధుశ్చ పుండరీకశ్చ పుణ్యకృత్, ఆచార్యవత్తయా ముక్తౌ తస్మాదాచార్యవాన్ భవేత్"** (పాపిష్ఠుడైన క్షత్రబంధువు, పుణ్యాన్ని చేసిన పుండరీకుడు- వీరిరువురికి వారు చేసిన పాపంగాని, పుణ్యంగాని ఉత్తారకోపాయం కాలేదు. వారు సదాచార్యసంబంధాన్ని కల్గి ఉన్నందువల్లనే ముక్తులయ్యారు. అందువల్ల సదాచార్యుడు కల్గినవాడై ఉండాలి) అనే పరమార్థాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇదే ఈ ప్రబంధప్రధాన ప్రమేయం. దీనిని అణ్ణన్ ప్రబంధం ఆరంభంలో, మధ్యలో, చివరలో ఉపక్రమోపసంహారాభ్యాసాది శాస్త్రక్రమంలో అనుసంధించడం గమనించదగినది.

(త్వదీయ కరుణాస్రోతస్వినీ సాగరాన్)- మీ కరుణ అనే నది చేరే సముద్రాల వంటివారు- అని అర్థం. **"నదీనాం సాగరో గతిః"** అని. **"యథా నద్యః స్యందమానా స్సముద్రే, అస్తం గచ్ఛంతి"** అనే రీతిలో నదులన్నీ చేరే చోటు సముద్రం. ఆ రీతిలోనే వరవరమునుల కరుణ అనే నదులు చేరే సముద్రాలవంటి మహాత్ములని భావం. అణ్ణన్, వరవరమునులను ఆశ్రయించడానికి పురుషకారభూతులైన కోయిలణ్ణన్ మొదలైనవారు ఈ ప్రయోగం ద్వారా సూచింపబడ్డారు. సదాచార్యసమాశ్రయణం సత్పురుషసంగం వల్ల కల్గుతుందని **"సత్సంగాత్ భవనిస్పృహో గురుముఖాత్ శ్రీశం ప్రపద్య"** అని నడాదూర్ అమ్మాళ్ అన్నారు.

పూర్వశ్లోకములో వరవరమునుల శ్రీచరణములలో శరణాగతిని చేసిన అణ్ణన్ ఇందు కైంకర్యప్రార్థనను చేసి, ప్రకృతస్తుతిలో ప్రధాన ప్రమేయమైన చరమపర్వనిష్ఠ యొక్క స్వరూపమును అనుసంధించిరి. ఇంతటితో **"శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః"** అనే వైదికమైన ద్వయమంత్రం యొక్క తాత్పర్యం శ్రీవరవరమునుల పర్యంతం అనుసంధేయమని సూచింపబడింది. శ్రీమన్నారాయణ చరణ స్థానీయులు ఆళ్వార్లు, వారి చరణస్థానీయులు శ్రీరామానుజులు కాగా, శ్రీరామానుజుల పాదస్థానీయులు యతీంద్రప్రవణులైన శ్రీవరవరమునులేకదా! అందువల్ల ఈ స్తుతిలో ద్వయమంత్రార్థం చరమపర్వపర్యంతంగా అనుసంధింపబడిందని భావించడంలో విప్రతిపత్తి ఏమీ లేదు.

శ్రీమతే రమ్యజామాతృమునీంద్రాయ మహాత్మనే ।
శ్రీరంగవాసినే భూయా న్నిత్యశ్రీః నిత్యమంగళమ్ ॥

మహాత్మనే = మహానుభావులు, శ్రీరంగవాసినే = శ్రీరంగంలో నివసించేవారు, శ్రీమతే = కైంకర్యలక్ష్మిని కలవారు అయిన, రమ్యజామాతృమునీంద్రాయ = శ్రీమణవాళ మహామునులకు, నిత్యశ్రీః = నిత్యమైన సంపద, నిత్యమంగళం = నిత్యమైన, మంగళం = భూయాత్ = కలగాలి.

ఇది ప్రతివాదిభయంకరమ్ అణ్ణన్‌చే అనుగ్రహింపబడిన వరవరమునుల మంగళశ్లోకము.

శ్రీ రంగనాథుని దివ్యాజ్ఞచే శ్రీరంగమును నిత్యవాసముగ గొని, శ్రీవైష్ణవసిరిచే వెల్గువారై, మిక్కిలి గొప్పతనమును కలవారై, తమ మంగళాశాసనబలముచే ఎల్లప్పుడు శ్రీరంగనాథుని సంపదను వర్ధిల్లజేయు మణవాళమహామునులకు నిత్యశ్రీః నిత్యమంగళము అగుగాక!

శ్రీమద్యతీంద్రప్రవణస్తవస్య శ్రీవాదిభీకృద్గురుణా కృతస్య ।
లక్ష్మీనృసింహార్యపవిత్రభవ్యస్మృత్యర్థ మేషో విహితః ప్రకాశః ॥

ఆచార్యవరివస్యేమాం శింగరార్యసమర్పితామ్ ।
స్వీకరోతు దయాసాంద్రః శ్రీమాన్ సౌమ్యవరో గురుః ॥

జయతు జయతు యోగీ రమ్యజామాతృనామా
జయతు జయతు నిత్యం వాదిభీకృత్ బుధేంద్రః ।
జయతు జయతు హృద్యా తత్కృతిః సద్భిరీడ్యా
జయతు జయతు వంద్యా తద్రసాసక్తగోష్ఠీ ॥

అస్యాః ప్రకాశనవిధౌ వినియుక్తవిత్తః
సౌమ్యోపయంతృమునిపాదసరోజభృంగః।
లక్ష్మీనృసింహాగురువర్యసుతః కృతార్థః
రామానుజార్యహ్వసుకృతీ లభతాం శుభాని ॥

శ్రీవరవరమునివ్యాఖ్యానం ఆచార్యవరివస్యావ్యాఖ్యానము సంపూర్ణం.

॥ శ్రీమతే రామానుజాయ నమః ॥

॥ శ్రీమద్వరవరమునయే నమః ॥

శ్రీ సేనాపతి ముని అనుగ్రహించిన

శ్రీమణవాళ మామునికళ్ నూఱ్ఱన్దాది

"శ్రీపాదపరిచర్యా" వ్యాఖ్యానం

అక్షతక్షేమదైః క్షిప్రం రక్షాదీక్షిత ! తేఽక్షిజైః ।
కటాక్షైః పుండరీకాక్ష! వీక్ష్య మాం రక్షితం కురు ॥

తనియన్

మా వళరుమ్ కోయిల్ మణవాళమామునికళ్
పూ వళరుమ్ పొన్నడిమేల్ పామాలై - నావలవన్
శేనాపతి మునివన్ శీరుడై అన్దాది తన్దాన్
మేనాడరుమ్ కఱ్క ఏయ్న్దు.

మా వళరుమ్ = కాంతి వృద్ధి చెందే, (నిత్యాభివృద్ధమైన కాంతిని కల), మణవాళ మా మునికళ్ = శ్రీవరవరమునులుయొక్క, పూ వళరుమ్ = అందం వృద్ధి చెందే, (తామర పూవువంటి) పొన్ అడి మేల్ = బంగారంవలె స్పృహణీయాలైన శ్రీచరణాలపై, పా మాలై = పాశురమాలికలను, నా వలవన్ = వాక్పటిమను కల, శేనాపతి మునివన్ = సేనాపతి మునులు, శీరుడై = కవిత్వగుణాలను నిండుగా కల, అన్దాది = అన్దాది ప్రబంధాన్ని, మేనాడరుమ్ = తరువాతి కాలంలోనివారుకూడా, ఏయ్న్దు కఱ్క = స్వరూపానురూపంగా అభ్యసించేటట్లుగా, తన్దాన్ = అనుగ్రహించారు.

వాక్పటిమను మెండుగా కల్గినవారైన సేనాపతిమునులు తమ తరువాత కాలంవారుకూడా అభ్యసించడంకోసం శ్రీరంగంలోని మణవాళమహామునుల, అందం నిండుగా ఉన్న తామరపూవువంటి శ్రీపాదాలను ఉద్దేశించి గొప్పతనం కల్గిన, అన్దాదిప్రక్రియలో కూర్చిన పాశురాల మాలికలను సమర్పించారు.

"మా వళరుమ్" – ఇక్కడ **"మా"** శబ్దం సంస్కృతపదం; లక్ష్మీవాచకం. ప్రకృతంలో లక్షణయా శోభను, కాంతిని తెలుపుతుంది. దీనిని **"కోయిల్"** అనే పదానికి కాని,

"పామాలై" అనే పదానికి కాని అన్వయించవచ్చు. శ్రీరుగానికి అన్వయిస్తే **"వాన్ తికళ్ళుమ్‌శోలై"** ఇత్యాదిగా చెప్పబడిన రీతిలో అందమైన తోటలతో ప్రకాశించే శ్రీరంగ క్షేత్రమని తాత్పర్యం. తిరువాయ్‌మొళ్ళి అన్దాది శ్రీరంగంలోని శ్రీరంగనాథుని గూర్చినది కాగా, ఈ అన్దాది ఆ శ్రీరంగాన్ని నిరూపకంగా కల మణవాళమాముని పాదాలపై రచింపబడింది. తిరువాయ్‌మొళ్ళి కూడా **"ముకిల్‌వణ్ణనడిమేల్ శొన్నశొన్మాలై"** కదా! **"ముకిల్‌వణ్ణన్"** శ్రీరంగనాథుడే కదా!

"మా" అనే పదం తమిళంలో బహ్వర్థకం. కనుక **"మావళరుమ్ కోయిల్"** అనే ప్రయోగంలో పలు అర్థస్వారస్యాలను అభ్యూహించవచ్చు. **"మా"** అంటే తుమ్మెద అని అర్థం. **"మావళరుమ్"** - తుమ్మెదలు వృద్ధి చెందే శ్రీరంగం. అంటే, తేనె సమృద్ధిగా కల్గిన పూలను కల తోటలతో పరివేష్ఠితమైన క్షేత్రమని భావం. **"మావుదైత్తార్"** వంటి ప్రయోగాలలో ఈ పదం తుమ్మెద అనే అర్థంలో ప్రయోగింపబడింది. నాథమునులు, యామునులవంటివారిని, **"అరుళాళ్ళి వరివణ్డే"** అనే రీతిలో భగవద్రామానుజులను తుమ్మెదగా చెప్పే సంప్రదాయాన్నిబట్టి, అటువంటి మహాచార్యులు విలసిల్లే శ్రీరంగమనే అర్థాన్ని చెప్పడంలో కూడా అడ్డు లేదు. **"మా"** అనే పదానికి హంస అని కూడా అర్థం. కలిత్తొకై అనే గ్రంథంలోని **"మడనడై మాయినమ్"** (92, 17) అనే ప్రయోగం దీనికి ఉదాహరణం. ఇక్కడ హంసలంటే- పరమహంసపదవాచ్యులైన భగవద్రామానుజ శ్రీమన్నాథముని, శ్రీయామునులవంటి ఆచార్యులే. **"మా"** అంటే సరస్వతి అని కూడా అర్థం. **"మా వళరుమ్ కోయిల్ మణవాళ మామునికళ్"** అంటే సకల విద్యలు వృద్ధిచెందే- ప్రకాశించే మణవాళ మహామునులని తాత్పర్యం. ప్రకృష్టవిజ్ఞాన బలైకధాములైన ఆదిశేషుల అపరావతారం శ్రీమణవాళ మహామునులలో విద్యలన్నీ వర్ధిల్లడంలో ఏమి ఆశ్చర్యం ఉన్నది? **"మా"** అంటే అందం. **"మావీళ్ళ్ పళ్ళి"** వంటి ప్రయోగాలు ఇందుకు ఉదాహరణం. **"మావళరుమ్ కోయిల్ మణవాళ మామునికళ్"** అంటే అందం వృద్ధిచెందే వరవరములని భావం. **"శుద్ధోదన్వద్ధవళమధుర"**మైన వరవరమునుల రూపంలో అందానికి ఏమి లోటు? **"మావళరుమ్"** అనే ప్రయోగంలోని వర్తమానకాలిక **"వళరుమ్"** అనే పదంవల్ల స్ఫురించే అర్థస్వారస్యం కూడా గమనీయం. ఈ విధంగానే ఈ ప్రయోగంలో ఇంకా పలు అర్థస్వారస్యాలను సహృదయులు భావించవచ్చు. **"నావలవన్"** - **"నా"** అంటే నాలుక, పదం అనే అర్థాలున్నాయి. **"వలమ్"** అంటే బలం, సామర్థ్యం. **"అన్"** - అనేది పుంలింగ ప్రత్యయం. పదప్రయోగంలో సమర్థుడు అని ఈ పదం యొక్క తాత్పర్యం. **"కిళరొళి ఎన్ కేశవనే"** ఇత్యాది దివ్యప్రబంధాలలోని ప్రయోగాల అర్థం ప్రకృతంలో భావనీయం. **"పూ వళరుమ్"** - ఇక్కడ పూ శబ్దం అందాన్ని, మృదుత్వాన్ని నిర్దేశిస్తుంది. తమిళనిఘంటువులలోకూడా (దివాకర నిఘంటువు) ఈ శబ్దం

సౌందర్యవాచకంగా చూపబడింది. ఈ పదం లక్షణయా తారమపూవును కూడా తెలుపుతుంది కనుక, తామరపూవు వంటి అందమైన, మృదువైన, శ్రీచరణాలనే అర్థం పర్యవసిస్తుంది. **"శీరుడై"** – ఇక్కడి **'శీర్'** శబ్దం కవిత్వగుణాలను తెలుపుతుంది. **"మేనాడరుమ్" – మేల్‌నాడరుమ్–** అనంతరకాలంవారని అర్థం.

1. కుణవాళన్ ఇన్దిరకోన్ కుణజ్ఞూఱుమ్ మాఱన్‌తాళ్
తణవాద ఎతిరాశన్‌తాళ్ వణఙ్గుమ్ తన్మైయనాయ్
ప్పణ వాదిశేడనరుళ్ పర నేవ అవతరిత్త
మణవాళమామునివన్ మలరడియే అడై నెఞ్జే !

కుణవాళన్ = స్వాభావికాలైన కల్యాణగుణాలను కలవాడైన, ఇన్దిరై కోన్ = ఇందిరానాథుని, కుణమ్ కూఱుమ్ = దయావాత్సల్యాది కల్యాణగుణాలను కీర్తించే, మాఱన్ తాళ్ = నమ్మాళ్వార్ల శ్రీచరణాలను, తణవాత = విడువని, ఎతిరాశన్ తాళ్ = యతిరాజుల శ్రీచరణాలను, వణఙ్గుమ్ = నమస్కరించే, తన్మైయనాయ్ = స్వభావాన్ని కలవారై, పణ ఆదిశేషన్ = ఫణాలను కల, ఆదిశేషుడు, అరుళ్ పరన్ = కరుణాశీలి అయిన భగవానుడు, ఏవ = ఆజ్ఞాపించగా, అవతరిత్త = అవతరించిన, మణవాళ మా మునివన్ = మణవాళమహామునుల, మలర్ అడియే = పూవువలె సుకుమారమైన, అందమైన శ్రీచరణాలనే, నెఞ్జే = ఓ మనసా !, అడై = ఆశ్రయించు.

ఈ పాశురార్థానికి అనుగుణంగా ఇరామానుశనూఱ్ఱన్దాదిలోని **"పూమన్ను మాదు"** అనే పాశురార్థాన్ని, **"శ్రీమాధవాంఘ్రి"** అనే యతిరాజవింశతిశ్లోకార్థాన్ని స్మరించాలి. శ్రియఃపతి ఆజ్ఞానుసారంగా ఆదిశేషుడే మణవాళమహామునులుగా అవతరించారనే ఐతిహ్యం సంప్రదాయప్రసిద్ధం. **"మలరడి"** అనే ప్రయోగం లోని విశేషణ విశేష్యాలద్వారా శ్రీవరవరమునుల శ్రీచరణాల ప్రాప్యప్రాపకత్వాలు ధ్వనిస్తున్నాయి. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళ్రిలో భగవానుని గుణాలు పాడారా ! అని అంటే, **"పొరుళెన్రు ఇవ్వులకమ్ పడైత్తవన్ పుకళ్మేల్ . . . . వణ్ శడకోపన్ తెరుళ్ కొళ్ళ చ్చొన్న"** అని ఆళ్వార్లే అన్నారు కదా! ఆళ్వార్లు **"తుయ రఱు శుడరడి తొళ్దెళు ఎన్ మననే !"** అన్నట్లే వీరుకూడా **"మలరడియే అడై నెఞ్జే !"** అని మనస్సును సంబోధిస్తూ అన్నారు. **"మలరడి"** – తామరపూవు వంటి పాదాలని అర్థం. అపుడే ఆశ్రయణమనే క్రియకు అన్వయం కుదురుతుంది. ప్రారంభంలో మంగళార్థకమైన **"కుణ"** శబ్దప్రయోగం ద్వారా **"మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని చ శాస్త్రాణి ప్రథన్తే"** అని విధింపబడ్డ కావ్యాదిలో చేయవలసిన మంగళాచరణం చేయబడింది.

సద్గుణాలను కల్గినవాడైన భగవానుని కల్యాణగుణాలను పలికే నమ్మాళ్వార్ల శ్రీపాదాలను విడువనివారైన భగవద్రామానుజుల శ్రీపాదాలను నమస్కరించే స్వభావాన్ని కలవారై, కరుణాశీలి అయిన భగవానునిచేత నియమింపబడి, వచ్చి భూమిపై అవతరించినవారై, ఫణాలను కల ఆదిశేషస్వరూపులైన మణవాళమహామునుల శ్రీపాదాలను ఓ మనసా! ఆశ్రయించు.

2. నెఞ్జురుకి క్కణ్ పనిప్ప నెడుమాలై నమన్దెళ్లు నమ్
తఞ్జమరుళ్‌మారి పుకళ్ తామ్పరవుమ్ ఎతికట్కొరు
వణ్ శరణే వణఙ్గియ నమ్‌మణవాళమామునివన్
ఇన్ శరితైయిన్ శీరై ఇయమ్బి యెళ్లాయ్ ఎన్ వాయే !

నెఞ్జు ఉరుకి = మనస్సు ద్రవించి, కణ్ పనిప్ప = కన్నులు ఆనంద బాష్పాలతో చెమ్మగిల్లగా, నెడు మాలై = సర్వాధికుడైన శ్రియఃపతిని, నమన్దు ఎళ్లుమ్ = నమస్కరించి ఉజ్జీవించే, నమ్ తఞ్జమ్ = మనకు రక్షకుడు, అరుళ్ మారి = **"అరుళ్ మారి"** అనే పేరును కల తిరుమఙ్గై ఆళ్వార్ల, పుకళ్ = కల్యాణగుణాలను, తామ్ పరవుమ్ = తాము స్తుతించడంద్వారా విస్తరింపజేసే, ఎతికట్కు ఒరు వణ్ శరణ్ = యతులకు అద్వితీయులైన, గొప్ప నాథులైన శ్రీరామానుజుల (అందమైన శ్రీచరణాల)ను, వణఙ్గియ = నమస్కరించిన, నమ్ మణవాళ మామునివన్ = మన వరవరమునుల, ఇన్ = తీయని, శరితైయిన్ శీరై = దివ్యావతారచరిత్రలోని గొప్పతనాన్ని, ఇయమ్బి = కీర్తించి, ఎన్ వాయే = ఓ నా నాలుకా !, ఎళ్లాయ్ = ఉజ్జీవించు.

"విచిత్రా దేహసంపత్తిః ఈశ్వరాయ నివేదితుమ్" అనే శాస్త్రార్థాన్ని ఇక్కడ స్తుతికర్త చరమపర్వనిష్ఠలో అన్వయిస్తూ పల్కుతున్నారు. **"ఎఙ్గళ్ కతియే! ఇరామానుశమునియే! . . . . . పొఙ్గు పుకళ్ మఙ్గైయర్‌కోన్ ఈన్ద మఱై అయిరమ్ అనైత్తుమ్ తఙ్గు మనమ్ నీ ఎనైక్కు త్తా"** అనే పెరియతిరుమొళ్లి తనియన్, **"కణ్ణమఙ్గై నిన్దానై కలై పరవుమ్ తనియానైయై తణ్ తమిళ్ శెయ్‌ద నీలన్‌తనక్కు ఉలకిల్ ఇనియానై ఎఙ్గళ్ ఇరామానుశనై"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది సూక్తి భావ్యాలు. **"ఇయమ్బుతల్"** – సంగీతవాద్యం వలె మధురంగా ధ్వనించడం అనికూడా అర్థం.

మనస్సు ద్రవించి, కన్నులు చెమ్మగిల్లగా, శ్రియఃపతిని నమస్కరించే **"అరుళ్ మారి"** అయిన తిరుమఙ్గైయాళ్వార్ల కీర్తిని విస్తరింపజేస్తున్న భగవద్రామానుజుల శ్రీపాదాలనే కొలిచే మన మణవాళమహామునుల చరిత్రల గొప్పతనాన్ని ఓ మనసా ! పలికి, ఉజ్జీవించు– అని భావం.

**3. వాయాలుమ్ మెయ్యాలుమ్ మనత్తాలుమ్ పెరుమ్బూదూర్
మేయానై అడి పరవుమ్ మెయ్యడియార్ తాళ్ నినైన్దు
మాయాద మణవాళమామునివన్ కుణఙ్గళైయే
కూశామల్ వణఙ్గి యెఱ్ఱాయ్ కుఱియుడైయ ఎన్ తలైయే !**

వాయాలుమ్ = వాక్కుతో, మెయ్యాలుమ్ = శరీరంలో, మనత్తాలుమ్ = మనస్సులో, పెరుమ్బూదూర్ మేయానై = శ్రీ పెరుమ్బూదూర్‌లో వేంచేసి ఉండే భగవద్రామానుజుల, అడి = శ్రీ చరణాలను, పరవుమ్ = సేవించే, మెయ్ అడియార్ = ఏ సంకోచం లేని శేషభూతులైన దాసుల, తాళ్ = శ్రీచరణాలను, నినైన్దు = తలచి, మాయాద = నిలువని, మణవాళ మామునివన్ = మణవాళ మహామునుల, కుణఙ్గళైయే = కల్యాణగుణాలనే, కుఱి యుడైయ = గుఱిగా – లక్ష్యంగా కల్గిన, ఎన్ తలైయే = ఓ నా శిరస్సా! కూశామల్ = సందేహించకుండా, వణఙ్గి ఎఱ్ఱాయ్ = నమస్కరించి ఉజ్జీవించు.

మొదటి పాశురంలో మానసికమైన, రెండవ పాశురంలో వాచికమైన కైంకర్యాన్నిగూర్చి పల్కిన ప్రబంధకర్త ఇందులో కాయిక కైంకర్యాన్నిగూర్చి పల్కుతున్నారు. **"సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్"** కనుక **"తలైయల్లాల్ కైమ్మాఱిలేన్"** అని దివ్యసూరులు వాక్కు కనుక, శిరస్సు చేసే ప్రణామంతో ఇక్కడ కాయికకైంకర్యాన్ని లక్షిస్తున్నారు. దీనిలో శ్రీ వరవరమునుల విషయంలో త్రికరణాత్మకకైంకర్యం చేయాలనే తమ ఆశను కవి ఆవిష్కరించారు. **"శిన్దైయాలుమ్ శొల్లాలుమ్ శెయ్‌కైయినాలుమ్"** అని అంటూ ఆళ్వార్లు భగవానుని విషయంలో పడిన ఆశ చరమపర్వవిషయంగా అదే క్రమంలో అనుసంధింప బడడం గమనార్హం. **"మెయ్యడియార్"** – శేషత్వంలో ఏ మాత్రం లోపం లేని దాసులు అని భావం. **"మెయ్యడియార్"** అనే కులశేఖరసూక్తి స్మరణీయం. **"మేయానై"– "మేయాన్ వేఙ్గడమ్"** అనే ఆళ్వార్ల సూక్తి భావనీయం. ఆదరంతో వేంచేసి ఉండేవాడని అర్థం.

వాక్కు, శరీరం, మనస్సులతో శ్రీపెరుమ్బూదూర్ మామునులనే తలచి ద్రవించే మణవాళమహామునుల గుణాలనే మంచి లక్ష్యాన్ని కల ఓ నా శిరమా ! సందేహించకుండా నమస్కరించి ఉజ్జీవించు.

**4. తలైయాన ఎతిరాశన్ తన్‌వడివై నినైక్క మనమ్
విలై యాదుమ్ ఇల్లవన్ శీర్ విళ్ళఙ్గియిడ వాయడిమై
నిలైయాన ముఱై శెయ్య నిచ్చలుమ్ కై వేణ్డుమ్ తిరు
మలైయాళ్వార్ అరుళ్ పెఱ్ఱ మణవాళ మామునియే!**

తిరుమలై ఆళ్వార్ అరుళ్ పెఱ్ఱ = తిరువాయ్‌మొళ్ళిప్పిళ్ళై అనుగ్రహాన్ని పొందిన, మణవాళ మామునియే = ఓ మణవాళ మహామునీ! తలైయాన = మిక్కిలి గొప్పవారైన, ఎతిరాశన్‌తన్ వడివై =భగవద్రామానుజుల రూపాన్ని, నినైక్క = భావించడంకోసం గల, మనమ్ = మనస్సు, విలై యాదుమ్ ఇల్ = ఏ వెల కట్టలేని, అవన్ శీర్ = వారి కళ్యాణగుణాలను, విళ్ళుఙ్గి యిడ = గ్రహించడంకోసం (కీర్తించడం కోసం), వాయ్ = వాక్కు, (జిహ్వ), నిలైయాన అడిమై = స్థిరమైన కైంకర్యాన్ని, నిచ్చలుమ్ ముత్తె శెయ్య = ఎల్లప్పుడు శేషత్వ పారతంత్ర్యాలకు అనుగుణంగా చేయడంకోసం, కై వేణ్డుమ్ = చేతులు కావాలి.

ఉత్తమాంగాన్ని నిర్దేశించే **"తలై"** అనే పదం ఇక్కడ ఉత్తముడనే అర్థాన్ని లక్షణయా ఇస్తుంది. **"వడివు"** – శరీరాన్ని నిర్దేశించే ఈ పదం ప్రత్యంగశోభ అయిన సౌందర్యాన్ని లక్షిస్తుంది. తాము త్రికరణాత్మకమైన కైంకర్యాన్ని యతిరాజులకు చేయగల్గడం వరవరమునుల కరుణ ఉన్నప్పుడే సాధ్యం కనుక, అందుకోసం వారి అనుగ్రహాన్ని కవి ఇక్కడ ప్రార్థిస్తున్నారు. **"కై"** – అనే పదం ఇక్కడ సర్వాంగాలకు ఉపలక్షణం. **"నిచ్చలుమ్"** నిత్యశబ్దభవం. దీనిని **"నినైక్క"**, **"విళ్ళుఙ్గియిడ"**, **"శెయ్య"** అనే మూడు క్రియలలోను అన్వయించడం సరసం.

మిక్కిలి ఉన్నతం అయిన భగవద్రామానుజుల తిరుమేని సౌందర్యాన్ని తలచే మనస్సు, విలువ కట్ట వీలు లేనివారి గుణాలను పలికే వాక్కు, ఎప్పుడూ శాశ్వతమైన కైంకర్యాన్ని చేసే హస్తాలు నాకు కావాలి. తిరువాయ్‌మొళ్ళిప్పిళ్ళై అనుగ్రహాన్ని పొందిన మణవాళమహామునీ! మీరు వాటిని నాకు అనుగ్రహించండి.

5. మునియేఱామ్ ఎతిరాశన్ ముళ్ళు త్తకవాల్ ముప్పదత్తిన్
ఇనియ పొరుళ్ నిలై వేణ్డి ఇన్బముడన్ అవనడియిల్
కునియు మెవరుమ్ మది యద్వైయ క్కరుతు మణవాళముని
తనియరుళే నినైన్దడియేన్ తారణియిల్ మకిళ్ళ్‌వేనే

ముని ఏఱామ్ = మునివృషభులైన, ఎతిరాశర్ = యతిరాజులయొక్క, ముళ్ళు = పూర్ణమైన, తకవాల్ = కరుణతో, ముప్పదత్తిన్ = అష్టాక్షరిలోని మూడు పదాలలోని (స్వరూప–ఉపాయ–పురుషార్థరూపమైన) ఇనియ పొరుళ్ = మధురమైన అర్థంలో, నిలై వేణ్డి = నిలకడగా ఉండాలని కోటి, ఇన్బముడన్ = ఆనందంతో, అవన్ అడియిల్ = వారి శ్రీపాదాలలో, కునియుమ్ ఎవరుమ్ = వంగి నమస్కరించేవారంతా మది అద్వైయ= మంచి జ్ఞానాన్ని కల్గి ఉండాలని, కరుతుమ్ = భావించే, మణవాళమాముని తని అరుళే = శ్రీవరవరమునుల అద్వితీయమైన కరుణనే, నినైన్దు= తలచి, అడియేన్ = దాసుణ్ణి అయిన నేను, తారణియిల్ = భూమిలో, మకిళ్ళ్‌వేన్ = ఆనందిస్తాను.

"తకవు" – దయ అని చూడామణి నిఘంటువు. **"తత్తువ మన్ఱు త్తకవన్ఱు"** అనే తిరుప్పావై సూక్తి స్మరణీయం. **"ముప్పదత్తిన్ ఇనియ పొరుళ్"** – తిరుమంత్రంలోని ప్రణవం – నమస్సు – నారాయణాయ అనే పదాలు మూడింటిచే ప్రతిపాదింపబడే అర్థాలు– భగవదనన్యార్హశేషత్వం, అనన్యశరణత్వం, అనన్య భోగ్యత్వం. ఇవి మధురంగా ఉండడం అంటే చరమపర్వ పర్యంతం అనుసంధించి, అనుష్ఠించడమే. ఇటువంటి అపూర్వమైన చరమపర్వనిష్ఠ స్థిరంగా నిలవాలంటే అది మణవాళ మహామునుల అనుగ్రహంవల్లనే సాధ్యం కనుక, అందుకోసం వారి కరుణను కవి ప్రార్థిస్తున్నారు. **"మునియేఱు"** – ముని వృషభులని అర్థం. సంస్కృతంలోని వృషభ శబ్దంవలె ద్రావిడం లోని **"ఏఱు"** (ఎద్దు) అనే శబ్దంకూడా ఉత్తమార్థకం.

మునివృషభులైన భగవద్రామానుజుల పూర్ణమైన కరుణతో అష్టాక్షరిలోని మూడు పదాలయొక్క మధురార్థం నిలకడగా ఉండాలని కోఱి, వారి శ్రీపాదాల్లో భక్తితో సేవించే అందరూ మంచి జ్ఞానాన్ని పొందాలని తలచే మణవాళ మహామునుల కరుణనే భావించి దాసుడనైన నేను ఈ లోకంలో ఆనందిస్తాను.

6. మకిழ్ మాఱన్ అడి శూడుమ్ ఎతిరాశన్ మలరడియిన్
నికழ్ కాదఱ్కు ఇడైచ్చువరై నీక్కి అరుళ్ ఎన్ఱిరన్ఱు
మకిழు మన మణవాళమామునివన్ కుణఙ్గళైయే
పుకழాద పులవర్కళ్ ఇప్పూమిక్కోర్ పెరుఙ్జుమైయే

మకిழ் మాఱన్ = వకుళమాలికను నిరూపకంగా కల నమ్మాழ్వార్ల, అడి శూడుమ్ = శ్రీచరణాలను (శిరస్సుకు ఆభరణంగా) అలంకరించుకొనే, ఎతిరాశన్ = యతిరాజుల, మలర్ అడియిన్ = పద్మాలవంటి శ్రీ చరణాలలో, నికழ் = కలిగిన, కాదఱ్కు = భక్తికి (ఏర్పడే), ఇడై చ్చువరై = ఆటంకాలను, నీక్కి = తొలగించి, అరుళ్= అనుగ్రహించండి, ఎన్ఱు ఇరన్ఱు = అని వేడి, మకిழుమ్ = ఆనందించే, మనమ్ = మనస్సును కల, మణవాళ మామునివన్ = మణవాళ మహామునుల, కుణఙ్గళై = కల్యాణగుణాలను, పుకழాద = కీర్తించని, పులవర్కళ్ = పండితులు (కవులు) ఇప్పూమిక్కు = ఈ భూమికి, ఓర్ పెరుమ్ శుమైయే = గొప్ప భారమే.

వకుళమాలికను అలంకరించుకొన్న నమ్మాழ్వార్ల శ్రీపాదాలను ఆభరణంగా ధరించే శ్రీరామానుజుల శ్రీపాదాల్లో ఏర్పడే భక్తికి అవరోధాలను తొలగించి, అనుగ్రహించాలి – అని ఆ శ్రీరామానుజులవద్దనే ప్రార్థించి, ఆనందించే మణవాళ మహామునుల కల్యాణగుణాలను కీర్తించని కవులు ఈ భూమికి గొప్ప భారమే కాగలరు. పాపిష్ఠివారిని భూమి తనకు భారంగా భావిస్తుంది. కనుక, శ్రీవరవరమునుల కల్యాణగుణాలను కీర్తించని వారు పాపిష్ఠివారని తాత్పర్యం.

**7. మైన్దన్ ఎతిరాశనరుళ్ మన్న మిక నైచ్చియత్తై
ఐన్దాఱు కవికళినాల్ ఆర్త్త మణవాళముని
పైన్దామరై అడియై ప్పరవుమవర్ తాళిణైక్కే
నైన్దురుకుమ్ ఎన్ నెఞ్జమ్ నైయాదు పిఱరుక్కే**

మైన్దన్ = బలిమిని కల, ఎతిరాశన్ = యతిరాజులయొక్క, అరుళ్ = కరుణ, మన్న = స్థిరంగా నిలవడంకోసం, మిక నైచ్చియత్తై = అత్యంతనైచ్యాన్ని, ఐన్దు ఆఱు కవికళినాల్ = అయిదాఱు (పలు) శ్లోకాలలో, (ఆర్తి ప్రబంధంలో, యతిరాజవింశతిలో), ఆర్త్త = విస్తరించిన (మార్గమైన), మణవాళముని = మణవాళమామునులయొక్క, పైన్దామరై అడియై= అందమైన తామరలవంటి శ్రీచరణాలను, పరవుమవర్ = సేవించేవారి, తాళ్ ఇణైక్కే= పాదయుగ్మం విషయంలోనే, ఎన్ నెఞ్జమ్ = నా మనస్సు, నైన్దు ఉరుకుమ్ = భావించి శ్రమించి, ద్రవిస్తుంది. పిఱరుక్కు = ఇతరులకోసం, నైయాతు = శ్రమించదు.

"మైన్దన్" - ప్రకృష్టవిజ్ఞానబలైకధామని" అయిన ఆదిశేషుల అవతారరూపులైన భగవద్రామానుజులను **"మైన్దన్"** అని నిర్దేశించడం యుక్తం. **"నైచ్చియత్తై"** - ఇది నైచ్యమనే సంస్కృతశబ్దవికృతి. **"ఐన్దాఱు"** - అయిదు, ఆఱు అని అర్థం కాదు. కొన్ని అని తాత్పర్యం. **"నినైన్దు నైన్దు ఉళ్ కరైన్దురుకి" (తిరువాయ్‌మొழி)** ఇత్యాది పాశురార్థం చరమపర్వవిషయంలో ప్రకృతంలో అనుసంధింపబడింది.

బలిమిని కల్గిన శ్రీరామానుజుల దయను పొందడంకోసం తమ నైచ్యాన్ని పలు పాశురాలతో (యతిరాజవింశతి, ఆర్తిప్రబంధాలలో) అనుగ్రహించిన మణవాళ మహామునుల పాదపద్మాలను సేవించే దాసుల శ్రీపాదాలనే నా మనస్సు భావించి, శ్రమించి, ద్రవిస్తుంది. ఇతరుల విషయంలో ద్రవించదు.

**8. అరుక్కన్ కులదెయ్వ వణి అరఙ్గన్ వరఙ్కొణ్డు
శెరుక్కడిత్త ఎతిరాశన్ తిరువరుళే అరణాక
ఇరుక్కు మణవాళముని ఇణైయడియే ఇణైఇఞ్జుమవర్
తిరుక్కమల త్తాళిణైయే తిత్తిక్కుమ్ అడియేఱ్కే**

అరుక్కన్ కుల దెయ్వ = సూర్యకులానికి దైవం అయిన, అణి అరఙ్గన్ = అందమైన శ్రీరంగనాథునివద్దనుండి, వరమ్ కొణ్డు = వరాన్ని పొంది (దానివల్ల), శెరుక్కు + అడిత్త = (సాత్త్విక) గర్వాన్ని పొందిన, ఎతిరాశన్ = యతిరాజుల, తిరు అరుళే = భవ్యమైన కరుణే, అరణ్ ఆక = రక్షణగా, ఇరుక్కుమ్ = తలచి నిర్భయనిర్భరులై

ఉండే, మణవాళముని = మణవాళమహామునుల, ఇణై = అందమైన, పరస్పరసదృశం అయిన పద్మాలవంటి పాదద్వయి, అడియేఱ్కు = దాసుణ్ణి అయిన నాకు, తిత్తిక్కుమ్ = మధురంగా ఉంటుంది. (**"లబ్ధ్వా కులధనం రాజా"** అని శ్రీరామాయణంలో శ్రీరంగ నాథుడు సూర్యకులదైవంగా చెప్పబడ్డాడు.)

ఒక పంగునిమాసం ఉత్తరానక్షత్రంనాడు శ్రీరంగంలో దివ్యదంపతుల సమక్షంలో శ్రీరామానుజులు వరాన్ని పొందిన వృత్తాంతం సంప్రదాయంలో సుప్రసిద్ధం. భగవద్రామానుజుల సంబంధాన్ని పొందినవారికి అందరికీ మోక్షాన్ని ప్రసాదిస్తానని శ్రీరంగనాథుడిచ్చిన వరంవల్ల శ్రీమణవాళమహామునులు ఇక తమకు శ్రీరామానుజులతో గల పరంపరాసంబంధవల్ల పరమపదప్రాప్తి తథ్యమనే నైర్భర్యాన్ని పొందారు. **"అరుక్కన్"**– అర్కశబ్దభవం. రజోగుణతమోగుణమూలకం అయిన గర్వం త్యాజ్యం కాని, **"అభిమాన తుఙ్గన్ శెల్వన్"** అన్నట్లు సాత్త్వికమైన గర్వం ఉపాదేయమే. అందువల్ల **"శెరుక్కడిత్త ఎతిరాశన్"** అని అనబడింది.

సూర్యకులదైవం అయిన శ్రీరంగనాథునివద్ద వరాన్ని పొంది, దానివల్ల సాత్త్విక గర్వంతో ప్రకాశించే యతిరాజుల కరుణనే రక్షకంగా కల్గిన మణవాళమహామునుల శ్రీపాదాలను సేవించే దాసుల పాదపద్మాలే దాసుడనైన నాకు రుచిస్తాయి.

9. ఏఱ్కుమ్ ఎతిరాశనుడై ఎழிల్పదత్తిన్ శేవైతనై
చ్చీర్ త్తిరువాయ్మొழிప్పిళ్ళై శెழுన్దకవాల్ తన్దదనై
మేఱ్కిళర అరుళెన్ఱు మేవుమ్ మణవాళమాముని
ఆర్క్కరుళుమ్ అడియేనుక్కు అల్లదు నీర్ శొల్లీరే

ఏఱ్కుమ్ = తగిన కీర్తిని కల, ఎతిరాశనుడై = యతిరాజుల, ఎழிల్ పదత్తిన్ = ప్రకాశించే శ్రీచరణాలలో, శేవైతనై = సేవను, శెழுమ్ తకవాల్ = తమ అందమైన కరుణతో, తన్దు = అనుగ్రహించి, అతనై = ఆ కైంకర్యాన్ని, మేల్ కిళర = ఇంకా ఇంకా పైకి వృద్ధి చెందేటట్లుగా, అరుళ్ = అనుగ్రహించండి, ఎన్ఱు = అని, శీర్ తిరువాయ్మొழி ప్పిళ్ళై = కల్యాణగుణాలను కల తిరువాయ్మొழிప్పిళ్ళైను, మేవుమ్ = ప్రార్థించే, మణవాళమాముని = వరవరమునులు, అడియేనుక్కు అల్లతు = దాసుడనైన నాకు తప్ప, ఆర్క్కు అరుళుమ్ = ఇంక ఎవరికి అనుగ్రహిస్తారు? నీర్ శొల్లీరే = మీరే చెప్పండి.

"ఏఱ్కుమ్" – **"ఏఱ్కుమ్ పెరుమ్ పుకழ் వానవరీశన్"** ఇత్యాది తిరువాయ్మొழி సూక్తి భావ్యం. **"శ్రీమన్! యతీంద్ర! తవ దివ్యపదాబ్జసేవాం, శ్రీశైలనాథకరుణా పరిణామదత్తామ్"** అనే యతిరాజవింశతి సూక్తి పాశురార్థానికి అనుగుణంగా స్మరణీయం.

తిరువాయ్మొఴ్రిప్పిళ్ళై అనుగ్రహంవల్ల పొందిన, తగిన కీర్తిని కల యతిరాజుల అందమైన శ్రీపాదాలలోని కైంకర్యం మరింతగా వృద్ధిజెందాలని (ఆర్తి ప్రబంధంలో) ప్రార్థించే మణవాళమహామునులు దాసుడనైన నన్ను తప్ప వేఱెవరిని అనుగ్రహిస్తారో మీరే చెప్పండి.

10. ఈరేఴ్రు పువనత్తార్ ఇఱైఞ్జు పుకఴ్ ఎతిరాశన్
శీరేర్ఱ నన్దియలుమ్ శెమ్మైయినాల్ అరుళ్ శూడి
నీరేర్ఱమ్ ఇల్లామల్ తికఴ్రుమ్ మణవాళమాముని
పారేత్తు పెరుమ్ పుకఴ్రై ప్పాడి మనమ్ కళిత్తేనే

ఈర్ ఏఴ్రు పువనత్తార్ = పదు నాల్గు లోకాలలోనివారు, ఇఱైఞ్జుమ్ = ప్రార్థించే, పుకఴ్ = కీర్తిని కల, ఎతిరాశన్ = యతిరాజుల, శీర్ ఏర్ఱమ్ = కళ్యాణగుణాల ఆధిక్యంయొక్క, నన్దియలుమ్ = చక్కని స్వభావంయొక్క, శెమ్మైయినాల్ = ఋజుత్వంవల్ల, అరుళ్ శూడి = కరుణను పొంది, నీర్ ఏర్ఱమ్ ఇల్లామల్ = సాటిలేనివారు, మించినవారు లేకుండా, తికఴ్రుమ్ = ప్రకాశించే, మణవాళ మా ముని = శ్రీవరవరమునుల, పార్ ఏత్తు = భూమిలోని జనులంతా కీర్తించే, పెరుమ్ పుకఴ్రై = గొప్ప కీర్తిని, పాడి = పొగడి, మనమ్ = మనస్సులో, కళిత్తేనే = గర్వించాను (ఆనందించాను)

"నీరేర్ఱమ్" – నిస్సమాభ్యధికం – అని అర్థం. **"న తత్ సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే," "ఒత్తార్ మిక్కారై ఇలైయాయ"** ఇత్యాది సూక్తుల అర్థాలు ఇక్కడ శ్రీ వరవరమునుల విషయంలో అనుసంధింపబడ్డాయి. **"నీరేర్ఱమ్"** – గర్వం అని కూడా అనిఅర్థం. **"పార్ ఏత్తు"** – భూమి అని అర్థమిచ్చే **"పార్"** అనే పదం ఇక్కడ భూమిలోని జనులను లక్షిస్తుంది.

పదునాల్గు లోకాల్లో ఉన్నవారు అందఱు పొగడే కీర్తిని కల యతిరాజులయొక్క చక్కని స్వభావంతో ఉపకరించే కల్యాణగుణాలవల్ల అనుగ్రహాన్నిపొంది, నిస్సమాభ్యధికులై వర్ధిల్లే మణవాణమహామునుల, భూలోకంలోని వారంతా కీర్తించే, గొప్ప కీర్తిని పాడి నేను మనస్సులో ఎంతో సంతోషించాను.

11. తేనమరు పూమ్బొఴ్రిల్ శూఴ్ తిరుక్కచ్చినకర్ ప్పొయ్కై
ప్పూనదువిల్ ఉదిత్త ముని పుకఴ్ పాడు ఎతిరాశన్
మానిలవిల్ వాయ్ మదుక్కుమ్ మణవాళమామునివన్
ఞాన వొళిక్కలై యల్లాల్ నామ్ ఎన్నుమ్ ఓదోమే

తేన్ అమర్ = తేనె నిండుగా ఉండే, పూమ్ పొఱ్ఱిల్ = పూల తోటలచేత, శూழ் = పరివేష్ఠితం అయిన, తిరు కచ్చి నకర్ = అందమైన, కాంచీనగరంలోని, పొయ్కై = సరస్సులో పూచిన, పూ నడువిల్ = తామర పూవు మధ్యభాగంలో, ఉదిత్త = అవతరించిన, ముని = సరోయోగియొక్క, పుకழ் పాడుమ్ = కీర్తిని పాడే, ఎతిరాశన్ = యతిరాజులు (అనే చంద్రుని), మా నిలవిల్ = గొప్ప వెన్నెలలో, వాయ్ మదుక్కుమ్ = జిహ్వను మడిచే (ఆస్వాదించే) (పొగడే), మణవాళ మామునివన్ = మణవాళమహా మునులయొక్క, ఞాన ఒళి = జ్ఞానప్రకాశాన్ని కల్గించే, కలై అల్లాల్ = శాస్త్రరూపాలైన సూక్తులను తప్ప, నామ్ = మేము, ఒన్ఱుమ్ = ఇక దేనినీ, ఓదోమ్ = అభ్యసించము.

ఇరామానుశ నూఱ్ఱన్దాదిలోని **"వరుత్తుమ్ పుఱ ఇరుళ్ మాఱ్ఱ"** అనే పాశురార్థం ఇక్కడ స్మరణీయం. ఈ పాశురంనుండి వరుసగా ఆழ்వార్ల పరంపరను సేవించే భగవద్రామానుజులు, వారిని సేవించే వరవరమునులు కీర్తింపబడుతున్నారు. **"ఎతిరాశన్ మానిలవిల్"** యతిరాజుల చంద్రికలో– అని అర్థం. దీనివల్ల యతిరాజులను చంద్రునిగా రూపించడం ధ్వనిస్తుంది. వెన్నెలగా కీర్తి రూపింపబడినది. **"యతిరాజచంద్ర మపరాగదూరగమ్"** అనే యతిరాజసప్తతి సూక్తి దీనికనుగుణంగా స్మరణీయం. **"కలై"** – శాస్త్రం, శ్రీవరవరమునుల వాక్కులు **"వేదశాస్త్రరథారూఢాః జ్ఞానఖడ్గధరా ద్విజాః, క్రీడార్థ మపి యద్బ్రూయుః స ధర్మో వేద"** అన్నట్లు శాస్త్రరూపాలు, అవి జ్ఞానదీప్తిని కల్గించేవి. వాటిని తప్ప ఇక దేనినీ అభ్యసించనక్కరలేదని భావం. **"మానిలవిల్ వాయ్ మదుక్కుమ్ మణవాళమామునివన్"** – అనే ప్రయోగంద్వారా వరవరమునుల చకోరసామ్యం స్ఫురిస్తున్నది. **"తేనమరు పూమ్బొழிల్ శూழ் తిరుక్కచ్చినకర్"** – **"కైతైశేర్ పూమ్బొழிల్శూழ் కచ్చినకర్"** అనే ముదల్ తిరువన్దాది తనియన్ పాశుర ప్రయోగం స్మరణీయం.

మధువు నిండుగా ఉండే పూల దోటలచేత చుట్టబడిన కాంచీనగరంలోని ఒక సరస్సులో పూచిన ఒక తామరపూవులో అవతరించిన పొయ్కైయాழ்వార్ కీర్తిని పాడే యతిరాజుల చంద్రుని వంటి తిరుముఖమండలాన్ని పొగడే మణవాళ మామునుల, జ్ఞానప్రకాశాన్ని కల్గించే శాస్త్రాలైన వాక్కులను తప్ప మేము వేఱు దేనినీ అభ్యసించము.

12. ఓద క్కడల్మల్లై ఒళి శూழ் వన్దుదిత్త
పూదత్తార్ ఇయలోదుమ్ పూదూరిన్ మామునివన్
పాదత్తై ప్పలకాలుమ్ పరవు మణవాళముని
కోదఱ్ఱ తెన్ మొழிయై క్కొణ్డాడి క్కూఱుదుమే

ఓదమ్ కడల్ = పైకి ఎగసిపడే కెరటాలను కల సముద్రతీరంలోని, కడల్ మల్లై = తిరుక్కడల్ మల్లై అనే దివ్యక్షేత్రంలో, ఒళి శూழ் = కాంతి వ్యాపించేటట్లుగా (ప్రసిద్ధం

అయేటట్లుగా), వన్దుదిత్త = అవతరించిన, పూదత్తార్ = పూదత్తాళ్వార్లు అనుగ్రహించిన ఇయల్ = ఇయల్ రూపంలోని ఇరణ్డామ్ తిరువన్దాదిని, ఓదుమ్ = అభ్యసించే, పూదూరిన్ = శ్రీపెరుమ్బూదూర్‌లోని, మా మునివన్ = గొప్ప ముని అయిన శ్రీరామానుజుల, పాదత్తై = శ్రీచరణాలను, పల కాలుమ్ = పలు మార్లు, పరవుమ్ = కీర్తించే, మణవాళ మాముని = శ్రీవరవరమునుల, కోదు అఱ్ఱ = నిర్దుష్టమైన, పూర్ణంగా సారవంతమైన, తెన్ = తీయని అందమైన, మొழிయై = సూక్తులను (గ్రంథాలను), కొణ్డాడి కూఱుదుమే = కీర్తిస్తూ పల్కుదాం.

"కడల్ మల్లై ఒళి శూழ்" – తిరుక్కడల్ మల్లైలో కాంతి పరివేష్ఠితం కావడం అంటే – ఆ క్షేత్రం వారి అవతారంవల్ల సుప్రసిద్ధం కావడమే. **"కోదు" –** అసారం, దోషం. **"కోదఱ్ఱ" "పొయ్యిలాద మణవాళమాముని పుగ్ది వాழி"** అనే వాழிత్తిరునామ సూక్తి స్మరణీయం. ఏ దోషం లోకపోవడమే కాదు, అది **"తెన్ మొழி"**– అంటే అర్థంలో తేనెవలె మధురమైనది. **"తెన్"** – ఈపదం తమిళంలో దక్షిణదిక్కును, తేనెను, అందాన్ని తెలుపుతుంది. **"తెన్ పుతువై"** ఇత్యాదులలో అందమైన అనే అర్థాన్ని, **"తెన్‌పాల్"** ఇత్యాదులలో దక్షిణదిక్కులో ప్రచురంగా ఉండే ద్రావిడభాషను తెల్పుతుంది. ఇవే, కాక బలిమి అనే అర్థాన్నికూడా ఈపదం ఇస్తుందని కొన్ని నిఘంటువులలో చూపబడింది. తేవారమ్ వంటి గ్రంథాలలో ప్రయోగింపబడింది. అపుడు, శ్రీవరవరమునుల సూక్తి వైలక్షణ్యాన్ని ప్రకృతప్రయోగం తెలుపుతుందని చెప్పవచ్చు. **"ఇతైవనై క్కాణుమ్"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది పాశురానుకరణం ఈ పాశురం.

అలలు ఎగసిపడే తిరుక్కడల్ మల్లై ప్రకాశించేటట్లుగా ఈ లోకానికి వచ్చి అవతరించిన పూదత్తాళ్వార్లు అనుగ్రహించిన దివ్యప్రబంధాన్ని అభ్యసించే శ్రీరామానుజుల పాదాన్ని పలుమార్లు సేవించేవారైన మణవాళమామునియొక్క, దోషరహితం అయిన ద్రావిడగ్రంథాలను పొగడుతూ పలుకుదాము.

13. కూఱియ శీర్ మయిలైయార్‌కోన్ మణఙ్గొళ్ళుమ్ ఎతిరాశన్
మాఱిలడి వణఙ్గి మకిழ் మణవాళ మామునివన్
వీఱుడైయ మెయ్మ్మొழிయై విరుమ్బి యరుమ్ పొరుళనైత్తుమ్
తేఱుమవర్ ఎఙ్ఙానుమ్ త్తేశికరాయ్ త్తికழ்వారే

కూఱియ = పురాణాదులలో కీర్తింపబడ్డ, శీర్ = గొప్పతనాన్ని కల, మయిలై యార్ = మయిలాపురిలో ఉండేవారికి నాథులైన పేయాళ్వార్ల, కుణమ్ కొళ్ళుమ్ = కల్యాణగుణాలను గ్రహించే (కీర్తించే), ఎతిరాశర్ = యతిరాజుల, మాఱు ఇల్ = సాటి లేని, అడి వణఙ్గి = శ్రీచరణాలను నమస్కరించి, మకిழ் = ఆనందించే, మణవాళ మా

మునివన్ = మణవాళమహాములు, వీఱుడైయ = వైలక్షణ్యాన్ని కల, మెయ్ మొళ్ళియై = సత్యమైన సూక్తులను, విరుమ్బి = ఆశపడి ఆదరించి, అరుమ్ పొరుళ్ అనైత్తుమ్ = అరుదైన తత్త్వార్థాలను అన్నిటినీ, తేఱుమవర్ = స్ఫుటంగా తెలిసేవారు, ఎజ్ఞాన్టుమ్ = ఏనాటికి అయినా, తేశికరాయ్ = సదాచార్యులై, తికళ్ళ్వారే = ప్రకాశిస్తారు.

"కూఱియ శీర్" – పురాణాలలో ప్రసిద్ధంగా వర్ణింపబడే–అని భావం. దీనిని " **"మయిలైయార్కోన్"** అనేదానికి విశేషణంగా కూడా అన్వయించవచ్చు. అపుడు పేయాళ్ళ్వార్ల గొప్పతనం చెప్పబడుతుంది. **"మణవాళ మామునివన్ వీఱుడైయ మెయ్మొళ్ళి"** – **"పొయ్యిలాద మణవాళ మాముని"** అనే సూక్తి స్మరణీయం. **"అరుమ్ పొరుళ్"** చరమపర్వనిష్ఠారూపమైన అరుదైన అర్థమని చెప్పవచ్చు. భగవానుడే ప్రాప్యప్రాపకభూతుడనే నమ్మిక కలుగవచ్చు. కాని, ఆచార్యుడే ప్రాప్యప్రాపకభూతుడనే విశ్వాసం కల్గడం అరుదుకదా! **"శిఱు మామనిశరాయ్ ఎన్నై యాణ్డార్ ఇజ్గే తిరియవే"** అని అంటూ అటువంటివారిని **"శిఱు మామనిశర్"** గా భావించడం చాలా అరుదు. **"మన్నియ పేరిరుళ్ మాణ్డపిన్"** అనే ఇరామానుశ నూఱ్ఱన్దాది పాశురభావం ప్రకృత పాశుర భావానుగుణంగా స్మరణీయం.

కీర్తింపబడే మయిలాపురిలో అవతరించిన పేయాళ్ళ్వార్ల గొప్ప కల్యాణగుణాలను పొగడే యతిరాజుల సాటి లేని మేటి శ్రీపాదాలను నమస్కరించి, ఆనందించే మణవాళమామునుల తిరువాక్కులలో ఆసక్తిని పొంది, వాటి యాథార్థ్యాన్ని అంతటినీ తెలియగలవారు ఎప్పటికీ గొప్ప ఆచార్యులుగా ప్రకాశిస్తారు.

14. వార్ పునల్ శూళ్ మామళ్ళిశై వాళ్వెయ్‌ద వరుజ్జోతి
శీర్ పుకళుమ్ ఎతిరాశన్ శీల మెల్లామ్ కుడైన్దాడుమ్
ఓర్ పునిదన్ మణవాళయోగి శెయు ములకారియన్
ఓర్ పనువల్ వియాక్కియైయై ఎణ్ణు మవర్క్కు ఏదరిదే

వార్ = ప్రవహించే, పునల్ = స్వచ్ఛజలంచేత, శూళ్ = చుట్టబడిఉండే, మా = గొప్పదైన, మళ్ళిశై = తిరుమళ్ళిశై అనే దివ్యక్షేత్రం, వాళ్వు ఎయ్‌ద = ఉజ్జీవించిన (ఆ క్షేత్రం ఉజ్జీవించేటట్లు అవతరించిన), అరుమ్ శోది = అప్రాకృతజ్యోతిస్స్వరూపులైన తిరుమళ్ళిశై ఆళ్ళ్వార్ల, శీర్ పుకళుమ్ = కల్యాణగుణాలను పొగడే, ఎతిరాశన్ = యతిరాజుల, శీలమ్ ఎల్లామ్ = స్వభావాన్ని (శీలగుణాన్ని) అంతటినీ, కుడైన్దు ఆడుమ్= అవగాహించే, ఓర్ పునితన్ = సాటి లేని పవిత్రమూర్తి అయిన, మణవాళ యోకి = మణవాళమామునులు, శెయుమ్ = అనుగ్రహించే, ఉలకారియన్ ఓర్ పనువల్ వియాక్కియైయై = శ్రీపిళ్ళైలోకాచార్యులవారి అద్వితీయాలైన రహస్యగ్రంథాల వ్యాఖ్యలను, ఎణ్ణుమవర్క్కు = మననం చేసే వారికి, ఏతు అరితు = ఏది అసాధ్యం?

శ్రీ పిళ్ళైలోకాచార్యులవారి రహస్యగ్రంథాలలో తత్త్వత్రయం, ముముక్షుప్పడి, శ్రీవచనభూషణాలనే మూడింటికి శ్రీవరవరమునులు అనుగ్రహించిన వ్యాఖ్యలను అనుసంధించేవారికి తత్త్వయాథాత్మ్యం స్ఫుటంగా తెలుస్తుంది, వారికి ఏ దోషం ఉండదు- అని కూడా చెప్పవచ్చు. **"ఏతు"** - దోషం. **"ఏతమిల్ పన్నీరాయిరమ్"** అనే ప్రయోగం భావ్యం. **"ఏతిలాత కళ్ళకమ్"** అనే అవ్వైయార్ (కందపురాణం) ప్రయోగం గ్రహ్యం. **"శీల మెల్లామ్ కుడైన్దాదుమ్"** - ఈ సూక్తివల్ల శ్రీవరవరమునులుకూడా ఆళ్వార్లవంటి వారని ధ్వనిస్తుంది. ఆళ్వార్లు భగవద్గుణావగాహనం చేయగా, వీరు యతిరాజుల కల్యాణగుణాబ్ధిలో అవగాహించారు. అందువల్ల **"ఓర్ పునితన్"**- అద్వితీయులైన పవిత్రులయ్యారనే కార్యకారణరూపమైన స్వారస్యాన్నికూడా ఇక్కడ చెప్పవచ్చు. **"ఇడమ్ కొణ్డ కీర్త్తి"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది పాశురార్థం ప్రకృతంలో స్మరణీయం.

ప్రవహించే స్వచ్ఛజలంచేత చుట్టబడి ఉండే తిరుమళ్శై అనే దివ్యస్థలం వర్ధిల్లేటట్లు అవతరించిన తిరుమళ్శై ఆళ్వార్ల గుణాలను పొగడే యతిరాజుల సౌలభ్యం మొదలైనగుణాలలో మునిగి, నర్తించే సాటి లేని పవిత్రులైన మణవాళ మహామునులు శ్రీపిళ్ళైలోకాచార్యులవారి అందమైన గ్రంథాలకు అనుగ్రహించిన వ్యాఖ్యానాలను భావించేవారికి ఏదీ అసాధ్యం కాదు.

15. అరి దేవన్ అల్లాదార్ అవనురు వెన్ఱు ఉరై క్కురుకా-
పురి దేశికన్ పాదమ్ పుకళ్ళుమ్ ఎతిశేకరన్ తన్
శరితై నినైన్దు ఉళ్ళురుకుమ్ శాల మణవాళముని
శౌరి తేఱల్ కలై నుకరుమ్ శోమ్బరుక్కు ప్పశి యేతే

అరి = శ్రీహరి, దేవన్ = దేవుడు, (పరతత్త్వం), అల్లాతార్ = మిగిలినవారు, అవన్ ఉరువు = ఆ స్వామికి శరీరభూతులు, ఎన్ఱు = అని, ఉరై = పలికే, కురుకాపురి తేశికన్ = కురుకాపురికి అధిపతులైన నమ్మాళ్వార్ల, పాదమ్ = శ్రీచరణాలను, పుకళ్ళుమ్= కీర్తించే, ఎతి శేకరన్ తన్ = యతిరాజుల, శరితై = చరిత్రను, నినైన్దు = భావించి, ఉళ్ ఉరుకుమ్ = మనస్సులో ద్రవించే, మణవాళమాముని = మణవాళ మామునుల, శాల తేఱల్ శౌరి = మిక్కిలిగా మధువును స్రవించే (పరమభోగ్యాలైన), కలై = గ్రంథాలనే, నుకరుమ్ = ఆస్వాదించే, శోమ్బరుక్కు = సోమరులకు, పశి ఏదు = ఆకలి ఏది ? (ఏ కోరిక ఉండదు)

విశిష్టాద్వైతసిద్ధాంతానికి ప్రధానప్రతితంత్రార్థం అయిన, శ్రీమన్నారాయణుడే శరీరి, చిదచిత్తులు అన్నీ అతనికి శరీరాలు, అతడొక్కడే పరమాత్మ, మిగిలినవారంతా ఆ స్వామికి శరీరభూతులనే తత్త్వార్థం ఇక్కడ ప్రస్తావింపబడింది. శ్రీశఠకోపులు తమ ప్రబంధాలలో

పలు చోట్ల ఈ సిద్ధాంతాన్ని తెలియజేసినందున **"అరి దేవన్, అల్లాతార్ అవనురు వెన్షు ఉరై క్కురుకాపురితేశికన్"** అని అనబడింది. **"నుకరుమ్" - "కవియముతమ్ నుకర్చ్చియుఱుమో"** అని తిరువాయ్మొழி (8-10-5) ప్రయోగం. పానం చేయడమనే అర్థాన్నిచ్చే **"నుకరుమ్"** అనే పదస్వారస్యాన్నిబట్టి వరవరముని శ్రీసూక్తుల అమృతరసస్యం దిత్వం ధ్వనిస్తున్నది. అమృతపానం చేసేవారికి ఆకలి ఉండనట్లే, ఇక దేనినీ పానం చేయాలనే ఆశ లేకుండా ఉండేటట్లే, వరవరమునుల శ్రీసూక్తులనే అమృతాన్ని పానం చేసేవారికి ఇక దేనిమీద ఆసక్తి ఉండదనే అర్థవిశేషం స్ఫురిస్తుంది. **"కాదంబరీ రసజ్ఞానా దాహారోஉపి న రోచతే"** వంటిదే ఈ సూక్తి. దేవశబ్దానికి కల పది విధాలైన అర్థాలు ప్రకృతంలో భావ్యాలు.

"శ్రీమన్నారాయణుడే పరమాత్మ, మిగిలిన దేవతలు అందరూ అతనికి శరీరభూతులు" అని అనుగ్రహించే కురుకాపురీశులైన నమ్మాழ்వార్ల శ్రీపాదాలను తలచి, చాలా ఎక్కువగా మనస్సులో ద్రవించేవారైన మణవాళమహామునుల మధుస్యందినులైన శ్రీసూక్తులను పానం చేసే వారికి ఆకలి అనేది ఉంటుందా ?

16. ఏదేనుమ్ ఆవేన్ నాన్ ఎమ్బెరుమాన్ పొన్మలైమేల్
ఈదే నఙ్కాద లెనుమ్ ఎழிల్ వఙ్జిక్కళత్తిఱైవన్
పా తేఙ్గుమ్ ఎతిరాశన్పదమ్ కరుతు మణవాళ
మాదేశికన్ కలైయే మఱ్ఱుదు మోర్ అముదుణ్డే

ఎమ్బెరుమాన్ పొన్ మలై మేల్ = శ్రీవేంకటేశ్వరుని బంగారుకొండపై, నాన్ ఏతేనుమ్ ఆవేన్ = నేను ఏ వస్తువుగా అయినా కాగలను, ఈదే = ఇదే, నమ్ కాతల్= నా ఆశ, ఎనుమ్ = అని పలికే, ఎழிల్ = ప్రకాశించే, వఙ్జిక్కళత్తు = తిరువఙ్జిక్కళమ్ అనే దివ్యదేశానికి, ఇఱైవన్ = నాయకులైన కులశేఖరాழ்వార్ల, పా = పాశురాలలో, తేఙ్గుమ్ = ఆసక్తులై ఉండే, ఎతిరాశన్ పదమ్ = యతిరాజుల పాదాలను, కరుతుమ్ = ధ్యానించే, మణవాళ మా తేశికన్ = మణవాళమహామునుల, కలైయే = గ్రంథాలే తప్ప, మఱ్ఱుతుమ్ ఓర్ = మిగిలిన ఇంకొక, అముతు ఉణ్డే = అమృతం ఉన్నదా !

కులశేఖరాழ்వార్లు శ్రీ వేంకటాచలంపై ఏ రూపంలోనైనా స్థిరంగా ఉండాలనే తమ ఆశను వ్యక్తం చేసే **"ఊనేఱు శెల్వమ్"** అనే దశకంలో చివరగా 10వపాశురంలో **"ఎమ్బెరుమాన్ పొన్మలైమేల్ ఏతేను మావేనే"** అని అంటూ ఆశపడిన విషయం పాశురం మొదటి పాదంలో ప్రస్తుతం. ఆ కులశేఖరుల పాశురాలలో భగవద్రామానుజులు ఆసక్తులైన విషయం వారు పెరుమాళ్ తిరుమొழிకి అనుగ్రహించిన **"ఇన్నముతమ్ ఊట్టుకేన్"** అనే తనియన్పాశురంద్వారా స్పష్టం. కులశేఖరులసూక్తిని శ్రీరామానుజులు

అమృతంగా భావించగా, ప్రబంధకర్త వరవరమునుల సూక్తులను అద్వితీయమైన అమృతంగా భావిస్తున్నారు. **"కతిక్కు ప్పతరి"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది పాశురభావం ప్రకృతంలో భావ్యం. **"మఱ్ఱుమ్ ఓర్ అముతుణ్డే"** అన్నందువల్ల దేవతల అమృతం అమృతమే కాదని వరవరమునుల సూక్తులే నిజమైన అమృతమనే అర్థం ధ్వనిస్తున్నది. **"తేఙ్గుమ్"** – స్థిరంగా ఉండడం అని అర్థం. **"తేఙ్గుకప్పై త్తిరుముడి చ్చెఙ్కణ్"** (కంబరా-కాట్చి-21) అనే ప్రయోగం స్మరణీయం.

"శ్రీవేంకటేశ్వరుని కొండపై ఏదైనా కాగలను" అని, ఇదే తమ ఆశ అని పలికినవారు, తిరువఞ్జిక్కళమ్‌లో అవతరించినవారు అయిన కులశేఖరుల పాశురాలలో నిమగ్నులైన యతిరాజుల శ్రీపాదాలనే తలచే మణవాళ మహామునులనే మహాచార్యుల శ్రీసూక్తులు తప్ప వేఱొక అమృతం ఉన్నదా !

17. తుణ్డిత్తు ప్పరమపదమ్ తూ నెఱియై త్తాపిత్తు
క్కొణ్డుయ్త్త విల్లిపుత్తూర్‌క్కోన్ కుణన్తేర్ ఎతియరశై
ప్పణ్డుఱ్ఱ మణవాళమామునివన్ పనువల్‌కళిన్
ఒణ్ తత్తువ ప్పొరుళై ఓర్న్దిడువార్ ఉఱఙ్గారే

పరమ పదమ్ = పరమపదమనబడే పవిత్రమైన వైకుంఠాన్ని సైతం, తుణ్డిత్తు = కాదని, తూ నెఱియై = పవిత్రమైన, భగవన్మంగళాశాసనం చేయడమనే మార్గాన్ని, తాపిత్తు క్కొణ్డు = స్థాపించి, ఉయ్త్త = ఉజ్జీవించిన, విల్లి పుత్తూర్ కోన్ = శ్రీవిల్లిపుత్తూర్‌కు నిర్వాహకులైన పెరియాళ్వార్ల, కుణమ్ = కల్యాణగుణాలను, తేర్ = అనుభవించే, ఎతి అరశై = యతిపతులను, పణ్డు = పూర్వం, ఉఱ్ఱ = ఆశ్రయించిన, మణవాళ మామునివన్ పనువల్‌కళిన్ = శ్రీవరవరమునుల కృతులలోని, ఒణ్ తత్తువ పొరుళై = శ్లాఘ్యమైన తత్త్వార్థాలను, ఓర్న్దిడువార్ = తెలిసినవారు, ఉఱఙ్గారే = నిద్రించరు.

"తూనెఱి" – మంగళాశాసనాన్ని చేయడమనే పవిత్రమైన మార్గం. శ్రీరామాయణాది వేదోపబృంహణసిద్ధం కనుక పరమవైదికం, పవిత్రం. **"ఉఱఙ్గారే"** – నిద్రించరు. ఇది లౌకికమైన నిద్ర కాదు. **"అనాదిమాయయా సుప్తః"** అన్నట్లు అనాది అయిన ప్రకృతి సంబంధంవల్ల జ్ఞానసంకోచం కల్గి, అజ్ఞానాంధకారంలో నిద్రించడమే. అటువంటి వారిని జాగృతం చేసేవి శ్రీవరవరమునుల కృతులలోని తత్త్వార్థాలు. **"శోరాత కాతల్"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది పాశురభావం శ్రీవరవరమునుల విషయంలో ఇందులో అనుసంధింపబడింది. **"మణవాళమామునివన్. . . . . . . ఉఱఙ్గారే"** – వరవరమునుల గ్రంథాలలోని తత్త్వార్థాలను తెలిసినవారు నిద్రపోరు అంటే – **"జాగృవాంసః"** అన్నట్లు నిత్యసూరులని తాత్పర్యం. **"నమ్బువార్ పది వైకున్దమ్"** అన్నట్లే ఈ సూక్తి కూడా

పరమపదాన్ని సైతం కాదని, మంగళాశాసనం అనే పవిత్రమైన మార్గాన్ని ప్రతిష్ఠించి, ఉజ్జీవించినవారు, శ్రీ విల్లిపుత్తూర్‌కు నాథులు అయిన పెరియాళ్వార్ల కల్యాణగుణాలను పొగడే యతిరాజులను పూర్వం ఆశ్రయించిన మణవాళమహామునులు అనుగ్రహించిన గ్రంథాల అందమైన తత్త్వార్థాలను తెలిసినవారు నిద్ర పోనేపోరు.

18. కారేఱు కరు ముకిల్‌పోల్ కణ్ వళరుమ్ అరఙ్గేశన్
పారేఱు పుకళ్ పాడి త్తిరుప్పళ్ళి యుణర్‌త్తు మొరు
పోరేఱ్ఱ్రు త్తిరుమణ్డఙ్కుడియిలుఱుమ్ ఎతిరాశన్
శీరేఱు మణవాళ చ్చీయరురై ఓదుమినే

కారేఱు పోల్ = కారెద్దువలె, కరు ముకిల్ పోల్ = నల్లని మేఘంవలె (ఉండే), కణ్ వళరుమ్ = నిద్రించే, అరఙ్గేశన్ = శ్రీరంగనాథునియొక్క, పార్+ఏఱు = భూమిలో వృద్ధి చెందే, పుకళ్ = కళ్యాణగుణాలను, పాడి = కీర్తించి, పళ్ళి ఉణర్‌త్తుమ్ = సుప్రభాతాన్ని పాడే, పోర్ ఏఱ్ఱ్రు = పోటెద్దువంటి తొణ్డరడిప్పొడి ఆళ్వార్ల, తిరుమణ్డఙ్కుడియిల్ = తిరుమణ్డఙ్గుడి అనే దివ్యదేశాన్ని, ఉఱుమ్ = పొందే (ఆశ్రయించే) ఎతిరాశన్ = యతిరాజుల, శీర్ = కల్యాణగుణాలను, ఏఱుమ్ = వృద్ధి చెందే (కీర్తించే), మణవాళ చ్చీయర్ = మణవాళమహామునుల, ఉరై = వ్యాఖ్యానాలను, ఓదుమినే = అభ్యసిస్తాము.

"కారేఱు", **"కరు ముకిల్"** – ఈరెండు శ్రీరంగనాథునకు ఉపమానాలు. తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు తిరుప్పళ్ళి ఎళుచ్చి ప్రబంధంలో శ్రీరంగనాథుని కీర్తిస్తూ సుప్రభాతాన్ని పాడడం రెండవ పాదంలో ప్రస్తుతం. **"కవిఞర్ పోరేఱు"** అని అంటూ పొయ్‌కై ఆళ్వార్లు కవివృషభులుగా కీర్తింపబడినట్లే ఈ ఆళ్వార్లుకూడా **"పోరేఱు"** అని కీర్తింపబడ్డారు. **"శెయ్యుమ్ పశుమ్ తుళవ"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది పాశురార్థం ప్రకృతంలో భావనీయం.

నల్లని మేఘంవలె నిద్రించే శ్రీరంగనాథుని కీర్తిని పాడి, సుప్రభాతాన్ని పాడిన తొణ్డరడిప్పొడి ఆళ్వార్లను తిరుమణ్డఙ్గుడిలో ఆశ్రయించిన యతిరాజుల కల్యాణగుణాలను కీర్తించే గొప్ప కీర్తిని కల మణవాళ మామునుల వ్యాఖ్యలను అభ్యసిస్తాము.

19. ఓదు మొరు మామునియై ఓర్‌న్దు పుకున్దు అరఙ్గనడి
ప్పోదు ముదల్ ముడియళవామ్ పోఱ్ఱియనుమ్ ఉఱైయూరాన్
మీదు ముయల్ ఎతిరాశన్ మణవాళ మామునియాయ్
త్తీదు ముకన్దు అఱియాద తెన్‌మఱైయై వళర్‌త్తానే

ఓదుమ్ = వేదాన్ని అభ్యసించే, ఒరు మా మునియై = ఒక గొప్ప ముని అయిన లోకసారంగమునిని, ఓర్న్దు పుకున్దు = అనుసంధించి (సేవించి), అరఙ్గన్ = శ్రీరంగనాథుని, అడి పోదు ముతల్ = శ్రీచరణపద్మాలనుండి, ముడి అళవుమ్ = కిరీటపర్యంతం, పోఱ్ఱియనుమ్ = కీర్తించినవారు, ఉఱైయూరాన్ మీదు = ఉఱైయూర్ అనే దివ్యదేశంలో అవతరించినవారు అయిన తిరుప్పాణ్ ఆళ్వార్లపై, ముయల్ = ఉత్సాహాన్ని చూపే (భక్తిని చూపే), ఎతిరాశన్ = యతిరాజులే, మణవాళ మాముని యాయ్ = మణవాళ మహామునులుగా, తీదు ముకన్దు అఱియాత = దోషం వాసన చూడని (ఏ దోషంలేని), తెన్ మఱైయై = ద్రావిడప్రబంధాలను, వళర్త్తానే = వర్ధిల్లజేశారు.

సంస్కృతవేదాంతాన్ని భగవద్రామానుజులు వర్ధిల్లచేయగా, ద్రావిడవేదాలను యతివరపునరవతార భూతులైన మణవాళ మహామునులు ప్రధానంగా ప్రవర్తింపజేశారనే సాంప్రదాయికమైన అర్థం ఇక్కడ సూచింపబడింది. **"ఓదుమ్"** అనే క్రియాప్రయోగాన్నిబట్టి వేదమనే పదం అధ్యాహరించుకోవాలి. **"తీతు ముకన్దు తెఱియాత తెన్ మఱై"** – సంస్కృతవేదం అధికృతాధికారులకు మాత్రమే అధ్యయనసాధ్యం. కాని, ద్రావిడవేదానికి ఆ లోపం లేదు. అది అందఱికి అందుబాటులో ఉండేది. కనుక ఈ ప్రయోగం సాభిప్రాయకం లేక, భగవానుని స్వరూపగుణ విభూతుల వర్ణన స్పష్టంగా చేయబడ లేదనే లోపం లేనిది.

వేదాన్ని అభ్యసించిన గొప్పముని అయిన లోకసారంగమునిని సేవించి, శ్రీరంగనాథుని పాదాలనుండి కిరీటంవరకు కీర్తించినవారు, ఉఱైయూర్‌లో అవతరించిన వారు అయిన తిరుప్పాణ్ ఆళ్వార్‌పైన భక్తిని కల యతిరాజులు మణవాళమహామునులుగా అవతరించి, ఏ దోషం లేని ద్రావిడవేదాలైన దివ్యప్రబంధాలను వర్ధిల్ల జేశారు.

20. తానే తన్ వళ్రిప్పట్ట దామోదరన్ పణియై
క్కానేఱి ప్పఱిత్తు మను కఱ్ఱుయ్న్ద నమ్ కుఱైయ
ర్కోనేత్తుమ్ ఎతిరాశన్ కోమల వాన్ కుణమ్ పాడి
వానేఱ్ఱుమ్ మణవాళ మామునివన్ మన్నురైయే

తానే తన్ వళ్రిప్పట్ట = చేతన సంరక్షణార్థం తానే స్వయంగా ముందుగా వచ్చిన, తామోతరన్ = దామోదరుని, పణియై = ఆభరణాలను, కానేఱి = అరణ్యమార్గంలో, పఱిత్తు = అపహరించి, మను = అష్టాక్షరీమంత్రాన్ని, కఱ్ఱు = అభ్యసించి, ఉయ్న్ద = ఉజ్జీవించిన, నమ్ కుఱైయర్ కోన్ = కుఱైయలూర్ ప్రభువు అయిన, మన తిరుమఙ్గై యాళ్వార్లను, ఏత్తుమ్ = కీర్తించే, ఎతిరాశన్ = యతిరాజుల, కోమళ వాన్ కుణమ్ =

సుకుమారమైన గొప్ప గుణాలను, పాడి = కీర్తించి, వాన్ = పరమపదానికి, ఏఱ్ఱుమ్= చేర్చేవి, మణవాళమాముని, మన్ను ఉరైయే = మణవాళ మహామునుల స్థిరమైన యథార్థమైన శ్రీసూక్తులే.

"తానే తన్ వఴ్ఙిప్పట్ట" – జీవుల రక్షణకోసం భగవానుడు ముందుగా ప్రయత్నించే స్వభావానికి ఇది సూచకం. **"పణి"** – ఆభరణం. **"కానేఱి"** – అరణ్యమార్గమని అర్థమిచ్చే **"కానేఱి"** అనే పదం ఛందోనుగుణంగా మాఱింది. **"కోమళ వాన్ కుణమ్ పాడి"** – కృపామాత్రప్రసన్నాచార్యులైన శ్రీరామానుజుల ఔదార్యగుణాన్ని పాడి – అని భావం. **"వానేఱ్ఱుమ్"** – ఇక్కడి **'వాన్'** అనే పదం పరమపదమనే అర్థాన్ని ఇస్తుంది. **"మన్నురై"**– స్థిరంగా ఉండే సూక్తి. యథార్థసూక్తి– అని భావం. **"పొయ్యిలాత మణవాళమాముని"** కదా!

తనముందే, తానుగానే వచ్చిన భగవానుని దివ్యాభరణాలను అన్నిటినీ అపహరించి, తిరుమంత్రాన్ని ఉపదేశంగా పొంది, ఉజ్జీవించిన కుఱైయలూర్ ప్రభువు తిరుమఙ్గైయాళ్వార్లను కీర్తించే యతిరాజుల గొప్ప గుణాలను పాడి, మనకు పరమపదాన్ని పొందించేవి మణవాళమామునుల శ్రీసూక్తులే.

21. మన్ను తిరువాయ్ప్పాడి మఙ్గైకళిల్ తానొన్ఱాయ్
తన్ ఉరుక్కుమణిక్కణవన్ తకవడైన్ద పుదువై మయిల్
ఎన్నణ్ణన్ ఎన ఉవన్ద ఎతిరాశన్ తాళిణైయై
మున్ నణ్ణుమ్ మణవాళముని మొఴ్ఙియై మురలుమినో

మన్ను = స్థిరంగా నిలచి ఉండే, తిరువాయ్ ప్పాడి మఙ్గైకళిల్ = రేపల్లెలోని గోపికలలో, తాన్ ఒన్ఱాయ్ = తాను ఒకతెయై, ఉరుక్కు మణి క్కణవన్ = రుక్మిణీనాథుడైన శ్రీకృష్ణుని, తకవు = కృపను, అడైన్ద = పొందిన, పుతువై మయిల్ = శ్రీవిల్లిపుత్తూర్‌లోని నెమలి అయిన గోదాదేవి, **"ఎన్ అణ్ణన్"** = నా అన్న, ఎన = అని, ఉవన్ద = సంతోషించి, ఎతిరాశన్ = యతిరాజుల, తాళ్ ఇణైయై = శ్రీచరణద్వయిని, మున్ నణ్ణుమ్ = ముందుగా సేవించే, మణవాళ మాముని మొఴ్ఙియై = మణవాళమామునుల శ్రీసూక్తిని, మురలుమిన్ = అనుసంధించండి. (పాడండి)

"పుతువై మయిల్" – **"పున మయిలే పోదరాయ్"** అని అంటూ రేపల్లెలోని గోపికను సంబోధించిన ఆణ్డాళ్, తనను ఆ గోపికలలో ఒకతెగా సంభావించుకొన్నది. కనుక, ఆమెను మయిల్‌గా కీర్తించడం అర్థవంతం. **"అనుశిఖిని శిఖీవ"** అనే భట్టర్ ప్రయోగం భావ్యం. నాచ్చియార్ తిరుమొఴ్ఙి తనియన్‌లో కూడ **"మల్లినాడాణ్డ మడ మయిల్"** అని నిర్దేశింపబడింది. **"మయిల్"** ఇతరుల సంరక్షణలో పెరిగేటట్లే ఈమెకూడా

పెరియాళ్వార్ల సంరక్షణలో వృద్ధి అయినదనే సామ్యాన్నికూడా అక్కడ శ్రీ పిళ్ళైలోకమ్ జీయర్ సెలవిచ్చారు. అది కూడా అనుసంధేయం. తాను **"నాఱు నఱుమ్బొళ్ళిల్"** పాశురంలో నూఱు గంగాళాల వెన్నను, నూఱు గంగాళాల పాయసాన్ని తిరుమాలిరుమ్ శోలైలోని సుందరబాహుస్వామికి సమర్పించాలని ఆమె ఆశపడ్డ ఆ కైంకర్యాన్ని పూర్తిచేసిన శ్రీరామానుజులను చూచి గోదాదేవి సంతోషంగా ఆదరంతో **"ఎన్ కోయిలణ్ణనే!"** అని సంబోధించిన ఉదంతం మూడవ పాదంలో ప్రస్తావింపబడింది.

రేపల్లెలోని గోపీకన్యకలలో ఒకతెగా తనను భావించి, రుక్మిణికి నాథుడైన శ్రీకృష్ణుని అనుగ్రహాన్ని పొందిన విల్లిపుత్తూర్‌లోని మయూరి అయిన గోదాదేవి **"నా అన్నా!"** అని సంతోషించి పిలిచిన భగవద్రామానుజుల శ్రీపాదాలను ఆశ్రయించే మణవాళ మహామునుల శ్రీసూక్తులను చెప్పండి.

22. మురలు మివర్ పదినొరువర్ మొళ్ళికళుక్కోర్ ఇలక్కాకుమ్
పరన్ పెరియ పెరుమాళై ప్పణియుమ్ ఎతిరాశన్ తాళ్
విరల్ తొడఙ్గి ముడి యళవుమ్ విరుమ్బుమ్ మణవాళముని
తర మఱియుమ్ పెరియోర్తమ్ తాళిణై యెన్ తలైక్కణియే

మురలుమ్ = (దివ్యప్రబంధాలను) పాడే, ఇవర్ పదినొరువర్ = ఈ పదకొండుమంది ఆళ్వార్ల, మొళ్ళికళుక్కు = (వేదసమానమైన) శ్రీసూక్తులకు, ఓర్ ఇలక్కు ఆకుమ్ = ఏకైకలక్ష్యభూతుడైన, పరన్ = పరమాత్మ, పెరియ పెరుమాళై = శ్రీరంగనాథుని, పణియుమ్ = సేవించే, ఎతిరాశర్ = యతిరాజుల, తాళ్ = శ్రీచరణాల, విరల్ తొడఙ్గి = వేళ్ళనుండి, ముడి అళవుమ్ = కిరీటపర్యంతం, విరుమ్బుమ్ = భక్తితో సేవించే, మణవాళ ముని = శ్రీవరవరమునుల, తరమ్ = గొప్పతనాన్ని, అఱియుమ్ = తెలిసే, పెరియోర్తమ్ తాళిణై = మహాత్ముల శ్రీచరణద్వయి, ఎన్ తలైక్కు అణి = నా శిరస్సుకు ఆభరణం (చివరిలోని ఏకారం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని సూచిస్తుంది.)

"మురలుమ్"– తుమ్మెద చేసే ధ్వనిని ఈ శబ్దం నిర్దేశిస్తుంది. అందువల్ల ఆళ్వార్ల షట్పదసామ్యం ధ్వనిస్తున్నది. మధుస్వరూపుడైన భగవానుని అనుభవించడమే వ్రతంగా కల వీరిని మధువ్రతులనబడే తుమ్మెదలుగా చెప్పబడం అత్యంతం సరసం. **"పదినొరువర్ మొళ్ళికళుక్కు ఓర్ ఇలక్కాకుమ్ పరన్ పెరియ పెరుమాళై"**– **"అరఙ్గర్ వణ్ పుకళ్ళ్ మేల్ ఆన్ఱతమిళ్ళ్ మఱైకళ్ ఆయిరమ్"** – అని అంటూ భట్టర్ నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళ్ళికి లక్ష్యభూతుడు శ్రీరంగనాథుడన్నట్లుగా, పదకొండుమంది ఆళ్వార్ల ప్రబంధాలకు ప్రధానప్రమేయం శ్రీరంగనాథుడే. పన్నెండుమంది ఆళ్వార్లలో మధురకవులు

తప్ప మిగిలిన పదకొండుమంది శ్రీరంగనాథుని కీర్తించారు. కనుక ఈ సూక్తి అర్థవంతం. **"ఎతిరాశర్ తాళ్ విరల్ తొడఙ్గి ముడి యళవుమ్"**- **"ఆపాదమౌళి పర్యంతమ్"** అని, **"దేవా శ్చరణతః పునః"** అని దివ్యులను పాదాదికేశాంతం సేవించాలని శాస్త్రనియమం దీనివల్ల సూచింపబడింది. **"మణవాళమాముని . . . తాళిణై ఎన్ తలై క్కణియే"** - **"తాళిణై ఎన్ తలై మేలవే"** అని, **"అడిచ్చియోమ్ తలైమిశై నీ అణియాయ్ . . . . ఉల్ కోలప్పాదమ్"** అని, **"త్రివిక్రమ! త్వచ్చరణాంబుజ ద్వయమ్ మదీయమూర్ధాన మలంకరిష్యతి"** అని ఆళ్వార్లు, ఆచార్యులు పడిన ఆశ చరమపర్వంలో అనుసంధింప బడింది. **"వాఴ్త్తువార్తమ్ మలరడి ఎన్శెన్నిక్కు మలర్న్ద పూవే"** అనే ఇయల్ శాఱ్ఱుసూక్తి స్మరణీయం. **"మణవాళ మాముని తర మతియుమ్ పెరియోర్"** – శ్రీవరవరమునుల గొప్పతనాన్ని తెలిసినవారు, కనుక, మహనీయులనే హేతు హేతుమద్భావం చెప్పడం సరసం. ఈ పాశురం నుండి **"స చ ఆచార్యవంశో జ్ఞేయః అసౌ వసౌ విత్యాభగవత్తః"** అనే రీతిలో అవరోహణం క్రమంలో గురుపరంపర భగవానుని నుండి స్వాచార్యపర్యంతం అనుసంధింపబడుతున్నది.

ఆళ్వార్లు పదకొండుమంది పాశురాలకు లక్ష్యభూతుడైన పెరియపెరుమాళ్ అనబడే శ్రీరంగనాథుని సేవించే యతిరాజుల శ్రీపాదాలయొక్క వేళ్ళనుండి కిరీటం వరకుగల తిరుమేని సౌందర్యాన్ని అనుభవించే మణవాళమహామునుల గొప్పతనాన్ని తెలిసిన మహాత్ముల శ్రీపాదాలు నా శిరస్సుకు ఆభరణం.

23. అణి యరఙ్గన్ అడి వణఙ్గుమ్ అరుట్పెరియ పిరాట్టితనై
ప్పణియుమ్ ఎతిరాశనడి పరవు మణవాళముని
పిణి యకల అరుళ్ శెయ్ద పిరపన్దఙ్గళ్ పెరుమ్ పొరుళై
త్తుణియుమవర్క్కు ఒరు కాలుమ్ తుయరుదిక్కకిల్లావే

అణి = ఉభయవిభూతులకు అలంకారభూతుడైన, అరఙ్గన్ అడి = శ్రీరంగనాథుని శ్రీపాదాలను, వణఙ్గుమ్ = సేవించే, అరుళ్ = కరుణే నిరూపకంగా కల, పిరాట్టితనై = లక్ష్మీదేవిని, పణియుమ్ = సేవించే, ఎతిరాశన్ అడి = శ్రీరామానుజుల శ్రీచరణాలను, పరవుమ్ = కీర్తించే, మణవాళ మాముని = మణవాళమహామునులు, పిణి = అర్తి, అకల = తీరేటట్లుగా, అరుళ్ శెయ్ద = అనుగ్రహించిన, పిరపన్దఙ్గళ్ = ఆర్తిప్రబంధం, యతిరాజవింశతివంటి ప్రబంధాల, పెరుమ్ పొరుళై = మహనీయమైన తత్త్వార్థాలను, తుణియుమ్ = తెలిసి అవి యథార్థమని నిశ్చయించుకొన్నవారికి, ఒరు కాలుమ్ = ఏనాటికీ, తుయర్ = దుఃఖాలు, (క్లేశాలు) ఉదిక్కకిల్లావే = కలుగవుకదా!

"అణి అరఙ్గన్" – **"అణి అరఙ్గనార్"** (పెరుమాళ్ తిరుమొழி), **"అయనార్ అణి అరఙ్గనార్"** (దేశికప్రబంధం) వంటి సూక్తులు స్మరణీయాలు. **"అరుళ్ పెరియపిరాట్టి"** – **"దేవ్యా కారుణ్యరూపయా"** – కరుణే మూర్తీభవించినదికదా లక్ష్మీదేవి. **"కృపయా పర్యపాలయత్"** అన్నట్లు కృపాపరనామధేయ లక్ష్మి. **"కారుణ్యేన రూప్యతే ఇతి కారుణ్యరూపా"** అని వ్యుత్పత్తి. **"పిరాట్టి"** – ఇది పిరాన్ (స్వామి, ఉపకారకుడు) అనే ద్రావిడ పదానికి స్త్రీలింగరూపం. **"పిరాట్టితనై పణియుమ్ ఎతిరాశన్"** – శరణాగతి గద్యప్రారంభంలో **"భగవన్నారాయణాభిమతానురూప"** ఇత్యాదిగా లక్ష్మిని శ్రీరామానుజులు కీర్తించారుకదా! **"పిణి అకల అరుళ్ శెయ్ద"** – తమ మనస్సులోని ఆర్తి తీరేటట్లుగా అనుగ్రహించిన – అని కాని, మనవంటివారి మనస్సులోని ఆర్తి తీరేటట్లుగా అనుగ్రహించిన అని కాని చెప్పవచ్చు. యతిరాజవింశతికూడా ఒక ఆర్తిప్రబంధమే– అనే విషయం అందులోని పలు శ్లోకాలు తెలుపుతున్నవి. చివరగల **"శ్రుతిమధురై రుదితైః"** అనే సూక్తిని **"శ్రుతిమధురైః రుదితైః"** అని విడదీసి పెద్దలు అర్థం చెప్పే స్వారస్యంకూడా ఉన్నది. **"ఒరు కాలుమ్"** –ఇక్కడ **"కాల్"** అనే పదాన్ని కాలవాచిగా కాని, దేశవాచిగా కాని, పర్యాయవాచిగాకాని గ్రహించవచ్చు. మణవాళ మహామునులకు కల్గిన ఆర్తి నిజమని, వారి సూక్తులలో ప్రతిపాదింపబడ్డ తత్త్వార్థాలు సత్యమని విశ్వసించేవారికి ఏక్లేశాలు కలుగవు. **"న సంశయోఽస్తి తద్భక్తపరిచర్యారతాత్మనామ్"** అని కదా సూక్తి.

శ్రీరంగనాథుని శ్రీపాదాలను నమస్కరిస్తున్న లక్ష్మీదేవిని స్తుతించే యతిరాజుల శ్రీపాదాలను సేవించే మణవాళమహామునులలో తమ ఆర్తి తీరాలనే భావనతో అనుగ్రహించిన ఆర్తిప్రబంధంయొక్క అర్థాన్ని తెలిసినవారికి ఏనాడూ దుఃఖం ఏర్పడదు.

24. ఇల్లాద కుణఙ్గాట్టి ఇన్నుయిరై ఇఱై శేర్క్కుమ్
వల్లాళై అరుట్పెరియ పిరాట్టితనై వణఙ్గామల్
శెల్లాద శేనైయర్కోన్ శెయల్ పాడుమ్ ఎతిరాశన్
శొల్లాழுం మణవాళముని శొఱ్కళ్ నన్నూలే

ఇల్లాత = లేని, కుణమ్ కాట్టి = గుణాలు ఉన్నవి అని చూపి, ఇన్ ఉయిరై = (భగవానునకు, తనకు) తీయని (అభిమతమైన), ఉయిరై = జీవవర్గాన్ని, ఇఱై శేర్క్కుమ్ = పరమాత్మవద్దకు చేర్చే, వల్లాళై = సామర్థ్యాన్ని కల్గినది, అరుళ్ = కరుణాగుణాన్ని నిరూపకంగా కల, పిరాట్టితనై = లక్ష్మీదేవిని, వణఙ్గామల్ = నమస్కరించకుండా, శెల్లాత = ఉండలేని, శేనైయర్ కోన్ = సైన్యాధిపతి అయిన విష్వక్సేనుని, శెయల్ పాడుమ్ = లీలలను పాడే, ఎతిరాశన్ = యతిరాజుల, శొల్ = శ్రీసూక్తులలో, ఆழ்ுమ్ = అవగాహించే, మణవాళ మాముని శొఱ్కళ్ = మణవాళమహామునుల శ్రీసూక్తులు, నల్ నూల్ = గొప్ప శాస్త్రాలు.

జగన్మాత అయిన లక్ష్మీదేవి **"కార్యం కరుణ మార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి"** అని, **"నిర్దోషః క ఇహ జగతి"** అని ఈ రీతిలో తగిన రీతిలో భగవానుని సమాధానపఱచి, అతడు జీవులను ఉద్ధరించేటట్లుగా పురుషకారాన్ని చేస్తుందనే అంశం ప్రథమపాదంలో ప్రస్తుతం. **"ఇన్నుయిరై"** - కౌస్తుభస్థానీయమైన జీవతత్త్వం భగవానునకు ఆ కౌస్తుభరత్నంవలెనే అత్యంతం ప్రియమైనది. కనుక **"ఇన్"** అనే విశేషణం ప్రయోగింపబడింది. **"శేనైయర్కోన్ శెయల్ పాడుమ్ ఎతిరాశన్"- "శ్రీమతి విష్వక్సేనే న్యస్తసమస్తైశ్వర్యమ్"** ఇత్యాది శ్రీరామానుజసూక్తులు స్మరణీయాలు. **"మణవాళ మామునిశొల్లాళ్ నన్నూల్"** - ద్రావిడభాషలో ప్రసిద్ధమైన **"నన్నూల్"** అనే లక్షణ గ్రంథాన్ని ఈ ప్రయోగం స్మరింపజేస్తుంది. అవరోహణక్రమంలోని గురుపరంపరలో శ్రీరంగనాథుడు, పెరియపిరాట్టి తరువాత స్థానాన్ని విష్వక్సేనుడు అలంకరించి ఉన్నందున ఆ క్రమంలో ఈశ్లోకంలో విష్వక్సేనుడు ప్రస్తావింపబడ్డాడు.

చేతనుల విషయంలో లేని గుణాలను ఉన్నట్లుగా చూపి, వారిని భగవానుని వద్దకు చేర్చే సమర్థురాలైన లక్ష్మీదేవిని నమస్కరించకుండా ఉండని సేనైముదలియార్ లీలలను కీర్తించే యతిరాజుల శ్రీసూక్తులను అవగాహించే మణవాళమహామునుల శ్రీసూక్తులు గొప్ప శాస్త్రాలు.

25. కణ్ణనై మావుడన్ మరువ కఱ్పిత్త వన్ కిరిశై
తిణ్ణనవే శుమక్కుమ్ శేనైయర్కోన్తాళ్ వణఙ్గుమ్
అణ్ణల్ అరుళ్ మాఱన్ తాళడైయుమ్ ఎతిరాశనైయే
నణ్ణు మణవాళముని నఱ్కழలే నమ్ తుణైయే

కణ్ణనై = సర్వనిర్వాహకుడైన పరమాత్మ, మా ఉడన్ = లక్ష్మీదేవితో కలిసి, మరువ = ఆనందించడంకోసం కఱ్పిత్త = కల్పించిన, వన్ కిరిశై = లోకసంరక్షణాది గొప్ప కార్యాలను, తిణ్ణనవే = సమర్థవంతంగా, శుమక్కుమ్ = నిర్వహించే, శేనైయర్ కోన్ = విష్వక్సేనుల, తాళ్ = శ్రీచరణాలను, వణఙ్గుమ్ = నమస్కరించే, అణ్ణల్ = స్వామి, అరుళ్ మాఱన్ = కృపను నిరూపకంగా కల నమ్మాళ్వార్ల, తాళ్ అడైయుమ్ = శ్రీపాదాలను ఆశ్రయించే, ఎతిరాశనైయే = యతిరాజులను, నణ్ణుమ్ = సేవించే (ఆశ్రయించే) మణవాళమహామునుల, నల్ కழలే = గొప్ప శ్రీచరణాలే, నమ్ తుణై = మనకు రక్షకం.

"తిణ్ణనవే" - నిశ్చయంగా అని అర్థం. **"విడార్ కణ్డీర్ వైకున్దమ్ తిణ్ణనవే"** అని తిరువాయ్ మొழி (2-1-10) ప్రయోగం. **"అణ్ణలై అచ్చుతనై"** అని నమ్మాళ్వార్లు శ్రియఃపతిని సర్వస్వామిగా కీర్తించగా వీరు నమ్మాళ్వార్లను **"అణ్ణలై"** అని నిర్దేశించారు. **"శ్రీరంగచంద్రమస మిందిరయా విహర్తుం విన్యస్య విశ్వచిదచిన్నయనాధికారమ్, యో**

నిర్వహత్యనిశ మంగుళిముద్రయైవ సేనాన్య మన్యవిముఖా స్తమశ్రియామ" అనే సేనై ముదలియార్ తనియన్ శ్లోకార్థం భావ్యం. **"నల్కళ్గల్" – "తిణ్కళ్గల్"** వంటి ఆళ్వార్ల సూక్తుల భావాలు భావ్యాలు.

భగవానుడు లక్ష్మీదేవితోకూడి ఆనందించడంకోసం లోకసంరక్షణ బాధ్యతను అంతటినీ తాను వహించే విష్వక్సేనుల శ్రీపాదాలను సేవించే నాథులు, **"అరుళ్ మాఱన్"** (శఠకోపుల) శ్రీపాదాలను సేవించేవారైన యతిరాజులనే ఆశ్రయించే మణవాళ మామునుల శ్రీపాదాలే మనకు సహాయం – అని భావం.

26. నన్దాద మదురకవి నఱ్కలైయై త్తాన్ శవిత్తు
శిన్దామల్ శడకోపన్ శీరరుళ్ శేర్ నాదముని
మున్ తాళుమ్ ఎతిరాశమూర్త్తి మణవాళముని
అన్దాది నూత్తైయుమ్ నామ్ అనుశన్దిత్తు ఇరుప్పోమే

నన్దాద = నిరవధికమైన గొప్పతనాన్ని కల (శాశ్వతమైన), మతుర కవి = మధుర కవి ఆళ్వార్లు అనుగ్రహించిన, నల్ కలైయై = గొప్ప శాస్త్రమైన (చరమపర్వనిష్ఠా ప్రతిపాదకమైన) కణ్ణినుణ్ శిఱుత్తాంబ్బుప్రబంధాన్ని, తాన్ శిన్దామల్ శవిత్తు = తాను ఏకాగ్రత చెదఱకుండా పన్నెండు వేలసార్లు జపించి, శడకోపన్ = నమ్మాళ్వార్ల, శీర్ అరుళ్ శేర్ = గొప్ప కరుణను పొందిన, నాతముని మున్ = నాథమునుల ముందు (సన్నిధిలో), తాళుమ్ = నమ్రంగా తలవంచి నమస్కరించే, ఎతిరాశమూర్త్తి = యతిరాజులమూర్తి (అపరావతారం) అయిన, మణవాళముని = మణవాళమహామునులు అనుగ్రహించిన, అన్దాది నూత్తైయుమ్ = తిరువాయ్మొళ్ళి నూఱ్ఱన్దాది. పాశురాలను నూటింటిని, అనుశన్దిత్తు ఇరుప్పోమ్ = అనుసంధించి సత్తను కలవారంగా కాగలము.

"నన్దాద"–అవధి లేని, శాశ్వతమైన – అని అర్థం. **"నన్దాద కొళ్ళిఙ్గుడరే"** (పెరియతిరు 1-10-9) ఇత్యాది ప్రయోగాలు గ్రాహ్యాలు. **"మతురకవి నఱ్కలై"** – మధురకవులు ప్రవర్తింపజేసిన చరమపర్వనిష్ఠారూపమైన గొప్ప శాస్త్రమనికూడా అర్థం. **"ఎతిరాశర్ మూర్త్తి మణవాళముని"** శ్రీవరవరమునులు శ్రీరామానుజుల పునరవతార భూతులు కదా! "శవిత్తు" – జపమనే సంస్కృతం శబ్దంనుండి పుట్టిన వైకృతికమైన అసమాపక క్రియారూపం.

మధురకవులు అనుగ్రహించిన కణ్ణినుణ్శిఱుత్తాంబ్బును పన్నెండు వేలమార్లు జపించి, నమ్మాళ్వార్ల అనుగ్రహాన్ని పొందినవారైన నాథమునుల సమక్షంలో తలవంచి నమస్కరించే యతిరాజుల అపరావతారం అయిన మణవాళమహామునుల (తిరువాయ్మొళ్ళి) అన్దాది నూఱు పాశురాలను మనము అనుసంధిస్తాము.

27. తిరుప్పొలి అరుళ్‌నాదన్ శేవడి శేర్ ఉయక్కొణ్డార్
పరుప్పొదు పొరుమ్ తాళ్‌కళ్ పణియుమ్ ఎతిరాశనిదై
విరుప్పోఙ్గు మణవాళముని విరిత్త కలై యోది
ఇరుప్పోముక్కు ఇని యొరుత్తర్ ఇయల్ కేట్క వళ్ళి యెన్నే

తిరు = లక్ష్మీదేవియొక్క, పొలి అరుళ్ = వృద్ధి చెందే కరుణను పొందిన నాతన్= నాథమునుల, శే అడి శేర్ = అందమైన శ్రీచరణాలను ఆశ్రయించే, ఉయక్కొణ్డార్= ఉయ్యక్కొణ్డార్‌యొక్క, పరుప్పొదు పొరుమ్ = గొప్పతనంతో పరస్పరం స్పర్ధించే (సాటివచ్చే), తాళ్‌కళ్ = శ్రీచరణాలను, పణియుమ్ = సేవించే, ఎతిరాశన్ ఇదై = యతిరాజులపట్ల, విరుప్పు ఓఙ్గుమ్ = ఆదరం (భక్తి) వృద్ధి చెందే, మణవాళ ముని = మణవాళమహామునుల, విరిత్త = విస్తరించిన, కలై ఓది = శాస్త్రాలను (సూక్తులను) అభ్యసించి, ఇరుప్పోముక్కు=ఉండే మనకు, ఇని = ఇక, ఒరుత్తర్ = ఇంకొకరి, ఇయల్= మాటలను (పాశురాలను), కేట్క వళ్ళి ఎన్నే=వినవలసిన దారి (గతి) ఉన్నదా? (లేదు).

"పరుప్పు" – గొప్పతనం. **"పరుప్పుడైయ పవళమ్‌పోల్"** అని జీవక చింతామణి ప్రయోగం. **"పరుప్పొదు పొరుమ్ తాళ్‌కళ్"** – పరస్పరం గొప్పతనంలో స్పర్ధించే శ్రీచరణాలు. ఇక్కడి స్పర్ధ ఆశ్రితుల సంరక్షణలోని అహమహమికలో. **"కలై యోది"** – ఈ ప్రయోగంవల్ల వరవరమునుల సూక్తుల వేదసామ్యం ధ్వనిస్తున్నది.

లక్ష్మియొక్క అనుగ్రహాన్ని పొందిన నాథమునుల శ్రీపాదాలను ఆశ్రయించే ఉయ్యక్కొణ్డార్ చరణాలను సేవిస్తున్న యతిరాజులపట్ల భక్తిని కలవారైన మణవాళ మహామునుల శ్రీసూక్తులను అభ్యసించే మనకు వేఱొకరి మాటలను వినవలసిన అవసరం లేదు.

28. వళ్ళక్కెన్న ఉయ్యకొణ్డార్ వన్ శరణామ్బుదుమత్తిన్
నిళ్ళత్కొణ్డు నికళ్ళ్ మణక్కాల్ నమ్బియై నణ్ ఎతిరాశన్
కళ్ళఙ్కణ్డ మళవాళముని కలైయై విరుమ్బాదార్
విళ్ళక్కణ్డ నామవఱ్ఱై విరుమ్బాద నాళుణ్డే

వళ్ళక్కు ఎన్న = సత్సంప్రదాయమనదగిన, ఉయ కొణ్డార్ = ఉయ్యక్కొణ్డార్ యొక్క, వన్ = బలిష్ఠమైన, శరణామ్బుదుమత్తిన్ = చరణాలనే పద్మాలయొక్క, నిళ్ళల్ కొణ్డు = ఛాయను ఆశ్రయించి, నికళ్ళ్ = ప్రకాశించే, మణక్కాల్ నమ్బియై = మణక్కాల్ నమ్బిని, నణ్ = ఆశ్రయించే, ఎతిరాశన్ = యతిరాజుల, కళ్ళల్ కణ్డ = శ్రీపాదాలను దర్శించిన, మణవాళముని = మణవాళమహామునులయొక్క, కలైయై = గ్రంథాలను

(శ్రీసూక్తులను), విళ్గ కణ్డ = సంసారంలో పడడాన్ని చూచిన, నామ్ = మనం, అవఱ్ఱై = ఆ శ్రీసూక్తులను, విరుమ్బాద = ఆదరించని (కోరని), నాళ్ ఉణ్డే = దినం ఉంటుందా?

సంస్కృతంలోని **"పద్మ"** శబ్దవికృతి **"పదుమ"** అని అయినది. **"ఛాయా మివ సత్త్వ మనుగచ్ఛేత్"**, "**నిళ్గలు మడితాఱు మానోమ్**" అనే సూక్తుల అర్థాన్ని **"వన్ శరణామ్బుదుమత్తిన్ నిళ్గత్కొణ్డు"** అనే ప్రయోగం తలపిస్తున్నది.

ఉయ్యక్కొణ్డార్ల శ్రీపాదపద్మాల నీడలో నివసించే మణక్కాల్‌నమ్బిని ఆశ్రయిస్తున్న యతిరాజుల శ్రీపాదాలను సేవించే మణవాళమహామునుల శ్రీసూక్తులను ఆశ పడనివారు సంసారంలో నశించిపోవడాన్ని చూచిన మనం, మామునుల శ్రీసూక్తులను కోరని దినం ఉంటుందా?

29. నాళ వరితాళ్ తొడరుమవర్ నఱ్పదత్తై అడైన్దుయ్న్ద
ఆళవన్దార్ తిరువడియిల్ అన్బుఱుమ్ ఎమ్బెరుమానార్
తాళువన్ద మణవాళముని తరు నూఱ్ఱన్దాదిక్కు
ఆళవన్‌తాళ్ పరవామల్ ఆరాక క్కడవారే

నాళ వరితాళ్ = ప్రతిదినం నిత్యనూతనంగా భాసించే భగవానుని శ్రీచరణాలను, తొడరుమవర్ = ఆశ్రయించే మణక్కాల్ నమ్బి, నల్ పదత్తై = గొప్ప శ్రీచరణాలను, అడైన్దు ఉయ్న్ద = ఆశ్రయించి, ఉజ్జీవించిన, ఆళవన్దార్ = భగవద్యామునుల, తిరువడియిల్ = శ్రీచరణాలలో, అన్బు + ఉఱుమ్ = భక్తిని పొందే, ఎమ్బెరుమానార్ = శ్రీరామానుజుల, తాళ్ = శ్రీచరణాలను, ఉవన్ద = ఆశపడే, మణవాళముని = మణవాళమహామునులు, తరు = అనుగ్రహించే, నూఱ్ఱన్దాదిక్కు = తిరువాయ్‌మొళ్గి నూఱ్ఱన్దాదికి, ఆళవన్‌తాళ్= దాసులైనవాని శ్రీచరణాలను, పరవామల్ = మంగళాశాసనం చేయకుండా, ఆర్ ఆకక్కడవార్ = ఎవరు ఉండగలరు?

ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా తోచే శ్రియఃపతి శ్రీపాదాలను ఆశ్రయించి ఉజ్జీవించినవారైన మణక్కాల్ నమ్బి శ్రీచరణాలను సేవించే ఆళవన్దార్ శ్రీపాదాలలో భక్తిని కల భగవద్రామానుజుల శ్రీపాదాలను ఆశపడే మణవాళ మహామునులు అనుగ్రహించిన తిరువాయ్‌మొళ్గి నూఱ్ఱన్దాదికి దాసులై, వారి శ్రీపాదాలను మంగళాశాసనం చేయకుండా ఎవరు ఉండగలరు? **"యత్పదాంభోరుహధ్యా నధ్వస్తాశేషకల్మషః, వస్తుతా ముపయాతోఽహం యామునేయం నమామి తమ్"** అని యామునులను శ్రీరామానుజులు స్తుతించడం స్మరణీయం. యామునుల ఏకలవ్య శిష్యునిగా తమను శ్రీరామానుజులు చెప్పుకొనేవారనే విషయం ప్రసిద్ధం కదా!

30. కడమాక ఆళవన్దార్ కழల్ పణిన్ద పెరియనమ్బి
ఉడన్ వర అడి పరవుమ్ ఎతిరాశన్ ఉఱై తేఱుమ్
మడనెఞ్జ మణవాళ మామునివన్ మఱై యోదుమ్
తిడనెఞ్జార్ అడియేనై త్తిరుత్తి యరుళ్ శెయ్దారే

కడమ్ ఆక = కర్తవ్యంగా, ఆళవన్దార్ కழల్ = ఆళవన్దారుల శ్రీపాదాలను, పణిన్ద = సేవించిన, పెరియ నమ్బి = పెరియ నమ్బి, ఉడన్ వర = తమతో రాగా, అడి పరవుమ్ = వారి శ్రీచరణాలను కీర్తించే, ఎతిరాశన్ = యతిరాజుల, ఉఱై = శ్రీసూక్తులలో, తేఱుమ్ = స్పష్టమైన అవగాహనను కల, మడ నెఞ్జమ్ = భవ్యమైన మనస్సును కల, మణవాళ మామునివన్ = శ్రీమణవాళమహామునులు, మఱై = వేదసమానాలు అయిన సూక్తులను, ఓదుమ్ = అధ్యయనం చేసే, తిడ నెఞ్జార్ = దృఢమైన మనస్సును కలవారు, అడియేనై = దాసుణ్ణి అయిన నన్ను, తిరుత్తి = సంస్కరించి, అరుళ్ శెయ్దార్ = అనుగ్రహించారు.

శ్రీరామానుజులు, పెరియనమ్బి పరస్పరం మధురాంతకంలోని ఏరికాత్తరామన్ సన్నిధిలో కలిసినపుడు, అక్కడే పెరియనమ్బి శ్రీరామానుజులకు పంచసంస్కారాలను ప్రసాదించిన ఐతిహ్యం స్మరణీయం. **"మామునివన్ మఱై"** – మణవాళ మామునుల సూక్తులు వేదసదృశాలనే అర్థాన్ని ఈ ప్రయోగం ఇస్తుంది. **"మామునివన్ మఱై యోదుమ్ తిడ నెఞ్జార్"** – దృఢమనస్కులే మణవాళమహామునుల శ్రీసూక్తులను సేవించగలవారనే అర్థస్వారస్యం ఈ ప్రయోగంలో స్ఫురిస్తుంది. **"కడమాక"** – కర్తవ్యం అని అర్థం. **"వేఙ్గడత్తుఱైవార్క్కు నమ వెన్నలామ్ కడమై"** అనే ప్రయోగం స్మరణీయం. **"తిడ"** – ఇది దృఢశబ్దభవం.

ఆళవన్దారుల శ్రీపాదాలను సేవించిన పెరియనంబి తమతో రాగా, వారి శ్రీపాదాలను సేవించిన శ్రీరామానుజుల సూక్తులను ఆశపడే మణవాళమామునుల శ్రీసూక్తులను అభ్యసించే దృఢమైన మనస్సును కలవారు దాసుని సంస్కరించి, దాసునిగా చేసికొని అనుగ్రహించారు.

31. ఆరే శీర్ అముదనుఱై అన్దాదిద్దేవతై శేర్
కూరేశన్ కురుకేశన్ కురు ముదలియాణ్డాన్పోల్
కారే శీర్ ప్పెరున్దిరళై క్కరుదుమ్ మణవాళముని
శీరే శిన్దనై శెయ్వార్ శేవడి శేర్న్దకలోమే

శీర్ ఆర్ = ప్రబంధగుణాలతో నిండిన, అముదన్ ఉఱై అన్దాది తేవతై = తిరువరఙ్గత్తముదనార్ అనుగ్రహించిన ఇరామానుశనూఱ్ఱన్దాదికి అధిదేవత అయిన

శ్రీరామానుజులను, శేర్ = ఆశ్రయించే, కూరేశన్ = కూరత్తాళ్వాన్, కురుకేశన్ = తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్, కురు ముదలియాణ్డాన్ పోల్ = గురువైన ముదలియాణ్డాన్ వంటి, కారే శీర్ పెరుమ్ తిరళై = మేఘంవలె ఔదార్యగుణాన్ని కల మహానుభావుల సమూహాన్ని, కరుతుమ్ = భావించే, మణవాళమహాములల, శీరే = కల్యాణగుణాలను, శిన్దనై శెయ్ వార్ = చింతన చేసేవారి, శే అడి = స్పృహణీయమైన శ్రీచరణాలను, శేర్న్దు = చేరి, అకలోమే = విశ్లేషించలేము.

"కారే శీర్"– "కారేయ్ కరుణై" అనే ఇరామానుశనూత్ర్రన్దాదిసూక్తి స్మరణీయం. **"అముద నుఱై అన్దాదిదేవతై శేర్"** – తిరువరఙ్గత్తముదనార్ అనుగ్రహించిన అన్దాది – భగవద్రామానుజుల విషయంలోని **ఇరామానుశనూత్ర్రన్దాది. "కూరేశన్ కురుకేశన్ కురు ముదలియాణ్డాన్"** కూరత్తాళ్వాన్, తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్, ముదలిఆణ్డాన్ అనబడే దాశరథి– వీరు ముగ్గురు భగవద్రామానుజుల ముఖ్యశిష్యులు. **"పవిత్రీకృత కూరేశో భాగినేయత్రిదండకః"** అని అన్నట్లు కూరేశులు, ముదలియాణ్డాన్ శ్రీరామానుజులకు పవిత్ర, త్రిదండస్థానీయులు, కురుకేశులు శ్రీరామానుజులకు ఆత్మపుత్రులు. ఇటువంటి భాగ్యాన్ని పొందిన వీరు **"కారే శీర్"** అనే విశేషణంతో విశేషింపబడ్డారు.

తిరువరఙ్గత్తముదనార్ అనుగ్రహించిన ఇరామానుశనూత్ర్రన్దాదికి అధిదైవమైన భగవద్రామానుజుల పాదదాసులగు కూరత్తాళ్వాన్, తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్, ముదలియాణ్డాన్వంటివారిని సేవించేవారైన మణవాళమహామునుల గుణాలను చింతన చేసేవారి శ్రీపాదాలను చేరి, ఇకపై వారిని విశ్లేషించలేము.

32. తకవుడైయ ఎతిరాశన్ తాళడైయుమ్ ఎమ్బార్తాళ్
మిక వడైయుమ్ మణవాళమామునివన్ మిఴ్ఱ్త్ర్రియ శొఱ్కు
అక ముడైయుమ్ అదికారి యారేనుమ్ ఒరువరే తాన్
శెక ముడైయ పరమార్త్తమ్ శిన్దిక్క త్తిరువుడైత్తే.

తకవు + ఉడైయ = కరుణను కల, ఎతిరాశన్ = యతిరాజుల, తాళ్ అడైయుమ్ = శ్రీచరణాలను ఆశ్రయించే, ఎమ్బార్ తాళ్ = గోవిందభట్టర్ అనబడే ఎమ్బార్ శ్రీచరణాలను, మిక = మిక్కిలి (భక్తితో), అడైయుమ్ = ఆశ్రయించే, మణవాళ మహామునివన్ = మణవాళ మహామునులు, మిఴ్ఱ్త్ర్రియ = మధురంగా పల్కిన, శొఱ్కు = సూక్తులకు, అకమ్ ఉడైయుమ్ = మనస్సును కల (అభిమానించే), అదికారి= అధికారి, ఆర్ ఏనుమ్ = ఎవరైనా ఉంటే, ఒరువరే తాన్ = వారు ఒక్కరే, శెకమ్ అడైయ = లోకంలో అంతటికి, పరమార్త్తమ్ = పరమార్థాన్ని, శిన్దిక్క = చింతించడానికి తగిన, తిరు ఉడైత్తే = సంపదను కలవారు.

"తకవుడైయ ఎతిరాశన్" – **"తకవు"** – కరుణ. కృపామాత్రప్రసన్నాచార్యులైన భగవద్రామానుజులకు ఈ విశేషణం సార్థకం. **ఎమ్బార్** – శ్రీరామానుజులకు పినతల్లి కుమారులు. కొన్నాళ్ళు యాదవప్రకాశుల ప్రభావంవల్ల శివభక్తులై, కాళహస్తిలో కాలం గడిపారు. శ్రీరామానుజులు పెరియనంబిద్వారా వీరిని సన్మార్గంలోకి మళ్ళించి, అనుగ్రహించారు. పరమవైరాగ్యసంపన్నులు. లౌకికమైన సుఖాలపై రోసినవారైనా, వీరు దివ్యప్రబంధాలలోని ఆ యా సందర్భాలలో తెలిపే అర్థనిర్వాహాలు అన్నీ రసోదంచితాలు. **"ఎమ్బార్"** అనే ఈ పేరు ఎమ్బెరుమానార్ అనే పేరుకు సంగ్రహంరూపం అని పెద్దలంటారు. శ్రీభట్టర్ ఈ నామాన్ని **'ఎమ్ పార్'** అని విడదీసి చమత్కరిస్తూ **"రామానుజ పదచ్ఛాయా గోవిందాహ్వాఽనపాయినీ, తదాయత్తస్వరూపా సా జీయాన్మద్వి శ్రమస్థలీ"** అనే శ్లోకాన్ని రచించారు. **"శెకమ్"**–జగచ్ఛబ్దవికారం. **"ఆరేనుమ్ ఒరువరేతాన్"** అనే ప్రయోగం పాశురంలో చెప్పబడ్డ అధికారుల దౌర్లభ్యాన్ని సూచిస్తుంది. **"మిழఱ్ఱల్"** – మధురంగా పల్కడం అని అర్థం.

కరుణను కల భగవద్రామానుజులు శ్రీపాదాలను ఆశ్రయించిన ఎమ్బార్‌యొక్క పాదాలను శరణు పొందే మణవాళమహామునులు అనుగ్రహించిన శ్రీసూక్తులపట్ల మనస్సు శిథిలమై, ద్రవించేవారు ఎవరైనా ఉంటే, వారే లోకం అంతటికి గొప్ప అర్థాన్ని చింతించే సంపదను కలవారు.

33. ఉడైయవరామ్ ఎతిరాశర్ ఉయర్ తకవాల్ ఎమ్బార్ తాళ్
అడైయుమ్ పరాశరపట్టర్క్కు అఱ్ఱ మణవాళముని
తడై యఱవే తమిழ్మఱైక్కు త్తకవు శెయ్ నూఱ్ఱన్దాది
త్తొడైయదనై ప్పులవర్కళ్తామ్ తుతిత్తు నలమ్ పరుకువరే

ఉడైయవర్ ఆమ్ = సొత్తు దారులైన (స్వామి అయిన), ఎతిరాశర్ = శ్రీరామానుజుల, ఉయర్ తకవాల్ = ఉన్నతమైన కృపతో, ఎమ్బార్ తాళ్ అడైయుమ్ = ఎమ్బార్ శ్రీచరణాలను ఆశ్రయించే, పరాశర పట్టర్క్కు = పరాశరభట్టర్‌కు, అఱ్ఱ = విధేయులైన, మణవాళముని = మణవాళమహామునులు, తడై అఱవే = ఆటంకాలు నశించేటట్లుగా, తమిழ் మఱైక్కు = ద్రావిడవేదానికి (తిరువాయ్‌మొழிకి), తకవు శెయ్= తగినట్లు అనుగ్రహించే, నూఱ్ఱన్దాది త్తొడై అదనై = తిరువాయ్‌మొழி నూఱ్ఱన్దాది పాశుర మాలికను, పులవర్కళ్తామ్ = పండితులు, తుతిత్తు = స్తుతించి, నలమ్ పరుకువరే = ఆనందాన్ని గ్రోలుతారు.

'ఉడైయవర్' – ఉభయవిభూతులను శ్రీరంగనాథుడు శ్రీరామానుజుల అధీనం చేసినందువల్ల శ్రీరామానుజులు ఉభయవిభూతులకు స్వామి. **"ఉడైయవర్"**–(సొత్తుగా

ఉభయవిభూతులను) కలవారు స్వామి అని అర్థం. **"ఎతిరాశర్ ఉయర్ తకవాల్ ఎమ్బార్తాళ్ అడైయుమ్ పరాశరపట్టర్క్కు"**–పరాశరభట్టర్ జన్మించిన పదకొండవనాడు శిష్యసమేతంగా శ్రీరామానుజులు కూరేశుల ఇంటికి విచ్చేశారు. అపుడు ఎమ్బార్ భట్టర్‌ను తమ చేతులలో ఎత్తుకొని ద్వయానుసంధానం చేస్తూ శ్రీరామానుజుల సన్నిధికి తీసికొని వచ్చారు. శ్రీరామానుజులు భట్టర్ శిరస్సును ఆఘ్రాణిస్తూ "ఎమ్బార్! ఈశిశువు దగ్గర ద్వయం పరిమళిస్తున్నదేమి?" అని అడిగారు. ఎమ్బార్ తాము ఆ శిశువును తీసికొని వచ్చేటప్పుడు ద్వయానుసంధానం చేసిన విషయాన్ని చెప్పారు. అప్పుడు శ్రీ రామానుజులు ఎమ్బార్‌తో "ఈ బాలుని హితాన్ని గూర్చి ముందుగా చింతించిన మీరే వీరికి ఆచార్యులు కాదగినవారు" అని నియమించారు. ఆ విధంగానే ఎమ్బార్ సన్నిధిని భట్టర్ ఆశ్రయించారు. ఈ కారణంవల్లనే భట్టర్ తమ సహస్రనామభాష్య– ప్రారంభంలో **"వందే గోవిందతాతౌ"** అని అంటూ ఎమ్బార్‌ను ముందుగా స్మరించారు. **"తమి*ழ్*మఱైక్కు త్తకవుశెయ్ నూఱ్ఱన్దాది"** ద్రావిడ వేదమైన తిరువాయ్‌మొ*ழி*కి సాటివచ్చే తిరువాయ్‌మొ*ழி* నూఱ్ఱన్దాది అని భావం. **"తకవు"** – సాటివచ్చే.

"ఉడైయవర్" (స్వామి) అయిన భగవద్రామానుజుల దయతో ఎమ్బార్ శ్రీ పాదాలను చేరిన పరాశరభట్టర్‌కు దాసులైన మణవాళ మహామునులు ఏ ఆటంకం లేకుండా ద్రావిడవేదం అయిన తిరువాయ్‌మొழிకి అనుగ్రహించిన తిరువాయ్‌మొழி నూఱ్ఱన్దాది అనే వాఙ్మలను పండితులు స్తుతించి, దాని గొప్పతనాన్ని అనుభవిస్తారు.

34. పెరుమ్బూదూర్ మునివన్ అడి పేణియ నఞ్జీయరైయే
విరుమ్బుమ్ మణవాళముని విరి నూఱ్ఱన్దాదితనై
క్కరుమ్బాఱు శాఱముదాయ్ క్కరుదామల్ తిరివార్కళ్
అరుమ్పావికళ్ కణ్డీర్ అవరుఱవై అకఱ్ఱుమినే

పెరుమ్బూదూర్ మునివన్ = శ్రీపెరుమ్బూదూర్‌లోని శ్రీరామానుజుల, అడి = శ్రీచరణాలను, పేణియ = ఆశ్రయించిన, నఞ్జీయరైయే = నంజీయర్‌ను, విరుమ్బుమ్= కోరే (ఆదరించే), మణవాళమాముని = మణవాళమామునియొక్క, విరి నూఱ్ఱన్దాది తనై = అర్థవిస్తృతిని కల తిరువాయ్‌మొழிనూఱ్ఱన్దాదిని, కరుమ్బు ఊఱు శారు అముదాయ్ = చెఱకునుండి ఊరే మధురరసంవలె, అమృతంవలె, కరుతామల్ = భావించకుండా, తిరివార్కళ్ = వ్యర్థంగా పరిభ్రమించేవారు, అరుమ్ పావికళ్ కణ్డీర్ = అరుదైన (మహా) పాపాలను చేసినవారు సుమా! అవర్ ఉఱవై = వారితో సంబంధాన్ని, అకఱ్ఱుమినే = తెంచుకొనండి.

నమ్మాழ்వార్ల తిరువాయ్‌మొழி **"తొణ్డర్క్కముదన్న చ్చొల్ మాలైకళ్"** అన్నట్లు భక్తులకు భోగ్యమైన అమృతం అయినట్లే, ఆ ప్రబంధార్థాన్ని సంగ్రహిస్తూ

శ్రీమణవాళమహామునులు అనుగ్రహించిన తిరువాయ్‌మొఴ్ఱి నూఱ్ఱన్దాది ప్రబంధంకూడా **"కరుమ్బాఱు శారముడు"**-చెఱకురసంవలె, అమృతంవలె మధురమైనది. లౌకికమైన చెఱకురసం, నాలుకకు తీయగా ఉండి, తద్ద్వారా మనస్సుకు ఆనందాన్ని కల్గించేటట్లే, వరవరమునుల తిరువాయమొఴ్ఱినూఱ్ఱన్దాదికూడా శబ్దమాధుర్యంతోను, అనుసంధానంతోను నాలుకకు, అర్థమాధుర్యంద్వారా మనస్సుకు ఆనందాన్ని కల్గిస్తుంది. స్వర్గలోకంలోని మధురమైన అమృతం కొన్నాళ్ళవరకు రూపానికి మాత్రం మరణం రాకుండా కాపాడుతున్నది. కాని, ఈ అమృతం శాశ్వతంగా రూపాన్ని స్వరూపాన్ని రక్షిస్తుంది. ఇటువంటి మధురమైన ప్రబంధాన్ని అనుసంధించలేనివారు పాపిష్ఠివారు. మహాపాపాన్ని చేసినవారు. పాపం చేసినవారికి ఆ ఆనందాన్ని పొందే యోగ్యత ఉండదుకదా ! అటువంటివారితో సంబంధాన్ని పోగొట్టుకోవాలి. **"న కేవలం యో మహతోఽపభాషతే శ్రుణోతి తస్మాదపి యః స పాపభాక్"** అని కాళిదాసు అన్నట్లు మహాత్ములపట్ల అపచారపడేవారితో సంబంధం పాపానికి హేతువుకదా !

శ్రీపెరుమ్బూదూర్‌మాముని అయిన శ్రీరామానుజుల శ్రీపాదాలను ఆశ్రయించే వారైన నఞ్జీయర్‌ను అభిమానించే మణవాళమహామునులు అనుగ్రహించిన తిరువాయ్‌మొఴ్ఱి నూఱ్ఱన్దాదిని చెఱకులో ఊరే తీయని రసంవలె, అమృతంవలె భావించకుండా తిరిగే (భ్రమించే) వారు పరమపాపిష్ఠివారు కాబట్టి వారితో ఉన్న సంబంధాన్ని పోగొట్టుకోండి.

35. అకత్తిల్ ఎతిరాశన్‌తాళ్ అకలాద నమ్బిళ్ళై
వకుత్త మలరడి వణఙ్గు మణవాళమామునివన్
శెకత్తుక్కా ఉపదేశమ్ శెయ్‌ద మణిమాలైదనై
అకత్తుక్కోర్ అణియాక అణివార్ ఎన్‌ముడిక్కణియే

ఆకత్తిల్ = తమ మనస్సులో, ఎతిరాశన్ తాళ్ = యతివరుల శ్రీపాదాలను, అకలాద = విడువని (నిరంతరం ధ్యానించే), నమ్బిళ్ళై = నమ్బిళ్ళైయొక్క, వకుత్త = తగిన, స్వరూపానురూపమైన, మలర్ అడి = పద్మాలవంటి శ్రీచరణాలను, వణఙ్గుమ్= నమస్కరించే, మణవాళ మామునివన్ = మణవాళమహామునులు, శెకత్తుక్కు ఆక = లోకం అంతటికీ, ఉపదేశమ్ శెయ్‌ద = ఉపదేశించిన, మణి మాలైతనై = ఉపదేశరత్న మాలను, అకత్తుక్కు = తమ హృదయానికి, ఓర్ = అద్వితీయమైన, అణి ఆక = అలంకారంగా, అణివార్ = అలంకరించుకొన్నవారు, ఎన్ ముడిక్కు అణియే = నా శిరస్సుకు ఆభరణంవంటివారు.

"మలరడి వణఙ్గుమ్"–**"వణఙ్గుమ్"** అనే క్రియాస్వారస్యాన్నిబట్టి పద్మాలవంటి పాదాలనే ఉపమితసమానం చెప్పడం ఉచితం. **"శెకత్తు"** జగత్తు అనే పదంయొక్క వికారం. **"మణిమాలై"** – **"ఉపదేశరత్తినమాలై"** అని అర్థం. రత్నశబ్దపర్యాయం అయిన మణి అనే పదం రత్నశబ్దస్థానంలో ప్రయోగింపబడింది. **"రత్తినమాలై"** అనే పేరులోని స్వారస్యాన్నిబట్టి **"అకత్తుక్కు ఓర్ అణియాక అణివార్"** అని ప్రయోగింపబడింది. **"అకమ్"** అనే పదానికి ఇక్కడ హృదయం, మనస్సు – అని అర్థం. లోకంలోని రత్నమాల హృదయానికి అలంకారం అయితే, ఇది మనస్సుకు అలంకారం. ఇక్కడ మనస్సుకు అలంకరించుకోవడం అంటే – నిరంతరం మనస్సులో ధ్యానించడమే. **"ఉపదేశరత్తిన మాలైతన్నై తన్నెఞ్జుతన్నిల్ తరిప్పవర్తాళ్కళ్ శరణ్ నమక్కే"** అనే ఉపదేశ రత్తినమాలై తనియన్ భావం స్మరణీయం.

తమ మనస్సులో శ్రీరామానుజుల శ్రీపాదాలను నిరంతరం ధ్యానించే నమ్బిళ్ళై యొక్క అందమైన శ్రీపాదాలను నమస్కరించే మణవాళమహామునులు లోకానికి ఉపదేశించడంకోసం అనుగ్రహించిన ఉపదేశరత్తినమాలైను తమ మనస్సుకు అలంకారంగా గ్రహించేవారు నా తలకు ఆభరణం కాగలరు.

36. ముడిక్కురియ ఎతిరాశన్ ముழு నలనుమ్ ముకన్దురుకుమ్
పడి వడక్కుత్తిరువీదిప్పిళ్ళైయై చ్చేర్ మణవాళన్
అడిక్కమలత్తు అన్బుఉవార్ అవన్ మొழிయై ఆరాయ్న్దు
పడిప్పల్లాల్ పఴ్పల్ కాల్ పాழ் పొழுదు పోక్కువరే

ముడిక్కు ఉరియ = (శ్రీవైష్ణవసంప్రదాయసామ్రాజ్యానికి చక్రవర్తి అనే సంగతిని సూచించే) కిరీటానికి యోగ్యులైన, ఎతిరాశన్ = యతిరాజుల, ముழு నలనుమ్ = సమస్తమైన కల్యాణగుణాలను, ముకన్దుమ్ = అనుభవించే, ఉరుకుమ్ పడి = ద్రవించే రీతిలో వడక్కు త్తిరువీది ప్పిళ్ళై = వడక్కుత్తిరువీథిప్పిళ్ళైను, శేర్ = ఆశ్రయించే, మణవాళన్= మణవాళమహామునుల, అడి క్కమలత్తు = పద్మాలవంటి శ్రీచరణాలలో, అన్బు ఉఉవార్= భక్తిని కలవారు, అవన్ మొழிయై = ఆ మణవాళమహామునుల శ్రీసూక్తులను, ఆరాయ్న్దు= పరిశీలించి, పల్ పల్ కాల్ పడిప్పు అల్లాల్ = పలుమార్లు అధ్యయనం చేయడం కాకుండా, పొழுదు పాழ் పోక్కువరే = వ్యర్థంగా కాలక్షేపం చేస్తారా? (చేయరు)

పొழுతు = పొద్దు. **"బ్రధ్నా"** అనే సంస్కృత శబ్దవికృతి. **ముழுనలనుమ్**– నలశబ్దం ఇక్కడ కల్యాణగుణ సామాన్య వాచకంగాగాని, యతిరాజులకు నిరూపకగుణం అయిన కృప అనే కల్యాణగుణవిశేష వాచకంగాగాని చెప్పవచ్చు. వడక్కుత్తిరువీదిప్పిళ్ళై– వీరు నమ్బిళ్ళైప్రధానశిష్యులలో ఒకరు. వీరి కుమారులే శ్రీపిళ్ళైలోకాచార్యులవారు,

అఱ్ఱకియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్. శ్రీరంగంలో ఉత్తరవీథిలో నివసించడంవల్ల వీరికి వడక్కుత్తిరు వీథిప్పిళ్ళై అనే పేరు వచ్చింది.

శ్రీవైష్ణవసంప్రదాయానికే పట్టాభిషిక్తులైన యతిరాజుల అన్ని కల్యాణగుణాలను అనుభవించి, ద్రవించేవారైన వడక్కుత్తిరువీథిప్పిళ్ళైను ఆశ్రయించిన మణవాళ మహామునుల శ్రీపాదాలను సేవించేవారు వారు అనుగ్రహించిన గ్రంథాలను పరిశీలించి పలు మార్లు అభినివేశాన్ని పొందడం కాకుండా, వేఱే కృత్యాలలో వ్యర్థంగా కాలాన్ని గడుపుతారా? (గడపరు)

37. ఉవరోదు తమరేత్తుమ్ ఉత్తమర్ ఎమ్బెరుమానార్
అవరే తమ్ శరణాక అడైయుమ్ ఉలకారియనై
ఇవరే నమ్ కులదెయ్వమ్ ఎన త్తుణిన్ద మణవాళర్క్కు
ఎవరేనుమ్ ఆళానార్ ఎఱ్ఱు పిఱప్పుమ్ ఎమక్కరశే

ఉవరోదు తమర్ ఏత్తుమ్ = శత్రుమిత్రభేదం లేకుండా అందఱు దాసులు స్తుతించే, ఉత్తమర్ = ఉత్తములైన, ఎమ్బెరుమానార్ అవరే = భగవద్రామానుజులనే, శరణ్ ఆక = శరణంగా, అడైయుమ్ = ఆశ్రయించే, ఉలకారియనై = శ్రీపిళ్ళైలోకాచార్యుల వారిని, ఇవరే = వీరే, నమ్ కుల దెయ్వమ్ = మన కులదైవం, ఎన = అని, తుణిన్ద= నిశ్చయించుకొన్న, మణవాళర్క్కు = మణవాళమహామునులకు, అళానార్ ఎవరేనుమ్= దాసులైనవారు ఎవరైనా, ఎఱ్ఱు పిఱప్పుమ్ = ఏడేడు జన్మలలో, ఎమక్కు అరశే = మమ్ములను పాలించే ప్రభువులు.

"పాఱ్కడల్ శేర్న్ద పరమనై పయిలుమ్ తిరువుడైయార్ ఎవరేలుమ్ అవర్ కణ్డీర్ పయిలుమ్ పిఱప్పాదు తోఱు ఎమ్మై యాళుమ్ పరమరే" అని అంటూ నమ్మాఴ్వార్లు భగవద్విషయంలో అనుసంధించిన చరమపర్వనిష్ఠను ప్రబంధకర్త మణవాళమహామునుల విషయంలో ఇక్కడ అనుసంధించారు. **"ఎఱ్ఱు పిఱప్పుమ్"** – ఏడేడు ఏడు జన్మలని అర్థం. **"సప్త సప్త చ సప్త చ"** అని అన్నట్లు. **"ఎవరేనుమ్"** జన్మవృత్తాదులలో ఎటువంటివారైనా అని అర్థం. ఆఴ్వార్ల పాశురంలో **"పయిలుమ్ తిరువుడైయార్"** అని కీర్తించే సంపదను కలవారని చెప్పబడగా, ఇక్కడ **"తుణివు"** నిశ్చయించుకొంటే చాలని చెప్పబడింది. **"ఉవరోదుతమర్ ఏత్తుమ్ ఉత్తమర్ ఎమ్బెరుమానార్"** **"ఉవర్"** అంటే గిట్టనివారు అని అర్థం. (**"ఉవర్"** – వగరు అని నిఘంటువు. వగరువలె రుచించనివారు శత్రువులే కదా). శత్రువులు, మిత్రులు అందఱు కీర్తించే ఉత్తములు శ్రీరామానుజులు. **"శత్రోః ప్రఖ్యాతవీర్యస్య రంజనీయస్య విక్రమైః"**, అని, **"కూడారై వెల్లుమ్ శీర్"** అని కీర్తింపబడే రీతిలో భగవద్రామానుజులు శత్రుమిత్ర భేదం లేకుండా అందరిచేత స్తుతింపబడ్డారని భావం. మొదట ద్వేషించిన యాదవప్రకాశులు సైతం శ్రీరామానుజులకు

శిష్యులైన ఉదంతం ప్రసిద్ధం కదా! **"ఉత్తమర్"** – తాను నష్టపడినా ఇతరులు బాగుపడాలని తలచేవాడు ఉత్తముడు. తాము నరకానికి పోయినా సరే, మంత్రార్థాన్ని అందరు గ్రహించి తరించాలని తలచిన శ్రీరామానుజులు ఉత్తమపద వాచ్యులు కదా! **"ఉలకారియన్" –** శ్రీపిళ్ళైలోకా చార్యులవారు. ఈ మహాచార్యులు అష్టాదశరహస్యాలను అనుగ్రహించారు.

దాసులు ఆనందంతో స్తుతించే భగవద్రామానుజులనే తమ శరణంగా ఆశ్రయించిన శ్రీపిళ్ళైలోకాచార్యులవారే మన కులానికి దైవం అని చూపిన మణవాళ మహామునులకు ఎవరు దాసులయ్యారో వారు ఏడేడు జన్మలలోను మాకు ప్రభువులు.

38. కరై శేర్క్కుమ్ ఎతిరాశన్కణ్ తిరువాయ్మొழிప్పిళ్ళై
ఉరై శెయ్ద పழைవழிయే ఓదుమ్ మణవాళముని
విరై యేగ్రాు మలరడియై విరుమ్బుమవర్ ఎమ్ కురుక్కళ్
నిరై శేర్న్దు నిచ్చలుమే నినైన్దెన్ఱుమ్ ఇకழారే

కరై శేర్క్కుమ్ = (సంసారసముద్ర) తీరాన్ని చేర్చే, ఎతిరాశన్ కణ్ = శ్రీరామానుజుల విషయంలో తిరువాయ్మొழிప్పిళ్ళై = తిరువాయ్మొழி ప్పిళ్ళై, ఉరై శెయ్త = అనుగ్రహించిన, పழை వழிయే = సనాతనమైన మార్గాన్నే, ఓదుమ్ = అభ్యసించే, మణవాళమాముని = మణవాళమహామునుల, విరై ఏగ్రామ్ = సువాసనను వెదజల్లే, మలర్ అడియే = పద్మాలవంటి పాదాలనే, విరుమ్బుమవర్ = ఆశపడేవారు (సేవించే వారు), ఎమ్ కురుక్కళ్ = మా ఆచార్యుల, నిరై శేర్న్దు = పరంపరను చేరి, నిచ్చలుమే = నిత్యంగా, నినైన్దు = భావించి, ఎన్ఱుమ్ ఇకழారే = ఏనాటికీ నిందింపబడరు.

"కరై శేర్క్కుమ్"– అర్థస్వారస్యంవల్ల **"కరై"** అనే పదానికి సంసారసముద్ర తీరమని తాత్పర్యం. **"ఎమ్ కురుక్కళ్ నిరై శేర్న్దు" – "శాతుకోట్టియుళ్ కొళ్ళప్పడువర్"** అనే పెరియాழ்్వార్లసూక్తి రీతిలో గురుపరంపరలో అంతర్భవిస్తారు. **"నిచ్చలుమ్"**– నిత్యశబ్దవికారం.

ఈ లోకయాత్ర అనే సంసార సముద్రంనుండి భగవద్రామానుజుల దరిచేర్చే తిరువాయ్మొழி ప్పిళ్ళై అనుగ్రహించిన శ్రీసూక్తులను క్రమం తప్పకుండా అభ్యసించే మణవాళమహామునుల శ్రీపాదాలను అభిమానించేవారు మన ఆచార్యగోష్ఠిని ఆశ్రయించి, ఏనాడు నిందింపబడకుండా ప్రకాశించే స్థితిని పొందుతారు.

39. కழலాద ముక్కోలాన్ కరుణైనిది ఎతిరాశన్
కழலాడి త్తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ వియాక్కియైయిన్
నిழలాదుమ్ ఇకழాదే నిఱ్కుమ్ మణవాళముని
శుழలాద తొల్ వழிయై చ్చూరికళుక్కు అరుళ్వానే

కழலాత = ఏనాటికీ చేతినుండి జారిపోని, ముక్కోలాన్ = త్రిదండాన్ని కల్గినవారు, కరుణై నితి = కరుణకు నిధి అయిన, ఎతిరాశన్ = యతిరాజులయొక్క, కழల్ ఆడి = శ్రీచరణాలలో అవగాహించే (శ్రీచరణాలను ఆశ్రయించే), తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ = తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ అనుగ్రహించిన, వియాక్కియైయిన్= ఆఱాయిరప్పడి వ్యాఖ్యానంయొక్క, నిழల్ ఆతుమ్ = ఛాయను దేనినీ, ఇకழాతే నిఱ్కుమ్ = వదలకుండా నిలచి ఉండే, మణవాళ ముని = మణవాళ మహామునులు, శూరికళుక్కు = సూరులకు (శిష్యులకు), శుழలాత = సంసారంలో పరిభ్రమించని, తొల్ వழியై = ప్రాచీనమైన మార్గాన్ని, అరుళ్వానే = అనుగ్రహిస్తారు.

సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిన యతులు త్రిదండాన్ని సదా విడువకుండా ధరించాలని యతిధర్మశాస్త్రనియమం. అందువల్ల **"కழలాత ముక్కోలాన్"**-అని ప్రయోగింపబడింది. అద్వైతసన్న్యాసులు ఏకదండాన్ని ధరిస్తారు. ఇది వారి సిద్ధాంతతత్త్వానికి ప్రతీక. శ్రీవైష్ణవసన్న్యాసులు త్రిదండాన్ని ధరిస్తారు. ఇది ఒకటిగా చేర్చి కట్టబడ్డ మూడు దండాలతో కూడి ఉంటుంది. ఈ మూడు దండాలు చిదచిదీశ్వరతత్త్వాలకు ప్రతీకలు. విశిష్టాద్వైతసిద్ధాంతంలోని ప్రధానప్రతితంత్రార్థం అయిన, చిదచిత్తులు రెండు పరమాత్మకు శరీరభూతాలనే తత్త్వాన్ని ఈ త్రిదండం సూచిస్తుంది. **"కరుణైనితి"** - కృపామాత్రప్రసన్నాచార్యులైన శ్రీరామానుజుల విషయంలో ఈ విశేషణం సార్థకం. మొదటి పాదంలో ఉండే **"కழలా"** అనే పదం **"కழల్"** అనే ధాతువునుండి పుట్టిన కృదంతం (వినైత్తొకై). రెండవపాదంలో ఉండే **"కழల్"** అనే పదానికి శ్రీపాదమని అర్థం. **"తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ వియాక్కియైయుమ్"** - తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ (కురుకేశులు) శ్రీరామానుజుల శిష్యులలో ఒకరు. వీరిని శ్రీరామానుజులు ఆత్మ సంబంధంతో పుత్రులుగా స్వీకరించారు. శ్రీరామానుజుల ఆదేశం మేరకు పిళ్ళాన్ తిరువాయ్మొழிకి ఆఱాయిరప్పడి అనే ఆఱు వేల గ్రంథపరిమితిలో అద్భుతమైన, సంగ్రహమైన వ్యాఖ్యను వెలయించారు. **"ఇన్బ మికు మాఱాయిరమ్"** అని దీనిని వరవరమునులు ఉపదేశరత్తినమాలైలో గొప్పగా శ్లాఘించారు. **"శుழలాద"**- సంసారంలో పరిభ్రమించని - అని భావం. **"శుழల్"**-చుట్టడం - గుండ్రంగా తిరగడం.

ఏ సమయంలోను చేయి విడువని త్రిదండాన్ని కల, కరుణకు నిధి అయిన యతిరాజుల శ్రీపాదాలను సేవించే, తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ అనుగ్రహించిన ఆఱాయిరప్పడి వ్యాఖ్యానాన్ని ఛాయవలె అనుసరించి ఉండే మణవాళమామునులు తమ దాసులకు భగవానుని విడిచి ఉండకుండా ఉండే దారిని అనుగ్రహిస్తారు.

40. అరుళాழி ఎతిరాశన్ అడి తాழுమ్ నఞ్జీయర్
మరుళామల్ శెయ్ద తమిழ் వియాక్కియైయై వాయ్న్దరుళుమ్
పొరుళాదుమ్ శోరామల్ పుకలుమ్ మణవాళముని
తెరుళాழி తీక్కలియై త్తేయ్న్దழியా తీర్త్తానే

అరుళ్ ఆழி = కరుణాసముద్రులు అయిన, ఎతిరాశన్ = యతిరాజుల, అడి = శ్రీచరణాలలోను, తాழுమ్ = నమ్రం అయే (ఆశ్రయించే), నఞ్జీయర్ = నఞ్జీయర్ అనే ఆచార్యులు, మరుళామల్ = ఏమాత్రం అజ్ఞానాది దోషాలు లేకుండా, శెయ్ద = రచించిన, తమిழ் వియాక్కియైయై = ఒన్పదినాయిరప్పడి అనే వ్యాఖ్యానాన్ని, వాయ్న్దు అరుళుమ్ = చక్కగా అనుగ్రహించేవారు, పొరుళ్ ఆదుమ్ = అర్థాలను వేటినీ, శోరామల్ = తప్పిపోకుండా, పుకలుమ్ = గ్రహించేవారు (విశదీకరించేవారు), తెరుళ్ ఆழி = జ్ఞానసముద్రులు అయిన మణవాళముని = మణవాళమహామునులు, తీ కలియై = (అజ్ఞానం అనే) దుర్గతిని, తేయ్న్దు అழியా తీర్త్తానే = నశించేటట్లుచేసి, అజ్ఞానాన్ని తీర్చారు.

"అరుళాழி"-దయాసముద్రులని అర్థం. **"ఆழம்"** అంటే లోతు. **"ఆழమ్"** (లోతును) కల్గినది కనుక **ఆழி** అయింది. (చక్రం కల్గినవానిని **"చక్రి"** అని అన్నట్లు తమిళంలోకూడా ఇటువంటి ప్రయోగాలుండడం విశేషం.) **"అరుళాழி వరివణ్డే"** అనే తిరువాయ్మొழி ప్రయోగం భగవద్రామానుజులను సూచిస్తుందనే పూర్వాచార్య నిర్వాహం స్మరణీయం. **"తమిழ் వియాక్కి యైయై"**-పిళ్ళాన్ అనుగ్రహించిన ఆఱాయిరప్పడివ్యాఖ్య సంస్కృతపదభూయిష్ఠం కాగా, నఞ్జీయర్‌వ్యాఖ్య ద్రావిడపదప్రచురం. అందువల్ల ఈ ప్రయోగం సాభిప్రాయకం. **"తెరుళాழி"-"తెరుళ్"** అంటే జ్ఞానం. దానికి సముద్రులు. అంటే సముద్రం లోతైన నీటిని కల్గి ఉన్నట్లు, వీరు లోతైన జ్ఞానం కలవారు. జ్ఞానపూర్ణులు - అనే అత్యంత సామ్యాన్నిబట్టి ఈ రూపకం.

(దయాసముద్రులైన) దయను మెండుగా కల శ్రీరామానుజుల శ్రీపాదాలను సేవించే నంజీయర్ అనుగ్రహించిన ఒన్పదినాయిరప్పడి వ్యాఖ్యానంలో చెప్పబడ్డ అర్థాలను ఒక్కటికూడా తప్పకుండా అనుగ్రహించే మణవాళ మామునులు అజ్ఞానం అనే దుర్గతిని నశింపజేశారు.

41. తీర్త్తన్ ఎతిరాశనడిశేర్ ఆచ్చాన్‌పిళ్ళై మున్నాళ్
శీర్త్త తమిழ் వియాక్కియైయై చ్చెయ్యుమ్ మణవాళముని
వార్త్తైకళిల్ ఓరొన్డ్రే వానేఱ్ఱి ఉయ్త్తిడుమాల్
పార్త్తవనై చ్చేవిత్తార్ పాక్కియత్తై ప్పణిత్తామో

తీర్తన్ = పరమపావనులు అయిన, ఎతిరాశన్ = శ్రీరామానుజులు, అడి శేర్ = శ్రీపాదాలను ఆశ్రయించే, ఆచ్చాన్ పిళ్ళై = పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన, మున్ నాళ్ = పూర్వం, శీర్త్త = తగినట్లు గొప్పగా అనుగ్రహించిన, తమిళ్ల్ వియాక్కియైయై= గొప్ప దివ్యమైన ఇరుపత్తు నాలాయిరప్పడి వ్యాఖ్యానాన్ని, శెయ్యుమ్ = కృప జేసే (వివరించే), మణవాళముని = మణవాళమహామునుల, వార్త్తైకళిల్ = శ్రీసూక్తులలో, ఓర్ ఒన్ఱే= ఏ ఒక్కటి అయినా, వాన్ ఏఱ్ఱి = పరమపదానికి చేర్చి, ఉయ్త్తిడుమ్ = ఉద్ధరిస్తుంది, ఆల్ = ఆశ్చర్యం! అవనై = ఆ మణవాళ మహామునులను, పార్త్తు సేవిత్తార్ = సాక్షాత్తుగా దర్శించి సేవించినవారి, పాక్కియత్తై = అదృష్టాన్ని, పణిత్తు ఆమో? = వర్ణించి అవుతుందా? (వర్ణించ సాధ్యం కాదు)

"తీర్త్తన్" - "తీర్త్తన్ ఉలకళన్ద" అనే నమ్మాళ్వార్ల సూక్తిని ఇది తలపిస్తుంది. ఇది తీర్థం అనే సంస్కృతపదానికి వికృతి. సంస్కృతంలో తీర్థశబ్దానికి **"తీర్యతే అనేన"** అనే వ్యుత్పత్తిద్వారా మనలను తరింపజేసే గురువు-అని అర్థం. **"తీర్థమ్ ఋషిజుష్టజలే గురౌ"** అని అమరం. **"పత్యుః సంయమినాం ప్రణమ్య చరణౌ తత్పాదకోటీరయోః సంబంధేన సమేధితాత్మవిభవాన్ ధన్యాన్ మదన్యాన్ గురూన్"** అని, **"తస్మిన్ రామానుజార్యే గురు రితి చ పదం భాతి నాన్యత్ర"** అని, **"యతిరాజో జగద్గురుః"** అని అన్నట్లు పూర్వోత్తరాచార్యవర్గాన్ని తమ కిరీటపాదస్పర్శతో తరింపజేసిన శ్రీరామానుజులకు ఈ విశేషణం సార్థకం. **"శీర్త్త తమిళ్ల్"**-ఈ ప్రయోగాన్ని **"వియాక్కియైయై"** అనే పదానికి విశేషణంగాకూడా చేయవచ్చు. అపుడు గొప్ప ద్రావిడభాషలో రచించిన ఇరుపత్తు నాలాయిరప్పడి-అని భావం. **"ఓరొన్ఱే వానేఱ్ఱి ఉయ్త్తిడుమ్"**-వేదాంతదేశికుల తనియన్ అయిన **"శీరొన్ఱు తూప్పుల్ తిరువేఙ్గడముడైయాన్ పారొన్ఱ చ్చొన్న ప్పళ్లమొళ్లియుళ్, ఓరొన్ఱుతానే అమైయాతో తారణియిల్ వాళ్లవార్క్కు వానేఱ ప్పోమళవుమ్ వాళ్ల్వు"** అనే సూక్తి స్మరణీయం. **"పాక్కియత్తై"**-ఇది భాగ్యశబ్దభవం. **"భాగ్యం స్త్రీ నియతిర్విధిః"** అనే నిఘంటువచనంవల్ల అదృష్టమని అర్థం. **"పణిత్తు"**-ఇది **"పణ-వ్యవహారే స్తుతౌ చ"** అనే సంస్కృతభ్వాది ధాతువునుండి పుట్టిన వికృతిరూపంగా చెప్పవచ్చు. స్తుతించి- అని అర్థం. **"వాయ్ తిఅన్దొన్ఱు పణిత్తతుణ్డు"** - అని పెరియ తిరుమొళ్ల్ (2-8-9) సూక్తి.

పరమపావనులైన యతిరాజుల శ్రీపాదాలను ఆశ్రయించిన పెరియవాచ్చాన్ పిళ్ళై పూర్వం అనుగ్రహించిన ఇరుపత్తునాలాయిరప్పడి వ్యాఖ్యానాన్ని కృపజేసే మణవాళ మహామునుల సూక్తులు (వార్తలు) ఒక్కొక్కటే మనకు పరమపదాన్ని ఇచ్చి ఉజ్జీవనాన్ని ఇచ్చేవి కాబట్టి, వారిని నేరుగా సేవించినవారు పొందిన భాగ్యాన్ని మనకు చెప్పడానికి సాధ్యమా!

42. తామ్ మున్ ఇరుమ్ పూదూర్క్కోన్ తాన్ వణఙ్గుమ్ పరమపదమ్
తీ మునిన్దు శొరి వడక్కు త్తిరువీదిప్పిళ్ళై శొల్లాల్
తూమననాయ్ త్తమిళ్ మఱైయై త్తొకుత్తురైక్కు మణవాళ
మామునివన్ మలరడియై మరువాదార్ వాళ్వారే

తామ్ మున్ = తాము పూర్వం, ఇరుమ్ = ఉండే, పుతూర్కోన్ తాన్ = పెరుమ్బూదూర్‌లోని స్వామి అయిన శ్రీరామానుజులు, వణఙ్గుమ్ = నమస్కరించి, పరమపదమ్ = పరమపదాన్ని, తీ మునిన్దు = లౌకికజీవనం అనే చెడ్డపై కోపించి, శొరి = విస్తృతంగా పలికే, వడక్కు త్తిరువీదిప్పిళ్ళై శొల్లాల్ = వడక్కుత్తిరువీది ప్పిళ్ళై సూక్తులతో (ఈడు వ్యాఖ్యతో), తూ మననాయ్ = పవిత్రమైన మనస్సును కలవారై, తమిళ్ మఱైయై = ద్రావిడవేదాన్ని (సహస్రగీతిని), తొకుత్తు ఉరైక్కుమ్ = కూర్చి అనుగ్రహించే, మణవాళ మా మునివన్= మణవాళ మహామునుల, మలర్ అడియై = పూవువంటి శ్రీచరణాలను, మరువాతార్= ఆశ్రయించనివారు, వాళ్వారే = ఉజ్జీవించరు.

"శొరి" – ఎక్కువగా ఇవ్వడం, వర్షించడం అని అర్థం. **"తూ మఱై"**– పవిత్రద్రావిడవేదం – తిరువాయ్మొళ్ళి ప్రబంధం. **"మలరడి"**– భోగ్యతనుబట్టి, మార్దవం, ఆరుణ్యం మొదలైనగుణాలనుబట్టి పూలతో శ్రీపాదాలు రూపింపబడ్డాయి.

తాము పూర్వం నివసించే శ్రీపెరుమ్బూదూర్‌కు స్వామి అయిన ఎమ్బెరుమానార్ నమస్కరించే పరమపదాన్ని, ఈ లౌకికజీవనం అనే చెడ్డపై కోపించి, వడక్కుత్తిరువీదిప్పిళ్ళై విరివిగా అనుగ్రహించిన తిరువాక్కులచేత (ఈడు ముప్పత్తాఱాయిరప్పడి వ్యాఖ్యచేత) పరిశుద్ధం అయిన మనస్సును కలవారై, ద్రావిడవేదం అనే తిరువాయ్మొళ్ళియొక్క అర్థాన్ని కూర్చి అనుగ్రహించే మణవాళమహామునుల శ్రీపాదాలను ఆశ్రయించనివారు ఉజ్జీవనాన్ని పొందలేరు.

43. ఆళ్వార్‌కళ్ అరు మఱైయై ఆర్త్త ఎతిరాశనైయే
శూళ్ వాదికేశరి శొల్ శూరికళుక్కు అరుళ్ శెయ్యుమ్
తాళ్వాదుమ్ ఇల్లాద తకవన్ మణవాళముని
వాళ్వాక మణ్ణవర్క్కు మన్దిరత్తై విరిత్తానే

ఆళ్వార్‌కళ్ అరు మఱైయై = దివ్యసూరులు అనుగ్రహించిన అరుదైన ద్రావిడ వేదాన్ని, ఆర్త్త = కీర్తించిన, ఎతిరాశనైయే = భగవద్రామానుజులనే, శూళ్ = ఆశ్రయించే, వాది కేశరి శొల్ = వాదికేసరి అళ్ళకియ మణవాళచ్చీయర్ శ్రీసూక్తులను (పన్నీరాయిరప్పడిని), శూరికళుక్కు = పండితులకు, అరుళ్ శెయ్యుమ్ = అనుగ్రహించే వారు, తాళ్వు ఆతుమ్ ఇల్లాత = ఏ నైచ్యం (దోషం) లేని, తకవన్ = కరుణను

కలవారు అయిన, మణవాళముని = మణవాళమహామునులు, వాఝ్వు ఆక = ఉజ్జీవనం కలిగేటట్టుగా మణ్ణవర్క్కు = భూలోకవాసులకు, మన్దిరత్తై = మంత్రార్థాన్ని, విరిత్తానే = వివరించారు. (**"తకవు"** ను కలవాడు **"తకవన్".**)

ఆఝ్వార్లు అనుగ్రహించిన ద్రావిడవేదాలను కీర్తించే యతిరాజులనే ఆశ్రయించే వాదికేసరి అఝకియ మణవాళచ్చీయర్ పన్నీరాయిరప్పడి వ్యాఖ్యను దాసులకు అనుగ్రహించేవారు, ఏ దోషం లేనివారు, కరుణను కలవారు అయిన మణవాళ మామునులు భూలోకంలో నివసించేవారికి ఉన్నతగతిని కల్గించే మంత్రాన్ని వివరించి, కృపజేశారు.

44. విరి పుకఝ్ ఎమ్బెరుమానార్ విశయత్తాల్ అవర్క్కాళాయ్
ప్పెరియ పుకఝ్ అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్
ఉరియ మొఝికళై అరుళాల్ ఉరైక్కు మణవాళముని
తెరివరియ తిరుప్పుకఝై త్తేరుమవర్ దేవర్కళే

విరి పుకఝ్ = విస్తరించిన కీర్తిని కల, ఎమ్బెరుమానార్ = భగవద్రామానుజుల, విశయత్తాల్ = విజయంవల్ల, అవర్క్కు ఆళాయ్ = వారికి దాసులై, పెరియ పుకఝ్ = గొప్ప కీర్తిని కల, అరుళాళ ప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ = అరుళాళ ప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనే ఆచార్యుల, ఉరియ మొఝికళై = స్వరూపానురూపం అయిన శ్రీసూక్తులను, అరుళాల్ = దయతో, ఉరైక్కుమ్ = వ్యాఖ్యానించే, మణవాళముని = మణవాళమహామునులయొక్క, తెరివరియ = తెలియడానికి సాధ్యం కాని, తిరు ప్పుకఝై = గొప్ప యశస్సును, తేరు మవర్ = తెలిసినవారు, దేవర్కళే = నిత్యసూరులే.

"ఎమ్బెరుమానార్ విశయత్తాల్ అవర్క్కాళాయ్"–"అహ మస్యావరో భ్రాతా గుణై ర్దాస్య ముపాగతః" అని లక్ష్మణుడు అన్నట్లుగా శ్రీరామానుజుల విజయపరంపరలవల్ల వారికి దాసులై అని భావం. రామానుజుల విజయానికి కారణాలు అయిన గుణాలు అనేకం. పిళ్ళై ఉఱజ్గావిల్లి దాసర్వంటి కొందఱు రూపగుణాలవల్ల, కూరేశులవంటి మఱి కొందఱు స్వరూపగుణాల వల్ల జయింపబడి దాసులు అయ్యారు. **"అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ ఉరియ మొఝికళై"** – ఈ ఆచార్యులు పూర్వాశ్రమంలో యజ్ఞమూర్తి అనే అద్వైతి మహా విద్వాంసులు. వీరిని శ్రీరామానుజులు వాదంలో జయించిన చరిత్ర సుప్రసిద్ధం. వీరు జ్ఞానసారం, ప్రమేయసారమనే రెండు అద్భుత కృతులను రచించారు. వీటికి వరవరమునుల వ్యాఖ్యలున్నాయి. **"తెరియ వరియ . . . . తేరు మవర్"**– తెలియడానికి సాధ్యం కాని వరవరమునుల కీర్తిని తెలియడం ఏమి? అని అంటే, తెలియడం సాధ్యం కానిదని తెలియడమే. అపుడేకదా

యథార్థజ్ఞానం అవుతుంది. అటువంటివారు **"దేవర్కళ్"** దేవతలు. అంటే-నిత్యసూరులు. **"దివు-దీప్తౌ"** అనే అర్థాన్నిబట్టి **"దేవర్కళ్"** ప్రకాశించేవారని అర్థం. **"తద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే"** అని వేదంకూడా వారు ప్రకాశిస్తారని అన్నది కదా!

గొప్ప కీర్తిని కల భగవద్రామానుజుల గొప్పతనంవల్ల వారికి దాసులైన గొప్ప యశస్సును కల అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానారుల శ్రీసూక్తులను తమ కరుణతో వివరించే మణవాళమహామునుల మిక్కిలి గొప్ప యశస్సులను తెలిసినవారు దేవతలతో సమానులు కాగలరు.

45. ఏఱు పుకళ్ర్ ఉలకారియన్ ఇయల్ తత్తువత్తిరియత్తిన్
ఆఱు విరిత్తు ఎతిరాశర్క్కు ఆట్చెయ్ మణవాళముని
కూఱు కలై అతికరిక్కుమ్ కూర్ మదియోర్ అల్లామల్
వేఱు శిలర్ వేదాన్త విళ్లుప్పొరుళై క్కాణారే

ఏఱు = వృద్ధిచెందే, పుకళ్ర్ = కీర్తిని కల, ఉలకారియన్ = శ్రీపిళ్ళైలోకాచార్యులవారి, తత్తువత్తిరియత్తిన్ ఇయల్ = చిదచిదీశ్వరతత్త్వాల స్వభావాన్ని, వివరించే తత్త్వత్రయమనే రహస్యగ్రంథంయొక్క, ఆఱు = తీరును, విరిత్తు = వివరించి, ఎతిరాశర్క్కు = యతిరాజులకు, ఆళ్ శెయ్ద = శ్రీరామానుజులకు కైంకర్యం చేసే, మణవాళముని = మణవాళ మహామునులు, కూఱు కలై = అనుగ్రహించే శాస్త్రాలను (గ్రంథాలను), అతికరిక్కుమ్ = అధికరించే, కూర్ మదియోర్ అల్లామల్ = నిశితమైన మనస్సును కలవారు తప్ప, వేఱు శిలర్ = అన్యులు కొందఱు, వేదాన్త విళ్లు ప్పొరుళై = వేదాంతంలోని యథార్థాన్ని, కాణారే = దర్శించలేరు.

తత్త్వత్రయాన్ని వ్యాఖ్యానించి, శ్రీరామానుజులను సేవించారని అనడం ఏమి? అంటే శ్రీరామానుజులు ప్రవర్తింపజేసిన విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని వివరించే తత్త్వత్రయాన్ని వ్యాఖ్యానించి శ్రీరామానుజుల ముఖోల్లాసాన్ని కల్గించారని అనడమే. మణవాళ మహామునుల గ్రంథాలలోని అర్థాన్ని తెలియాలంటే నిశితమైన బుద్ధి కావాలి. ఆ విధంగా బుద్ధినైశిత్యాన్ని కల్గి, వరవరముని గ్రంథపర్యాలోచనను చేసినవారికే **"వేదాన్త విళ్లుప్పొరుళ్"**-వేదాలలోని ఉన్నతమైన తత్త్వం. శ్రీమన్నారాయణుడే ఉపాయం, ఉపేయం-అనే అర్థం తెలుస్తుంది. అన్యులెవ్వరూ దర్శించలేరు.

గొప్ప పేరును కల శ్రీలోకాచార్యులవారి గ్రంథం అయిన తత్త్వత్రయంయొక్క అర్థాన్ని విశదీకరించి, వ్యాఖ్యానించి, శ్రీరామానుజులకు కైంకర్యం చేసేవారైన మణవాళ మహాముల గ్రంథాలను అభ్యసించే నిశితమైన జ్ఞానం కల్గినవారు తప్ప వేఱు ఎవరూ వేదాంతంయొక్క నిజమై అర్థాన్ని తెలియలేరు.

46. కాణాదర్ కపిలర్ కురు కపాలి కుతర్క్కమతఙ్గళ్
కాణాద పడి యఴియ క్కలై శెయ్ ఉలకారియన్ శొల్
పూణాక ఎతిపతియై ప్పోఱ్ఱుఱు మణవాళన్‌తాళ్
పేణాద చేతనరై ప్పేయెన్బర్ పెరియోరే

కాణాదర్ = కాణాదులు, కపిలర్ = కపిలురు, కురు కపాలి = కాపాలికులు, మొదలైనవారి, తర్క్క మతఙ్గళై = కుతర్కాలతో కూడిన మతాలను, కాణాత పడి = అవి కన్పించని రీతిలో, అఴియ = నశించేటట్టుగా, కలై శెయ్ = గ్రంథాలను రచించే, ఉలకారియన్ శొల్ = శ్రీపిళ్ళైలోకాచార్యులవారి వాక్కులను, పూణ్ ఆక = ఆభరణంగా కల, ఎతిపతియై = యతిరాజులను, పోఱ్ఱుమ్ = కీర్తించే, మణవాళన్ తాళ్ = మణవాళమహాముసుల శ్రీచరణాలను, పేణాత = అభిమానించని, చేతనరై = జీవులను, పెరియోర్=పెద్దలు, పేయ్ ఎన్బర్ = దెయ్యాలని అంటారు.

కణాదుడు – వైశేషిక మత ప్రవర్తకుడు, కపిలముని సాంఖ్యమత ప్రవర్తకుడు, వీరి మతాలను అనుసరించేవారు కాణాదులు. కపిలురు, కపాలి అయిన శివుని పరదైవమని వాదించే వామాచారులు కాపాలికులు. వీరి మతాలు నాస్తికమతాలు, వేదసిద్ధాంతవిరుద్ధాలు. ఇవి అన్నీ కుతర్కాలతో నిండి ఉంటాయి. ఈ మతాలను అన్నింటినీ శ్రీపిళ్ళైలోకాచార్యులవారు తత్త్వత్రయాది గ్రంథాలలో నిర్వీర్యం చేశారు. **"పూణ్"**– ఈ పదమే తెలుగులో బంగారమని అర్థమిచ్చే **"పొన్ను"**గా మారింది.

కాణాదులు, కపిలురు, కాపాలికులవంటివారి మతాలు కుతర్కాలతో నిండి ఉంటాయి. అవి నశించేటట్లు గ్రంథాలను అనుగ్రహించిన పిళ్ళైలోకాచార్యుల శ్రీసూక్తులను ఆభరణంగా కల్గిన యతిరాజులను కీర్తించే మణవాళమహామునుల శ్రీపాదాలను అభిమానించని మానవులను దెయ్యాలని పెద్దలు అంటారు.

47. ఎన్ పరమకారుణికన్ ఎతిరాశన్ ఎన్ఱిఱైఞ్జి
అన్బరుయ ఉలకారియన్ అరుళ్ వశనపూడణత్తై
మున్బరుళి నమక్కురైత్త మూర్త్తి మణవాళముని
పొన్బఱ్ఱాన్తిరువడియై ప్పోఱ్ఱుమవర్ పుకలెమక్కే

"ఎన్ పరమకారుణికన్ ఎతిరాశన్" = మా పరమకారుణికులు యతిరాజులు, ఎన్ఱు ఇఱైఞ్జి = అని ప్రార్థించి, అన్బర్ ఉయ = భక్తులు ఉజ్జీవించేటట్లుగా, ఉలకారియన్ అరుళ్ = పిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించే, వశన పూడణత్తై = శ్రీవచనభూషణాన్ని, మున్బు = పూర్వం, అరుళి = అనుగ్రహించి, నమక్కు ఉరైత్త = మనకోసం వ్యాఖ్యానించిన, మూర్త్తి = దివ్యమంగళవిగ్రహాన్ని కల, మణవాళ ముని = మణవాళ మహామునుల,

పొన్ పఙ్కు ఆమ్ తిరువడియై = బంగారు తామరలవంటి శ్రీచరణాలను, పోఱ్ఱుమవర్ = మంగళాశాసనం చేసేవారు, ఎమక్కు పుకల్ = మాకు శరణం.

"మణవాళమామునివన్ పొన్నడియామ్ శెఙ్గమల పోప్దుకళ్" అని అని అన్నట్లు **"పొన్బఙ్కాన్తిరువడి"** అని అన్నారు. **"పఙ్కు"**- సంస్కృతంలోని పద్మశబ్దానికి వికృతి. **"ఆమ్"** ఉపమావాచకం. వరవరముని పాదాలు మాకు శరణం అని అనకుండా ఆ శ్రీచరణాలను పొగడేవారు మాకు శరణం-అని అనడంవల్ల చరమపర్వంలో చరమపర్వం సూచింపబడింది. **"మూర్త్తి"** - రూపాన్ని కలవారు - దివ్యమంగళవిగ్రహవిశిష్టులని భావం. **"మూర్ఛా- మోహసముచ్ఛ్రాయయోః"** అనే ధాతువునుండి పుట్టిన మూర్తిశబ్దం ఇచ్చే మోహాన్ని కల్గించేది, అని ఉన్నతమైనది అనే అర్థాలు శ్రీవరవరమునుల రూపంలో అన్వయిస్తాయి.

"మా పరమకారుణికులైన భగవద్రామానుజులు" అని ప్రార్థించి, భక్తులు ఉజ్జీవించడంకోసం లోకాచార్యులు అనుగ్రహించిన శ్రీవచనభూషణం అనే గ్రంథాన్ని మనకు వివరించి అనుగ్రహించిన మణవాళమహామునుల బంగారు తామరలవంటి పాదాలను కీర్తించేవారు మాకు శరణం కాగలరు.

48. మక్కళ్ ఇఱై పిఱవి కురు మాతా పితా మాదర్ తనమ్
తక్క కతి శరణెల్లామ్ తమక్కు ఎతిరాశనెన్ఱు
మిక్కడైన్ద వైయకురు మెయ్ కలైయై వివరిక్కుమ్
ముక్కియ శీర్ మణవాళ ముని మొழிయిల్ మూழ்కినమే

మక్కళ్ = సంతానం, ఇఱై = దైవం, పిఱవి = ఉన్నతమైన జన్మ, కురు = గురువు, మాతా పితా = తల్లి తండ్రి, మాతర్ = స్త్రీలు (భార్యలు) తనమ్ = ధనం, తక్క కతి = తగిన గతి, శరణ్ = శరణం, ఎల్లామ్ = అన్నీ, తమక్కు = తమకు, ఎతిరాశన్ ఎన్ఱు = యతిరాజులే అని, మిక్కు అడైన్ద = గొప్పగా ఆశ్రయించిన, వైయ కురు = పిళ్ళైలోకాచార్యులవారి, మెయ్ కలైయై = సత్యమైన విషయాలను ప్రతిపాదించే గ్రంథాలను, వివరిక్కుమ్ = వివరించే, ముక్కియ శీర్ = గొప్ప కళ్యాణగుణాలను కల, మణవాళ ముని = మణవాళ మహామునుల మొழிయిల్ = శ్రీసూక్తులలో, మూழ்కినమే= అవగాహించాము కదా! ఆహా!

"శేలేయ్ కణ్ణియరుమ్ పెరుమ్ శెల్వముమ్ నన్మక్కళుమ్ మేలా త్తాయ్ తన్దైయుమ్ అవరే" అని అంటూ సర్వం భగవానుడే అని ఆழ்వార్లు అన్నారు. **"మాతా పితా యువతయ స్తనయా విభూతిః సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ . . . . వకుళాభిరామమ్"** అని అంటూ యామునులు సర్వవిధ బంధువు నమ్మాழ்వార్లే అని అన్నారు. ఈ రీతిలోనే సర్వం శ్రీరామానుజులే అని శ్రీ పిళ్ళైలోకాచార్యులవారు భావించారని ప్రబంధకర్త సూక్తి.

"మెయ్ క్కలై"-యథార్థతత్త్వాన్ని ప్రతిపాదించే గ్రంథాలు కనుక అవికూడా **"మెయ్"**. **"ముక్కియ శీర్"** - అతిశయాన్ని కల్గిన కల్యాణగుణాలు-అని అర్థం. **"ముడిత్తు క్కొణ్డ ముక్కియముమ్"** అనే తిరువాయ్‌మొழ్రి సూక్తి (5-10-9) భావ్యం. సంస్కృతంలోని ముఖ్య శబ్దవికృతి ఇది. **"మణవాళముని మొழ్రియిల్ మూழ్గికినమే"**-అని అంటూ తాము కూడా ఒక ఆழ్వార్లు అనే స్వారస్యాన్ని ప్రబంధకర్త సూచించారు.

సంతానం, దైవం, ఆచార్యుడు, తల్లి, తండ్రి, భార్య, సంపద, తగిన మార్గం, శరణం - అన్ని తమకు భగవద్రామానుజులే అని భావించి, వారిని ఆశ్రయించిన లోకాచార్యులు అనుగ్రహించిన గ్రంథాలను వివరించే గొప్ప గుణాన్ని కల మణవాళ మహామునుల శ్రీసూక్తులలో మనం మగ్నులమయ్యాము.

49. ఇన మేదుమ్ ఇల్లామల్ ఇలకుమ్ ఇరామానుశనై
తిన మేత్తి వైయకురు తిరుత్తమ్బి శెయ్ కలైయై
మన మేత్తి విరిత్తరుళుమ్ మణవాళ మామునియై
త్తిన మేవుమ్ అడియార్క్కు త్తర మఱిన్దు మేవుమినే

ఇనమ్ ఏతుమ్ = సాటి ఏదీ, ఇల్లామల్ = లేకుండా, ఇలకుమ్ = వెలిగే, ఇరామానుశనై = శ్రీరామానుజులను, తినమ్ ఏత్తి = ప్రతిదినం స్తుతించే, వైయ కురు = శ్రీపిళ్ళైలోకాచార్యులవారి, తిరుత్తమ్బి = తమ్ములు, అழ్గకియ మణవాళప్పెరుమాళ్ నాయనార్, శెయ్ కలైయై = అనుగ్రహించిన గ్రంథాలను, మనమ్ ఏత్తి = మనస్సులో కీర్తించి, విరిత్తు అరుళుమ్ = వివరించే, మణవాళ మహామునియై = మణవాళ మహామునులను, తినమ్ మేవుమ్ = నిత్యం సేవించే, అడియార్క్కు = దాసులకు, తరమ్ అఱిన్దు = వారి వైలక్షణ్యాన్ని తెలిసి, మేవుమినే = ఆదరించండి.

"ఇన మేతుమ్ ఇల్లామల్" - సాటి లేని అని అర్థం. **"ఇన మేతు మిలానై అదైవతుమే"** అనే తిరువాయ్‌మొழ్రి సూక్తి (9-3-5) భావ్యం. అழ్గకియమణవాళ ప్పెరుమాళ్ నాయనార్ అనే ఆచార్యులు శ్రీపిళ్ళైలోకాచార్యులవారికి తమ్ములు. వీరు ఆచార్యహృదయం, అరుళిచ్చెయల్ రహస్యం అనే స్వతంత్రగ్రంథాలను, కణ్ణినుణ్ శిఱుత్తామ్బు, అమలనాది పిరాన్, తిరుప్పావై మొదలైన ప్రబంధాలకు విశదగంభీర వ్యాఖ్యలను రచించారు. **"తమ్‌శీరాల్ వైయకురు తమ్బి మన్ను మణవాళముని శెయ్యుమవై తాముమ్ శిల"** అని అంటూ ఉపదేశరత్తిన మాలైలో మణవాళమహామునులు వ్యాఖ్యలను గూర్చి పలికారు.

తక్కువదనం ఏమీ లేకుండా ఉండే శ్రీరామానుజులను ప్రతిదినం స్తుతించే లోకాచార్యుల అనుజులైన అழ్గకియ మణవాళప్పెరుమాళ్ నాయనార్ అనుగ్రహించిన

సూక్తులను మనస్సులో ధరించి, వ్యాఖ్యానించే మణవాళమహామునులను సేవించే దాసుల గొప్పతనాన్ని తెలిసి, వారిని ఆశ్రయించండి.

50. మేవి ఎతిరాశనైయే మెయ్ ప్పొరుళై చ్చురుక్కాక
త్తావిత్త విళాఞ్జోలైప్పిళ్ళై తరత్తనిమొళ్ళియై
ప్పావిత్త మణవాళ మామునివన్ పదఙ్గళైయే
శేవిత్త తిరువాళర్ శెకత్తు క్కోర్ శెల్లుమ్ పూణే

ఎతిరాశనైయే మేవి = భగవద్రామానుజులనే ఆశ్రయించి, మెయ్ పొరుళై = యథార్థతత్త్వాన్ని, శురుక్కాక = సంగ్రహంగా, తావిత్త = స్థాపించిన, విళాఞ్జోలైప్పిళై = విళాఞ్జోలైప్పిళ్ళై అనుగ్రహించిన, తర త్తని మొళ్ళియై = వైలక్షణ్యాన్ని కల, అద్వితీయమైన సూక్తి అయిన సప్తగాథను, పావిత్త = భావించిన మణవాళ మాముని = మణవాళ మహామునుల, వన్ పదఙ్గళైయే = గొప్ప శ్రీచరణాలనే, శేవిత్త = సేవించిన, తిరువాళర్ = సంపదను కలవారు, శెకత్తుక్కు = లోకానికి, ఓర్ = నిబిడమైన (అద్వితీయమైన) శెల్లుమ్ పూణే = గొప్ప ఆభరణమే.

భగవానుని శ్రీచరణసేవను చేయడం గొప్ప సంపద అనే విషయం **"లక్ష్మణో లక్ష్మిసంపన్నః", "స తు నాగవరః శ్రీమాన్"** ఇత్యాది సూక్తులు తెలుపుతున్నవి. ఇక్కడ **"మణవాళమాముని పదఙ్గళైయే శేవిత్త తిరువాళర్"** – అని శ్రీవరవరమునుల శ్రీచరణాలను అనన్యంగా సేవించడం గొప్ప సంపద–అని తెలుపబడడంద్వారా పై ఉపబృంహణసూక్తుల అర్థం చరమపర్వంలో అనుసంధింపబడింది. శ్రీవచనభూషణంలో శ్రీపిళ్ళైలోకాచార్యుల వారు తెల్పిన అర్థతత్త్వాన్ని విళాఞ్జోలైపిళ్ళై అనే ఆచార్యులు సప్తగాథ అనే తమ ప్రబంధంలో సంగ్రహంగా తెలిపారు. అందువల్ల **"మెయ్ ప్పొరుళై చ్చురుక్కాక త్తావిత్త"** అని చెప్పబడింది. **"మణవాళమాముని వన్ పదఙ్గళైయే"** – అనిఅంటూ **"వన్"** అనే పదాన్ని పదాలకు విశేషణంగా చేయవచ్చు. అపుడు బలిష్ఠమైన, చాతుర్యాన్ని కల, ఆశ్రితసంరక్షణ సమర్థమైన శ్రీచరణాలని అర్థం.

భగవద్రామానుజుల శ్రీపాదాలనే ఆశ్రయించి, యథార్థతత్త్వాన్ని చాలా సంగ్రహంగా విళాఞ్జోలైప్పిళ్ళై సప్తగాథ అనే గ్రంథంలో అనుగ్రహించిన అర్థాలను వ్యాఖ్యానించే మణవాళ మహామునుల శ్రీపాదాలను సేవించేవారు లోకానికే గొప్ప అలంకారాలవలె ప్రకాశిస్తారు.

51. పూణాలుమ్ ముక్కోలుమ్ పునై శికైయుమ్ తువరుడైయుమ్
శేణార్త్తువ పుణ్డరముమ్ శేర్న్ద ఎతిశేకరన్ మున్

నాళ్ నూఱ్ఱదినిరుపదాణ్డు నాన్మఱైయై నోక్కి ప్పిన్
కాణూలఱి వరవరనాయ్ క్కాత్తళిత్తాన్ తమిళ్ఱ్కలైయే

పూణూలుమ్ = యజ్ఞోపవీతాన్ని, ముక్కోలుమ్ = త్రిదండాన్ని, పునై శిక్రైయుమ్= ముడివేయబడ్డ శిఖను, తువరుడైయమ్ = కాషాయాంబరాన్ని, శేణ్ ఊర్త్తువ పుణ్డరముమ్ = దీర్ఘమైన (ఉన్నతమైన) ఊర్ధ్వపుండ్రాన్ని, శేర్న్ద = కల్గిన, ఎతిశేకరన్ = యతిరాజులు, మున్ = పూర్వం, నూఱ్ఱదిన్ ఇరుపదు ఆణ్డు నాళ్ = నూట ఇరవై సంవత్సరాల కాలం, నాల్ మఱైయై నోక్కి = చతుర్వేదాలను కాపాడి, ప్పిన్ కాణ్ = తరువాత కదా, నూలఱి = శాస్త్రగ్రంథాలను తెలిసిన, వరవరనాయ్ = మణవాళ మహామునులై, తమిళ్ఱ్ కలైయే= ద్రావిడప్రబంధాలను, కాత్తు అళిత్తాన్ = రక్షించారు.

"ఉపవీతిన మూర్ధ్వపుండ్రవంతం త్రిజగత్పుణ్యఫలం త్రిదండహస్తమ్, శరణాగతసార్థవాహ మీడే శిఖయా శేఖరిణం పతిం యతీనామ్" అనే యతిరాజసప్తతిసూక్తి క్రమంలో మొదటి రెండు పాదాలు రచింపబడ్డాయి. పైన పేర్కొన్నవి అన్ని శ్రీవైష్ణవయతి చిహ్నాలు. రెండు వందల సంవత్సరాల కాలం భూమిపై వేంచేసి ఉండి వైదిక తత్త్వాలను ప్రవర్తింపజేయమని భగవానుడు ఆదిశేషుని ఆజ్ఞాపించగా, ఆదిశేషుడు శ్రీరామానుజు లుగా అవతరించి 120 ఏండ్ల కాలం భూమిపై వేంచేసి ఉండి **"తస్మై రామానుజార్యాయ నమః పరమాయోగినే, ... యః శ్రుతిస్మృతిసూత్రాణా మంతర్జ్వర మశీశమత్"** అన్నట్లు వేదాలకు కల్గిన అంతర్జ్వరాన్ని వేదార్థసంగ్రహం, శ్రీభాష్యం మొదలైన కృతులద్వారా యథార్థాన్ని వివరించి, ఉపశమింపజేసి అవతారం చాలించారు. తరువాత మణవాళమామునులుగా అవతరించి ద్రావిడవేదాలుగా చెప్పబడే ఆళ్వార్ల ప్రబంధాలను తమ వ్యాఖ్యలతో సూక్తులతో కాపాడారు – అనే ఐతిహ్యం చివరి రెండు పాదాలలో ప్రస్తుతం. **"నూలఱి"** – వేదరూపశాస్త్రాలను తెలిసినవారని అర్థం. **"అఱివు"** (జ్ఞానాన్ని) కలవారు **"అఱి"** – **"ఆళ్రమ్"**ను కలవాడు **"ఆళ్రి"** అయినట్లు. **"అఱి"** – అంటే జ్ఞానమనికూడా అర్థం. **"తువర్"** – తెలుగులో తొగరుగా మారింది. ముదురు ఎఱుపు రంగు అని అర్థం.

యజ్ఞోపవీతం, త్రిదండం, అందమైన శిఖ, కాషాయాంబరం, ఊర్ధ్వపుండ్రం కల యతిరాజులు పూర్వం నూటఇరవై సంవత్సరాలకాలం వేంచేసి ఉండి, సంస్కృత వేదాలను రక్షించి, తరువాత, శాస్త్రాలను అభ్యసించి, తెలిసిన మణవాళ– మహామునులై అవతరించి ద్రావిడవేదాలైన దివ్యసూరుల దివ్యప్రబంధాలను కాపాడారు.

52. కళైకళైళ్రాక్కరుణైయినాల్ కాత్తరుళుమ్ ఎతిపతియే
కళైకణ్ ఎమక్కెన క్కరుతి క్కళిత్త మణవాళముని

విళై కళ్ణి అరుట్పయిర్క్కు విరుమ్బుమవర్క్కు అరుమ్బిఱప్పామ్
తళై కళ్ల అరుళల్లాల్ తళర్న్దవర్క్కు ఆర్ తావళమే

కళైకళ్ ఎఱ్లా = కలుపు మొలవని (దోషం లేని), కరుణైయినాల్ = కరుణతో, కాత్తరుళుమ్ = రక్షించే, ఎతిపతియే = యతిపతియే, ఎమక్కు = మాకు, కళై కణ్ = రక్షకుడు, ఎన కరుతి = అని భావించి, కళిత్త = సాత్త్వికాహంకారాన్ని పొందిన, మణవాళ ముని = మణవాళ మహామునులు, విళై = అంకురింపజేసిన, కళ్ణి = సస్యక్షేత్రంలోని, అరుళ్ పయిర్క్కు = కృపాసస్యాన్ని, విరుమ్బుమవర్క్కు = ఆశించేవారికి, అరుమ్ = అరుదైన, పిఱప్పామ్ తళై = జన్మ అనే సంకెళ్ళు, కళ్ల = తొలగాలంటే, అరుళ్ అల్లాల్= వారి కరుణతప్ప, తళర్న్దవర్క్కు = సంసారంలో తాపాన్ని పొందేవారికి, తావళమ్ ఆర్ = శరణు ఎవరు ? (ఉపఘ్నం – పట్టుకొమ్మ ఎవరు ?)

కళైకళ్ ఎఱ్లా క్కరుణైయినాల్ – భగవానుని కృప నిరంకుశ స్వాతంత్ర్యదోష దూషితం, కాని, యతిరాజుల కరుణ అటువంటిదికాదు. **"కళై"** – కలుపు. పైరు పెరుగుదలకు అడ్డువచ్చే రెల్లువంటి మొక్కలు. **"కళైకణ్"** – కలుపు తీసేవాడు. రక్షకుడు అని అర్థం. **"కళైకణీయే", "కళైకణ్ మఱ్ఱిలేన్"** ఇత్యాది దివ్యసూరిసూక్తులు, **"మఱ్ఱోర్ కళైకణ్ ఇల్లేన్"** అనే తేవారం సూక్తి ఉదాహరణాలు. **"కళిత్త మణవాళముని"** – యతిరాజులే మనకు రక్షకులనే గర్వం. ఇది **"అబిమానతుజ్గన్ శెల్వనై పోల"** అన్నట్లు సదాచార్యసంబంధప్రయుక్తమైన సాత్త్వికాహంకారం, కాబట్టి ఉపాదేయం. **"పల్లురువై యెల్లామ్ పడర్విత్త విత్తా"** అని, **"పత్తియుళ్లువన్"**–అని భగవానుడు భక్తిసస్య రక్షకుడు. అయినట్లే మణవాళమాముని కూడా **"అరుళ్ పయిర్"**ను పండించే కృషీవలులు. **తావళమ్** – ఆశ్రయం, ఉపఘ్నం – అని అర్థం. **"తళన్దార్ తావళమ్"** – అని ఈడులో (6-1-7) ప్రయోగం. **తాఙ్గివు ఇడమ్ – తావళమ్. కళ్ణి** – చేను – క్షేత్రం.

దోషం లేని కరుణతో మనలను రక్షించే యతిరాజులే మనకు శరణం–అని ఆనందించిన మణవాళ మహామునులు అంకురింపజేసే కృపాసస్యాన్ని కోరేవారికి జన్మ అనే సంకెళ్ళు తొలగడంకోసం వారి కృప తప్ప ఆర్తి చెందినవారికి వేఱు శరణం ఏమి ఉన్నది ?

53. వళ మిక్క ఎతిరాశన్ వణ్మైయినాల్ ఉయ్న్దమైయాల్
ఉళ మకిళ్లుమ్ మణవాళయోకి ఉపదేశత్తాల్
ఇళ మదిపోల్ మతి కిళైక్కుమ్ ఇలకు అట్ట తిక్కయజ్గళ్
ఉళర్ అవన్దన్ తిరువడియై ఉలకర్ అడైన్దు ఉయ్వదఱ్కే

వళమ్ మిక్క = మిక్కిలిగా సారాన్ని కల, ఎతిరాశన్ = యతిరాజుల, వణ్మైయినాల్ = ఔదార్యంవల్ల, ఉయ్న్దమైయాల్ = ఉజ్జీవించినందువల్ల, ఉళ మకిళ్ళుమ్= మనస్సులో సంతోషించే, మణవాళ యోకి = మణవాళ మహామునుల, ఉపదేశత్తాల్ = ఉపదేశంవల్ల, ఇళ మతిపోల్ = బాలచంద్రునివలె, మతి కిళైక్కుమ్ = బుద్ధి శాఖోప శాఖలుగా వృద్ధి చెందుతుంది. ఇలకు = ప్రకాశించే, అట్ట తిక్కయజ్గళ్ = అష్టదిగ్గజాలనే విద్వాంసులు, అవన్తన్ తిరువడియై = ఆ మణవాళమహామునుల శ్రీచరణాలను, ఉలకర్ = లోకులు, అడైన్దు = ఆశ్రయించి, ఉయ్వదఱ్కు = ఉజ్జీవించడంకోసం ఉళర్ = ఉన్నారు.

వళమ్ - సారవంతమైన. **"ఇళమతిపోల్ మతి కిళైక్కుమ్"**- మొదటి **'మతి'** అనే పదం ద్రావిడం; చంద్రుడని అర్థం. (**"మతి నిఱైన్ద నన్నాళ్"** - అనే చోటవలె. రెండవ **మతి** అనే పదం సంస్కృతం "బుద్ధి అని అర్థం". **"ధీః ప్రజ్ఞా శేముషీ మతిః"** అని నిఘంటువాక్యం. శ్రీవరవరమునుల ప్రధానశిష్యులు ఎనిమిదిమంది. వీరికే అష్టదిగ్గజాలని పేరు. వీరు **"పారారు మజ్జై తిరువేజ్గడముని పట్టర్‌పిరాన్ ఆరామమ్ శూళ్న్ద కోయిల్ కన్దాడై అణ్ణన్ ఎఱుమ్బియప్పా, ఏరారుమ్ అప్పిళ్ళై అప్పుళ్ళార్ వాదిపయఙ్కరన్ పేరార్న్ద దిక్కయమ్** - అని అనే రీతిలో వానమామలై జీయర్, ఎమ్బెరుమానార్ జీయర్, పట్టర్ పిరాన్ జీయర్, కన్దాడై అణ్ణన్, ఎఱుమ్బియప్పా, అప్పుళ్ళార్, అప్పిళ్ళై, ప్రతివాదిభయంకరమ్ అణ్ణన్ - అనబడే ఎనిమిదిమంది. **"మణవాళయోకి ఉపదేశత్తాల్ ఇళ మతిపోల్ మతి కిళైక్కుమ్"** - ఈ ప్రయోగాన్ని **"అట్టతిక్కయజ్గళ్"** అనే పదానికి విశేషణంగా చేసి అన్వయించడంలోను స్వారస్యం ఉన్నది. మణవాళమహామునుల ఉపదేశాలవల్ల వృద్ధిచెందిన జ్ఞానాన్ని కలవారని భావం. ఈ అన్వయంలో ఈ ప్రయోగం అసమాపక క్రియాంతరూపం.

మిక్కిలి సారాన్ని కల యతిరాజుల ఔదార్యగుణంవల్ల ఔన్నత్యాన్ని పొంది, మనస్సులో సంతోషించే మణవాళమహామునుల ఉపదేశంచేత చంద్రుడు శుక్లపక్షంలో వర్ధిల్లేటట్లుగా జ్ఞానం వృద్ధి అవుతుంది. లోకులు వారి శ్రీపాదాలను అశ్రయించి, ఉజ్జీవించడంకోసం వారిచేత నియమింపబడ్డ అష్టదిగ్గజాలనబడే శిష్యులు ఉన్నారు.

54. తర్క్కత్తాల్ వేణ్డిన్ఱై త్తాపిక్క చ్చెరుక్కిరుక్క
ముఱ్ఱురుక్కళ్ ఉపదేశమ్ ముక్కియ మెన త్తెళిన్దు
కఱ్కు మణవాళముని కాణ్మిన్ ఎతిరాశనవన్
నిఱ్క మఱ్ఱోర్ కఱ్పిత్త నిలై నమక్కు వేణ్డోమే

తర్క్కత్తాల్ = తర్కబలంతో, వేణ్డిఱ్ఱై = తాము కోరినదానిని, తాపిక్క = స్థాపించడానికి తగిన, శెరుక్కు ఇరుక్క = బలం ఉన్నా, మున్ కురుక్కళ్ = పూర్వాచార్యులు, ఉపదేశమ్ = ఉపదేశాలు, ముక్కియమ్ ఎన తెళిన్దు = ముఖ్యం అని తెలిసికొని, కఱ్కుమ్ = అభ్యసించే, మణవాళముని = మణవాళమహాముునులు, ఎతిరాశన్ కాణ్మిన్ = యతిరాజులే సుమా !, అవన్ నిఱ్క = ఆ మణవాళమహాముునులు ఉండగా, మఱ్ఱోర్ కఱ్పిత్త = ఇతరులు కల్పించిన, నిలై = స్థితి, నమక్కు వేణ్డోమ్ = మనకు వద్దు.

"మున్నోర్ మొళ్థిన్ద ముఱై తప్పామల్ కేట్టు పిన్నోర్న్దు తామదనై ప్పేశాతే తన్నెఞ్జిల్ తోఱ్ఱినతే శొల్లి ఇతు శుత్త వుపదేశ వరవాఱ్ఱై ఎన్బర్ మూర్క్కరావార్" అనే ఉపదేశరత్తినమాలైలోని పాశురార్థం ప్రకృతంలో స్మరణీయం.

తర్కంతో మనకు అభిలషితాలైన అర్థాలను స్థాపించడానికి తగిన శక్తి ఉన్నా, పూర్వులైన మన ఆచార్యులు ఉపదేశించినవే మనకు ముఖ్యం అని తెలిసి, అభ్యసించినవారు మణవాళమామునులు. యతిరాజుల అపరావతారం అయిన వారు మనకు ఉపదేశించిన మార్గం తప్ప వేరు దారులు ఏవీ వద్దు.

55. వేణ్డామల్ వెఱుమ్ పులవర్ వీళ్థ్ పొరుళై మేలైయర్ శొల్
తాణ్డాత ఎతిరాశన్తాళ్ వణఙ్గుమ్ వరయోకి
శేణ్ తామరైత్తాళ్కళ్ శెన్నిక్కోర్ మణిముడియాయ్
పూణ్డార్క్కు ప్పూముడియుమ్ పొన్ ముడియుమ్ పరమామో

వెఱుమ్ పులవర్ = వ్యర్థమైన పాండిత్యాన్ని కలవారు కోరే (యథార్థ తత్త్వాన్ని తెలియని పండితులు), వీళ్థ్ = పతనం చెందే (వ్యర్థమైన), పొరుళై = నశ్వరాలైన సుఖాలను, వేణ్డామల్ = కోరకుండా, మేలైయర్ శొల్ = పూర్వుల సూక్తిని, తాణ్డాత = అతిక్రమించని (దాటని), ఎతిరాశన్ = యతిరాజుల, తాళ్ = శ్రీచరణాలను, వణఙ్గుమ్= నమస్కరించే, వరయోకి= మణవాళమహాముునుల, శేణ్ తామరై త్తాళ్కళ్ = ఉన్నతాలైన (గొప్ప) తామరలవంటి పాదాలను, శెన్నిక్కు = శిరస్సుకు, ఓర్ మణి ముడియాయ్ = అద్వితీయమైన రత్నకిరీటంగా, పూణ్డార్క్కు = ధరించినవారికి, పూ ముడియుమ్ = పూలతో కూర్చిన కిరీటం, పొన్ ముడియుమ్ = బంగారు కిరీటం, పరమ్ ఆమో = గొప్ప అవుతుందా?

"వీళ్థ్ పొరుళై" – పతనం చెందే విషయాలు, లౌకిక, నశ్వరాలైన విషయాలని భావం. **"ఉన్ పాదపఙ్కయమే తలైక్కు అణియాయ్"** అని ఆళ్వార్లు భగవానుని శ్రీచరణపద్మాలను తమ శిరస్సును ఆభరణంగా కావాలని ఆశపడి ధరించినట్లే, అద్వితీయాలైన శ్రీవరవరమునుల శ్రీచరణులను ధరించినవారని భావం.

జిగీషువులైన పండితులు కోరే నశ్వరాలైన విషయాలను కోరకుండా, పూర్వాచార్యులు పల్కిన పల్కులను అతిక్రమించనివారైన యతిరాజుల శ్రీపాదాలను నమస్కరించే మణవాళమహామునుల పాదపద్మాలను తమ శిరస్సుకు మణికిరీటంగా గ్రహించినవారికి బంగారంతో చేసిన కిరీటం, పూలతో కూర్చిన కిరీటం ఒక విషయం అవుతాయా?

56. "మా మేకమ్" ఎన వణ్మై ఇళైయాఴ్వారై త్తుదిత్తే
తామ్ ఏకశిన్దైయనాయ్ త్తరిత్త వరవరమునియై
నామేతు నణ్ణువ తెన్ఱు అకలాదే నఱ్పడియే
యామేవి వణఙ్గుదుమ్ వా నఱ్ఱినత్తాల్ నన్నెఞ్జే !

నల్ నెఞ్జే = ఓ మంచి మనసా! మామ్ ఏకమ్ = నన్ను ఒకడినే శరణు వేడు, ఎన వణ్మై = అనే ఔదార్యాన్ని కల, ఇళైయాఴ్వారై = శ్రీరామానుజులను, తుతిత్తే = స్తుతించే, తామ్ ఏకశిన్దైయనాయ్ = తాము తదేకచింతను కలవారై, తరిత్త = మనస్సులో ధరించిన, వరవరమునియై = వరవరమునులను, నామ్ నణ్ణువతు ఏతు = మనం దరిచేరడం ఏమి?, ఎన్ఱు = అని, అకలాతే = దూరం కాకుండా (తొలగి పోకుండా), నల్ పడియే = చక్కని రీతిలో, యామ్ మేవి = మనం ఆశపడి, నల్ దినత్తాల్ = మంచి దినంలో, వణఙ్గుదుమ్ = నమస్కరిద్దాం, వా = రా.

ఇందులో తమ మనస్సును ఉద్బోధించడంద్వారా కవి లోకులను ఉపదేశిస్తున్నారు.

"నేనే శరణం" అన్న ఔదార్యాన్ని కల్గిన శ్రీరామానుజులను (శ్రీకృష్ణుని) స్తుతించి, తదేకచింతలో ధరిస్తున్న మణవాళమహామునులను చేరడానికి మనకు ఏమి యోగ్యత ఉన్నది? అని తలచి విడువకుండా చక్కని రీతిలో ఆశ్రయించి నమస్కరిద్దాం – ఓ నా మనసా! రా !

"నాడొఱుమ్ ఏక శిన్దైయనాయ్" అనే తిరువాయ్మొఴి ప్రయోగం (5-10-11) భావ్యం. **"నెడియానై అడి నాయేన్ నినైన్దిట్టేనే"** అనే రీతిలో తిరునెడున్దాణ్డక ప్రబంధంలో తిరుమఙ్గై ఆఴ్వార్లు, **"పళవేఴులకు"** అనే దశకంలో నమ్మాఴ్వార్లు భగవానుని దరిచేరదానికి వెనుకంజ వేసినపుడు స్వామివాని అనునయించి తనదరికి చేర్చుకొన్నాడు. ఈ అర్థం ప్రకృతంలో వరవరమునులపట్ల అనుసంధింపబడింది. శేషిభూతునకు ఆనందం కల్గించేదే కదా కైంకర్యం.

57. నన్నకరామ్ పుతూర్క్కోన్ నల ముఱైక్కుమ్ మణవాళన్
పొన్నడియామ్ శఙ్గమల ప్పోదుకళై క్కనవిలుమ్ నామ్

శెన్నియిల్ శూట్ట వరుమ్ శేమ మెల్లామ్ ఆకిలుమ్ నామ్
మన్నియిడ వఱై శుమన్దు మఱుమైయిలుమ్ మాయోమే

నన్నకరామ్ = గొప్ప నగరం అయిన, పుతూర్ = శ్రీపెరుమ్బూదూర్‌కు, కోన్ = నాయకులైన శ్రీరామానుజుల, నలమ్ = కళ్యాణగుణాలనుగూర్చి, ఉరైక్కుమ్ = వివరించే, మణవాళన్ = మణవాళమహాముునుల, పొన్నడియామ్ శజ్గమల పోదుకళై = బంగారు పాదపద్మాలను, కనవిలుమ్ = కలలో కూడా, నామ్ = మనం, శెన్నియిల్ శూట్ట = శిరస్సులో అలంకరించుకొంటే, శేమమ్ ఎల్లామ్ వరుమ్ = మనకు క్షేమం అంతా కల్గుతుంది, ఆకిలుమ్ = అయినా, నామ్ = మనం, మన్ని యిడ = మన్నికగా, స్థిరంగా ఉండేటట్లుగా, వఱై = (పాపాలనే) కొండలను,శుమైన్దు = మోసి, మఱుమైయిలుమ్ = (ఇహలోకంలోనే కాక) పరలోకంలో కూడా, మాయోమే = నశించిపోతున్నామే, అయ్యో!).

వాస్తవంగా మణవాళమహాముునుల శ్రీచరణాలను శిరస్సులో ధరించకపోయినా, కలలో ధరించినా అన్ని క్షేమాలు కల్గుతాయి – అని అనడం శ్రీ వరవరముునులు శ్రీపాదమహిమవర్ణనలో అంతర్భవిస్తుంది. **"వఱై శుమన్దు"** – **"కున్ఱనైయ కుఱ్ఱమ్"** అనే పొయ్‌కై ఆళ్వార్ల సూక్తి ప్రకారం ఇక్కడ **"వఱై"** అనే పదం పాపరాశిని లక్షిస్తుంది. భరించడానికి సాధ్యం కాకపోవడం, ఏనాటికీ తరుగకపోవడం మొదలైన సామ్యాలనుబట్టి పాపరాశి కొండగా నిరూపించబడింది. అత్యంతసామ్యంచేత ఇక్కడ పర్వతం అనే ఉపమేయమాత్రనిర్దేశం చేయబడింది. దీనికి ద్రావిడంలో **"ముఱ్ఱువమై"** అని పేరు. **"మఱుమైయిలుమ్"** – ఇచటి అనుక్త సముచ్చయార్థకమైన **"ఉమ్"** (చకారం) ద్వారా ఇహలోకం లక్షింపబడింది.

గొప్ప నగరం అయిన శ్రీపెరుమ్బూదూర్‌లో అవతరించిన యతిరాజుల గుణాలనే పలికే మణవాళమహాముునుల **"పొన్నడియామ్ శెజ్గమలమ్"** అని వ్యవహరింపబడే శ్రీపాదాలను కలలో అయినా మన తలకు అలంకరించుకొంటే, మనకు అన్ని విధాలైన క్షేమాలు కలుగుతాయి. అయినా, మనం కొండలు కొండలుగా పాపాలను చేస్తూ భరిస్తూ, ఈ జన్మలోనే కాకుండా, మఱుజన్మలో కూడా ఉజ్జీవనం పొందకుండా పోతున్నామే (అయ్యో)

58. మెయ్యన్ ఎతిరాశనైయే మేవు మణవాళముని
శెయ్య తిరువడిప్పోదై చ్చెన్నియినాల్ తరిత్తదనిన్
మొయ్య శెఱుున్దుకళాడి మోన్దిదయత్తుఱుత్తిట్టాల్
ఉయ్య వకై తేడి నమక్కు ఉళమ్ తుళజ్గవేణ్డావే

మెయ్యన్ = యథార్థవాది అయిన, ఎతిరాశనైయే = యతిరాజులనే, మేవుమ్ = ఆశపడే, మణవాళముని = మణవాళమహామునుల, శెయ్య = అందమైన, ఎఱ్ఱని, తిరు అడి ప్పోదై = శ్రీచరణసుమాన్ని, శెన్నియినాల్ = శిరస్సుతో, తరిత్తు = ధరించి, అతనిన్ = ఆ పద్మంయొక్క, మొయ్య = అందమైన, శెళ్ళుమ్ = దట్టమైన, తుకళ్ ఆడి = రజస్సులో అవగాహించి, మోన్దు = ఆఘ్రాణించి, ఇదయత్తు = హృదయంలో, అళ్ళిత్తిట్టాల్ = పూసికొంటే, నమక్కు = మనకోసం, ఉయ్య వకై = ఉజ్జీవించే రీతిని, తేడి = వెదకి, ఉళమ్ తుళఙ్గ వేణ్డావే = మనస్సులో బాధపడనక్కరలేదుకదా !

"మెయ్యన్" – వేదాల యథార్థాన్ని వ్యక్తంచేసిన, శ్రీరామానుజులు యథార్థవాది, **"మెయ్యన్"** అయ్యారు. **"మెయ్యన్ ఇరామానుశన్ శరణే"** అనే ఇరామానుశనూఱ్ఱన్దాది సూక్తి భావ్యం. **"శెయ్యతిరువడిప్పోదై"** – మణవాళమహామునుల శ్రీచరణాలు **"శెయ్యతామరైత్తాళిణై"** కదా !

సత్యస్వరూపులైన యతిరాజులను ఆశ్రయించే మణవాళ మహామునుల ఎఱ్ఱని శ్రీపాదపద్మాలను శిరస్సుతో ధరించి, దాని రజస్సును ఆఘ్రాణించి, హృదయంలో ధరిస్తే, మనం ఉజ్జీవించడానికి వేఱే దారి వెదకి మనస్సులో బాధపడనక్కఱలేదుకదా !

59. తుళఙ్గామల్ ఎతిపతియై తుదిక్కుమ్ మణవాళముని
ఉళఙ్గాలుమ్ శెఙ్గమల ఉళ్ళితళ్పోల్ తిరువిరలుమ్
విళఙ్గవై మేల్ వెణ్ ముళైపోల్ ఇలకు తిరుమ్ పుఱన్తళిర్పోల్
వళఙ్కాట్టుమ్ పుఱఙ్కాలుమ్ వన్దడియేన్ మనత్తుళవే

తుళఙ్గామల్ = విడువకుండా, ఎతిపతియై = యతిరాజులను, తుతిక్కుమ్ = స్తుతించే, మణవాళముని = మణవాళమహామునులయొక్క, ఉళఙ్కాలుమ్ = అరికాళ్ళు(అనే), శెమ్ కమల ఉళ్ ఇతళ్ పోల్ = ఎఱ్ఱ తామరలోని రేకులవలె ఉండే, తిరు విరలుమ్ = కాలి వేళ్ళు, విళఙ్గ = వెలుగగా, అవై మేల్ = వాటిపై, వెణ్ ముళై పోల్ = తెల్లని అంకురాలవలె (మొగ్గలవలె), ఇలకు ఉకిరుమ్ = ప్రకాశించే నఖాలు, పుఱమ్ తళిర్ పోల్ = బయట ఉండే చిగుళ్ళవలె, వళమ్ కాట్టుమ్ = అందాన్ని చూపే, పుఱమ్ కాలుమ్ = బయటి పాదాలు, వన్దు = వచ్చి, అడియేన్ మనత్తు ఉళవే= దాసుని మనస్సులో ఉన్నాయి.

ఈ పాశురంనుండి వరుసగా కొన్ని పాశురాలలో మణవాళమహామునుల దివ్యమంగళవిగ్రహవర్ణన చేయబడుతున్నది. తైలధారవలె ఉండే అవిచ్ఛిన్నధ్యానసంతాన రూపభక్తి ప్రభావంవల్ల ప్రత్యక్షంగా రూపం ఎదురుగా లేకపోయినా, ఉన్నట్లు తోచే స్థితి అయిన పరజ్ఞానదశ ఇందులో తెలుపబడింది. శిష్యునకు ఆచార్యుని దివ్యమంగళ

వి[గ్రహమేకదా ధ్యేయవస్తువు. **"తేశారుమ్ శిచ్చన్ అవన్ శీర్వడివు పేణుమవన్"** అనికదా వరవరమునుల సూక్తి. **"తుళఙ్గుతల్"** – తొలగుట.

చక్కగా యతిరాజులను స్తుతించే మణవాళమహాముసుల అరికాళ్ళు ఎఱ్ఱ తామరలవలె, లోపల గల రేకులవలె వేళ్ళు ప్రకాశించగా, వానిపై తెల్లగా ఉండే మొగ్గలవలె నఖాలు వెలుగగా, బయటి చిగుళ్ళవలె బయటి పాదాలు ప్రకాశిస్తూ దాసుని మనస్సులో ప్రవేశించాయి.

60. తుళవముడన్ మణివడముమ్ తోన్ఱు తిరుప్పవిత్తిరముమ్
వళ పురునూలుడన్ తరిత్తు వాళ్ ఎతిరాశనై వణఙ్గు
కళప మెన త్తికళ్ళుమ్ వరయోగి తిరుక్కణైక్కాలిన్
వళమదణి పుఱవడిపోల్ వాళ్న్దిడు మెన్ మఱ్ఱై మదియే

తుళవ ముడన్ మణి వడముమ్ = తులసీమాలతోపాటు, తామరపూసలమాల, తోన్ఱు = ప్రకాశించే, తిరు ప్పవిత్తిరముమ్ = పవిత్రాన్ని, వళ పురి నూలుడన్ = దీర్ఘమైన యజ్ఞోపవీతంతో పాటు, తరిత్తు = ధరించి, వాళ్ = విజయంతో వర్ధిల్లే, ఎతిరాశనై = యతిరాజులను, వణఙ్గు= నమస్కరించే, కళపమ్ ఎన = కలభంవలె, (గున్న ఏనుగు వలె), తికళ్ళుమ్ = ప్రకాశించే, వరయోగి = శ్రీమణవాళ మహామునుల, పుఱ అడి = బయటి పాదాలవలె, తిరు క్కణైక్కాలిన్ = ముంగాళ్ళయొక్క, వళమ్ అదు అణి = గుండ్రని అద్వితీయమైన ఆభరణంవంటి, ఎన్ మఱ్ఱై మతియే = నా చల్లని ఆర్ద్రమైన మనస్సు, వాళ్న్దిడుమ్ = ఉజ్జీవించాలి.

"యే కంఠలగ్నతులసీనళినాక్షమాలాః" అని అన్నట్లు తులసీమాల, తామర మణిమాల శ్రీవైష్ణవచిహ్నాలు. వీటిని యతిరాజులు ధరించి ఉన్నారు. తమ మనస్సు వరవరమునుల ముంగాళ్ళకు అద్వితీయమైన గుండ్రని ఆభరణంవంటిది అని అంటే– సదా వరవరమునుల ముంగాళ్ళను తమ మనస్సు స్మరిస్తున్నదని భావం.

"కలభమ్" – చిన్నవయస్సులో ఉండే గజం. శ్రీరామానుజులవారికి తరువాత ఎత్తిన అవతారం మణవాళమహామునులు కనుక కలభంగా వారి రూపణం సమంజసం.

తులసీమాలను, తామరపూసల మాలను, పవిత్రాలను, వెలిగే తెల్లని యజ్ఞోపవీతాన్ని ధరించి ప్రకాశించే యతిరాజులను నమస్కరించే గజంవంటి మణవాళ మహామునుల పిక్కలకు గుండ్రని ఆభరణంవలె ప్రకాశించే నా మనస్సు ఉజ్జీవించాలి.

61. మఴుఙ్గాత ఎతిరాశన్ వాయ్ మదుత్త శేదమల్లాల్
విఴుఙ్గాద మణవాళమామునియిన్ విఴుప్పుముదై

ముఱ్ఱాన్లై శిన్దిత్తు ముప్పొళుదుమ్ విన్డై ప్పిఱవిక్కు
ఇఱ్ఱాదు మిల్లామల్ ఎఱ్ఱ క్కిళ్ళి ప్పొకట్టేనే

మఱ్ఱాద = మొక్కపోని జ్ఞానాన్ని కల, ఎతిరాశన్ = శ్రీరామానుజులు, వాయ్ మదుత్త = ఆరగించిన, శేదమ్ అల్లాల్ = ప్రసాదశేషం తప్ప, దేనినీ, విఱ్ఱాద = భుజించని, మణవాళ మామునియిన్ = మణవాళమహాముసులయొక్క, విళుప్పముద్రై = అతిశయాన్ని కల, ముఱ్ఱాన్లై = ముంగాళ్ళను, ముప్పొళుతుమ్ = మూడు వేళల, శిన్దిత్తు = చింతించి, విన్డై ప్పిఱవిక్కు = కర్మవల్ల కల్గిన జన్మను, ఎఱ్ఱ ఇఱ్ఱుగ్గు ఆతుమ్ ఇల్లామల్ = పునరావృత్తి లేకుండా, వృద్ధి చెందే అవకాశం ఏమీ లేకుండా, కిళ్ళి ప్పొకట్టేన్ = గిల్లి పారవేశాను.

"రంగభర్తు ర్మదాత్మా జంఘూం దృష్ట్వా జననపదవీజాంఘికత్వం జహాతి" అనే శ్రీదేశికుల భగవద్ధ్యానసోపానసూక్తి స్మరణీయం. భగవానుడు ఆరగించగా మిగిలిన ప్రసాదశేషాన్ని విష్వక్సేనులు స్వీకరించగా, మణవాళమహాముసులు భగవద్రామానుజులు ఆరగించగా మిగిలిన శేషాన్ని భుజిస్తారు. విష్వక్సేనులు శేషాశనులుకాగా వీరు శేషశేషాశనులు. **"విళుప్పమ్"** – గొప్పతనం. **"ఒళుక్కమ్ విళుప్పమ్ తోలాన్"** అని కుఱళ్ (131) ప్రయోగం.

కొఱతలేని జ్ఞానాన్ని కల యతిరాజులు ఆరగించి విడచిన ప్రసాదశేషం తప్ప వేఱు దేనినీ భుజించని మణవాళమహాముసుల ముంగాళ్ళను మూడు పొద్దులలో మనస్సులో ధరించి, నా కర్మ జన్మకు ఇక చోటు ఏమీ లేనివిధంగా గిల్లి పారవేశాను.

62. కట్టేదు ఎమక్కు ఇనిమేల్ కామఱుశీర్ ఎతిరాశన్
మట్టేదు మిల్ శీరిన్ మన్ను వరయోగి తువర్ పా
పట్టే శూఱ్ఱ్ తిరుత్తుడైయై ప్పలకాలుమ్ నినైన్దల్లాల్
విట్టేశుమ్ పిఱర్ శిరిప్ప వాయ్ వెరువ పెఱ్ఱనవే

కామఱు శీర్ ఎతిరాశన్ = అందమైన, అభిలషించదగిన కల్యాణగుణాలను కల యతిరాజుల, మట్టు ఏదుమ్ ఇల్ = అవధి లేని, శీరిన్ = గుణాలలో, మన్ను = స్థిరంగా ఉండే (అభినివేశాన్ని కల్గి ఉండే), వరయోగి తువర్ పా పట్టే = మణవాళ మహాముసుల పట్టు కాషాయాంబరం, శూఱ్ఱ్ = చుట్టి ఉండే, తిరు త్తుడైయై = ఊరువులను, పల కాలుమ్ నినైన్దు అల్లాల్ = పలుమార్లు భావించడం తప్ప, విట్టు ఏశుమ్ = నిందించే, పిఱర్ = ఇతరులు, శిరిప్ప = నవ్వేటట్లు, వాయ్ వెరువ పెఱ్ఱనవే = నోటితో వదరేటట్లు చేస్తానా! ఇని మేల్ = ఇక, ఎమక్కు = మనకు, కట్టు ఏతు = అవధి ఏమున్నది?

"కామఱు శీర్" – **"కామఱు కుయిల్, కామఱు శీర్ కలికన్ఱి"** – ఇత్యాది దివ్యసూరి ప్రయోగాలు స్మరణీయాలు. ఇతరులకు స్పృహణీయాలైన గుణాలని భావం. **"మట్టు"**– అవధి. **"వడివుక్కోర్ మట్టుణ్డోమో?"** అని తేవారం ప్రయోగం.

కోరదగిన గుణాలను కల యతిరాజుల అంతు లేని కల్యాణగుణాలలో అభినివేశాన్ని పొందే మణవాళమహామునుల కాషాయవస్త్రం అలంకరించుకొన్న ఊరువులను పలుమార్లు భావించడం తప్ప, ఇతరులు నన్ను పరిహసించి, దూషించి, నోటికి వచ్చినట్లు పలుకనిస్తానా?

63. పెఱ్ఱిమైయోన్ ఎతిపతియై ప్పేణుమ్ మణవాళమామునిక్కు
అఱ్ఱు ఇమైయాదిరున్దు అడియేన్ అవన్ ఉదరబన్దనత్తై
ప్పఱ్ఱియల్ మిక నోక్కమ్ పఱ్ఱి తలై క్కొణ్డ పిన్నాల్
మఱ్ఱిమైయోర్ ఆట్చితనిన్ మనమ్ మన్ని మాన్దేనే

పెఱ్ఱిమైయోన్ = గొప్పతనాన్ని కల, ఎతిపతియై = యతిరాజులను పేణుమ్= ఆదరించే, మణవాళ మామునిక్కు = మణవాళమహామునులకు, అఱ్ఱు ఇమైయాదిరున్దు= శేషభూతుడనై, సదా స్మరిస్తూ, అడియేన్ = దాసుడనైన నేను, అవన్ ఉదరబన్దనత్తై పఱ్ఱి = ఆ యతిరాజుల ఉదరబంధాన్నిగూర్చి, ఇయల్ మిక నోక్కమ్ పఱ్ఱి = పొందికగా నిలచి ఉండే ఆశతో కూడిన దృష్టిని, తలైక్కొణ్డ పిన్నాల్ = కల్గి ఉన్న తరువాత, మఱ్ఱు = ఇక, ఇమైయోర్ ఆట్చితనిన్ = దేవతల సార్వభౌమత్వంలో, మనమ్ మన్ని మాన్దేనే = మనస్సును స్థిరంగా ఉన్నవాడనై నశించను, బాధపడను.

"పెఱ్ఱిమై" – అతిశయం., **"ఇమైయోర్ ఆట్చి"** – దేవతల రాచరికం. **"ఆళ్"** అనే ధాతువునుండి పుట్టిన నామరూపం **"ఆట్చి"** – పరిపాలన అని అర్థం. **"మాన్దుతల్"**– బాధపడడం నశించడం.

ఉన్నతులైన యతిరాజులనే కోరే మణవాళమహామునులకే దాసుడనై, నేను వారి ఉదరబంధం అనే తిరువాభరణాన్ని నిలకడగా నిలచి ఉండే, ఆసక్తితో కూడిన చూపుతో దర్శించిన తరువాత, ఇక దేవతలకు ప్రభువై ఉండడాన్ని కూడా నా మనస్సులో తలవను.

64. మాన్దర్ ఇరామానుశర్క్కే మన మురుకి మఱ్ఱతియా
కాన్ద మణవాళముని కమల మణిత్తుళవవడమ్
శేర్న్ద తిరుప్పవిత్తరముమ్ శెపమయమే పురినూలుమ్
శేర్న్ద తిరుమార్బుమ్ ఎజ్ఞనమ్ నాన్ మఱప్పదువే

మాన్దర్ = మానవరూపులైన, ఇరామానుశర్క్కే = శ్రీరామానుజులకే, మనమ్ ఉరుకి = మనస్సు కఱగి, మఱ్ఱు అఱియా = వేఱెవ్వరినీ తెలియని, కాన్ద మణవాళ

మహాముని = సుందరరమ్యజామాతృమునియొక్క, కమల మణి త్తుళవ వడమ్ = తామరపూసల మాలను, తులసిపూసల మాల, శేర్న్ద = చేరికను (పొందికను) కల, తిరు ప్పవిత్తరముమ్ = అందమైన పవిత్రం, శెప మయమే పురి నూలుమ్ = యజ్ఞోపవీతం అనే ఇవి, శేర్న్దు అకన్ఱ = చేరి ఉండే, విశాలమైన, తిరు మార్పుమ్ = వక్షఃస్థలాన్ని, ఎజ్ఞనమ్ తాన్ మఱప్పతువే = ఏవిధంగా మఱువగలను?

శ్రీరామానుజులనే తలచి, మనస్సు ద్రవించి వేఱు దేనినీ తెలియనివారైన మణవాళమహాముల తామరపూసల మాల, తులసీమాలతో చేరిన పవిత్రం, జపమాల తెల్లని యజ్ఞోపవీతం – ఇవన్నీ చేరి, విశాలంగా ప్రకాశించే వక్షఃస్థలాన్ని నేను ఏవిధంగా విస్మరించగలను?

65. మఱ మఱియా ఎతిపతియై మఱవాద వరయోకి
అఱ ముఱైయుమ్ ముక్కోలుమ్ అఞ్జలియుమ్ తికఴ్ తిరుక్కై
త్తిఱ మఱిన్దు దినన్దినముమ్ శిన్దిత్తు త్తేఱిన పిన్
అఱ ముఱుకుమ్ ఇప్పువియిల్ అడిక్కొదిప్పై అడైన్దోమే

మఱమ్ అఱియా = కాఠిన్యాన్ని, కోపాన్ని తెలియని, ఎతిపతియై = యతి పతులను, మఱవాత = మఱచి పోని, వరయోకి = వరవరమునులయొక్క, అఱమ్ ఉఱైయుమ్ = ధర్మం నిలచి ఉండే, ముక్కోలుమ్ = త్రిదండం, అఞ్జలియుమ్ = అంజలి, తికఴ్ = ప్రకాశించే, తిరు క్కై = శ్రీహస్తాల, తిఱమ్ = తీరును (అందాన్ని), అఱిన్దు = తెలిసి, దినమ్ దినముమ్ = ప్రతిదినం, శిన్దిత్తు = భావించి, తేఱిన పిన్ = స్ఫుటంగా మనస్సులో తేటపడిన తరువాత, అఱమ్ ఉఱుకుమ్ = ధర్మం క్షీణించే ఇప్పువియిల్ = ఈ భూమిలో ఉండడంవల్ల, అడి కొదిప్పై = కాలు కాలిన స్థితిని, అడైన్దోమే = పొందామే!

"మఱమ్" – కోపం. **"మేలార్ మఱత్తొడు.... కడన్దకాళై"** ఇత్యాది ప్రయోగాలు గ్రాహ్యాలు. **"అఱమ్ ఉఱుకుమ్"** – **"ఎజ్ఞు వన్దు ఉఱుకో"** – ఇత్యాది ప్రయోగాలలో ఈ పదానికి దగ్గరకు రావడమని అర్థం. ఇక్కడ లక్షణయా క్షీణించడమని అర్థం. **"అడి కొతిత్తు"** – కష్టపడి, త్వరపడి – అని భావం. **"అడి కొతిత్తు"**, **"అడిక్కొతిత్తు"** – అనే రెండు రూపాలకు అర్థం ఒకటే. **"నెరుప్పుప్పట్ట తరైయిలే కాల్ పావాతాప్పోలే అవ్విడమ్ అడికొతిత్తు ప్పోన్దానాయ్త్తు"** (తిరువాయ్మొఴి1– 4–9 ప్రవేశం) వంటి ప్రయోగాలను గమనించవచ్చు. **"తిఱమ్"** – స్థిరమనే సంస్కృతపదవికారం కావచ్చు. లేక, **"తిఱమ్"**– అనే ద్రావిడపదం ప్రకారార్థకం.

అధర్మాన్ని తెలియనివారైన యతిరాజులను మఱువని మణవాళమహామునుల ధర్మమే మూర్తీభవించిన త్రిదండం, అంజలిముద్ర– వీటితో ప్రకాశించే శ్రీహస్తాల

అందాన్ని ప్రతిదినం భావించి తెలిసిన తర్వాత, ధర్మం క్షీణించే ఈ భూమిలో ఉండడం కాలు కాలినట్లుగా అసహ్యంగా ఉన్నది.

66. అడైయాళమాయ్ అముదమ్ అక్కిణఱ్ఱిల్ శుమన్దాఴుమ్
పడైయానై ఎతిపతియై ఉళ్ళు మణవాళముని
కిడైయాద వలమ్బురిపోల్ కిళరొళి శేర్ తిరుక్కళుత్తై
నడైయాక నినైన్దురుకి నల్లవర్క్కాట్పట్టోమే.

అడైయాళమాయ్ = తాము వింధ్యారణ్యంనుండి కంచికి చేరడంలో సూచక మైనది అయిన, అక్కిణఱ్ఱిల్ = ఆ శాలక్కిణఱునుండి, అముదమ్ = తిరువారాధన తీర్థాన్ని, శుమన్దు = మోసికొని, ఆఴుమ్ = (భగవానుని కల్యాణగుణాలలో) అవగాహించే, పడై యానై = పట్టపుటేనుగువంటివారైన, ఎతిపతియై = యతిరాజులను, ఉళ్ళు = మనస్సులో ఆరాధించే, మణవాళ ముని = మణవాళమహామునులయొక్క, కిడైయాత= అలభ్యమైన (అపూర్వమైన), వలమ్బురిపోల్ = దక్షిణావర్తశంఖంవంటిది, కిళర్ ఒళి శేర్ = వృద్ధిచెందే కాంతిని కల్గినది అయిన, కళుత్తై = కంఠాన్ని, నడైయాక నినైన్దు = నడక (జీవనయాత్ర)గా తలచి, ఉరుకి = మనస్సులో ద్రవించి, నల్లవర్క్కు = ఆ సత్పురుషులకు, ఆళ్పట్టోమే = దాసుణ్ణి అయ్యాను.

తాను కంచికి చేరడానికి సూచకం అయిన **"శాలక్కిణఱు"** నుండి నీటిని మోసికొని పోయి, వరదరాజస్వామికి సేవచేసే యతిరాజులను ఎల్లప్పుడూ సేవించే మణవాళమునుల, పొందడానికి అరుదైన దక్షిణావర్తశంఖంవలె ప్రకాశించే కంఠాన్ని తలచి నీరై, వారికి నేను దాసుడనయ్యాను.

"అడైయాళమ్" – ఈ పదం తెలుగులో **"అడియాలము"** అనే రూపాన్ని పొందింది.

67. ఆట్పట్ట ఇలక్కుమణర్క్కు అఱ్ఱ మణవాళముని
తోట్పడై ఎఴిచ్చికళుమ్ తూయ మణక్కుమ్ తిరువాయుమ్
శేట్పట్ట తిరుమూక్కుమ్ తిరుక్కాదుమ్ నినైన్దడియేన్
కోట్పట్ట శిన్దైయనాయ్ కొడున్దశైయై త్తూర్త్తేనే

ఆళ్ పట్ట = (శ్రీరామునకు) దాసుడైన, ఇలక్కుమణర్క్కు = లక్ష్మణునకు, అఱ్ఱ = విధేయుడైన, మణవాళముని = మణవాళ మహామునులయొక్క, తోళ్ = బాహువులలోని, పడై ఎఴిచ్చికళుమ్ = ఆయుధచిహ్నాలైన శంఖచక్రాలను, తూయ = పవిత్రమైన, మణక్కుమ్ = పరిమళించే, తిరు వాయుమ్ = నోటిని, (పెదవిని), శేట్పట్ట = దీర్ఘమైన,

ఉన్నతమైన, మూక్కుమ్ = నాసికను, తిరు క్కాదుమ్ = చెవులను, నినైన్దు = భావించి, అడియేన్ = దాసుణ్ణి అయిన నేను, కోట్పట్ట శిన్దైయనాయ్ = వాటిచే అపహరింపబడ్డ మనస్సును కలవాడనై, కొడుమ్ దశైయై = క్రూరమైన సంసారదశను, తూర్త్తేనే = లేకుండా చేసికొన్నాను.

"తోళ్ పడై ఎழுచ్చికళుమ్" – బాహువులలో ప్రకాశించే శ్రీసుదర్శన, పాంచజన్య చిహ్నాలు – **"యే బాహుమూలపరికర్మితశంఖచక్రాః"** అని కదా శ్రీవైష్ణవ లక్షణం. **"చక్రాంకితాః ప్రవేష్టవ్యాః"** అని శ్రీకృష్ణుడే స్వయంగా శంఖచక్రలాంఛనాన్ని విధించాడు. **"ఎన్నైయుమ్ ఎన్నుడైమైయుమ్ నిన్ శక్కర ప్పొరి ఒఱ్ఱిక్కొణ్డు"** – అని పెరియాళ్వార్లు కూడా పలికారు. **"తూయ మణక్కుమ్ తిరువాయ్"** – ఉత్తమజాతిపురుషుల అధరం పరిమళిస్తుందని లక్షణశాస్త్ర సూక్తి. లేక, ద్వయమంత్రంతో పవిత్రమై, పరిమళించే పెదవులనికూడా చెప్పవచ్చు. **"మంత్రరత్నానుసంధానసంతతస్ఫురితాధరమ్"** అని శ్రీవరవరమునులు కీర్తింపబడుతున్నారుకదా. **"నినైన్దు ఉరుకి"** – ప్రత్యక్ష సమానాకారంగా దర్శించి, కఱగిన మనస్సును కలవాడనై – అని భావం. **"నినైన్దు నైన్దుళ్ కఱన్దురుకి"** అని ఆళ్వార్ల సూక్తి **"కోట్పట్ట శిన్దైయనాయ్" – "కోట్పట్ట శిన్దైయాయ్"** అనే తిరువాయ్‌మొழி సూక్తి దీనికి సదృశంగా భావ్యం. **"కొడుమ్ దశై"** – సంసార స్థితి.

శ్రీరామునకు దాసుడైన లక్ష్మణుని అవతారం అయిన భగవద్రామానుజులకు దాసులైన మణవాళమహామునుల బాహువులను, ద్వయమంత్రం పరిమళించే వారి ఆస్యాన్ని, దీర్ఘమైన నాసికను, కన్నులను స్మరించి దుఃఖాన్ని కల్గించే క్రూరమైన సంసారస్థితిని లేకుండా చేసికొన్నాను.

68. తూరాత కాదలుడన్ తువరుడైయ ఎతిరాశన్
శీరాదుమ్ శోరామే శిన్దిక్కుమ్ వరయోగి
ఆరాద త్తడఙ్కణ్ణ అழுకుక్కే తోఱ్ఱు అవన్‌తన్
ఆరాదనైక్కు ఇశైన్దడియేన్ ఎన్నినిమేల్ పరన్దిరుక్కే

తూరాత కాదలుడన్ = ఏనాడూ నశించని భక్తితో, తువరుడైయ = కాషాయాన్ని ధరించిన, ఎతిరాశన్ = శ్రీరామానుజుల, శీర్ ఆతుమ్ శోరామే = కల్యాణగుణాలలో ఏ ఒక్కటిని కూడా విడువకుండా, శిన్దిక్కుమ్ = భావించే, వరయోకి = మణవాళ మహామునుల యొక్క, ఆరాత = (విస్తృతిలో) తృప్తి పొందని, తడమ్ కణ్ణ అழுకుక్కే = విశాలమైన తిరునేత్రాల అందానికే, తోఱ్ఱు = ఓడి, అవన్‌తన్ ఆరాతనైక్కు = ఆ మణవాళ మహామునుల ఆరాధనకు, ఇశైన్దు = అంగీకరించి, అడియేన్ = దాసుణ్ణి

అయిన నేను, ఇని మేల్ = ఇకపై, పరన్దిరుక్క ఎన్ = అన్యవిషయాలలో వ్యాపించి ఉండడం ఎందుకు? (అన్యవిషయాసక్తిని కల్గి ఉండడం ఎందుకు?)

"తూరాత కాదల్" – నిందించడానికి వీలు కాని భక్తి. **"తూరా క్కుళ్ళి", "తూరాద మనక్కాదల్"** ఇత్యాది దివ్యప్రబంధ ప్రయోగాలు ఉదాహార్యాలు. **"తువర్"**– తొగరు రంగు. కాషాయవర్ణాన్ని తెలిపే ఈ శబ్దం ఇక్కడ ఆ వర్ణాన్ని కల వస్త్రాన్ని లక్షిస్తుంది, తమిళంలో ఇటువంటి లక్షక శబ్దాలకు **"ఆకుపెయర్"** అని పేరు. **"ఆరాత తడమ్ కణ్"** – ఆకర్ణాంతం విస్తరించినా తృప్తి చెందని కన్ను అని అర్థస్వారస్యం. **"కృపయా పరయా కరిష్యమాణే సకలాంగం కిలసర్వతోఽక్షినేత్రే"** ఇత్యాదిగా పరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవపూర్వశతకంలో పల్కిన శ్లోకార్థం ఇక్కడ భావ్యం. **"పరన్దిరుక్క"** – వ్యాపించి ఉండడం – అన్యవిషయాలలో ఆసక్తిని కల్గి ఉండడం.

అంతు లేని భక్తితో, కాషాయాన్ని ధరించిన యతిరాజుల కల్యాణగుణాలను ఒక్కటికూడా విడువకుండా భావిస్తున్న మణవాళమహామునుల ప్రేమను' ప్రవహించే తిరునేత్రాలకు జితుడనై, వారిని ఆరాధించడానికి అంగీకరించే దాసునకు ఇక వేఱేమి కావాలి?

69. ఇనియత్తిల్ వేఱుణ్డో ఇళైయాళ్వార్ తిరుప్పుకళ్లామ్
కనియదనిల్ శువడఱిన్దు కవర్న్దుయ్న్ద మణవాళ
మునియదిపన్ తిరుప్పురువ ముళ్ళి క్కరుప్పుచ్చిలై నినైన్దు
తనియదొరు పేరిన్బమ్ తళ్ళైత్తడియేన్ తళ్ళైత్తేనే

ఇళైయాళ్వార్ = శ్రీరామానుజుల, తిరుప్పుకళ్లామ్ కనియదనిల్ = కల్యాణ గుణాలు అనే మధురఫలంలోని, శువడు అఱిన్దు = రసాన్ని తెలిసికొని, కవర్న్దు = దానిని ఆస్వాదించి, ఉయ్న్ద = ఉజ్జీవించిన,మణవాళముని అదిపన్ = మణవాళ మహామునులయొక్క తిరు ప్పురువ ముళ్ళి క్కరుప్పు చ్చిలై = పూర్ణమైన చెఱకువింటివంటి కనుబొమలను, నినైన్దు = భావించి, తనియతు = అద్వితీయమైన, ఒరు పేర్ ఇన్బమ్= ఒక గొప్ప ఆనందాన్ని, తళ్ళైత్తు = విస్తారంగా అనుభవించి, అడియేన్ = దాసుణ్ణి అయిన నేను, తళ్ళైత్తేనే = ఉబ్బి తబ్బిబ్బు అయ్యాను. ఇనియత్తిల్ = మాధుర్యంలో, వేఱు ఉణ్డో = వేఱయినది ఇంకొకటి ఉన్నదా? (లేదు).

"ఇళైయాళ్వార్ తిరుప్పుకళ్లామ్ కనియదనిల్ శువడఱిన్దు కవర్న్దు" – శ్రీరామానుజుల కల్యాణగుణాలనే పండును ఆస్వాదించి అనుభవించడం అంటే – యతిరాజవింశతి, ఆర్తిప్రబంధాదులలో శ్రీరామానుజుల కీర్తిని శ్లాఘించి, ఆనందించడమే. **"తిరు ప్పురువ ముళ్ళి క్కరుప్పు చ్చిలై"** – కనుబొమలను వింటితో

పోల్చడం కవిసమయం. చెఱకువింటితో పోల్చడం వాటి సౌందర్య మాధుర్యాలలోను అతిశయాన్నిబట్టి. **"తనియదొరు పేరిన్బమ్"** – బ్రహ్మానందం అని భావం.

లక్ష్మణులైన యతిరాజుల కీర్తి అనే ఫలంయొక్క రుచిని తెలిసి, దానిని గ్రహించిన మణవాళమహామునులయొక్క చెఱకు విల్లువంటి కనుబొమ్మలను భావించి, అద్వితీయమైన ఆనందాన్ని పొంది దాసుడనైన నేను ఉబ్బితబ్బిబ్బు అయ్యాను. దానికంటె మధురమైనది వేఱొకటి ఉన్నదా?

70. తழைత్త పెరుమ్ పొழிల్ పుతూర్ తనినాతన్ తిరువరుళాల్
పిழைత్త మణవాళముని పిఱై యొళియ త్తిరునుదలుమ్
కుழைత్తణిన్ద తిరుమణు మెన్‌కూర్ మదియిల్ తరిత్త పిన్నర్
అழைత్తడియేన్‌తన్నై యవనే యడిమై తిరుత్తిణ్ణనవే

తழைత్త = విస్తరించిన, పెరుమ్ పొழிల్ = పెద్ద పెద్ద పొదలను కల, పుతూర్ = శ్రీపెరుంబూదూరుకు, తని నాతన్ = అద్వితీయనిర్వాహకులు అయిన శ్రీరామానుజుల, తిరు అరుళాల్ = కరుణతో, పిழைత్త = ఉజ్జీవించిన, మణవాళముని = మణవాళ మహామునుల, పిఱై = అష్టమీచంద్రఖండంవలె, ఒళియ = ప్రకాశించే, తిరు నుదలుమ్= ఫాలభాగాన్ని, కుழைత్తు అణిన్ద తిరు మణుమ్ = చూర్ణంచేసి అలంకరించుకొన్న ఊర్ధ్వపుండ్రాలను, ఎన్ కూర్ మదియిల్ = నా నిశితమైన బుద్ధిలో, తరిత్త పిన్నర్ = ధరించిన తర్వాత, అవనే = ఆ మణవాళమహామునులే, అడియేన్‌తన్నై = దాసుణ్ణి అయిన నన్ను, అழைత్తు = పిలచి, అడిమై తిరుత్తిణ్ణనవే = తమకు నేను దాస్యం చేయడంలో స్థిరంగా నిశ్చయించారు.

"పిఱై ఒళిత్త త్తిరునుదలుమ్" – అష్టమీ చంద్రశకలంతో ఫాలాన్ని పోల్చడం కవిసమయం.

తోటలు దట్టంగా కల్గిన శ్రీపెరుమ్బూదూర్‌కు నాథులైన యతిరాజుల కరుణతో ఉజ్జీవనాన్ని పొందిన మణవాళమహామునుల చంద్రకళవంటి నుదురు, అందులో అలంకరింపబడిన తిరుమణ్ కాప్పును నా నిశితమైన బుద్ధిలో ధరించిన తరువాత, వారే దాసుని పిలచి తనకు దాస్యం చేయడంలో నిశ్చయించారు.

71. తిణ్ణనవే ఎతిరాశన్ శేవడి శేర్ ఆయియిడమ్
నణ్ణి నమన్దాశారియ విదయవురై తాన్ కేట్కుమ్
అణ్ణల్ మణవాళమునిక్కు అనుదినముమ్ అన్బుడనే
వణ్ణమలర్ శాత్తుమవర్ వానవరాయ్ త్తికழ్వారే

తిణ్ణనవే = దృఢంగా, ఎతిరాశన్ శే అడి శేర్ = యతిరాజుల ఎఱ్ఱని శ్రీపాదాలను చేరే, ఆయి ఇడమ్ = **"ఆయ్"** అనే పేరును కల జనన్యాచార్యుల వారి సన్నిధిలో, నణ్ణి = ఆశ్రయించి, నమన్ఱు = నమస్కరించి, ఆశారియవిదయ ఉరైత్తాన = ఆచార్యహృదయ వ్యాఖ్యానాన్ని, కేట్కుమ్ = వినే, అణ్ణల్ = స్వామి, మణవాళమునిక్కు = మణవాళ మహామునులకు, అనుదినముమ్ = ప్రతిదినం, అన్బుడనే = భక్తితో, వణ్ణ మలర్ శాత్తుమవర్ = రంగు రంగుల పూలు సమర్పించేవారు, వానవరాయ్ తికళ్ర్వారే= నిత్యసూరులై ప్రకాశిస్తారు.

ఆచార్యహృదయమనే రహస్యగ్రంథంతో తమకు కల్గిన సందేహాలను తీర్చుకోవడానికై మణవాళమహామునులు తిరునారాయణపురంలో వేంచేసి ఉండే **"ఆయ్"** అనే ఆచార్యులవద్దకు వెళ్ళాలని ప్రయాణం చేస్తూ ఉండగా, ఆ సమయానికే ఆయ్‌కూడా శ్రీమణవాళమహామునుల ప్రశస్తిని విని వారిని సేవించడం కోసం శ్రీరంగానికి పయనం అయ్యారు. దారిలో ఆయ్‌ను కలిసిన శ్రీవరవరమునులు ఆచార్యహృదయంలో తమకున్న సందేహాలను వారితో సంప్రదించి తీర్చుకొన్నారు – అనే వృత్తాంతం ఇక్కడ స్మరణీయం. **"అనుదినముమ్ వణ్ణమలర్ శాత్తుమవర్" – "వణ్ణమలర్ ఏన్ది వైకలుమ్"** – అనే పొయ్‌కై ఆఴ్వార్లసూక్తి స్మరణీయం. **"శాత్తుమవర్ వానవరాయ్ తికళ్ర్వారే"** – శ్రీవైకుంఠాన్ని చేరి, నిత్యసూరులుగా ప్రకాశిస్తారని, ఈలోకంలో ఉండగానే నిత్యసూరులతో సమానంగా ప్రకాశిస్తారని చెప్పవచ్చు. రెండవ నిర్వాహానికి అనుగుణంగా **"మదురకవి శొన్న శొల్ నమ్బువార్ పది వైకున్దమ్"** – అనే సూక్తి వ్యాఖ్యానాన్ని స్మరించాలి.

దృఢంగా యతిరాజుల శ్రీపాదాలను ఆశ్రయించే జనన్యాచార్యులను (ఆయ్) ఆశ్రయించి, వారివద్ద ఆచార్యహృదయంలోని అర్థాన్ని విన్న మహానుభావులైన మణవాళమహామునులకు ప్రతిదినం రంగురంగుల పూలను సమర్పించేవారు పరమపదవాసులుగా ప్రకాశిస్తారు.

72. వార్ పునల్ శూఴ్ పుదూర్‌మన్ వళ మురైక్కుమ్ ఉలక కురు
శీర్‌వశనపూదణత్తిన్ శెఴుమ్ పొరుళై చ్చెక మతియ
నీర్మైయుడన్ వియాక్కియైయై నిరుమిత్త వరయోగి
కార్‌ముకిలై ద్దినన్తోఱుమ్ కఴల్ పణివార్‌క్కు ఈడిలైయే

వార్ పునల్ శూఴ్ = ప్రవహించే కొండవాగులచే పరివేష్టితం అయిన, పుతూర్ మన్ = శ్రీపెరుంబూదూరుకు ప్రభువు అయిన శ్రీరామానుజుల, వళమ్ ఉరైక్కుమ్ = వృద్ధిని (కీర్తిని) కీర్తించే, ఉలక కురు = శ్రీపిళ్ళై లోకాచార్యులవారి, శీర్ వశన బూడణత్తిన్ = శ్రీవచనభూషణంయొక్క, శెఴుమ్ పొరుళై = గంభీరమైన అర్థాలను,

శెకమ్ అఱియ = జగత్తు తెలిసేటట్లుగా, నీర్మైయుడన్ = ఋజుత్వంతో, (సౌలభ్యగుణంతో) వియాక్కియైయ్ = వ్యాఖ్యానాన్ని, నిరుమిత్త = నిర్మించిన, వరయోకి = శ్రీమణవాళమహామునులు అనే, కార్ ముకిలై = కృష్ణమేఘంయొక్క, కழల్ = శ్రీచరణాలను, దినన్తోఱుమ్ = ప్రతిదినం, పణివార్క్కు = సేవించేవారికి, ఈడు ఇలైయే = సాటి ఎవరూ లేరు.

ఈ కృతిలో చరమపర్వనిష్ఠను ప్రతిపాదించే పాశురాలలో ఇది ఇంకొకటి. **"వళమ్ ఉరైక్కుమ్"** – **"వళమ్"** అంటే వృద్ధి. ఈ పదం ఇక్కడ కీర్తిని, కల్యాణగుణాలను లక్షిస్తుంది. **"శెழుమ్ పొరుళై"** – శ్రీవచనభూషణంలోని గంభీరమైన అర్థాలు – పరగతస్వీకారం, ఆచార్యాభిమానం మొదలైనవి. ఇవి సామాన్యులకు సులభంగా అవగతం అయేవికావు. అందువల్ల **"శెழుమ్"** అనే విశేషణం ప్రయోగింపబడింది. **"నీర్మైయుడన్"** – **"నీర్మై"** – అంటే నీటికి ఉండే స్వభావం. అది ఋజుత్వమే కదా ! శ్రీవచనభూషణ-దివ్యశాస్త్రంలోని గూఢంగా ఉండే అర్థాలను మఱుగుపరచకుండా, అన్యథాకరించకుండా సుస్పష్టం చేయడమే ఇచటి ఋజుత్వం. నీరు పల్లపు ప్రాంతాలవైపే ప్రవహించేటట్లు, వరవరమునులు కూడా ఏమాత్రం యోగ్యతలేని అధముల విషయంలో తమ సౌలభ్యసౌశీల్యాది గుణాలను ప్రకటిస్తారు. దీనికి కరుణ ఆవశ్యకం కనుక. **"కార్ ముకిల్"** అనే ఉపమానం ప్రయోగింపబడింది. ఈ ఉపమానంవల్ల, మేఘం తాను గ్రహించిన నీటిని మధురంగా చేసి వర్షించేటట్లే, వరవరమునులుకూడా అతిగహనాలైన అర్థాలను అందఱికీ మధురంగా ఉండే రీతిలో తమ మధురవాగ్విలాసాలతో అనుగ్రహిస్తారని స్ఫురిస్తున్నది.

వాగులచే పరివేష్ఠితం అయిన శ్రీ పెరుమ్బూదూర్‌కు నాథులైన యతిరాజుల కీర్తిని వివరించే శ్రీపిళ్ళై లోకాచార్యులు అనుగ్రహించిన శ్రీవచనభూషణంయొక్క అర్థమహిమను కరుణతో వ్యాఖ్యానించే మణవాళమామునులనే మేఘంయొక్క శ్రీపాదాలను ప్రతిదినం సేవించేవారికి ఈడు లేదు.

73. ఇలై ఎతిరాశఱ్కు నికర్ ఇవ్వులకిల్ కురవరెన్ఱు
నిలై నిఱుత్తుమ్ అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్
కలై యతిన్దు కరుత్తురైక్కుమ్ కరుణై మణవాళముని
మలరడిక్కు ఆళ్ అల్లాదార్ వైయకత్తు వழுక్కారే

ఇవ్వులకిల్ = ఈలోకంలో, ఎతిరాశఱ్కు = శ్రీరామానుజులకు, నికర్ = సాటి అయిన, కురవర్ = ఆచార్యులు, ఇలై = లేరు. ఎన్ఱు = అని, నిలై నిఱుత్తుమ్ = సుస్థాపించే, అరుళాళ ప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ = అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరు

మానార్ అనే ఆచార్యుల, కలై = గ్రంథాలు అయిన జ్ఞానసారం, ప్రమేయసారాలను, అఱిన్దు = తెలిసికొని, కరుత్తు ఉరైక్కుమ్ = అందులోని అర్థాన్ని వివరించే, కరుణై = దయను కల, మణవాళముని = మణవాళమహామునుల, మలర్ అడిక్కు = పద్మాలవంటి శ్రీచరణాలకు, ఆళ్ అల్లాతార్ = దాసులు కానివారు, వైయకత్తు = ఈలోకంలో కూడా, వ్ఱాఙ్గారే = ఉజ్జీవించరు.

"ఇలై ఎతిరాశర్క్కు నికర్ ఇవ్వులకిల్ కురవర్" – **"తస్మిన్ రామానుజార్యే గురు రితి చ పదం భాతి, నాన్యత్ర"** – ఇత్యాది సూక్తులు స్మరణీయాలు. ఈ అర్థాన్ని స్థిరీకరించినవారు అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్. **"నికర్"** – ఉపమానం అని అర్థం. **"తనక్కు నికరుమేలు మిన్తాకియే"** అనే కందపురాణ ప్రయోగంలో ఉపమానం అనే అర్థాన్ని, **"నేర్న్దు నికరల్లార్ నీరల్లశొల్లియక్కాల్"** అనే నాలడియార్ ప్రయోగంలో సమానమైన అర్థాన్ని గమనించవచ్చు.

యతిరాజులకు సాటి అయిన ఆచార్యులు ఈలోకంలో లేరు అనే అర్థాన్ని ప్రతిష్ఠించిన అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనుగ్రహించిన గ్రంథాలలోని అర్థాలను వివరించే, కరుణ మెండుగా కల మణవాళమహామునుల శ్రీపాదాలను దాసులు కానివారు ఈ లోకంలో ఉజ్జీవనాన్ని పొందరు.

74. కారేయుమ్ కరుణై ఇరామానుశనై క్కాశినియిల్
నేరే కణ్డు అడి పణియ నియమిత్త శడకోపన్
శీరేయుమ్ తమిఴ్ మఱైక్కు శిఱన్ద కురు ఇవరెన్ఱు
పేరేయుమ్ మణవాళముని కఴలై ప్పిరియోమే

కార్ ఏయుమ్ = మేఘంతో సమానమైన, కరుణై ఇరామానుశనై = దయను నిరూపకంగా కల శ్రీరామానుజులను, కాశినియిల్ = భూమిలో, నేరే కణ్డు = సాక్షాత్తుగా దర్శించి, అడి పణియ = వారి శ్రీచరణాలను సేవించమని, నియమిత్త = నియమించిన, శడకోపన్ = నమ్మాఴ్వార్ల, శీర్ ఏయుమ్ = సమస్త కవిత గుణాలను కల, తమిఴ్ మఱైక్కు = ద్రావిడవేదం అయిన తిరువాయ్మొఴిని ప్రవచించే, శిఱన్ద కురు = గొప్ప ఆచార్యులు, ఇవర్ ఎన్ఱు = వీరే అని, పేర్ ఏయుమ్ = పేరును పొందిన, మణవాళముని= మణవాళమహామునుల, కఴలై = శ్రీచరణాలను, పిరియోమే = విశ్లేషించము.

"ఏయుమ్" – సాటి వచ్చే – అని అర్థం. **"శేలేయ్ కణ్ణియరుమ్"**, **"ఏయుమ్పి రాక్కళ్"** మొదలైన దివ్యప్రబంధ ప్రయోగాలు గ్రాహ్యాలు. **"శీర్ ఏయుమ్ తమిఴ్ మఱై"**– **"శీర్ తొడై ఆయిరత్తు"**, **"మిడైన్ద శొల్ తొడై ఆయిరత్తు"**, **"శొల్ వల జ్కొణ్డ ఆయిరత్తు"**, **"ఆయిరమ్ శీర్ త్తొడై ప్పాడల్"**, **"ఒలి పుకఴ్ ఆయిరమ్"** ఇత్యాదిగా నమ్మాఴ్వార్లే

స్వయంగా పల్కిన సూక్తులు తిరువాయ్‌మొழ్ళి వైభవాన్ని తెలుపుతున్నవి. **"శీరేయుమ్ .... కురు ఇవర్ ఎన్ఱు"** – తిరువాయ్‌మొழ్ళి ప్రబంధానికి సాటి వచ్చే వ్యాఖ్య ఈడు ముప్పత్తాఱాయిరప్పడి. ఈ వ్యాఖ్యను సుప్రథితం చేసినవారు శ్రీవరవరమునులు. **"ఈడు ముప్పత్తాఱాయిర ప్పెరుక్కర్"** అని వీరు ప్రశంసింపబడుతున్నారుకదా ! శ్రీరంగంలో శ్రీరంగనాథుడుకూడా ఒక ఏడాదిపాటు అన్ని ఉత్సవాలను నిలిపించి, ఈడు వ్యాఖ్యను వరవరమునులద్వారా ఆలకించాడు. కనుక తిరువాయ్‌మొழ్ళి ఈడు వ్యాఖ్యము తగిన ఆచార్యులు వీరే. శ్రీమన్నాథమునులకు భవిష్యదాచార్యులైన శ్రీరామానుజులను దర్శింపజేసిన వృత్తాంతం పాశురపూర్వార్ధంలో సూచితం. **"కழల్"** – కడియమనే పాదభూషణాన్ని తెలిపే ఈ పదం ద్వారా పాదాన్ని నిర్దేశించడం ఆలంకారికమైన ప్రయోగం.

మేఘంవంటి కరుణను కల రామానుజులను ఈ లోకంలో దర్శించి, సేవించేటట్లు నియమించినవారు, నమ్మాழ్వార్లు అనుగ్రహించిన ద్రావిడవేదం అయిన తిరువాయ్ మొழ్ళిని వివరించడంలో "వీరే గొప్పవారు"– అని పేరును పొందినవారైన మణవాళ మహామునుల శ్రీపాదాలను విడువము.

75. మేదినియిల్ శిత్తిరైయిల్ ఆదిరైనాళ్ విళఙ్గ వెన్ఱు
పుదూరిల్ వన్దుదిత్త పునిదన్ ఎతిరాశన్‌తన్
పాదమలర్‌క్కు ఆళాన పాకవతర్ తిలక మెన
ప్పోదముళోర్ పుకழుమ్ మణవాళముని పువిక్కరశే

మేదినియిల్ = భూమిలో, శిత్తిరైయిల్ = చైత్రమాసంలోని, ఆదిరై నాళ్ = ఆర్ద్రానక్షత్రం, విళఙ్గ = ప్రకాశంచుగాక !, ఎన్ఱు = అని, పుతూరిల్ = శ్రీపెరుమ్బూదూర్‌కు, వన్దు ఉదిత్త = వచ్చి అవతరించిన, పునితన్ = పుణ్యాత్ములు అయిన, ఎతిరాశన్‌తన్ = శ్రీరామానుజుల, పాద మలర్‌క్కు = పద్మాలవంటి శ్రీపాదాలకు, ఆళాన = దాసులు అయిన, పాకవతర్ = భాగవతులలో, తిలక మెన = ముఖ్యులు అని, పోదమ్ ఉళోర్ జ్ఞానాన్ని కలవారు, పుకழుమ్ = ఆశ్రయించే, మణవాళముని = మణవాళమహామునులు, పువిక్కు అరశే = ఈ భూమికి ప్రభువు.

"పోదమ్" – బోధశబ్దభవం. జ్ఞానమని అర్థం. **"ఇన్నులకీర్ ! శిత్తిరైయిల్ ఎయ్‌న్ద తిరువాదిరైనాళ్"** అనే ఉపదేశరత్తిన మాలైపాశురార్థం భావ్యం. **"అరశు"** – రాజశబ్దభవం.

ఈలోకంలో చిత్తిరమాసం (మేషమాసం) ఆర్ద్రా నక్షత్రం ప్రకాశించే రీతిలో శ్రీపెరుమ్బూదూర్‌లో వచ్చి అవతరించిన పవిత్రులైన యతిరాజుల శ్రీపాదాలలో సేవించిన

దాసులలో ముఖ్యులుగా ప్రకాశించేవారు- అని గొప్ప మహాజ్ఞానులచేత చెప్పబడే మణవాళమహామునులు ఈ భూమికి ప్రభువులు.

76. అరశాకుమ్ ఎతికళుక్కు ఎన్ఱు అకిల వులకుమ్ పణియుమ్
పరమన్ ఇరామానుశర్‌క్కు ప్పాఙ్గాన పత్తనెన్నుమ్
వరవరమామునివన్ ఇన్ద వైయకత్తిల్ వన్దిలనేల్
ఉరై పెఱు నర్‌ఱమిళ్ వేదమ్ ఉలకఱివార్ ఎవరుణ్డే

ఎతికళుక్కు = యతులకు, అరశు ఆమ్ = ప్రభువు కాగలరు, ఎన్ఱు = అని, అకిల ఉలకుమ్ = సమస్తలోకం, పణియుమ్ = సేవించే, పరమన్ = గొప్పతనాన్ని కల, ఇరామానుశర్‌క్కు = శ్రీరామానుజులకు, పాఙ్గాన = తగిన, పత్తన్ ఎన్నుమ్ = భక్తుడు అనే, వరవర మామునివన్ = శ్రీవరవరమునులు, ఇన్ద వైయకత్తిల్ = ఈ భూలోకంలో, వన్దిలనేల్ = అవతరించి ఉండకపోతే, ఉరై పెఱు నల్ తమిళ్ వేదమ్ = వ్యాఖ్యానాన్ని కల గొప్ప ద్రావిడవేదాన్ని (తిరువాయ్‌మొళ్రిని), ఉలకు = లోకంలో, అఱివార్ = తెలిసేవారు, ఎవర్ ఉణ్డే = ఎవరు ఉండగలరు?

"ఇన్ద ప్పూదలత్తే మాఱ్‌ఱత్త శెమ్బొన్ మణవాళమాముని వన్దిలనేల్ ఆఱ్‌ఱిఱ్కరై పుళియల్లవో తమిళ్రారణమే" - సాటిలేనివారైన శ్రీవరవరమునులు ఈ లోకంలో అవతరించి ఉండకపోతే నమ్మాళ్వార్ల ద్రావిడవేదం వాగునీటిలోని చింతపండువలె నిష్ఫలం అయి ఉండేదని సంప్రదాయచంద్రికలో అప్పిళ్ళై పల్కిన సూక్తి స్మరణీయం. యతులు ఎంతమంది ఉన్నా, వారికి ప్రభువు శ్రీరామానుజులు ఒక్కరే. యతిపతి, యతిరాజు, యతీశ్వరులు వంటి పదాలు అన్నిటికీ శ్రీరామానుజులలోనే రూఢి. **"ఉలకు"**- లోకశబ్ద భావం.

యతులకు అందఱికీ ప్రభువు అని లోకమంతా సేవించి, నమస్కరించే గొప్పతనాన్ని కల యతిరాజులకు తగిన దాసులైన మణవాళమహామునులు ఈ భూలోకంలోని వచ్చి అవతరించి ఉండకపోతే, ద్రావిడవేదాలు అయిన దివ్యప్రబంధాల వ్యాఖ్యలు లోకంలో ఎవరిచేత తెలిసికోవడానికి వీలవుతుంది?

77. ఉణ్డో ఓ ఎతిరాశఱ్కొరువర్ నికర్ ఎన్ఱురైక్కుమ్
వణ్డారున్దొడై మౌళి మణవాళమామునివన్
విణ్డలర్న్ద మలర్ ప్పదత్తై విరుమ్బి యనుదినమ్ వణఙ్గుమ్
తొణ్డర్ తమక్కొరుకాలుమ్ తుయరుదిక్కకిల్లావే

ఎతిరాశఱ్కు = యతిరాజులకు, నికర్ = సాటి వచ్చేవారు, ఒరువర్ = ఒకరు ఉణ్డో = ఉన్నారా! ఓ = ఆహా ! ఆశ్చర్యం, ఎన్ఱు ఉరైక్కుమ్ = అని పలికే, వణ్డు ఆరుమ్

తొడై మౌళి = తుమ్మెదలు మధురంగా ధ్వనించే పూమాలికను అలంకరించిన కిరీటాన్ని కల్గిన, మణవాళ మామునివన్ = మణవాళమహామునుల, విణ్డు అలర్న్ద మలర్ పదత్తై = రేకులు విచ్చి పూచే పద్మాలవంటి శ్రీపాదాలను, విరుమ్బి = ఆశపడి, అనుదినమ్ = ప్రతిదినం, వణఙ్గుమ్ = నమస్కరించే, తొణ్డర్ తమక్కు = దాసులకు, ఒరు కాలుమ్ = ఏ సమయంలోను, తుయర్ = దుఃఖాలు, ఉదిక్కకిల్లావే = కలుగవుసుమా !

ఉపదేశరత్తినమాలైలో శ్రీవరవరమునులు **"ఉణ్డో ఎతిరాశర్క్కు ఒప్పొరువర్"** అని పల్కిన సూక్తి మొదటి పాదానికి అనుగుణంగా భావ్యం. **"విణ్డలర్న్ద మలర్" - "విట్టు అలర్న్ద మలర్"** - (రేకులు) విచ్చి వికసించిన పూవు. "గొప్ప శోభ కల్గిన పూవు అని తాత్పర్యం. **"విణ్డలర్ తూళి"** (పెరియ-11-3-8) అనే ప్రయోగం భావ్యం.

యతిరాజులకు సాటి అయినవారు ఎవరైన కలరా ? అని పలికేవారు, తుమ్మెదలు చేరిన మాలను అలంకరించుకొన్న కిరీటాన్ని కలవారు అయిన మణవాళ మహామునుల వికసించిన శ్రీపాదపద్మాలకు ప్రతిదినం నమస్కరించే దాసులకు ఎపుడూ దుఃఖం కలుగదు.

78. వేదాన్త విఴుప్పొరుళిన్ మేలిరుక్కుమ్ అరఙ్గేశర్
నాదన్ నమక్కెన్ఱురైక్కుమ్ నఱ్కుణనామ్ ఎతిరాశన్
మాతకవాల్ ఎవ్వుయిర్క్కుమ్ వాఴ్వళిక్కుమ్ వరయోకి
పాద మడై పత్తర్ పదమ్ పణిన్దేత్తి ప్పఱ్ఱుమినే

వేదాన్త విఴు ప్పొరుళిన్ మేల్ = ఉపనిషత్తులలోని సారార్థంలో (ఓంకారంలో) ఇరుక్కుమ్ = ఉండే, అరఙ్గేశర్ = శ్రీరంగనాథుడు, నమక్కు = మనకు, నాతన్ = ప్రభువు, ఎన్ఱు ఉరైక్కుమ్ = అని పలికే, నల్ కుణనామ్ = సద్గుణశీలి అయిన, ఎతిరాశన్= యతిరాజుల, మా తకవాల్ = గొప్ప కరుణతో, ఎవ్వుయిర్క్కుమ్ = ఆత్మలకన్నిటికి, వాఴ్వు అళిక్కుమ్ = ఉజ్జీవనాన్ని కల్గించే, వరయోకి = వరవరమునుల, పాదమ్ అడై= శ్రీచరణాలను పొందే, పత్తర్ పదమ్ = భక్తుల శ్రీపాదాలను, పణిన్దు = సేవించి, ఏత్తి = కీర్తించి, పఱ్ఱుమినే = ఆశ్రయించండి.

"విఴుప్పొరుళ్" = గొప్ప అర్థం. **"విణ్ణకత్తేవరు నణ్ణమాట్టా. విఴుప్పొరుళే"** అనే తిరువాచక ప్రయోగం (20-9) గ్రాహ్యం. **"ఓంకారప్రభవో వేదాః"** అని అన్నట్లు వేదాల సారార్థం ఓంకారమే. ప్రణవంలోని అకార, ఉకార, మకారాలద్వారా మకార వాచ్యుడైన జీవుడు అకార వాచ్యుడైన భగవానునవే శేషభూతుడని తెలుపబడుతున్నది. అందువల్ల భగవానుడు సర్వశేషి అనే అర్థాన్ని ఓంకారం తెలుపుతున్నది. ఆ సర్వశేషి అయిన భగవానుడు శ్రీరంగంలోని శ్రీరంగనాథుడే- అనే విషయాన్ని శ్రీరామానుజులు శ్రీభాష్యాదిగ్రంథాలలో స్థిరీకరించి, శరణాగతిగద్యద్వారా అనుష్ఠించి చూపించారు. ఆ

యతిరాజులు గొప్ప కరుణతో ప్రార్థించిన కారణంగా, వారి సంబంధం కల్గినవారంతా తరిస్తారని శ్రీరంగనాథుడు వరాన్ని అనుగ్రహించాడు. అట్టి శ్రీరామానుజుల శ్రీచరణసంబంధాన్ని తమ శ్రీపాద సంబంధంద్వారా కల్గించి ఆత్మలన్నిటికీ ఉజ్జీవనాన్ని శ్రీమణవాళమహామునులు అనుగ్రహిస్తున్నారు. ఆ వరవరమునుల పాదాలను ఆశ్రయించే భక్తులు పాదాలను సేవించి, ఆశ్రయిస్తామని అనడంద్వారా ఈ ప్రబంధంలో చరమపర్వనిష్ఠ మఱొక్కమారు ఇక్కడ ఆమ్రేడితమయినది. **"ప్రణవాకారం వైకుంఠం రంగమందిరమ్ స వాసుదేవో రంగేశః"** ఇత్యాది సుప్రసిద్ధశ్లోకం శ్రీరంగవిమానం ప్రణవాకారత్వాన్ని చాటుతున్నది.

వేదాంతార్థాలచేత ప్రతిపాద్యుడు– **"వేదాన్తవిఴుప్పొరుళిన్ మేలిరున్ద విళక్కు"**గా వెలిగే శ్రీరంగనాథుడే మననాథుడు అని పలికే సద్గుణాలను కల యతిరాజుల గొప్ప కరుణతో జీవులందరికీ ఉజ్జీవనం కల్గించే మణవాళమహామునుల శ్రీపాదాలను పొందే దాసుల శ్రీపాదాలను భక్తితో స్తుతించి, ఆశ్రయించండి.

79. మిన్ను పుకఴ్ ఎతిరాశన్ వీఱురైక్కుమ్ వరయోకి
తున్ను పుకఴ్ నాడోఱుమ్ తుదిక్కుమ్ అడియారవర్కళ్
పన్ను మొఴియే శురుతి పార్వై శెడిక్కు త్తీయే
ఎన్ను మదు మున్నొరుకాల్ ఇయమ్బువర్ ఎమ్ పెరియోరే

మిన్ను = వెలిగే, పుకఴ్ = కీర్తిని కల, ఎతిరాశన్ = శ్రీరామానుజుల, వీఱు = మహత్వాన్ని, ఉరైక్కుమ్ = తెలిపే, వర యోకి = వరవరమునుల, తున్ను పుకఴ్ = గొప్ప కీర్తిని, నాళ్ తోఱుమ్ = ప్రతిదినం, తుదిక్కుమ్ = కీర్తించే, అడియార్ అవర్కళ్ = దాసులు, పన్ను మొఴియే = పలికే మాటే, శురుతి = వేదం, పార్వై = వారి చూపు, శెడిక్కు = పాపాలనే వృక్షాలకు, తీయే = అగ్నియే, ఎన్నుమతు = అనే విషయాన్ని, మున్ ఒరు కాల్ = పూర్వం ఒకానొక సమయంలో, ఎమ్ పెరియోర్ = మన పెద్దలు (ఆచార్యులు), ఇయమ్బువర్ = అంటారు.

"వేదశాస్త్రరథారూఢాః జ్ఞానఖడ్గధరా ద్విజాః, క్రీడార్థ మపి యద్బ్రూయుః స ధర్మః పరమో మతః", "వాసుదేవం ప్రపన్నానాం యాన్యేవ చరితాని వై, తాన్యేవ ధర్మశాస్త్రాణీత్యేవం వేదవిదో విదుః", "న శుద్ధ్యతి తథా జంతుః తీర్థవారిశతై రపి, లీలయైవ యథా భూప ! వైష్ణవానాం హి వీక్షణైః" అనే పౌరాణికప్రమాణాలు, వీటి అర్థాన్ని అనుసంధిస్తూ జ్ఞానసారమనే ప్రబంధంలో అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనే ఆచార్యులు పల్కిన – **"అల్లిమలర్ప్పావై క్కన్బరడిక్కన్బర్ శొల్లు మవిదు శురుతియామ్, నల్లపడియామ్ మనునూఱ్కవర్ శరితై, పార్వై శెడియార్ వినైత్తొగైక్కు త్తీ"** అనే పాశురాన్ని

స్మరించాలి. **"శెడిక్కు" - "శెడియాయ వల్ విన్కైకళ్"** అనే ఆళ్వార్లసూక్తినిబట్టి, పైన ఉట్టంకింపబడ్డ పాశురాన్నిబట్టి కర్మసంచయం వృక్షాలుగా నిర్దేశింపబడ్డాయి. **"పుకళ్"** - తెలుగులో **"పొగడు"**గా మారింది. **"పన్నుతల్"** - సంగీత వాద్యాలపై పాడడం, ఆగి ఆగి పల్కడం అనికూడా అర్థం.

ప్రకాశించే కీర్తిని కల యతిరాజుల గొప్పతనాలను వివరించేవారైన మణవాళ మహామునుల స్థిరమైన కీర్తిని స్తుతించే దాసులు పలికే వార్తలన్నీ వేదం అని, వారిచూపు లోకజీవనం అనే వృక్షాన్ని దహించే అగ్ని అని మన పెద్దలంటారు.

80. పెరియోరుమ్ శిఱియోరుమ్ పిత్తరుమ్ నల్పత్తరుమే
పిరియాదు వన్దిఱైఞ్జుమ్ పిఱఙ్గు పుకళ్ ఎతిరాశన్
మరువారుమ్ మలరడిక్కీళ్ వణఙ్గుమ్ ఎళిల్ వరయోకి
అరుళే నమ్ అనైవర్క్కుమ్ అతిశయత్తై త్తరవల్లదే

పెరియోరుమ్ = పెద్దవారు, శిఱియోరుమ్ = చిన్నవారు, పిత్తరుమ్ = ఉన్మత్తులు, నల్ పత్తరుమే = బద్ధులు (గొప్పభక్తులు) అనే తేడా ఏమీ లేకుండా, పిరియాతు= విశ్లేషించకుండా, వన్దు ఇఱైఞ్జుమ్ = వచ్చి, ఆశ్రయించే, పిఱఙ్గు పుకళ్ = ప్రకాశించే కీర్తిని కల, ఎతిరాశన్ = యతిరాజుల, మరువు ఆరుమ్ = సువాసన నిండిన, మలర్ అడిక్కీళ్ = పద్మాలవంటి పాదాల కింద, వణఙ్గుమ్ = నమస్కరించేవారైన, ఎళిల్ = ప్రకాశించే, (అందమైన) వరయోకి = వరవరమునుల, అరుళే = కరుణే, నమ్ అనైవర్క్కుమ్ = మనకు అందఱికి, అతిశయత్తై = గొప్పతనాన్ని, తరవల్లదే = కల్గించగల్గినది. (ఏకారం నిశ్చయార్థకం)

"పిఱఙ్గు" - ప్రకాశించే, నిబిడంగా ఉండే - అని అర్థం. **"పిఱఙ్గొళిశేర్ విణ్ణాకి"** అనే తిరువాచక ప్రయోగం స్మరణీయం. **"పుకళ్"** సందర్భానుగుణంగా ఈపదం ఇక్కడ ఆశ్రయానుకూలాలైన వాత్సల్య, సామ్య, సౌలభ్యాది గుణాలను తెలుపుతున్నదని చెప్పవచ్చు. **"ఎళిల్"** అనే విశేషణాన్ని **"అరుళ్"**కు కూడా అన్వయించవచ్చు.

చిన్నవారు, పెద్దవారు, పిచ్చివారు, బద్ధులు (భక్తులు) అనే భేదంలేకుండా అందఱు వచ్చి సేవించేటట్లున్న కీర్తిని కల యతిరాజుల శ్రీపాదపద్మాలను నమస్కరించేవారైన మణవాళమహామునుల గొప్ప కృపే మనకు అందఱికీ గొప్పతనాన్ని కల్గించగల్గినది.

81. వల్లాద పునఱ్పుదూర్ మన్నడియై చ్చేర్న్దు నజ్గళ్
వల్లాద పవక్కడలై వత్తు నినైవుత్తు పరన్

శెఱ్ఱారై చ్చెఱ్ఱ వరయోగి తిరుత్తాళిణైయామ్
పొఱ్ఱామరై ప్పోదై ప్పూణాక త్తరిప్పోమే

వఱ్ఱాత = ఏనాడూ ఎండిపోని, పునల్ = నీటిప్రవాహాన్ని కల, పుతూర్= శ్రీపెరుంబూదూర్‌కు, మన్ = నాథులైన శ్రీరామానుజుల, అడియై శేర్న్దు = శ్రీచరణాలను చేరి, నజ్గళ్ = మన, వఱ్ఱాత = ఎండిపోని, పవ క్కడలై = సంసారాబ్ధిని, వఱ్ఱ = ఎండించాలనే, నినైవు ఉఱ్ఱ = భావనను కల్గిన, పరన్ = మహనీయులు, శెఱ్ఱారై = (వైదికమతానికి) విరోధులైనవారిని, శెఱ్ఱ = నశింపజేసిన, వరయోకి = వరవరమునుల, తిరు త్తాళ్ ఇణైయామ్ = శ్రీచరణద్వంద్వం అనే, పొన్ తామరై ప్పోదై = బంగారు తామర పూలను, పూణ్ ఆక = శిరస్సుకు ఆభరణంగా, తరిప్పోమే = ధరిస్తాము.

"ఉన్ పాదపఙ్కయమే తలైక్కణియాయ్" అని నమ్మాళ్వార్లు భగవానుని విషయంలో అనుసంధించిన భావాన్ని కవి మణవాళమహామునుల విషయంలో ఇక్కడ అనుసంధిస్తున్నారు. **"వరయోకి తిరుత్తాళిణైయామ్ పొఱ్ఱామరైప్పోదై" - "పొన్నడి యామ్ శెఙ్గమల ప్పోదుకళై"** అనే ఉపదేశరత్తినమాలై సూక్తి స్మరణీయం **"ఆమ్"** - ఉపమానవాచకం. **"శెఱ్ఱార్"** - వైదిక మతానికి శత్రువులు. **"పిఱవి క్కడలుళ్ అన్ఱు నాన్ తుళఙ్గ"** అనే ఆళ్వార్ల సూక్తినిబట్టి, **"పవ క్కడలై"** అని ప్రయోగింపబడింది. భవమంటే పుట్టుకేకదా ! బయటపడడానికి వీలుకాకపోవడం, అంతులేకపోవడం, భయంకరంగా ఉండడం మొదలైన స్వభావాలనుబట్టి సంసారం సముద్రంగా దూషించబడింది.

ఎండని ప్రవాహాలను కల శ్రీపెరుమ్బూదూర్‌లోని యతిరాజులను ఆశ్రయించి, ఎండని భవాబ్దిని ఎండిపోయేటట్లు చేయాలని భావించేవారు, వైదికమతానికి విరోధులై ఉన్నవారిని నశింపజేసేవారు. అయిన మణవాళమహామునుల బంగారు తామరలవంటి పాదపద్మాలను మన శిరస్సుకు ఆభరణంగా ధరిస్తాము.

82. తరిప్పోమే తారణియిల్ శకల కలై కఱ్ఱుణర్న్దు
కరిప్పోమే శముశారక్కడలై మికవుమ్ కలైకళ్
విరిప్పోమే యతిపతితాళ్ మేవు వరవరముని యరుళ్ కొణ్డు
ఇరుప్పోమే ఏఱ్ఱరుమ్ శీర్ ఇమైయవర్‌కళ్ ఇనమ్ శేర్న్దే

యతిపతి తాళ్ = యతిరాజుల శ్రీచరణాలను, మేవు = ఆశ్రయించే, వరవర ముని = వరవరమునుల, అరుళ్ కొణ్డు = కృపను గొని, తారణియిల్ = ధరణిలో, శకల కలై = అన్ని కళలను, కఱ్ఱు = అభ్యసించి, ఉణర్న్దు = తెలిసికొని, తరిప్పోమే = ధరించగలం, శముశార క్కడలై = సంసారసముద్రాన్ని, తరిప్పోమే = దాటగలం, మికవుమ్ = మిక్కిలి, కలైకళ్ = శాస్త్రాలను, విరిప్పోమే = వివరించగలం, ఏఱ్ఱరుమ్ =

ఇతరులకు పొందడానికి వీలుకాని, శీర్ = గొప్పతనాన్ని కల, ఇమైయవర్కళ్ ఇనమ్ శెన్టు = నిత్యసూరుల సమూహాన్ని చేరి, ఇరుప్పోమే = ఉండగలం.

"ఏర్ర్రరుమ్" – "ఏర్ర్రరుమ్ కీర్త్తియినాయ్" – అనే ఇరామానుశనూర్ర్రన్దాది ప్రయోగం గ్రాహ్యం.

యతిరాజుల శ్రీపాదాలను నమస్కరించే మణవాళమాములను కృపను గొని, మనం ఈలోకంలో అన్ని కళను అభ్యసించి, ధరించి ఉండగలం. జన్మమహాబ్ధిని దాటగలం. శాస్త్రాలను వ్యాఖ్యానించగలం. గొప్పతనాన్ని కల నిత్యసూరుల సమూహాన్ని చేరి వారితో కలసి ఉండగలం.

83. శెన్టు కలియిరుళ్తన్నై చ్చెఖ్ఖు మఱైయిన్ ఒళియదనాల్
కన్టుమ్ ఎతిరాశన్ ఎఖ్ఖిల్కణ్ణనడి కాట్టిలనేల్
ఇన్టుయిర్కళ్ అఱిన్దుయ్య ఎళితో తాన్ ఎన్టురైక్కుమ్
తున్టు పుకఖ్ వరమునివన్ తూయ తమిఖ్ మఱైక్కరశే

శెన్టు = చేరి, కలి ఇరుళ్తన్నై = కలివల్ల కల్గిన అజ్ఞానమనే చీకటిని, శెఖ్ఖు = దట్టమైన, మఱైయిన్ ఒళి అదనాల్ = వేదాల ప్రకాశంతో, కన్టుమ్ = కోపించే (నిరసించే), ఎతిరాశన్ = యతిరాజులు, ఎఖ్ఖిల్ = ప్రకాశించే, కణ్ణన్ అడి = శ్రీకృష్ణభగవానుని శ్రీచరణాలను (మనకు శరణంగా), కాట్టిలనేల్ = చూపించి ఉండకపోతే, ఇన్టు = ఇపుడు,ఉయిర్కళ్= జీవులు, అఱిన్దు = తెలిసికొని, ఉయ్య = ఉజ్జీవించడం, ఎళితోతాన్ = సులభమా!, ఎన్టు ఉరైక్కుమ్ = అని పలికే, తున్టు పుకఖ్ = ప్రకాశించే (నిబిడమైన) కీర్తిని కల, వరమునివన్ = మణవాళమహామునులు, తూయ = పరిశుద్ధమైన, తమిఖ్ మఱైక్కు = ద్రావిడవేదానికి, అరశే = ప్రభువు.

"కన్టుమ్" – కందడం – అంటే – ఎఱ్ఱబడడం – కళ్ళు ఎఱ్ఱబారడం కోపానికి చిహ్నం. కనుక, కోపించి – అని భావం. **"కన్టిమారి పొఖ్ఖిన్దిడ"** అనే పెరియతిరుమొఖ్ఖి (1–8–3) ప్రయోగం ఉదాహార్యం ఇక్కడ తొలగించచడమని తాత్పర్యం. **"ఎఖ్ఖిల్ కణ్ణనడి నాట్టిలనేల్"** – శరణాగతిగద్య ద్వారా అని భావం. లేక, తాము తిరుక్కోట్టియూర్నమ్బివద్ద గ్రహించిన శ్రీకృష్ణచరమ శ్లోకరహస్యార్థాలను అందరినీ తెలుపుడం ద్వారా అని చెప్పవచ్చు. **"తూయ తమిఖ్"**– స్త్రీశూద్రాదులచేత అధ్యయనం చేయబడకూడదనే నియమాలు లేని పవిత్రత – అని కాని, సంస్కృతవేదంలో స్ఫుటంగా ప్రకాశించని భగవానుని స్వరూప రూపగుణ లీలలను స్ఫుటంగా ప్రకాశింపజేసే పవిత్రత – అని కాని చెప్పవచ్చు. **"మఱై ఒళి" "నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా"** అనే గీతాచార్య సూక్తి స్మరణీయం.

కలియొక్క అంధకారాన్ని (అజ్ఞానాన్ని) వేదాల ప్రకాశంతో (జ్ఞానంతో) పోగొట్టిన యతిరాజులు, మనకు కృష్ణుని శ్రీపాదాలను తమ సూక్తులద్వారా చూపి ఉండకపోతే, ఇపుడు లోకులు సులభంగా తెలిసికొనడం వీలు అయ్యేదా ! అని అనుగ్రహించే పవిత్రమైన కీర్తిని కల మణవాళమహామునులు పావనం అయిన ద్రావిడవేదం అనే దివ్యప్రబంధాలకు ప్రభువులు.

84. శేమజ్కురుకైయర్కోన్ తిరువడి ఎన్ఱెన్ఱు పణిన్దు
తామ మడియార్క్కరుళుమ్ తకవన్ ఎతిరాశనడి
త్తామమ్ ముడి క్కణియు మణవాళముని పూన్తిరుత్తాళ్
పూమదు వుణ్ వణ్డినమామ్ పూశురర్కళ్ ఎన్ తుణైయే

కురుకైయర్ కోన్ = నమ్మాళ్వార్ల, తిరువడి = శ్రీచరణాలు, శేమమ్ = మనకు క్షేమం (రక్షకం), ఎన్ఱు ఎన్ఱు = అని, పణిన్దు = పల్కి, తామమ్ = పరమపదాన్ని, అడియార్క్కు = దాసులకు, అరుళుమ్ = అనుగ్రహించే, తకవన్ = కరుణాశీలి, ఎతిరాశన్ = యతిరాజుల, అడి = శ్రీచరణాలలో అలంకరించిన, తామమ్ = పూమాలను, ముడిక్కు అణియుమ్ = (తమ) శిరస్సుకు అలంకరించుకొనే, మణవాళ ముని = మణవాళమహామునులు, పూమ్ తిరు త్తాళ్ = వికసించే పద్మాలవంటి శ్రీచరణాల లోని, పూ మతు = తేనెను, ఉణ్ = భుజించే, వణ్డు ఇనమామ్ = తుమ్మెదల సమూహం వంటి, పూ శురర్కళ్ = భూసురులు, ఎన్ తుణైయే = నాకు సహాయకులు. (రక్షకులు)

"శేమమ్" – క్షేమశబ్దభవం. ఈ పదం ఇక్కడ క్షేమాన్ని కల్గించే సాధనాన్ని లక్షిస్తుంది. **"పణిన్దు" – "భణ"** – అనే సంస్కృత ధాతువునుండి పుట్టిన వైకృతం. **"తామమ్"** – (రెండవపాదం) ధామమనే సంస్కృతశబ్దానికి వికృతి. **"తకవు"** – కృప. దానిని కలవాడు **"తకవన్". "అన్"** పులింగబోధక ప్రత్యయం. **"దామమ్"** – పూమాలిక అని అర్థం (మూడవపాదం) దామశబ్దభవం. **"వణ్డినమామ్"** – ఇక్కడ **"ఆమ్"** ఉపమా వాచకం. **"శ్రేయః కిరంతు కిరణాః ... చరణారవిందనిష్యందమానమకరందర సౌఘ దేశ్యాః"** అనే అతిమానుషస్తవశ్లోకవ్యాఖ్యలో భగవానుని శ్రీచరణారవిందాలనుండి స్రవించే మకరందరసం విష్ణుపాదోద్భవ అయిన గంగారూపమైన శ్రీపాదతీర్థమే అని అభిజ్ఞుల వివరణం. ఈ క్రమంలో ఇక్కడ – వరవరమునుల శ్రీచరణాలనుండి స్రవించే మధువు వారి శ్రీపాదతీర్థమే అని చెప్పడంలో స్వారస్యం ఉన్నది. 'ఆ మధువును ఆస్వాదించే ఆచార్యులు తుమ్మెదలని అనడం చాలా సరసం. షట్పదాలేకదా తుమ్మెదలు. షట్పదశబ్ద వాచ్యం అయిన ద్వయమంత్రంలో నిష్ఠను కలవారు కదా ఆచార్యులు.

నమ్మాళ్వార్ల శ్రీపాదాలే మనకు రక్షకం అని వారి శ్రీపాదాలను ఆశ్రయించి, ఉన్నతస్థానం అయిన పరమపదాన్ని మనకు అనుగ్రహించే కరుణను కల యతిరాజుల శ్రీపాదాలలో అలంకరించిన మాలను తమ శిరస్సులో అభరణంగా ధరించే మణవాళమామునుల పూవువంటి శ్రీపాదాలో గల తేనెను తాగే తుమ్మెదలవంటి దాసులే నాకు రక్షకులు.

85. తుణర్ పొళ్ళిల్ శూళ్ అరజ్గేశన్ తొల్ శీరిన్ మన్నుమ్ ఎతి
కణమదుక్కు త్తలైవన్ ఇరామానుశ నళ్కుళుక్కమల
మణ మిక వణ్ మణవాళమామునివన్ కలై యరుళ్కళ్
కుణముడనే అడియవర్క్కు క్కూఱుకిన్దదు అతిశయమే

తుణర్ = గుత్తులు గుత్తులుగా పూలు వికసించే, పొళ్ళిల్ = తోటలచేత, శూళ్ = పరివేష్ఠింపబడ్డ, అరజ్గేశన్ = శ్రీరంగానికి ప్రభువైన శ్రీరంగనాథునియొక్క, తొల్ శీరిల్ = సహజకల్యాణగుణాలలో, మన్నుమ్ = అభినివిష్టులైనవారు, ఎతి కణమ్ అతుక్కు = యతుల సమూహానికి, తలైవన్ = ప్రభువు అయిన, ఇరామానుశన్ = శ్రీరామానుజుల, కళ్ళల్ కమల = శ్రీచరణకమలాల, మణమ్ మిక = పరిమళం అతిశయించేటట్లుగా, వణ్ మణవాళ మామునివన్ = ఉదారులైన మణవాళమహామునులు అనుగ్రహించిన, కలై పొరుళ్కళ్ = శాస్త్రాలలోని అర్థాలు, అడియవర్క్కు = దాసులకు, కుణముడనే = గుణంతో పాటు, అతిశయమే = అతిశయాన్నికూడా, కూఱుకిన్దతు = కల్గిస్తాయి.

"తుణర్" - పూలగుత్తి, లేక, పండ్లగుత్తి అని అర్థం. **"వాన్ తికళ్ళుమ్ శోలై"** ఇత్యాది ప్రయోగం స్మరణీయం. **"తుణర్ పొళ్ళిల్ శూళ్"** అనే విశేషణం **"అరజ్గేశన్"** అనే సమస్తపదంలో ఏకదేశం అయిన **"అరజ్గ"**మనే పదంలో అన్వయిస్తుంది. **"తొల్ శీర్"** – స్వాభావికకల్యాణగుణాలు. **"ఇరామానుశన్" ..... కలైపొరుళ్కళ్"** – యతిరాజ వింశతి, ఆర్తి ప్రబంధంవంటి గ్రంథాలు. ఇవి శ్రీరామానుజుల కల్యాణగుణప్రకాశకాలు కదా!

చక్కని తోటలచే చుట్టబడిన శ్రీరంగానికి నాథుడైన రంగనాథుని గుణాలలో అభినివిష్టులైన యతుల సమూహానికి నాథులు యతిరాజుల శ్రీపాదపద్మాలలోని పరిమళం అతిశయించేటట్లు మణవాళమహామునులు అనుగ్రహించే శ్రీసూక్తులు దాసులకు అతిశయాన్ని కల్గిస్తాయి.

86. శయ మేవుమ్ ఎతిరాశన్ అడిక్కడియన్ నానెన్ఱు
తుయముడనే శకల మత్తైత్తుయ్య పొరుళ్ ఉరైత్తైమక్కు

ప్పయనళిక్కుమ్ వరయోకి పారులకిల్ వన్దిలనేల్
నయ మతివార్ ఇలై యెన్ఱు నావలర్కళ్ ఓదువరే

శయ మేవుమ్ – ఎతిరాశన్ = జయాన్ని పొందే, ఎతిరాశన్ = యతిరాజుల, అడి = శ్రీచరణాలకు, నాన్ = నేను, అడియన్ = దాసుణ్ణి, ఎన్ఱు = అని పల్కి, తుయముడనే = ద్వయమంత్రంతోపాటు, శకల మఱై = అన్ని శాస్త్రాల, తుయ్య పొరుళ్= పవిత్రాలైన అర్థాలను, ఉరైత్తు = వివరించి, ఎమక్కు = మనకు, పయన్ అళిక్కుమ్ = ప్రాప్యాన్ని, అనుగ్రహించే, వరయోకి = వరవరమునులు, పార్ ఉలకిల్ = భూలోకంలో, వన్దిలనేల్ = అవతరించి ఉండకపోతే, నయమ్ అఱివార్ = నీతిని తెలిసేవారు, ఇలై ఎన్ఱు = లేరు అని, నావలర్కళ్ = పండితులు, ఓదువరే = అంటారు.

"నయమ్" – అనే పదానికి అందం, మార్దవం– అనే అర్థాలున్నందున, వరవరమునులు అవతరించి ఉండకపోతే ద్రావిడ వేదంలోని అర్థాల అందాన్ని, మార్దవాన్ని తెలిసేవారెవ్వరూ ఉండి ఉండరనే భావాన్నికూడా చెప్పవచ్చు. సంస్కృతవేదాన్ని శ్రీరామానుజులు, ద్రావిడవేదాన్ని శ్రీవరవరమునులు వ్యాప్తిచేశారుకదా !

"మఱైత్తు + ఉయ్య పొరుళ్" – అని విడదీసి వేదాలలోని ఉజ్జీవించే అర్థాన్ని– అనే అర్థాన్ని చెప్పవచ్చు. ఉజ్జీవించే అర్థం అంటే – భగవానుని ప్రాప్యత్వ ప్రాపకత్వాలు, చరమపర్వనిష్ఠ, పరగతస్వీకారం – ఇత్యాదులు. పూర్వోదాహృతం (76వ పా) అయిన సంప్రదాయకచంద్రికలోని పాశురభావం ప్రకృతంలో కూడా భావ్యం.

"జయశీలురైన యతిరాజుల శ్రీపాదాలకు నేను దాసుడను" అని పలికి, ద్వయమంత్రంతో పాటు అన్ని శాస్త్రాల పవిత్రాలైన అర్థాలను వివరించి, మనకు ప్రాప్యాన్ని అనుగ్రహించేవారైన మణవాళ మహామునులు ఈ లోకంలో వచ్చి అవతరించి ఉండకపోతే, ఆళ్వార్ల పాశురాలయొక్క, వాటి వ్యాఖ్యానాలయొక్క గొప్పతనాన్ని తెలియగలవారు ఎవరూ లేరు– అని వాగ్వైభవాన్ని కలవారు పలుకుతారు.

87. ఓదు మఱైయోర్క్కు ఇనితాయ్ ఉరైత్తరుళుమ్ ఒళ్ళియ నూల్
తీదిల్ శీర్ పాచ్చియత్తోన్ శీర్ మన్ను వరయోకి
మేదినియిల్ ఉదిత్త పిన్నర్ విళఙ్గియ శెన్దమిళ్ మఱైకళ్
పేద మఱ క్కఱ్ఱుణర్న్దు పెరుమై పెఱుమిన్కళిన్దే

ఓదు మఱైయోర్క్కు = వేదాభ్యాసాన్ని చేసేవారికి, ఇనితాయ్ = మధురంగా, ఉరైత్తు అరుళుమ్= వివరించే, ఒళ్ళియ నూల్= మిక్కిలి గొప్ప సుందరమైన గ్రంథం అయిన, తీదు ఇల్ శీర్ పాచ్చియత్తోన్ = ఏ దోషం లేని శ్రీభాష్యంలోని, శీర్ = గొప్ప అర్థాలలో, మన్ను = అభినివిష్టులై ఉండే, వరయోకి = శ్రీవరవరమునులు, మేదినియిల్=

ఈ లోకంలో, ఉదిత్త పిన్నర్ = అవతరించిన తరువాత, విళఙ్గియ = ప్రకాశించిన, శెమ్ తమిழ் మఱైకళ్ = అందమైన (ఋజువైన) ద్రావిడవేదాలు అయిన దివ్యప్రబంధాలను, పేదమ్ అఱ = తేడా లేకుండా, కఱ్ఱు ఉణర్న్దు = అభ్యసించి తెలిసికొని, ఇన్ఱే = ఈనాడే, పెరుమై = గొప్పతనాన్ని, పెరుమిన్‌కళ్ = పొందండి.

"శెమ్ తమిழ் మఱైకళ్" - **"శెన్దిఱత్తై తమిழోశై"** అనే తిరుమఙ్గైయాழ்వార్ల సూక్తి స్మరణీయం. భగవానుని తత్త్వాన్ని స్ఫుటంగా, అందంగా ప్రకాశింపజేసేవి కనుక **"శెమ్"** అనే విశేషణం ద్రావిడ వేదానికి సాభిప్రాయకం. **"తీదిల్ శీర్ పాచ్చియత్తోన్"** - శ్రీభాష్యం ఏదోషం లేని గ్రంథం అనడం ఎందుకు? అని అంటే, భేదశ్రుతులు, అభేదశ్రుతులు, భేదాభేదశ్రుతులు, సగుణశ్రుతులు, నిర్గుణశ్రుతులు - అన్ని విధాలైన శ్రుతులను సమన్వయించి సరసంగా అర్థం చెప్పేది శ్రీరామానుజుల శ్రీభాష్యమే. కనుక **"తస్మై రామానుజార్యాయనమః పరమయోగినే, యః శ్రుతి స్మృతిసూత్రాణా మంతర్జ్వర మశీశమత్"** అనికదా శ్రీరామానుజులు కీర్తింపబడుతున్నారు. (శ్రీ శంకరభాష్యాదులలో కొన్ని శ్రుతులను- నిర్గుణశ్రుతులను, భేదశ్రుతులను అప్రధానంగా గ్రహించిన లోపం ఉన్నదికదా! సర్వశ్రుతి సమన్వయాన్ని చేసినవారు శ్రీరామానుజులే.) **"మఱై"** - మఱుగుపరచేది. అర్థాన్ని అయోగ్యులకు తెలియని రీతిలో మఱుగుపరుస్తుంది కనుక వేదానికి **"మఱై"** - అని పేరు.

వేదాన్ని అభ్యసించేవారికి మధురంగా అర్థాన్ని వివరించే మిక్కిలి గొప్ప గ్రంథం అయిన శ్రీభాష్యాన్ని అనుగ్రహించినవారైన యతిరాజులగుణాలలో అభినివేశాన్ని పొందే మణవాళమహామునులు ఈ లోకంలో అవతరించిన తర్వాత వివరింపబడ్డ అందమైన ద్రావిడవేదాలనబడే దివ్యప్రబంధాలను చక్కగా తేడా లేకుండా అభ్యసించి తెలిసికొని, గొప్పతనాన్ని పొందండి.

88. ఇన్ తమిழின் పొరుళెల్లామ్ ఇవ్వులకిల్ అఱిన్దురైక్కుమ్
తున్ఱు పుకழ் ఆరియర్‌కళ్ తుదిక్కుమ్ ఎతిరాశర్ పుకழ்
నిన్ఱురై శెయ్ వరయోగి నీణిలత్తిల్ ఒరు మరత్తై
శెన్ఱడైయ ప్పరమపదఙ్గొడుత్తరుళుమ్ నీర్‌మై యెన్నే

ఇన్ తమిழின் = తీయని ద్రావిడవేదాల, పొరుళ్ ఎల్లామ్ = అర్థాలను అన్నిటినీ, అఱిన్దు = తెలిసికొని, ఇవ్వులకిల్ = ఈలోకంలో, ఉరైక్కుమ్ = వివరించే, తున్ఱు పుకழ்= ప్రకాశించే కీర్తిని కల, ఆరియర్‌కళ్ = ఆచార్యులు, తుదిక్కుమ్ = స్తుతించే, ఎతిరాశర్ పుకழ் = శ్రీరామానుజుల కల్యాణగుణాలను, నిన్ఱు = నిలచి (మననం చేసి), ఉరై శెయ్ = పలికే, వరయోగి = శ్రీవరవరమునులు, నీళ్ నిలత్తిల్ = విశాలమైన భూమిలో, ఒరు మరత్తై = ఒక వృక్షాన్నికూడా, పరమపదమ్ = పరమపదాన్ని,

శెన్దడైయ = చేరేటట్లుగా, శెయ్తు అరుళుమ్ = చేసి అనుగ్రహించే, నీర్మై = సౌలభ్యం, ఎన్నే = ఏమి! ఆశ్చర్యం!

శ్రీవరవరమునుల అవతారవైభవాన్ని, సౌలభ్యాన్ని తెలిపే ఒక అద్భుతోదంతం ఇందులో ప్రస్తావింపబడింది. **"ఇన్ తమిళ్లిన్ - అరియర్కళ్"** అనే ప్రయోగానికి తిరువరఙ్గత్తముదనార్వంటివారని అర్థం చెప్పి, **"తుదిక్కుమ్ - ఉరైశెయ్ వరయోకి"**- అనే ప్రయోగం ఆ ఆచార్యులు శ్రీరామానుజుల విషయంలో అనుగ్రహించిన ఇరామానుశ నూఱ్ఱన్దాది ప్రబంధానికి మణవాళమహామునులు ఉరైను రచించిన విషయాన్ని సూచిస్తున్నదని అనవచ్చు. **"మరమ్"** - తెలుగులో **"మ్రాను"** అయింది. **"ఆరియర్"**- ఆర్యశబ్దభవం. **"నీర్మై"** - నీటియొక్క స్వభావం. పల్లపు ప్రాంతాలకు ప్రవహించడం నీటిస్వభావం. ఆవిధంగానే అధముల దరి చేరే గుణమైన సౌలభ్యానికి **"నీర్మై"** అని పేరు. లేక, సహజగుణానికి కూడా. **"నీర్మై"** అని పేరు. లేక, సహజ గుణానికి కూడా **"నీర్మై"** అనిపేరు. అపుడు గుణసామాన్యవాచకం విశేషపర్యవసానాన్ని పొందిందని చెప్పాలి. లేక, వరవరమునుల స్వాభావికమైన గుణం సౌలభ్యం కనుక, అది **"నీర్మై"** అని నిర్దేశింపబడిందని చెప్పవచ్చు. **"మెయ్న్నీర్మై తోఱ్ఱాయే"** (2-1-6) అనే తిరువాయ్మొళ్ళి ప్రయోగంలో ఈ పదం అందమని వ్యాఖ్యానింపబడింది. ఆ అర్థంకూడా ప్రకృతంలో గ్రాహ్యమే. **"ఎన్నీర్మై కణ్డు ఇరఙ్గి"** అనే తిరువాయ్మొళ్ళి (1-4-4) ప్రయోగంలో స్థితి, దశ అనే అర్థంలోకూడా ఈ పదం ప్రయోగింపబడింది. లేక, నీటికి సహజగుణమైన శీతలత్వాన్ని ఈ పదం తెలుపుతున్నదని తలిస్తే, ఇది ప్రకృతంలో వరవరమునుల శీతలస్వభావాన్ని తెలుపుతున్నదని చెప్పవచ్చు. వీటి అన్నిటిలో సౌలభ్య గుణపరంగా ఆ వివరించడంలో అర్థస్వారస్యం అధికం.

శ్రీ వరవరమునులు సేతువుద్వారా ప్రయాణం చేసేటపుడు తమకు, తమ అనుచరులకు నీడను ఇచ్చిన చింతచెట్టుకు మోక్షం ఇచ్చారని యతీంద్రప్రవణప్రభావంలో తెలుపబడింది. దీనిని అణ్ణావప్పఙ్గార్ **"సేతోర్మార్గేణ గచ్ఛన్ అకురుత మనసా తింత్రిణీవృక్షమోక్షమ్"** అని శ్రీవరవరమునిసుచరితచషకమనే కృతిలో పలికారు.

తీయని ద్రావిడపాశురాల అర్థాలను అన్నిటినీ తెలిసికొని వివరించే ప్రశస్తిని కల ఆచార్యులచే స్తుతింపబడేవారైన యతిరాజుల కీర్తిని వివరించే మణవాళ మహా మునులు, ఈ లోకంలో ఒక వృక్షాన్ని కూడా పరమపదం చేరేటట్లుగా చేసిన కరుణ ఎంత ఆశ్చర్యకరం!

89. ఎన్పోలుమ్ పిళ్లై శెయ్వార్ ఇవ్వులకిల్ ఇల్లై యెన్నుమ్
ఉన్ పోలుమ్ పొఱుత్తరుళ్వార్ ఒరువరిల్లైయే యెన్నుమ్

అన్బోదన్జు ఎతిరాశర్క్కు అతిశయఙ్జొల్ వరమునివన్
పొన్బోలుమ్ అడిముదలా పోఱ్ఱుమిన్ నీర్ ముడియళవే

ఎన్ పోలుమ్ = నావలె, పిழై శెయ్‌వార్ = తప్పులను చేసేవారు, ఇవ్వులకిల్ = ఈలోకంలో, ఇల్లై ఎన్జుమ్ = లేరు అని, ఉన్ పోలుమ్ = నీవలె, పొఱుత్తు అరుళ్‌వార్ = సహించి, కరుణించేవారు, ఒరువర్ ఇలైయే ఎన్జుమ్ = ఎవరూ ఇంకొకరు లేరని, అన్బోడు అన్జు = అపుడు భక్తితో (ఆర్తి ప్రబంధంలో) ఎతిరాశర్క్కు = యతిరాజులకు, అతిశయమ్ = గొప్పతనాన్ని, శొల్ = పలికే, వరవరమునివన్ = వరవరమునుల, పొన్ పోలుమ్ = బంగారంవంటి, అడి ముదలా = శ్రీచరణాలనుండి, ముడి యళవే = కిరీటం వరకు, నీర్ పోఱ్ఱుమిన్ = మీరు కీర్తించండి.

"ఎన్ పోలుమ్ పిழై శెయ్‌వార్ ఇవ్వులకిల్ ఉణ్డో? ఉన్నైప్పోల్ పొరుక్క వల్లారుణ్డో? అనైత్తులకుమ్ వాழ ప్పిఱన్ద ఎతిరాశమాముని వా, ఏழై క్కిరఙ్గా యిని" (శ్రీరామానుజా? నావలె తప్పులు చేసే వారీలోకంలో ఉన్నారా! మీ వలె వాటిని క్షమించే వారున్నారా ? లోకాలను అన్నిటినీ ఉద్ధరించడంకోసం అవతరించిన మీరు ఈ దీనునిపట్ల దయ చేయండి) అనే ఆర్తిప్రబంధంలోని 41వ పాశురార్థం స్మరణీయం. **"అడిముదలా ముడియళవే" – "దేవా శ్చరణతః పునః"** అనే క్రమాన్నిబట్టి దేవతల వర్ణనను పాదాల నుండి శిరస్సు పర్యంతం చేయాలి. **"పొన్బోలుమ్ అడి"** – బంగారంవంటి శ్రీచరణాలు. **"పదాంబుజయుగ్మరుక్మ"** – అని కూరేశుల ప్రయోగం. అందానికి, ఎఱ్ఱని వర్ణానికి, స్పృహణీయతకు బంగారం శ్రీచరణాలకు ఉపమానంగా చెప్పబడింది.

"నావలె పాపం చేసేవారు ఈ లోకంలో లేరు" అని, "నీవలె పాపాలను సహించేవారు ఎవరూ లేరు." అని యతిరాజుల వద్ద (ఆర్తి ప్రబంధంలో) భక్తితో అనుగ్రహించిన మణవాళమహామునులను బంగారంవంటి పాదాలనుండి కిరీటం వరకు కీర్తించండి.

90. ముడి యழకుమ్ విழి యழకుమ్ ముకత్తழకుమ్ తిరుమేని
పడి యழకుమ్ తూయ్ ముఱువల్ పవళ నికర్ వాయழకుమ్
కడి యழకుమ్ కరత్తழకుమ్ కణ్డు మకిழ్న్దు ఎతిరాశర్
అడి పరవుమ్ వరమునివన్ అడియழకుమ్ విడవఱ్ఱే

ముడి అழకుమ్ = (శ్రీరామానుజుల)కిరీటసౌందర్యం, విழి అழకుమ్ = కటాక్ష (నేత్రసౌందర్యం, ముకత్తు అழకుమ్ = తిరుముఖంలోని అందం, తిరుమేని పడి అழకుమ్= దివ్యరూపసౌందర్యం, తూయ్ ముఱువల్ = పవిత్రమైన చిఱునవ్వులోని, పవళ నికర్ = పగడాలతో సాటివచ్చే (పగడపు కాంతిని కల), వాయ్ అழకుమ్ =

పెదవిలోని అందం, కడి అழకుమ్ = నడుములోని అందం, కరత్తు అழకుమ్ = శ్రీహస్తసౌందర్యం, కణ్డు మకిழ్న్దు= దర్శించి ఆనందించి, ఎతిరాశర్ అడి పరవుమ్ = శ్రీరామానుజుల శ్రీచరణాలను సేవించే, వరవరమునివన్ = శ్రీవరవరమునుల, అడి అழకుమ్ = శ్రీచరణసౌందర్యం, విడవఱ్ఱే= (సేవించకుండా) విడువడానికి వీలు అవుతుందా!

పాశురంలో శ్రీరామానుజుల కిరీటంనుండి పాదాలవరకు గల శోభ ప్రస్తుతింప బడింది. **"దేవా శ్చరణతః పునః"** అనే నియమాన్నిబట్టి గత పాశురంలో పల్కిన కవి, తిరుమేని సొబగు తమను పరవశం చేసినందువల్ల వివశులై ఇందులో అ క్రమంలో వరవరమునులు అనుభవిస్తున్నారని అంటున్నారు. – **"అత్యంతభక్తియుక్తానాం న శాస్త్రం నైవ చ క్రమః"** అని కదా సూక్తి. నమ్మాழ్వార్లు కూడా **"ముడిచ్చోది"** అనే దశకంలో (తిరువాయ్మొழి) ఈ క్రమంలోనే భగవానుని సౌందర్యాన్ని అనుభవించారు. దీనిని కూరేశులు, భట్టర్ మొదలైన ఆచార్యులు అనుసరించారు. భక్తుడు శరణ్యుని పరత్వాన్ని భావించినపుడు కిరీటంనుండి, తన స్వరూపాన్ని గమనించినపుడు పాదాలనుండి వర్ణించడం పొసగుతుందని పూర్వాచార్యులు చేసిన వివరణం ప్రకృతంలో స్మరణీయం. అందువల్ల ప్రకృత అనుభవక్రమం వరవరమునులభక్త్యుత్కర్షకు సూచకం. **"నికర్"** – ఉపమానం, సమానం, కాంతి అనే అర్థాలు గ్రాహ్యాలు.

యతిరాజుల కిరీటసౌందర్యం, నేత్రసౌందర్యం, ముఖసౌందర్యం, తిరుమేని అందం, చిఱునవ్వుతో వెలిగే పగడంవంటి పెదవి అందం, నడుము అందం, శ్రీహస్తాల సౌందర్యం అనే వీటిని దర్శించి ఆనందించి వారి శ్రీపాదాలను సేవించే మణవాళ మహామునుల శ్రీపాదాల అందాన్ని విడువడానికి వీలవుతుందా!

91. వఱ్ఱాద పవక్కడలై వఱ్ఱువిత్తు అన్దామత్తిల్
నఱ్ఱాదై పద మళిక్కు నమ్మెతిరాశన్ పదత్తై
పఱ్ఱాక ప్పఱ్ఱు మణవాళముని ఇవ్వులకిన్
ముఱ్ఱాదు ఎమ్ తీవినైయై ముడిత్త పకై అరియోమే

వఱ్ఱాత = ఏనాడు ఇంకిపోని, పవ క్కడలై = సంసారసముద్రాన్ని, వఱ్ఱు విత్తు = ఎండగట్టి, అన్దామత్తిల్ = అందమైన పరమపదంలో, నల్ తాదై పదమ్ = నిరుపాధిక తండ్రి అయిన భగవానుని, శ్రీచరణాలను,అళిక్కుమ్ = అనుగ్రహించే, నమ్ ఎతిరాశన్ పదత్తై = మన శ్రీరామానుజుల శ్రీచరణాలను, పఱ్ఱు ఆక = శరణంగా, పఱ్ఱుమ్ = ఆశ్రయించే, మణవాళముని = మణవాళమహామునులు, ఇవ్వులకిన్ = ఈలోకంలో, ఎమ్ తీ వినై = మన దుష్కర్మలను, ముఱ్ఱాతు = పరిణతిని చెందకుండా

(ఫలపర్యవ సాయి కాకుండా), ముడిత్త వకై = నశింపజేసే తీరును, అఱియోమే = తెలియలేము.

"అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" అని అన్నట్లు కర్మఫలం అవశ్యభోక్తవ్యం. అయినా శ్రీవరవరమునులు దానిని ఫలించకుండా నశింపజేసే తీరు అత్యాశ్చర్యకరం, కనుక తెలియలేమని తాత్పర్యం. **"నఱ్ఱాతై" – "భూతానా మవ్యయః పితా"** అని, **"ఎన్దమ్ ఇఱవాత ఎన్దై"** అని శ్రీమన్నారాయణుడు నిరుపాధికజనకునిగా కీర్తింపబడుతున్నాడు కదా. ప్రణవంలోని అకారం ఈ సంబంధాన్ని తెలుపుతున్నదని పెద్దలు తెలిపారు. కాబట్టి **"నఱ్ఱాతై",** – భగవానుడే నిజమైన పిత అనే విషయం కాకాసుర వృత్తాంతంలో స్పష్టం. అతడు **"స పిత్రా చ పరిత్యక్తః"** కదా! **"పఱ్ఱుతల్"**– పట్టుకోవడం.

ఎండని భవాబ్ధిని ఎండేటట్లుగా చేసి, పరమపదంలో మన తండ్రి అయిన భగవానుని శ్రీపాదాలను మనకు అనుగ్రహించే యతిరాజుల శ్రీపాదాలను శరణంగా ఆశ్రయించే మణవాళమహామునులు ఈ లోకంలో నా దుష్కర్మలను ఫలించకుండా నశింపజేసిన రీతిని తెలియలేము.

92. మేవాద శమయికళుమ్ మేవి యడి పణికిన్ఱ
మూవాద కతికళ్ తరు మొయ్మ్బు ఎతిరాశఱ్కినియ
పావారు న్తమిఴ్ మఱైక్కు ప్పాఙ్గాన కురు వెన్ఱు
దేవాదిదేవనుమే శెప్పు మణవాళనైయే

మేవాత శమయికళుమ్ = ఇంతకుముందు ఆశ్రయించని ఇతరమతాలవారు సైతం, మేవి = ఆశ్రయించి, అడి పణికిన్ఱ = శ్రీచరణాలను సేవించే, మూవాత = పునరావృత్తి లేని, కతికళ్ = (అర్చిరాది) గతులను, తరుమ్ = అనుగ్రహించే, మొయ్మ్బు= సమర్థులైన, ఎతిరాశఱ్కు = శ్రీరామానుజులకు, ఇనియ = తీయని, పా ఆరుమ్ తమిఴ్ మఱైక్కు = పాశురాలతో నిండిన ద్రావిడ వేదానికి, పాఙ్గాన = తగిన, కురువు = ఆచార్యులు, మణవాళనైయే ఎన్ఱు = శ్రీవరవరములే అని, తేవాతి తేవనుమే = దేవాధిదేవుడైన శ్రీరంగనాథుడే, శెప్పుమ్ = పలికాడు.

"మూవాత కతికళ్" – పునరావృత్తి లేని గతులు. **"మూవాత మూక్కతిక్కణ్ శెల్లుమ్ వకై"** – అని ఆళ్వార్ల సూక్తి. శ్రీరామానుజులు మెచ్చిన ద్రావిడ వేదానికి తగిన ఆచార్యులు శ్రీమణవాళమహామునులే – అని శ్రీరంగనాథుడు పలికాడని తాత్పర్యం. **"మొయ్మ్బు"** – బలం, సామర్థ్యం.

ఇతరమతాలవారు సైతం ఆశ్రయించేవారు, నశించని గతి అయిన పరమపదాన్ని అనుగ్రహించే సామర్థ్యాన్ని కలవారైన యతిరాజులకు మిక్కిలి తీయగా ఉండే పాశురాలను కల ద్రావిడవేదాలైన దివ్యప్రబంధాలకు తగిన గురువు మణవాళమహామునులే అని దేవాధిదేవుడైన శ్రీరంగనాథుడుకూడ పలికాడు. ఒక సంవత్సరకాలం పాటు ఈడు వ్యాఖ్యను వరవరమునులవల్ల శ్రీరంగనాథుడు విన్నాడు కదా !

93. మణవాళమామునివన్ వణ్మై తికళ్ ఎతిరాశన్
కుణ మేవు నల్పరమన్ కూర్ మదియోర్ కురుక్కళెల్లామ్
తుణైయాక త్తొళుదు దినన్తుదిక్కుమ్ అరవరశాకుమ్
ఇణైయారుమ్ ఇల్లాదిఙ్గు ఎళిలరఙ్గమ్ ఇలఙ్గువనే

మణవాళ మామునివన్ = మణవాళమహామునులు, వణ్మై తికళ్ = ఔదార్యం ప్రకాశించే, ఎతిరాశన్ = యతిరాజుల, కుణమ్ మేవుమ్ = కల్యాణగుణాలను ఆదరించే, నల్ పరమన్ = మహాత్ములు, కూర్ మతియోర్ = నిశితమైన బుద్ధిని కల, కురుక్కళ్ ఎల్లామ్ = గురువులు అందఱు, తుణైయాక = సహాయంగా (భావించి) తొళుతు = నమస్కరించి, దినమ్ = ప్రతిదినం, తుదిక్కుమ్ = స్తుతించే, అర అరశు ఆకుమ్ = సర్పాలకు అధిపతియే (ఆదిశేషులే). ఆ ఆచార్యులు, ఇణై ఆరుమ్ ఇల్లాతు = సాటి ఎవరూ లేని రీతిలో, ఇఙ్గు = ఈలోకంలో, ఎళిల్ అరఙ్గమ్ = ప్రకాశించే శ్రీరంగంలో, ఇలఙ్గువనే = వెలుగుతున్నారు.

"కూర్మదియోర్కురుక్కళ్" – ప్రతివాది భయంకరం అణ్ణన్, కోయిల్కన్దాడై అణ్ణన్, ఎఱుమ్బియప్పా మొదలైన గొప్ప గురువులు.

మిక్కిలి ఔదార్యాన్ని కల యతిరాజుల గుణాలలో అభినివేశాన్ని పొందేవారు, నిస్సమాభ్యధికులై శ్రీరంగంలో వేంచేసి ఉన్నవారు అయిన మణవాళమామునులు నిశితమైన జ్ఞానాన్ని కల ఆచార్యులచేత ప్రతిదినం తమకు సహాయంగా నమస్కరించి, స్తుతింపబడే సర్పరాజు అయిన ఆదిశేషులే.

94. ఇలఙ్గు తికిరియి నొళియాల్ ఎళిల్ అత్తికిరిమాలుమ్
కలఙ్గి ఎతిపతి యళిత్త కారణముమ్ మామునివన్
తులఙ్గియ నఱ్కుణఙ్గళైయుమ్ తొల్లులకోర్క్కు అళిత్తరుళుమ్
వలఙ్గొళ్ మణవాళముని మన్నియ శీర్ వాళ్త్తుమినే

ఇలఙ్గు = ప్రకాశించే, తికిరిన్ ఒళియాల్ = శ్రీసుదర్శనంయొక్క కాంతితో, ఎళిల్ = వెలిగే, అత్తికిరి మాలుమ్ = హస్తిగిరిలోని భక్తవత్సలుడుకూడా, కలఙ్గి = మనస్సులో బాధపడి, ఎతిపతి అళిత్త = శ్రీరామానుజులను శ్రీరంగనాథునకు

అనుగ్రహించిన, కారణముమ్ = కారణాన్ని, మా మునివన్ = గొప్పముని అయిన శ్రీరామానుజుల, తులఙ్గియ = ప్రకాశించిన, నల్ కుణఙ్గళైయుమ్ = కల్యాణగుణాలను, తొల్ = పూర్వం, ఉలకోర్క్కు అరుళుమ్ = లోకాలకు తెలియజేసిన, వళఙ్గొళ్ = గొప్ప జయాన్ని కల, మణవాళ ముని = మణవాళ మహామునుల, మన్నియ శీర్ = స్థిరమైన కీర్తిని, వాళ్త్తుమినే = మంగళాశాసనం చేయండి.

"అత్తికిరి" – హస్తిగిరి అనే పదంయొక్క వికృతి.

ప్రకాశించే చక్రాయుధంతో అందంగా ఉండే హస్తిగిరినాథుడైన వరదరాజస్వామి శ్రీరంగనాథునకు అనుగ్రహించిన కారణాన్ని, గొప్పముని అయిన యతిరాజుల కల్యాణగుణాలను లోకంలోనివారికి వివరించే మణవాళమహామునుల కల్యాణగుణాలను కీర్తించండి.

95. వాళ్త్తుమిన్కళ్ నాడోఱుమ్ మాఱనడి పణి మునితాళ్
తాళ్త్తు ముడి మణవాళమామునివన్ తన్నరుళాల్
శూళ్త్త వినైత్తూఱ్ఱై ముఱ్ఱురత్తి ప్పిన్ నల్వనమ్ తழைక్కుమ్
మూళ్త్త పెరునీరులకీర్ ముత్తి తరుమ్ ముఱై ముఱైయే

నాళ్ తోఱుమ్ = ప్రతిదినం, మాఱన్ అడి పణి = నమ్మాళ్వార్ల శ్రీచరణాలను సేవించే, ముని తాళ్ = శ్రీరామానుజుల శ్రీపాదాలలో, ముడి తాళ్త్తు = శిరస్సును తాకించే, మణవాళ మా మునివన్ తన్ అరుళాల్ = మణవాళమహామునులు తమ కృపచేత, శూళ్త్త = (మనలను జన్మ జన్మలుగా) చుట్టుకొన్న, వినై తూఱ్ఱై = కర్మలనే ముళ్ళ పొదలను, ముఱ్ఱు = పూర్తిగా, తురత్తి = ఛేదించి, పిన్ = తరువాత, నల్ వనమ్ తழைక్కుమ్ = మంచి వనాన్ని విస్తరింపజేస్తారు. ముఱై ముఱైయే = క్రమక్రమంగా, మూళ్త్త పెరు నీర్ ఉలకీర్ = ఉప్పొంగి చుట్టి ఉండే గొప్ప నీటిని కల భూమిలోని జనులారా!, ముత్తి తరుమ్ = ముక్తిని అనుగ్రహిస్తారు.

"వినై తూఱ్ఱై" – దుష్కర్మలు ముళ్ళపొదలుగా రూపింపబడ్డాయి. ముళ్ళ పొదలలో చిక్కుకొన్నవాడు వాటినుండి బయటకు రావడం వీలుకానట్లే, దుష్కర్మలలో చిక్కుకొన్నవాడు వాటినుండి బయటపడలేడుకదా! **"నల్ వనమ్ తழைక్కుమ్"** – ఇక్కడ చక్కని వనాన్ని విస్తరింపజేయడం అంటే, భగవత్కైంకర్యాన్ని అభివృద్ధి చేయడమేకదా! ముళ్ళపొదలు నశిస్తే పెరిగేది మంచి వనమే కదా! దుష్కర్మలు నశిస్తే చేసేది భగవత్కైంకర్యమే **"మూళ్త్త నీర్ ఉలకెల్లామ్"** తిరువాయ్మొళ్ళి ప్రయోగభావ్యం.

ప్రతిదినం నమ్మాళ్వార్ల శ్రీపాదాలను సేవించే యతిరాజుల శ్రీపాదాలలో తలను వంచే మణవాళమహామునులు తమ కృపతో మనలను చుట్టి ఉన్న కర్మబంధాన్ని తొలగించి, తరువాత చక్కని ముక్తిని క్రమక్రమంగా అనుగ్రహిస్తారు.

96. ముఱై యుణర త్తమిళ్ మఱైయై మూదులకోర్క్కు అళిత్తరుళుమ్
నఱై వకుళమాఱనడి నణ్ణుమ్ ఎతిరాశర్ పుకళ్
తిఱలుఱు నల్చిన్దై మణవాళముని శెయ్ కలైయుమ్
నఱై పుకళుమ్ నెఞ్జిల్ వైత్తు నీడులకిల్ నిల్లుమినే

ముఱై ఉణర = క్రమం తెలిసేటట్లుగా, తమిళ్ మఱైయై = ద్రావిడ వేదాన్ని, మూదు+ఉలకోర్క్కు = ప్రాచీనమైన ఈలోకంలో ఉన్నవారికి, అళిత్తు అరుళుమ్ = అనుగ్రహించే, నఱై = తేనెను కల (సువాసనను కల), వకుళ = వకుళమాలికను, ముడి = కిరీటంలో కల, మాఱన్ అడి = నమ్మాళ్వార్ల శ్రీచరణాలను, నణ్ణుమ్ = సేవించే, ఎతిరాశర్ పుకళ్ = యతిరాజుల కీర్తిని, తిఱల్ = విజయాన్ని, ఉఱు = అనుభవించే, నల్ శిన్దై = మంచి మనస్సును కల, మణవాళముని = మణవాళ మహామునులు, శెయ్ = రచించిన, కలైయుమ్ = గ్రంథాలను, నఱై పుకళుమ్ = పరిమళించే కల్యాణగుణాలను (కీర్తిని), నెఞ్జిల్ వైత్తు = మనస్సులో పెట్టుకొని, నీడు ఉలకిల్ = విశాలమైన లోకంలో, నిల్లుమినే = నిలవండి.

"ముఱై ఉణర" – ఆత్మ – పరమాత్మల మధ్య ఉండే శేషశేషిభావమనే క్రమాన్ని– అని చెప్పవనచ్చు. వేదాలసారం అదే కదా. **"యస్యాస్మి న తమంత రేమి"** అని కదా వేదపురుషుని వచనం. **"శిన్దై"** – చింతాశబ్ద భావం.

ద్రావిడవేదం అయిన దివ్యప్రబంధాలను ఈలోకంలోనివారికి అనుగ్రహించిన వారైన నమ్మాళ్వార్ల శ్రీపాదాలను ఆశ్రయించే యతిరాజుల కీర్తిని తలచే మణవాళమహామునుల శ్రీసూక్తులను, వారి కీర్తిని ఎల్లప్పుడూ మనస్సులో నిలుపుకొనండి.

97. నిఱ్కిన్ఱ తిరుమలైయుమ్ నీళ్ విశుమ్బుమ్ పాఱ్కడలుమ్
ఒక్క వళర్ ఎతిరాశర్ ఓఙ్గు పుకళ్ ఇవ్వులకిల్
మిక్క వరుళ్ మణవాళన్ మెయ్క్కలైయిల్ మనమకిళుమ్
తక్క మఱైయోర్ ఎనక్కు త్తారణియిల్ వాన్ తుణైయే

నిఱ్కిన్ఱ = శాశ్వతంగా నిలచి ఉండే, తిరుమలైయుమ్ = వేంకటాద్రి, నీళ్ విశుమ్బుమ్ = విశాలమైన పరమాకాశం, పాఱ్కడలుమ్ = క్షీరాబ్ధి – అనే వీటిలో, ఒక్క= సమంగా, వళర్ = వృద్ధిచెందే, ఎతిరాశర్ = యతిరాజుల, ఓఙ్గు పుకళ్ = వర్ధిల్లే కీర్తిని గూర్చి, ఇవ్వులకిల్ = ఈ లోకంలో, మిక్క అరుళ్ = మిక్కిలిగా అనుగ్రహించే

(కీర్తించే), మణవాళన్ = మణవాళమహామునుల, మెయ్ = యథార్థాన్ని ప్రతిపాదించే, కలైయిల్ = గ్రంథాలలో లగ్నమై, మనమ్ మకిళ్యుమ్ = మనస్సు ఆనందించే, తక్క మఱైయోర్ = తగిన వేదవిదులు, ఎనక్కు = నాకు, తారణియిల్ = ఈలోకంలో, వాన్ తుణైయే = గొప్ప రక్షకులు.

"మెయ్ కలైయిల్" – "పొయ్యిలా మణవాళ మాముని" అని కీర్తింపబడే శ్రీమణవాళమహామునుల గ్రంథాలు యథార్థాన్ని తెలియజేస్తాయి. కనుక, ఈ ప్రయోగం సార్థకం. ఆదిశేషుడే వేంకటాచలంగా రూపొందాడని పురాణకథనం, పాలకడలిలో శయ్యగా, పరమపదంలో సింహాసనంగా ఆదిశేషుడు సేవచేస్తాడు. అందువల్ల ఈ మూడు దివ్యదేశాలలో ఆ ఆదిశేషుల అవతారభూతులైన యతిరాజుల కీర్తి వృద్ధి చెందుతున్నదని చెప్పవచ్చు. లేక తిరుమల భూలోకానికి, పరమపదం ఊర్ధ్వలోకాలకు, పాలసముద్రం అధోలోకాలకు ఉపలక్షణాలై, ముల్లోకాలలో యతిరాజుల కీర్తి వ్యాపించిందని చెప్పవచ్చు.

దీర్ఘంగా, ఉన్నతంగా నిలచి ఉండే తిరుమల, పాలసముద్రం, పరమపదం మొదలైనవానితో సమంగా ఉన్నతంగా పెరుగుతున్న యతిరాజుల కీర్తిని ఈ లోకంలో వృద్ధి పొందించే మణవాళమహామునుల గ్రంథాలలో మనస్సు లగ్నం చేసి ఆనందించే శాస్త్రజ్ఞులు (వైదికులు) నాకు ఈ లోకంలో గొప్ప రక్షకులు కాగలరు.

98. తుణైయాళన్ వయలరఙ్గన్ తొల్ శీరై ఏత్తుమవర్క్కు
ఇణై యిల్లై ఎన్ఱురైక్కుమ్ ఎతిరాశన్ ఎఙ్కతి యెన్ఱుణర్
మణవాళముని యోదు కలైకళై ఉళ్ నినైన్దార్కళ్
ఇణైమలర్త్తాళ్ ఇఱైఞ్జుమవర్ ఎళ్ళిల్ విశుమ్బుక్కిఱైయవరే

తుణైయాళన్ = మాకు శరణ్యుడైనవాడు, వయల్ = పొలాలచే చుట్టబడిఉండే, అరఙ్గన్ = శ్రీరంగంలోని శ్రీరంగనాథుని, తొల్ శీరై = సహజాలైన కల్యాణగుణాలను, ఏత్తుమవర్క్కు = కీర్తించేవారికి, ఇణై ఇల్లై = సాటి లేదు, ఎన్ఱు ఉరైక్కుమ్ = అని పలికే, ఎతిరాశన్ = యతిరాజులు, ఎమ్ కతి = మాకు గతి, ఎన్ఱు = అని, ఉణర్ = తెలిసే, మణవాళముని = మణవాళమహామునులు, ఓదు కలైకళై = అనుగ్రహించిన కృతులను, ఉళ్ నినైన్దార్కళ్ = మనస్సులో భావించేవారి, ఇణై మలర్ త్తాళ్ = పద్మాలవంటి పాదాల జంటను, ఇఱైఞ్జుమవర్ = ఆశ్రయించేవారు, ఎళ్ళిల్ విశుమ్బుక్కు = ప్రకాశించే పరమపదానికి, ఇఱైయవరే = స్వాములు

"ఎళ్ళిల్ విశుమ్బు" – "అత్యర్కానలదీప్తం తత్ స్థానం విష్ణోః ర్మహాత్మనః" అనే రీతిలో జ్యోతిర్మయంకదా పరమపదం. ఈ ప్రబంధంలోని ప్రధాన ప్రమేయమైన చరమ పర్యనిష్ఠను మఱొక్కమారు ప్రతిపాదించే పాశురం ఇది.

మాకు శరణం అయిన శ్రీరంగనాథుని కల్యాణగుణాలను స్తుతించేవారికి సాటి లేదు- అని అనుగ్రహించే యతిరాజులే మనకు గతి, అని తలచే మణవాళ మహామునులు అనుగ్రహించే శ్రీసూక్తులను మనస్సులోపల భావించేవారి శ్రీపాదాలను సేవించేవారు అందమైన పరమపదానికి స్వాములై ప్రకాశిస్తారు.

99. ఇఱైయు మఱి విల్లాద ఈనరైయుమ్ తన్నరుళాల్
నిఱై మదియర్ ఆక్కి యరుళ్ నిన్మలనామ్ ఎతిరాశన్
నఱై మలర్తాళ్ ముడిక్కణియాయ్ నఱ్ఱరిక్కుమ్ మణవాళన్
విఱల్ మరువు తొన్నూలిన్ వియాక్కియైకళ్ విరుమ్బిరే

ఇఱైయుమ్ = కొంచెంకూడా, అఱివు ఇల్లాత = జ్ఞానం లేని, ఈనరైయుమ్ = హీనులను కూడా, తన్నరుళాల్ = తమ కృపతో, నిఱై మదియర్ = పూర్ణమైన జ్ఞానాన్ని కలవారుగా, ఆక్కి అరుళ్ = చేసి అనుగ్రహించే, నిన్మలనామ్ ఎతిరాశన్ = నిర్మలులైన యతిరాజుల, నఱై మలర్ తాళ్ = పరిమళించే పద్మాలవంటి శ్రీచరణాలను, ముడిక్కు అణియాయ్ = కిరీటానికి ఆభరణంగా, నల్ తరిక్కుమ్ = చక్కగా ధరించి, మణవాళన్ = మణవాళమహామునుల, విఱల్ మరువు = గొప్పతనం నిలచిఉండే, తొల్ నూలిన్ = ద్రావిడవేదాల, వియాక్కియైకళ్ = వ్యాఖ్యానాలను, విరుమ్బిరే = ఆదరించండి.

"నఱ్ఱరిక్కుమ్" - **"ఇప్పోదాయిఱ్ఱివళైయుమ్ శెవ్వి పెఱ్ఱతుమ్ ముడి నఱ్ఱరిత్తతుమ్"** అనే ఈడు (2-6-10) వ్యాఖ్యానసూక్తి స్మరణీయం. **"ఈనర్"** - ఇది హీనశబ్దభవం. **"నిఱై మదియర్"** - పూర్ణమైన జ్ఞానాన్ని కలవారు. **"మది"** - సంస్కృతంలోని మతిశబ్దవికారం. ఇది ఇక్కడ జ్ఞానాన్ని లక్షిస్తుంది. **"నఱై"** - తేనె అనికూడా అర్థం. **"తొల్ నూలిన్ వియాక్కియైకళ్"**- నాలాయిర దివ్యప్రబంధాలలో మొదటి ప్రబంధం అయిన పెరియాళ్వార్ తిరుమొழி వ్యాఖ్యానం అనికూడా చెప్పవచ్చు.

కొంచెంకూడా జ్ఞానం లేనివారిని సైతం తన కృపతో జ్ఞానాన్ని కలవారిగా చేసి అనుగ్రహించే, ఏ దోషం లేని యతిరాజుల శ్రీపాదపద్మాలను తమ కిరీటానికి ఆభరణంగా ధరించే మణవాళమహామునుల గొప్ప దివ్యప్రబంధవ్యాఖ్యానాలను ఆదరించండి.

100. విరుప్పముడన్ తిరుమాలై మేవి యుళ్ళే నైన్దురుకి
ఇరుక్కు మకిழ் మాఱనడి ఏత్తి యరుళ్మారి యడిక్కు
ఉరుక్క ముఱుమ్ ఎతిరాశర్ మణమకిழுమ్ తమిழ்మఱైయై
పొరుక్క ముఱ ఓదు మణవాళనడి పేణు నెஞ்జే !

విరుప్పముడన్ = ఆదరంతో, తిరుమాలై = శ్రియఃపతిని, మేవి = ఆశ్రయించి, ఉళ్ళే = మనస్సులో, నైన్దు = శైథిల్యాన్ని పొంది, ఉరుకి = నీరై, ఇరుక్కుమ్ = ఉండే, మకిழ் మాఱన్ అడి = వకుళమాలికను ఆభరణంగా - నిరూపకంగా కల నమ్మాழ్వార్ల శ్రీచరణాలను, ఏత్తి = కీర్తించే, అరుళ్ మారి అడిక్కు = **"అరుళ్ మారి"** అని కీర్తింపబడే తిరుమఙ్గై ఆழ్వార్ల శ్రీచరణాలలో, ఉరుక్కమ్ = ప్రేమను (భక్తిని), ఉఱుమ్ = పొందే, ఎతిరాశర్ కుణమ్ = యతిరాజుల కల్యాణగుణాలను, మకిழుమ్ = అనుభవించి ఆనందించేవారు, తమిழ் మఱైయై = ద్రావిడవేదాలను, పొరుక్కమ్ ఉఱ ఓదుమ్ = మిక్కిలి విస్తృతంగా అధ్యయనం చేసే, మణవాళన్ అడి = మణవాళమహామునుల శ్రీచరణాలను, నెఞ్జే = ఓ మనసా !, పేణు = ఆశపడు.

మిక్కిలి భక్తితో శ్రియఃపతిని ఆశ్రయించి, మనస్సులో ఆర్తిని పొంది, ద్రవించే నమ్మాழ్వార్ల శ్రీపాదాలను స్తుతించే తిరుమఙ్గైయాழ్వార్ల శ్రీపాదాలకు మనస్సు ద్రవించే యతిరాజుల కల్యాణగుణాలను భావించి ఆనందించి, ద్రావిడవేదాలను మిక్కిలి విస్తృతంగా అభ్యసించే మణవాళమహామునుల శ్రీపాదాలను ఓ మనసా ! అభిలషించు.

నమ్మాழ్వార్లు భగవానుని కల్యాణగుణాలను భావించి నీరైన స్వభావానికి **"ఆడియాడి"** ఇత్యాది దశకాలు స్మరణీయాలు. **"ఉరుక్కమ్" - "ఉరుకు"** అనే ధాతువు నుండి పుట్టిన నామరూపం. ఇక్కడ భక్తి అని అర్థం'

101. నెఞ్జే! తిరుమాలై నిత్తియముమ్ అడి పణియుమ్
మఞ్జేఱు కురుకై మకిழ் మాఱనడి పణిన్దుయ్న్దిఙ్గు
అఞ్జేలెన్ఱు ఎమక్కరుళుమ్ ఎతిరాశన్ అడి మరువు
నఞ్జేమ వరమునివన్ నణ్ణుది నీ నఱ్కుణమే

నెఞ్జే = ఓ మనసా !, తిరుమాలై = శ్రియఃపతిని, నిత్తియముమ్ = నిత్యం, అడి పణియుమ్ = పాదసేవ చేసేవారు, మఞ్జు ఏఱుమ్ = మేఘాలు అధిరోహించే (మేఘమండలపర్యంతంగా ఉన్నతాలైన పద్మాలతో కూడిన), కురుకై = కురుకాపురిలోని, మకిழ் మాఱన్ అడి = సేవించి, ఉయ్న్దు = ఉజ్జీవించి, ఇఙ్గు = ఈ లోకంలో, అఞ్జేల్ = భయపడకండి,ఎన్ఱు = అని, ఎమక్కు అరుళుమ్ = మనకు అనుగ్రహించే, ఎతిరాశన్ అడి = యతిరాజుల శ్రీచరణాలను, మరువు = సేవించే, నమ్ శేమమ్ = మనకు క్షేమంకరులుగా ఉండేవారు అయిన, వరమునివన్ = వరవరమునుల, నల్ కుణమే = కల్యాణగుణాలను, నీ = నీవు, నణ్ణుది = సహించు.

శ్రీవరవరమునులు సమస్తకల్యాణగుణాకరులు, మనకు క్షేమంకరులు, పరమప్రాప్యభూతులు - అనే విషయాన్ని ఓ మనసా ! నీవు ముందు సహించు- అని

భావం. అద్వేషమే భక్తికి మూలం కనుక, ఆ దశను నీవు పొందితే క్రమంగా నీవు ఉజ్జీవించే అవకాశం ఉన్నది– అని అంటూ తమ మనస్సును ప్రబోధిస్తూ కృతికర్త ఈ ప్రబంధాన్ని నిగమించారు. **"నఱ్ఱుణమే"** అనే ప్రయోగం ద్వారా ఈ ప్రబంధంలో మండల అన్దాది నియమం పాటింపబడింది. **"కుణవాళన్"** అని కదా ప్రబంధం ప్రారంభమైనది. **"అఱ్ఱేలెన్ఱు ఎమక్కరుళుమ్" – "అఱ్ఱేలెన్ఱు కైకవియాయ్"** అనే పెరియాళ్వార్ల (5–3–7) సూక్తి భావ్యం.

ఓ మనసా! శ్రియఃపతిని ప్రతిదినం సేవించేవారు, కురుకాపురిలో అవతరించిన వారు అయిన నమ్మాళ్వార్ల శ్రీపాదాలను సేవించి, ఉన్నతగతిని పొంది, "భయపడవద్దు" అని మనకు అభయాన్ని అనుగ్రహించే యతిరాజుల శ్రీపాదాలను ఆశ్రయించేవారు, మనకు రక్షకంగా ఉండేవారు అయిన మణవాళమామునుల కల్యాణగుణాలను నీవు అంగీకరించి సహిస్తావు గాక !

శ్రీమతే రామానుజాయ నమః　　　　శ్రీమద్వరవరమునయే నమః

నివేదనమ్

ఆచార్యసార్వభౌమోయం రమ్యజామాతృయోగిరాట్ ।
జయత్వాచంద్రతారార్కం శ్రేయసే న స్సదా భువి ॥

గడచిన శతాబ్దిలో సుమారు 75 సంవత్సరాల కాలం భగవద్రామానుజ దర్శనానికి, శ్రీవైష్ణవసంప్రదాయానికి సాటి లేని సేవ చేసిన మహనీయులు మహావిద్వాన్, పద్మవిభూషణ, జగదాచార్యసింహాసనాధిపతి ఉ.వే.శ్రీమాన్ కాంచీ ప్రతివాదిభయంకరం అణ్ణంగరాచార్య స్వామివారు. సహస్రాధికగ్రంథకర్తలైన వీరిని తెలియని సంస్కృత పండితుడు కాని, శ్రీవైష్ణవుడు కాని ఉండడనేది నిస్సంశయం. ఒకే సమయంలో తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో శ్రీరామానుజ మాసపత్రికను నడపి, ఆసేతుహిమాచలం సంప్రదాయప్రచారాన్ని వీరు చేశారు. విశేషించి, ఆళ్వారుల దివ్యప్రబంధాలకు దివ్యార్థదీపిక అనే పేరుతో వీరు రచించిన వ్యాఖ్యానాలు పండితపామరరంజకాలు. సంస్కృతభాషలోకూడా వీరు పలు కతులను వెలయించారు. ఆచార్యసార్వభౌములైన శ్రీమణవాళ మహాముసుల విషయంలో వీరికి ఉండే భక్తిప్రపత్తులు సాటి లేనివి. వీరి విషయంగా శ్రీ అణ్ణంగరాచార్య స్వామివారు ఎన్నో స్తోత్రాలను సంస్కృతంలో చిత్రకవిత్వప్రక్రియలో రచించారు వాటిని శ్రీవైష్ణవసౌభాగ్యమనే పేరుతో 1943 వ సంవత్సరంలో ముద్రించారు. కొన్నిటికి వారే స్వయంగా తమిళంలో తాత్పర్యాన్ని కూడా వ్రాశారు. కతజ్ఞతా పూర్వకంగా చేసికొనే కైంకర్యరూపంలో శ్రీఅణ్ణంగరాచార్యస్వామివారు అనుగ్ర హించిన మణవాళ మహామునుల స్తుతులలో కొన్నిటికి తెలుగుతాత్పర్యంతో అందజేయబడు తున్నవి. ఈ ప్రయత్నాన్ని చేయడానికి ఉదారంగా అనుమతినిచ్చిన సహదయులు, శ్రీఅణ్ణంగరాచార్యస్వామివారి పౌత్రులు, ఉ.వే. శ్రీమాన్ రాజహంసమ్ స్వామివారి సన్నిధిలో కతజ్ఞతాపురస్సరంగా దాసోహసమర్పణను చేసికొంటున్నాను. ఈ ప్రయత్నం సహదయపాఠకులకు ఆనందాన్ని కలిగిస్తుందని భావిస్తున్నాను.

పర్యాయభాష్యకార శ్రీరమ్యజామాతృయోగినామ్ ।
పాదారవిందసవిధే వరివస్యేయమర్ప్యతే ॥

భాగవతదాసుడు

ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీమద్వరవరమునయే నమః

శ్రీమద్వరవరముని వైభవ స్తోత్రమ్

(శ్రీమద్భిః ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యవిద్వద్వరేణ్యైః ప్రణీతమ్)

శ్రీశైలేశేతిమంత్రస్థవర్ణానుక్రమశోభితమ్ ।
ఆచార్యసార్వభౌమస్య స్తోత్రం హృద్యం నిగద్యతే ।

"శ్రీశైలేశదయాపాత్రమ్" అనే తనియన్ శ్లోకంలో ఉండే ముప్పై రెండు అక్షరాలలో ఒక్కొక్క అక్షరాన్ని క్రమంగా ఒక్కొక్క శ్లోకం ఆరంభంలో కూర్చి ఈ స్తుతి రచింపబడుతున్నది (అన్ని శ్లోకాలలోని మొదటి అక్షరాలను వరుసగా కలిపితే తనియన్ శ్లోకం వస్తుంది).

1) **శ్రీమద్వరవరమునయే గుణగణనిధయే సదా నతిం కలయే ।**
యత్సూక్తికల్పలతికా కాంక్షితమఖిలార్థ మనుపదం దిశతి ॥

కల్పలతవలె కోరిన ఫలాలను అన్నిటిని వెంటనే ఇవ్వగలిగిన శ్రీసూక్తులను అనుగ్రహించినవారు, అన్ని కల్యాణ గుణాలను కలవారైన మణవాళమహాముని లను ఎల్లప్పుడు నమస్కరిస్తున్నాను.

2) **శైల ఇవ సూక్తిసరితాం ఛాయాతరురివ భవార్తిఖిన్నానామ్ ।**
రవిరివ దురధ్వతమసాం వరవరమునివర్య భవాన్ విబభౌ ॥

శ్రీవరవరమునీ! దేవరవారు సూక్తులనే పుణ్యనదులకు పర్వతంవలె ఉత్పత్తి స్థానం. సంసారతాపంవల్ల బాధపడేవారికి చల్లని నీడను ఇచ్చే వృక్షంవంటివారు. చెడ్డ మార్గమనే చీకటిని పోగొట్టే సూర్యునివంటి వారు.

3) **లేశోఽపి యస్య సూక్తేః మనసి ధ్యాతోఽత్ర ముదముదంచయతి ।**
సోఽయం వరవరయోగీ సూతే భక్తిం స్వకీయపదపద్మే ॥

తమ శ్రీసూక్తులలోని స్వల్పభాగాన్ని చింతించినా చాలు, ఆనందం పొంగి పొర్లేటట్లుగా వాటిని అనుగ్రహించిన వరవరమునులు తమ శ్రీచరణాలలో భక్తిని కలిగిస్తున్నారు.

4) శమయతి దురితమశేషం జనయతి పరమం ప్రబోధమిహ యస్య ।
సూక్తితతిరేష మమ హృది జాగర్తి సదైవ వరవరో యోగీ ॥

దుష్కర్మలను అన్నిటిని పోగొట్టి, మంచి జ్ఞానాన్ని కలిగించే దివ్యసూక్తులను పలికిన మణవాళమహామునులు సదా నా హృదయంలో ప్రకాశిస్తున్నారు.

5) దయయా నిర్హేతుకయా హరిరిహ సంరక్షతీతి యత్సూక్తిః ।
విశదయతి మునివరోఽసౌ విలసతి నిర్హేతుకరుణయా హృది మే ॥

భగవానుడు తన నిర్హేతుకకరుణతో మనలను రక్షిస్తున్నాడనే విషయాన్ని స్పష్టం చేసే సూక్తులను అనుగ్రహించే వరవరమునులు నా మనసులో నిర్హేతుక కరుణతో వెలుగుతున్నారు.

6) యాతు సకలోపి కాలో వరవరయోగీంద్రవివృతసకలార్థే ।
శ్రీవచనభూషణాఖ్యే దివ్యే శాస్త్రేఽస్య దాసదాసస్య ॥

శ్రీమణవాళమహామునుల వ్యాఖ్యానంతోనే సకలార్థాలను తెలియదగినది అయిన శ్రీవచనభూషణమనే దివ్యశాస్త్రంయొక్క అనుభవంతోనే దాసుడనైన నా కాలమంతా గడవాలి.

7) పాతు వరయోగివర్యో యో హి రహస్యత్రయార్థమనవద్యమ్ ।
పావనఫణితిభి రద్భుతసందర్భాభిః ప్రసాదయామాస ॥

రహస్యత్రయార్థవివణరూపంగా శ్రీపిళ్లైలోకాచార్యులవారు అనుగ్రహించిన ముముక్షుప్పడి అనే గ్రంథాన్ని చాలా అందమైన, పవిత్రమైన దివ్యసూక్తులతో సత్సంప్రదాయానుగుణంగా వ్యాఖ్యానించిన శ్రీమణవాళమహామునులు మనలను కాపాడాలి.

8) త్రయ్యంతార్థమశేషం లలితసరణ్యైవ బోధయన్ యోఽస్మాన్ ।
తత్త్వత్రయస్య వివృతిం వరవరయోగీ చకార స గురుర్నః ॥

శ్రీపిళ్లైలోకాచార్యులవారు అనుగ్రహించిన తత్త్వత్రయమనే రహస్యగ్రంథానికి వ్యాఖ్యానాన్ని కృపజేయడంద్వారా సకలవేదాంతసారార్థాలను సులభమైన రీతిలో వివరించిన మణవాళమహామునులే మన మనస్సులోని అజ్ఞానాన్ని పోగొట్టగల మహాచార్యులు.

9) **ధీరిహ జగతి మదీయా తాస్తా వాచో నిషేవ్య విరమంతీ ।**
వరవరమునీంద్రఫణితిషు దివ్యా మనుభూతి మవిరతాం ధత్తే ॥

ఈ లోకంలో వ్యక్తమైన పలు పలు వాక్కులను సేవించిన (పరిశీలించిన) నా బుద్ధి వానిని వదలి మణవాళమహామునుల దివ్యసూక్తులను అనుభవించడంలో సదా ఆసక్తిని కలిగి ఉన్నది. ("ఎప్పొళుదుమ్ నాళ్ త్తిళ్ ఆణాళీయూళీతొఱుమ్ అప్పొళుదైక్కప్పొళుదు ఎన్నారావముదమే" – ఏ సమయంలో అయినా, దినాలు, మాసాలు, ఏళ్ళు అనే విధంగా ఎంతకాలం అనుభవించినా, ఎప్పటికప్పుడు అతృప్తామతమై శ్రీ వరవరమునుల సూక్తి ఉంటుందని భావం).

10) **భవభయభేషజమతులం విభాతి యత్రోక్త వివృతివిశదార్థమ్ ।**
ఆచార్యహృదయశాస్త్రం స జయతు సౌమ్యోపయంతృ యోగీంద్రః ॥

అళకియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్ అనే ఆచార్యవర్యులు అనుగ్రహించినది, జన్మ అనే వ్యాధికి గొప్ప మందు అయిన ఆచార్యహదయమనే దివ్యశాస్త్రంలోని సకలార్థాలను సువిశదంగా వివరించగలిగిన వ్యాఖ్యానాన్ని కృపజేసిన మణవాళ మహామునులు సర్వోత్కర్షతో వెలగాలి.

11) **భక్త్యా కథయత సతతం వరవరమునివక్త్రదివ్యకమలసుధామ్ ।**
ఉపదేశరత్నమాలాం యయైవ శోభేత భువి సతాం హృదయమ్ ॥

శ్రీవరవరమునుల ముఖారవిందంలోని తేనె అనదగినది, సత్పురుషుల హదయానికి శోభను(ఆనందాన్ని) కలిగించేది అయిన ఉపదేశరత్నమాల అనే దివ్యశాస్త్రాన్ని ప్రీతితో అనుసంధించండి.

12) **దిశతు మయి దివ్యదృష్టిం ద్రవిడోపనిషన్మహార్థసారం యః ।**
శతకేన దివ్యవచసాం ప్రోచే కాంతోపయంతృమునివర్యః ॥

తిరువాయ్మొళి దివ్యప్రబంధంలోని సారార్థాలను తిరువాయ్మొళి నూట్రన్దాది అనే దివ్యప్రబంధంద్వారా తెలిపిన శ్రీవరవరమునులు తమ దాసుడనైన నాకు దివ్యదష్టిని అనుగ్రహించాలి.

13) **గురుభిరిహ బహుభిరమితా గిరః ప్రసూతా లసంతి విలసంతు ।**
సుందరజామాతృమునేః సూక్తిషు మాధుర్యమప్రతిద్వంద్వమ్ ॥

ఈ లోకంలో పలువురు ఆచార్యులు అనుగ్రహించిన సూక్తులు లెక్కలేనివి ఉన్నా, శ్రీవరవరమునుల దివ్యసూక్తులలోని తీయదనం సాటి లేనిది.

14) గుణలవదరిద్రమేనం దానం వరయోగిగురువరః స్వగిరామ్ ।
అర్థమనర్ఘమగాధం పరయా కృపయా ప్రబోధయత్వఖిలమ్ ॥

ఏ యోగ్యత లేని నాకు మణవాళ మహామునుల దివ్యసూక్తులలోని అర్థాలన్నీ చక్కగా ఆ శ్రీవరవరమునుల కృపవల్ల తెలియాలి. (ఈ శ్లోకంలో "ణ" కారం రెండవ అక్షరంగా కూర్చబడింది).

15) అర్ణవగభీరతామ ప్యహహ! పరిచ్ఛేత్తు మీశతే కతిచిత్ ।
వరయోగిసూక్తిసాగరగభీరభావస్తు గోచరో న నృణామ్ ॥

"అప్రమేయో మహోదధిః" అని చెప్పబడే సముద్రంలోని గాంభీర్యాన్ని తెలియగలవారు కొందరు ఉండవచ్చు. కాని, మణవాళమహామునుల శ్రీసూక్తి సముద్రంలోని లోతును మాత్రం ఎవరూ తెలియలేరు.(ఈ శ్లోకంలో "ర్ణ" అనే అక్షరం రెండవ అక్షరంగా కూర్చబడింది).

16) వంశే సుమహతి జననం వివేకపుష్టిం శమాదిగుణపూర్తిమ్ ।
వరయోగిదివ్యసూక్తిష్వద్వేషఫలం ప్రచక్షతే ప్రాజ్ఞాః ॥

శ్రీవరవరమునుల సూక్తులలో భక్తివిశేషం లేకపోయినా, అద్వేషమే కనుక ఉంటే, తత్ఫలంగా మంచి వంశంలో జన్మ, విద్యలలో పూర్ణమైన వివేకం, శమం, దమం మొదలైన సద్గుణాల పూర్తి కలుగుతుందని విజ్ఞులంటారు.

17) యతిపతిపునరవతారో వరవరమనిరేష ఇతి వినిశ్చేతుమ్ ।
ఉపపత్తయో హి జాగ్రతి భూయస్య స్తా స్సదా హృదా కలయే ॥

మణవాళ మహామునులు భగవానుని వేఱొక అవతారమని నిశ్చయించు కోవడానికి పలు పలు సాక్ష్యాలున్నందున వాటిని సదా చింతిస్తున్నాను.

18) తీర్త్వా భవాంబురాశిం యది దివమాసాదయేయమపి తత్ర ।
కాంతోపయంతృమునివరదివ్యోక్తిసుధైవ భుక్తిరస్తు మమ ॥

జన్మలనే సముద్రాన్ని దాటి, ఒకవేళ పరమపదానికి నేను వెళ్ళినా, అక్కడకూడా మణవాళమహామునుల శ్రీసూక్తి అనే అమృతమే నాకు ఆహారంగా కావాలి.

19) ద్రవతి దృషదప్యహో! యత్ప్రకథిత యతిరాజవింశతిశ్రవణాత్ ।
శమదమముఖగుణశేవధి రేష మునిః పాతు వరవరో జగతిమ్ ॥

విన్నంతలోనే రాళ్ళుకూడా కరిగే రీతిలో ఉండే యతిరాజవింశతి అనే భగవద్రామానుజుల స్తుతిని అనుగ్రహించినవారు, శమదమాదిసద్గుణాలకు నిధి అయిన మణవాళమహామునులు లోకాన్ని రక్షించాలి.

20) ప్రథయతి యదుదితభగవద్గీతా వ్యాఖ్యానమద్భుతం భావమ్ ।
కథయతు మమ ముఖమనిశం తస్యైవ మునేః నామాని ॥

భగవద్గీతలోని అద్భుతమైన తాత్పర్యాన్ని స్పష్టంగా తెలుపగలిగిన గీతాతాత్పర్య దీపమనే వ్యాఖ్యానాన్ని అనుగ్రహించిన మణవాళమహామునుల దివ్యనామాలనే నా నోరు సదా అనుసంధించాలి.

21) వరదాధిరాజమంగళ మభిరామవరో మునీశ్వరో హృద్యమ్ ।
యః ప్రోవాచ సదా మే వక్త్రం తస్యైవ మంగళం బ్రూతామ్ ॥

శ్రీవరదరాజస్వామి విషయంగా చాలా అందమైన మంగళాశాసనస్తుతిని అనుగ్రహించిన మణవాళమహామునులకే నా వాక్కు మంగళాన్ని నిత్యం పలకాలి.

22) ప్రవణం హృదయ! సదా భవ
వరవరమునివర్యవివృతిమహితాయామ్ ।
యతిపతిశుభగుణవర్ణన
విచక్షణాయాం ప్రపన్నగాయత్ర్యామ్ ॥

భగవద్రామానుజుల కల్యాణగుణాలను భోగ్యంగా పలుకగలిగినది, శ్రీవరవరమునుల వ్యాఖ్యానంతో మరింత మహత్త్వాన్ని పొందినది అయిన ఇరామానుశ నూట్రన్దాది ప్రబంధంలోనే, ఓ మనసా! సదా ఆసక్తిని కలిగి ఉండు (ఈ శ్లోకంలో “ణ” కారం మూడవ అక్షరంగా కూర్చబడింది).

**23) వంచయితు మపీచ్ఛథ జగతీం వరయోగిభక్తిభావనయా ।
వంచయత కామమేషా పునాతి సత్యం ఛలాత్మికాఽపి సతీ ॥**

కపటభక్తితో లోకాన్ని వంచించాలని అనుకొన్నా, ఆ కపటభక్తికూడా మణవాళ మహామునుల విషయంలో కలిగి ఉండడం మంచిది. ఎందుకంటే, వరవరమునుల విషయంలో ఏ విధంగా భక్తిభావనను కలిగి ఉన్నా, అది ఆత్మను పవిత్రం చేస్తుంది. "పొయ్యే కైమ్మై శొల్లి" అని ఆళ్వార్లు అన్నారుకదా!

**24) దేయాద్వరవరయోగీ గోదాజనకీయ దివ్యసూక్తితతేః ।
స్వాత్మకృతవిశదవివృతౌ సుగాఢ మవగాఢ మంతరాత్మానమ్ ॥**

మణవాళమహామునులు పెరియాళ్వార్ తిరుమొళి ప్రబంధానికి తాము అనుగ్రహించిన భోగ్యమైన వ్యాఖ్యానాన్ని లోతుగా అవగాహించగలిగిన (అర్థం చేసికోగలిగిన) మనసును అనుగ్రహించాలి.

**25) రమయతి మమ మతి మవిరత
మాచార్యవరస్య వరవరస్య మునేః ।
సకలప్రమాణసంగ్రహ
సమాహ్వయం తత్ ప్రసిద్ధకృతిరత్నమ్ ॥**

ఆచార్యసార్వభౌములైన మణవాళ మహామునులు అనుగ్రహించిన సకల ప్రమాణసంగ్రహమనే ("ప్రమాణత్తిరట్టు") అనే దివ్యగ్రంథం నా మనసును ఎల్లప్పుడు సంతోషింపజేస్తున్నది.

**26) య ఇహ వరయోగివర్యః ప్రణినాయార్తిప్రబంధ మార్తిభరాత్ ।
అపనుదతు సోయ మార్తి రఖిలా అపి నిత్యమధివసన్ జగతీమ్ ॥**

ఈ లోకంలో తాము ఉండలేని గొప్ప ఆర్తితో "ఆర్తిప్రబంధమ్" అనే దివ్య ప్రబంధాన్ని అనుగ్రహించిన మణవాళ మహామునులు "ఇన్న మొరు నూట్రాణ్డి రుమ్" అనే మంగళాశాసనరీతిలో ఈ లోకంలో నిత్యం నిలచి ఉండి, మన ఆర్తిని తీర్చాలి.

**27) జాయా జనక స్సోదర ఇతి తేషు తేషు యః ప్రేమా ।
ఇహ భవతి సోయమఖిల శ్రీమద్వర యోగి చరణయోర్మేఽస్తు ॥**

భార్య అని, తల్లి అని, తండ్రి అని, సోదరుడని పలువురిపట్ల ఉండే ప్రీతి అంతా నాకు మణవాళమహామునుల శ్రీచరణాలలోనే కలగాలి. సకలవిధబంధువు శ్రీవరవరమునులే కావాలి.

28) మాధవ ముకుంద మురహర మధుసూదన కేశవేతి నామోక్తీ ।
ముక్త్వా కథయతు సతతం వరవరమునినామ మామకం వదనమ్ ॥

నా నోరు "మాధవ! ముకుఃద! మురారీ! మధుసూదన! కేశవ!" అనే భగవన్నామాల సంకీర్తనాన్ని విడచి సదా మణవాళ మహామునుల తిరునామాలనే పలకాలి.

29) తరలమపి మానసం మే సుందరజామాతృయతిపతేః పదయోః ।
సుదృఢమవగాఢమాస్తే గురువరకరుణా మహో! కథం కథయె ॥

నా మనసు చంచలమైనది అయినా, మణవాళమహామునుల శ్రీచరణాలలో మాత్రం గాఢంగా, దృఢంగా ప్రీతిని కలిగి ఉన్నది. ఈ విధంగా నన్నునుగ్రహించిన ఆ వరవరమునులను ఏ విధంగా స్తుతించగలను?

30) రంగీ స్వయమిహ యస్మి న్నంతేవాసీ భవన్ కృతార్థో౽భూత్ ।
స ఖలు వరయోగివర్యః కథమిహ వర్ణ్యేత మాదృశాం వచసా ॥

శ్రీరంగనాథునికూడా తమ శిష్యునిగా చేసికొన్న మణవాళ మహామునుల మహిమ నావంటి అల్పజ్ఞుల వాక్కుతో వర్ణించడానికి సాధ్యమా!

31) ముహురిహ వరవరముని వర
సూక్తి సుధాస్వాదముదితహృద్రంగీ ।
దివ్యం యమాహ మంత్రం
స సర్వమంత్రాన్ విజిత్య భువి భాతి ॥

మణవాళమహామునుల శ్రీసూక్తి అనే అమతాన్ని మాటిమాటికి ఆస్వాదించి, మిక్కిలి ఆనందించిన శ్రీరంగనాథుడు స్వయంగా పలికిన "శ్రీశైలేశదయాపాత్రమ్" అనే తనియన్ లోకంలోని సకలమంత్రాలను మించి వెలుగుతున్నది.

32) నిఖిలాప్యర్చామూర్తిః నిత్యం యన్మంత్రనిగమనాత్తుష్టిమ్ ।
భజతే వరవరమునివరదైవతమంత్రోఽయ మస్తు మే జప్యః ॥

భగవానుని అర్చామూర్తులందరు మణవాళ మహామునులను అధిదేవతగా కల ఏ "శ్రీశైలేశదయాపాత్రమ్" అనే మంత్రాన్నే ప్రతిదినం ఆలకించి ఆనందిస్తారో, ఆ మంత్రాన్నే నేను సదా నేను జపిస్తాను.

33) మహతా శుభకులజనుషా
మహనీయాచార్యకరుణయా చ తథా ।
శ్రీవైష్ణవాంఘ్రిదాసో
వరవరయోగిస్తుతిం వ్యజిజ్ఞపత ॥

శ్రీవైష్ణవదాసుడనైన నేను మహనీయుల వంశంలో జన్మించినందున, పెద్దల కృపకు పాత్రమైనందున ఈ స్తుతిని విన్నపించగలిగాను.

శ్రీమద్వరవరముని వైభవ స్తోత్రమ్ సంపూర్ణమ్

శ్రీమద్వరవరమునయే నమః

శ్రీమద్వరవరముని కర్ణామృతమ్

(శ్రీమద్భిః ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యస్వామిభిః ప్రణీతమ్)

ఈ స్తుతిలో ఒక్కొక్క శ్లోకంలోని మొదటి అక్షరాలను వరుసగా కలిపితే "వరవరమునిపదకమల జయ" అనే వాక్యం ఏర్పడుతుంది.

అవతారిక

భగవద్విషయంలో అభినివేశాన్ని కలవారు "మణివణ్ణా! ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు" అని మంగళాశాసనం చేసినట్లు మణవాళమహామునుల విషయంలో అభినివేశాన్ని కలవారు "వరవరమనిపదకమల జయ" అని మంగళాశాసనం చేయడం యుక్తం కనుక, ఆ వాక్యసన్నివేశంతో అందులో ఉండేఅక్షరాలను క్రమంగా ఒక్కొక్క శ్లోకం మొదట కూర్చి ఈ స్తుతి విన్నపింపబడింది. దీనికి పెద్దలు

"శ్రీమద్వరవరమునికర్ణామృతమ్" అనే పేరును పెట్టారు. రసాయన స్తోత్రం వలె ఇదికూడా లఘ్వక్షరాలను అధికంగా కూర్చి రచింపబడింది.

వరవరమునిపదకమల జయే
త్యనుపమ సుమహితచరణమిమమ్ ।
నిజహృది కలయత
తదుపరి విరచితకవనమిదమ్ ॥

"వరవరమునిపదకమలమా! నీవు సర్వోత్కర్షతో ప్రకాశించాలి" అనే అర్థాన్ని ఇచ్చే "వరవరమునిపదకమల జయ" అనే ఈ పాదాన్ని చింతించండి. అంతకుమించి శక్తి ఉంటే ఈ కర్ణామతాన్ని కంఠస్థం చేయండి.

1) **వరవరమునివర తవ చరణౌ**
రవిసమమిహ మమ మనసి పరమ్ ।
సునియత ముదయత ఇతి వదతో
మమ ఖలు జనిరిహ సుఫలవతీ ॥

వరవరమునీ! మీ శ్రీచరణాలు దాసుని మనసులో సదా సూర్యోదయంవలె ప్రకాశిస్తున్నాయి. ఈ విధంగా పలికే నా జన్మ సఫలమైనదికదా!

1) **రవిరిహ ఘనఘనతిమిరతతీః**
శ్లథయతి బహిరివ న తు హృదయే ।
గురువర మునివర హృదయగతం
మమ ఖలు తదఖిల మపహరసి ॥

మణవాళమహామునీ! సూర్యుడు బయట ఉండే చీకటినిమాత్రం పోగొట్ట గలడు తప్ప, మనసులోని చీకటిని (అజ్ఞానాన్ని) పోగొట్టలేడు. దేవరవారు నా మనసులోని చీకటిని అంతటిని పూర్తిగా పోగొడుతున్నారు.

2) **వచసి చ మనసి చ సతతమపి**
స్వఫణితి మనవధి మతిమధురామ్ ।
కలయసి మమ వరమునివర భోః!
భవభయపరిహృతినిపుణ గురో! ॥

మణవాళ మహామునీ! మీ పరమమధురమైన శ్రీసూక్తులను నా మనసుకు వాక్కుకు రుచించేటట్లు అనుగ్రహించారు. ఇక నేను సంసారాన్ని చూచి భయపడవలసిన అక్కర లేదు.

3) రఘువరయదువరముఖ
భగవత్తనురిహ భువి లసతి పరమ్ ।
విలసతు మమ ఖలు నయనపథే
మునివర! తవ శుభతనురనిశమ్ ॥

మణవాళమహామునీ! ఈలోకంలో శ్రీరామశ్రీకృష్ణాదివిగ్రహాలు ప్రకాశిస్తున్నాయి. అవి ఆ విధంగా ప్రకాశిస్తే ప్రకాశించనీ! కాని, దేవరవారి దివ్యమంగళరూపంమాత్రమే నా కంటికి సదా ప్రకాశించాలి.

4) మునిరితి గురురితి యతిరితి చ
ప్రభజతు యశ ఇహ బహుజనతా ।
మునిగురుయతిపద మఖిలమపి
స్ఫుటగణమిహ వరయమిని పరమ్ ॥

ముని అని, గురువని, యతి అని ఈ లోకంలో పలువురు వ్యవహరింప బడతున్నా ఆ మునిగురుయతిపదాలకు అన్నిటికీ శ్రీవరవరమునుల విషయంలోనే సార్థక్యం మెండుగా ప్రకాశిస్తున్నది.

5) నిధిమివ నిజహృది నిదధతి
యే వరమునివర తవ ఫణితితతిమ్ ।
బహుజనివిరచిత మఘనివహం
క్షణలవవిదళిత మదధత తే ॥

మణవాళమహామునీ! దేవరవారి శ్రీసూక్తులను మనసులో నిధివలె నిలుపుకొని కాపాడుకొనగలిగినవారే పలు జన్మలలో వారు చేసిన పాపాలను అన్నిటిని ఒక్క క్షణంలో పోగొట్టుకోగలరు.

6) పటుమతిరిహ భువి తవ ఫణితీ
రధిముఖ మవిరతమపి కలయన్ ।

విలసతి యది మునివర తం
జితహయముఖఇతి బిరుదముపైత్ ॥

మణవాళ మహామునీ! ఈ లోకంలో వివేకం కలవాడొకడు మీ వ్యాఖ్యానాలను నిరంతరం అనుసంధానం చేస్తే అతడు హయగ్రీవుని కూడా జయించిన వాడనే బిరుదును పొందుతాడు.

7) **దమశమముఖగుణజలధిరితి**
ప్రసృమరశుభతరనిజయశసా ।
సురభితభువనక మునివర భోః!
మమ హృది లిఖ లిఖ తవ ఫణితీః ॥

శమదమాదిదివ్యగుణాలకు సముద్రంవంటివారనే కీర్తితో లోకాన్ని అంతటిని పరిమళింపజేసిన (వ్యాపించిన) మణవాళ మహామునీ! తమ సూక్తులను నా హృదయంలో లిఖించండి.

8) **కలిబల మనుదిన మధికతమం**
ప్రసరతి బత బత భృశమితి మే ।
భయలవమపి న హి భజతి
మనో వరముని ఫణితిభి రతివిమలమ్ ॥

కలిప్రభావం ప్రతిదినం నాలుగు వైపుల ఎంతగా వ్యాపించినా దానినిగూర్చి నాకు కొంచెంకూడా భయం లేదు. ఎందుకంటే, మణవాళ మహామునుల శ్రీసూక్తులతో నా మనసు చాలా స్వచ్ఛంగా ఉన్నది కనుక.

9) **మమ మతిరిహ భువి బహుమతిభాక్**
విలసతి మునివర శృణు కృపయా ।
అవిరతమయమిహ తవ ఫణితీః
నిజహృది కలయతి నిధివదితి ॥

మణవాళమహామునీ! నేనెప్పుడూ దేవరవారి శ్రీసూక్తులనే నిధిగా నిలుపుకొన్నాను – అని నా బుద్ధిని పలువురు ప్రశంసిస్తున్నారు.

10) **లసతి హి భువి బహుగురుజనవాక్**
ఫలమిహ న కిమపి భవతి తయా ।
మునివర యది తవ న భవతి
గీః ధ్రువమివ సువిపులతిమిరమిహ ॥

మణవాళ మహామునీ! ఈ లోకంలో ఇంకా పలువురు ఆచార్యుల శ్రీసూక్తులు ప్రకాశిస్తున్నా వాటివల్ల ఏ ప్రయోజనం కనబడలేదు. దేవరవారి శ్రీసూక్తులు అవతరించి ఉండకపోతే లోకంలో అజ్ఞానం నిండి ఉండేది.

11) **జగదిద మనవధిగురుభరితం**
భవతి హి భవతు చ గురునియుతమ్ ।
శుభగుణవరవరముని గురురా
దయమిహ నిరుపమగురుపదభాక్ ॥

ఈ లోకంలో లెక్కలేనంతమంది ఆచార్యులు నిండి ఉన్నారు. ఇంకా లక్షలాదిమంది ఆచార్యులు అవతరించనీ. దానివల్ల ఏమి లాభం? మణవాళ మహామునులొకరే సాటి లేని ఆచార్యులు.

12) **యతిపతిమతమిహ విశదయితుం**
కృతజనిరిహ భువి వరమునిరాట్ ।
విలసతి మమ హృది పరమ
కృపాజలనిధి రవిరత మమితముదా ॥

భగవద్రామానుజసిద్ధాంతాన్ని ఈ లోకంలో ప్రకాశింపజేయడం కోసమే ఈ లోకంలో అవతరించిన గొప్ప దయాసముద్రమైన మణవాళ మహామునులు దాసుని హృదయంలో ఆనందంగా వేంచేసి ఉన్నారు.

13) **వరవరమునివర! కవనమిదం**
గుణలవరహితమపి విదుషామ్ ।
హృది ముద మనవధి ముపజనయేదితి
దృఢమహమిద మభిహితవాన్ ॥

మణవాళ మహామునులను గూర్చిన ఈ స్తుతి ఏ గుణాన్ని కలిగినది కాకపోయినా విద్వాంసుల మనసులో మిక్కిలి ఆనందాన్ని కలిగిస్తుంది–అనేది నిజం.

శ్రీమద్వరవరముని కర్ణామృతమ్ సంపూర్ణమ్

శ్రీమద్వరవరమునయే నమః

శ్రీమద్వరవరముని స్తోత్ర రసాయనమ్

(శ్రీమద్భిః ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యవిద్వద్వరేణ్యైః ప్రణీతమ్)

శ్రీశైలేశేతిమంత్రస్థవర్ణానుక్రమశోభితమ్
లఘ్వక్షరమయం స్తోత్రం రసాయన ముదీర్యతే ।
దీర్ఘాక్షరప్రవేశోత్ర యస్మాన్న ఘటతే తతః
మంత్రస్థదీర్ఘవర్ణానాం హ్రస్వతైవాత్ర సహ్యతామ్ ॥

"శ్రీశైలేశదయాపాత్రమ్" అనే తనియన్ లోని వర్ణాలను క్రమంగా ఒక్కొక్క శ్లోకంలో అమర్చి ఈ స్తుతి రచింపబడింది. అయితే, ఈ స్తుతి లఘు అక్షరాలతో రచించాలనే నియమాన్ని అనుసరించి దీర్ఘాక్షరాలకు బదులుగా లఘువులే కూర్చబడ్డాయి. శ్లోకం అంతా లఘువులనే ప్రయోగించాలనే నియమం ఉన్నా పాదం చివరలో దీర్ఘం ఉండడం విరుద్ధం కాదు.

1) **శ్రితజనివిరచితదురితగణం**
క్షణలవవిదలిత మకురుత యః ।
స దిశతి వరవరమునివరగురురాట్
మమ హృది నిజశుభతనుమనిశమ్ ॥

భక్తులు చేసిన పాపాలను అన్నిటిని ఒక క్షణకాలంలోనే నశింపజేసే మణవాళ మహామునులు తమ తిరుమేనిని సదా నా మనస్సులో దర్శింపజేస్తున్నారు.

2) **శమదమముఖశుభగుణజలధే!**
సువిశద వివరణకరణపటో! ।

అనుదినమిహ భువి తవ యశసాం
తతి మహ మనుభవవిషయ మధామ్ ॥

శమదమాదిగుణాలకు సముద్రంవంటి మణవాళ మహామునీ! చాలా స్పష్టమైన వ్యాఖ్యానాలను అనుగ్రహించడంలో సామర్థ్యం కల స్వామీ! మణవాళ మహామునీ! దాసుడనైన నేను ప్రతిదినం దేవరవారి కీర్తినే నా అనుభవానికి విషయంగా చేసికొన్నాను.

3) **లఘు మయి విరచయ గురుకరుణాం**
ప్రదిశతి మమ శుభమతి మిహ యా ।
వరమునివర యది న తవ కృపా
మమ జనిరిహ కథముదితఫలా ॥

మణవాళ మహామునీ! దాసునకు మంచి బుద్ధిని కలిగించగలిగిన మీ గొప్ప కరుణను నాపై త్వరగా ప్రసరింపజేయాలి. ఆ కరుణ లభించకపోతే నా జన్మ ఏవిధంగా సార్థకమవుతుంది?

4) **శశధరపరిభవకరవదన!**
ప్రకలితశుభతరగుణజలధే ।
శమధనమునివరపరిబృఢ! భోః!
ప్రజనయ నను మయి మతిరనఘామ్ ॥

చంద్రుని పరిభవించే అందమైన ముఖాన్ని కల మణవాళ మహామునీ! సద్గుణాలను అన్నిటిని ప్రకాశింపజేసే స్వామీ! శమమనే గుణాన్ని కల యతులలో శ్రేష్ఠా! దాసునకు మంచి బుద్ధి కలిగేటట్లు చేయాలి.

5) **దరదలదనుపమజలజదృశోః**
నిపతనమయి! మయి కలయ గురో! ।
ఇదమిహ మయి న హి భవతి
యది ధ్రువ మథ మమ జడపరిబృఢతా ॥

మణవాళ మహామునీ! కొంచెం వికసించిన తామరపూలవంటి మీ కటాక్షాలను నాపై ప్రసరింపజేయాలి. ఈ దయ లభించకపోతే, నాకంటే ఇంకొక మూఢుడు ఈ లోకంలో ఉండబోడు.

6) యతిపతిమతరస మఖిలమపి
ప్రథయతి యదుదితవివరణవాక్ ।
స జయతు వరముని రమితగుణామృత
జలనిధిరితి విశదయశాః ॥

తమ వ్యాఖ్యానసూక్తులతో శ్రీరామానుజదర్శనసారార్థాలను అన్నిటిని వివరించినవారు, గొప్ప గుణసముద్రులనే పేరును కలవారైన మణవాళ మహామునులు జయించాలి.

7) పవనజతరణిజముఖకపిభిస్సహ
కృతరఘువరపరిచరణ! ।
మఘవజిదభిభవకుశలబల!
ప్రకటయ మయి తవ పృథుకరుణామ్ ॥

లక్ష్మణునిగా అవతరించి హనుమంతుడు, సుగ్రీవుడు మొదలైన వానరవీరులతో కలసి శ్రీరామునకు కైంకర్యాన్ని చేసిన, ఇంద్రజిత్తును జయించగల బలాన్ని కల ఓ వరవరమునీ! దాసునిపై దేవరవారి గొప్ప దయను చూపాలి.

8) తనురియమిహ భువి లసతు చిరం
గురువర మునివర తవ పదయోః ।
స్మృతితతిరవిరత మిహ ఘటతే
యది మమ తవ శుభతరకృపయా ॥

మణవాళమహామునీ! దేవరవారి కపవల్ల తమ శ్రీచరణాలలో దాసునకు నిరంతరమైన చింతన కలిగితే ఈ భూలోకంలో దాసుడు చిరంజీవియై ఉంటాడు.

9) ధియమిహ మనుపమమహిమజుషా
వరమునివర! తవ గురుకృపయా ।

తవ గుణగణనుతికలనవిధౌ
అనుకల మనవధి వినిహితవాన్ ॥

మణవాళ మహామునీ! ప్రతినిముషం తమ కల్యాణగుణాలను స్తుతించడం లోనే నా బుద్ధిని అంతటిని ఉపయోగిస్తున్నాను. దేవరవారి కపయే దీనికి కారణం.

10) భవమయజలనిధి జఠరగతాం
ఘనకృపమునివర బహుజనతామ్ ।
కరతలవితరణకుశలతయా
కలయసి గతశుచ మమితశుభామ్ ॥

గొప్ప దయను కల మణవాళ మహామునీ! జన్మసముద్రంలో పడి క్లేశపడే పలువురు జీవులకు మీరు చేయూతను ఇవ్వగలిగినందున వారికి అందరికి క్లేశం తీరి, ఆనందం పొందేటట్లు చేస్తున్నారు.

11) యతిపతివిరచితసకలకృతీః
మమ హృది లిఖ లిఖ రుచిరమునే! ।
స చ యతిపతిగురురిహ భవతో
న హి ఖలు కథమపి వహతి భిదామ్ ॥

మణవాళ మహామునీ! భగవద్రామానుజులు, దేవరవారు వేరు కానందున, దేవరవారు భగవద్రామానుజులై అవతరించి, అనుగ్రహించిన శ్రీభాష్యాది గ్రంథాలను అన్నిటిని దాసుని హదయంలో లిఖించాలి.

12) దివి భువి విరచయ మమ వసతిం
గురువర మమ న హి మనసి భిదా ।
తవ శుభగుణగణ మనవరతం
ప్రకలయ మమ నుతితతివిషయమ్ ॥

మణవాళ మహామునీ! నన్ను స్వర్గానికి తీసికొనిపోయినా, ఈ లోకంలోనే ఉంచినా, నా మనస్సులో తేడా ఏమీ లేదు. సదా దేవరవారి గుణాలనే నా స్తుతులకు విషయంగా చేసికోవాలన్నదే నా కోరిక.

13) గురువర! శఠరిపుమునివచసాం
సువిమలసువిశదహృదయ మహో! ।
మమ హృది దృఢతరఘటిత మథాః
బత! బత! మయి తవ బహులకృపా ॥

మణవాళ మహామునీ! తిరువాయ్మొళి దివ్యప్రబంధంలోని గంభీరమైన, అందమైన అర్థాలన్నీ దాసుని మనసులో దఢంగా నిలచి ఉండేటట్లు చేశారు. దాసుని విషయంలో దేవరవారి కప చాలా ఘనమైనది.

14) ప్రణమత వరమునిపదకమలం
ప్రవదత వరమునిశుభఫణితిమ్ ।
కలయత వరమునిపరిచరణం
ప్రవిశత సుమహితపరమపదమ్ ॥

లోకులారా! మణవాళమహామునుల శ్రీచరణాలను నమస్కరించండి. వారి శ్రీసూక్తులను చెప్పండి. వారికి కైంకర్యాన్ని చేయండి. ఈ విధంగా చేస్తే పరమపదాన్ని చేరగలరు (ఈ శ్లోకంలో మొదటి అక్షరంగా రావలసిన "ణ"కారం రెండవ అక్షరంగా వచ్చింది).

15) రచయితు మహమిహ తవ కవనం
వరమునివర! హృది న హి కలయే ।
తదపి చ తవ గుణతతి రఖిలాఽ_ప్యహ
మహమితి హృది నటతితమామ్ ॥

మణవాళ మహామునీ! దేవరవారిని స్తుతించాలని నేను నా మనస్సులో అనుకోలేదు. అయినా, మీ గుణాలన్నీ నా మనస్సులో "నేనంటే నేను" అని నాట్యమాడుతున్నందున ఈ విధంగా స్తుతులు ఆవిర్భవించాయి (ఈ శ్లోకంలో "ర్ణ" అనే అక్షరానికి బదులుగా రేఫంమాత్రమే గ్రహింపబడింది).

16) వచసి చ మనసి చ సతతమపి
ప్రథయసి మునివర! తవ సుగుణాన్ ।

కథమపి న హి ఖలు గురురితరో
మమ హృది పదమిహ వినిహితవాన్ ॥

మణవాళ మహామునీ! నా వాక్కులో మనస్సులో సదా తమ కల్యాణగణాలే ప్రకాశించేటట్లు మీరు అనుగ్రహించారు. ఇక వేరు ఏ ఆచార్యులు నా మనస్సులో పాదం మోపే అవకాశం లేకుండా అయినది.

17) యశ ఇహ భువి తవ నిరవధికం
విలసతి వరమునివర తదిదమ్ ।
కతిపయకుమతిభి రపలపితం
యది కిము హతమిహ నను కథయ ॥

మణవాళమహామునీ! దేవరవారి కీర్తి ఈ లోకంలో అంతటా వ్యాపించి, "మణవాళమామునియే! ఇన్నమొరు నూఱ్ఱాణ్డిరుమ్" అని ప్రతిఇంటిలో, ప్రతివీథిలో మంగళాశాసనం చేసేటట్లు ప్రకాశిస్తున్నది. ఈ వైభవాన్ని కొందరు కుమతులు నిందిస్తేమాత్రం ఆ కీర్తికి ఏమి లోటు?

18) తిథిరితి దినమితి భమితి
తథాఽయనమితి విచలతి సమయగణే ।
క్షణమపి గురువర! తవ ఫణితే
రనుభవవిరహిత మిహ న సహే ॥

మణవాళమహామునీ! తిథులు, దినాలు, నక్షత్రాలు, అయనాలు అనేవిధంగా గడచిపోయే కాలంలో ఒక్క క్షణం అయినా దేవరవారి దివ్యసూక్తుల అనుభవం లేనిదే నేను ఉండలేను.

19) ద్రవతి హి మునివర! తవ ఫణితీః
ప్రణిదధదవిరతి మమ హృదయమ్ ।
మితమతి రహమిద మభిహితవాన్
ప్రియమపి బత! హృది న హి కలయే ॥

మణవాళ మహామునీ! దేవరవారి దివ్యసూక్తులను నిరంతరం అనుసంధించే నా మనస్సు నీటిబుగ్గవలె ద్రవిస్తున్నది. మహాజ్ఞానులు చెప్పదగిన ఈ మాటను అల్పజ్ఞుడనైన నేను చెప్పడానికి కొంచమైనా సిగ్గుపడడం లేదు.

20) ప్రథయతి వరమునిఫణితి ర్భగవతి
శుభగుణగణనిధితామ్ ।
విలసతు మమ ముఖ ఇయ మనఘా
విదలితబహుతమకుమతిమతా ॥

మణవాళమహామునుల వ్యాఖ్యానసూక్తులు భగవానుని కల్యాణగుణాలను వివరించేటట్లే పలు కుదష్టిసిద్ధాంతాలనుకూడా ఖండిస్తున్నవి. ఇటువంటి శ్రీసూక్తులు వాచోవిధేయం కావాలి.

21) వపుషి చ వచసి చ మే మునివర!
తవ శుభతమవపుషః ।
ఛవితతి రవిరత మఖిలురతి ప్రకథయ
కథమిద మఘటత మే ॥

మణవాళ మహామునీ! నా దేహంలో, వాక్కులో, మనస్సులో దేవరవారి దివ్యమంగళవిగ్రహకాంతియే నిరంతరం పొరలుతున్నది (వ్యాపిస్తున్నది) ఇటువంటి అదష్టంనాకు ఏవిధంగా లభించిందో!

22) నతితతిరథ నుతిశతమథ చ
ప్రచలతిసువిశదమననకలా ।
మునివర! గురువర! తవ విషయే
త్రికరణకృతిరియ మనవధికా ॥

మణవాళ మహామునీ! నా మూడు విధాలైన కరణాల ప్రవృత్తి దేవరవారి విషయంలోనే ప్రవర్తిస్తున్నది. దేవరవారికి నమస్కరించడం దేహానికి కత్యం. దేవరవారిని స్తుతించడం వాక్కుకు కర్తవ్యం. దేవరవారిని ధ్యానించడం మనస్సుకు కర్తవ్యం (ఈ శ్లోకంలోని మొదటి అక్షరంగా రావలసిన ణకారానికి బదులుగా నకారం కూర్చబడింది).

23) వరకవిరితి భువి బిరుదధరో
విలసతి బహుబుధజన ఇహ భోః ।
వరమునికవిరితి శుభబిరుదం
మమ పునరనుపమమతిమహితమ్ ॥

ఈ లోకంలో దైవకటాక్షంతో కవితను చెప్పగలిగిన సామర్థ్యాన్ని పొందిన పలువురు పండితులు వరకవులనే(గొప్ప కవులనే) పేరును పొందారు. కాని, వరమునికవులనే పేరును ఇంతవరకు ఎవరూ పొందలేదు. మణవాళ మహామునులనే నిరంతరం స్తుతించడంవల్ల దాసునకు గొప్పదైన ఆ బిరుదు లభించింది.

24) దశశతనుతితతిరపి ముఖతో
మమ సరభస మనుదిన ముదియాత్ ।
వరమునిశుభగుణసురభిరహో!
విధురవివిలసితసమ మచలా ॥

మణవాళ మహామునుల గుణాలను పొగడాలంటే దాసుని నోటినుండి వేలాది స్తుతులు ప్రతిదినం ఆవిర్భవిస్తూనే ఉంటాయి. అవి సూర్య చంద్రులున్నంత కాలం నిలచి ఉంటాయి.

25) రమయతి మునివర! మమ హృదయం
తవ నిరవధిశుభతనుసుషమా ।
అనుభవ మనుపమ మహ మిహ మే
కథమివ కథయితు మలమయి భోః ॥

మణవాళ మహామునీ! దేవరవారి తిరుమేని అందం దాసుని మనసును రంజింపజేస్తున్నది. సాటి లేని నా ఆ అనుభవాన్ని నేను ఏవిధంగా వివరించగలను?

26) యతిపతిశఠరిపు భువనగురు
ప్రభృతిషు గురుషు చ మహితధియా ।
మునివర! నుతిశత మభిహితవాన్
అహమనుశయమిహ బహు కలయే ॥

మణవాళ మహామునీ! భగవద్రామానుజుల, నమ్మాళ్వారులు, శ్రీపిళ్ళైలోకాచార్యులవారు మొదలైన ఆచార్యుల విషయంగా గౌరవబుద్ధితో నేను పలు స్తుతులను పూర్వం విన్నపించాను. అయినా, "నేను వానిని అన్నిటిని ఎందుకు చేశాను?" అనే అనుతాపం నాకున్నది.

27) జగదిద మనవధిసమయగణే
సృజతి చ బహుతమగురునివహమ్ ।
వరమునిసమగురురుదిత న హీ
త్యహమిహ సశపథ మభిహితవాన్ ॥

ఈ లోకంలో అనేకకాలాలలో పలు మతాలలో పలువురు ఆచార్యులు అవతరిస్తున్నారు. కాని, మణవాళ మహామునులవంటి ఆచార్యులు ఇంతవరకు ఎవరూ అవతరించలేదని ప్రమాణపూర్వకంగా చెప్పగలను.

28) మహిమసు మునివర! తవ
నిఖిలేష్వపి లఘుకణలవ మనుభవితుమ్ ।
న హి పటుమతి రహ మహహ!
తథాప్యవిరతి తవ శుభకృతిషు రమే ॥

మణవాళ మహామునీ! దేవరవారి మహిమ అనే మహాసముద్రంలోని చాలా చిన్న కణాన్నికూడా నేను అనుభవించగలవాడను కాను. అయినా, నిరంతరంగా దేవరవారి విషయంలో స్తుతులను విన్నపించడంలోనే ఆసక్తిని కలిగి ఉన్నాను.

29) తరలహృదహమపి వరయమిని
క్షణమపి న హి రుచిభరవిరహీ ।
కరిగిరిపతిమపి వరమునిరాదయమితి
మతియుత ఇహ కలయే ॥

నేను చంచలమైన మనసును కలవాడనే అయినా, మణవాళ మహామునుల విషయంలో భక్తి లేకుండా ఒక్క నిముషంకూడా ఉండను. వరదరాజస్వామిని

సేవించినా, మణవాళ మహామునులనే భావనతోనే సేవిస్తాను (వరదుడనే నామంలో వరవరమునినామంలోని ఏకదేశాన్ని భావిస్తాను).

30) రచయతు కవిజన ఇహ బహుళాం
కృతితతి మనవధిగుణఘటితామ్ ।
వరమునిగుణగణకథనపరా
మమ ఖలు కృతిరియ మతిశయనీ ॥

ఈ లోకంలో పలువురు కవులు చాలా గొప్పవైన పలు కావ్యాలను రచించవచ్చు. ఎవరు ఏ గ్రంథాన్ని రచించినా, మణవాళ మహామునుల దివ్యగుణాలను స్తుతించే నా కతియే ఉన్నతంగా ఉంటుంది.

31) మునివర! తవ శుభతనుమననం
మమ హృది విలసత నను సతతమ్ ।
అత ఇహ భువి మమ సకలమహో!
కరతలముపగతమితి సుదృఢమ్ ॥

మణవాళ మహామునీ! దేవరవారి తిరుమేనినిగూర్చిన చింతనయే నా మనసులో సదా ఉన్నందున ఈ లోకంలో నా చేతికి అందనిది ఏదీ లేదు. నేను అవాప్తసమస్తకాముడనైనాను.

32) నిరవధి నిరుపమ మహిమనిధే!
వరమునివర తవ శుభకృపయా ।
అనుదిన మనుకల ముదయ
మియాత్ స్తుతితతి రనవధిగుణభరితా ॥

సాటి లేని పలు కల్యాణగుణాలను కల మణవాళ మహామునీ! దేవరవారి అనుగ్రహంవల్ల గుణభరితాలైన ఇటువంటి స్తుతులు ప్రతిదినం ప్రతినిముషం ఆవిర్భవిస్తూనే ఉండాలి.

శ్రీమద్వరవరమునిస్తోత్రరసాయనమ్ సంపూర్ణమ్

శ్రీమద్వరవరమునయే నమః

శ్రీవరవరముని నక్షత్రమాలా

(అంతాదిరూపా)

(శ్రీమద్భిః ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యవిద్వద్వరేణ్యైః ప్రణీతమ్)

శ్రీమద్వరమునీంద్రార్యస్తుతిం నక్షత్రమాలికామ్ ।
సాత్త్వికానాం సదా ధ్యేయాం సంతనోమి సతాం ముదే ॥

శ్రీ వరవరమునులను స్తుతించే, నక్షత్రమాలికా రూపమైన, సాత్వికులకు సదా అనుసంధించదగిన స్తోత్రాన్ని ఆనందంగా రచిస్తాను.

1) **శ్రీమాన్ సుందరజామాతృమునిర్జీయాద్యదుక్తయః ।**
అశ్వినాపృథఃకృత్య చికిత్సాం భువి తన్వతే ॥

"అశ్వినౌ వై దేవానాం భిషజౌ" అని వేదం పలికినట్లు దేవతలకు వైద్యులైన అశ్వినీదేవతలకంటే, తమ శ్రీసూక్తులతో సంసారులకు గొప్ప చికిత్సను చేసే మణవాళ మహామునులకు మంగళమ్ (ఇందులో మొదటి నక్షత్రమైన "అశ్వినీ" నక్షత్రం పేరు సూచింపబడింది).

2) **తరుణార్యమజైత్రవపుస్సుషమః కరుణావరుణాలయదివ్యమనాః ।**
వకుళాభరణీయవచోరసికో వరయోగివర శ్శరణం భవినామ్ ॥

తమ దేహకాంతితో సూర్యుని జయించినవారు, కరుణాసముద్రంవంటి మనసును కలవారు, తిరువాయ్‌మొళి ప్రబంధంలోని రస్యాలైన అర్థాలను విశదం చేసినవారైన మణవాళ మహామునులే ముముక్షువులైన సంసారులకు రక్షకం (ఇందులో రెండవ నక్షత్రమైన "భరణీ" నక్షత్రం పేరు సూచించబడింది).

3) **నానారుచి ర్జన ఆశ్రయతే ముకుందం**
స్కందం తథా పశుపతిం ధృతకృత్తికాయమ్ ।
కామం తథా భజతు రమ్యవరోపయంతృ-
యోగీంద్రతోఽన్య మహ మత్ర న భావయేయమ్ ॥

"లోకో భిన్నరుచిః" అని లోకోక్తి. అందువల్ల ముకుందుని కొందరు, షణ్ముఖుని కొందరు, శివుని కొందరు ఆశ్రయించడాన్ని చూస్తున్నాము. వారి వారి అభీష్టానుసారంగా ఎవరినైనా ఆశ్రయించనీ. నేనుమాత్రం మణవాళ మహాములను తప్ప ఇంకొకరిని ఎవరినీ ఆశ్రయించను (ఇందులో మూడవ నక్షత్రమైన "కత్తికా" నక్షత్రం పేరు సూచింపబడింది)

4) **యత్పాదా వధిరోహిణీ హి భగవత్పాదాబ్జయోః శాశ్వతీః**
యద్గాత్రం కలశాంబురాశిసుషమా సంస్పర్ధమానర్ధికమ్ ।
యద్వక్త్రం నిరవద్యశాస్త్ర నిచయోదంచన్మహాసౌరభం
సోయం భాతి వరోపయంత మునిరాట్ చిత్తే మదీయేఽనిశమ్ ॥

దాసుని మనస్సులో ఎల్లప్పుడు వేంచేసి ఉండే మణవాళ మహామునుల శ్రీచరణాలు-భగవానుని పాదకమలాలను చేర్చే నిచ్చెనవంటివి. వారి తిరుమేని కాంతి పాలసముద్రంతో పోటీ పడగలిగినది. వారి ముఖం సకలశాస్త్రసారార్థాలతో పరిమళిస్తుంది (ఇందులో నాలుగవ నక్షత్రమైన "రోహిణీ" నక్షత్రం పేరు సూచింపబడింది).

5) **శశాదిమృగశీర్షకేష్వపి భవేద్విషాణం క్వచిత్**
నభస్యపి కదాచనోద్భవ మియాచ్చ పంకేరుహమ్ ।
న జాతుచిదహో! భవేద్వరవరస్య యోగీశితుః
గభీరమధురోక్తిషు ధ్రువమవద్యశంకాంకురః ॥

సహజంగా కొమ్ములు లేని కుందేళ్ళు మొదలైన కొన్ని మగాల తలలపై కొమ్ములు మొలిస్తే మొలువవచ్చు, ఆకాశంలో తామరపూవు ఒకవేళ పూస్తే పూయవచ్చు. ఈ విధంగా అసంభావితాలు సంభవిస్తే సంభవించవచ్చు. కాని, మణవాళ మహామునుల గంభీరమైన, మధురమైన శ్రీసూక్తులలో ఎక్కడా దోషశంకకు అవకాశం లేదనేది నిశ్చయం (ఇందులో అయిదవ నక్షత్రమైన "మృగశీర్షా" నక్షత్రంపేరు సూచింపబడింది).

6) **రమ్యవరయోగివరసూక్తిరససేకైః**
సంతతమిహాస్తు మమ సాధు రసనాఽఽర్ద్రా ।

యే ఖలు పవిత్రతమగాంగజలసేకాన్
అప్యహహా! మందయితుమత్ర భువి శక్తాః ॥

పరమపవిత్రమైన గంగాజలసేకాన్నికూడా తక్కువజేయగలిగిన మణవాళ మహామునుల శ్రీసూక్తిరసప్రవాహంతో నా నాలుక సదా ఆర్ద్రమై ఉండాలి (ఈ శ్లోకంలో ఆరవ నక్షత్రమైన "ఆర్ద్ర" పేరు సూచింపబడింది).

7) తాత స్సర్వజనీన ఏష భగవాన్ మా నామ మాం రక్షతాత్
నైర్ఘృణ్యేన పునఃపున ర్వసుమతీకోణేఽత్ర కామం క్షిపేత్ ।
ఏతత్కేవల మర్థయే మురరిపుం శ్రీరమ్యజామాతరి
స్వామిన్యద్భుతభక్తిభూషితహ దాం వంశే సముత్పాదయ ॥

సర్వలోకపిత అయిన భగవానుడు నన్ను రక్షించనక్కరలేదు. మనస్సులో దయ లేకుండా ఇంకా ఇంకా ఈ సంసారంలో నే తోసివేస్తే తోసివేయనీ. ఆ భగవానుని నేను ఒక్కటే ప్రార్థిస్తాను. అది ఏమంటే– మణవాళ మహామునుల విషయంలో భక్తిని కల మహనీయుల వంశంలోనే నాకు జన్మ కలగాలి?అని మాత్రమే అర్థిస్తాను (ఈ శ్లోకంలో ఏడవ నక్షత్రమైన "పునర్వసు" పేరు సూచింపబడింది).

8) యతస్వ నను సంతతం వరమునీంద్రదివ్యోక్తిభిః
సుధారససరీతిభి ర్గమయితుం నిజం జీవితమ్ ।
ఇతీహ సుబహుర్జనో గురువరోపదిష్టోఽప్యహో!
యతిష్య ఇతి కేవలం ప్రతివదన్ భవే భ్రామ్యతి ॥

"మణవాళ మహామునుల అమతంవంటి సూక్తులతోనే నిత్యకాలక్షేపం చేయండి" అని పెద్దలు పలువురికి ఉపదేశిస్తున్నా, "ప్రయత్నిస్తాను" అని మాత్రం బదులు పలుకుతున్నారు తప్ప, ఆ విధంగా మణవాళ మహామునుల సూక్తులతో కాలక్షేపం చేయడం లేదే! అయ్యో! (ఈ శ్లోకంలో ఎనిమిదవ నక్షత్రమైన "పుష్యమి" పేరు "తిష్య" శబ్దంతో సూచింపబడింది).

9) తిరస్కృత్య ప్రాచా మతిమధురసందేశ మనఘం
పలాయధ్వే భోః! భోః! పిశితవపురాశ్లేషకుతుకాత్ ।

అమందానానందాన్ సృజతి వరయోగీంద్రఫణితి-
ప్రవాహే స్వాదిష్ఠే ఘటయత సకృద్వాపి రసనామ్ ॥

పెద్దలు చేసే మధురమైన ఉపదేశాలను ఆదరించకుండా, మాంసమయమైన శరీరంతో కలిగే సంశ్లేషంలోని ఆశతో అటు ఇటు పరిభ్రమించే లోకులారా! మహానందాన్ని ఇచ్చే మణవాళ మహామునుల దివ్యసూక్త్యమృత ప్రవాహంలో ఒక్క నిముషమైనా తడవాలని మీరు అనుకోకూడదా! (ఇందులో తొమ్మిదవ నక్షత్రమైన "ఆశ్లేషా" నక్షత్రం పేరు సూచించబడింది).

10) నార్హత్యేవాత్ర నూనం హరిరపి భవినాం మాదృశానా మఘాని
ప్రోద్ధర్తుం దైత్యరక్షోగణదళనకలామాత్రదక్షో హి సోఽభూత ।
ఏక స్సర్వజ్ఞచూడామణి రనఘగుణో రమ్యజామాతృయోగీ
దివ్యశ్రీసూక్తితేజోవితతిభి రతనోత్ ద్రాగఘధ్వాంతశాంతిమ్ ॥

నావంటివారి పాపాలను పోగొట్టడానికి భగవానునకుకూడాసాధ్యం కాదు. అతడు అసురులను, రాక్షసులను సంహరించడంలో మాత్రమే నిపుణుడు. సర్వజ్ఞులైన మణవాళ మహామునులొక్కరే తమ దివ్యసూక్తులనే తేజఃపుంజాలద్వారా పాపాలనే చీకటిని పారదోలారు (ఈ శ్లోకంలో పదవ నక్షత్రమైన "మఘా" నక్షత్రం సూచింపబడింది).

11) శాంతం కర్తుం సంసృతిరోగం స్పృహయంతః
పూర్వే ఫల్గున్యౌషధవర్గే హతతృష్ణాః ।
యత్సూక్త్యోఘే దివ్యమహాభేషజబుద్ధిం
భేజు స్సోయం పాతు సదా మాం వరయోగీ ॥

సంసారమనే వ్యాధిని పోగొట్టుకోవాలని తలచిన పెద్దలు అల్పమైన ఔషధాలలో కోరిక లేనివారై, మణవాళ మహామునుల శ్రీసూక్తులనే దానికి తగిన మందుగా గ్రహించారు. ఆ వరవరమునులు నన్ను రక్షించాలి (ఇందులో పదకొండవ నక్షత్రమైన "పూర్వఫల్గుని" పేరు సూచింపబడింది. "పూర్వే ఫల్గుని" అనేది వైదికమైన నిర్దేశం).

12) గీరేషా మమ ధన్యభావ మతులం ధత్తే స్మ యస్మాదహో
దౌర్భాగ్యోత్తరఫల్గునీచజనతాస్తోత్రే విరక్తిం గతా ।
శ్రీమద్రమ్యవరోపయంతృయమినః శ్రీసూక్తిసౌవాదవం
నిస్సీమాద్భుతవైభవం ప్రతికలం స్తోతుం సముజ్జృంభతే ॥

నా వాక్కు చాలా కృతార్థమైనది. ఎందుకంటే-మిక్కిలి దౌర్భాగ్యాన్ని కలిగిన అసార-అల్పజనులను స్తుతించడం విడచిపెట్టి మణవాళ మహామునుల శ్రీసూక్తి మాధుర్యాన్నే స్తుతిస్తున్నాను కనుక (ఇందులో పన్నెండవ నక్షత్రమైన "ఉత్తరఫల్గుని" పేరు సూచింపబడింది)

13) తే తే సంతు పరస్సహస్రఫణితిస్తోమాః ప్రణీతాః పరైః
కిం తే శ్రీవరయోగితల్లజవచస్సేకేన దధ్యుస్తులామ్ ।
శ్రీరంగేశ్వరసంప్రకాశిత మహామాహాత్మ్య సింధో ర్గురోః
అస్త్యేకాం ఫణితిం ముఖే కలయతాం హస్తస్థితో మాధవః ॥

ఇతరులు పలికిన పలు వేల వాక్కులుండనీ. అవి అన్నీ కలసినా మణవాళ మహామునుల ఒక్క శ్రీసూక్తితో సరిపోతాయా? శ్రీరంగనాథునివల్ల లోకంలో ప్రసిద్ధమైన గొప్పమహిమ కల ఈ వరవరమునుల ఒక సూక్తిని అయినా అనుసంధించగలిగినవారికి భగవానుడు స్వాధీనమవుతాడు (ఇందులో పదమూడవ నక్షత్రమైన "హస్త" పేరు సూచింపబడింది).

14) వరవరమునివర్యపాదాబ్జయుగ్మైక్య సంబంధినాం
జనిమృతిభవభీతివైదేశికత్వం తు నిశ్చప్రచమ్ ।
ప్రతిజని యది తత్పాదాబ్జైకసంబంధసంపద్ ధ్రువా
జనితతిరతిమాత్రచిత్రాఽపి మాం కామమాసీదతు ॥

మణవాళ మహామునుల శ్రీచరణసంబంధం పొందినవారికి జన్మమృత్యువులు కలుగవు అనేది నిశ్చయం. అయినా, ప్రతిజన్మలోను మణవాళ మహామునుల శ్రీచరణసంబంధమనే సంపదయే తప్పక లభిస్తే పలు విచిత్రమైన జన్మలు కలగాలి. (ఇందులో పద్నాల్గవ నక్షత్రమైన "చిత్ర" పేరు సూచింపబడింది).

15) **తులాయాం మూలర్ క్షే సకలజన సౌభాగ్యవిభవాత్**
విభూత్యామేతస్యాం సముదిత యతీంద్రప్రవణ! నః ।
క్షమస్వాతీతానాం సముదయమఘానా మథ పునః
మనో వాచం కాయం ప్రవణయ భవత్సూక్తినివహే ॥

లోకం చేసికొన్న అదృష్టంవల్ల అల్పిశిమాసం (ఆశ్వయుజమాసం) ములానక్షత్రంలో ఈ లోకంలో అవతరించిన మణవాళ మహామునీ! ఇంతవరకు మేము చేసిన దోషాలను క్షమించండి. ఇకపై ఏ దోషం సంభవించని విధంగా మా మనోవాక్కాయాలను దేవరవారి శ్రీసూక్తులలోనే ఆసక్తిని కలిగి ఉండేటట్లు దేవరవారే అనుగ్రహించాలి (ఇందులో పదిహేనవ నక్షత్రమైన "స్వాతీ" నక్షత్రంపేరు సూచింపబడింది)

16) **హరిరిహ భువి రంగధామా స్వయం రమ్యయోగీశ్వరాత్**
ఉపనిషదనుధావిశాఖాసహస్రం శఠారీరితమ్ ।
సహుగురువరభాష్యసారార్థసందోహసంధుక్షితం
నిజహృది వినిధిత్సు రాత్మాన మాధత్త శిష్యోత్తరమ్ ॥

శ్రీరంగనాథుడు ఉపనిషత్తులకు సమానమైన (సహస్రశాఖోపనిషత్స మానమైన) తిరువాయ్‌మొళిని అనేక వ్యాఖ్యాన విశేషార్థాలతో ఆలకించగోరి, మణవాళ మహామునులకు శిష్యునిగా తనను చేసికొన్నాడు (ఈ శ్లోకంలో పదహారవ నక్షత్రమైన "విశాఖా" నక్షత్రం పేరు సూచింపబడింది).

17) **మహీయాన్ యోగీంద్ర స్స ఖలు మనురాధాతు మవనౌ**
ప్రతిష్ఠాం ధర్మాణాం యదవదత తద్భేషజమితి ।
శ్రుతిర్భూతాం కామం వరవరమునీంద్రోక్తినికరాత్
ప్రశంసంతి ప్రాజ్ఞాః కిమపి న పరం భేషజవరమ్ ॥

"మనువు అనే మహర్షి ధర్మస్థాపనకోసం చెప్పినది అంతా మందు" అని "యద్వై కించిత్ మనురవదత్ తద్భేషజమ్" అనే వాక్యంతో వేదం తెలిపింది. అయినా, మణవాళ మహామునుల దివ్యసూక్తులకు మించిన గొప్ప మందు వేరొకటి ఉన్నదని ప్రాజ్ఞులు ప్రశంసించరు (ఇందులో పదిహేడవ నక్షత్రమైన "అనూరాధా" నక్షత్రంపేరు సూచింపబడింది).

18) రంగాధీశ్వరగీతపద్యవిశదఖ్యాతే ర్మహాయోగినః
పాదాబ్జాశ్రితశిష్యశిష్యపదయోః సేవాఽప్యలం శ్రేయసే ।
ఏవం సత్యపి హంత! యేఽత్ర విముఖాః గుర్వంతరాన్వేషిణః
తే జ్యేష్ఠాసవిధాత్ సుసంపదమిహ ప్రేప్సోర్జనస్యాగ్రజాః ॥

శ్రీరంగనాథుడు పలికిన "శ్రీశైలేశ" ఇత్యాది తనియన్ శ్లోకంతో జగద్విఖ్యాతులైన కీర్తిని కల మణవాళ మహామునులను నేరుగా సేవించలేకపోయినా వారి సంబంధసంబంధసంబంధులను ఆశ్రయించినా ఉజ్జీవించడంలో లోటు లేదు. వాస్తవం ఈ విధంగా ఉన్నా, శ్రీవరవరమునుల విషయంలో విముఖులై, ఇంకొక ఆచార్యులను వెదకేవారు జ్యేష్ఠాదేవివద్ద గొప్ప సంపదను పొందాలని కోరేవారికి అన్నగారే (ఈ శ్లోకంలో పద్దెనిమిదవ నక్షత్రమైన "జ్యేష్ఠా" నక్షత్రంపేరు సూచింపబడింది).

19) జన్మశుద్ధవైష్ణవాగ్ర్యమానసోద్యదప్రమేయమోదమూలం
అద్వితీయభక్తియుక్తదివ్యసూరిసూక్తితత్త్వబోధమూలమ్ ।
లక్ష్మణార్యదర్శనీయనిస్తులార్థరత్నరాశిజీవమూలం
అత్ర సుందరోపయంతృయోగివర్య నిస్తులావతారమూలమ్ ॥

మణవాళ మహామునులవతరించిన మూలానక్షత్రం–సహజంగానే పవిత్రులైన శ్రీవైష్ణవుల మనస్సులో కలిగే ఆనందానికి మూలం, గొప్ప భక్తులైన దివ్యసూరుల సూక్తులలోని యథార్థతత్త్వాలను గ్రహించడానికి మూలం, భగవద్రామానుజుల దర్శనంలోని గంభీరమైన, గొప్ప అర్థాలను తెలియడానికి మూలం (ఇందులో పందొమ్మిదవ నక్షత్రమైన "మూలా" నక్షత్రం పేరు సూచింపబడింది).

20) మూర్తి రపూర్వాషాఢగ్రహీతిస్ఫుటశోభా
వామనరూపా యా బలిచిత్తం హరతిస్మ ।
సా తు మదగ్రే తిష్ఠతు కామం న హి సా మే
హర్తుమలం హృద్రమ్యమునీంద్రప్రతిపన్నమ్ ॥

పాలాశదండాన్ని చేతిలో ధరించిన, అందమైన, అపూర్వమైన వామనరూపం నా మహాబలి చిత్తాన్ని అపహరించింది. ఆ మూర్తి నా కంటిముందు ప్రత్యక్షమైనా మణవాళ మహామునులపట్ల ఆసక్తమైన నా మనస్సును అది ఆకర్షించలేదు. (అపూర్వా, ఆషాఢగ్రహీతి అని పదవిభాగం. పలాశ దండానికి ఆషాఢమని పేరు. ముందు శ్లోకంలోని చివరలో ఉండే లకారానికి తరువాత ఉన్న మకారం ఈ శ్లోకం మొదట వచ్చింది. కనుక అందాదినియమంలో భంగం లేదు. ఇందులో ఇరవైయవ నక్షత్రమైన "పూర్వాషాఢా" నక్షత్రం పేరు సూచింపబడింది.)

21) నాసహంత యదహో తదషాఢా
ఇత్యదశ్శ్రుతివచోనుగుణం యే ।
రమ్యయోగివిభవాన్న సహంతే
తానషాఢపదతః కథయేయమ్ ॥

యజుర్వేదంలో ప్రథమాష్టకం పంచమప్రశ్నలో నక్షత్రనామాలకు నిర్వచనం చెప్పబడింది. అక్కడ "యన్నాసహంత తదషాఢా" అని చెప్పబడింది. ఇతరుల ఉన్నతిని సహించనివారికి "అషాఢా" అని అక్కడ తెలుపబడింది. అంటే- అసూయ కలవారని అర్థం. ఈ శ్రుత్యనుసారం మణవాళ మహామునుల వైభవంపట్ల అసూయ కలవారు అషాఢశబ్దవాచ్యులు (ఈ శ్లోకంలో "అషాఢ" పదం రెండు సార్లు ప్రయోగింపబడడం ఉత్తరాషాఢకు గమకం).

22) యన్మంత్రశ్రవణకుతూహలం ధరిత్ర్యా
మర్చామూర్తిషు నిఖిలాసు నిత్యమింధే ।
సోయం శ్రీవరవరయోగిదైవమంత్ర
స్సర్వేషామలమిహ చిత్తశోధనాయ ॥

మణవాళ మహామునుల తనియన్ ను ఆలకించాలని సమస్తదివ్యదేశాలలోని అర్చామూర్తులు కుతూహలాన్ని కలిగి ఉండడాన్ని తెలిస్తే వాస్తవం వ్యక్తమవు తుంది (ఇందులో ఇరవై రెండవ నక్షత్రమైన "శ్రవణా" నక్షత్రంపేరు సూచింపబడింది).

23) యతిపతిపదపద్మసంబంధనిష్ఠాగరిష్ఠాత్మనామ్
అపి వరయోగిపాదారవిందానుబంధో న చేత్ ।

న భవతి గతిరుత్తమేతి ప్రతీత్యా మహాంతః పురా
వరమునిపదపద్మ మాశ్రిత్య సంప్రాపు రుజ్జీవనమ్ ॥

భగవద్రామానుజుల సంబంధం పొందినవారికికూడా మణవాళ మహామునుల శ్రీచరణసంబంధం లేకపోతే ఉత్తమగతి లేదు-అని నమ్మిన పూర్వులు మణవాళ మహామునుల శ్రీచరణాలను ఆశ్రయించి, ఉజ్జీవించారు (ఇందులో ఇరవై మూడవ నక్షత్రమైన "ధనిష్ఠా" నక్షత్రంపేరు సూచింపబడింది).

24) నరజని ముపయాతా నిత్యరోగోపమర్దాః
దశశతభిషగంఘ్రీన్ సంశ్రయంతో భ్రమంతి ।
అహమిహ వరయోగిశ్రీపదాంభోజరేణూన్
హృది కలయితుమిచ్ఛన్ సర్వరోగైర్విముచ్యే ॥

మానవులై జన్మించినవారు నిత్యం రోగాలతో బాధపడుతూ వేలాదిమంది వైద్యులను ఆశ్రయించి క్లేశపడుతున్నారు. నేనయితే, మణవాళ మహామునుల శ్రీచరణరేణువులను మనసులో ధరించాలని తలచినంతనే అన్ని రోగాలనుండి విముక్తుడ నయ్యాను (ఇందులో ఇరవై నాల్గవ నక్షత్రమైన "శతభిషక్" నక్షత్రం పేరు సూచింపబడింది).

25) యేఽపూర్వభద్రపదవీ మిహ లబ్ధుకామాః
తే రమ్యయోగిపదభక్తసమీహితార్థాన్ ।
సంసాధయేయురిహ చేదథ తైస్తు సద్యః
ప్రాప్యేత సేతి విశయోఽత్ర న జాతు లోకే ॥

ఈ లోకంలో అధికారస్థానాలలో గొప్ప పదవులను పొందాలని కోరుకొనే వారు మణవాళ మహామునుల భక్తులకు మంచిని చేస్తే వెంటనే వారు కోరుకొన్న పదవులను పొందగలరనేది నిశ్చయం (ఇందులో ఇరవై అయిదవ నక్షత్రమైన "పూర్వభద్ర" పేరు సూచింపబడింది).

26) లోకోత్తరభద్రపదస్థిత మప్యుత్సృజ్య చిరం వరయోగిగురోః ।
సద్భక్తగృహాంగణకింకరతాం దాసో ముహు రిచ్ఛతి లబ్ధుమసౌ ॥

లోకోత్తరమైన, మంగళకరమైన పదవి లభించినా దానిని విడచిపెట్టి, మణవాళ మహామునుల భక్తుల గృహాలలో కైంకర్యం చేయడానికే నేను ఇష్టపడతాను (ఇందులో ఇరవై ఆరవ నక్షత్రమైన "ఉత్తరభద్ర" పేరు సూచింపబడింది).

27) సౌమిత్రిరేవతీశౌ శ్రీరామానుజవరోపయంతృమునీ ।
ఇత్యవతారాం శ్చతురః చతురః కృతవాన్ ఫణీంద్ర ఏవ పరమ్ ॥

లక్ష్మణుడు, బలరాముడు, భగవద్రామానుజులు, మణవాళ మహామునులు – అనే నాలుగు అవతారాలను ఎత్తిన ఆదిశేషులే చతురులు (ఇందులో చివరి నక్షత్రమైన "రేవతి" పేరు సూచింపబడింది).

నక్షత్రమాలాం వరయోగివర్యప్రభావ సంకీర్తనసంప్రవీణామ్ ।
నిత్యం ముఖే బిభ్రతి యే మహాంతః తే తారకాధీశవదుజ్జ్వలేయుః ॥

శ్రీమణవాళ మహామునుల వైభవాన్ని వర్ణించగల ఈ నక్షత్రమాలికాస్తుతిని నిత్యం అనుసంధించే మహనీయులు నక్షత్రాలకు నాథుడైన చంద్రునివలె గొప్పగా ప్రకాశిస్తారు.

శ్రీమద్వరవరమునినక్షత్రమాల సంపూర్ణమ్

శ్రీమద్వరవరమునయే నమః

శ్రీశైలేశదయాపాత్ర మంగళాశాసనమ్

(శ్రీమద్భిః ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యవిద్వద్వరేణ్యైః ప్రణీతమ్)

శ్రీశైలేశేతిమంత్రస్థ వర్ణానుక్రమశోభితమ్ ।
వచ్మి విద్వన్మనోహారి వరయోగీంద్రమంగళమ్ ॥

"శ్రీశైలేశదయాపాత్రమ్" ఇత్యాది తనియన్ శ్లోకంలోని వర్ణాల క్రమంలో పండితుల మనసును రంజింపజేసే మణవాళ మహామునుల మంగళాశాసనస్తుతిని విన్నపిస్తాను.

1) శ్రీశఠారియతీశానశ్రీసూక్త్యమృతపాయినే ।
శ్రీమత్సుందరజామాతృమునీంద్రాయాస్తు మంగళమ్ ॥

నమ్మాళ్వార్ల, భగవద్రామానుజుల శ్రీసూక్తులనే అమతాన్ని పానం చేసే మణవాళ మహామునులకు మంగళమ్.

2) శైశవాత్ప్రభృతి శ్రీమన్నారాయణ గుణాంబుధౌ ।
నిమగ్నహృదయాయాస్తు మునివర్యాయ మంగళమ్ ॥

చిన్నతనంనుండే భగవద్గుణసముద్రంలో అవగాహించిన వరవరమునులకు మంగళమ్.

3) లేఖనే విశదవ్యాఖ్యానిబంధానాం పటీయసే ।
లేలిహానేంద్రరూపాయ మునీంద్రాయాస్తు మంగళమ్ ॥

మిక్కిలి స్పష్టమైన వ్యాఖ్యానాలను అనుగ్రహించగలిగిన మణవాళ మహామునులకు మంగళమ్.

4) శఠారిపరకాలాదిదివ్యసూరిసుధోక్తిభిః ।
సౌరభాంచితవక్త్రాయ సౌమ్యాచార్యాయ మంగళమ్ ॥

నమ్మాళ్వార్ల, తిరుమంగై ఆళ్వార్ల సూక్తులు పరిమళించే ముఖాన్ని కల మణవాళ మహామునులకు మంగళమ్.

5) దయాపాలమునీంద్రోక్తదివ్యగ్రంథార్థవర్షిణే ।
దయాబ్ధయే మునీంద్రాయ దాంతశ్రేష్ఠాయ మంగళమ్ ॥

"అరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమానార్" అనుగ్రహించిన జ్ఞానసార, ప్రమేయసారాలనే ప్రబంధాలకు వ్యాఖ్యానాలను అనుగ్రహించిన మణవాళ మహామునులకు మంగళమ్.

6) యాతాయాతశ్రమం ఘోరసంసారమరు కాననే ।
లుంపతే రమ్యజామాతృమునివర్యాయ మంగళమ్ ॥

సంసారమనే ఎడారిలో మనం పరిభ్రమించకుండా కాపాడిన మణవాళ మహామునులకు మంగళమ్.

7) పాదాబ్జప్రవణాన్నిత్యం పాదాంభోరుహపాథసా ।
పునతే పుణ్యయశసే పూజ్యశ్రేష్ఠాయ మంగళమ్ ॥

తమ పాదాలను ఆశ్రయించినవారికి నిత్యం శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించే మణవాళ మహామునులకు మంగళమ్.

8) త్రయ్యంతార్థానశేషేణ తత్త్వత్రితయటీకయా ।
వివృణ్వతే యతీంద్రాయ మహతే నిత్యమంగళమ్ ॥

తత్త్వత్రయవ్యాఖ్యానంద్వారా వేదాంతార్థాలను వివరించిన మణవాళ మహామునులకు మంగళమ్.

9) ధీమద్భి ర్వరదార్యాదిగురుభి స్సేవితాంఘ్రయే ।
ధీరాయ రమ్యజామాతృమునీంద్రాయాస్తు మంగళమ్ ॥

కోయిలణ్ణన్ మొదలైన మహనీయులచే సేవింపబడే మహాధీరులైన మణవాళ మహామునులకు మంగళమ్.

10) భయం భవాబ్ధిమగ్నానాం సమున్మూలయతే సతామ్ ।
భవ్యాయ రమ్యజామాతృమునయే నిత్యమంగళమ్ ॥

జన్మసముద్రంలో మునిగినవారి భయాన్ని తీర్చే మణవాళ మహామునులకు మంగళమ్.

11) యాతానాం నరకేస్మాకం యః కృపాంబుధి రచ్ఛినత ।
యతీంద్రప్రవణాయాస్మై మునీంద్రాయాస్తు మంగళమ్ ॥

నరకంలో కలిగే వేదన ఏదీ మనకు కలుగకుండా ఉండేటట్లు కపజేసిన మణవాళ మహామునులకు మంగళమ్.

12) దివ్యసూక్తిసుధాస్వాదప్రఫుల్లమనసే సదా ।
దివ్యామలముఖాయాస్తు దేశికేంద్రాయమంగళమ్ ॥

ఆళ్వారుల దివ్యసూక్తులనే అమతాన్ని పానం చేసి, వికసించిన మనస్సును కల మణవాళ మహామునులకు మంగళమ్.

13) గురూణామప్యశేషాణా మగ్రగణ్యాయ యోగినే ।
గుహ్యానా మర్థతత్త్వానాం నిధయే నిత్యమంగళమ్ ॥

ఆచార్యులందరికంటే ముందుగా భావించదగినవారు, రహస్యార్థతత్త్వనిధి అయిన మణవాళ మహాములకు మంగళమ్

14) గుణానా మప్రమేయానాం సింధవే భక్తబంధవ ।
గురూత్తమాయ మహతే మునయే నిత్యమంగళమ్ ॥

అంతు లేని గుణాలకు సముద్రంవంటివారు, భక్తుల విషయంలో ప్రీతిని కలవారైన మణవాళ మహాములకు మంగళమ్

15) అర్ణవాయ మహార్థానా మాశ్చర్యమతిసంపదే ।
అభిరామమునీంద్రాయ గంభీరాయాస్తు మంగళమ్ ॥

గొప్ప గొప్ప అర్థాలకు సముద్రంవంటి ఆశ్చర్యకరమైన జ్ఞానసంపదను కల మణవాళ మహాములకు మంగళమ్.

16) వందే స్తౌమి నమామీతి క్రియాణాం ముఖ్యలక్ష్యతా ।
యస్మిన్నేవ సమృద్ధాస్మై యమిశ్రేష్ఠాయ మంగళమ్ ॥

ప్రణమిల్లుతున్నాను, స్తుతిస్తున్నాను, నమస్కరిస్తున్నాను–అనే క్రియలకు ముఖ్యలక్ష్యభూతులైన మణవాళ మహాములకు మంగళమ్.

17) యచ్ఛృతే శఠజిత్సూక్తిసహస్రార్థాన్ శతోక్తితః ।
యతీంద్రమతదీపాయ యతిశ్రేష్ఠాయ మంగళమ్ ॥

తిరువాయ్‌మొళినూత్తందాది ప్రబంధంద్వారా తిరువాయ్ మొళిప్రబంధం లోని వేయి పాశురాల అర్థాలను కృపజేసినవారు, భగవద్రామానుజ దర్శనానికి దీపంవంటివారైన మణవాళ మహాములకు మంగళమ్.

18) తీర్త్వా సంసారవారాశిం సిసేవిషుభి రచ్యుతమ్ ।
సేవ్యాయ రమ్యజామాతృమునీంద్రాయాస్తు మంగళమ్ ॥

సంసారసాగరాన్ని దాటి, పరవాసుదేవుని సేవించాలనే ఆశను కలవారిచే సేవించదగినవారైన మణవాళ మహాములకు మంగళమ్.

19) ద్రవీభవతి యత్సూక్తిధ్యానేన హృదయం సతామ్ ।
ద్రావిడామ్నాయభాగ్యాయ తస్మై ప్రాజ్ఞాయ మంగళమ్ ॥

తమ శ్రీసూక్తులను చింతించేవారి మనసును ద్రవీకరింజేసేవారు, ఆళ్వారుల సూక్తుల భాగ్యంవంటివారైన మణవాళ మహామునులకు మంగళమ్.

20) ప్రళయేపి న లీయేత యన్మంత్రవిభవో భువి ।
తస్మై ప్రఖ్యాతయశసే పుణ్యశ్లోకాయ మంగళమ్ ॥

ప్రళయసమయంలోకూడా నశించని వైభవాన్ని కల తనియన్ శ్లోకంతో స్తుతింపబడేవారు, లోకంలో అంతటా వ్యాపించిన కీర్తిని కలవారైన మణవాళ మహామునులకు మంగళమ్.

21) వచోభూషణతత్త్వార్థవివృత్త్యోత్ఫుల్లకీర్తయే ।
విదితాశేషవేద్యాయ వదాన్యాయాస్తు మంగళమ్ ॥

శ్రీవచనభూషణదివ్యశాస్త్రంలోని యథార్థతత్త్వాన్ని తెలిపే వ్యాఖ్యానాన్ని అనుగ్రహించి, వికసించిన కీర్తిని కలవారు, సర్వజ్ఞులు, పరమోదారులైన మణవాళ మహామునులకు మంగళమ్

22) ణముధాత్వర్థనిష్ఠా యద్ధృదయే సుప్రతిష్ఠితా ।
సర్వోత్తమాయ తస్మై స్యాత్సౌమ్యాచార్యాయ మంగళమ్ ॥

"ణము" ధాతువుయొక్క అర్థమైన ప్రహ్వీభావంలోని (వినయంగా ఉండడంలోని) నిష్ఠయే మనసులో స్థిరంగా కలిగిన (వినయశీలి అయిన) మణవాళ మహామునులకు మంగళమ్.

23) వశిష్ఠాదిమహాయోగివచోభ్యోతిగరీయసీ ।
వాచో దత్తవతే యోగవరేణ్యాయాస్తు మంగళమ్ ॥

వశిష్ఠాది మహర్షుల వాక్కుల కంటే చాలా గొప్పవైన సూక్తులను అనుగ్రహించిన మణవాళ మహామునులకు మంగళమ్.

24) దేశికానా మశేషాణా మావేశోయం న సంశయః ।
ఇత్యభిజ్ఞాభినంద్యాయ గురువర్యాయ మంగళమ్ ॥

ఆచార్యులందరు ఒకటిగా చేరి మణవాళ మహాముసులై అవతరించారు– అని అభిజ్ఞులు పొగడే మణవాళ మహామునులకు మంగళమ్.

25) రంధ్రాన్వేషిజనానా మప్యవద్యోక్తిదవీయసీ ।
సూక్తీర్దత్తవతే సౌమ్యమునీంద్రాయాస్తు మంగళమ్ ॥

ఏ దోషం దొరుకుతుందా! అని సదా ఇతరులలో దోషాలనే వెదకి దూషించేవారి విషయంలోకూడా దూషణవాక్యాలను పలుకని చాలా సౌమ్యులైన మణవాళ మహామునులకు మంగళమ్.

26) యతిప్రవరభాష్యార్థభరితోక్తిప్రదాయినే ।
యతిభి స్త్రిభిరీడ్యాయ. యతివర్యాయ మంగళమ్ ॥

శ్రీభాష్యార్థాలు నిండిన శ్రీసూక్తులను అనుగ్రహించేవారు, వానమామలై జీయర్, పట్టర్ పిరాన్ జీయర్, తిరువేంగడ రామానుజ జీయర్–అనే ముగ్గురు జీయరులచే స్తుతింపబడేవారైన మణవాళ మహామునులకు మంగళమ్.

27) జాగ్రద్దశాయా మాత్మీయదివ్యమంగళ విగ్రహమ్ ।
ప్రదర్శితవతే మహ్యం ప్రాజ్ఞభోగ్యాయ మంగళమ్ ॥

కలలో కాక, మెలకువగా ఉండేటపుడే దాసునకు(నాకు) తమ దర్శనాన్ని అనుగ్రహించిన మణవాళ మహామునులకు మంగళమ్

28) మాయా దురత్యయేత్యేవం గీతాచార్యేణ కీర్తితమ్ ।
మాయాం ధ్వస్తవతే సద్భి ర్మాననీయాయ మంగళమ్ ॥

"మమ మాయా దురత్యయా" అని గీతలో శ్రీకష్ణుడు పలికిన మాయను (ప్రకతిసంబంధాన్ని) పోగొట్టే మణవాళ మహామునులకు మంగళమ్.

29) తత్త్వార్థం సర్వశాస్త్రాణాం హస్తామలకసన్నిభమ్ ।
అవధార్యోచుషే విద్వదగ్రగణ్యాయ మంగళమ్ ॥

సర్వశాస్త్రాలలోని తత్త్వార్థాలను కరతలామలకంవలె దర్శించి, ఏ సందేహం కలుగని విధంగా ఉపదేశించే మణవాళ మహామునులకు మంగళమ్.

30) రంజితాశేషచిత్తాయ భంజితధ్వాంతరాశయే ।
మంజువాణీవిలాసాయ మునీంద్రాయాస్తు మంగళమ్ ॥

అందరి మనసులను రంజింపజేసేవారు, అజ్ఞానాన్ని పోగొట్టేవారు, అందమైన వాక్కులను పలికేవారైన మణవాళ మహామునులకు మంగళమ్.

31) ముఖపంకజనిర్గచ్ఛన్మధుసోదరసూక్తిభిః ।
ముముక్షూన్ రక్షతే నిత్యం మునివర్యాయ మంగళమ్ ॥

తమ పద్మంవంటి ముఖంనుండి వెలువడే తేనెవంటి సూక్తులతో ముముక్షువులను రక్షించే మణవాళ మహామునులకు మంగళమ్.

32) నిత్యకైంకర్యనిష్ణాతశేషావతరణాత్మనే ।
మునయే రమ్యజామాత్రే నిత్యశ్రీః నిత్యమంగళమ్ ॥

నిత్యం భగవత్కైంకర్యనిరతులైన ఆదిశేషుల అంశతో అవతరించిన మణవాళ మహామునులకు సదా మంగళమ్.

మంగళాశాసనం శ్రీమద్వరయోగి గుణోజ్జ్వలమ్ ।
నిధ్యాయతాం సతా మస్తు నిత్యశ్రీః నిత్యమంగళమ్ ॥

మణవాళ మహామునుల కల్యాణగుణాలు ప్రకాశించే ఈ మంగళా శాసన స్తోత్రాన్ని అనుసంధించేవారికి నిత్యశ్రీః, నిత్యమంగళమ్.

శ్రీశైలేశదయాపాత్రమంగళాశాసనస్తుతి సంపూర్ణమ్